
# ఆధ్యాత్మిక ఆలోచనలు

(మొదటి భాగము & రెండవ భాగము)

## Adhyatmika Alochanalu (Part - I & Part II)

రచన : పూజ్యశ్రీ స్వామి హంసానంద



సద్గురు స్వామి శివానంద సరస్వతీ మహారాజ్

వ్యవస్థాపకులు : దివ్య జీవన సంఘము, ఋషీకేష్

ప్రచురణ :

మాధవ దివ్యధామ్, బెంగుళూరు

2022

# విశ్వప్రార్థన

ఓ పూజ్య ప్రభూ! క్షమా పరిపూర్ణా! ప్రేమమయా!
నీకు నమస్కృతులు, సాష్టాంగ ప్రణామములు.
నీవు సచ్చిదానందుడవు, సర్వాంతర్యామివి,
సర్వ శక్తిమయుడవు, సర్వజ్ఞుడవు,
సర్వజీవ హృదయాంతర వాసివి.
కరుణార్ద్ర హృదయము, సమదృష్టి, స్థిరమనస్సు,
భక్తి విశ్వాస జ్ఞానములను మాకు ప్రసాదించుము.
ఆకర్షణల నణగద్రొక్కి చిత్తవృత్తుల నరికట్టుటకు
మాకు వలయు అంతరాధ్యాత్మిక శక్తి నొసంగుము;
కామ, క్రోధ, లోభ, ద్వేషముల బారినుండి మమ్ము తప్పింపుము;
మా హృదయ ఫలకములను సద్గుణములతో నింపివేయుము.
ఈ సర్వనామరూపములలో నిన్ను తిలకింపనిమ్ము;
ఈ సర్వనామరూపములలో నిన్ను సేవింపనిమ్ము;
నిన్ను సదా స్మరించుకొననిమ్ము;
నీ లీలలను సదా గానము చేయనిమ్ము;
నీ నామము సదా మా పెదవులపై ఉండనిమ్ము;
నీలో సదా మమ్ము వసింపనిమ్ము.

*-సద్గురు స్వామి శివానంద, ఋషీకేశ్.*

సూచన : సర్వమతావలంబికులు సర్వ సందర్భాలలో ఈ ప్రార్థన చేసికొనవచ్చును.

# ఆధ్యాత్మిక ఆలోచనలు

(Part- I & II)



వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ ।
నిర్విఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా ॥

# ఆధ్యాత్మిక ఆలోచనలు

(మొదటి భాగము & రెండవ భాగము)

# ĀDHYATMIKA ĀLOCHANALU

(Part- I & II)

రచన :

**పూజ్యశ్రీ స్వామి హంసానంద**

# ఆధ్యాత్మిక ఆలోచనలు (మొదటి భాగము & రెండవ భాగము)

**ĀDHYATMIKA ĀLOCHANALU** (Part-I & II)


రచన :- శ్రీ స్వామి హంసానంద

ప్రచురణ :- మాధవ దివ్యధామ్,
బెంగుళూరు.

ముద్రణ : 2022

ప్రతులు : 500

ముద్రణాలయము : **శ్రీ చక్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్,**
తాటిపాక – 533249.
సెల్ : 9866952350

మూల్యము : మోక్షలక్ష్మి అనుగ్రహము



(సర్వస్వామ్య సంకలితము)

This book was published with the

financial assistance from
noble hearted

SRI NITTA RAMPRASAD &

Smt. SUSEELA
of Orlando, U.S.A.

ఓం

# పీఠిక

**ప్రియ ఆత్మస్వరూపులారా!,**

అందఱికి వందనములు.

ప్రస్తుతము మీ హస్తములను అలంకరించిన గ్రంథము "**ఆధ్యాత్మిక ఆలోచనలు**" అనునది 2014వ సంవత్సరములోను, 2021 సంవత్సరములోను ఆయా సందర్భాలను పురస్కరించుకొని విడివిడిగా ప్రచురింపబడిన రెండు గ్రంథముల (ఆధ్యాత్మిక ఆలోచనలు-మొదటిభాగము, ఆధ్యాత్మిక ఆలోచనలు-రెండవ భాగము) సమాకలన గ్రంథము. ఇందు మొదటి గ్రంథమును పఠించినవారు రెండవదానిని, రెండవదానిని పఠించినవారు మొదటిదానిని పఠించియుండకపోవచ్చును. ఇందు మొదటి దానిని పఠించినవారు రెండవది కావలయుననియు, రెండవదానిని ముందుగా పఠించినవారు మొదటిది కావలయుననియు అభిప్రాయపడుట జరిగినది. అందుచేతనే ఏకీకృత "**ఆధ్యాత్మిక ఆలోచనలు**" వెలుగుచూచుచున్నది. దీనిని ప్రచురించుచున్నవారు "మాధవ దివ్యధామ్", బెంగుళూరువారు.

దీనియందలి అంశములన్నియును "శ్రీశివానంద సందేశ ప్రచార సమితి, (శివానందాశ్రమము)"వారు చాల కాలముగా ప్రచురించుచు వచ్చుచుండిన "శ్రీశివానందవాణి" అనెడి ద్వైమాసిక ఆధ్యాత్మిక గ్రంథములలో సంపాదకీయములుగా ముద్రించినట్టివే. వీటిని అందించినవారు పూజ్యశ్రీ హంసానంద సరస్వతీ స్వాముల వారు. లోతైన ఆధ్యాత్మిక మఱియు వేదాంత భావాలను ఆబాలగోపాలము సులభముగా చదివి ఆకళింపుచేసుకొనెడి విధముగా వ్రాయుటయందు శ్రీవారు దిట్ట. అందుచే వారు లిఖించిన గ్రంథాలన్నీ భక్తుల ఆదరణకు నోచుకొనుచు వచ్చుచున్నవి. ఆంధ్రులకు దైవము ఎంతో కృపతో అందించిన ముద్దుబిడ్డ మన శ్రీవారు. అందుచే ఆంధ్రులందఱున్నూ శ్రీవారిపట్ల ఎంతో కృతజ్ఞతతో మెలగుచు, ప్రస్తుతము 83 వత్సరములను పూర్తిచేసుకొనుచున్న శ్రీవారు శతాధిక సంవత్సరములు మంచి ఆరోగ్యసంపదతో జీవించి, ఎప్పటివలెనే ముముక్షువుల ఆధ్యాత్మిక పురోగతికి సహకరించుచు ఉండాలని దైవాన్ని ప్రార్థించుచు కృతజ్ఞతతో వారికి శుభాకాంక్షలనందించుచున్నారు.

గురుపాద రేణువు,

రాజోలు-533 242.

**యు. నారాయణరావు.**

Part - I

# శుభాభివందనములు

సద్గురు స్వామి శివానంద సరస్వతీ మహారాజ్ వారిచే స్థాపించబడిన శ్రీశివానందా శ్రమము (ఋషీకేశ్) నుండి 'శివానంద సందేశ ప్రచార సమితి' వారిచే వెలువడుతున్న ద్వైమాసిక ఆధ్యాత్మిక తెలుగు పత్రిక "శ్రీశివానందవాణి". దీనిద్వారా ఆశ్రమ సద్గురువులందించిన అనేక ఆంగ్లగ్రంథములలోని కొన్ని భాగముల ఆంధ్రాను వాదములు, మూలగ్రంథాలలోని కొన్ని ఆంగ్లభాగములు ఇతర ఆధ్యాత్మిక అంశములతో పాటు స్వాధ్యాయపరులకు అందించబడు చున్నవి. వీటితోపాటు ఈ పత్రికకే మకుటాయమానముగా భాసించుచున్నది పూజ్యశ్రీ హంసానంద స్వామివారు అందించే సంపాదకీయము. పత్రికను అందుకొన్నదే తడవుగా పాఠకుల దృష్టిని ఆకర్షించేది ఈ పత్రిక సంపాదకీయమేయని అనేకుల అభిప్రాయము. 2009, జనవరి మొదలుకొని 2014, జూన్ వరకు ఎంతో హృద్యంగా శ్రీవారు అందించిన సంపాదకీయ వ్యాస సముచ్ఛయమే మీ హస్తముల నలంకరించిన "**ఆధ్యాత్మిక ఆలోచనలు**" అనెడి గ్రంథము. దీనిలో శ్రీవారిచే విరచించబడిన **30 సంపాదకీయ వ్యాసములు,** ఇతర పత్రికలకు శ్రీవారు అందించిన కొన్ని వ్యాసములు, **"మననానికి మూడు మాటలు", "నా గురుదేవులు", "నా మాతృమూర్తి ప్రబోధము"** అను వాటితో పాటు **"శ్రీ హంసానంద స్వామి వారి జీవిత విశేషములు"** పొందుపరచబడినవి. శివుడందించిన పత్రపుష్పాదులతోనే శివుని అర్చించినట్లుగా, ఈ గ్రంథాన్ని పూజ్యశ్రీ హంసానంద స్వామివారి 75వ జన్మదినోత్సవము (25-5-2014) శుభ సంబరాలలో శ్రీవారి చరణ కమలముయందొక పూజాపుష్పముగా శ్రీవారి భక్తులచే సమర్పింపబడుచున్నది.

1965వ సంవత్సరమునుండి శ్రీశివానందాశ్రమమునందుండి, బ్రహ్మలీన శ్రీ స్వామి కృష్ణానంద సరస్వతీ మహారాజ్ వంటి మహాపురుషుల సంసేవనా భాగ్యముచే పునీతులై జ్ఞానసిద్ధిని బడసిన నిరాడంబర తపస్వియే! పూజ్యశ్రీ స్వామి హంసానంద సరస్వతీ మహారాజ్‌వారు. దేవభాషతోపాటు ఆంధ్రాంగ్లభాషలయందు వారు మంచి దిట్టయని వారి అనువాదగ్రంథములు తేటతెల్లపరచును. వారు కలము చేతబూని అనువాదానికి సంసిద్ధులైతే వాగ్దేవి వారి కలాన్నావహించగా వారు అపర శ్రీకృష్ణద్వైపాయ నులౌతారని ఉవాచ. నవీన నాగరికతా పోకడలతో అవిద్య పెనుభూతమై ఆవహించగా

సంసార కూపములో తలమునకలౌతున్న సామాన్యజనావళి పట్ల వారికున్న అపారమైన కరుణయే! ద్రాక్ష పాకముతో జాలువారే విజ్ఞానదాయకములైన సంపాదకీయములుగా రూపుదాల్చుచున్నట్లనిపించును. సంసారలంపటములో చిక్కు కొనుట వలన సమయము చిక్కక శ్రీమద్రామాయణ, మహాభారత, భాగవతాది ఇతిహాసములను గాని, ప్రస్థానత్రయమని పిలువబడే ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రములను గాని పఠింపజాలక, నిరాసక్తులుగా మిగిలిపోతున్న నిర్భాగ్యులకీ స్వామివారి సంపాదకీయములు, రచనలే ఒక గొప్ప సాంత్వన నిచ్చుచున్నవి. మిత్రుడు మిత్రునితో సంభాషించు చున్నట్లుగా సాగే వారి రచనాశైలి పాఠకులను ముగ్ధులను గావించి, పునీతులనుజేసి, అవిద్యానాశమునకు తొడ్పడి, సంశయ నివృత్తి గావించి, వారిని జ్ఞానభూమికకు జేర్చుననుట నిస్సంశయము.

సద్గురు స్వామి శివానందవారి దివ్య జీవన సంఘ భావాలకు అద్దం పట్టే ఈ గ్రంథమును చేబూనినవారు ఆధ్యాత్మిక ప్రకంపనల ప్రభావమునకు లోనై దీనినవశ్యము పఠించి, ఆధ్యాత్మిక ఆలోచనా పరంపరల దివ్యానుభూతి ప్రసాద సంతుష్టులగుదురనుట నిశ్చయము. పార్వతీపరమేశ్వరులు మఱియు గురుదేవుల దివ్యాశీస్సులతో శ్రీస్వామీజీ వారు శతవత్సరములు ఆయురారోగ్య సుసంపన్నులై విలసిల్లాలని వారి 75వ జన్మదినోత్సవ శుభ సమయాన ముముక్షువు లందఱున్నూ శుభాభివందనముల నర్పించుకొనుచున్నారు.

ఈ గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహకారాన్ని అందించిన శ్రీ నిట్టా రామ్‌ప్రసాద్‌గారికి, సిస్టర్స్ ఇందిర, రమణి, సుశీల (www.mokshalakshmi.org) మరియు డా॥ సత్యపాల్ వారికి భగవంతుడు, సద్గురుదేవులు ఆయురారోగ్య ఐశ్వర్య సుజ్ఞానములను ప్రసాదించుటకుగాను భక్తులందఱూ ప్రార్థించుచున్నారు.

హరిః ఓం తత్సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

ఇట్లు

31-3-2014
జయ నామ సంవత్సర
ఉగాది

-యు. నారాయణ రావు, రాజోలు.



ఓం

# ముందుమాట

ముద్రణామాధ్యమము అందఱికీ సులువుగా అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కోకొల్లలుగా వివిధరకాల గ్రంథాలు లభిస్తున్నాయి. అయితే, వాటిలో ఉపయుక్తమయ్యే గ్రంథాల ఎంపిక పాఠకుని అభిరుచిని బట్టి అతని ముందున్న అంశము. ప్రస్తుతం మీ చేతియందున్న పుస్తకం ఆబాలగోపాలానికి పఠించడానికి సులభసాధ్యంగా ఉండి, లోతైన ఆధ్యాత్మికభావాలు, వేదాంత విషయాలు ఎన్నెన్నో ద్రాక్షాపాకంలో రచయితచే అందజేయబడినవి. ఇందు నిత్యజీవితంలో మానవుడు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలతోపాటు, రామాయణ, భారత, భాగవతాలు, భగవద్గీత వంటి ఆధ్యాత్మికగ్రంథాలలో మామూలుగా చదివితే అర్థంకాని అంశాలు ఎంతో సరళంగా గ్రంథకర్త అందించారు. ఈ గ్రంథాన్ని పఠించినవారు వేరే వేదాంతగ్రంథాన్ని పఠించకుండానే వేదాంతాన్ని అవగతం చేసికొనజాలుదురు; మానవజీవిత లక్ష్యాన్ని తెలిసికొనగలిగి, ఆధ్యాత్మికంగా ముందడుగు వేయగలుగుదురు. మరి, ఇంతటి అద్భుత వ్యాససహిత గ్రంథాన్ని అందించిన రచయిత ఎవరని తెలుసుకొనాలనే కోరిక పాఠకులలో కలుగుట సహజము!

ఈ గ్రంథ రచయిత పూజ్యశ్రీస్వామి హంసానంద సరస్వతీ మహారాజ్‌వారు. ఈయన 1965వ సంవత్సరమునుండి ఋషీకేశ్‌నందలి శ్రీశివానంద ఆశ్రమములో సేవలందించుచున్నారు. వీరి ముఖ్యవ్యాపకము సద్గురు స్వామి శివానంద, పరమపూజ్య స్వామి చిదానంద, పూజ్యపాద స్వామి కృష్ణానంద వంటి అనేకానేక మహర్షులు విరచించిన ఆంగ్లగ్రంథాలను తెలుగుపాఠకుల ఉపయోగార్థము ఆంధ్రీకరించి, అచ్చొత్తించి, వితరణ చేయుటయే! అందుచేత శ్రీస్వామి హంసానందవారిని పరమాత్మ ఆంధ్రులమీద ఎంతో కృపతో ప్రసాదించిన ముద్దుబిడ్డగా అభివర్ణించాలి. వారి వ్యాసాలు చదువుతుంటే రోమాంచితం కానివారెవ్వరునూ ఉండరంటే అతిశయోక్తి కాదు.

ఈ గ్రంథంలోని వ్యాసాలన్నీ 2014 తరువాత "శ్రీశివానందవాణి" అనే ద్వైమాసిక తెలుగు సంచికలలో సంపాదకీయాలుగా ముద్రింపబడినవి. 2014కు పూర్వం అదే పత్రికయందు ప్రచురింపబడిన సంపాదకీయాలన్నీ "ఆధ్యాత్మిక

శుభసందర్భమునందు భక్తులకు జ్ఞానప్రసాదముగా వితరణచేయబడిది. ప్రస్తుత గ్రంథమైన "ఆధ్యాత్మిక ఆలోచనలు-రెండవ భాగము" పూజ్యశ్రీ స్వామి హంసానందవారి సహస్ర చంద్రదర్శన జన్మదినము (25.5.2021) సందర్భముగా ముద్రించబడి, పూజ్యపాద శ్రీస్వామి కృష్ణానంద సరస్వతీ మహారాజ్‌వారి దివ్య శతజయంతి సంవత్సరము (2021-2022) నందు శ్రీవారి పాదపద్మములయందొక పూజాపుష్పముగా సమర్పించుటకై ప్రచురింపబడినది.

ఈ గ్రంథమునందు శ్రీవారిచే విరచించబడి, వివిధ పత్రికలలో ప్రచురింపబడిన కొన్ని హిందీ భాషావ్యాసములును, శ్రీవారి యూరపుదేశాల పర్యటనా విశేషాలను, "Marriage" అను దానిపై వారి భావాలను కూడ జతపరచుట జరిగినది.

ఈ గ్రంథముద్రణకు తోట్పాటునందించిన ......... యావన్మందికి, ముద్రాపకులకు, ఆర్థికసాయం అందించిన భక్తులకు మాధవ దివ్యధామము, బెంగుళూరువారు హృదయపూర్వక ధన్యవాదములనర్పించుకొనుచున్నారు.

గురుపూర్ణిమ,

**- యు. నారాయణరావు**

ప్లవనామ సంవత్సరము



ॐ

# విషయ సూచిక

Part - I


1. అజ్ఞానము 1
2. ఆశ్చర్యవత్పశ్యతి 4
3. ఇదం శరీరమ్ 6
4. ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే తిష్ఠతి 9
5. ఉత్తమః పురుషస్త్వన్యః 12
6. ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః 15
7. ఋజుమార్గ వర్తనము 18
8. ఏషా బ్రాహ్మీ స్థితిః 21
9. "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" 24
10. కోరిక – కోరికలు 27
11. పరుగు – పరుగులు 30
12. మూట – మూటలు 33
13. "మత్థ్సాని సర్వభూతాని" – "నచమత్థ్సాని భూతాని" 36
14. నేను మేను కాను 39
15. సర్వాత్మభావము 42
16. నేను ప్రపంచములో ఉన్నానా? లేక, ప్రపంచము నాకు బయట ఉన్నదా? 45
17. దేవుని నేత్రము 48
18. జ్ఞానము – విజ్ఞానము 51
19. అన్ని వస్తువులు అన్ని స్థలములలోను, అన్ని వేళలలోను ఉన్నవి 53
20. అప్పుల కుప్ప 56
21. భావ శుద్ధియే! జ్ఞాన సిద్ధి 59
22. అశోకవనములో శోకించుటయా? 61
23. నగ్నసత్యము 64

24. నీటిపై వ్రాత 66
25. విద్యాలయములు - వైద్యాలయములు 68
26. నేతి బీరకాయ 70
27. పంచామృతము 72
28. అద్వైత లక్ష్మి 75
29. ఆనంద లక్ష్మి 77
30. మోక్ష లక్ష్మి 80
31. మననానికి మూడు మాటలు 83
32. నా గురుదేవులు 92
33. నా మాతృమూర్తి ప్రబోధము 98
34. సనాతన ధర్మమనగానేమి? 106
35. పరిశుద్ధమైన గీత 108
36. గీతామేచోత్తమం గృహమ్ 110
37. మంచిని మించిన మహిమ లేదన్న మాత 111
38. పూజ్యశ్రీ స్వామివారితో నాకు గల పరిచయము 113
39. సయాతి పరమాం గతిమ్ 116
40. శ్రీ శివానందజ్యోతి 117
41. రథ సారధి 119

## Part - II


| | | |
|---|---|---|
| 1. | మోక్ష సామ్రాజ్యలక్ష్మి | 123 |
| 2. | గురువు దేవుడెట్లగును? | 126 |
| 3. | దహింపబడునదే! దేహము. | 128 |
| 4. | మనము మన జీవితమునందేమి చేయవలయును? | 131 |
| 5. | ఏది సత్యము? ఏది అసత్యము? | 134 |
| 6. | నా నిర్ణయము | 136 |
| 7. | ఏది లాభము? ఏది నష్టము? | 139 |
| 8. | ఎంత కాలా మోర్చియుందునురా? | 142 |
| 9. | శాంతి వృక్షము | 145 |
| 10. | నీవున్న చోట నేను కూడా ఉన్నాను. | 148 |
| 11. | అస్తమించని సూర్యుడే! ఆత్మదేవుడు | 151 |
| 12. | కన్నీరు కార్చనేల? | 153 |
| 13. | ఆత్మ చింతన | 156 |
| 14. | మన కోరికలే! మన సమస్యలు. | 159 |
| 15. | విద్య - అవిద్య | 161 |
| 16. | మన కోరికలన్నియును తీఋనదెప్పుడు? | 164 |
| 17. | ఏకము సత్యమా? లేక, అనేకము సత్యమా? | 167 |
| 18. | ఆత్మకథ | 169 |
| 19. | తిరుగు ప్రయాణము | 172 |
| 20. | ఉన్నదానికి లేమి లేదు- లేనిదానికి ఉనికి లేదు | 175 |
| 21. | కలికాల కల్మష కారణ నివారణము | 178 |
| 22. | లక్ష్మియొక్క లక్ష్యము | 180 |
| 23. | కర్తవ్య కర్మ | 183 |
| 24. | ఒడి - బడి - గుడి | 185 |
| 25. | "సర్వం శక్తిమయం జగత్" | 188 |
| 26. | అద్వైతామృతము | 191 |
| 27. | సాంఘిక సేవగొప్పదా? స్వాత్మ సేవగొప్పదా? | 193 |
| 28. | సత్యవ్రతము | 196 |
| 29. | స్వంత ఇల్లు | 198 |
| 30. | నూరేండ్లు నిండుట అనగానేమి? | 201 |
| 31. | జీవన్మ ృతుడు- జీవన్ముక్తుడు | 203 |
| 32. | గృహప్రవేశము | 206 |
| 33. | అపూర్ణ సతోమా పూర్ణ సద్గమయ | 209 |
| 34. | జీవితములో విజయదశమి | 211 |
| 35. | విద్యా ధనం సర్వధనాత్ప్రధానమ్ | 214 |
| 36. | దేవుని ఇల్లు | 217 |

| | | |
|---|---|---|
| 37. | ఆశ్చర్య వత్పశ్యతి | 220 |
| 38. | ఇదం శరీరమ్ | 222 |
| 39. | ఉత్తమః పురుషస్త్వన్యః | 225 |
| 40. | చదువులలోని మర్మము | 228 |
| 41. | నాణ్యమైన వస్తువు | 231 |
| 42. | ఋజుమార్గ వర్తనము | 234 |
| 43. | "నిశ్శేష కర్మక్షయమే! మోక్షము" | 237 |
| 44. | అజ్ఞానము | 240 |
| 45. | తన్మయత్వము | 243 |
| 46. | తథ్యమైన విషయము | 246 |
| 47. | దారిద్ర్యము | 249 |
| 48. | ధన్యాత్మ | 252 |
| 49. | "నతాతో నమాతా" | 255 |
| 50. | పాప పంక ప్రక్షాళనము | 258 |
| 51. | ఫాలనేత్రము | 261 |
| 52. | "బలం బలవతాం చాహమ్" | 263 |
| 53. | భయము | 266 |
| 54. | మాయ | 269 |
| 55. | యతిధర్మము | 271 |
| 56. | రహస్యం హ్యేత దుత్తమమ్ | 274 |
| 57. | లాభము | 277 |
| 58. | విద్య | 279 |
| 59. | శక్తిపాతము | 282 |
| 60. | షణ్ముఖనాథుడు | 284 |
| 61. | స్వప్నము | 287 |
| 62. | హరియను రెండక్షరములు | 290 |
| 63. | క్షమాలక్ష్మి | 292 |
| 64. | త్రినేత్రములు | 295 |
| 65. | "జ్ఞానేన హీనః పశుభిః సమానః" | 298 |
| 66. | రాష్ట్రీయ ఐక్యత | 300 |
| 67. | భగవద్గీత – కర్మ, భక్తి, మోక్ష సన్న్యాస యోగములు | 303 |
| 68. | నిష్కామ సేవా సారము | 305 |
| 69. | బాలభగవానుడు | 307 |
| 70. | (అ) నా యూరప్ ఖండ పర్యటన (ఆ) నా యూరప్ ఖండ పర్యటన – వివరణ కొనసాగింపు (ఇ) నా యూరప్ ఖండ పర్యటన | 309 |
| 71. | అమ్మా! అమ్మా! రావమ్మా! (పాట) | 319 |
| 72. | Marriage | 321 |

# Part - I

# ఆధ్యాత్మిక ఆలోచనలు

## 1. అజ్ఞానము

ఆత్మజ్ఞానోపలబ్ధికై జ్ఞానము గూర్చి తెలిసికొనుట ఎంత అవసరమో, అజ్ఞానము గూర్చి తెలిసికొనుట కూడ అంతే అవసరము. జ్ఞానము లేకపోవుటయే! అజ్ఞానము. ఇచ్చట జ్ఞానమనగా చర్మచక్షువులతో చూచి తెలుసుకొనునట్టి సామాన్య జ్ఞానము కాదు. "నేనెవరు? నేనెచ్చటినుండి వచ్చితిని? ఈ లోకములో నేను చేయవలసిన కర్తవ్యమేమి? ఈ లోకమును విడిచిన తర్వాత నేనెచ్చటికి వెళ్ళుదును?" మున్నగు ప్రశ్నలకు సమాధానమును తెలిసికొనుటయే! నిజమైన జ్ఞానమనబడును. తెలిసికొనకుండా ఉండుటయే! అజ్ఞానము. "నేనెవరు?" అని తెలిసికొనుట ప్రతి మానవునికి అవసరము. దీనిని తెలిసికొనకపోవుట వలన కలుగు నష్టమేమి? "మహతీ వినష్టిః" అని ఉపనిషత్తు పలుకుచున్నది. అనగా:– దీనికి మించిన నష్టము మఱొకటి లేదని భావము. జీవితమే! వ్యర్థమగునని అర్థము. దీనిని తెలిసికొనకున్నచో మనుజుడు జననమరణ చక్రమునందు పరిభ్రమింప వలసివచ్చును. జనన మరణ చక్రమునందు పరిభ్రమించినచో కలుగు నష్టమేమి? సుఖదుఃఖములకు గుఱికావలసివచ్చును. సుఖమున్నచోట దుఃఖము తప్పకుండా ఉండును. అందువల్ల శాశ్వతమైన సుఖము మనకు లభింపదు. శాశ్వత సుఖమే! అనందమని చెప్పబడును. ఈ ఆనందము నందున్నూ ఎన్నో రకములున్నవి. ముఖ్యమైనవి రెండు: (1) విషయానందము, (2) బ్రహ్మానందము. విషయానందము మనలను జననమరణ చక్రమునందు పడవేయును. బ్రహ్మానందమునొందుటచే ఈ జనన మరణ చక్రమునుండి మనము విడివడుదుము. కేవలము జ్ఞానము చేతనే! ఈ బ్రహ్మానందము మనకు లభించును. కావున బ్రహ్మానందమునొందని వారందఱును అజ్ఞానభూమిక యందున్నారని చెప్పవలసియుండును. బ్రహ్మానందము నొందిన వారికి చలనస్వభావముండదు. ఏ నదియైనను తాను ఉత్పన్నమైన స్థలమునుండి సముద్రమును చేరునంతవరకు ప్రవహించుచునే యుండును. అదే విధముగా ప్రతిజీవియు, ప్రతి ప్రాణియు, ప్రతి మనుజుడున్నూ ఆ పరబ్రహ్మము నొందునంత వరకు జననమరణ ప్రవాహమునందు దొర్లుచునే యుండును. ఇదియే! జీవుని అజ్ఞానదశ. బ్రహ్మానంద సాగరమును చేఱునంతవరకు జీవుడు సుఖదుఃఖములకు గుఱికావలసియుండును. కావున

మనుజుడు బ్రహ్మానందసాగరమును చేరుటయే! లక్ష్యముగా కలిగియుండవలయును. "నేనెవరు?" అను విషయమును తెలిసికొన నంతవరకు మనుజుడు తన జీవితలక్ష్యమును తెలియజాలడు. మనము మన జీవిత లక్ష్యమును తెలిసికొనుటకై విషయానందము అడ్డుపడు చుండును. కావున విషయానందమును విషమువలె త్యజించుట సాధకులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు అవసరమైయున్నది.

మనుజుని మనస్సు సంకుచితమై యుండుటచే ఎల్లప్పుడది విషయానందము నొందుటకే పరిభ్రమించుచుండును. బ్రహ్మానందమునకు దిగువస్థాయియందున్న ఆనందములన్నియును విషయానందములనియే చెప్పవచ్చును. విషయానందము ధనకనక వస్తువాహనాది ఏదో ఒక విషయమును ఆలంబనముగా కలిగియుండును. ఆ విషయము నశించినప్పుడు, లేక మార్పునొందినప్పుడు మనుజుడు దుఃఖసాగరము నందు మునిగి పోవును. స్వర్గలోకము కూడా విషయానంద ప్రపూర్ణమై యున్నదని చెప్పవచ్చును. ఏలననగా:-మనుజుడు తన పుణ్యకర్మఫలముననుభవించుటకై స్వర్గలోకమునకు వెళ్ళి రంభ, ఊర్వశి, మేనక ఇత్యాదులతో స్వర్గలోక సుఖము ననుభవించును. కాని ఆ పుణ్యకర్మఫలము సమాప్తమైన వెంటనే భూపతనము నొందును. అప్పుడాతని దుఃఖమునకు మేర లేకుండును. కావున సుఖ దుఃఖములు రెండింటిచేతను మనుజునికి శాశ్వతసుఖము లభింపదు. వివేకవంతుడైన మనుజుడు శాశ్వత జ్ఞానమును కలిగి యుండును. అజ్ఞానావరణ తొలగిపోవుటెట్లు? అజ్ఞానము అంధకారము వంటిది. ఈ అంధకారము తొలగిపోవుటకై జ్ఞానభాస్కరుడు మన హృదయాకాశము నందుదయింపవలసి యుండును. అప్పుడు మన జ్ఞాననేత్రము తెరువబడును. జ్ఞానభాస్కరుడెవరు? గురుదేవుడే! జ్ఞానభాస్కరుడు. చిన్నమనస్సుగల మనకు పెద్దమనస్సుగల గురుదేవుడు ఉపదేశింప వలసియుండును. అప్పుడు మాత్రమే! మన అజ్ఞానము తొలగిపోవును. గురుదేవుడు మనకు జ్ఞానధనమును ప్రసాదించును. ఈ ధనమును మనము సదుపయోగమొనర్చుకొందుమేని, విషయానందమున కతీతమైన బ్రహ్మానందమును మనమార్జింపవచ్చును. గురుదేవుడు మనకేమి ఉపదేశించును? "ఈ ప్రపంచము నశ్వరమైనది. దీనియందు నిజమైన సుఖములేదు. ఈ ప్రపంచములోని సుఖము స్వప్నములోని సుఖమువంటిద"ని గురుదేవుడు పలుకును. ఈ మాటలు నిజమా? కావా? యని మనము మాటిమాటికి మననము చేసికొనుచుండవలయును. నిజమని నమ్మువాడు తన నిజానంద ధామమును చేరుకొనును. విశ్వాసములేనివాడు అశాశ్వత ధామమును చేరుకొనును.

మనము శాశ్వతమైన బ్రహ్మానంద ధామమును చేరుకొనుటకు పూర్వమే గురుదేవుడు తమ దేహమును చాలించెననుకొనుడు. ఐనను నిజమైన ముముక్షువునకు నష్టములేదు. ఏల? గురుదేవుడు దేహాతీతుడు. దేహము నందున్నప్పుడు గురుదేవుడు చెప్పిన మాటలను ఆచరించుచు, జీవితమును గడుపుదుమేని, దేహాతీతుడైన గురువు సూక్ష్మరూపమునందుండి

మనకు సహకరించుచుండును. "బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞాన మూర్తిమ్, ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్" అని గురుదేవుడు వర్ణింపబడెను. గురుదేవుడు బ్రహ్మానందస్వరూపుడగుటచే ఆతడు మనకు బ్రహ్మానందమును ప్రసాదించును. గురుదేవుడు పరమసుఖస్వరూపుడగుటచే మనకాతడు పరమ సుఖమునొసంగును. గురుదేవుడు కేవలము జ్ఞానమూర్తి యగుటచే మన అజ్ఞానమునాతడు పోగొట్టి జ్ఞానప్రకాశమును ప్రసాదించును. రూపముదాల్చిన పరబ్రహ్మమే! గురుదేవుడగుటచే అతడు ద్వంద్వాతీతుడై యున్నాడు. గగనములోని విహంగమువలె మనము గురుదేవుని కారుణ్యముచే ఆత్మస్వాతంత్ర్యముతో విహరింపజాలుదుము. "తత్త్వమసి" మహావాక్యమును గురుదేవుడు మనకుపదేశించును. దానిని మననముచేసికొని మనము మన అజ్ఞానమును నివర్తింపజేసికొని, ''అహం బ్రహ్మాస్మి''యను మహావాక్యము ననుభూతికి తెచ్చుకొనవలయును. అప్పుడు మనము మన జీవిత లక్ష్యము నొందజాలుదుము. జీవితలక్ష్యమునొందుటకై మనయందు విషయవాసన లేశమైనను ఉండరాదు. భగవంతుని యందాసక్తి కలిగినప్పుడు మాత్రమే ప్రపంచమునందనాసక్తి ఏర్పడును. మన కోరికలన్నియును కోదండ రాముని యందేకత్రిత మొనర్పబడవలయును. మన ముఖములన్నియును మురళీ మనోహరునివైపు త్రిప్పబడవలయును. మన శిరస్సులన్నియును శివునిముందు వంచబడవలయును. మన శరీరములన్నియును ఆ పరాశక్తికి సమర్పింపబడవలయును. కేవలము అప్పుడు మాత్రమే! మన అజ్ఞానము నశించును. అజ్ఞాననాశముచే మనోనాశమేర్పడును. మనోనాశముచే విషయవాంఛలు నశించును. విషయవాంఛలు నశించుటచే ప్రపంచము నందాసక్తి సన్నగిల్లును. అప్పుడు సాధకునికి పరబ్రహ్మానుభవము కరతలామలకమగును. కావున మనమందరమున్నూ అజ్ఞానాంధకారమును నశింపజేసికొని మన జీవితలక్ష్యమునొందుటకై జ్ఞానభాస్కరుడైన శ్రీగురుదేవుని చరణకమలముల నాశ్రయించెదము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జనవరి/ఫిబ్రవరి, 2009 సంచిక నుండి)

# 2. ఆశ్చర్యవత్పశ్యతి

**"ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవద్వదతి తథైవచాన్యః ।**
**ఆశ్చర్యవచ్చైన మన్యః శృణోతి, శ్రుత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥"**

పై శ్లోకము శ్రీమద్భగవద్గీతలోని రెండవ అధ్యాయమునందలి 29వ శ్లోకము. ఈ శ్లోకములోని "ఏనం" పదమునకు 'ఆత్మ' యను అర్థమును స్వీకరింపవలయును. మొదటిపాదమునకు ఈ ఆత్మను ఒకానొకడు ఆశ్చర్యముతో చూచునని అర్థము. ఆత్మ కంటికి కానబడునట్టి వస్తువు కాదుకదా! అట్టి ఎడల దీనిని చూచుట ఎట్లు సంభవించునను ప్రశ్న ఉదయించును. జ్ఞాననేత్రముతో చూచునని చెప్పవచ్చును. మఱియు "ఆత్మవత్సర్వా భూతాని" అనెడి ఆర్యోక్తి కలదు. సకల భూతములలో, సకల పదార్థమును చూచినను, ఆత్మను చూచినట్లే యగును. ఐతే ఆత్మ నశించునది కాదుకదా! పదార్థము లన్నియును నశించును కదా! యను సందేహమిచ్చుట కలుగును. పదార్థములు నశించినను, పదార్థములలోని సారవస్తువు నశింపదు. కుండ నశించినను, మట్టికి నాశములేదు. దేహము నశించినను దేహములోని ఆత్మకు నాశములేదు. ప్రపంచము నశించినను ప్రపంచమును సృష్టించిన పరమాత్మకు నాశములేదు. తల్లి గర్భమునుండి జన్మించిన ప్రతి పసిబిడ్డయు ప్రపంచమును చూచి ఆశ్చర్యము నొందును. పొయ్యిలో వెలుగుచున్న అగ్నిని చూచి ఆశ్చర్యముతో దానిని పట్టుకొనబోవును. కాని తల్లి ఆ పసిబిడ్డను అగ్నివైపు పోకుండా వారించును. ఆకాశములోని చంద్రుని చూచి పసిబిడ్డ ఆశ్చర్యమునొందును. తర్వాత ఆ పసిబిడ్డ గృహములోనికి రాగానే ఆ విషయమై మరచిపోవును. ఇంటిలో ప్రాకుచున్న చీమను చూచి పసిబిడ్డ ఆశ్చర్యముతో దానిని పట్టుకొనబోవును. కాని చీమకుట్టినచో పసిబిడ్డ బాధపడునని తలంచి, తల్లి పసిబిడ్డను ఆ చీమనుండి వైదొలగునట్లు చేయును.

ఇక పై శ్లోకములోని రెండవపాదమునకు "ఈ ఆత్మను గూర్చి మరియొకడు ఆశ్చర్యముతో పలుకున"ని అర్థము. ఆత్మ అనిర్వచనీయము, అవర్ణనీయము. కావున దానిని గూర్చి పలుకుట ఎవరికిన్నీ సాధ్యము కాదు. ఐనను విద్వాంసులు, కవులు, జ్ఞానులు, భక్తులు దానిని గూర్చి పలుకుటకై ప్రయత్నించిరి. "రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ" అనెడి సామెత కలదు. అనగా:– రామ రావణుల యుద్ధము రామ రావణుల యుద్ధమువలె ఉన్నదని అర్థము. కారణమేమనగా:– రామరావణులమధ్య జరిగిన యుద్ధముతో పోల్చుటకు తగిన మరియొక యుద్ధములేదని భావము. అదే విధముగా "సాగరం సాగరోపమమ్" అను సామెత కలదు. అనగా:– సముద్రము సముద్రమువలె ఉన్నదని అర్థము. కారణమేమనగా:– సముద్రముతో పోల్చుటకు తగిన మరియొక పదార్థము లేదు. అదేవిధముగా ఆత్మను ఆత్మతోనే పోల్చవలసియుండును. ఆత్మయందన్ని పదార్థములును గర్భితములైయున్నవి. కావున ఆత్మను ఆత్మయే వర్ణింపగలుగును. ఆత్మను అనాత్మ వర్ణింపజాలదు.

"మరియొకడు ఈ ఆత్మను గూర్చి ఆశ్చర్యముతో శ్రవణము చేయున"ని పై శ్లోకములోని మూడవ పాదమునకర్థము. ఆత్మజ్ఞుడైన గురువు ఆత్మ అనగా ఏమియో

తెలియని శిష్యునికుపదేశించును. ఆత్మకు సంబంధించిన విషయములన్నింటిని శిష్యుడు ఆశ్చర్యముతో శ్రవణము చేయుచుండును. సముద్రమును చూడనివానికి సముద్రము గుఱించి ఎంతగా వర్ణించి చెప్పినను, అతనికి బోధపడదు. ఆతడా సముద్రమును దర్శించినప్పుడు మాత్రమే! చక్కగా బోధపడును. అదే విధముగా ఆత్మ సాక్షాత్కారము నొంద నంత వరకు ఆత్మ విషయమై మనము తెలిసికొనజాలము. ఆత్మ ప్రబోధమును గురువుగారి నుండి శ్రవణము చేసిన తర్వాత దానిని మననము చేయుచుండవలయును. మననము చేయగా చేయగా మనస్సు తన చంచలమైన స్వరూపమును కోల్పోయి, ఆత్మస్వరూపము నొందును. ఇది "భ్రమర కీటక న్యాయము" వంటిది. సామాన్యమైన ఒక కీటకమును తెచ్చి, తుమ్మెద దానిని తన గూటియందుంచి, దానిచుట్టు తిరుగుచు, ఝుంకారము చేయుచుండును. ఆ ఝుంకారమును విని, విని, తుట్టతుదకా కీటకము తుమ్మెదగా మారిపోవును. ఐతే ఆత్మను గూర్చి ఎంత శ్రవణము చేసినను దానిని తెలిసికొనుట కష్టము. ఏల? ఆత్మను గూర్చి తెలిసికొన్న తర్వాత అనాత్మ ఆత్మగా మారిపోవును. ఇది కీటకము భ్రమరముగా మారుటవంటిది. ఆత్మ తెలియబడనంత వరకే అజ్ఞాన కారణముచే అన్ని రకములగు సమస్య లుండును. ఆత్మజ్ఞానము కలిగిన తర్వాత సమస్యలన్నియును సమసిపోవును. ఈ ప్రపంచమునందున్నంత వరకు మనమీ ప్రపంచములోని సుఖదుఃఖములకు గుఱియగుచుందుము. పుణ్యకర్మఫలముచే మనము స్వర్గలోకమునకు వెళ్ళినప్పుడు స్వర్గలోకభోగములననుభవింపవలసి వచ్చును. ఇక "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" యనునట్లు పుణ్యఫలము సమాప్తమైన వెంటనే మనమీ భూలోకమునందు పతనమగుట సంభవించును. కావున పతనములేని భూమికను చేరుకొనుటయే! ఆత్మసాక్షాత్కారమనబడును. ఆత్మసాక్షాత్కారము నొందిన తర్వాత మనము కృతకృత్యులమగుదుము. అనగా:- చేయవలసినదానిని చేసినవారమగుదుము.

మనమీ ప్రపంచములో చేయవలసినదేమి కలదు? దేనిని చేసినచో ఇక చేయవలసినదేమియు మిగిలియుండదో దానిని చేయవలయును. మనము దేవుని దర్శించినచో, అన్నియు దర్శించినట్లగును. ఇచ్చట దేవుడనగా:- దేవాలయములు, గుళ్ళు, గోపురములలోని దేవుడని అర్థము కాదు. ఈ దేవుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడైన దేవుడు. ఇట్టి దేవుని గూర్చి వర్ణించినచో, అన్నింటిని వర్ణించినట్లేయగును. ఇట్టి దేవుని గూర్చి శ్రవణము చేసినచో, అన్నింటినీ శ్రవణము చేసినట్లేయగును. కావున ఇట్టి దేవుని గూర్చి తెలిసికొన్నచో, అన్నింటిని తెలిసికొన్నట్లేయగును. ఆత్మసాక్షాత్కారము నొందిన వ్యక్తి సూర్యునితో కలసి ప్రపంచమును ప్రకాశింపజేయుచుండును. చంద్రునితో కలిసి రాత్రివేళ వెన్నెల నొసంగును. సముద్రముతో కలిసి గర్జన చేయుచుండును. వాయువుతో కలిసి వీచుచుండును. భూదేవితో కలిసి భూమండలమును పరిపాలించు చుండును. ఆతడన్నింటితో తాదాత్మ్యము నొంది, అన్నియు తానై భాసించుచుండును. "అహం బ్రహ్మాస్మి" వాక్యము ననుభూతమొనర్చుకొన్నవాడే! ఆత్మసాక్షాత్కారము నొందగలుగును. అప్పుడు తాను ప్రపంచమును చూచి, ఆశ్చర్యమునొందుటకు బదులుగా, ప్రపంచమే! అట్టివానిని చూచి, ఆశ్చర్యము నొందుచుండును.

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', మార్చి/ఏప్రియల్, 2009 సంచిక నుండి)

# 3. ఇదం శరీరమ్

**"ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥**

పై శ్లోకము శ్రీమద్భగవద్గీతలోని 13వ అధ్యాయములోని 1వ శ్లోకము. ఈ శ్లోకమును శ్రీకృష్ణభగవానుడు అర్జునుని సంబోధించి చెప్పెను. అనగా:- అర్జునుని నిమిత్తముగా చేసుకొని ఆధ్యాత్మిక సాధకులందఱికి చెప్పెనని భావము. అర్జునుడు కుంతీపుత్రుడు. అందువల్ల పై శ్లోకము నందర్జునుడు "కౌంతేయ" అని సంబోధింపబడెను. అర్జునునివలె మన మందఱమున్నూ తల్లి గర్భమునుండి వచ్చినవారమే కదా! ఐతే తల్లి గర్భము నుండి కేవలము శరీరము మాత్రమే బయటికి రాలేదు. శరీరముతో పాటు శరీరి కూడ బయటికి వచ్చెను. శరీరి అంటే శరీరమునందున్న ప్రాణము లేక ఆత్మయని అర్థము. ఒకవేళ శరీరము మాత్రమే బయటికి వచ్చియుండినచో తల్లి, తండ్రి, బంధుబాంధవులందఱును కన్నీరు కార్చియుండెడివారు. కాని శరీరి వచ్చిన కారణముచే తల్లిదండ్రులతోపాటు బంధుబాంధవులందఱును ఆనందోత్సవమును జరుపుచుందురు. కావున ఈ దేహము అసత్పదార్థమని తెలియుచున్నది.

ఈ శరీరము క్షేత్రమని చెప్పబడునని శ్రీకృష్ణుడు పలికెను. పంటచేలను, ఫలవృక్షాలను కలిగియుండునది క్షేత్రము. అదేవిధముగా ఈ దేహము వివిధములగు కర్మఫలములను కలిగియుండును. ఒక వృక్షముయొక్క బీజము మరొక వృక్షమునకు కారణమగునట్లే, ఈ దేహము మరొక దేహమునకు కారణమగును. కావున ఈ దేహము క్షేత్రమని చెప్పబడినది. ఈ దేహమును తెలుసుకొనువాడు క్షేత్రజ్ఞుడు. ఈ క్షేత్రజ్ఞుడు మన దేహమునందేయున్నాడు. ఆ దేహమునందున్నట్టివాడే "నా దేహము, నా నేత్రము, నా శ్రోత్రము, నా చేయి, నా కాలు, నా ఉదరము, నా వీపు" అని పలుకుచున్నాడు. కావున ఈ దేహమును, దేహములోని ఇంద్రియములను తెలుసుకొనువాడు క్షేత్రజ్ఞుడు అని చెప్పబడును. "దహ్యతే ఇతి దేహః" దహింపబడునదేదో అది దేహమని చెప్పబడును. "శీర్యతే ఇతి శరీరమ్" నశించు స్వభావమును కలిగియుండుటచే శరీరమని చెప్పబడును. ఇక "దేహి" లేక "శరీరి" యొక్క స్వభావమెట్టిదో తెలిసికొందము. "దేహి" అంటే దేహమునందున్న పదార్థమని అర్థము. "శరీరి" అంటే శరీరమునందున్న పదార్థమని అర్థము. దీనిని తెలిసికొనుటయే! మనందఱి కర్తవ్యమైయున్నది. దీనిని తెలిసికొనుటచే మనము కృతకృత్యులమగుదుము. అనగా:- చేయవలసినదానిని చేసినవారమగుదుము.

ఈ దేహమునందున్న ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. జలము తడుపజాలదు. గాలి ఎండింపజాలదు. ఇక దేహమో శస్త్రములచే ఛేదించపబడును. అగ్నిచే దహింపబడును. జలముచే తడుపబడును. గాలిచే ఎండింపబడును. కావున

ఈ దేహి – దేహముల మధ్య భూమ్యాకాశములవంటి భేదము కలదు. ఈ ఉపమానము కూడా అనుచితమని చెప్పవచ్చును. ఏలననగా:– భూమి, ఆకాశము రెండున్నూ పంచభూతములలో చేరును. ఇక దేహమునందున్న ఆత్మ పంచభూతముల కతీతమైయున్నది. అంతేకాదు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము లకున్నూ అతీతమైయున్నది. ఆత్మ మనస్సుచే తెలియబడదు. బుద్ధిచే యోచించబడదు. చిత్తముచే చింతించబడదు. అహంకారముచే పీడింపబడదు. కావున ఆత్మ వాటన్నింటికి అతీతమైయున్నది. ఈ కారణముచే ఆత్మ అసంగమని చెప్పబడును. ఆత్మయందు సత్త్వరజోతమోగుణములు కూడా లేవు. ఈ కారణముచే ఆత్మ నిర్గుణమని చెప్పబడును. ఆత్మయందు అజ్ఞానాంధకారము లేదు. ఈ కారణముచే ఆత్మ నిరంజనమని చెప్పబడును. ఆత్మయందు విభాగములు లేవు. కావున ఆత్మ నిష్కళమని చెప్పబడును.

దేహి ఆత్మ, దేహము అనాత్మ; దేహి పురుషుడు, దేహము ప్రకృతి; దేహి క్షేత్రజ్ఞుడు, దేహము క్షేత్రము. "నన్ను క్షేత్రజ్ఞునిగా తెలిసికొనుము"ని శ్రీకృష్ణుడు అర్జునునితో పలికెను. ఆ పరబ్రహ్మమే! శ్రీకృష్ణుని రూపమును ధరించెనని దీనినిబట్టి తెలియుచున్నది. నిజమునకు ఆ పరబ్రహ్మమే! మనందఱి శరీరములను ధరించినది. ఐతే ఆవిషయము మనకు తెలియదు. ఈ కారణముచేతనే మనకు దుఃఖపరంపరలు తప్పుటలేదు. "దేహము నేన"ను కొనుటయే! మహాపాపము. "దేహిని నేన"ను కొనుటయే మహాపుణ్యము. దేహము నేననుకొన్నవాడు "దేహి"కి దూరమగును. "దేహినినేన"ను కొన్నవానికి దేహము నశించినను చింతలేదు. స్వప్నము నందు మనమెన్నో దేహములను చూచుచుందుము. మేల్కొన్నప్పుడవి యన్నియును నశించును. అంతమాత్రముచే మనము దుఃఖించుచున్నామా? లేదు. అట్లే క్షేత్రము నశించినను క్షేత్రజ్ఞుడు దుఃఖింపడు. క్షేత్రజ్ఞుడు లేనిచో క్షేత్రమునకు ఉనికి లేదు. అది ఎట్లనగా:– దారములేనిచో వస్త్రమునకు ఉనికి లేదు కదా! మట్టిలేనిచో కుండకు ఉనికి లేదు కదా! బంగారము లేనిచో ఆభరణములకు ఉనికి లేదు కదా! కఱ్ఱ లేనిచో కుర్చీలు, బల్లలు, మేజాలకు ఉనికియుండదు కదా!

ఈ ప్రపంచమొక పెద్ద క్షేత్రము వంటిది. ఈ ప్రపంచమును సృష్టించినవాడే పరమాత్మ. కావున పరమాత్మయే క్షేత్రజ్ఞుడు. జీవులమైన మనము అజ్ఞానాంధకారమునందు మునిగియున్న కారణముచే క్షేత్రజ్ఞుని తెలిసికొనజాలకున్నాము. కావుననే జనన మరణ చక్రమునందు పరిభ్రమించుచున్నాము. ఈ జననమరణబంధము నుండి విడివడుటకై మనము క్షేత్రజ్ఞుని తెలిసికొనవలసియున్నది. ఐతే ఈ క్షేత్రజ్ఞుని నివాస మెచ్చట? మన హృదయగుహయే! ఈ క్షేత్రజ్ఞుని నివాసము. ఈ హృదయేశ్వరుని తెలిసికొన్నవాడు సకల జీవుల హృదయాంతర్వాసియైన హృదయేశ్వరుని కూడ తెలిసికొనజాలును. మన దేహము ఎంతవరకు మృణ్మయమై యుండునో, అంతవరకు మనము మన హృదయేశ్వరుని తెలిసికొనజాలము. మన దేహము చిన్మయమైనప్పుడు మనలోని హృదయేశ్వరునే గాక,

సకల జీవుల హృదయాంతర్వాసియైన హృదయేశ్వరుని కూడా తెలిసికొనజాలుదుము. అఖండ భగవన్నామ స్మరణచే మన దేహము చిన్మయమగును. గురూపదేశ మంత్రమును నిరంతరము జపించుటచే మన దేహము చిన్మయమగును. మహావాక్యచతుష్టయమును శ్రవణ – మనన – నిదిధ్యాసనల నొనర్చుటచే మన దేహము చిన్మయమగును.

మన దేహము మట్టిలో కలిసిపోయినను, అగ్నిలో దహింపబడినను, గంగానదిలో పడవేసినను, సముద్రమునందు త్రోయబడినను, కొందఱి ఆచారము ప్రకారముగా కాకులు, గ్రద్దలు తినుటకు అరణ్యము నందు పడవేయబడినను మరణభీతినొందని వాని దేహము "చిన్మయమ"ని చెప్పవచ్చును. మన భావము దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములకు అతీతమైయుండుటయే! చిన్మయానందము, లేక చిదానందముల నొందుట. అట్లు కాదేని, మృణ్మయానందము నొందినవార మగుదుము. దేహమే! సర్వస్వమనుకొనువారు మృణ్మయానందమునొందుదురు. అనగా:– వారి ఆనందము దేహమున్నంత వరకే పరిమితమైయుండును. ఈ దేహము నపుంసక లింగము. ఈ దేహమునందున్నవాడు పురుషుడు. స్త్రీత్వము, పురుషత్వము కేవలము దేహమునకు సంబంధించినదైయున్నది. నిజమునకు పురుషుడు స్త్రీపురుషులందఱి యందును, సకల చరాచర జగత్తంతయు వ్యాపించియున్నాడు. ఇట్టి పురుషోత్తముని సాక్షాత్కరించు కొనుటయే! సాధకుల యొక్క, జిజ్ఞాసువుల యొక్క, భక్తుల యొక్క, ముముక్షువుల యొక్క జీవిత లక్ష్యమైయున్నది.

(**సేకరణ**: 'శ్రీశివానందవాణి', మే/జూన్, 2009 సంచిక నుండి)

# 4. ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే తిష్ఠతి

"ఈశ్వరః సర్వభూతానాం హృద్ధేశేஉర్జున తిష్ఠతిః ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥"

పై శ్లోకము శ్రీమద్భగవద్గీతలోని పదునెనిమిదవ అధ్యాయములోని 61వ శ్లోకము. ఈశ్వరుడు సకల భూతముల హృదయములయందున్నాడని దీని భావము. సకల భూతముల హృదయములయందుండి ఏమి చేయు చున్నాడు? వారివారి కర్మానుసారముగా జీవులను త్రిప్పుచున్నాడు. ఏ సాధనముచే త్రిప్పుచున్నాడు? మాయ యొక్క సహాయముచే త్రిప్పుచున్నాడు. ఈశ్వరునికి కూడా సహాయమవసరమా? అతనికేలాటి సహాయమవసరము లేదు. ఏలననగా:- మాయ ఈశ్వరుని యొక్క సృష్టియే! అందువల్ల మాయ ఈశ్వరునికి లోబడియేయుండును. ఇక జీవులమైయున్న మనము మాయకు లోబడియున్నాము. అందువల్లనే! జనన మరణ చక్రమునందు పరిభ్రమించు చున్నాము. ఈ ప్రపంచమునందు నానా రకములైన యంత్రములను మనము చూచుచున్నాము. ఒక యంత్రములో గోధుమలను వేసి పిండి చేయుమన్నచో, అ యంత్రము పిండిచేసి ఇచ్చును. మరొక యంత్రములో ఆముదపుగింజలను వేసి ఆముదమును తయారుచేయమన్నచో, అది ఆముదమును తయారుచేసి ఇచ్చును. వేఱొక యంత్రములో ఎండుమిరపకాయలను వేసి కారప్పొడిని తయారుచేయుమని చెప్పినచో, అది కారప్పొడిని తయారుచేసి ఇచ్చును. అదే ప్రకారముగా ఈశ్వరుడు ఈ సృష్టియనెడి గొప్ప యంత్రమును నడుపుచున్నాడు. ఈశ్వరుడు తన సంకల్పమాత్రముచే చీమలను, దోమలను, గుఱ్ఱములను, ఏనుగులను, చెట్టుచేమలను, పర్వత శిఖరములను, నదీనదములను, స్త్రీ, పురుషులను, ఇవి, అవి అననేల? సకల చరాచర జీవజగత్తును తన ఇచ్ఛానుసారముగా ఈ యంత్రము నుండి సృష్టించు చున్నాడు. ఈ యంత్రమునకు "మాయ" యని పేరు. మాయ మొదట పంచ భూతములను సృష్టించును. మొమ్మొదట ఆకాశము సృష్టింపబడెను. దాని నుండి వాయువు జనించెను. వాయువు నుండి అగ్ని కలిగెను. అగ్ని నుండి జలము ఉత్పన్నమయ్యెను. జలము నుండి భూమి ఆవిర్భవించెను. తదనంతరము సకల జీవజాలము సృష్టింపబడెను.

సూక్ష్మాతిసూక్ష్మరూపమునందున్న పరమేశ్వరుడు తన మాయాశక్తిచే స్థూలాతి స్థూలమైన ఈ ప్రపంచమును సృష్టించెను. అనగా:- "ఏకోஉహం బహుస్యాం" అన్నట్లు ఏకము అనేకమయ్యెను. అనేకమైన కారణముచే క్రమముగా అనేక సమస్యలేర్పడెను. "నేను - నేన"నెడి భేదభావమేర్పడెను. నీకున్న వస్తువు నాకు కూడా కావలయుననెడి కోరిక ఏర్పడెను. నీకున్న హోదా నాకు కూడా కావలయుననెడి కోరిక ఏర్పడెను. నీకున్న హోదా నాకు కూడా కావలయుననెడి వాంఛ ఏర్పడెను. నీకున్న ధనము నాకు కూడా కావలయుననెడి ఇచ్ఛ ఏర్పడెను. అవి లభింపకున్నచో వాచికముగనో, కాయికముగనో,

మానసికముగనో యుద్ధ సన్నద్ధుడు కావలసివచ్చెను. ఈ ప్రకారముగా జీవుడు పరమాత్మకు దూరమయ్యెను. నీటిలోని చేప తన నోటిని తెరువకున్నచో, దాహముచే బాధింపబడును. అదే విధముగా పరమాత్మయందున్న జీవుడు స్మృతి విహీనుడైనప్పుడు పరమాత్ముని మఱచి పోవును. ఈ కారణముచే నానా రకములగు బాధలకు గుఱియగుచుండును. అందువల్ల మానవులమైన మన మందఱమున్నూ ఎల్లప్పుడు భగవన్నామ స్మరణ చేయుచుండవలయును. దీనిచే ఏకత్వానుభూతి కలుగును. నానాత్వ భావన రహితమగును. దేహాభిమానము నశించును. ఆత్మానుభూతి ఏర్పడును. ఆకాశమునుండి జాఱిపడిన నీటిబిందువు సముద్రమునందు పడినప్పుడది సముద్రమే యగును కదా!

''అనన్య ప్రోక్తే గతిరత్ర నాస్తి'' యని కఠోపనిషత్తు నుడువుచున్నది. జీవితలక్ష్యమునొందుటకు అనన్య భావమును చేపట్ట వలయును. "అనన్యమ"నగా:- అన్యులు, లేక ఇతరులెవ్వరును లేని స్థితియని అర్థము. అనగా:- ప్రపంచమునంతటిని భస్మమొనర్చుట కాదు. నానాత్వము నందేకత్వమును దర్శించుటయని దీని భావము. దేహాధ్యాసచే అన్యభావము కలుగును. ఆత్మానుభూతిచే అనన్యభావము కలుగును. రెండవ వస్తువున్నప్పుడు భయము కలుగును. రెండవ వస్తువులేనప్పుడు నిర్భయత్వ మేర్పడును. కావుననే శ్రీమద్భగవద్గీతలోని పదునారవ అధ్యాయమైన "దైవాసుర సంపద్విభాగ యోగము" లోని ప్రథమ శ్లోకమును శ్రీకృష్ణ భగవానుడు ''అభయం''తో ప్రారంభించెను. ఏకత్వమున్నప్పుడు అభయత్వ ముండును. ఏకత్వమున్నప్పుడు హింసా ప్రవృత్తి యుండదు. హింసాప్రవృత్తి లేనప్పుడు మనుజుడు తేజస్వంతుడగును. తేజస్వంతుడైయున్న మనుజుడు శాంతి సముపేతుడై యుండును. అట్టివాడెల్లెడల శాంతిని విస్తరింపజేయు చుండును. "శాంతములేక సౌఖ్యములేదు" అని శ్రీ త్యాగరాజస్వామి పలికెను. తన గృహమునకు "శాంతినికేతన్"అని పేరు పెట్టుకొన్నంత మాత్రముచే ప్రయోజనము లేదు. మనుజుని హృదయము శాంతి నికేతనము కావలసియున్నది. మనుజుని హృదయము శాంతినికేతనమెట్లగును? హృదయేశ్వరుని స్మరించినప్పుడు. ఐతే ఈ హృదయేశ్వరుడు కేవలము తన హృదయమునందు మాత్రమే! యున్నాడా? లేదు. ఆతడు "సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి" యన్నట్లు అన్ని భూతముల హృదయములలోను, సమస్త జీవుల హృదయములలోను సమానముగా వ్యాపించియున్నాడు. కావున అన్యుల హృదయములను గాని, మనస్సులను గాని నొపింపరాదు. నొప్పించినచో ఏమగును? ఆ నొప్పి తనకే తిరిగి వడ్డీతో సహా వచ్చును. ఈ విధముగా జీవుడు దుఃఖము పాలగును. ఇతరుల దుఃఖమును తన దుఃఖముగా భావించి, దానిని తొలగించునట్టివాడు ఉత్తముడుగా పరిగణింపబడును. ఇతరుల సుఖమును తన సుఖముగా భావించి, దానిని వృద్ధి నొందించునట్టివాడు సజ్జనుడు. సత్యమార్గముననుసరించువాడు సజ్జనుడని చెప్పబడును. ఏది సత్యమార్గము? భూతభవిష్యద్వర్తమాన కాలములలో నశింపని దేదియో, అదియే! సత్యవస్తువు. దానిని సాక్షాత్కరించుకొను దారి ఏదియో, అదియే! సత్యమార్గము. దీనికి

భిన్నమైనది అసత్యమార్గము. సత్యమార్గమునను సరించువారు దేవతలనబడుదురు. ఇక అసత్యమార్గము ననుసరించువారు రాక్షసులనబడుదురు.

మహాభారతయుద్ధమునందు భీష్మపితామహుడు అర్జుననితో పోరాడిన సమయమునందు శ్రీకృష్ణపరమాత్మను దర్శించుచున్నప్పుడు తన శక్తి క్షీణమగుచున్న కారణముచేతను, అర్జునుడు శ్రీకృష్ణునికి పూర్ణ శరణాగతుడై యున్న కారణముచేతను అర్జునుని జయింపజాలకపోయెను. రావణాసురునికి సోదరుడయ్యు విభీషణుడు అధర్మమును సహింపని కారణముచే శ్రీరాముని ఆశ్రయించి, తుదకు లంకాధిపతియయ్యెను. హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదుని హృదయము శ్రీమన్నారాయణ నామసంభరితమైయున్న కారణముచే హిరణ్యకశిపుడు పెట్టిన బాధలు ప్రహ్లాదుని ఏమాత్రము ప్రభావితమొనర్పజాలకపోయెను. కావున మనుజుడేవర్గమునకు చెందినవాడైనను, నిరంతర హరినామస్మరణచే హృదయేశ్వరుని ధ్యానించుచున్నచో అట్టివాడీ జననమరణ చక్రమునుండి విడివడజాలును. అతడు తన జీవిత లక్ష్యమును చేరుకొనజాలును. ఇందు నిమిత్తమై మనుజుడు ఈశ్వరుని యొక్క ఉనికి కేవలము తన హృదయము నందే గాక, సకల చరాచర జీవులందఱి హృదయములయందున్నూ విరాజమానుడైయున్నాడను విశ్వాసమును కలిగియుండవలయును. అప్పుడు మనుజుని సాధన జీవిత లక్ష్యమును సాధించునంతవరకు నిరాటంకముగా సాగిపోవుచుండును.

(**సేకరణ**: ‘శ్రీశివానందవాణి’, జూలై/ఆగష్టు, 2009 సంచిక నుండి)

# 5. ఉత్తమః పురుషస్త్వన్యః

పై శీర్షిక శ్రీమద్భగవద్గీతలోని పదునైదవ అధ్యాయమునందలి పదునేడవ శ్లోకములోని ఒక భాగము. ఉత్తమ పురుషుడెవ్వడను విషయమీ శ్లోకమునందు చర్చించబడినది. పరమాత్మయే! ఆ ఉత్తమ పురుషుడు. ఆత్మలన్నింటికి ఆత్మయే! పరమాత్మ. ఆతడు భూః, భువః, సువః అనెడి మూడు లోకములలోను వ్యాపించి, ఆ లోకత్రయమును పోషించుచున్నాడు. ఈ పురుషునికి నాశము లేదు. అందువల్ల ఈశ్వరుడని చెప్పబడుచున్నాడు. ఇక పదునారవ శ్లోక మీ క్రింది విధముగానున్నది.

**"ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షరః సర్వాణి భూతాని కూటస్థో౽క్షర ఉచ్యతే ॥"**

అనగా:-ఈ లోకమునందు క్షర-అక్షర అనెడి రెండు రకముల పురుషులున్నారు. సకల భూతములయందుండువాడు క్షరపురుషుడు. అక్షరపురుషుడు కూటస్థుడని చెప్పబడును. ఈ కూటస్థుడు అక్షరుడు. అనగా:- నాశములేనివాడు. అనగా:-ఈ మూడు లోకములున్నంతవరకాతనికి నాశము లేదు. ప్రళయకాలములో ఈ మూడు లోకములు పరమాత్మునియందు లయమైనప్పుడీ అక్షరపురుషుడు కూడ లయమగును.

కావున ఈ అక్షరపురుషుడు దీర్ఘకాలము తర్వాత నశించునని భావము. అదెట్లనగా:-స్వప్న-సుషుప్త్యవస్థలతో పోల్చినప్పుడు జాగ్రదవస్థ శాశ్వతమనబడును. ఇక మరణముతో పోల్చినప్పుడు ఈ జాగ్రదవస్థ కూడా అశాశ్వతమేయగును. అదేవిధముగా క్షరపురుషునితో పోల్చినప్పుడు అక్షరపురుషుడు శాశ్వతుడు. ఇక పరమాత్మతో పోల్చినప్పుడు అక్షరపురుషుడు కూడా అశాశ్వతుడే! యగును. కావున సాధకుడు ఉత్తమపురుషుని పొందుటయే లక్ష్యముగా కలిగియుండవలయును. కావుననే పదునైదవ అధ్యాయమునకు "పురుషోత్తమ ప్రాప్తియోగము"ని పేరు. ఈ పురుషోత్తముని తెలిసికొన్నవాడు "సర్వవిత్" అగును. అనగా:- ఆతడన్నింటిని తెలిసికొన గలుగును. ఆతనికి తెలిసికొనవలసిన విషయము మరొకటి శేషించియుండదని భావము. ఈ పురుషోత్తముని తెలుసుకొన్నవాడు కృతకృత్యుడగును. అనగా:-ఆతడన్నింటిని చేసినవాడగును. ఆతనికి చేయవలసిన మరియొక కర్తవ్యము మిగిలి యుండదని భావము. ఈ కారణముచే ఆతడు పూర్ణకాముడై, పూర్ణ సంతృప్తుడై యుండును.

ఐతే ఈ పురుషోత్తముని తెలిసికొనుటెట్లు? పురుషోత్తముని తెలిసికొనుటకై ఆధ్యాత్మిక సాధకుడు ద్వంద్వరహితుడై యుండవలయును. అనగా:-రెండవ వస్తువుపై మనస్సును పోనీయరాదు. ఇప్పుడు నిజమునకు రెండవ వస్తువు ఉన్నదా? అను ప్రశ్న ఏతెంచును. రెండవ వస్తువునకు ఉనికి లేదు. కారణమేమి? భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు. ఇక భగవంతుడు సర్వవ్యాపకుడైనచో, రెండవ వస్తువునకు

అస్తిత్వమెట్లుండును? ఒకవేళ రెండవ వస్తువుకు అస్తిత్వమున్నచో, భగవంతుడు సర్వవ్యాపకుడు కాదని చెప్పవలసియుండును. ఐతే వ్యావహారిక జగత్తు నందు రెండవ వస్తువును అంగీకరింపక తప్పదు. కారణమేమి? నానాత్వమే! ఈ జగత్తు. అందువల్లనే ఇది ద్వంద్వ జగత్తని చెప్పబడుచున్నది. ప్రస్తుతము మనము నిజమైన ఆధ్యాత్మిక సాధకుని విషయమై చర్చించుచున్నాము. నిజమైన ఆధ్యాత్మిక సాధకుడు సర్వకాల సర్వావస్థలలో "సర్వం బ్రహ్మమయం జగత్త"ను భావము నందనురక్తుడైయుండును.

నిజమైన ఆధ్యాత్మిక సాధకుడు జాతి, నీతి, కుల, గోత్ర దూరగుడైయుండును. జన్మనుబట్టి జాతి ఏర్పడును. జన్మ శరీరమునకు సంబంధించినది. "శీర్యతే ఇతి శరీరః" శరీరమునకు నశించు స్వభావము కలదు. కావున జనన మరణ రహితుడైన పురుషోత్తమునియందు నిష్ఠ కలవానికి జాతి ఎక్కడిది? నీతి నియమములు ఈ ప్రపంచమునకు సంబంధించినవి. ఈ ప్రపంచము నందున్నంత వరకు ప్రతి మనుజుడున్నూ నీతిని పాటించుట అత్యవసరము. ఇతరుల కష్టములు తన కష్టములే!యని భావించుట నీతికి లక్షణము. ఇక ఇతరులే లేనప్పుడు నీతితో అవసరమే ముండును? కులము ఒక మనుజుని మరొక మనుజునితో ఎడబాటును కలిగించును. పురుషోత్తమప్రాప్తియే! లక్ష్యముగా కలిగియున్న సాధకుడు కులము అనెడి కుడ్యమును కూలద్రోయును. ఒక వ్యక్తి అభినస గోత్రము నందు జన్మించినాడనుకొనుడు. ఆ గోత్రము ఆత్మసాక్షాత్కారమునొందిన ఆ ఋషికి సంబంధించినది. అందువల్ల ఆత్మసాక్షాత్కారము నొందుటయే! మన జీవితలక్ష్యమగును. కాని గోత్రము యొక్క గొప్పలను చెప్పుకొనుట కాదు.

ఇక మతమును గూర్చి కొంత చర్చింతము. ఏ మతమైనను ఆ పరమాత్మను చేరుటకొక మార్గమే! అట్టి ఎడల మతకలహము లేలయుండవలయును? మతకలహమొనర్చువానికి మతమనగా ఏమియో తెలియదని అర్థము. ఒక మతము కాలిబాటవంటిది కావచ్చును. మరొక మతము సైకిల్‌పై ప్రయాణముచేయుట వంటిది కావచ్చును. ఇంకొక మతము స్కూటర్‌పై పయనించునట్టిది కావచ్చును. వేరొక మతము బస్సులో ప్రయాణమొనర్చుట వంటిది కావచ్చును. ఇంకొక మతము కారులో ప్రయాణించుట వంటిది కావచ్చును. వేరొక మతము రైలుబండిలో పయనించుట వంటిది కావచ్చును. మరొక మతము విమానములో ప్రయాణమొనర్చుట వంటిది కావచ్చును. ఐతే ఈ మతములన్నియును ఒకే లక్ష్యమును చేర్చునను విషయమును మరువరాదు. మతములన్నియును ఒకే పాఠశాలలోని భిన్నమైన తరగతులవంటివి. పరమాత్మ మతములన్నింటికి అతీతమైనది. మతములన్నియును ఈ ప్రపంచమునకు సంబంధించినవి. ఇక ప్రపంచమంతటా పరమాత్ముడు నిండియున్నాడు. కావున మతము లన్నింటియందును పరమాత్మయొక్క అస్తిత్వమున్నదని భావము. నాస్తికుని యందున్నూ ఆ పరమాత్మ యొక్క

అస్తిత్వమున్నది. దేవుడు లేదని చెప్పువాడు నాస్తికుడనబడును.

దేవుడు లేదని చెప్పుచున్నవాడెవ్వడు? ఆతడే! పరమాత్మ. దేవుడు లేదని చెప్పుట "నా నోటిలో నాలుక లేద"ని చెప్పుట వంటిది. నాలుకయే లేనిచో ఎవ్వడైనా నోటితో మాట్లాడగలుగునా? పరమాత్ముని మాయ కడుంగడు విచిత్రమైనది. ఆతడీ ప్రపంచమంతటను నిండియుండియు ఈ చర్మచక్షువుల కగోచరుడై యున్నాడు. నిజమునకు ఉత్తమపురుషుని చేరుటకు మనము ప్రయాణము చేయవలసిన అవసరమే లేదు. ఆతడిప్పుడిచ్చటనే పొందబడును. కాని అందునిమిత్తమై వ్యక్తిత్వము అవ్యక్తము కావలసి యుండును. పూర్వసంస్కారములన్నియును దహింపబడవలసియుండును. నూతన సంస్కారములకవకాశము లేకుండా యుండవలసి యుండును. కేవలము అట్టి సందర్భమునందు మాత్రమే! జీవుడు దేవుడగుట కవకాశము కలదు. జీవాత్మ పరమాత్మ స్వరూపము నొందుట కవకాశము కలదు. అప్పుడు మాత్రమే! సాధకుడు "అహం బ్రహ్మాస్మి"యని ఘోషించుట కర్హుడగును. అప్పుడు మాత్రమే! గురుదేవుడు "తత్త్వమసి"యని శిష్యుని కుపదేశింపగలుగును. అప్పుడు మాత్రమే! శిష్యుడు "అయమాత్మా బ్రహ్మ"యనియు, "ప్రజ్ఞానం బ్రహ్మ"యనియు తెలిసికొని, చతుర్వేద సారముననుభూతమొనర్చుకొని, బ్రహ్మానంద సాగరమునందోలలాడ గలుగును. అప్పుడు మాత్రమే! గురుశిష్యసంబంధము చరితార్థమగును. అప్పుడు మాత్రమే ఆత్మసాక్షాత్కారము, దైవసాక్షాత్కారము, లేక బ్రహ్మ సాక్షాత్కారము పొందబడును.

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', సెప్టెంబరు/అక్టోబరు, 2009 సంచిక నుండి)

# 6. ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః

పై శీర్షిక శ్రీమద్భగవద్గీతలోని పదునాల్గవ అధ్యాయములోని పదునెనిమిదవ శ్లోకములోని ప్రథమపాదము. సత్త్వగుణ సంపన్నులు ఊర్ధ్వలోకములకు వెళ్ళుదురని దీని భావము. వారు స్వర్గలోకములోని దేవతల స్వరూపమునొందుదురు. ఇక రాజసిక గుణముకలవారు ఈ భూలోకమునందే తిరిగి జన్మింతురు. తామసిక గుణము కలవారు పశుపక్ష్యాది క్రిమికీటకాది నిమ్నయోనులలో జన్మింతురు. లేక మానవజన్మ ఎత్తినను, క్రూరమైన స్వభావమును కలిగియుందురు. ఈ కారణముచే ఈ ప్రపంచమంతయును ఈ త్రిగుణములతో కూడిన ఒక నాటకరంగమని తెలియుచున్నది. సత్త్వగుణ సంపన్నుడు శాంతస్వభావమును కలిగియుండును. ఆతడు రాజసిక, తామసిక స్వభావమును కలిగియుండడు. ఆతడు రాజసిక, తామసిక స్వభావముగల మనుష్యులతో తటస్థుడైయుండును. సత్త్వగుణసంపన్నుడు జ్ఞానభాస్కరునివలె ప్రకాశించుచుండును. సత్త్వగుణసంపన్నునికి అజ్ఞానావరణ తొలగిపోవును. సత్త్వగుణసంపన్నుడు ఆనందసాగరమును పోలియుండును. సత్త్వగుణ సంపన్నుడు "బ్రహ్మసత్యం జగన్మిథ్య"యను వాక్యమును తన జీవితము నందనుభవమునకు తెచ్చుకొనును.

నేటికాలములోని రాజకీయనాయకులు రాజసికగుణము కలవారని చెప్పవచ్చును. వారికి తమ జీవితలక్ష్యమేమిటో తెలియదు. అట్టివారీ ప్రపంచమే సర్వస్వముగా భావించుచుందురు. ఈ ప్రపంచమును విడిచివెళ్ళిన తరువాత వారి గతి ఏమగునో వారికి తెలియదు. ఈ ప్రపంచమునందే విధముగా ప్రవర్తించినచో వారికి ఊర్ధ్వగతి కలుగునో వారికి తెలియదు. అట్టివారికి నీతిశాస్త్రము నేతిబీరకాయ వంటిదైయుండును. వారికి ధర్మమార్గము దయ్యపుమార్గమువలె గోచరించును. వారికి ధర్మము అధర్మమువలెను, అసత్యము సత్యము వలెను తోచుచుండును. అట్టివారు తమకొక మార్గదర్శి అవసరమని అనుకొనరు. వారికి సత్యము తెలియకున్నను తెలిసినవారివలె నటించుచుందురు. ఒక అంధుడు మరొక అంధునికి మార్గమును చూపుటవంటి ప్రవర్తనను వారు కలిగియుందురు.

ఇక తామసిక గుణము కలవారు అజ్ఞానావరణచే పరివేష్టింపబడి యుందురు. అట్టివారికి తినుట, త్రాగుట, నిద్రించుట, ఇంద్రియభోగముల ననుభవించుట కంటే మరియొక విషయము తెలియదు. అట్టివారు పశుప్రాయులని చెప్పవచ్చును. కేవలము కర్మానుభవము కొరకే ఇట్టివారీ ప్రపంచమునందు జన్మించుచుందురు. కర్మానుభవము పూర్తియైన తర్వాత వారికి ఆధ్యాత్మిక జిజ్ఞాస ఉత్పన్నమగుటకవకాశము కలదు. తమస్సు అంటే అంధకారము, లేక అజ్ఞానమని అర్థము. తానెవరో తెలిసికొనకపోవుటయే! అజ్ఞానము. తానీ ప్రపంచమునకేతెంచిన కారణమేమియో తెలిసికొనక పోవుటయే! అజ్ఞానము. తానీ ప్రపంచమును విడిచివెళ్ళిన తర్వాత తనగతి ఏమగునో తెలిసికొనక

పోవుటయే! అజ్ఞానము. "నేను – నాది" అనుకొనుటయే! అజ్ఞానము. "నేను లేను – నాది కాదు" అనుకొనుటయే! జ్ఞానము. "నేను" అనుకొనుటకు ఈ శరీరమే! కారణము. శరీరమునకు సంబంధించిన వారందఱును "నాది"అనుకొనుటకు కారణము దేహమే!. దేహము నేనుకాను. దేహియే! నేను అనుకొనుటయే! జ్ఞానము.

త్రిగుణాతీతుడు జ్ఞానియని చెప్పబడును. ఈ త్రిగుణములీ ప్రపంచమునకు సంబంధించినవి. పరమాత్మ ఈ ప్రపంచమంతట నిండియున్నను, ఈ ప్రపంచము నకతీతుడు కూడానైయున్నాడు. ఈ కారణముచే పరమాత్మ ప్రాప్తికై మనము ఈ త్రిగుణముల నతిక్రమింపవలసి యుండును. కావున శ్రీమద్భగవద్గీత 14వ అధ్యాయములోని 20వ శ్లోకమునందు శ్రీకృష్ణుడిట్లు పలికెను:–

**"గుణానేతానతీత్యత్రీన్ దేహీదేహ సముద్భవాన్ ।**
**జన్మమృత్యు జరాదుఃఖైర్విముక్తోఽమృతమశ్నుతే ॥**

దేహమునకు సంబంధించినట్టి ఈ మూడు గుణముల నతిక్రమించిన సాధకుడు జనన మరణములు, వృద్ధాప్యము, దుఃఖములనుండి విడివడినవాడై అమృతత్వము నొందునని పై శ్లోకమునకర్థము. సాధకుడీ ప్రపంచమనెడి పెద్ద భవనమునందున్న మూడు అంతస్తులను దాటవలసి యుండును. ఇవియే! త్రిగుణములు. శ్రీకృష్ణభగవానుడు త్రిగుణాతీతుని లక్షణములనీదిగువ శ్లోకమునందు చక్కగా నుడివెను:–

**"మానాపమానయోస్తుల్యస్తుల్యోమిత్రారిపక్షయోః ।**
**సర్వారంభ పరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥"**

గుణాతీతుడు మానమునందును, అవమానమునందును సమానుడై యుండును. మఱియు శత్రుమిత్రులయందు సమానుడై యుండును. అనగా:– ఆతనికి శత్రువుగాని, మిత్రుడుగాని యుండడు. గుణాతీతు డేకర్మ యొనర్చినను దానిని "నేను చేయుచున్నాన"నెడి భావన అతనికుండదు.

శ్రీమద్భగవద్గీతలోని ద్వితీయాధ్యాయమునందలి 45వ శ్లోకమీ దిగువ ఉదహరింపబడుచున్నది:–

**"త్రైగుణ్య విషయా వేదా నిస్త్రై గుణ్యోభవార్జున ।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥"**

ఆత్మతత్త్వానుభూతినొందు విధానమీశ్లోకమునందు వర్ణింపబడినది. వేదములన్నియును త్రిగుణములకు సంబంధించి యున్నవి. అనగా:– ప్రాపంచిక కార్యకలాపములన్నింటిని వేదములు వర్ణించును. వేదములు వేదవేద్యుడైన భగవంతుని పొందునంతవరకు మాత్రమే! మనకు సహకరించును. భగవత్ప్రాప్తియైన పురుషునికి వేదములతో అవసరముండదు. అది ఎట్లననగా:– మూడు అంతస్తులభవనము నిర్మించుటకై

నిచ్చెన అవసరమగును. భవననిర్మాణము పూర్తియైన తరువాత నిచ్చెనతో అవసరముండదు కదా! పై అంతస్తునెక్కుటకు భవనము లోపలనే సోపానములుండును. అనగా:–త్రిగుణాతీతుడు మూడు లోకములలోను స్వేచ్ఛగా విహరింపగలుగును. ఈ కారణముచే "నిస్త్రైగుణ్యో భవార్జున" యని శ్రీకృష్ణభగవానుడు అర్జునుని కాదేశము నొసంగెను. నిస్త్రైగుణ్యుడైన పురుషుడు నిర్ద్వంద్వుడగును. అనగా:– ఆతనికి పరమాత్మ తప్ప పరవస్తువు కానరాదు. అట్టి సమయమునందాతడు నిత్యసత్త్వస్థుడై యుండును. అనగా:–భగవత్సత్తాయందే నిలకడను కలిగియుండును. ఆ పరిస్థితియందాతనికి ఏ పదార్థమునైనను ఆర్జించుటగాని, దానిని రక్షించుటగాని చేయవలసిన పనియుండదు. ఏలననగా:– అట్టివాడాత్మస్థుడైయుండును. "ఆత్మవత్సర్వాభూతాని" అట్టివాడన్ని వస్తువులయందును, సమస్త ప్రాణులయందును తన ఆత్మనే దర్శించుచుండును. ఆతడెల్లెడల ఆత్మ సందర్శనమునొనర్చుచుండును. ఇట్టివాడు పరమోన్నత స్థానమునలంకరించును. దేనిని మించినది మరొకటి లేదో, అట్టిదానినాతడు పొందును. "యద్గత్వాన నివర్తంతే తద్ధామ పరమం మమ" యని శ్రీకృష్ణుడు పలికెను. దేనిని చేరినచో, మరల తిరిగి వచ్చుట యుండదో, అదే నా ధామమని శ్రీకృష్ణుడు నుడివెను. ఆత్మసాక్షాత్కారము నొందినవాడిట్టి ఊర్ధ్వగతిని పొందును. నిత్యసత్త్వస్థుడై యున్నవాడే! ఇట్టి స్థితి నొందగలుగును. అట్టి పరమోన్నత స్థితినొందినవాడు స్థితప్రజ్ఞుడనబడును. ఆతడు పరమోన్నతమైన ప్రజ్ఞయందు, లేక సర్వవ్యాపకమైన చైతన్యమునందు స్థితిని కలిగియుండునని భావము. అనగా:– సచ్చిదానంద సాగరము నందాతడు మునకలిడుచుండునని అర్థము. ఇదియే! మానవజీవితమునకు పరమలక్ష్యమై యున్నది.

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', నవంబరు/డిశంబరు, 2009 సంచిక నుండి)

# 7. ఋజుమార్గవర్తనము

'ఋజుమార్గవర్తన'మనగా:- సూటియైన మార్గమునందు నడచుటయని అర్థము. సూటియైన మార్గమనగానేమి? మానవ జీవిత లక్ష్యమేమియో తెలిసికొని, కేవలము దానిని పొందుట కొరకే జీవించుట ఋజుమార్గ వర్తనమనబడును. ఇక మానవ జీవితలక్ష్యమేమి? యను విషయమును తెలిసికొనవలసియున్నది. మనమీ ప్రపంచమున కెచ్చటినుండి వచ్చితిమో, తిరిగి అచ్చటికి చేరుకొనుటయే! మానవ జీవిత లక్ష్యము. మన మీ ప్రపంచమున కెచ్చటినుండి వచ్చితిమి? ఈ ప్రపంచమున కాధారమై యున్నదేదో, దానినుండి మనమీ ప్రపంచమునకేతెంచితిమి. ఈ ప్రపంచమున కాధారమై యున్నదేది? దేనికి మరొక ఆధారములేదో, అదే ఈ ప్రపంచమునకాధారమైయున్నది. దేనికి మరొక ఆధారము లేదో, అది ఏది? అదియే! పరమాత్మ, అదియే! పరబ్రహ్మము, అదియే! పరంజ్యోతి అదియే! పరమ ప్రకాశము అదియే! పరమానందము. పరమానంద మనగా:- శాశ్వతమైన, శ్రేష్ఠమైన, ఉన్నతమైన, దివ్యమైన ఆనందము. ఈ ప్రపంచములో 99వంతుల దుఃఖము, ఒకవంతు సుఖము కలదు. అజ్ఞాన కారణముచే మన మీ విషయమును గ్రహింపజాలకున్నాము. ఈ ప్రపంచ మంతయు ఒక చిజ్జడ గ్రంథియై యున్నది. అనగా:- చైతన్యవంతమైన పదార్థము జడమైన పదార్థమునందు ముడివడియుండుట. ఈ ముడి విడిపోవుటెట్లు? దానిని విచారించి, తదనుసార జీవితమును గడుపుటయే! ఋజుమార్గ వర్తనము. ఎంత విచారించినను, ఎవరికి వారు తనను గూర్చి తాను సంపూర్ణముగా తెలిసికొనజాలరు. అదెట్లనగా:- ఒక సింహపుపిల్ల పొరపాటుచే ఒక మేకల గుంపులో కలిసిపోయెను. అది తన తల్లిని విడిచియుండుటవల్ల తన సింహపులక్షణములను పోగొట్టుకొనెను. కొన్ని సంవత్సరములు గడచిన తరువాత అది మేక వలెనే అరవసాగెను. మేకవలెనే గడ్డిని తినసాగెను. మరికొన్ని సంవత్సరముల తరువాత తల్లికి సింహపుపిల్ల మేకల గుంపులో కలిసిపోయిన విషయము తెలిసిపోయెను. అప్పుడు సింహము గర్జించి, తన పిల్లను మేకల గుంపునుండి వేఱుపరచెను. దానిని నది ఒడ్డుకు తీసుకొనివెళ్ళి నీటిలో చూడుమని చెప్పి, తన రూపము - సింహపు పిల్ల రూపము ఒక్కటే! యని చెప్పెను. అప్పుడా సింహపు పిల్లకు తన పూర్వవాసన ఉబికి వచ్చెను. కావున సింహపు పిల్లవలె గర్జింపసాగెను. అప్పుడా సింహపుపిల్లను చూచి మేకలన్నియును వణకసాగెను.

ఈ ప్రకారముగా తన స్వస్వరూపమును తెలిసికొనుటకై ప్రయత్నించుటయే! ఋజుమార్గ వర్తనమని చెప్పబడును. జీవుడు తన తల్లి గర్భమునందున్నప్పుడే! ఋజుమార్గ వర్తనమునలవరచుకొనుట శ్రేష్ఠము. ఇందు నిమిత్తమై తల్లిదండ్రులు ఋజుమార్గవర్తనము కలవారైయుండ వలయును. గర్భిణిస్త్రీ సాత్త్వికాహారమునే భుజింపవలయును. అప్పుడు తనకు పుట్టిన బిడ్డ సాత్త్వికతతో కూడియుండును. తదనంతరము ఆ బిడ్డ సాత్త్వికాహారమునే

భుజింపగోరును. ఇట్టి సాత్త్వికాహారమును జీవితాంతమువరకు స్వీకరించుచుండవలయును. అప్పుడు రజోగుణ తమోగుణములు మన దరికి చేరజాలవు. అయితే పిల్లలు పెరుగుచున్నకొలదీ తోటి స్నేహితులుకూడా పెరుగుచుందురు. కావున మనమెల్లప్పుడు సాత్త్విక ప్రవృత్తిగల స్నేహితులనే! కలిగియుండవలయును. ఇదియే! ఋజువర్తనము నకు మార్గము. ఈ కారణముచేతనే జగద్గురు శ్రీశంకరభగవత్పాదులవారీ దిగువ శ్లోకమును రచించిరి:

**"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం ।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥"**

ఋజుమార్గగాములమగుటకై మనమందరమీ శ్లోకములోని భావమును హృదయంగమ మొనర్చుకొనవలసి యుండును. సత్పురుషుల సాంగత్యముచే నిస్సంగత్వము కలుగును. "నేను–నాది" యనెడి భ్రమ తొలగుటయే! నిస్సంగత్వము. "నేను–నాది" యను భ్రమ తొలగినప్పుడు మోహము తొలగిపోవును. ఉన్నదానిని లేదనుకొనుట – లేని దానిని ఉన్నదను కొనుటయే! మోహము. అది ఎట్లనగా:– ఈ శరీరమునకాధారమై యున్నదే! ఆత్మ. మనము అట్టి ఆత్మ లేదనుకొనుచు, ఈ దేహమే! ఉన్నదనుకొనుచున్నాము. ఒకప్పుడీ శరీరము నశించును. దేహము దహింపబడును. మన మీ విషయమును మఱచిపోయి మోహమునందు మునిగిపోవుచున్నాము. సత్సాంగత్యము ఇట్టి మోహము తొలగిపోవునట్లొనర్చును. మోహము తొలగిపోయినప్పుడు మనస్సు నిశ్చలమగును. అట్టి సమయమునందు నిశ్చలమైన, నిర్వికల్పమైన, నిరంజనమైన, నిర్వికారమైన ఆత్మతత్త్వము తెలియబడును. ఆత్మతత్త్వము తెలియబడినప్పుడు జీవన్ముక్తి కరతలామలకమగును. జీవన్ముక్త పురుషుడు అజ్ఞాన నిద్రయందున్నవారినందఱిని మేల్కొల్పగలుగును. జీవన్ముక్త పురుషుడు మాయ నతిక్రమించినవాడైయుండును. త్రిగుణాత్మికమైనదే! మాయ. అహంకారమే! మాయ. ఈ మాయనతిక్రమించుటకై "నేను – నాది" యనుకొనుటను మానుకొని "అహం బ్రహ్మాస్మి" యనెడి మహావాక్యము నర్థమొనర్చు కొనవలయును. కేవలము బ్రహ్మోపదేశము చేతనే! బ్రహ్మానుష్ఠానము సిద్ధించును. "బ్రహ్మోపదేశమ"నగానే! భయపడవలసిన అవసరములేదు. కారణమేమి? భయమును పోగొట్టునదే! బ్రహ్మము. భయమును కలిగించునదే! భ్రమ. అది ఎట్లనగా:– చీకటిలోనున్న త్రాడును చూచి పామనుకొనుట వలన భయము కలుగును. ఆ సమయమునందొక మిత్రుడు లాంతరును తీసుకొనివచ్చి "ఇది పాము కాదు, ఇది త్రాడు" అను విషయమును స్పష్టము చేయును. అప్పుడు మన భయము తొలగిపోవును. అదే విధముగా నిజమునకు మనమీ దేహము కాదు. దేహమే! నిజమని తలచినప్పుడు మరణ భయము మనల నావరించును. మదాలస తన బిడ్డలను ఊయలం దూపునప్పుడు "శుద్ధోఽసి బుద్ధోఽసి నిరంజనోఽసి, సంసారమాయా పరివర్జితోఽసి" అనెడి జోలపాటను పాడెను. మన భారతమాత

"మదాలస" వంటి తల్లులను కనవలసియున్నది. అప్పుడా తల్లులకు సాత్త్విక సంపన్నులైన సంతానము కలుగును. అనగా:– ఋజుమార్గవర్తనులగు సంతానము కలుగును. అట్టివారు నిర్భయులై జీవించుచు, ప్రపంచమునందు భయకంపితులైయున్నవారి భయమును కూడ తొలగింపజాలుదురు. వారు మానవ సంఘమునంతటిని సంస్కరింపజాలుదురు. పాఠశాలలలోను, కళాశాలలలోను ఉపాధ్యాయులు , ప్రొఫెసర్లు సంస్కారవంతులై యున్నప్పుడు విద్యార్థులు కూడ సంస్కారవంతులుగా పరిణమింతురు. అప్పుడు భారతీయ సంస్కృతి విదేశీయ సంస్కృతికి దాసోహమనెడి దీనస్థితి కలుగదు. శ్రీవిశ్వామిత్రుడు శ్రీవసిష్ఠుని నూరుగురు కుమారులను హతమార్చినను, శ్రీవసిష్ఠుడు నిశ్చలచిత్తుడైయుండెను. అప్పుడు శ్రీవిశ్వామిత్రుడు "ధిక్‌క్షత్రియబలం, బ్రహ్మతేజోబలం బలమ్" అని పలికెను. బ్రహ్మతేజమునకు మించిన బలము మరొకటి లేదు. కావుననే విదేశీయులెందఱోవచ్చి భారతమాతను వశీభూతమొనర్చుకొనదలంచినను, బ్రహ్మతేజోకిరణములకు తాళజాలక వెనుదిరిగి పోవలసివచ్చుచున్నది. ఉజ్జ్వల భవిష్యత్తుకై భారతదేశములోని ప్రతిబాలుడు, ప్రతి బాలిక, ప్రతియువకుడు, ప్రతియువతి, ప్రతివృద్ధుడు, ప్రతి వృద్ధురాలున్నూ ఆత్మబలమును, లేక బ్రహ్మతేజోబలమును సంపాదించుటకై యత్నింపవలసియున్నది. ఆత్మబలసంపన్నుడు మనోబలము కలవాడై దృఢచిత్తుడై యుండును. ఆతడు శారీరిక దార్ఢ్యము కలవాడైయుండును. అప్పుడు భారతమాత బిడ్డలు శారీరకముగాను, సాంఘికముగాను, ఆర్థికముగాను సుసంపన్నులై శోభింతురు. ఆత్మబలము, లేక బ్రహ్మతేజోబలము చేతనే ఇది సాధ్యమగును. ఇదియే! ఋజుమార్గ వర్తనమనబడును.

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', జనవరి/ఫిబ్రవరి, 2010 నుండి)

# 8. ఏషా బ్రాహ్మీ స్థితిః

"ఇదియే! బ్రహ్మీస్థితి" యని పై శీర్షికకు అర్థము. ఈ శ్లోకాంశము శ్రీమద్భగవద్గీతలోని ద్వితీయాధ్యాయము నందుగల చివరి శ్లోకము నందున్నది. ఈ బ్రాహ్మీస్థితినొందిన అనంతరము మనుజుడు మోహగ్రస్తుడు కాడని శ్రీకృష్ణుడర్జునునితో పలికెను. ఈ స్థితిని మానవుడు తన జీవితములోని చరమావస్థయందు బడసినను, బ్రహ్మనిర్వాణము నొందును. ఐతే ఈ బ్రాహ్మీస్థితి నొందుటెట్లు? అను విషయమును మనమిప్పుడు చర్చింపవలసి యుండును. బ్రాహ్మీస్థితిచే మనుజుడు పరమశాంతిననుభవించును. పరమశాంతి నొందుటకై మనము ప్రాపంచిక విషయభోగములపైగల ఆసక్తిని త్యజింపవలసి యుండును. కోరికలనేమాత్రము కలిగియుండరాదు. కోరికలను త్యజించుటకై మనుజుడు "నేను - నాది" అనువాటిని దరిజేర నీయరాదు. "నేను" అన్న మనుజుడు పరబ్రహ్మమునకు భిన్నుడగును. "నాది" అన్న మానవుడు "సర్వం బ్రహ్మమయం" అన్న దృష్టిని కోల్పోవును. "నేను - నాది" అనుకొనువాడెవ్వడైనను సంకుచిత స్వభావుడై యుండును. "నీవు-నీది" అన్నవాడే! విశాలదృక్పథము కలవాడు.

నదులన్నింటియొక్క అలజడి సముద్రమును చేరునంతవరకే యుండును. ఏ నదియైనను సముద్రమునందు ప్రవేశించిన తత్క్షణమే! ప్రశాంతతను, గాంభీర్యమును, నిర్భయత్వమును ఆపాదించుకొనును. అదే విధముగా ఏ కోరిక కలవాడైనను దీనత్వమును, హీనత్వమును, సంకుచితత్వము ననుభవింపవలసియుండును. ఇక కోరికలన్నింటిని ఏకత్రితమొనర్చి బ్రాహ్మీస్థితి సముపార్జనమనెడి ఏకైక వాంఛను కలిగియున్న నరుడు ప్రశాంతచిత్తుడు, గాంభీర్యవదనుడు, విశాల హృదయుడై చెన్నొందును. ప్రాపంచిక వాంఛలన్నియును కాలువలు, సెలయేర్లు, చిన్న చిన్న ఉపనదుల వంటివి. కాని పరమేశ్వర ప్రాప్తిని వాంఛించు నరుడు గంగోత్రి నుండి గంగాసాగరము వైపు ప్రహించునట్టి శ్రేష్ఠమైన గంగానది వంటివాడై శోభిల్లును. ఏ నదియైనను గ్రీష్మకాలములోని వేడికి సముద్రము లోని జలము ఆవిరియై, పైకెగసి, మేఘముగా మారి, వర్షాకాలమునందు పర్వతములపై పతనమునొంది, కొండచరియలలో ప్రవహించుచు, పృథ్వి యందడుగిడి, అసంఖ్యాకము లగు ఇడుములను సహించి, తుట్టతుదకు తన జన్మస్థానమైన సాగరమును చేరుకొనును. అదేవిధముగా మనమెచ్చటినుండి వచ్చి ఈ భూలోకమున కేతెంచితిమో, మరల అచ్చటికే చేరుకొని, పరమానందానుభూతి నొందుటయే! "బ్రాహ్మీస్థితి" యని చెప్పబడును. రాత్రి అజ్ఞానమును సూచించును. పగలు జ్ఞానమును సూచించును. బ్రహ్మచింతన చేయుచు మౌననిష్ఠయందున్న మునులు అజ్ఞానమనెడి రాత్రిని రహితమొనర్తురు. అప్పుడు వారు జ్ఞానభాస్కరులై ప్రకాశింతురు. అట్టివారికి ప్రాపంచికతయనెడి పగలు (అజ్ఞానము)

దృష్టిగోచరము కాదు. రాత్రియందు ప్రపంచమును మనమెట్లు చూడజాలమో, అట్లే మునులు పగటియందీ ప్రపంచమును చూడజాలరు. తపోధనులైన మునులు రాత్రిం బగళ్ళు "బ్రాహ్మీస్థితి" యందే జీవించుచుందురు. ఇంద్రియములను విషయభోగములవైపు చలింపజేయువారి వివేకము కుంటుపడును. వాయువుచే నావ జలములో చలింపజేయబడునట్లు, ప్రాపంచిక విషయ వాంఛయనెడి వాయువుచే మనుజుడు చలింపజేయబడినవాడై, "బ్రాహ్మీస్థితి"నందుకొనజాల కుండును. ఊర్ధ్వదృష్టికలవాడు మాత్రమే! బ్రాహ్మీస్థితినందుకొనజాలును. ప్రాపంచిక దృష్టికలవాడు అధఃపతితుడగును. వివేక సూర్యోదయమైన మనుజుడు "బ్రాహ్మీస్థితి" ననుభవింప గలుగును. మనస్సును మాధవునివైపు త్రిప్పిననరుడు "బ్రాహ్మీస్థితి" నొందజాలును. బ్రాహ్మీస్థితినొందినప్పుడు సర్వదుఃఖనివృత్తియగును. అట్టివాని బుద్ధి స్థిరత్వమునొందును. మానసిక నిగ్రహము లేనివాని బుద్ధి నశించును. అప్పుడాతనికి అశాంతియే శేషించును. ఇంద్రియములను విషయ వస్తువులనుండి మరల్చి, రాగద్వేషరహితుడైనవాడు పరమశాంతి సముపేతుడగును. విషయవస్తువులను చింతించుటచే వాటియందు సంగమేర్పడును. సంగమువల్ల కోరిక ఉత్పన్నమగును. కోరిక నెఱవేరకున్నచో క్రోధము కలుగును. క్రోధము వల్ల బుద్ధి భ్రష్టమగును. బుద్ధి భ్రష్టముచే మనుజుడు పతనమునొందును. ఇంద్రియములకు లోబడిన మనుజుని మనస్సు నిమ్నదశయందుండును. ఇంద్రియములను జయించిన మానవుని మనస్సు ఊర్ధ్వగామియగును. తాబేలు తన ఇంద్రియములనన్నింటిని తన కవచము దిగువున దాచియుంచునట్లు, మనుజుడు తన ఇంద్రియములను బుద్ధియనెడి కవచము నందు దాచియుంచవలయును. శుభాశుభ వస్తువులను పొందినను ఎవ్వడు రాగద్వేషములకు లోబడడో, అట్టివాని బుద్ధి సుస్థిరమై యుండును. రాగము, భయము, క్రోధములను వర్జించినవాని బుద్ధి స్థిర ప్రతిష్ఠత నొందును. అట్టివాడు "బ్రాహ్మీస్థితి"ని బడయజాలును.

"బ్రాహ్మీస్థితి" నొందదలంచువాడు బ్రహ్మము యొక్క శ్రేష్ఠత్వమును మొమ్మొదట గ్రహింపవలసియుండును. బ్రహ్మము సర్వవ్యాపకము. కావున అది శ్రేష్ఠము కాకమానదు. బ్రాహ్మీస్థితి నొందినవానికి మరొక దానిని పొందు ఆవశ్యకత యుండదు. బ్రహ్మము సర్వజ్ఞము. కావున బ్రాహ్మీస్థితినొందిన వానికి మరొక దానిని తెలిసికొనవలసిన అవసర ముండదు. బ్రహ్మము సర్వశక్తిమంతము. కావునబ్రాహ్మీస్థితి నొందినవానికి మరొక శక్తికి భయపడవలసిన పనియుండదు. ఈ కారణముచే బ్రాహ్మీస్థితి నొందుటకై మనము మన జీవితమంతయు వెచ్చింపవలసియుండును. ఒకవేళ ఈ జీవితమునందు బ్రాహ్మీస్థితిని బడయజాలకున్నచో, ఈ జీవితములోని ప్రయత్నఫలితముగా మరుజన్మ శ్రేష్ఠమై విరాజిల్లును. అట్టివానికి యోగుల గృహమునందు జన్మలభించును. భోగుల గృహమునందు జన్మించినవాడు జనన-మరణ చక్రమునందు పరిభ్రమింపవలసియుండును. ఇక యోగుల గృహమునందు జన్మించినవాడు జీవాత్మ భావమును వీడినవాడై, పరమాత్మ

భావభూమికయందు ప్రవేశించును. "బ్రాహ్మీస్థితి" నొందుటయే! ప్రతి స్త్రీ పురుషునికి పరమ కర్తవ్యమైయున్నది. బ్రాహ్మీస్థితియే! భగవద్గీతాసారము. బ్రాహ్మీస్థితియే! సర్వోపనిషత్తులకు సారము. బ్రాహ్మీస్థితి నొందుటయే! "బ్రహ్మసూత్రము" లన్నింటికి సారము. బ్రాహ్మీస్థితిని బడయుటయే! సకల వేదములయొక్క సారము. బ్రాహ్మీస్థితి నొందుటకే అష్టాదశ పురాణములు శ్రీవేదవ్యాసుల వారిచే రచింపబడినవి. కావున బ్రాహ్మీస్థితి సర్వోత్క ృష్టమైయున్నది. బ్రాహ్మీస్థితినొందిన వాని కోరికలన్నియు అంతమొందును. బ్రాహ్మీస్థితి నొందిన వాడు పూర్ణసంతృప్తుడై యుండును. బ్రాహ్మీస్థితి నొందినవాడు పూర్ణానందమునొందును. బ్రాహ్మీస్థితి నొందినవాడు బ్రహ్మానందమునను భవించును. ఇట్టి సర్వోత్కృష్టమైన బ్రాహ్మీస్థితిని బడయుటకై మనమందఱమున్నూ త్రికరణ శుద్ధితో ప్రయత్నించి మన జీవితములను తరింపజేసికొందుము గాక!

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', మార్చి/ఏప్రియల్, 2010 సంచిక నుండి)

# 9. "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ"

పై శీర్షిక శ్రీమద్భగవద్గీతలోని ఎనిమిదవ అధ్యాయమునందలి పదమూడవ శ్లోకము యొక్క ప్రథమపాదము. "ఓం" అనునది ఏకాక్షరము. అదే బ్రహ్మము. ఏకమునుండి అనేకమేర్పడినది. అతిచిన్నని మఱ్ఱి బీజమునుండి అత్యంత విశాలమైన మఱ్ఱివృక్షమెట్లు ఉత్పన్నమైనదో, అట్లే అతిసూక్ష్మమైన ఓంకారమునందీ విశాలమైన జగత్తు సృష్టింపబడినది. అతిసూక్షమైన మఱ్ఱిబీజమునందు మిక్కిలి విశాలమైన మఱ్ఱివృక్షము నిహితమై యున్నది. అదేవిధముగా అతి సూక్ష్మమైన ఓంకారము నందీ విశాలమైన విశ్వము అంతర్నిహితమై యున్నది. మఱ్ఱిబీజము నశించి మఱ్ఱివృక్షముగా మారెను. కాని మరల ఆ మఱ్ఱివృక్షము నుండి మఱ్ఱిబీజములుత్పన్నమగును. ఇక ఓంకార విషయమిట్టిది కాదు. ఓంకారము నుండి ఈ విశాలవిశ్వము ఉత్పన్నమైనను, ఓంకారమునకు నాశములేదు. ఓంకారమునకు మార్పులేదు. అందువల్లనే అది బ్రహ్మమని చెప్పబడినది. బ్రహ్మము ఆది మధ్యాంత రహితము. ఆది ఉన్నచో, అంతము కూడా ఉండును. అదే విధముగా ఓంకారమున్నూ ఆదిమధ్యాంతరహితము. ఏల? ఓంకారము బ్రహ్మమున కభిన్నమైయున్నది. బ్రహ్మము "ఓం, తత్, సత్" అనెడి మూడు నామములను కలిగియున్నది. ఓంకారము అక్షర బ్రహ్మమని చెప్పబడును. "తత్" అవర్ణనీయమైనది, లేక అనిర్వచనీయమైనదని అర్థము. "సత్" అనగా:−సత్యమైన పదార్థమని భావము. సకల చరాచర జీవులకు, పదార్థములకు స్థావరమై యున్నట్టిదే! పరబ్రహ్మము. వేదములీ పరబ్రహ్మమునకొక నామము నొసంగుటకు సాహసించెను. నవజాత శిశివున కేలాటి నామముండదు. కాని పేరు పెట్టిన తరువాతనే బాలుడుగాని, బాలికగాని మన పిలుపునకు సమాధాన మొసంగును. ప్రాపంచిక సమస్యలచే కష్టములననుభవించుచున్న మనుజులు తమ ఇష్టదేవతను శరణుపొంది, ఆ ఇష్టదేవత యొక్క నామము నుచ్చరించుచుందురు. అప్పుడా అదృశ్యరూపమునందున్న బ్రహ్మము ఇష్టదేవత రూపమును ధరించి, ఆ భక్తుని ఎదుట ప్రత్యక్షమై, ఆ భక్తుని కష్టములను నివారించును. ఒకవేళ చర్మచక్షువులకా ఇష్టదేవత కానరాకున్నను, మనోనేత్రమునకు తప్పక గోచరించును.

బ్రహ్మసాక్షాత్కారము నొందదలంచు ముముక్షువులు ఓంకారము నెల్లప్పుడు ఉచ్చరించుచుండవలయును. ఓంకారమునుచ్చరించుట యనగా:− బ్రహ్మమును స్మరించుట. స్మరించుటయనగా:− జగత్తును విస్మరించుట. దేహభావనను వీడుటయనగా:− దేహము 'నేను' కాదనుకొనుట. దేహము 'నేను' కాదనుకొనుట యనగా:−దేహమునందున్న ఆత్మయే! నిజమనుకొనుట. ఆత్మయే నిజమనుకొనుట ఆత్మభావన యనబడును. నీ ఆత్మ, నా ఆత్మ, అతని ఆత్మ. ఆమె ఆత్మ. దీనియందున్న ఆత్మ. దానియందున్న ఆత్మ. సర్వమునందున్న ఆత్మయే! పరబ్రహ్మము. ఈ విషయమును మనన మొనర్చుటయే!

పరమాత్మ భావన. ఇదియే! బ్రహ్మభావనయని చెప్పబడును. "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనగా:- బ్రహ్మమును తెలుసుకొన్నవాడు బ్రహ్మమే! యగును. బ్రహ్మమును తెలుసుకొనుట ఒక కుండను తెలుసుకొనుట వంటిది కాదు. కుండను తెలుసుకున్నవాడు కుండయగునా? కాదు. కారణమేమి? కుండ సర్వవ్యాపకమైనది కాదు. బ్రహ్మము సర్వవ్యాపకము. బ్రహ్మమును తెలిసికొన్నవాని శరీరము నశించునా? నశించును. ఎప్పుడు? కర్మానుభవము నిశ్శేషముగా నశించినప్పుడు. శరీరము నశించుట దుఃఖ హేతువా? కాదు. ఏల? శరీరము నశింపకుండుటయే! దుఃఖహేతువు. అట్లు కాదేని, ఎవ్వడున్నూ మోక్షము నపేక్షింప కుండును. దేహము నేననుకున్నవాడు దుఃఖసాగరమునందు మునుగును. దేహము నందున్నట్టి "ఆత్మ" నేననుకున్నవాడు సుఖసాగరమునందు మునుగును. "మమేతి బద్ధ్యతే జంతుః, నిర్మమేతి విముచ్యతే" అనగా:- "నేను - నాది" అనుకున్నవాడు జనన - మరణ సంకెలచే బంధింపబడును. "నీవు - నీదే" అనుకున్నవాడీ జనన - మరణ సంకెలనుండి విడివడును. మరణానంతరము జీవుడీ శరీరమును విడిచి ఎక్కడికి వెళ్ళును? జీవితమంతయు ఆతడెట్టి ప్రగాఢమైన కోరికను కలిగియుండునో, ఆ కోరికను మరొక శరీరము ద్వారా తీర్చుకొనుటకై అనుకూలమైన పరిస్థితులుగల ప్రదేశమునకాతడు వెళ్ళును. పాపమొనర్చినవాడు పాపయోనులలో జన్మించును. ఇక ఈ జన్మలో యోగ సాధన చేసినవాడు మరుజన్మలో యోగుల గృహములో జన్మించును. ఇక భోగవాంఛ కలవాడు శ్రీమంతుల గృహములో జన్మించును. కాని భోగవాంఛ కలవానికి మోక్షాపేక్ష యుండదు. భోగము అల్పసుఖము నొసంగును. యోగసాధనను జీవితాంతము వరకు కొనసాగించిన వ్యక్తికి ఆత్యంతిక దుఃఖ నివృత్తి మఱియు పరమానంద ప్రాప్తి కలుగును. అట్టివానికీ దేహమున్నను, లేకున్నను సమానమే! కారణమేమి? అట్టివాడు జీవన్ముక్తుడని చెప్పబడును. అనగా:- జీవించియున్నప్పుడే ముక్తినొందినవాడు. జీవన్ముక్త పురుషుడు మోక్షానందమును చవిచూచినవాడై యుండును. అట్టివాని ఉనికిచే పరిసరప్రాంతములు పవిత్రములగును. ఇరుగుపొరుగువారు ఇహలోక వాంఛల నుండి విముక్తులగుదురు. వారియందు పరమానందమునొందు వాంఛ జనించును. ఏ యానందమునొందినచో, మరోక ఆనందమునొందు వాంఛ జనింపదో, అదియే! పరమానందము. అదియే! బ్రహ్మానందము. అదియే! "మోక్షానందము". ఇట్టి మోక్షానందమును బడయుటయే! ఓంకారోచ్చారణ యొక్క లక్ష్యము. గృహయజమాని సామాన్యముగా తన పరివారము నందున్న వారిని "ఓరే! ఓసీ!" అని పిలుచుచుండును. ఇది ఆధ్యాత్మికజీవితము నవలంబించువాని లక్షణము కాదు. గృహము నందైతేనేమి? గురుకులమునందైతేనేమి? ఆశ్రమమునందైతేనేమి? ఇతరులను సంబోధించునప్పుడు "హరిఓమ్" అని సంబోధింపవలయును. ఈ రెండు పదములలో "హరి" ఓంకారమునకు భిన్నమైనది కాదు. ఇక "ఓమ్" హరికి భిన్నమైనది కాదు. హరి నిర్గుణబ్రహ్మమును సూచించును. ఓం సగుణబ్రహ్మము, లేక శబ్దబ్రహ్మమును సూచించును. నిర్గుణ బ్రహ్మమునుండియే

సగుణబ్రహ్మము జనించినది. అనగా:– అవ్యక్తమైన పరమాత్మనుండి జగత్తు వ్యక్తమైనది. వ్యక్తమైనదేదియైనను దుఃఖసమన్వితమై యుండును. అవ్యక్తమునందానందము తాండవమాడుచుండును. ఉదాహరణకు మన దేహేంద్రియములేవియు చలింపని స్థితియగు గాఢనిద్ర యందు మనమున్నప్పుడు ఎంతో సుఖముననుభవించుచున్నాము కదా! ఐనను వ్యక్తావ్యక్తములకతీతమైనదే! పరబ్రహ్మమనబడును. అవ్యక్తమునందు వ్యక్తజగత్తు సూక్ష్మరూపమునందుండును. స్థూలసూక్ష్మకారణముల నతిక్రమించినదేదో, అదియే! పరబ్రహ్మము. అదియే! ముముక్షువులకు పరమగతి. ఈ స్థితిని బడయుటకై నిరంతర ఓంకారోచ్చారణ ఆవశ్యకమై యున్నది. ఈ స్థితిని బడయుటయే బ్రహ్మసాక్షాత్కార మనబడును. మనమున్నూ అఖండ బ్రహ్మచింతన ద్వారా బ్రహ్మసాక్షాత్కారానుభవమును బడయుదుము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', మే/జూన్, 2010 సంచిక నుండి)

# 10. కోరిక - కోరికలు

కోరిక ఏకవచనము. కోరికలు బహువచనము. ఏ కోరిక తీరినచో మరియొక కోరిక శేషించియుండదో, అట్టి ఏకైక కోరికచే పరమాత్మ పొందబడును. కోరికలచే ప్రాపంచిక పదార్థములు లభించును. ఈ ప్రపంచమునకు సృష్టికర్త పరమాత్మ. కావున ప్రాపంచిక పదార్థము లన్నియును పరమాత్మయందున్నవను మాట నిర్వివాదాంశము. కాని మన మనస్సీ విషయమునంగీకరింపదు. కారణమేమి? మన మనస్సెల్లప్పుడు ప్రాపంచిక పదార్థములను చింతించుటకే అలవాటు పడియున్నది. మన నేత్రము గులాబి పుష్పములను, అందమైన భవనములను, సుందరీమణులను చూడగోరును. కాని వీటికి కారణభూతుడైన పరమాత్మునివైపు మరలదు. పరమాత్ముని మాత్రమే స్మరించు ఏకైక కోరిక బలవత్తరమైయుండును. మన శ్రోత్రము సుమధురమైన సంగీతమును, సినిమా గానములను, కోకిలస్వనమును శ్రవణము చేయగోరును. కాని వీటన్నింటికి మూలకారణుడైయున్న పరమేశ్వరుని నామమును శ్రవణము చేయగోరదు. ఈ పరమేశ్వరుని నామమును గానము చేయు ఏకైక కోరిక శ్రేష్ఠమైయుండును. మన నాసిక సుగంధ ద్రవ్యములను, పుష్పముల సుగంధమును, సుమధురములగు ఆహారపదార్థముల వాసనలను ఆఘ్రాణింపగోరును. కాని వీటన్నింటికి మూలకారణుడైయున్న ఆ పరమాత్ముని చరణకమలములయందున్న తులసి పత్రము నాఘ్రాణింపగోరదు. పరమాత్ముని కర్పింపబడిన పదార్థముల నాఘ్రాణించు ఏకైక కోరికను మనము సముపార్జింపవలసి యున్నది. మన జిహ్వ రుచికరములగు పదార్థములను, మకరందమును, షడ్రసోపేతము లగు ద్రవ్యములను భుజింపగోరును. కాని వీటన్నింటికి మూలకారణమైయున్న మాధవ మాధుర్యమును చవిచూడ గోరదు. ఇట్టి ఏకైక కోరికను మనము కలిగియుండవలయును. మన చర్మము మృదువైన వస్తువులను, మృదువైన శయ్యను, మృదువైన వాహనములను వాంఛించును. కాని వీటన్నింటికి మూలకారణుడైయున్న పరమేశ్వరుని మృదువైన దివ్యాంకము నిచ్చగింపదు. ఇట్టి ఏకైక కోరికను మనము కలిగియుండుటయే! ఆధ్యాత్మిక సాధకుని పరమ లక్ష్యమై యున్నది. ఈ ఏకైక ఆధ్యాత్మిక వాంఛయందన్ని కోరికలు ఇమిడియుండును. ఈ ఏకైక వాంఛ నెఱవేరినప్పుడు మరియొకదానిని కోరుకొను ఆవశ్యకత యుండదు.

ఈ ఏకైక కోరికయందున్న బలము, శక్తి ఇతర కోరికల యందుండదు. సూర్యుని యందున్న తేజస్సు సూర్యకిరణము నందుండదు. సముద్రమునందున్న శక్తి సముద్ర కెరటమునందుండదు. నదియందున్న వేగము, పవిత్రత మురికి కాలువల యందుండదు. అదేవిధముగా పరమాత్ముని చేరుటయనెడి కోరికయందున్న బలము ఇతరములగు ప్రాపంచిక వాంఛల యందుండదు. ప్రతి మనుజుడు మోక్షకాంక్షను కలిగియుండ

వలయును. ఇదియే! నిజమైన కోరిక. శ్రీమద్భగవద్గీతలోని పదునెనిమిదవ అధ్యాయమగు "మోక్షసన్న్యాస యోగము" యొక్క అర్థమును కొందఱు కుక్షింభరులు మోక్షమును కూడ సన్న్యసింపవలయునని, లేక విడిచిపెట్టవలయునని చెప్పుచుందురు. మోక్షమునే విడిచిపెట్టినచో ఇక మానవజీవితోద్దేశ్యమేమై యుండును? మోక్షమనెడి ఏకైక కోరికను నెఱవేర్చుటకై ఇతరములగు ప్రాపంచిక కోరికలను సన్న్యసింపవలయునని, లేక విడిచిపెట్టవలయునని దీని నిజమైన అర్థము. కావుననే "అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే । తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥" అని శ్రీకృష్ణపరమాత్మ నుడివెను. అన్యచింతను వదలి ఏకైక భగవచ్చింతను కలిగియున్నవాని యోగక్షేమములనా సర్వేశ్వరుడు చూచుకొనును. ఏకైక కోరిక సమస్తైశ్వర్యమును సూచించును. ఈ కోరిక నెఱవేరినచో సమస్త కోరికలు నెఱవేరినట్లగును. "యస్మిన్ స్థితేన దుఃఖేన గురుణాపి విచాల్యతే" అనునట్లీ ఏకైక కోరిక తీరిన తర్వాత నరుడే భూమికయందుండునో అట్టివానికెంత గొప్ప దుఃఖము కలిగినను దానిచే విచలితుడు కాకుండా సుస్థిరుడై యుండును. "ఆపూర్యమాణ మచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ । తద్వత్ కామాయం ప్రవిశంతి సర్వే సశాంతి మాప్నోతి నకామకామీ ॥" యనునట్లు ఎన్ని నదులు సముద్రమునందు ప్రవేశించినను, సముద్రము తన స్థానమునుండి చలింపక సుస్థిరమైయుండును. అదేవిధముగా ఎన్ని కోరికలు మానవుని మనస్సులో ప్రవేశించినను మనుజుడా కోరికలచే చలింపకుండానుండవలయును. అప్పుడాతడు పరమ శాంతిననుభవించును. కోరికలు అశాంతికి మూలములు. ఏకైక కోరిక శాంతికి మూలము. కావున పరబ్రహ్మ సాగరమునందు ప్రవేశించు ఏకైక వాంఛను ప్రతి మనుజుడు కలిగియుండవలయును. అప్పుడాతడు సచ్చిత్సుఖము ననుభవించుటయే గాక మానవజన్మ సార్థకమగును. అట్లు కాదేని జనన మరణ చక్రమునందు పరిభ్రమింపవలసివచ్చును.

ఆధ్యాత్మిక వాంఛ రామబాణమువంటిది. శ్రీరామచంద్ర భగవానుడు ఒకేయొక బాణముచే ఏడు తాళవృక్షములను నేలగూల్చెను. ఇది మానసిక ఏకాగ్రతను సూచించును. ఇది ఏకైకవాంఛను సూచించును. మఱియు సప్తతాళవృక్షములు సప్తజ్ఞాన భూమికలను సూచించును. ఆధ్యాత్మిక సాధకుడు మొమ్మొదట *(1)* శుభేచ్ఛను కలిగియుండవలయును. అనగా:– జీవితలక్ష్యమును చేరునట్టి మార్గమునను సరించుట యనెడి మంచి కోరికను కలిగియుండవలయును. అట్టి మనుజుడు శాశ్వతాశాశ్వతములను గూర్చి *(2)* విచారణ చేయును. శాశ్వతమైనదానిని చేపట్టి అశాశ్వతమైన దానిని త్యజించును. అప్పుడాతని మనస్సు సూక్ష్మమగును. ఇట్టి భూమిక *(3)* తనుమానసి యనబడును. మనస్సు సత్త్వగుణముచే పూరింపబడియున్నప్పుడా స్థితి *(4)* సత్త్వాపత్తి యని చెప్పబడును. అప్పుడు ప్రాపంచిక విషయములయందాతనికి అనాసక్తి కలుగును. ఈ భూమిక *(5)* అసంసక్తి యనబడును. దీనిని కొంతకాలమభ్యసించిన తరువాత ప్రాపంచిక పదార్థములాతనికి కానబడవు. ఈ భూమిక *(6)* పదార్థభావన యని చెప్పబడును. ప్రాపంచిక

పదార్థములన్నియును ఆతనికొక తేజోపుంజము వలె గోచరించును. ఇక ఏడవ భూమిక *(7)* తురీయమని నుడువబడును. ఇది చైతన్యఘనమై యుండును. ఇందు ద్రష్ట, దృక్కు, దృశ్యములు ఏకమగును. ఇది తేజస్సు తేజస్సును చూచుట వంటిది. సూర్యుడు సూర్యుని చూచుట వంటిది. దీనిని చైతన్యజ్యోతి యని చెప్పవచ్చును. ఇదియే! బ్రహ్మానుభవము. ఇదియే! బ్రహ్మనిర్వాణము. ఇదియే! బ్రహ్మసాక్షాత్కారము. ఏకైక వాంఛను, లేక కోరికను కలిగియుండు వాడిట్టి స్థితికి చేరుకొనును. ఇక కోరికలను కలిగియుండువాడు తదనుసార వాంఛాపూర్తికై జనన మరణ చక్రమునందు పరిభ్రమింపవలసియుండును. కోరికలు సుఖదుఃఖములకు కారణములగును. కోరికలచే మనుజుడొక పైసా సుఖమును, తొంబైతొమ్మిది పైసాల దుఃఖము ననుభవించును. ఇక ఏకైక పారమార్థిక వాంఛను కలిగియున్నవాడు కేవలము పరమానంద సాగరమును చేరుకొనును. ఆతని జనన మరణ చక్రము తుత్తునియలు చేయబడును. ఏకైక వాంఛ శాశ్వతానందమునొసంగును. వాంఛలు అవాంఛితములగు సమస్త దుఃఖములకు కారణములగును. కావున మనమందరమున్నూ శాశ్వతసుఖము నొసంగునట్టి ఏకైకకోరికను కలిగి యుండి జనన మరణ చక్రమునకు కారణములగు క్షుద్రమైన కోరికలను త్యజించి, సుఖించెదము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జనవరి/ఫిబ్రవరి, 2011 సంచిక నుండి)

# 11. పరుగు - పరుగులు

పరుగు ఏకవచనము. పరుగులు బహువచనము. ప్రపంచములోని ప్రతి మనుజుడున్నూ ప్రతిక్షణము పరుగులు తీయుచునే యుండును. ఇచ్చట పరుగనెడి శబ్దము కాళ్ళకు సంబంధించినది కాదు. ఈ పరుగు మనస్సుకు సంబంధించినది. మనస్సెల్లప్పుడు పరుగులకు అలవాటుపడియున్నదే కాని "పరుగు"కు అలవాటుపడిలేదు. పాఠశాలలోని విద్యార్థులు పరుగు పందెములను వేయుచుందురు. "పరుగు"తీయు విద్యార్థి మాత్రమే! పందెములో గెలుచును. పరుగులు తీయు విద్యార్థి ఓడిపోవును. పరుగు మనస్సు యొక్క ఏకాగ్రతను సూచించును. పరుగులు మనస్సుయొక్క చంచలత్వమును సూచించును. అదేవిధముగా ఈ ప్రపంచమునందు "పరుగు"తీయు మనుజుడు మాత్రమే! తన జీవిత లక్ష్యమును చేరుకొనును. కాని పరుగులు తీయు మనుజుడీ సంసార సాగరమునందు, లేక జనన మరణ చక్రమునందు పరిభ్రమించుచుండును.

గృహములోని గృహిణి పాలను పెరుగుచేయుటకై గోరువెచ్చని పాలలో రాత్రియందు ఒక పెరుగుచుక్కను వదలును. తెల్లవారుసరికి ఆ పాలన్నియు పెరుగుగా మారిపోవును. వేడిగానున్న పాలలో పెరుగుచుక్కను వదలినచో, ఆ వేడిపాలు పెరుగు చుక్కవైపు పరుగులు తీయును. ఈ కారణముచే ఆ పాలు పెరుగుగా మారజాలకుండును. ఇక చల్లని పాలలో పెరుగుచుక్క వదలినచో, ఆ పాలుకూడ పెరుగుగా మారవు. కారణమేమనగా:– ఆ పాలలో పరుగుగాని, పరుగులుగాని ఉండవు. కేవలము గోరువెచ్చని పాలలోనే "పరుగు"సాధ్యమగును. ఈ పరుగు సాత్త్వికమని చెప్పబడును. ఈ సాత్త్విక పరుగుచే పాలు పెరుగుగా మారును. ఇక వేడిపాలు రాజసిక మగుటచే పరుగులు తీయును. కావున ఆ పాలు పెరుగుగా మారవు. చల్లని పాలు తామసికమగుటచే దానియందు పరుగుగాని, పరుగులుగాని యుండవు. కావున ఆ పాలుకూడ పెరుగుగా మారజాలదు. అదే విధముగా మానవుడు తన జీవితలక్ష్యమును చేరుకొనుటకై రాజసిక, తామసికములను త్యజించి, సాత్త్విక సంపన్నుడు కావలసియుండును.

"పరుగు పరుగున రావోయి బాలకృష్ణ" యని తల్లియగు యశోద బాలుడైన శ్రీకృష్ణుని పిలచును. అదే విధముగా ప్రతి తల్లియు తన బిడ్డయందు బాలకృష్ణుని దర్శింపవలయును. బాలికయందు బాలరాధను దర్శింప వలయును. అప్పుడామె తన సంతానముయొక్క హృదయములలో ఆధ్యాత్మిక బీజములను నాటగలుగును. ఆధ్యాత్మిక సాధకుడు ఆత్మను రథికునిగా భావించును. శరీరమును రథముగా తలంచును. బుద్ధిని సారథిగా చేసికొనును. మనస్సును పగ్గముగా చేసికొనును. ఇంద్రియములను గుఱ్ఱములుగా భావించును. విషయములను మార్గములుగా తలంచును. ఇట్లు శరీరము, ఇంద్రియములు, మనస్సుతో కూడిన జీవాత్మ ఇంద్రియములనెడి గుఱ్ఱములను మనస్సనెడి పగ్గముతో నిగ్రహించి, పరమాత్మ వైపు తన ప్రయాణమును కొనసాగించును. ఇది "పరుగు" అని చెప్పబడును.

అట్లా ఇంద్రియములను నిగ్రహింపని వాడు పరుగులు తీసి తీసి, తుట్టతుదకు పతితుడై తన పరువును పోగొట్టుకొనును. కావున పరుగుతీయుట ముముక్షువుల యొక్క లక్ష్యమై యున్నది. ఇక పరుగులు తీయుట ప్రాపంచిక విషయభోగలాలసుని లక్ష్యమై యుండును.

శ్రీ ఆంజనేయుడు ఒక్క పరుగులో సముద్రమును దాటి, లంకలో ప్రవేశించెను. ఐతే శ్రీ ఆంజనేయుని పరుగు ఆకాశమునకు సంబంధించినది. ఈ పరుగు రామబాణమువలె సాగిపోయెను. మైనాకుడు శ్రీ ఆంజనేయుని పూజించడానికి ఆహ్వానించినప్పుడాతడు రామకార్యము మీదనే తన దృష్టిని కలిగియుండెను. కావున ఒక్క క్షణమైనా విశ్రమింపకుండా ముందుకు సాగిపోయెను. తాను శ్రీరామునికి దాసుడై శ్రీరామకార్యమును సఫలీకృతముగా నొనర్చుట శ్రీ ఆంజనేయుని జీవిత లక్ష్యమైయున్నది. ఇట్టి సర్వసమర్పణ కార్యము "పరుగు" అని చెప్పబడెను. మన జీవితమంతటిని ఒక్క "పరుగు"తో పోల్చవచ్చును. ఐతే ఈ పరుగు పరమేశ్వరునికి సంబంధించినదై యుండ వలయును. పరమాత్మ "పరుగు"కు సంబంధించినవాడు. ఇక ప్రపంచము పరుగులకు సంబంధించినది. ఏకత్వము పరమాత్మునికి సంబంధించి యున్నది. అనేకత్వము ప్రపంచమునకు సంబంధించియున్నది. పరుగులు తీసితీసి చిట్టచివరకు అవమానకరమైన జీవితమును గడుపుటకంటే "పరుగు" తీసి పరమాత్మానుభవమునొందుటయే! శ్రేష్ఠమైయున్నది. పరుగు డేగకన్ను కలిగియుండును. ఇక "పరుగులు" లేడి నేత్రములను కలిగియుండును. పరులు "పరుగు"నందుండరు. ఇక పరుగులలో "పరులు" కానబడుదురు. పరుగులతో పెరుగువారు పరతత్త్వమునెఱుంగజాలకుందురు. ఇక కేవలము "పరుగు"తో పెరుగువారు పరతత్త్వజ్ఞులై యుందురు. "పరుగు"లో జీవితమంతయు పరమాత్మునియందు కరిగిపోవును. ఇక పరుగులు జనన మరణములకు కారణములగును. తరుగులేని జీవితము "పరుగు"కు సంబంధించియుండును. ఈ పృథ్వికి మరల తిరిగివచ్చుటకు కారణమగు "పరుగులు" ప్రపంచమునకు సంబంధించియుండును. కావున జీవితలక్ష్యము నొందదలంచువారు "పరుగుల"ను నిరాకరించి, "పరుగు"బాట ననుసరింపవలయును. "పరుగు"చే జీవితము శాంతియుతమగును. "పరుగులు" జీవితము యొక్క అశాంతికి కారణములగును. పరుగు ఏకైక లక్ష్యము నొందింపజేయును. పరుగులు నానాత్వభ్రాంతి యందు పడవేయును. పరుగు అద్వైతసిద్ధికి కారణమగును. పరుగులు ద్వంద్వభావ సముపేతములై మనస్సును సందిగ్ధావస్థయందు పడవేయును. పరుగుచే పడుగుపేకలు వస్త్రముగా మారును. పరుగులచే పడుగుపేకలు ఛిన్నాభిన్నములగును. పరుగుచే ఆనందామృత సాగరస్నానము లభించును. ఇక పరుగులచే దుఃఖ సాగర నిమగ్నత తటస్థించును. పరుగు రాజబాట వంటిది. పరుగులు పల్లెల లోని పిల్లదారుల వంటివి.

పరమాత్మ ప్రాప్తికై జీవాత్మ పరుగుపందెమును తన తల్లిగర్భమునందే నేర్చుకొనవలసియుండును. ఇందునిమిత్తమై తల్లి యొక్క వాతావరణము కూడా పరుగు పందెమునకనుకూలమై యుండవలయును. అనగా:- తండ్రి కూడ పరుగు

పందెమునందాటితేరినవాడై యుండవలయును. అది సంభవింపకున్నచో తల్లి గర్భము నందున్న జీవుడు వామదేవుని వలె పూర్వపుణ్య సంస్కారమును కలిగియుండవలయును. అట్టి ఎడల ఆ జీవుడు ప్రతికూల వాతావరణమును ఛేదించినవాడై పరుగు పందెమునందు ముందంజ వేయుట జరిగి తీరును. మన భారతజాతిపితయగు మహాత్మాగాంధీగారు ఈ పరుగు పందెమునందు ముందంజవేసినవారై భారతమాత బంధనమును త్రెంపివేయగలిగిరి. శ్రీరమణమహర్షులవారు ఈ పరుగు పందెమునందు ముందంజవేసిన వారై "నేనెవడను?" అను విషయమును తెలిసికొనగలిగిరి. ఈ పరుగు పందెము నాధారముగా గొనియే జగద్గురు శ్రీశంకరాచార్యులవారు "బ్రహ్మసత్యం జగన్మిథ్యా" అను వాక్యమును ప్రతిపాదింపగలిగిరి. ఈ పరుగు పందెమునందు నిష్ణాతురాలైన భక్త మీరాబాయి సర్పమును ఒక పూలమాలగా మార్చగలిగెను. శ్రీ సద్గురు శివానంద స్వాములవారీ పరుగుపందెమునందు నిష్ఠగలవారై 75 సంవత్సరములకు పూర్వము "దివ్యజీవన సంఘము"ను స్థాపించగలిగిరి. కావున మనమందఱమున్నూ అశాశ్వతత్వము నొసంగు పరుగుల దరిజేరక, కేవలము శాశ్వతత్వము నొసంగునట్టి "పరుగు" పథమునందు పయనించి, పరమాత్మ ప్రాప్తిని ఈ జన్మయందే సాధించెదము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', మార్చి/ఏప్రియల్, 2011 సంచిక నుండి)

# 12. మూట - మూటలు

మూట ఏకవచనము, మూటలు బహువచనము. ఈ ప్రపంచము నందు సృష్టింపబడిన ప్రతి ప్రాణియున్నూ నిరంతరము మూడు మూటలను మోయుచుండును. కాని ఒకే ఒక మూటను మోయుచుండువాడు ముముక్షువని చెప్పబడును.ఆ మూడు మూటలేవి? (1) సంచితము (2) ప్రారబ్ధము (3) ఆగామి. సంచితము, ఆగామి అనెడి మూటలను దిగువకు దింపి, కేవలము ప్రారబ్ధమనెడి మూటను మోయుచుండువాడే! నిజమైన సాధకుడనబడును. నిజమునకు ఎవ్వడైనను, ఏ మూటనైనను మోయుట కిష్టపడడు. కాని జీవితమున్నంతవరకు కనీసము ఒకమూటనైనా మోయక తప్పదు. మూటయే లేనిచో జీవితమను మాటయే లేదు. ఐతే ఈ మూట తలపై గాని, వీపుపై గాని మోయునట్టి మూటకాదు. ఈ శరీరమే! ఒక మూట. ఇట్లు మోయవలసినట్టి మూటలు సంచితమునందసంఖ్యాకములై యుండును. జనన–మరణములే! ఈ మూటలు. ఈ మూటలను మోయుటను తప్పించుకొనుటెట్లు?

**"అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే ।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥"** (గీత 9–22)

అన్యచింతలేక కేవలము భగవచ్చింతనే ఎవ్వరు కలిగియుందురో, అట్టివారికీ మూటలను మోయు ఆవశ్యకత యుండదు, సరికదా! ఈ మూటలను మోయుభారమును ఆ పరమాత్ముడే! వహించును. అన్యచింత లేనివాడై గజేంద్రుడు శ్రీవిష్ణుమూర్తిని ప్రార్థించగా శ్రీవిష్ణుమూర్తి గజేంద్రుని మూడు మూటలను రహితమొనర్చి (తానే మోసి) గజేంద్రునికి మోక్షమొసంగలేదా? ఇక ద్రౌపదికి కౌరవ సభలో మానభంగము జరుగుచుండగా ద్రౌపది అన్యచింత లేక శ్రీకృష్ణపరమాత్ముని ప్రార్థించినప్పుడు శ్రీకృష్ణుడు స్వయముగా చీరల మూటగా మారి దుశ్శాసనుని సొమ్మసిల్లునట్లు చేయలేదా? అన్యచింత లేని ప్రహ్లాదుని రక్షించుటకై శ్రీవిష్ణుమూర్తి నరసింహావతారమెత్తి, హిరణ్యకశిపుని వధించి, తండ్రి కొడుకుల యొక్క మూడు మూటలను రహితమొనర్పలేదా?

కావున ముముక్షువులందఱును అనన్యచింతను కలిగియుండ వలయును. ప్రపంచములోని ప్రజలందఱి యందును పరమాత్ముని దర్శించువారు అనన్యచింతను కలిగియున్నారని చెప్పవచ్చును. అట్టివారికి పరులుగాని, ఇతరులు గాని కానబడరు. వారికి సర్వత్ర కేవలము పరమాత్మయే! సర్వవేళలలో కానబడుచుండును. కావున అట్టివారు నిరంతరము పరోపకారమొనర్చుచునే యుందురు. పరోపకారము తనకే ఉపకారముగా పరిణమించును. ఇతరులకు అపకారము చేయుట తనకు తాను అపకారము చేసికొనుటయే!యగును. కారణమేమి? ఈ విశ్వమే! మనకు తండ్రి. ఈ విశ్వమే! మనకు

తల్లి. ప్రకృతి–పరుషులే! మనకు తల్లిదండ్రులు. అందుచే ఈ విశ్వములోని ఏ ప్రాణికి ఉపకారమొనర్చినను, ఆ ఉపకారము మన తల్లిదండ్రులకొనర్చినట్లగును. ఇక అపకారము చేసినచో, ఆ అపకారము మన తల్లిదండ్రులకొనర్చినట్లగును. తన తల్లిదండ్రులకు సేవచేయు భాగ్యము నొందని వారు ఈ విశ్వములోని ప్రతిప్రాణికి సేవయొనర్చుచుండ వలయును. అనగా:– వారి శ్రేయస్సును కోరుచుండవలయును. అప్పుడాతని సేవచే తన స్వంత తల్లిదండ్రులే కాక, ప్రపంచములోని తల్లిదండ్రులందఱును ప్రీతి నొందుదురు. ఇట్లు చేయుటచే మనకు మూడు మూటలను మోయుభారము తగ్గిపోవును. అపరిగ్రహము కూడా పరోపకారముతో సమానమగును. కొందఱు ఇతరులనుండి ఎంత ధనమును అపహరించినచో అంత లాభమని తలంచుచుందురు. దీనికి కారణము తమ అజ్ఞానమే తప్ప మరియొకటి కాదు. జగద్గురు శ్రీశంకరాచార్యులవారు "అర్థమనర్థం భావయనిత్యం – నాస్తితతః సుఖలేశః సత్యమ్" అని నుడివియున్నారు. ధన సంపాదన అనర్థమునకు హేతువగును. ధనమునార్జించువాని మూడు మూటల భారము హెచ్చుచుండునే కాని, తగ్గుట కవకాశము లేదు. ఒకవేళ పరోపకారము చేయుటకు తనవద్ద ధనములేనిచో, అంతకు మిక్కిలి ధనసంపన్నుడు మరొక డుండడని చెప్పవచ్చును. కారణమేమి? అట్టివాడు ప్రశాంతచిత్తుడై యుండును. అట్టివాడు తన భావనాబలముచే పరోపకారము నొనర్పజాలును. అపరిగ్రహమును పాటించిన మనుజునికి పాపమంటుకొనదు. శరీరపోషణకు మాత్రము సరిపడునట్టి ద్రవ్యమునాతడార్జింప వచ్చును. దానిని మించిన ద్రవ్యము నార్జించుట పాపహేతువగును. అనగా:–అట్టివానికి మూడు మూటల భారము పెరుగుచుండును. ఈ కారణముచే మనశ్శాంతి లేనివాడగును. "సర్వం బ్రహ్మమయం జగత్" అను భావముచే సర్వపాపములు నశించును. బ్రహ్మానందము ప్రాప్తించును. ఇట్లు సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు నశించును.

శ్రీ శివుడు పార్వతీదేవికి "గురుగీత"ను బోధించెను. దానియందు గురుదేవుని మహిమ వర్ణించబడియున్నది. "గురుబ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః। గురుస్సాక్షాత్పరబ్రహ్మా తస్మై శ్రీగురవేనమః ॥" అని చెప్పబడినది. మనము బ్రహ్మ–విష్ణు–శివులను ప్రత్యక్షముగా మన నేత్రములతో దర్శింప జాలకున్నాము. ఈ కారణముచే వారికి ప్రతీకముగా మనము గురుదేవుని స్వీకరింపవచ్చును. గురువుగారి ఆజ్ఞాపాలనముచే మనకు సమస్తము లభించును. గురువుగారి ఆజ్ఞను పాలించుటచే మన మూడు మూటలభారము రహితమగును. గురువుగారి ఆజ్ఞను శిరసావహించుటచే బ్రహ్మానుభవము కలుగును. "గు"కారము అంధకారము, లేక అజ్ఞానమును సూచించును. "రు"కారము ప్రకాశము, లేక జ్ఞానమును సూచించును. కావున గురుదేవుడు మనలోని అజ్ఞానమనెడి అంధకారమును జ్ఞానమనెడి ప్రకాశముచే తొలగించును. జ్ఞానమనెడి అగ్నిచే సంచితమనెడి "దూదిరాశి" దగ్ధమగును. ఇట్లు ఆగామికర్మయున్నూ నశించును. ఇక ప్రారబ్ధమును ఎట్టివారైనను అనుభవింపక తప్పదు. కాని మనము గురుకరుణను

సంపాదింపగలిగినచో, మనమొక సింహముచే కబళింపబడు ప్రారబ్ధమును కలిగియున్నచో, అట్టి క్రియ స్వప్నమునందు జరుగును. ఈ ప్రకారముగా మహావిపత్తు నుండి మనము రక్షింపబడుదుము.

సంచితము, ప్రారబ్ధము, ఆగామి యనెడి మూడు మూటలలో సంచితము జ్ఞానాగ్నిచే దహింపబడును. అప్పుడు ఆగామి మూట ఉనికి లేనిదగును. ఇక ప్రారబ్ధమనెడి ఒకే మూట మిగులును. ఈ మూటలను ఎట్టివారైనను మోయక తప్పదు. ఈ మూట యొక్క భారమును రహిత మొనర్చుటకై గురుకరుణ అత్యావశ్యకమగును. తను-మన-ధనములను సద్వినియోగమొనర్చుటయే "దివ్యజీవనము" యొక్క ఆశయము. తనువును ఇతరులను సేవించుటకై వినియోగింప వలయును. దీనిచే ప్రారబ్ధ కర్మానుభవము సులభసాధ్యమగును. ఇక మనస్సును మాధవునిపై కేంద్రీకరింప వలయును. దీనిచే మన హృదయాకాశమునందు జ్ఞానభాస్కరుడు ప్రకాశించును. ధనమును దానమొసంగవలయును. అప్పుడు దానఫలము మనకే ప్రాప్తించును. మానవులమై జన్మించిన మనము ముముక్షుత్వము కలవారమై, మోక్షమార్గమునందు పయనించుచున్నచో, మనము మోయుచున్న మూడు మూటల భారము తగ్గి, మన జీవితమనెడి నౌక ఈ భవసాగరమును సునాయాసముగా దాటగలుగును. ఇందునిమిత్తమై మనమీ జన్మయందే ఈశ్వరకృపను, గురుకరుణను ఆర్జించెదము గాక!

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', మే/జూన్, 2011 సంచిక నుండి)

# 13. "మత్స్థాని సర్వభూతాని" - "నచమత్స్థాని భూతాని"

పై శీర్షికలు శ్రీమద్భగవద్గీత తొమ్మిదవ అధ్యాయములోని 4,5 శ్లోకముల యందున్నవి. పాఠకులకివి పరస్పర విరుద్ధభావములను ప్రస్ఫుటమొనర్చును. కాని వాస్తవమునకది నిజము కాదు. కారణమే మనగా:– "మయాతతమిదం సర్వం జగత్త"ని శ్రీకృష్ణపరమాత్మ పలికెను. అనగా:– ఈ జగత్తంతయు నాచేత వ్యాపించియున్నది. అనగా:– పరమేశ్వరుడీ జగత్తంతయు సూక్ష్మరూపమునందు వ్యాపించియున్నాడు. కావుననే "అవ్యక్తమూర్తినా"అని చెప్పబడెను. పరమేశ్వరుడు సృష్టింపబడిన జీవులకగోచరుడై యున్నాడు. "మత్స్థాని సర్వభూతాని" – 'నాయందు సకలభూతములున్నవ'ని శ్రీకృష్ణుడు పలికెను. ఈ సకలభూతములు స్వప్నపదార్థములవంటివి. స్వప్నపదార్థములు స్వప్నమును గాంచువానికి భిన్నములు కావు. స్వప్నద్రష్టయందు స్వప్నపదార్థములున్నవి. కాని స్వప్నపదార్థములయందు స్వప్న ద్రష్ట లేదు. కావుననే "నచాహం తేష్వపస్థితః" అని చెప్పబడినది. అనగా:– భూతములయందు నేను లేనని అర్థము. ఒకవేళ స్వప్నపదార్థములలో స్వప్నద్రష్టయున్నచో స్వప్నము అదృశ్యమైనప్పుడు స్వప్నద్రష్టయున్నూ అదృశ్యుడై యుండెడివాడు. కాని అట్లు జరుగుటలేదు. కావున "నచాహం తేష్వవస్థితః" అని చెప్పబడినది. ఇక 5వ శ్లోకమునందు "నచమత్స్థాని భూతాని" అని చెప్పబడినది. భూతములు లేక పదార్థములు నాయందు లేవని అర్థము. ఇచ్చుటకూడ స్వప్నదృష్టాంతము అన్వయించును. ఈ ప్రపంచమొక దీర్ఘమైన స్వప్నమువంటిది. ప్రపంచములోని పదార్థము లన్నింటికి పరమేశ్వరుడే! ఆధారము. పదార్థములు నశించినప్పుడు పరమాత్మ నశింపడు. సకల చరాచర పదార్థములయొక్క సృష్టి స్థితి లయములకు పరమాత్మయే! కారణము. పదార్థములు అంతవంతములు. పరమాత్మ అనంతము. పదార్థములు అసత్యములు. పరమాత్మ సత్యస్వరూపుడు. ఏ ప్రాణియైనను స్వల్ప జ్ఞానమును కలిగియుండును. కాని పరమాత్మ జ్ఞానభాస్కరుడు, అఖండజ్ఞానసంపన్నుడు. పరమాత్మకు తెలియని పదార్థమీ ముల్లోకములయందేదియును లేదు. అల్పజ్ఞుడైన జీవుడు సర్వజ్ఞుడైన పరమాత్మ నెరుంగజాలడు.

ఒక కుండలో దీపముండునేకాని, దీపములో కుండయుండ జాలదు. జీవులందఱును కుండలవంటివారు. ప్రతిజీవి యందును ఆత్మదీపమున్నది. కాని ఆత్మ, లేక పరమాత్మ యందు జీవుడుండజాలడు. కారణ మేమి? ఆత్మప్రకాశము సర్వవ్యాపకమై యున్నది. ఇక జీవియొక్క ప్రకాశము కేవలము శరీరమునకే స్థగితమై యుండును. విశ్వరూపమునందు అర్జునుడున్నాడే కాని, అర్జునునియందు విశ్వరూపము లేదు. జీవత్వము దహింప బడినప్పుడు విశ్వరూపము దర్శనమొసంగును. కావుననే శ్రీకృష్ణపరమాత్మ తన

విశ్వరూపమును దర్శింపజేయుటకు ముందు అర్జునునితో "దివ్యం దదామితే చక్షుః" అని పలికెను. అనగా:- "ఓ అర్జునా! నేను నీకు దివ్యమైన నేత్రమునొసంగుచున్నాన"ని పలికెను. చర్మచక్షువులకు విశ్వరూపము కానబడదు. దివ్యచక్షువులనార్జించుటకై మనమందఱము దివ్యజీవనావలంబులము కావలసియుండును. ఎల్లెడల సర్వకాల సర్వావస్థలలో దివ్యత్వమును దర్శించుటయే! దివ్యజీవనావలంబులగుట. ఈశ్వరుని యోగశక్తి అద్భుతమైనది. బీజమునందు విశాలమైన మఱ్ఱిచెట్టు సూక్ష్మరూపము నందుండును. అదేవిధముగా ఈ విశాలమైన జగత్తంతయు పరమాత్మునియందు సూక్ష్మరూపమునందుండును. భగవంతుని సంకల్పముచే యోగశక్తి విస్తరించి, ఈ విశాలమైన జగత్తుగా రూపొందును. సృష్టింపబడిన వస్తువు సృష్టికర్తయందుండును. కాని సృష్టికర్త సృష్టింపబడిన వస్తువందుండడు. తల్లి గర్భమునందు శిశువుండును. కాని శిశువునందు తల్లి గర్భముండదు. అదేవిధముగా సమస్తపదార్థములు పరమాత్మయందుండును. కాని పరమాత్మ సమస్తపదార్థములయందుండడు. సమస్తపదార్థములు పరమాత్మతో తాదాత్మ్యమునొందినప్పుడు పరమాత్మ యందు సమస్తపదార్థములున్నవని చెప్పవలసియుండును. ఉత్తర-దక్షిణ ధ్రువములలో సముద్ర జలము మంచుగా మారును. ఆ మంచు కరిగినప్పుడది సముద్రమేయగును. అదేవిధముగా వ్యక్తిత్వమున్నంతవరకు "అహం బ్రహ్మాఽస్మి"అను వాక్యము నుచ్చరించుటకు అర్హతయుండదు. అహంకారనాశమే! మనోనాశము. మనోనాశమే! ఆత్మసాక్షాత్కారమునకు కారణము. అహం భావమున్నప్పుడు "సోఽహం" భావము కలుగజాలదు. "సోఽహం"భావము కలిగినవారి హృదయమునందా పరమాత్మ నివసించును. అహంభావమున్న వారియందా పరమాత్మ నివాసమునకవకాశముండదు.

నిజముగా మనయందు పరమాత్మ ప్రవేశించినప్పుడు "అహంభావమ"నే కుండ పగిలిపోవును. సోఽహం భావన కలిగిన వారియందా పరమాత్మ పూర్తిగా నివసించును. అహంభావనయే! ఆత్మసాక్షాత్కారమునకొక అడ్డుగోడవలె నిలచియున్నది. కావున జీవుడున్నంత వరకు దేవుడుండడు. దేవుడున్నప్పుడు జీవుని ఉనికికి అవకాశముండదు. ఈ వాక్యముచే సామాన్యమానవునికి ముచ్చెమటలు పట్టును. దానికి కారణము అజ్ఞానము. జీవుడొక చక్కెరబొమ్మవంటివాడు. చక్కెరబొమ్మ సముద్రములో పడినప్పుడది సముద్రమేయగును. ఐతే ఈ సముద్రము లవణ సముద్రము కాదు. ఇది అమృత సాగరము. అమృత సాగరమునందు ప్రవేశించిన వాడమరుడగును. జీవుడమరత్వము నొందుటకై గురువు ద్వారా "తత్త్వమసి" మహావాక్యమును శ్రవణమొనర్పవలసియుండును. ఆ పరమాత్మ తత్త్వమును తెలిసికొన్నవాడు "తత్త్వజ్ఞాని" యని చెప్పబడును. తత్త్వజ్ఞాని నిశ్చింతుడై యుండును. కారణమేమి? అట్టివానికి తెలిసికొనవలసిన మరియొక విషయము శేషించియుండదు. ఇట్టివాడు "ప్రజ్ఞానం బ్రహ్మ" మహావాక్యము నెఱింగినవాడైయుండును. అప్పుడాతడు "అయమాత్మా బ్రహ్మ" యను మహావాక్యమునను భవమునకు తెచ్చుకొనును.

స్థూలప్రపంచమున్నప్పుడు సూక్ష్మప్రపంచము మనకు కానబడదు. సూక్ష్మప్రపంచమును మనమనుభవమునకు తెచ్చుకొన్నప్పుడు స్థూలప్రపంచము మనకు కానబడదు. స్థూల ప్రపంచమునందున్న నీతో భగవంతుడు "మత్థ్సాని సర్వభూతాని" అని పలుకును. ఇక సూక్ష్మప్రపంచము ననుభవమునకు తెచ్చుకొన్న నీతో భగవంతుడు "నచ మత్థ్సాని భూతాని" అని పలుకును. ఈ విధముగా శీర్షికలో రెండు వాక్యములయందు కానబడుచున్న పరస్పర వైరుధ్యము రహితమగును. బాహ్యదృష్టి కలవానికి కేవలము ప్రపంచమే కానబడును. ఆంతరిక దృష్టి కలవానికి కేవలము పరమాత్మయే! గోచరించును. "మత్థ్సాని సర్వభూతాని" అను వాక్యము సగుణబ్రహ్మమును సూచించును. ఇక "నచ మత్థ్సాని భూతాని" అను వాక్యము నిర్గున బ్రహ్మమును సూచించును.

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జూలై/ఆగష్టు, 2011 సంచిక నుండి)

# 14. నేను మేను కాను

"నేను మేను కాను" అంటే నేనీ దేహమును కాను, లేక నేనీ శరీరమును కానని అర్థము. ఐతే, "నేనెవరు?" దానిని గురించి తెలిసికొనుటకే భగవంతుడు మనకీ మానవదేహమునొసంగెను. మనమందఱము నా చేయి, నా కాలు, నా కన్ను, నా చెవి, నా ముక్కు అంటున్నాము. అందువల్ల నేను చేయిగాని, కాలుగాని, కన్నుగాని, చెవిగాని, ముక్కుగాని కాదు. ఈ దేహమును కూడ నా దేహము, లేక నా శరీరమంటున్నాము. అందువల్ల మనమీ దేహమునకు భిన్నమైయున్నాము. చేతి కధిష్ఠాన దేవత ఇంద్రుడు. ఇంద్రుడు లేనిచో చేయి పనిచేయజాలదు. సూర్యచంద్రులు నేత్రములకధిష్ఠాన దేవతలు. సూర్యచంద్రులు లేనిదే నేత్రములు చూడజాలవు. ఇక అశ్వినీ దేవతలు నాసిక (ముక్కుకు) అధిష్ఠాన దేవతలు. అవి లేకుండా ముక్కు పనిచేయజాలదు. ఈ ప్రపంచము పంచభూతములతో నిర్మింపబడియున్నది. మన దేహము కూడా పంచభూతములతో నిర్మింపబడియున్నది. ఈ దేహమొక జడ పదార్థము. ఆత్మ దేహమునందు ప్రవేశించినప్పుడు జీవాత్మయని చెప్పబడును. ఈ ప్రపంచమొక జడపదార్థము. పరమాత్మ ఈ ప్రపంచమునందు ప్రవేశించుటచే సకల చరాచర జీవరాసులు చైతన్యవంతములగుచున్నవి. ఆత్మ దేహమునందు ప్రవేశించుటచే ఈ దేహము చలించుచున్నది. ఐతే ఈ దేహమెచ్చటికి పయనించుచున్నది? జీవితగమ్యము తెలియని మానవునికి మార్గము తెలియదు. జీవిత లక్ష్యము తెలిసినప్పుడు మార్గదర్శి కూడా లభించును. ఈ దేహము నశ్వరమని తెలిసికొన్నప్పుడు నాశములేని పదార్థము కొరకై మానవుడన్వేషించుచుండును. ఈ మేను నేను కానని తెలిసికొన్నప్పుడు నేనెవడనో తెలిసికొనుటకై మానవుడు ఉబలాటపడును.

"నేను మేను కాన"ని తెలిసికొన్న మనుజుని మనస్సు శరవేగముతో జీవిత లక్ష్యమునొందుటకై ఉత్సహించును. జీవిత లక్ష్యమునొందకున్నచో మనకు కలుగు నష్టమేమి? యని మీరడుగ వచ్చును. "మహతీ వినష్టిః" అని ఉపనిషత్తు నుడువుచున్నది. అనగా:-గొప్ప నష్టము కలుగును. అనగా:- 84 లక్షల యోనులను సంచరించిన తర్వాత లభించిన ఈ మానవజన్మ వ్యర్థమగును.

లక్ష్యములేని జీవితము కుక్షింభరత్వ జీవితముగా పరిణమించును. అనగా:- అట్టి మనుజుడు తినుటకు మాత్రమే! జీవించును. అప్పుడు తినుటకు మాత్రమే జీవించుచున్న పశుపక్ష్యాదులకు, మానవునికి మధ్య భేదమేముండును? కేవలము రూపమునందు భేదముండునే కాని, చర్యలో భేదముండదు. "యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః" యని శ్రీమద్భగవద్గీత (6 అ. 22 శ్లో.) నుడువుచున్నది. "దేనిని పొందినచో దానికి మించిన లాభము మరొకటుందో", అదియే! జీవిత లక్ష్యమనబడును. మఱియు "యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే", అనగా:- దేనియందు ప్రతిష్ఠితుడై

యున్నచో మహాదుఃఖముచేత కూడా చలింపజేయబడడో, అదియే! జీవిత గమ్యస్థానమని చెప్పబడును. ఇక నేను మేనను కొన్నవాడు జీవితలక్ష్యము నొందజాలడు. కారణమేమి? ఈ దేహము జడమైనదని ఇతః పూర్వము మనము తెలిసికొనియున్నాము. మట్టి మట్టిలో కలిసిపోవునట్లు ఈ దేహమనెడి మట్టి మరణానంతరము భూమిలో కలిసి పోవును. అప్పుడు నిజమైన "నేను" శేషించును. ఐతే రాజు వెంబడి సైన్యము బయలుదేరునట్లు ఈ "ఆత్మ"యనెడి రాజు వెంబడి పూర్వసంస్కారములు, లేక పూర్వవాసనలనెడి సైన్యము కూడా బయలుదేరి వెళ్ళును. అప్పుడీ రాజుకు ఏకాంతవాసము చిక్కదు. సామాన్యముగా రాజు సైన్యము నాజ్ఞాపించు చుండును. కాని ఈ "జీవాత్మ" యనెడి రాజు పూర్వవాసనలనెడి సైన్యము యొక్క కట్టుదిట్టములయందుండవలసియుండును. ఈ కారణముచే ఆతనికి స్వాతంత్ర్యముండదు. ఈ బంధనము నుండి విడివడుటెట్లు? ఇందు నిమిత్తమై "జీవాత్మ"కు మార్గదర్శి అవసరమగును. ఆ మార్గదర్శియే! గురువని చెప్పబడును.

"నేను మేన"ను కొనువానికి గురుదేవుడు లభించుట దుర్లభము. ఒకవేళ లభించినను అట్టి మనుజుడు గురువును కూడ తనకు వలెనే ఒక దేహముగా భావించుచుండును. ఈ కారణముచే ఆతడాధ్యాత్మిక జీవితమునందు పురోభివృద్ధి నొందజాలడు. తానొక దేహధారి యనియు, గురువు కూడా ఒక "దేహధారి"యనియును భావించినప్పు డాతడాధ్యాత్మిక పురోభివృద్ధి నొందగలుగును. "దేహధారి" యనగా:– దేహమును ధరించినట్టి ఆత్మయని అర్థము. గురు–శిష్య సంబంధముచే శిష్యుని ఆత్మ గురుదేవుని యందున్న ఆత్మతో ఏకీభవించును. ఇదియే! గురుశిష్యపరంపర యొక్క ముఖ్యోద్దేశ్యము. నేటి కాలములోని శిష్యులు తమకు వలెనే గురువుగారి దేహపోషణకై కొంత ద్రవ్యము నంపుచు తృప్తినొందుచుందురు. ఇది గురు–శిష్యసంబంధమునకు అవహేళన వంటిది. మరికొందరు శిష్యులు సుప్రసిద్ధులైన గురువుగారి ద్రవ్యరాశి నాశించి, శిష్యరికము చేయుచుందురు. ఇదియున్నూ గురుశిష్యసంబంధమునకు నిశ్చయముగా అవహేళన వంటిదే! ఇంకను కొందఱు శిష్యులు సంవత్సరమునకొక గురువును మార్చుచుందురు. దీనికి కారణము గురువుయొక్క అర్థమును, గురువు యొక్క గొప్పతనమును, గురువు యొక్క మహిమను వారు గుర్తెఱుంగ కుండుటయే! ఏకలవ్యుడు ద్రోణాచార్యులవారి మట్టి విగ్రహమును తయారుచేసి, దానినుండి వచ్చిన సూచనల నాధారముగా గొని విలువిద్యలో అర్జునుని మించినవాడైన విషయమును నేటికాల శిష్యులు మరచిపోయి, అనేక గురువులను చేపట్టుచుందురు. నిజమైన సత్యాన్వేషకుడు ''నేను మేనను కొనుట''ను మానుకొనవలయును. నిరంతరము "నేను మేనుకాన"ను విషయమును మననము చేయుచుండవలయును. కొందఱు గురువులు ''శ్వాస యొక్క రాకపోకలను పరిశీలించుమ"ని శిష్యులకు చెప్పుచుందురు. ఐతే ఈ ఉచ్ఛ్వాస–నిశ్శ్వాసలు దేనిపై ఆధారపడియున్నవో, దానిని గుర్తెఱుంగ జాలకుందురు. "రాకన్మానవు హానివృద్ధులు మహారణ్యంబులో దాగినన్, పోకన్మానదు దేహమే విధమునన్ పోషించి రక్షించినన్"

అని శ్రీపోతనా మాత్యులు శ్రీమద్భాగవతమునందు నుడివినట్లు హానివృద్ధులకు కారణమే మన పూర్వజన్మ వాసనలనియు, ఇక పూర్వజన్మలకు కారణము దేహాభిమానమనియు తెలిసికొని, అత్మానాత్మ వివేకము కలవారమై ఆత్మసాక్షాత్కారము నొందుటకు మాత్రమే గురుదేవునాశ్రయింతుము గాక! గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే శివుడు, గురువు సాక్షాత్కార బ్రహ్మయేయను భావము కలవారమై "నేను మేన"ను కొనక, "గురుదేవుడు దేహమ"నుకొనక, దేహాభిమాన రహితులమై సర్వ దుఃఖ నివృత్తిని, పరమానందప్రాప్తి నొసంగునట్టి ఆత్మసాక్షాత్కారము, లేక దైవసాక్షాత్కారము, లేక బ్రహ్మ సాక్షాత్కారము నీ జన్మయందే పొందునట్లు భగవంతుడనుగ్రహించును గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', సెప్టెంబరు/అక్టోబరు, 2011 సంచిక నుండి)

# 15. సర్వాత్మభావము

"నేను మేను కాన"ను కొన్నవానికి సర్వాత్మభావము లభించును. సర్వాత్మభావము కలవారు ఏదేశమునకు చెందినను, ఏ జాతికి చెందినను, ఏ మతమునకు చెందినను, ఏ వర్ణమునకు చెందినను, ఏ లింగమునకు చెందినను మహాత్ములుగా, మహాపురుషులుగా మహర్షులుగా పరిగణింపబడుదురు. కారణమేమి? అట్టివారి ఆత్మ సమస్తప్రాణులయందు ప్రవేశించును. అంతేకాదు, సకల చరాచర వస్తుజాలమునందు ప్రవేశించును. కావున జగత్తులోని సమస్త శక్తులు సర్వాత్మభావము కలవారి హృదయము నందు అప్రయత్నముగా ప్రవేశించును.

"ఒరులేయవి యొనరించిన
నరవర! అప్రియము తన మనంబున కగుదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మ పదములకెల్లన్"

అని భాగవత మహాపురాణము నుడువుచున్నది. ఇతరులు మనకేమి చేసినచో మనకు బాధ కలుగునో, అట్టిదానిని మనమితరులకు చేయరాదు. ఇతరులు మనకేమి చేసినచో మనకు ప్రీతికలుగునో, అట్టి దానిని మనమితరులకు చేయుచుండవలయును. ఇదియే! సర్వాత్మభావము యొక్క సారాంశము. సొలమన్ చక్రవర్తి ఒకరోజు వాహ్యాళికి వెళు ళ్ళుచుండగా ఒక చీమలపుట్ట ఎదురయ్యెను. అప్పుడు చక్రవర్తి ఆ చీమలపుట్టను తప్పుకొని మరొక దారిలో వెళ్ళుచుండెను. దానిని గమనించిన రాజభటులు రాజమార్గమును వదలి వెళ్ళుటకు గల కారణమును ఆ చక్రవర్తినడిగిరి. దానికి సమాధానముగా సొలమన్ చక్రవర్తి "బలహీనులను రక్షించుటకే కదా! భగవంతుడు బలవంతులను సృష్టించెను?" అని సమాధానమొసంగెను. కావున బలమున్నదను గర్వముతో బలహీనుల నెప్పుడును బాధింపరాదు. ఇది సర్వాత్మ భావమునకు దృష్టాంతము. తనకంటె తక్కువ స్థితియందున్న వారిని, సేవకులను, దరిద్రులను సైతము సత్కరించుట, గౌరవించుట, ఆదరించుట సర్వాత్మ భావము కలవారి లక్షణమైయున్నది.

సర్వాత్మభావము గర్భస్థ శిసువుతో ప్రారంభమగును. అది ఎట్లనగా:- అర్జునుని కోడలైన ఉత్తర గర్భమునందున్న శిశువును హత మొనర్చుటకై అశ్వత్థామ వదలిన బాణమును తప్పించి శ్రీకృష్ణపరమాత్మ ఆ శిశువును రక్షించెను. గర్భమునుండి బయల్వెడలిన బాలుడు ప్రతివారి ముఖమును పరిక్షించుచు, నన్ను రక్షించిన ఆ పరమాత్ముడెవ్వడని పరీక్షింపసాగెను. అందువల్ల ఆతనికి "పరీక్షిత్తు" అనునామమేర్పడెను. ఆ పరీక్షిత్తునకే కదా! శుకయోగి ఒక వారము రోజులు శ్రీమద్భాగవత పురాణమును వినిపించెను. కావున బాల్యమునందే భాగవత ధర్మము చిన్నపిల్లల హృదయములలో చొప్పింపబడ వలయును.

"చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని,
దయయు, సత్యంబు లోనుగా దలపడేని
కలుగనేటికి తల్లుల కడుపు చేటు"

అని శ్రీమద్భాగవతము నుడివెను. చేతులారంగ శివుని పూజించిన నిజమైన భక్తుడు మార్కండేయుడు. "చంద్రశేఖర మాశ్రయే మమ కింకరిష్యతి వైయమః" అని ఉద్ఘోషించెనదీ మార్కండేయుడే కదా! "నేను శివుని ఆశ్రయించితిని. నన్ను యముడేమి చేయును?" అని పై వాక్యమున కర్థము. అదే విధముగా ఆటవికుడైన భక్తకన్నప్ప తన రెండు నేత్రములను శివుని కర్పించి నిజమైన శివపూజను గావించెను. శివుడే సర్వస్వమనుకొనుట కూడ సర్వాత్మభావమునకు తార్కాణము. సర్వులయందు శివుని దర్శించుటయు సర్వాత్మ భావమేయనబడును.

నోరునొవ్వంగ హరికీర్తి నుడివినవారిలో (1) చైతన్యప్రభువు, (2) భక్త మీరాబాయి, (3) త్యాగయ్య, (4) అన్నమాచార్యులు, (5) భక్తరామదాసు, (6) సద్గురు శ్రీ శివానందస్వామి మున్నగువారగ్రగణ్యులు. దయగల హృదయము కలవారిలో (1) బుద్ధదేవుడు, (2) శిబిచక్రవర్తి ముఖ్యులు. సత్యసంధులలో సత్యహరిశ్చంద్రుడు ఆదర్శపురుషుడు. పై లక్షణములులేక జన్మించిన మనుజులు తల్లుల కడుపు చేటుకే కారణమగుదురు కదా! సర్వాత్మ భావము కలవారు సర్వులయందును ఆ సర్వేశ్వరుని దర్శించుచుందురు. అట్టి వారికి పరమాత్మ ''ఇందుగలడందులేడ''ను సందేహముండదు. అట్టి వారికి శత్రువులుండరు. ఒకవేళ శత్రువులున్నచో వారు సర్వాత్మ భావము కలవారు కాదని ఘంటాపథముగా నుడువవచ్చును. ఐతే శ్రీకృష్ణునికి కంసుడు, శ్రీరామునికి రావణుడు, ప్రహ్లాదునికి హిరణ్యకశిపుడు శత్రువులే కదా! యని మీరడుగవచ్చును. అది శత్రుత్వము కాదు, సరికదా! సర్వాత్మ భావహీనుని సర్వాత్మభావ సముపేతునిగా చేయు ప్రక్రియ. ఇది లోకోద్ధారకకార్యము. ఇట్టి కార్యములను అవతారపురుషులు మాత్రమే! చేయగలుగుదురు. చివరి ఘడియలలో కంసుడు శ్రీకృష్ణుని మాత్రమే సర్వత్ర దర్శించి, శ్రీకృష్ణుని యందైక్యమయ్యెను. రావణుడంత్యకాలములో శ్రీరాముని స్మరించుచు ఆతని యందైక్యమయ్యెను. ఇక హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని రక్షించుటకై ఒక స్తంభము నుండి ఉద్భవించినట్టి నృసింహభగవంతుని ధ్యానించుచు, ఆతనియందైక్య మయ్యెను. కావున అవతారపురుషులు అధర్మమనెడి శత్రువును హతమెనర్చి, ధర్మసంస్థాపన గావింతురు. సర్వాత్మభావము లేకుండటయే! అధర్మము. సర్వాత్మ భావమును కలిగియుండుటయే! ధర్మము. నేను మాత్రమే సుఖింప వలయుననుట అధర్మము. ప్రపంచములోని ప్రజలందఱును సుఖింప వలయుననుకొనుటయే! ధర్మము. మహాత్మాగాంధీగారికి సౌతాఫ్రికాలో కలిగిన అవమానమును భారతదేశమంతటికి కలిగిన అవమానముగా వారు భావించిరి. ఈ కారణముచే వారు భారతదేశమునకు స్వాతంత్ర్యమును తెచ్చిపెట్టి

బ్రిటిష్ పాలనను అంతమొందింపజేసిరి. ఐనను భారతదేశప్రజలకు సర్వాత్మభావము కలుగలేదనియే చెప్పవలసియున్నది. కారణమేమి? ప్రప్రథమముగా ప్రతి గృహమునందు సర్వాత్మభావము కలుగవలయును. అది ఎట్లు సాధ్యమగును?

తల్లులు తమ జీవితములను తమ పిల్లల సంరక్షణకు మాత్రమే సమర్పింపవలయును. సంరక్షణయనగా:- సర్వాత్మభావమును తమ పిల్లల హృదయక్షేత్రములలో నాటుట. కేవలము ధనార్జనకై ఉద్యోగములలో ప్రవేశించుట చేయరాదు. ప్రస్తుత కాలములో భార్యాభర్తలు పరస్పరము తగువు లాడుకొని, చివరకు విడాకులనొసంగుచుందురు. ఇది ధర్మ విరుద్ధము మఱియు సర్వాత్మభావమునకు బద్ధశత్రువు. “దేశమంటే మట్టికాదోయ్- దేశమంటే మనుజులోయ్” అన్నారు శ్రీ గురజాడ అప్పారావుగారు. కావున మనుజులలో మార్పురావలయును. ఒక్క నరేంద్రుడు వివేకానందుడై విశ్వములోని ప్రజలందఱికి సర్వాతభావమును లేక విశ్వాత్మభావమును ప్రబోధించెను. ఒక్క కుప్పుస్వామి శివానందుడై ఆంగ్లభాషలో 300 గ్రంథములను రచించి తమ సర్వాత్మభావముచే విశ్వములోని ప్రజలందఱికి ఆరాధ్య దైవమయ్యెను. ఒక్క మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ తమ సర్మాత్మ భావముచే మహాత్ముడుగా జగద్విఖ్యాతినొందెను. ఒక్క ఆనందమాయి మాత తన సర్వాత్మ భావముచే విశ్వమునకారాధ్యదేవి యయ్యెను. ఒక్క అనసూయా దేవి తన సర్వాత్మభావముచే “అందరిల్లు”ను నిర్మాణమొనర్చి విశ్వజనని యయ్యెను. కావున అందరిండ్లను తన ఇల్లుగా భావించునట్టి తల్లులను, తండ్రులను భారతమాత ఉత్పన్నమొనర్చినప్పుడు సర్వాత్మభావ భవన కవాటము తెఱువబడును. అప్పుడు “బృందావనమది అందరిదీ, గోవిందుడు అందఱివాడేనే” అను వాక్యము సార్థకమై ప్రపంచమంతయు ఒక విశ్వబృందావనముగా మారిపోవును. ఇది జరుగుటకు మనందఱి మనస్సులు సర్వాత్మ భావ భాస్కరునికి ప్రతిరోజు నమస్కరింపవలసియున్నది.

(**సేకరణ:** ‘శ్రీశివానందవాణి’, నవంబరు/డిశంబరు, 2011 సంచిక నుండి)

# 16. నేను ప్రపంచములో ఉన్నానా? లేక, ప్రపంచము నాకు బయట ఉన్నదా?

ప్రపంచములో సామాన్యముగా పై ప్రశ్నలను వేసికొనువారు చాల అరుదుగా నుందురు. "ఏమిటీ పిచ్చి ప్రశ్న? నేను ప్రపంచములో లేకుంటే మరెక్కడున్నాను?" అని మీరడుగవచ్చును. ఐతే రెండవ ప్రశ్నచే మీకు సమాధానము లభించును. ఒకవేళ నేను ప్రపంచములో ఉన్నచో, ప్రపంచము నాకు బయట ఉండకూడదు. మనము "బయటి ప్రపంచమ"ని అంటున్నాము కదా! సన్యాసులు, సాధువులందఱు నేను ప్రపంచాన్ని వదలిపెట్టి హిమాలయములలో తపస్సు చేసికొనుటకు వచ్చినామని అంటున్నారు కదా! ఐతే పై రెండు ప్రశ్నలకు సమాధానము లభించినప్పుడు మాత్రమే! సాధకుల సాధన, జిజ్ఞాసువుల యొక్క జిజ్ఞాస, సన్యాసుల యొక్క తపస్సు ఫలించును. ఇది శ్రీ రమణమహర్షులవారి "నేనెవడను?" అను ప్రశ్నకు సమాధానము వంటిది. పై రెండు ప్రశ్నలతో పాటు "నేనెవడను?" అను ప్రశ్నకు సమాధానము లభించినప్పుడు సాధకుని సాధన సిద్ధించును. నిజమునకు ఎవ్వడైనను ప్రపంచమును త్యజింపజాలడు. ప్రపంచములోనే ఉండి, ప్రపంచమును త్యజించినానని చెప్పుట హాస్యాస్పదము కదా! ఒకవేళ విమానములో భూమినుండి ఆకాశముపైకెగిరినను, ఆ మనుజుడీ ప్రపంచమునందే యుండును. నక్షత్రమండలమును దాటి ఎంతో దూరము వరకు వెళ్ళగలిగినప్పుడు మాత్రమే! ఈ ప్రపంచమును నేను త్యజించినానని చెప్పవచ్చును. ఐతే ఈ విశ్వమునందు కేవల మీ ప్రపంచమునకు మాత్రమే! ఉనికి యున్నదా? లేదు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడా పరమేశ్వరుడు! ఈ విశ్వమునకు ఊర్ధ్వలోకములు ఏడు (భూర్భువస్సువః మున్నగునవి), అధోలోకములు ఏడు (అతల–వితల–పాతాళాదులు) – మొత్తము పదునాలుగు లోకములున్నవి. వీటన్నింటిని త్యజింపజాలిన వాడెవ్వడో, అట్టి వాడు నిజమైన సన్యాసియని చెప్పబడును. ఇది ఎట్లు సాధ్యమగును? ఇది అసాధ్యమైన విషయము ఐతే ఈ పదునాలుగు లోకములను త్యజించుటకు సులభమైన ఉపాయమొకటున్నది. ఈ ఉపాయము "మనోలయమ"ని చెప్పబడును. మనస్సును చిన్న విషయములనుండి తీసి పెద్ద విషయమునందు లయము చేయుటయే "మనోలయమ"నబడును. ఈ విషయము కఠోపనిషత్తు నందు చక్కగా వర్ణింపబడియున్నది.

"యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞస్తద్యచ్ఛేజ్ఞాన ఆత్మని ।
జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాంతా ఆత్మని ॥"

అనగా:– బుద్ధిమంతుడు వాగాదీంద్రియములను ప్రాపంచిక విషయముల నుండి తొలగించి మనస్సులో లీనమొనర్పవలయును. అప్పుడు వాగాదీంద్రియములు నిష్క్రియమగును. కావున మనస్సు విషయాసక్తి రహితమగును. అట్టి మనస్సును బుద్ధియందు లయమొనర్ప

వలయును. అప్పుడా మనస్సు నిశ్చయాత్మక బుద్ధియందు ప్రవేశించును. నిశ్చయాత్మక బుద్ధి ఏర్పడినప్పుడు, దానిని జీవాత్మ యొక్క శుద్ధ స్వరూపమునందు లయ మొనర్పవలయును. ఆ సమయమునందు కేవలము ఆత్మతత్త్వము మాత్రము శేషించి యుండును. తదనంతర మా శుద్ధమైన ఆత్మతత్త్వమును పరబ్రహ్మము నందు, లేక పురుషోత్తముని యందు లయము చేయవలయును. ఇదియే! మానవజీవితమునకు ధ్యేయము. ఇదియే! పరమ గమ్యస్థానము. ఇదియే! ధ్యానమునకు పరాకాష్ఠ.

ఇట్టి పరమోత్కృష్టమైన స్థితియందు నేను ప్రపంచమునందున్నానని గాని, ప్రపంచము నాకు బయట ఉన్నదని గాని తోచదు. అట్టివాడు పరమ శాంతిధామమును బడయును. సాధకులుగాని, జిజ్ఞాసువులుగాని, ముముక్షువులు గాని పరమశాంతిని, నిత్యానందమును, పరమానందమును కోరుచుందురు. కాని దానికి కావలసిన ప్రయత్నమును మాత్రము చేయరు. ఆ ప్రయత్నము కృతనిశ్చయులై యున్నవారికి సులభముగను, నిశ్చయాత్మక బుద్ధి లేనివారికి కఠినముగను తోచును. ఒక కుటుంబములోని సభ్యులందఱును సమైక్యబుద్ధిని కలిగియున్నప్పుడా కుటుంబము కలియుగ వైకుంఠమును బోలియుండును. అది సాధ్యము కానప్పుడా సాధకుడు తన దేహమునే ఒక కుటుంబముగా తలంపవలసి యుండును. ఈ దేహము నందెన్నో పదార్థములున్నవి. నేత్రములు సర్వత్ర శ్రీహరిని దర్శించుచుండవలయును. శ్రోత్రములు హరినామ కీర్తనములను శ్రవణము చేయుచుండ వలయును. నాసిక విష్ణుభగవానుని పాదపద్మములయం దర్పింబడిన తులసీదళమును ఆఘ్రాణించుచుండవలయును. జిహ్వ దేవుని కర్పింపబడిన నైవేద్యమును భుజించుచుండవలయును. ఇక దేహమును విష్ణుదేవుని చరణారవిందముల చెంత పరుండజేయవలయును. ఇట్లొనర్చుటచే "మనోలయము" సుసాధ్యమగును.

ఈ ప్రపంచమునందేలాటి సమస్యలు లేని గృహమెచ్చటను మనకు కానరాదు. కారణమేమి? భగవంతుని మనము మరచిపోవుటయే దీనికి గల కారణము. సర్వకాలసర్వావస్థలలో భగవత్ స్మరణ చేయుచుండునట్టి మానవుని జీవితమే! నిజమైన జీవితమనబడును. ఐతే ప్రాపంచిక కార్యములను నిర్వహింప పనిలేదా? యని మీ రడుగవచ్చును. వాటిని తప్పక నిర్వహించుచుండవలయును. కాని మనస్సు మాత్రము దైవ సన్నిధియందుంచ వలయును. దైవ సన్నిధియే! పెన్నిధి. అంటే పెద్దనిధి, అంటే గొప్ప ఐశ్వర్యము. అంత్యకాలమునందు దైవస్మరణ మాత్రమే! మనలను రక్షించును. అన్యచింత, లేక ఇతర చింత లేకుండుట "అనన్యచింతన" యనబడును. "అనన్యచింతన" కలవాడెచ్చటున్నను, ఏ పరిస్థితియందున్నను, ఏ కాలము నందున్నను నిర్భయుడై భాసించుచుండును. తన హృదయగుహయందున్న పరమాత్మను దర్శించినవాడు ప్రతిజీవియొక్క హృదయ గుహయందున్న పరమాత్మను దర్శింపగలుగును. అప్పుడాతడు కేవలమీ ప్రపంచముతోనే కాదు, 14 లోకములున్న విశ్వమంతటితో తాదాత్మ్యము

నొందజాలును. ఇట్టి స్థితియే నిర్వికల్ప సమాధియని చెప్పబడును. కేవలమీ ప్రపంచముతో తాదాత్మ్యము నొందినప్పుడది "సవికల్ప"సమాధి యని చెప్పబడును. విశ్వరూపమును దర్శించిన అర్జునుడు తిరిగి ఈ ప్రపంచమునందు కౌరవులతో యుద్ధము చేయవలసి వచ్చెను. ఇట్లు చేయవలసి వచ్చుటకు కారణము కేవలము శ్రీకృష్ణపరమాత్మని సంకల్పమే తప్ప మరియొకటి కాదు. కావున ప్రపంచము మనకు బాహ్యమునందు లేదు. మనమున్నూ ప్రపంచమునకు బాహ్యమునందు లేము. ప్రపంచమే దేవుని యొక్క దేహమేయై యుండుట దీనికి గల కారణము. ఈ విషయమును గుర్తించుటయే "నేనెవడను?" అను విషయమును తెలిసి కొనుటయగును. ఇదియే "తత్త్వమసి" మహావాక్యము యొక్క లక్ష్యము. "తత్" అనగా ఈ ప్రపంచమునకు అతీతమైయున్న పరమాత్మ. ఇక "త్వం" అనగా ఈ ప్రపంచమునందున్న నీవు. "అసి" అనగా:– ప్రపంచమునకతీతమై యున్న ఆ పరమాత్మయే! ఈ ప్రపంచమునందున్న నీవు అని అర్థము. "అహం బ్రహ్మాస్మి"యను మహా వాక్యము కూడా పై విషయమునే బోధించును. "అహం" అనగా ఈ ప్రపంచమునందున్న నేను. "బ్రహ్మ"యనగా ఈ ప్రపంచమున కతీతమైయున్న పరబ్రహ్మము. "అస్మి" అనగా:– పై రెండింటి యొక్క తాదాత్మ్యత. "అయమాత్మ బ్రహ్మ" యనెడి మహావాక్యము యొక్క అంతరార్థమున్నూ ఇదియే! "అయమాత్మా" అనగా:– ఈ జీవాత్మ. "బ్రహ్మ" యనగా:– పరబ్రహ్మము. జీవాత్మలోని జీవుని లక్షణములన్నింటిని తొలగించినప్పుడు శేషించునది ఆ పరబ్రహ్మమే యని భావము. ఇక "ప్రజ్ఞానం బ్రహ్మ" యను మహావాక్యము యొక్క భావమున్నూ ఇట్టిదే! ఈ విశ్వములోని సకల చరాచర పదార్థముల యొక్క లీలానాటకమంతయు చైతన్యము, లేక "ప్రజ్ఞానము" వల్లనే జరుగుచున్నది. అట్టి చైతన్యానంద ఘన స్వరూపమే! పరబ్రహ్మము. దానిని మనమందఱమున్నూ గుర్తెఱింగి తరించెదము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జనవరి/ఫిబ్రవరి, 2012 సంచిక నుండి)

# 17. దేవుని నేత్రము

ఆధ్యాత్మిక సాధకులందఱును దేవుని నేత్రముతో ఈ ప్రపంచమును చూడవలసియున్నది. ఇదేమి మాట! దేవునికి నేత్రముండునా? యని మీరు ప్రశ్నింపవచ్చును. ఇచ్చట నేత్రమును చర్మచక్షువుగా భావింపరాదు. దేవునికి నేత్రమే లేకున్నచో, ఈ ప్రపంచమెట్లు జరుగుచున్నదని తలంచుచున్నారు? దేవుడు గ్రుడ్డివాడని మీరు భావించుచున్నారా? గ్రుడ్డితనము మానవునికే గాని, దేవునికి వర్తింపదు. మానవునికి రెండు నేత్రములుండియు పుట్టంధుని వలె వర్తించుచున్నాడు. అజ్ఞానమే! దీనికి గల కారణము. దేవునియం దజ్ఞానము అణుమాత్రమైనను ఉండజాలదు. కారణమేమి? దేవుడు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు. అంధకారకూపమునందు పడియున్న ఒక కప్ప ఏమి ఆలోచించుచున్నదో, దేవునికి తెలియును. ఉదాహరణగా సూర్యభగవానుని స్వీకరింతము. సూర్యదేవునికి అంధకార మెట్లుండునో తెలియదు. రాత్రి ఎట్లుండునో తెలియదు. భూగోళము యొక్క తూర్పుదిశలో సూర్యుడు ప్రకాశించుచున్నప్పుడు పశ్చిమదిశయందున్న వారికి రాత్రియగును. ఇక సూర్యుడు పశ్చిమదిశయందు ప్రకాశించుచుండగా తూర్పుదిశయందున్నవారికి రాత్రియగును. భూగోళమునంతటిని ఒక్కుమ్మడిగా చూడజాలని మానవుని అజ్ఞానము వల్ల రాత్రింబగళ్ళు కానబడుచుండును. మన నేత్రద్వయమునకధిష్ఠాన దేవతలు సూర్య చంద్రులు. సూర్యచంద్రులు తమ సత్తాను మన నేత్రములలో చొప్పింపకున్నచో, మనము గ్రుడ్డివార మగుదుము. ఇక సూర్యచంద్రులు కూడా పరకీయ ప్రకాశము కలవారే! వారియొక్క అధిష్ఠాన దేవతలు వారికి ప్రకాశమునొసంగకున్నచో సూర్య చంద్రులు కూడా మనకు ప్రకాశమునొసంగ జాలకుందురు. కావుననే "న తత్ర సూర్యోభాతి న చంద్రతారకం, నేమా విద్యుతో భాంతి కుతోఽయమగ్నిః" అని చెప్పబడినది. అనగా, 'పరబ్రహ్మధామమును సూర్యుడుగాని, చంద్రుడు గాని, నక్షత్రములుగాని, విద్యుత్తుగాని ప్రకాశింపజేయజాలవు. ఇక అగ్ని విషయము చెప్పనేల?' యని అర్థము. ఏ ప్రకాశమునకు మించిన ప్రకాశము మరొకటి లేదో, అదియే "పరంజ్యోతి" యని చెప్పబడును. ఏ శక్తికి మించిన మరొక శక్తి లేదో, అది "పరాశక్తి" యని చెప్పబడును. "పరబ్రహ్మమే" ఈ పరంజ్యోతికి, పరాశక్తికి మూలకారణమైయున్నది. ఈ విశ్వము యొక్క సృష్టి స్థితి లయములీ పరబ్రహ్మము చేతనే ఏర్పడుచున్నవి. ఈ పరబ్రహ్మము యొక్క శక్తికి "మాయ" యని పేరు.

ఐతే దేవుని నేత్రముచే మనము చూచుట ఎట్లు సాధ్యమగును? ఇచ్చట పురుషసూక్తములోని "సహస్ర శీర్షాపురుషః సహస్రాక్షః సహస్రపాత్" అను అంశమును మనము స్మృతికి తెచ్చుకొనవలసియున్నది. ఇచ్చట "సహస్ర" అను శబ్దము "అనంత" అను పదమునకు బదులుగా వాడబడినది. ఆ పరబ్రహ్మమునకు అనంత శిరస్సులున్నవి.

ఆ పరబ్రహ్మమునకు అనంత నేత్రములున్నవి. ఆ పరబ్రహ్మమునకు అనంత పాదములున్నవి. దీని భావమేమి? ఈ ప్రపంచములోని సకల జీవుల శిరస్సులున్నూ ఆ పరబ్రహ్మము యొక్క శిరస్సులే! ఈ ప్రపంచములోని సకలజీవుల నేత్రములు ఆ పరబ్రహ్మము యొక్క నేత్రములే! ఈ ప్రపంచములోని సకల జీవుల పాదములు ఆ పరబ్రహ్మము యొక్క పాదములే! ఇట్లే ఇతర ఇంద్రియములన్నింటికి అన్వయించుకొనవలయును. ఇక నీవున్నూ, నేనున్నూ ఆ పరబ్రహ్మము యొక్క పరిధిని దాటియున్నామా? లేదు; అది అసంభవము. కావున నిజమునకు ప్రపంచమునకు గాని, ప్రపంచములోని జీవులకు గాని సత్తాయే లేదు. "యత్సత్యేన జగత్సత్యం" అనగా:– ఈ పరబ్రహ్మము సత్యమైన సత్తా గలదగుటచేతనే ఈ ప్రపంచమునకు సత్యమైన సత్తా ఏర్పడుచున్నది. ఈ ప్రపంచములోని జీవులందఱి నేత్రములన్నింటిని ఒక రాశిగా పోయగలుగుదుమేని, అది దేవుని యొక్క నేత్రమగును. కాదు, కాదు, అదియును సరికాదు. కారణమేమి? ఈ నేత్రములన్నింటి మధ్య ఇసుమంతయైన సందుగాని, భేదముగాని ఉండరాదు. అప్పుడది దేవుని నేత్రమగును. ఐతే దేవుని శిరస్సు వేఱు, నేత్రము వేఱా? వేఱు కానే కాదు. దేవుడు నిర్గుణుడు. కాబట్టి శిరస్సే నేత్రము, నేత్రమే శిరస్సని చెప్పవలసి యున్నది. ఇక దేవునికి శిరస్సు వేఱు, నేత్రము వేఱు, పాదములు వేఱుగా నున్నవా? లేవు. దేవునికి శిరస్సుగాని, నేత్రములుగాని, పాదములుగాని వేఱువేఱుగా లేవు. ఈ యాలోచన మనలను "అద్వైత సిద్ధి"కి గొంపోవును. కండ్లు, చెవులు, ముక్కు, నోరు, చర్మము ఇత్యాది ఇంద్రియములుకల మనకీ అద్వైత వాక్యములు రుచింపవు. ఐనను మూలమొక్కటే! శాఖలు వేర్వేఱను మాట నిత్యసత్యము. శ్రీమద్భగవద్గీత "అద్వైతామృత వర్షిణి" యని వర్ణింపబడినది. గీతాసారమును గ్రహించినవారికి "అద్వైత సిద్ధి" అమృతపానము వలె అనుభవగోచరమగును. నిజమునకీ "అద్వైత సిద్ధి" భవరోగమునకు దివ్యమైన ఔషధము వంటిది. ఈ విషయము శ్రవణ, మనన, నిదిధ్యాసలచే తెలియబడును.

దేవుని నేత్రముతో చూచువానికీ ప్రపంచములో దుఃఖలేశమణు మాత్రమైనను ఉండదు. దేవుని నేత్రము సర్వత్ర తన్ను తానే చూచుచుండును. దేవుని నేత్రములకు అన్య పదార్థము గోచరము కాకుండును. దేవుని నేత్రమునకు హిందువులు వేఱు, క్రైస్తవులు వేఱు, మహమ్మదీయులు వేఱు, బౌద్ధులు వేఱు, జైనులు వేఱు, ఫారశీకులు వేఱుగా గోచరింపకుండును. దేవుని నేత్రమునకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది వర్ణములు కానరావు. ఇంత ఏల? దేవుని నేత్రమునకు స్త్రీ–పురుష భేదము కూడా గోచరింపదు. కారణమేమి? దేవుని ఉనికికి తప్ప, అన్య వస్తువు యొక్క ఉనికికి తావు లేదు. ఐతే, ఈ ప్రపంచములో నానా పదార్థములు కానబడుటకు కారణము మాయ. ఈ మాయ యొక్క పరిధి యందున్నంతవరకు మనము సాంఘిక నియమములకు కట్టుబడియుండక తప్పదు. ఈ ప్రపంచము నందున్నంతవరకు నీతినియమములను పాటింపకుండుట అవివేకము. భేదభావమున్నంతవరకు జీవితాచరణము సాంఘిక నియమముల ననుసరించి

ఉండవలయును. దేవుని నేత్రముతో చూచువాడు జీవన్ముక్తుడుగా పరిగణింపబడును. అప్పుడా జీవన్ముక్తుని మనస్సు అమనస్కమగును. అనగా:- ఆతని మనస్సు దైవభావమునందు కరిగిపోవును. కావున అట్టివానికి విషయలోలత యుండదు. విషయాసక్తి యుండదు. విషయవాంఛ యుండదు. దేవుని నేత్రముతో చూచువారీ ప్రపంచమునందే కోటికొక్కరో ఉందురు. అట్టివారు "అపాణిపాదో జననోగ్రహీతా, పశ్యత్య చక్షుః స శ్రుణోత్యకర్ణః" అనెడి శ్రుతి వాక్యమునకనుగుణముగా జీవించుచుందురు. వారు పాదములు లేకనే నడుచుచుందురు. చేతులు లేకనే తీసుకొనుచుందురు. నేత్రములు లేకనే చూచుచుందురు. చెవులు లేకనే వినుచుందురు. అట్టి వారి అస్తిత్వముచే ఈ ప్రపంచమంతయు పునీతమగు చుండును. అట్టివారి అస్థిత్వము ఈ ప్రపంచములోని సాధకులకు, భక్తులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు ఆదర్శప్రాయమైయుండును. దేవుని నేత్రముచే చూచుట యనగా:- "దివ్య చక్షువు"ను కలిగియుండుట. శ్రీకృష్ణభగవానుడు అర్జునునికి "దివ్య చక్షువు" నొసంగి, తన విశ్వరూపమును దర్శింపజేసెను. ఈ దివ్యచక్షువు నార్జించుటకై మనమందఱము దివ్య పురుషులనాశ్రయింపవలసియున్నది. త్రిగుణముల నతిక్రమించినప్పుడు మనకీ దేవుని నేత్రము లభించును. అప్పుడు ప్రపంచాతీతుడైన పరమాత్మని మనము దర్శింపగలుగుదుము. ఈ పరమాత్మ ప్రపంచమునందేగాక, ప్రపంచమునకతీతుడై కూడా యున్నాడు. అట్టి పరమాత్మ కేవలము దేవుని నేత్రముచే చూడబడును. బ్రాహ్మీస్థితి నొందిన వారికిట్టి దర్శనము లభించును. తద్వారా బ్రహ్మ నిర్వాణము పొందబడును.

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', మార్చి/ఏప్రియల్, 2012 సంచిక నుండి)

# 18. జ్ఞానము - విజ్ఞానము

సామాన్య విషయములను తెలిసికొనుట "జ్ఞానమ"నియు, విశేష విషయములను తెలిసికొనుట "విజ్ఞానమ"నియు చెప్పబడును. ఉదాహరణమునకు "ఇది కుండ, ఇది గొలుసు, ఇది వస్త్రము" అని తెలిసికొనుట జ్ఞానము. ఇక "ఈ కుండను మట్టితో కుమ్మరివాడు చేసినాడనియు, ఈ గొలుసును బంగారముతో కంసాలివాడు చేసినాడనియు, ఈ వస్త్రమును సాలెవాడు దారముతో నేసినాడ"నియును తెలిసికొనుట విజ్ఞానము. ఇవి ప్రపంచములోని విషయములు. ఐతే ఈ ప్రపంచమనెడి ఆశ్చర్యకరమైన కుండను తయారుచేసినదెవరు? ఈ ప్రపంచములోని జనన-మరణములనెడి గొలుసును తయారుచేసినదెవరు? ఈ ప్రపంచమునకతీతమైన సూర్య-చంద్ర-నక్షత్రాది సమన్వితమైన ఆకాశమనెడి వస్త్రమును నేసినవారెవరు? అనునది విశేష ప్రశ్న. దీనికి జవాబు విజ్ఞానముగా పరిణమించును. భౌతిక శాస్త్రవేత్తలు, రసాయనిక శాస్త్రవేత్తలు, జీవ శాస్త్రవేత్తలు విశేష జ్ఞానము కలవారని చెప్పవచ్చును. కాని ఈ భవబంధమును ఛేదించునట్టి మహానుభావులతో పోల్చినప్పుడు, వీరి జ్ఞానము సామాన్య జ్ఞానముగా పరిణమించును. ఒక చిన్న బాలుడు అగ్నిని చూచి, ఆశ్చర్యపడి, దానినందుకొనుటకు ప్రయత్నించును. కారణమేమి? ఆ యగ్ని కాల్చుననెడి విశేషజ్ఞానమా బాలునికి లేదు. ఫలానా రోజు సూర్యగ్రహణము కలుగును. ఫలానా రోజు చంద్రగ్రహణము కలుగునని తెలిసికొనుట సామాన్యజ్ఞానము. ఇక ఈ సూర్య-చంద్ర గ్రహణము లేకారణముచే కలుగుచున్నవని తెలిసికొనుట విశేష జ్ఞానము. జీవరాసులన్నియును పుట్టుచున్నవి, గిట్టు చున్నవని తెలిసికొనుట సామాన్యజ్ఞానము. కాని ఈ జీవరాసులేల పుట్టు చున్నవి? ఏల మరణించుచున్నవి? ఎక్కడి నుండి వచ్చుచున్నవి? ఎక్కడికి వెళ్ళుచున్నవి? అని తెలిసికొనుట విశేష జ్ఞానము.

ఇక మరొక విధముగా చెప్పవలయునేని "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే" అనెడి గీతావాక్యముననుసరించి కేవల జ్ఞానమును శుద్ధజ్ఞానముగా గ్రహింపవచ్చును. దీనిని "నిర్గుణ బ్రహ్మ జ్ఞానమ"నియు చెప్పవచ్చును. ఇక విశేష గుణములతో కూడిన జ్ఞానము "విజ్ఞానమ"ని చెప్పబడును. శుద్ధమైన నేయిని "నేయి"యని చెప్పినచో చాలును. ఇది "శుద్ధమైన నేయి" అని చెప్పనవసరము లేదు. కల్తీ నేయిని అమ్మువారే "ఇది శుద్ధమైన నేయి" అని చెప్పుచుందురు. అదే విధముగా శుద్ధమైన జ్ఞానమును "జ్ఞానమ"ని చెప్పినచో చాలును. "విజ్ఞానమ"ని చెప్పినప్పుడు త్రిగుణములతో కూడిన కల్తీ జ్ఞానమగును. ఇది సగుణ బ్రహ్మజ్ఞానమును సూచించును. ''శుద్ధ బ్రహ్మ పరాత్పర రామ్'' అనగా:-పరాత్పరుడైన శ్రీరాముడు శుద్ధమైన పరబ్రహ్మ స్వరూపుడు. కాని సీతయనెడి మాయను పెండ్లాడినప్పుడాతడు "మాయా విశిష్ట బ్రహ్మ"మనబడును. ఈ ప్రపంచమునకు మూలకారణమేమి? యని తెలిసికొనుటకై మనము ఒక భూమికనుండి మరొక భూమికకేగవలసి యుండును. ఇవి మానవుని సాధనలోని సోపానములు. నిమ్నభూమికనుండి పరమోన్నత భూమికకేగునట్టి సోపానములన్నియును విశేషణములతో కూడి యుండుటచే వీటన్నింటి జ్ఞానము "విజ్ఞానమ"ని చెప్పబడును. ఈ వైజ్ఞానిక సోపానములన్నింటిని దాటినప్పుడు పరిశుద్ధమైన "జ్ఞానభూమిక" పొందబడును. కావుననే

పరబ్రహ్మము “సత్యం–జ్ఞానమనంతం బ్రహ్మ” అని వర్ణింపబడినది. సత్యమే జ్ఞానము – జ్ఞానమే అనంతము – అనంతమే బ్రహ్మమని దీని భావము. సత్యమైన పదార్థము ఏ దేశమందును, ఏ కాలమందును, ఏ కారణము చేతనైనను నశింపదు. ఇట్టి జ్ఞానమును పొందినప్పుడు ఇంకను తెలిసికొనవలసిన మరొక పదార్థము శేషించియుండదు. అనంతమైన పదార్థము తెలియబడినప్పుడు అంతముగల పదార్థము లన్నియును తెలియబడును. కారణమేమి? అంతముగల పదార్థము లన్నియును అనంతమైన పదార్థమునందిమిడియుండును. సత్యమైన, జ్ఞాన స్వరూపమైన, అనంతమైన బ్రహ్మమును తెలిసికొన్నవాడు బ్రహ్మజ్ఞాని, లేక ఆత్మజ్ఞానియని చెప్పబడును. బ్రహ్మజ్ఞాని పరిశుద్ధ జ్ఞానస్వరూపుడై భాసించును. “జ్ఞానము గొప్పదా? లేక విజ్ఞానము గొప్పదా?”యను ప్రశ్న “వేదాంత శాస్త్రము గొప్పదా? లేక విజ్ఞానశాస్త్రము గొప్పదా?”యను ప్రశ్న వంటిది. వేదాంత శాస్త్రమునందు విజ్ఞానశాస్త్రములన్నియును ఇమిడి యుండును. అదే విధముగా కేవల జ్ఞానమునందు విశేషజ్ఞానము లన్నియును ఇమిడియుండును. ఇది అతి చిన్నని మఱ్ఱిబీజమునందు అత్యంత విశాలమైన మఱ్ఱివృక్షము ఇమిడియుండుట వంటిది. కేవల జ్ఞానమనెడి బీజమునందు విజ్ఞానశాస్త్రములనెడి శాఖోపశాఖలు ఇమిడియుండును. కావుననే శ్రీకృష్ణభగవానుడు శ్రీమద్భగవద్గీతలోని సప్తమాధ్యాయమునందు జ్ఞాన–విజ్ఞాన ద్వయమును అర్జునునికుపదేశించెను. జ్ఞానము పరోక్షజ్ఞానమనియు, విజ్ఞానము అపరోక్షజ్ఞానమనియును భగవానుడు తెలిపెను. పరోక్షజ్ఞానము ఉపనిషాది శాస్త్రాధ్యయనము ద్వారా లభించును. ఇక అపరోక్షజ్ఞానము గురూపదిష్టుడై నిజమైన సాధనయొనర్చినట్టి ముముక్షువునకు లభించును. సద్యోజాతుడైన బాలుడు వృద్ధుడైన తరువాత భిన్నమైన వ్యక్తి కాజాలడు. అదే విధముగా ఉపనిషదధ్యయనము ద్వారా పొందబడిన పరోక్షజ్ఞానము ఆత్మసాక్షాత్కార మనబడు అపరోక్షమైన విజ్ఞానమునకు భిన్నమైనది కాజాలదు. విశ్వజ్ఞానమే విశ్వేశ్వర జ్ఞానము. విశ్వేశ్వర జ్ఞానమే విశ్వజ్ఞానమని చెప్పవలసియున్నది. ఏ జ్ఞానమైనను మరొక విషయము తెలిసికొనుటకు మిగిలియున్నప్పుడా జ్ఞానము పూర్ణజ్ఞానమనబడజాలదు. వేదాంతశాస్త్రమునందు తర్క వితర్కములకు తావు లేదు. “వేదము” అనగా:– తెలిసికొనదగినది అని అర్థము. “వేదాంతము” అనగా:– పూర్ణముగా తెలిసికొనబడినదని అర్థము. కావున పూర్ణజ్ఞానము లేనివారే వెలితికుండవలె వదరుచు, తర్క వితర్కముల నొనర్చుచుందురు. నిజమైన సాధకుడు పూర్ణజ్ఞానము నార్జించుటకై బ్రహ్మనిష్ఠుడును, అనుభవ జ్ఞానియునగు గురుదేవుని దరిచేరి తన జీవిత లక్ష్యమగు మోక్షమును సాధించు కొనును. ప్రాపంచిక మనుజుడు ధనలక్ష్మి నాకాంక్షించి, జనన మరణ సాగరము నందు మునిగిపోవును. ఇక ముముక్షువు మోక్షలక్ష్మి నాకాంక్షించి, అక్షయ సుఖముననుభవించి భవసాగరమును దాటును. విశేష జ్ఞానముకల వైజ్ఞానికుడు వివిదిష సన్న్యాసి వంటివాడు. శుద్ధజ్ఞాని విద్వత్సన్న్యాసి వంటి వాడు. చివరికి ఇరువురును ఏకైక మోక్షధామము నందుకొందురు.

**(సేకరణ:** ‘శ్రీశివానందవాణి’, మే/జూన్, 2012 సంచిక నుండి)

# 19. అన్ని వస్తువులు అన్ని స్థలములలోను, అన్ని వేళలలోను ఉన్నవి

పైవాక్యము పాఠకులకొక పిచ్చివాక్యమువలెను, వెఱ్ఱివాక్యమువలెను తోచక మానదు. కాని కొంచము లోతుగాను, దీర్ఘముగాను ఆలోచించినచో ఆ వాక్యములోని పరమసత్యము ప్రస్ఫుటమగును. ప్రపంచములోని పదార్థము లెచ్చటినుండి వచ్చినవి? పరమాత్మనుండి వచ్చినవి. ఈ పదార్థము లన్నియును దేనియందు ఉనికిని కలిగియున్నవి? దేవునియందునికిని కలిగియున్నవి. ఈ పదార్థములన్నియును నశించిన తరువాత ఎచ్చటికి వెళ్ళుచున్నవి? పరమాత్మలోనికి వెళ్ళుచున్నవి. కావున ఏ పదార్థమెచ్చటయున్నను, ఆ పరమాత్మను తప్పించుకొనజాలదు. భూత కాలములోని పదార్థములైతేనేమి? వర్తమానకాలములోని పదార్థములైతేనేమి? భవిష్యత్కాల వస్తువులైతేనేమి? అన్నియును ఆ పరమాత్మయందే అస్తిత్వమును కలిగియుండును. ఐతే ఒక పదార్థము మరియొక పదార్థమునకు భిన్నముగా ఏల కానబడుచున్నది? దీనికి కారణము అజ్ఞానము. అనగా:- నిజమైన తత్త్వము బోధపడకుండుట. నిజమైన తత్త్వము మనకేల బోధపడుటలేదు? ఈ దేహము, మనస్సు, బుద్ధియనెడి ఆవరణల కారణముచే బోధపడుట లేదు. మన బుద్ధిని మన మెంతకెంతకు శుద్ధమొనర్చుచుందుమో, అంతకంతకు మనకు నిజమైన తత్త్వము బోధ పడుచుండును. ఇక ఈ బుద్ధిని శుద్ధ మొనర్చుటెట్లు? మనకంటె ఎక్కువగా బుద్ధి పరిశుద్ధమైనవారినాశ్రయించి, వారికి శుశ్రూష యొనర్చి, వారియందు అనన్య విశ్వాసమును కలిగియుండి, వారి బోధనలను శ్రవణమొనర్చి, మననమొనర్చి, నిదిధ్యాసనల నొనర్చినప్పుడు మన బుద్ధి పరిశుద్ధమగును. అహంకార నాశముచే మన బుద్ధి పరిశుద్ధమగును. ఏమీ తెలియకున్నను, నాకే అన్నీ తెలుసుననుకొనుట అహంకారము యొక్క లక్షణము. అహంకారము నశించినప్పుడు అన్నియును తెలియబడును.

మన మనస్సు ధూళిధూసరితమైయున్న ఒక దర్పణము వంటిది. ఈ ధూళిని గురుశుశ్రూషయనెడి వస్త్రముచే దులిపివేయవలయును. నిరహంకారమనెడి సబ్బుచేతను, గురుభక్తియనెడి జలముచేతను కడిగివేయవలయును. అప్పుడీ దర్పణము నందు ఆత్మ ప్రకాశము తేజస్వంతమై శోభించును. నీవు-నేననెడి అడ్డగోడలు పగులగొట్టబడును. ఒకనాటి పాప మరొక రోజు తల్లియగును. ఈ మాయామయ జగత్తునందు ఈ జన్మలోని తల్లిని మరొక జన్మలో తనకు పాపగా చేసికొనజాలును. కర్మసిద్ధాంతము ననుసరించి ఏ స్థలములో, ఏ వేళలో ఏమి జరిగినను మనమాశ్చర్య పడవలసిన అవసరము లేదు. ఈ జన్మలో తన భార్యను పీడించినవాడు మరొక జన్మలో తన భార్యకు భార్యయై పీడింపబడును. ఈ జన్మలో తన తండ్రిని నిరాదరించినవాడు, మరొక జన్మలో తన తండ్రికి తండ్రియై తన కుమారునిచే నిరాదరింపబడును. ఈ జన్మలో తన పొరుగింటివాని ధనము

నపహరించినచో, మరొక జన్మలో ఆ పొరిగింటివాడు తన ధనము నపహరించును. ఇట్లు ప్రపంచమంతయు పరస్పర సంబంధమును కలిగియున్నది. ఈ దేహము పంచభూతములచే నిర్మింపబడినది. అదే విధముగా ఈ ప్రపంచమంతయు పంచభూతములచే నిర్మింపబడినది. అంతే కాదు, ఈ దేహములోను, ప్రపంచములోను పరమేశ్వరుడు ప్రవేశించియున్నాడు. అట్లు కాకున్నచో ఈ దేహమొక అస్తిపంజరము వలె గోచరించియుండెడిది. ఈ ప్రపంచమొక కదలికలేని అతిపెద్ద భవనమువలె గోచరించియుండెడిది.

ఈ ప్రపంచముతో నాకేమీ సంబంధము లేదనుకొనువాడు అజ్ఞాని. అదే విధముగా ఈ ప్రపంచముతో నాకు సంబంధమున్నదనుకొనువాడు కూడా అజ్ఞానియే! ఐతే ఎవడు సుజ్ఞాని? ఈ ప్రపంచములోని ప్రతి జీవియు సత్యమైన, నిత్యమైన, అమరమైన, అజరమైన వస్తువు నన్వేషించుచు, నిరంతరము తెలిసియో-తెలియకయో అహర్నిశము ప్రయత్నించుటకే తనకీ జీవితము లభించినదని తెలిసికొనువాడే! సుజ్ఞాని. ఒక వ్యక్తి అమెరికా నుండి ఫోన్ చేసినచో, ఋషీకేశ్‌లోనున్న వ్యక్తి ఆ మాటలను వినగలుగును. మనకు ప్రపంచముతో సంబంధము లేనిచో అది ఎట్లు సాధ్యమగును? ఆకాశ మండలమునందెంతో దూరమునందున్న సూర్యకిరణములీ భూమిపై ప్రసరించుచుండును. మనకు ప్రపంచముతో సంబంధము లేనిచో ఇది ఎట్లు సాధ్యమగును? ఇక ప్రపంచముతో మనకు సంబంధమున్నదనుకొన్నచో అమెరికాలోనున్న ఆ వ్యక్తిగాని, ఋషీకేశ్ నందున్న ఈ వ్యక్తిగాని ఒక రోజీ ప్రపంచము నుండి అదృశ్యుడగును. కావున పరస్పర సంబంధము లేదనియే చెప్పవలసియున్నది. ఈ కారణముచే మనమెల్లప్పుడు ఆ జగన్నాటక సూత్రధారుని స్మరణయందుంచు కొనవలయును.

అన్ని వస్తువులు అన్ని వేళలలోను, అన్ని స్థలములలోను ఉన్నవని అనుకొనునట్టివాడు అద్వైత సిద్ధాంతము నాకళించుకొనగలుగును. అట్టి వానికి రాగ-ద్వేషములుండవు. అట్టివాడు సకల చరాచర జీవరాశులను ప్రేమింప గలుగును. అట్టివాడు చీమలోను, దోమలోను, ఏనుగులోను, సింహములోను, నక్కలోను, కుక్కలోను, పాములోను, తేలులోను, దరిద్రునిలోను, ధనవంతునిలోను, స్త్రీలోను, పురుషునిలోను ఆ పరమాత్మను దర్శించు చుండును. అట్టివానికి చేటు చేకూరినచో, అది తాను ఇతరులకు చేసిన చేటుయొక్క ఫలితముగా భావించును. తనకు కష్టము కలిగినప్పుడా కష్టమును తానితరులను కష్టపెట్టినదాని ఫలితముగా తలపోయును. తనకు నష్టము కలిగినచో, అది ఇతరులను తాను నష్టపెట్టినదాని ఫలితమని అర్థమొనర్చు కొనును. ఈ ప్రకారముగా ఆ సర్వేశ్వరుడు సర్వత్ర తన ప్రేమ ప్రవాహమును ప్రవహింపజేయుచుండును. తనలో ఇతరులను, ఇతరులలో తనను దర్శింపగలుగువాడు పరమ జ్ఞానియని చెప్పబడును. కేవలము శారీరక భేదముచే ఇతరులు మనకు కాబడుచుందురు. శరీరభావనచే ద్వంద్వభావమేర్పడును. ద్వంద్వభావనచే ఏకైక విశ్వభావము విధ్వంసమగును. జీవన్ముక్తుడు అన్ని వస్తువులను

అన్ని వేళలలోను, అన్ని స్థలములలోను దర్శించుచుండును. భగవంతుడు కాలాతీతుడు. ఆతనికి భూత–భవిష్యద్వర్తమానములుండవు. ఇవి మానవ సృష్టి. అన్ని స్థలములు నావే అనుకొన్నవాడు జ్ఞాని. అట్టివాడు తన ఇంటియందుండియు ప్రపంచమంతటిని తన గృహముగా భావించుచుండును. బ్రహ్మమును గుర్తెఱింగినవాడు బ్రహ్మానందము నొందును. ఈనాటి విషయ సుఖము మరొకనాడు విషప్రాయమగును. కించజ్ఞత కలవాడు విషయ సుఖముల ననుభవించుచుందురు. సర్వజ్ఞత కలవారు కేవలము బ్రహ్మానందము నపేక్షింతురు. కావున మనమందరమున్నూ శారీరక సుఖము నుపేక్షించి, ఆత్మసుఖము నపేక్షింపవలయును. నాశవంతమైన ఈ శరీరమును ఆత్మ జ్ఞానాగ్నియందు కరిగింపజేయవలయును. అనగా:– ఈ శరీరమును కేవలము ఆత్మ సాక్షాత్కారమునకు సాధనముగా వినియోగింప వలయును. ఇది సాధ్యము కావలయునన్నచో ప్రతి సాధకుడు, ప్రతి భక్తుడు, ప్రతి జిజ్ఞాసువు, ప్రతి ముముక్షువు అన్ని వస్తువులను అన్ని వేళలలోను, అన్ని స్థలములలోను దర్శించుట అవశ్యకమగును. ఈ వాక్యమును జీవితము నందనుభూతికి తెచ్చుకొన్నప్పుడు పరమానంద ప్రాప్తి అరచేతిలోని అరటి పండువంటి దగుననుటలో సందేహము లేదు.

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జూలై/ఆగష్టు, 2012 సంచిక నుండి)

# 20. అప్పుల కుప్ప

మానవులమైనయున్న మనమందఱమున్నూ అప్పుల కుప్పలమై యున్నామని చెప్పుటలో తప్పులేదు. కారణమేమి? మన తల్లిదండ్రుల శుక్ల శోణితములు మన తల్లి గర్భమునందైక్యమైనప్పుడు మనకు అస్తిత్వమేర్పడినది. కావున మనము మన తల్లిదండ్రులకు ఋణగ్రస్తులమై యున్నాము. తర్వాత మన తల్లి తన గర్భమునందు నవమాసములు మోసి, ఎన్నో రకములైన కష్టముల కోర్చి మనకు జన్మయొసంగినది. కావున ఈ శరీరము నొసంగిన మన తల్లికి అధికముగా ఋణగ్రస్తులమై యున్నాము. ఇక జన్మించిన తర్వాత మనము భూమిపై అంబాడుట, కూర్చుండుట, నడచుట, పరుగెత్తుట, ఆటలాడుటను చేసితిమి. నేటికిన్నీ మనము భూదేవిని వదలి క్షణకాలమున్నూ నిలువజాలకున్నాము. ఒక వేళ విమానమెక్కినను భూమినుండి లేచి భూమిపై దిగవలసినదే! కావున భూదేవికి మనము ఋణమును తీర్చుకొనవలసియున్నది. బాల్యావస్థయందు మన తల్లి తన స్తన్యమునిచ్చి మనలను పోషించెను. తర్వాత ఆవు పాలతో మనము పోషించబడితిమి. నేటికిన్నీ పాలు, పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి వంటి పదార్థములచే మనము పోషింప బడుచున్నాము. కావున గోమాతకు మనము ఋణము తీర్చుకొనవలసియున్నది. గోమాతను హింసించుట, లేక కసాయి వానికమ్ముట నరకమునకు హేతువగును. భూమాత మనకు బియ్యము, గోధుమలు, పప్పుదినుసులు, కూరగాయలనొసంగుచున్నది. కావున భూమాతకే కాకుండా కర్షకునికి కూడా మనము ఋణగ్రస్తులమై యున్నాము. ఇది ఇట్లుండగా నూతులు, చెఱువులు, నదులు, సెలయేళ్ళు లేకున్నచో మనము మన దాహమును తీర్చుకొనజాలము. కావున జలదేవతకు మనము ఋణము తీర్చుకొనవలసియున్నది. సూర్య భగవానుడు అగ్నిదేవతకు ప్రతీక. అతడు లేనిదే మనకు జీవనము లేదు. కావున ఉదయము పడకనుండి లేచిన వెంటనే భూదేవికి, సూర్యదేవునికి తప్పక నమస్కరించి వారి ఋణమును కొంతవరకైనా తీర్చుకొనవలయును. "అహం వైశ్వానరో భూత్వా" అనెడి గీతా శ్లోకమునుచ్చరించిన తర్వాత ఆహార పానీయములను సేవించి, మన ఉదరమునందున్న జఠరాగ్ని యొక్క ఋణమును మనము తీర్చుకొనవలసియున్నది. గీతలోని 15వ అధ్యాయములోని 14వ శ్లోకమే పై తెలుపబడిన శ్లోకము.

ఇక వాయుదేవత లేకున్నచో మనకు ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగజాలవు. ప్రాణవాయువు, అపానవాయువు, ఉదానవాయువు, వ్యానవాయువు, సమాన వాయువులచే మన దేహము పోషింపబడుచున్నది. కావున మనము భుజించుటకు ముందు "ప్రాణాయ స్వాహా, అపాన స్వాహా, ఉదానాయ స్వాహా, వ్యానాయ స్వాహా, సమానాయ స్వాహా" అని ఉచ్చరించి, వాయు దేవత యొక్క ఋణము తీర్చుకొనవలసియున్నది. ఇక ఆకాశము లేనిదే మనకెవ్వరికిన్నీ అస్తిత్వము లేదు. ఆకాశము లేనిదే మనము మన చేతులను

కూడా పైకెత్తజాలము. హృదయాకాశము లేనిదే మనకస్తిత్వము లేదు. "ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి" అన్నట్లు మన హృదయ క్షేత్రమునందే ఈశ్వరుడు విరాజమానుడై యున్నాడు. కావున హృదయేశ్వరుని నిరంతరము మనము ప్రార్థించుచుండవలయును. ఈ ప్రకారముగా ఆకాశము యొక్క ఋణమును మనము తీర్చుకొనవచ్చును. మనలను మనము మరచి యుండుటయే! అజ్ఞానము. అనగా:- మన హృదయమునందున్న ఈశ్వరుని మరచియుండుటయే! అజ్ఞానమనబడును. సూర్యచంద్రులు మన నేత్రములకు శక్తి యొసంగుచున్న కారణముచే మన నేత్రములు చూడగలుగుచున్నవి. అశ్వినీదేవతలు మన నాసికాపుటముల యందుండి పని చేయుచున్న కారణముచే మనము మన ముక్కుతో వాసన చూడగలుగుచున్నాము. దిగ్దేవతలు మన చెవులలో పనిచేయుచున్న కారణముచే, మనము ఏ శబ్దమునైనను వినగలుగుచున్నాము. దేవేంద్రుడు మన హస్తములకు శక్తినొసంగుచున్న కారణముచే మనము మన చేతులతో పని చేయగలుగుచున్నాము. ఇట్లే మన దేహము నందున్న సకలేంద్రియములున్నూ ఆయా దేవతలు శక్తి సంచారము నొనర్చుచున్న కారణముచే పనులను చేయగలుగు చున్నవి. కావున మనమీ దేవతలందఱికిన్నీ ఋణగ్రస్తులమై యున్నాము. ఐతే ఈ దేవతలు కూడా తమకన్నా ఉన్నత స్థాయియందున్న దేవతలు శక్తి నొసంగుచున్న కారణముచే తమతమ పనులను నిర్వర్తింపగలుగుచున్నారు. శక్తులన్నింటికి కారణమైయున్న శక్తియే ""ఆదిశక్తి" లేక "పరాశక్తి"యని చెప్పబడును. ఈ పరాశక్తి పరమేశ్వరునకధీనమై యుండును. ఈ పరమేశ్వరుడు పరబ్రహ్మము యొక్క ఉనికి కారణముచే సకల కార్యముల నొనర్పజాలుచున్నాడు.

ఇతఃపూర్వము నుడువబడిన ఋణములన్నింటినుండి విమోచనము నొందుటకై మనవేమి చేయవలయును? అనుదినము, అనుక్షణము ఆయా దేవతలను స్మరించుచుండవలయును, చింతించుచుండవలయును, ధ్యానించుచుండవలయును. లేక సకల దేవతల కాధారముగా ఏ పరబ్రహ్మముకలదో, ఆ పరబ్రహ్మము నుపాసించుచుండ వలయును. ఆ పరబ్రహ్మమునుపాసించుటెట్లు? ఇది మిక్కిలి సులభమైన కార్యము. ఏల? ఆ పరబ్రహ్మము లేని స్థలమే లేదు. ఇక ఆ పరబ్రహ్మములేని కాలము కూడా లేదు. ఆ పరబ్రహ్మమును మనము మఱచియున్న కారణముచే, ఆ పరబ్రహ్మము మనకెంతో దూరముగా నున్నట్లు కానబడును. అదెట్లనగా:- గాఢనిద్రయందు ప్రపంచమే లేదు. మేల్కాంచిన వెంటనే మనకీ ప్రపంచము ప్రత్యక్షమగును. ఇక ఆ పరబ్రహ్మము భూత-భవిష్యద్వర్తమాన కాలములయందున్నది. కాని పరబ్రహ్మము గూర్చి మఱచిపోయి నప్పుడది మనకేకాలమునందున్నూ గోచరింపదు. అది ఎట్లనగా:- మరల గాఢనిద్రయే దీనికి తార్కాణము. గాఢనిద్రయందు భూత భవిష్యద్వర్తమానములు గోచరింపవు. అదే ప్రకారముగా అజ్ఞానమనెడి సుషుప్తియందు సర్వకాలముల యందున్న సర్వేశ్వరుడు గోచరింపజాలకుండును. ఈ యజ్ఞానము నశించుటకై మనము మన అప్పులన్నింటిని

నిశ్శేషముగా తీర్చుకొనవలసియుండును. అప్పులకుప్ప యున్నంతవరకు మనకు మనశ్శాంతి యుండదు. సంతృప్తి యుండదు. సంతోషముండదు. ఐతే ఈ యప్పులకుప్ప నుండి తప్పించుకొనుటకై మనమేమి చేయవలసియుండును? అనుదినము, అనునిమిషము, అనుక్షణము నందు అణువణువునందు, కణకణమునందు వ్యాపించియున్న ఆ పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందవలసియుండును. ఇది ఎట్లు సాధ్యమగును? దీనికై నిరంతర ప్రయత్నమవసరమైయున్నది. అహర్నిశ చింతన ఆవశ్యకమైయున్నది. విషయచింతనచే అప్పులకుప్ప పెరుగు చుండును. కాని ఈ విషయము లన్నింటికాధారమైయున్న ఆ విశ్వేశ్వరుని చింతనచే అప్పులకుప్ప తరుగుచుండును. కావున ఆధ్యాత్మిక సాధకులమైయున్న మనమందఱమున్నూ నిరంతర బ్రహ్మ నిష్ఠాపరులమై అప్పులకుప్ప తరుగునంతవరకు ప్రయత్నశీలురమై అక్షయ సుఖము నొసంగునట్టి మోక్ష లక్ష్మిచే వరింపబడి మన జీవితములను సార్థకమొనర్చుకొందుము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', సెప్టెంబరు/అక్టోబరు, 2012 సంచిక నుండి)

# 21. భావ శుద్ధియే! జ్ఞాన సిద్ధి

నిజమైన భగవద్భక్తుని భావము శుద్ధముగా నుండును. కారణమేమి? ఈ ప్రపంచముయొక్క సారము భగవంతుడే కనుక. ప్రపంచము లేకున్నను, భగవంతునికి ఉనికి యుండును. కాని భగవంతుడు లేకున్నచో, ప్రపంచమునకు ఉనికి యుండదు. భగవద్భక్తుడు సత్యమైన వస్తువును తెలిసికొన్నవాడైయుండును. సత్యమైన వస్తువేది? సర్వకాల సర్వావస్థలలో ఉనికి కలిగియుండునది సత్యమైన వస్తువు. ప్రళయకాలములో ప్రపంచమునకు ఉనికి యుండదు. సృష్టి-స్థితి-ప్రళయములకు కారణము భగవంతుడగుటచే, భగవంతునికి భూత భవిష్యద్వర్తమాన కాలము లన్నింటియందును ఉనికి యుండును. భగవంతుని యొక్క అస్తిత్వము మనస్సునందు దృఢపడినట్టివాని భావము శుద్ధమై యుండును. కేవలము ప్రపంచము యొక్క అస్తిత్వమునందు మాత్రమే విశ్వాసము కలిగియున్న మనుజుని భావము శుద్ధమైయుండునని చెప్పుటకు వీలులేదు. తన స్వంత ఉనికికి కారణము కూడా భగవంతుడే! ఈ విషయము తెలిసినవాని భావము శుద్ధమైయుండును. ఈ విషయము తెలియని వ్యక్తియొక్క భావము శుద్ధమై యుండునని నుడువుటకు వీలులేదు. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే" (గీత. 4-38) అనెడి గీతావాక్యానుసారముగా జ్ఞానమునకు మించిన పవిత్రమైన వస్తువు మఱొకటి లేదు. ప్రాపంచిక జ్ఞానము నిజమైన జ్ఞానమనబడదు. ఈ ప్రపంచ సృష్టికి కారణమైన పరమాత్మ జ్ఞానమే! నిజమైన జ్ఞానమనబడును. చంద్రలోకమునకేగుట కూడ నిజమైన జ్ఞానమును సూచింపదు. కారణమేమనగా:- చంద్రునికి కాంతి నొసంగుచున్న సూర్య లోకమునకేగుట మానవునికి అసంభవమైన కార్యము కదా!

నేనీ ప్రపంచమున కెచ్చటినుండి వచ్చితిని? ఈ ప్రపంచమునందు నేను చేయవలసిన కర్తవ్యమేమి? ఈ ప్రపంచమును వదలిన తరువాత నేనెచ్చటికి వెళ్ళుదును? అనెడి మూడు విషయములు స్పష్టముగా తెలిసినవాడు భావశుద్ధి కలవాడని చెప్పవచ్చును. "యద్భావం తద్భవతి" అనెడి వాక్యానుసారముగా మన భావమెట్లుండునో, మనమట్లే యగుదుము. భావశుద్ధి కలవాడు ఇతరుల మనస్సులలోని భావములను గుర్తెఱుంగ జాలును. కారణమేమి? భావశుద్ధి కలవాడు అందఱితో ఏకీభవించును. భావశుద్ధి కలవాని మనస్సు దర్పణమువలె పరిశుద్ధమైయుండును. అతని మనోమాలిన్యము కడిగివేయబడును. మనోమాలిన్యము కలవాడు కేవలము ఈ ప్రపంచమే! సత్యమనుకొనును. మనోమాలిన్యము లేనివాడు కేవలము పరమాత్మయే! సత్యమనుకొనును. భావశుద్ధి కలవానికీప్రపంచములోని తళుకు బెళుకులు స్వప్నతుల్య వస్తువులై గోచరించును. భావము శుద్ధమైనప్పుడు జ్ఞానము సిద్ధించును. పరమాత్మను తెలిసికొన్న జ్ఞానికి ప్రాపంచిక జ్ఞానముకల వ్యక్తి అజ్ఞానిగా భాసించును. "యా నిశా సర్వభూతానాం తస్యాం జాగ్రతి సంయమీ । యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥" (గీత. 2-69) అనెడి భగవద్వచనానుసారముగా సకలజీవులకు ఏదైతే రాత్రియో దానిని మునీంద్రుడు పగలుగా మార్చివేయును. అనగా:- మేల్కొనియుండును. ఇక సకల జీవులకు ఏదైతే పగలో, దానిని మునీశ్వరుడు రాత్రిగా

మార్చివేయును. అనగా:– ఇంద్రియములనరికట్టును. ఇంతే కాదు. "యస్మిన్ స్థితేన దుఃఖేన గురుణాపి విచాల్యతే" అనెడి గీతాచార్యుని వాక్యానుసారముగా ఏ భూమికయందు మనుజునికి జ్ఞానసిద్ధి కలుగునో, ఆ భూమిక యందెంతటి గొప్ప దుఃఖము సంభవించినను, ఆ భూమిక నుండి ముని పుంగవుడు చలింపకుండును. కారణమేమి? ఆ స్థితియందాతడు పరమానందము ననుభవించుచుండును. కుక్కలు మొఱిగినప్పుడు ఏనుగులు భయపడవు. అదే ప్రకారముగా జ్ఞానసిద్ధిని బడసిన మహాపురుషుడు ప్రాపంచిక క్లేశములెంతటి ఘోరములై యున్నను, వాటిచే ఏమాత్రము చలింపక హిమాలయ పర్వతమువలె సుస్థిరుడై యుండును.

ఇక అంతతోగత్వా జ్ఞానసిద్ధి మోక్షప్రాప్తికి కారణమగును. మోక్షమనగా:– విడుదల. దేనినుండి విడుదల? దుఃఖపరంపరల నుండి విడుదల. లేక దుఃఖపరంపరలకు కారణమైన జనన–మరణములనుండి విడుదల. ఏలాటి మనుజుడైనను దుఃఖము ననుభవింపగోరడు. ఐనను, దుఃఖ నివృత్తికి కారణమైన మార్గముననుసరించుట లేదు. ప్రతి మనుజుడున్నూ పరమానందమును, లేక శాశ్వతానందము ననుభవింపగోరును. కాని పరమానంద ప్రాప్తికి కారణమైన మార్గమును చేపట్టుట లేదు. భావశుద్ధి లేకుండుటయే! దీనికి కారణము. కావున ఆధ్యాత్మిక సాధకులు, జిజ్ఞాసువులు, భక్తులు, ముముక్షువులందఱున్నూ భావశుద్ధిని కలిగియుండవలయును. భావశుద్ధిచే జ్ఞానము సిద్ధించును. జ్ఞాన సిద్ధిచే మోక్షము ప్రాప్తించును. భావశుద్ధిని కలిగియున్న మనుజునికి కీర్తి ప్రతిష్ఠలపై ఆకాంక్షయుండదు. కారణమేమి? కీర్తిప్రతిష్ఠలు కేవలమీ ప్రపంచమునకు సంబంధించియున్నవి. ఈ ప్రపంచము నందు కీర్తి ప్రతిష్ఠల నొందిన వాని పుణ్యము క్షీణించును. ఈ కారణముచే స్వర్గలోకము నందాతనికి స్థానము లభింపదు. స్వర్గలోకమునందు స్థానమును పొందుటకై మనుజుడు పుణ్యపుంజమనెడి మూల్యమును చెల్లింపవలసియుండును. నిష్కామ కర్మచే కేవలము భగవంతునికి మాత్రము ప్రీతిపాత్రుడైయున్న వానికి ఏ లోకమున కేగినను స్థానముండును. అట్టి వ్యక్తి భగవంతునికి దూత, లేక రాయబారి వంటివాడు. దీనికి ఉపమానముగా మనము శ్రీనారదమహర్షిని తీసుకొనవచ్చును. నారదుడెల్లప్పుడు భగవన్నామ గానామృతమును పాన మొనర్చుచుండును. ఈ కారణముచే అతడన్ని లోకములను సంచరించుచు, ఆయా లోకాధిపతులతో సంభాషింపగలుగునంతటి సామర్థ్యమును కూడా కలిగియున్నాడు. ఐనను ఏ క్షణమునందు భగవన్నామమును మఱచిపోవునో, ఆ క్షణము నందు "మాయ" యనెడి చీకటి ఆవరించును. కావుననే శ్రీసద్గురు శివానందస్వాములవారు "Remembering God is Life. Forgetting God is Death." అని పలికియున్నారు. అనగా:– "భగవంతుని స్మరించుటయే! జీవనము. భగవంతుని విస్మరించుటయే! మరణమ"ని భావము. మనమందఱమున్నూ ఈ విషయమును సర్వకాల సర్వావస్థలలో దృష్టియందుంచుకొని, భావశుద్ధి కలవారమై, జ్ఞానసిద్ధిని బడసినవారమై, మోక్షప్రాప్తికి పాత్రులమై శోభిల్లుదుము గాక! సర్వదుఃఖ నివృత్తి మఱియు పరమానందప్రాప్తియే! మోక్షమను విషయమును మరువకుందుము గాక! నారద మహర్షి వలె నిరంతరము నారయణ నామామృతమును గ్రోలుచు, ఇహలోక, పరలోక సుఖముల ననుభవించుచు, మన జీవితములను ధన్య మొనర్చుకొందుము గాక!

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', నవంబరు/డిశంబరు, 2012 సంచిక నుండి)

# 22. అశోకవనములో శోకించుటయా?

పై శీర్షికలోని "అశోకవనము" లంకలోని అశోకవనమనుకొనరాదు. ఈ ప్రపంచమంతా అశోకవనమే! ఏల? ఈ ప్రపంచమంతా పరమేశ్వరునిచే నిండియున్నందువలన. ఈ విశ్వమంతా అశోకవనమే! ఏల? ఈ విశ్వమంతా విశ్వేశ్వరునిచే నిండియున్నందువలన. అశోకవనమనగా:– శోకములేని పూదోటయని అర్థము. అశోకవనమనగానే రావణాసురుడపహరించిన సీతాదేవి కొంత కాలము వరకు వసించినట్టి లంకలోని అశోకవనము స్మరణకు రాక తప్పదు. నిజమునకది అశోకవనమే! అనగా:– శోకములేని వనమే! ఐతే అట్టి శోకములేని వనమునందు సీతాదేవి దుఃఖించుట, విలపించుట, శోకించుటకు గల కారణమేమి? పరమాత్మయైన శ్రీరామునినుండి దూరమగుటయే! దీనికిగల కారణమను విషయమందరికీన్నీ తెలిసినదే. మానవ జీవులమైనయున్న మనందరి పరిస్థితి కూడా ఇట్టిదే! మనందరమున్నూ పరమాత్మునికి దూరముగానున్న కారణముచే ఈ ప్రపంచమునందు రకరకములగు దుఃఖములను మనమనుభవించు చున్నాము. ఇక పరమాత్ముని నుండి మనము దూరమగుటకు కారణమెవ్వరు? మనమే కారణము. మరొకరు కారణము కాజాలరు. సీతాదేవి లక్ష్మణ రేఖను దాటిన కారణముచే రావణాసురుడు ఆమె నపహరించుటకు అవకాశము లభించెను. లక్ష్మణరేఖ యనగా:– ధర్మరేఖ. ధర్మమును తప్పినప్పుడు మనము పరమాత్మునికి దూరమగుదుము. అప్పుడు మాయ మనలను చేజిక్కించు కొనును. కావున మనుజుడు నిరంతరము ధర్మపరాయణుడై యుండవలయును. ఇక ధర్మమనగానేమి? ఈ విశ్వమంతటిని ధరించియున్న ఆ విశ్వేశ్వరుని మరువకుండా యుండుటయే! ధర్మమనబడును. ఆ పరమేశ్వరుని మరచి జీవించుట అధర్మజీవనమనబడును.

ధర్మాధర్మములు తోటి సోదరులవంటివి. అది ఎట్లనగా:– రావణాసురుడు ధర్మమును తప్పినవాడై సీతాదేవినపహరించెను. ఇక ఆతని సహోదరుడైన విభీషణుడు అధర్మకార్యము ఉచితము కాదని రావణాసురునికి హితబోధ చేసెను. కాని అహంకార నిర్భరుడైన రావణాసురుడాతని మాటను వినకుండుటయేగాక, తన రాజ్యమునుండి విభీషణుని బహిష్కరించెను. ఈ విధముగా విభీషణునికి శ్రీరామచంద్రుని శరణు పొందుటకు అవకాశము లభించెను. తదంతరము అధర్మమునకు పరాకాష్ఠయైన రావణాసురుడు శ్రీరామునిచే హతమొనర్పబడుటచే విభీషణుడు లంకారాజ్యమునకు స్వయముగా శ్రీరామునిచే పట్టాభిషిక్తుడు గావింపబడెను. కావున చివరకు ధర్మమే జయించునుగాని, అధర్మము జయింపదని భావము. "సత్యమేవ జయతే నాఽనృతమ్" అనునది భారతదేశ పతాకమగు ధర్మచక్రములోని వాక్యము. సత్యము, ధర్మము ఈ రెండున్నూ పర్యాయపదములు; లేక ధార్మిక జీవనము సత్యలోకమునకు దారితీయునని చెప్పవచ్చును.

శాశ్వత సత్యమైన ధర్మము నంటిపట్టుకొని యుండుటయే! మానవజీవిత కర్తవ్యము. భరతుడు సత్యసంధుడు మఱియు ధర్మపరాయణుడు. కావుననే అన్నయగు శ్రీరామునికి చెందవలసిన రాజ్యమునేలుటకు ఏమాత్రము అంగీకరింప కుండెను. తుట్టతదకు శ్రీరాముని ఆజ్ఞచే శ్రీరామచంద్రుని పాదుకలను రాజ్యసింహాసనమునందధిష్ఠింపజేసి, శ్రీరామునికి ప్రతినిధిగా తాను రాజ్య పాలనమొనర్చెను. శ్రీరాముడు 14 సంవత్సరముల తరువాత అరణ్యమునుండి తిరిగి అయోధ్యకు వచ్చి, భరతుని కలసికొన్నప్పుడు వారిద్దరిలో శ్రీరాముడెవరో, భరతుడెవరో ప్రజలు గుర్తింపజాలకుండిరి. భరతుడు శ్రీరామునితో తాదాత్మ్యమునొందుటయే! దీనికి గల కారణము.

ఆంజనేయస్వామి ఆచార్యుడు, లేక గురువు వంటివాడు. శ్రీరాముని సందేశమును అతడు అశోకవనములో శోకించుచున్న సీతాదేవి కందించి, ఆమె దుఃఖమును నివారించెను. ఆంజనేయస్వామి మహాసముద్రమును లంఘించి, లంకలో ప్రవేశింపగలిగెను. శ్రీరామనామ ప్రభావమే! దీనికిగల కారణము. "యత్రయత్ర రఘునాథ కీర్తనం, తత్ర తత్ర కృత మస్తకాంజలిమ్। భాష్పవారి పరిపూర్ణ లోచనం, మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥" అనగా:- 'ఎచ్చటెచ్చట శ్రీరాముని గుణగానము కీర్తింపబడుచుండునో, అచ్చటచ్చట ఆంజనేయస్వామి చేతులు మస్తకమునందుంచి నిలబడియుండును. మఱియు తన నేత్రములనుండి ఆనందభాష్పములను రాల్చుచుండును. రాక్షసులను సంహరించిన అటువంటి హనుమంతునికి నమస్కారమని భావము.' కావున అశోకవనమునందున్న మనమెవ్వరమును శోకించుట పాడికాదు. ఐనను మానవులమైన మనమే కాకుండా ప్రపంచములోని ప్రతిజీవియున్నూ శోక సంతప్తమగుచునే యున్నది. దీనికిగల కారణము భగవంతునికి దూరమగుటయే! యను విషయమును మనమర్థమెనర్చుకొనవలసియున్నది. నిజమునకు భగవంతుడు మనకేమాత్రము దూరముగా లేడు. "తద్దూరే-తద్వంతికే"యని ఉపనిషత్తు నుడువుచున్నది. భగవంతుని స్మరించిన వానికి పరమాత్ముడు తన హృదయమునందే కానబడును. ఇక భగవంతుని విస్మరించిన వానికాతడెచ్చటను కానబడడు. మీదుమిక్కిలి అహంకార రాక్షస విన్యాసముచే ఆతడు వితండ నృత్యమునొనర్చుచుండును. ఇట్లు తన జీవితమంతయు అధర్మకార్యముల నొనర్చుటకై వెచ్చించును. ఐనను దైవోపహతుడై తిరిగి ఆతడు ధార్మిక మార్గము నవలంబింపక తప్పదు. కావున మన మందరమున్నూ సీతాదేవికి వలె అశోకవనములో శోకింపకుందుము గాక! ఒకవేళ శోకింపవలసివచ్చినను నిరంతము, అహర్నిశము రామనామ స్మరణ చేయుచున్నచో శ్రీరాముడు తనకు నమ్మిన బంటైన ఆంజనేయస్వామిని మన వద్దకు పంపి, మన శోకమును నివారింపజేయును. అరణ్యవాసమున కేగుచున్న శ్రీరాముని లక్ష్మణుడు వెంబడించెను. అదే విధముగా మనము దివియందున్నను, భువియందున్నను భగవత్సాన్నిధ్యమును మరువకుండా యుండవలయును. ఇక భరతుడు శ్రీరామునికి ప్రతినిధిగా రాజ్యపాలన మొనర్చెను. మనమున్నూ ఏ కార్యము చేయుచున్నను,

రామకార్యమును నిర్వహించుచున్నామను భావముతో ఈ జీవితమును గడుపుచుండవలయును. ఇక విభీషణుడు దుష్టసహోదరుడైన రావణాసురుని పరిత్యజించి, శ్రీరాముని అండజేరి, ఆతని శరణుజొచ్చెను. మనమున్నూ అధర్మ సహితమగు దౌష్ట్యమెచ్చటున్నను ఆ చోటును పరిత్యజించి, ధర్మమార్గావలంబులగు సత్య సంధుల సహవాసము నొనర్చుచుండవలయును. ఇట్లు సీతాదేవికివలె భగవన్నామ స్మరణ చేయుచుగాని, లక్ష్మణునికి వలె భగవత్సాన్నిధ్యము ననుభవించుచుగాని, భరతునికి వలె రామకార్యమును నిర్వహించుచుగాని, ఆంజనేయుని వలె భగవంతుని సేవ చేయుచుగాని, లేక విభీషణుని వలె భగవంతుని శరణుపొందిగాని మనము మన జీవితములను ధన్యమొనర్చు కొనవలయును. అట్లొనర్చినచో అశోకవనములో శోకించుట కవకాశ ముండదు. "లోకం శోకహతం చ సమస్తం" అని శ్రీశంకరాచార్యులవారు నుడివిరి. అనగా:– 'లోకమంతయు శోక సంతప్తమై యున్నద'ని అర్థము. దీనికి కారణము మనము భగవద్విముఖులమగుటయే! యను విషయమును గుర్తెఱింగి, భగవద్ధర్మ పరాయణులమై, భగవదనుభూతినొంది, పరమ సుఖమును బడయుదుము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జనవరి/ఫిబ్రవరి, 2013 సంచిక నుండి)

# 23. నగ్నసత్యము

ఉడుపులుగాని, తొడుగులుగాని, పరదాలుగాని లేని పదార్థము నగ్నమని చెప్పబడును. ప్రస్తుతము నగ్నసత్యము విషయమై చర్చింపబడుచున్నది. నగ్నసత్యము మఱియు శుద్ధసత్యము ఈ రెండున్నూ పర్యాయపదములు. కల్తీలేని, లేక దాపరికములేని సత్యము శుద్ధసత్యమని చెప్పబడును. ఈ ప్రపంచమునందున్న మనయందెవ్వరున్నూ కల్తీలేని సత్యము కలవారము కామని నిరాఘాటముగా చెప్పవచ్చును. అదెట్లు? మన మందఱమున్నూ అసత్యమైన ఈ శరీరముతో కూడుకొనియున్నాము. ఐతే దేహ, మనో, బుద్ధులకు అతీతులమై ఆత్మసాక్షాత్కారము నొందినవారి విషయము వేఱు. ఇక కర్మఠులమైయున్న మనమీ దేహమునొక బావిలో పడవేసినచో, లేక గంగలో దూకినచో, లేక ఒక అరణ్యమునందు సుదూరమునకేగి మన శరీరమును నశింపజేసికొన్నచో మనకు నగ్న సత్యము తెలియబడునా? మనము సత్యసంధులము కాగలుగుదుమా? కాము, కాజాలము, కాబోము. ఏలననగా:- ఈ శరీరమే క్రమము ననుసరించి వచ్చినదో, ఆ క్రమము ననుసరించియే! అంతర్థానము నొందవలయును. పంచభూతముల కలయికచే భగవంతుడు మనకీ దేహమును నిర్మించి ఇచ్చినాడు. కావున ఈ దేహమునొక పరికరము గావించుకొని, మనమీ అసత్యమైన భవబంధము నుండి విడివడవలయును. మన కాలికి ముల్లు గ్రుచ్చుకొన్నచో, మరొక ముల్లుతో దానిని తీసివేయవచ్చును. అదే ప్రకారముగా ఈ దేహమునపయోగించియే, మనము దేహరహితులము కావలసియున్నది. మనము జీవించియున్నప్పుడే దేహ రహితస్థితి నొందినప్పుడు మాత్రమే! ఆత్మజ్యోతి ప్రకాశించును. అదియే! సత్యప్రకాశమని చెప్పబడును. ఇక మనలోనున్న మనస్సు మాటేమి? మన మనస్సు కేవలము ప్రాపంచిక విషయములను గూర్చియే! అలోచించు చుండును. అట్లాలోచించినచో దోషమేమియును లేదు. ఐతే ఆ యాలోచన సత్యసమన్వితమై యుండవలయును. అదెట్లు? ఈ ప్రపంచములోని వస్తువులన్నింటికి కర్త ఆ పరమాత్మయను విషయమునెప్పుడును మరువరాదు. ఒకవేళ మఱచిపోయినచో నగ్నసత్యము మనకు ప్రస్ఫుటము కాజాలదు. భగవచ్చింతనయే! నగ్నసత్యమును గుర్తెఱుంగుటకు కీలకము.

మన భారతదేశమునందైతేనేమి? ప్రపంచములోని ఏ దేశము నందైతేనేమి? వ్యాధులను నిర్మూలించినట్టి చికిత్సాలయములు కోటానుకోట్లుగా వృద్ధినొందుచున్నవి. ఈ ప్రపంచములోని ఏ చికిత్సాలయమైనను మనుజుని మరణమును దూరము చేయగలుగు చికిత్స నొసంగునా? ఇంతవరకవి మరణమును రహితమొనర్చలేదు. మరణమును రహితమొనర్పజాలవు. మరణమును రహితమొనర్పబోవు. ఈ కారణముచే చికిత్సాలయములు అనావశ్యకములని నేను చెప్పుటలేదు సుమా! ఈ చికిత్స కేవలము తాత్కాలికమని మాత్రము మనమందఱమున్నూ గ్రహింపవలసియున్నది. ఏ దేశము నందైనను చికిత్సాలయములు పెంపొందుచున్నవో, ఆ దేశమభివృద్ధి నొందుచున్నదని తలపరాదు. ఏ దేశమునందు చికిత్సాలయములు పెరుగుచున్నవో, ఆ దేశము క్షీణదశకు పయనించుచున్నదని పలుకుట నగ్నసత్యము. ఇక రాజకీయ నాయకులు ఆస్తులు పెరుగుచున్నచో ఆ దేశము వృద్ధినొందుచున్నదని తలంచుట సత్య దూరము. అట్టి దేశము

క్షీణదశకు మ్రొగ్గుచున్నదని వచించుట నగ్న సత్యము.

ఇక మన బుద్ధి శుద్ధమైయున్నచో, మనము నగ్నసత్యము వైపు పయనించుచున్నామని చెప్పనొప్పును. నిస్స్వార్థత యనెడి సబ్బుతో మన బుద్ధిని శుద్ధమొనర్పవలసియున్నది. అప్పుడాబుద్ధి సత్యపథమునందు పయనింపజాలును. ప్రపంచములోని ఏ మనుజుడైనను తన జీవితపోషణ కావశ్యకమైన దానికంటె అధికమైన ధనమును ప్రోగుచేయునేని, అట్టివాడు చోరుడుగా పరిగణింపబడును. ఇక ఏ పదార్థమునైనను భగవదర్పితము చేయకుండా ఎవడు భుజించునో, ఆతడున్నూ చోరుడేయని శ్రీకృష్ణపరమాత్మ శ్రీమద్భగవద్గీత – తృతీయాధ్యాయములోని 12వ శ్లోకమునందు నుడివి యున్నాడు. ఇంతకూ దైవభావము కలవాడెన్నడును క్షీణదశ నొందజాలడు. దైవదత్తమైన దానిని స్వీకరించుటకు మనకు చేతులు చాలవు. కారణమేమి? భగవంతుడు ప్రసన్నుడైనప్పుడు తన సహస్ర బాహువులతో మనము వాంఛించు పదార్థముల నొసంగును. ఐతే భగవంతుడే సర్వస్వమనుకొను వానికి ప్రాపంచిక పదార్థముల యొక్క ఆవశ్యకత యుండదు.

భక్త మీరాబాయి ఒక రాజమహిషియయ్యు సర్వస్వమును త్యజించి, బృందావన వీథులలో శ్రీకృష్ణుని దర్శించుచు నృత్యమొనర్చెను. ఆనాడా నృత్యమును చూచినవారు మీరాబాయికి పిచ్చిపట్టినదనుకొనిరి. కాని మీరాబాయి ఆనాడు నృత్యమొనర్చుచు పాడిన "మేరా తో గిరిధర గోపాల్ – దూస్రా న కోయీ" వంటి పాటలను మనమిప్పటికిని పాడుకొనుచు ఆనందించుచున్నాము. భగవంతునికి పూర్ణశరణాగతి నొందినవారి లక్షణ మిట్లుండును. ఇది నగ్నసత్యము నెఱింగినవారి స్వరూపము. ఇక కౌరవ సభలో ద్రౌపది యొక్క వస్త్రములను దుష్టదుశ్శాసనుడీడ్చుచుండగా, ఆమె శ్రీకృష్ణపరమాత్మను సంపూర్ణముగా శరణుపొందెను. అప్పుడా పరమాత్మ స్వయముగా వస్త్రస్వరూపుడై ద్రౌపదిదేవికి అనంత వస్త్రములనొసంగెను. ఇది నగ్నసత్యమునకు శరణుపొందు విధానము. మన మనస్సును సంపూర్ణముగా మాధవునియందు లగ్నమొనర్చినప్పుడు నగ్నసత్యము ప్రకాశించును. మనము మన బుద్ధిని సంపూర్ణముగా భగవదాయత్త మొనర్చినప్పుడు మనకు నగ్నసత్యము లబ్ధమగును. స్వార్థపూరితములైయున్న మన కోరికలన్నియును జ్ఞానాగ్నియందాహుతి యొనర్పబడునప్పుడు మనకు నగ్నసత్యమవగతమగును. నిస్స్వార్థత నిర్వాణ పథమునందు నడిపింపజేయును. స్వార్థపరత్వము నరకమునకు హేతువగును. ఈ ప్రపంచమునందు ఇతరులనువారెవ్వరును లేరు. అది ఎట్లు? "ఇందుగలడందు లేడను సందేహము వలదు, చక్రి సర్వోపగతుండ"ని భక్తశిరోమణియైన ప్రహ్లాదుడు పలికిన పలుకులు భగవంతుడు సర్వవ్యాపకుడని ఋజువు పఱచుచున్నవి. స్తంభమునందు నరసింహుని దర్శించిన మహానుభావుడే ప్రహ్లాదుడు. మనమున్నూ ఒక స్తంభమునందు భగవంతుని దర్శింపగలుగుదుమేని, నగ్నసత్యము మనకు ప్రస్ఫుటితమగును. ఇతరులయందు, ఇతర పదార్థములయందు ఈశ్వరుని దర్శించుటయే! నగ్న సత్యోపలబ్ధికి దారి. మనమందఱమున్నూ నగ్నసత్యము వెనుక దాగియున్న పరమాత్మ, లేక పరబ్రహ్మానుభూతినొందు నిమిత్తమై జీవితమంతయు సాధన యొనర్చి, మన జీవిత లక్ష్యమగు పరమగమ్యస్థానమునొంది, మన జీవితములను ధన్యమొనర్చుకొందుము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', మార్చి/ఏప్రియల్, 2013 సంచిక నుండి)

# 24. నీటిపై వ్రాత

నీటిపై వ్రాసిన వ్రాత నిలువదు. కారణమేమి? నీటికి బలమెక్కువ. వ్రాతకు బలము తక్కువ. అదే విధముగా ఈ సృష్టి వైచిత్ర్యమంతయును నీటిపై వ్రాత వంటిది. ఐతే వ్రాయువాడెవ్వడు? ఆతడే! సృష్టికర్త. ఆతడే! పరమాత్మ. ఆతడే! పరబ్రహ్మము. ఒక బాలుడు అంబాడుచు వచ్చి, ఒక పళ్ళెములోనున్న జలమును చిందర వందర చేయును. లేక పళ్ళెములోని జలమంతయు నేలపై పారునట్లు చేయును. ఇట్లు చేయుటచే ఆతనికి నష్టము కాని, లాభము కాని కలుగునా? కలుగదు. అదే విధముగా భగవంతుడనెడి బాలుడు ఈ జగత్తనెడి పళ్ళెమునందున్న "మాయ"యనెడి నీటితో ఆడుకొను చుండును. జగత్తునందున్న మనమీ నీటిచే భయకంపితులమైనప్పుడు మనకు కష్టములు దాపురించును. అట్లుగాక జగత్తనెడి పళ్ళెములోని నీటిని కదలించుచు ఆడుకొనుచున్న ఆ పరమాత్ముని మనము శరణుజొచ్చినప్పుడు ఆనందసాగరములో మునుకలు వేయగలుగుదుము. కేవలము మనము నివసించుచున్న ఈ భూలోకమే కాకుండా ఊర్ధ్వలోకములు మఱియు అధో లోకములున్నూ కలిసి పదునాల్గు లోకములున్నవి. ఈ సమస్త లోకముల యందాడుకొనువాడా పరమాత్ముడే! కావుననే శ్రీవేదవ్యాస మహర్షి రచించిన బ్రహ్మ సూత్రములలో "లోకవత్తు లీలాకైవల్యమ్"అను ఒక సూత్రము కలదు. అనగా:– 'పరమాత్మునికీ విశ్వమంతయు కేవలమొక లీలవంటిద'ని భావము. ఈ కీలకమును తెలుసుకొన్నవానికి భయభ్రాంతులుండవు. ఆతడు భగవంతుని శక్తిసామర్థ్యమును, సర్వవ్యాపకతను, సర్వజ్ఞతను సంపూర్ణముగా గ్రహించినవాడైయుండును.

మరొక విధముగా చెప్పవలయునేని, ఈ జగత్తంతయు ఒక దీర్ఘ స్వప్నమువంటిది. స్వప్నవస్తువులకు ఉనికి లేదు. అవి కేవలము తాత్కాలికములు. అదే విధముగా ఈ జగత్తులోని వస్తుసముదాయమునకున్నూ ఉనికి లేదు. అవి కేవలము తాత్కాలికములు. ఈ ఉనికిలేని పదార్థముల కొఱకు ఆరాటపడువారు అర్భకులవంటివారు. "మమేతి బధ్యతే జంతుః నిర్మమేతి విముచ్యతే"యని శాస్త్రము నుడువుచున్నది. "నాది"అనుకొను ప్రాణి బంధింపబడును. ఇక "నాది కాదు" అనుకొను ప్రాణి బంధనము నుండి విముక్తినొందును. ఇతరుల భూభాగమైతేనేమి? ఇతరుల భోగ్య వస్తువు లైతేనేమి? "నాది" అనుకొన్నప్పుడు మనము శిక్షింపబడుదుము. ప్రపంచము నందు సుఖజీవనమును గడుపుటకై భగవంతుడు మనకు గృహమును, భార్యా పిల్లలను, ఐశ్వర్యమును ప్రసాదించెను. కాని వాటిని "నావి" అనుకున్నచో మనకు శిక్ష తప్పదు. భూభాగ పోరాటములను, భార్యాభర్తల కోర్టుకేసులను, తండ్రికొడుకుల జగడములను మనమీ ఆధునిక ప్రపంచములో చూచుచున్నాము కదా! ఇంత ఏల? ఈ దేహమును మనకు భగవంతుడు పంచ భూతములచే నిర్మించి ఇచ్చెను. దీనిని "నాది"యని చెప్పుట ఎంత గొప్ప తప్పు! "నాది" అనుకొన్నవాడు దానికి తగిన శిక్షననుభవింపక తప్పదు. అదేమి శిక్ష? 84 లక్షల యోనులలో పుట్టుట, గిట్టుటయే! శిక్ష. ఇంతకంటె ఘోరమైన శిక్ష మరొకటుండునా?

ఇక ఈ ప్రపంచములోని అణుమాత్రమైన స్థలముకాని, కించిన్మాత్ర సంపదగాని "నాది కాదు, నీదే" అనుకొనువాని జీవితము ఉత్సాహముతోను, సంతోషముతోను, ఆనందముతోను సాగిపోవును. కారణమేమి? అట్టివాని జీవిత సర్వస్వమును చూచుకొను బాధ్యతను ఆ భగవంతుడే! వహించును. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" యని శ్రీకృష్ణపరమాత్మ శ్రీమద్భగవద్గీతలోని పదునెనిమిదవ అధ్యాయమునందుగల 66వ శ్లోకమునందు నుడివియున్నాడు. అనగా:- "ఇతరములగు సమస్త ధర్మములను త్యజించి ఒకవేళ నీవు నన్నే శరణుపొందుదువేని, నిన్ను నేను సకల విధములగు పాపములనుండి విముక్తుని గావింతును. శోకింపకుము" అని భావము. ఈ కారణముచే మనము జనన మరణ బంధమునుండి విముక్తి నొందదలంతుమేని, మనమొనర్చిన పాపరాశిని దగ్ధమొనర్ప దలంతుమేని, మన అపారమగు శోక సముద్రమును దాటదలంతుమేని, భగవంతునికి అనన్య శరణాగతినొందుట తప్ప మరొక మార్గము కానరాదు.

బ్రహ్మచారి ఐతేనేమి? గృహస్థుడైతేనేమి? వానప్రస్థుడైతేనేమి? సన్న్యాసి ఐతేనేమి? ఏలాటి చీకు చింతలు లేకుండా భగవంతునికి పూర్ణ శరణాగతుడై జీవించువారి జీవితము సుఖప్రదమై శాంతిప్రదమై ఆనందప్రదమైయొప్పును. ఇంతే కాదు, బ్రాహ్మణుడైతేనేమి? క్షత్రియుడైతేనేమి? వైశ్యుడైతేనేమి? శూద్రుడైతేనేమి? భగవంతునికి సంపూర్ణ శరణాగతుడై జీవించునేని, అట్టివాని జీవితము సుఖప్రదమై, శాంతిప్రదమై, ఆనందాయకమై భాసిల్లును. "పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనమ్" అని పెద్దలు పలికిరి. అనగా:- 'ఇతరులకు ఉపకారము చేసినచో పుణ్యము కలుగును. ఇక ఇతరులను పీడించుట పాపమునకు హేతువగున'ని భావము. నిజమునకు ఇతరులను వారెవ్వరున్నూ లేరు. కారణమేమి; ఇచ్చట, అచ్చట, సర్వత్ర ఆ సర్వేశ్వరుడే! వెలసియున్నాడు కదా! ఇక ఇతరులకు తావెక్కడిది? కావున భౌతికముగా ఇతరులవలె గోచరించునట్టి ప్రాణులను హింసించుట భగవంతుని హింసించుటయే! యగును. అనగా:- మన హృదయగుహ యందున్న భగవంతుని హింసించుటయే! యగును. కావున దాని ఫలితమును మనమేకాలమునందున్నను, ఏ దేశమునందున్నను అనుభవింపక తప్పదు. ఇక భౌతికముగా ఇతరులవలె గోచరించు ప్రాణులకు ఉపకారము చేసినచో, ఆ ఉపకారము భగవంతునికి చేసిన ఉపకారమేయగును. అనగా:- మన హృదయ గహ్వరమునందున్న భగవంతునికి హితముచేయుటయే? యగును. ఈ కారణముచే ఈ జగత్తంతయు నీటిపై వ్రాయబడిన వ్రాతగా భావింపవలయును. అప్పుడు ఈ జగత్తులోని అలజడులచేతను, అల్లకల్లోలముల చేతను మనము భయకంపితులము కాజాలము. తుదకు ప్రళయము సంభవించినను ప్రశాంత చిత్తులమైయుండుట జరుగును. మన చిత్తక్షోభమునకున్నూ, ప్రశాంతచిత్తతకున్నూ ఈ జగజ్జలమునందు మనము వ్రాసిన వ్రాతయే? కారణము. కావున మనమందఱమున్నూ భగవచ్ఛరణాగతి యనెడి దివ్యభవనమునందు వసించుచు నిశ్చలమైన, నిశ్చింత జీవితమును గడుపుచుందురు గాక!

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', మే/జూన్, 2013 సంచిక నుండి)

# 25. విద్యాలయములు - వైద్యాలయములు

జ్ఞానము, తెలివి, వివేకము, ప్రజ్ఞ అన్నియును కలిపి "విద్య" యనబడును. విద్య అవిద్యను లేక అజ్ఞానమును, తెలివి తక్కువ తనమును, అవివేకమును తొలగించును. విద్య ఎచ్చట నేర్పబడునో ఆ స్థలము, ఆ ప్రదేశము, లేక ఆ భవనము విద్యాలయమని చెప్పబడును. పూర్వకాలములో "గురుకులవాసము"లుండెడివి. 8 సంవత్సరముల వయస్సుగల బాలుడు శ్రోత్రియ, బ్రహ్మనిష్ఠుడైన గురువును సమీపించి, గురుశుశ్రూష చేయుచు కనీసము 12 సంవత్సరములు విద్యాభ్యాసమొనర్చిన తర్వాత ఆజన్మ బ్రహ్మచర్య వ్రతము ననుష్ఠించుటగాని, గృహస్థాశ్రమములో ప్రవేశించుటగాని జరుగు చుండెడిది. గురుకులవాసమునందు బ్రహ్మవిద్య నేర్పబడుచుండెడిది. బ్రహ్మ విద్యకు ఇతరములైన విద్యలన్నియును భ్రమవిద్యలే యగును. బ్రహ్మవిద్యాభ్యాసము మానవజీవితమునకు గట్టి పునాది వంటిది. ఈ దృఢమైన పునాది పైననే మానవజీవిత సౌగంధ్యము నొసంగు సౌధము నిర్మింపబడు చుండెడిది. ఇట్టి గట్టిపునాదిలేని కారణముచేతనే నేటి బడులైతేనేమి, పాఠశాలలైతేనేమి, కళాశాలలైతేనేమి నిర్వీర్యములై నెగడుచున్నవి. అవి కేవలము ధనార్జన నిమిత్తమై కొనసాగుచున్నవి. ఉపాధ్యాయులుగాని, బడిపంతుళ్ళుగాని, ప్రొఫెసర్లుగాని తమకు జీవనోపాధి లభించుటయే! పరమావధిగా భావించుచున్నారు. ఇక విద్యార్థులు కాపీకొట్టియైనను పరీక్షలలో నెగ్గితే చాలనుకొనుచున్నారు. ఇట్టి విద్య నిజమైన విద్య కానేరదు. నిజమైన విద్యకు సత్యము, ధర్మము ఆధారములై యుండును. ఆధునిక గురుశిష్యు లిరువురున్నూ "సత్యంవద"ను ఆచరించుటకు బదులుగా "సత్యంవధ" అను వాక్యమునాచరించుచున్నారు. అసత్యము, అధర్మము అవిద్యకు, లేక అజ్ఞానమునకు కారణములగును. చదువులలోని మర్మమును తెలిసికొనుటయే! నిజమైన విద్య. ఆ మర్మమేమి? కర్మను తొలగించుకొనుటయే! ఆ మర్మము. కర్మానుభవమును నిశ్శేషముగా రహితమొనర్చునదేదో, అదియే! నిజమైన విద్య. కర్మానుభవమును వృద్ధి నొందించునది అవిద్యయనబడును. అనగా:- కర్మానుభవము ద్వారా జనన - మరణములను రహితమొనర్చునదే! నిజమైన విద్య.

నేటికాలములో వైద్యాలయములు, లేక క్లినిక్‌లు, లేక ఆస్పత్రులు కోకొల్లలుగా వృద్ధినొందుచున్నవి. వీటిచే దేశము పురోభివృద్ధి నొందుచున్నదని మీరు తలంచుచున్నారా? అట్లైనచో చదువులలోని మర్మమును తెలియనివారే యగుదురు. ఏ దేశమునందు ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్యాలయములు విరివిగానుండునో, ఆ దేశము రోగగ్రస్తమైన దేశముగా పరిగణింపబడును. అట్టి దేశము క్షీణదశయందున్నదని పరిగ్రహింపవలయును. ఆ దేశము అధః పతనము నొందుచున్నదని అర్థమొనర్చుకొనవలయును. నిజమునకు వైద్యము కూడా విద్యాలయమునందే నేర్పబడును. వైద్యము దేహమునకు సంబంధించిన చికిత్స. విద్య ఆత్మకు సంబంధించిన చికిత్స. ప్రస్తుతము మన ఆత్మ దేహమనెడి పంజరమునందు చిక్కుకొనియున్నది. ఇదియే! మనందరి బంధనము. ఇదియే!

మనందఱికిగల రోగము. ఇట్టి రోగమునకు చికిత్స కేవలము బ్రహ్మవిద్యచేతనే! సాధ్యమగును. ఏ దేశమునందు బ్రహ్మవిద్య ఎంతకెంతకు వృద్ధియగుచుండునో, ఆ దేశము యొక్క అభివృద్ధి శుక్లపక్ష చంద్రునివలె వికాసము నొందుచుండును. ఏ దేశము భ్రమవిద్య యందు ముందంజ వేయుచున్నదో, ఆ దేశము యొక్క పురోభివృద్ధి కృష్ణపక్ష చంద్రుని వలె క్షీణించుచుండును. రావణాసురుడైతేనేమి? హిరణ్యకశిపుడైతేనేమి? గొప్ప ఘోరమైన తపస్సునొనర్చి, పరమశివుని నుండి ప్రాణభయములేని వరములను పొందిరి. కాని అహంకారమనెడి పెనుభూతము వారి వెన్నంటి యుండెను. ఈ కారణముచే వారు మతిభ్రమ కలవారైరి; మఱియు తమ వినాశమునకు కారకులుయైరి. అహంకారముచే అవిద్య, అవివేకము, అజ్ఞానములు మొలకెత్తును, కావున ఏది అహంకారమును నశింపజేయునో, అదియే! నిజమైన విద్యయనబడును. అవిద్య కారణముచేతనే! అహంకార సమన్విత మగు దేహమునకు సంబంధించిన వైద్యాలయములు వృద్ధినొందు చుండును. నిజమైన విద్యాలయములున్నచోట వైద్యాలయముల అవశ్యకత అణుమాత్రమైనను ఉండదు. నిజమునకు వైద్యాలయములను రహితమొనర్చుటయే! నిజమైన విద్యాలయముల యొక్క కార్యము. నిజమైన విద్యాలయము భవ రోగమును నివారించి, మనుజులకు స్వస్థతను చేకూర్చును.

బ్రహ్మవిద్యను భ్రమవిద్యగా భావించునట్టి మహానుభావులున్నూ ఈ ప్రపంచములో లేకపోలేదు. అట్టివారికి తమ జీవిత కర్మానుభవమే! పాఠమును నేర్పును. మన జీవితమునందు బాల్య- యౌవన-వృద్ధాప్యములనెడి మూడు ముఖ్యమైన దశలున్నవి. బాల్యమునందు బ్రహ్మవిద్య నభ్యసించువారు యౌవనమునందు బ్రహ్మతేజోవిరాజితులై వెలుగొందుదురు. అట్టివారే! వృద్ధాప్యమునందు మహర్షులుగను, గురువులుగను, తత్త్వజ్ఞానులుగను ప్రకాశించు చుందురు. ఇక బాల్యమునందు భ్రమవిద్య నభ్యసించునట్టివారు తమ యౌవనము నందు కేవలము కేళీవిషయ విలాస లోలులగుదురు. ఈ కారణముచే అజ్ఞానము, అవివేకము, తెలివితక్కువ తనమునకు నిలయులై వెలయుదురు. అట్టివారు తమ వృద్ధాప్యమునందు దీనస్థితి ననుభవింపవలసి వచ్చును. నిజమైన విద్యనభ్యసించు ప్రతి మానవుడున్నూ 25 సంవత్సరముల వరకు బ్రహ్మచర్యవ్రతముల నవలంబించి, బ్రహ్మవిద్యాభ్యాసము నొనర్పవలయును. తదనంతరము అప్రయత్నముగనే తన జీవితము మూడు పూవులారు కాయలుగా దినదినాభివృద్ధినొందు చుండును. ఆత్మ యొక్క ఉనికి చేతనే! ఈ దేహము యొక్క అస్తిత్వము కొనసాగుచున్నది. మన దేహమునకు, మనస్సుకు, బుద్ధికి ఆత్మయే! ఆధారమైయున్నది. కావున ఆత్మవిద్యయే బ్రహ్మవిద్య, మఱియు బ్రహ్మవిద్యయే! నిజమైన విద్య. బ్రహ్మవిద్యను, లేక ఆత్మవిద్యను అవహేళన చేయువాడు తన్నుతాను అవహేళన చేసుకొన్నవాడే! యగును. ఆత్మ దేహమునకెట్లు ఆధారమైయున్నదో, అట్లు విద్యాలయము వైద్యాలయమునకాధారమై యున్నది. ఈ విషయమును బాగుగా గుర్తెఱింగి మనమందఱమున్నూ నిజమైన విద్యాలయములను నిర్మించెదము గాక! అనగా:- పాత విద్యాలయములను పడగొట్టి నూతన విద్యాభవనములను నిర్మించుట కాదు. అహంకారములేని వాని దేహము

దేవాలయము వంటిది. అహంకారమును, లేక అజ్ఞానమును నిర్మూలించునట్టి విద్యాలయము లన్నియును దేవాలయములే! ఇట్టి విద్యాలయములు, లేక విద్యాభవనముల నిర్మాణములు ప్రస్తుతము అత్యంతావశ్యకములై యున్నవి. ఈ కార్యము నెరవేఱినప్పుడు "లోకాస్సమస్తాస్సుఖినోభవంతు" అను వాక్యము సార్థకమగును. ఇట్టి విద్యాలయములు, ఇట్టి విద్యాభవనములు, ఇట్టి విద్యా నికేతనములు భారతదేశములోని అన్ని రాష్ట్రములలో, అన్ని జిల్లాలలో, అన్ని మండలములలో, అన్ని గ్రామములలో విరివిగా వృద్ధినొందును గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', జూలై/ఆగష్టు, 2013 సంచిక నుండి)

# 26. నేతి బీరకాయ

ఈ మధ్య నేను "క్రైస్తవ వేదాంత శాస్త్రం" అను గ్రంథము యొక్క శీర్షికను మాత్రము చూచుట తటస్థించినది. ఈ గ్రంథము యొక్క రచయితతో మనకు నిమిత్తము లేదు. కాని ఈ గ్రంథము యొక్క నామమును బట్టి గ్రంథకర్తగారు వేదాంతమనెడి గులాబి పుష్పము యొక్క సుగంధమును కూడా ఆఘ్రాణింపలేదని తెలియుచున్నది. ఏదైన ఒక గ్రంథము యొక్క శీర్షికను చూచినంత మాత్రముచే ఆ గ్రంథమును తెప్పించుకొని పఠింప వలయునని కోరిక కలుగును. ఈ గ్రంథము యొక్క పేరును చూచిన తర్వాత దానిని తెప్పించుకొని చదువవలయునను కోరిక ఏమాత్రము నాకు కలుగలేదు. కారణమేమి? వేదాంతము ఒక సముద్రము వంటిది. మతము లన్నియును నదుల వంటివి. మనుష్యులలో మతులు ఎన్ని కలవో, మతములున్నూ అన్ని కలవని చెప్పవచ్చును. కొన్ని మతులు ఏకత్రితమైనప్పుడు ఒక మతమేర్పడును. తుట్టతుదకు మతములన్నియును వేదాంతమనెడి మహా సాగరమునందు లీనము కావలసియుండును. సూర్యుని కిరణములు జగత్తంతయు ప్రసరించుచుండును. శృంగేరిలో ప్రసరించిన సూర్య కిరణములను దక్షిణ సూర్యునికి సంబంధించిన కిరణములని మనము చెప్పము కదా! ఇక జోషీమఠ్‌లో ప్రసరించిన సూర్యకిరణములను ఉత్తర సూర్యునికి సంబంధించినవని చెప్పుట లేదు కదా! అదే విధముగా పూరీలో ప్రసరించిన సూర్యకిరణములను తూర్పు సూర్యునికి సంబంధించినవని చెప్పుట లేదు కదా! ఇక ద్వారకలో ప్రసరించిన సూర్యకిరణములను పడమర సూర్యునికి సంబంధించినవని చెప్పము కదా! ఇదే రీతిగా వేదాంతమును మనము క్రైస్తవ వేదాంత శాస్త్రమనియు, ఇస్లాం వేదాంత శాస్త్రమనియు, బౌద్ధ వేదాంత శాస్త్రమనియు, జైన వేదాంత శాస్త్రమనియు, హిందూ వేదాంత శాస్త్రమనియును విభజింపజాలము. అట్లు విభజించినచో వేదాంతము అర్థరహితమగును; వేదాంతము తన అస్తిత్వమును కోల్పోవును. తుమ్మెదలు రకరకములగు పుష్పములనుండి పుష్పసారమును గ్రహించి తేనెను తయారుచేయును. ఆ తేనెలోని ఒక భాగము ఈ పుష్పమునకు సంబంధించినది, మరొక భాగము మరొక

పుష్పమునకు సంబంధిచినది అని మనము చెప్పజాలము కదా! అదే విధముగా వేదాంతములోని ఒక భాగము క్రైస్తవులకు సంబంధించినదనియు, మరొక భాగము ఇస్లాం మతమునకు సంబంధించినదనియు, వేరొక భాగము హిందువులకు సంబంధించిన దనియు మనము చెప్పజాలము.

"క్రైస్తవ వేదాంత శాస్త్రం" అను గ్రంథము యొక్క శీర్షికను చూచిన తరువాత నాకు "నేతి బీరకాయ" జ్ఞాపకమునకు వచ్చినది. నేతి బీరకాయలో నేయి ఎంత ఉన్నదో అంతే వేదాంతము "క్రైస్తవ వేదాంత శాస్త్రము" నందున్నది. "వేదము" అంటే జ్ఞానమని అర్థము. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహవిద్యతే" అనెడి గీతావాక్యానుసారముగా జ్ఞానము కంటే పవిత్రమైనది మరొకటి లేదు. వేదము యొక్క అంతము, అనగా:- చివరి భాగము, అనగా:- సారమే "వేదాంతమ"ని చెప్పబడును. ఇది సముద్రము వంటిది. సముద్రమునందు సమస్తనదులు కలియును. సముద్రములోని జలమును ఇది గంగానది జలమనియు, ఇది యమునానది జలమనియు, ఇది కృష్ణానది జలమనియు, ఇది తుంగభద్రానది జలమనియు, ఇది నర్మదా నది జలమనియును విభజించి చెప్పజాలము. అదే విధముగా వేదాంతమును మనము క్రైస్తవ వేదాంతము, ఇస్లాం వేదాంతము, బౌద్ధవేదాంతము, జైనవేదాంతము, హిందూవేదాంతమని విభజించి చెప్పజాలము. ఒక గ్రుడ్డి వాడు ఏనుగు యొక్క తొండమును పట్టుకొని ఏనుగు ఒక లావైన త్రాడువలె యుండునని చెప్పెను. మరొక గ్రుడ్డివాడు ఏనుగు యొక్క చెవిని స్పర్శించి ఏనుగు ఒక చేటవలె యుండునని చెప్పెను. మూడవ గ్రుడ్డివాడు ఏనుగు యొక్క కడుపును నిమిరి ఏనుగు ఒక పెద్ద బిందెవలెనుండునని పలికెను. నాలుగవ గ్రుడ్డివాడు ఏనుగు యొక్క కాలును పట్టుకొని ఏనుగొక స్తంభము వలె యుండునని చెప్పెను. అదే విధముగా మతములన్నియును తమతమ మతులను బట్టి వేదాంతమును విభజించుచున్నవి. ఏనుగు యొక్క పూర్ణస్వరూపము గ్రుడ్డివాని కెట్లు తెలియదో; అట్లే వేదాంతము యొక్క పూర్ణస్వరూపము క్రైస్తవులకు గాని, ఇస్లాం మతస్థులకుగాని, బౌద్ధులకుగాని, జైనులకుగాని, ఇంత ఏల? హిందువులకుగాని తెలియదని చెప్పవలసి యున్నది. కారణమేమనగా, హిందువులలో కూడా వైష్ణవులు, శైవులు, గాణాపత్యులు, సౌరులు, శాక్తేయులు ఇత్యాది వివిధ శాఖలు కానబడుచున్నవి. నానావిధ మతములను, నానావిధ శాఖలను, నానావిధ వర్గములను ఏకత్రిత మొనర్చునదే వేదాంతమని చెప్పబడును. వేదాంతము పూర్ణబ్రహ్మ జ్ఞానమును బడయజేయును. వేదాంతమునందు వాద వివాదములకు తావులేదు. వేదాంతమునందు భిన్నత్వమునకు చోటులేదు.

మానవులమైన మనకు కాళ్ళు, చేతులు, కండ్లు, చెవులు, ముక్కు, మూతి ఇత్యాదులు కలవు. ఇవి అన్నియును కలిపి మానవుని దేహము తయారగును. కాని ఒక్కొక్క అవయవమును మానవుడని చెప్పజాలము. అదేవిధముగా మతములన్నింటిని కలిపినప్పుడు కాదు, కాదు, మతములన్నింటి సారమును కలిపినప్పుడది "వేదాంతమ"ని చెప్పబడును. దేనిని తెలిసికొన్న తరువాత మరొకటి తెలిసికొనుటకు మిగిలియుండదో, అదియే "వేదాంతము". నిజమైన వేదాంతికి రాజకీయ సమస్యగాని, సాంఘిక సమస్యగాని, కుటుంబ

సమస్యగాని ఉండదు. నిజమైన సన్న్యాసి వేదాంత తత్త్వమును సుస్పష్టముగా గుర్తెరింగినవాడై యుండును. నిజమైన వేదాంతికి ఈర్ష్యాసూయలుగాని, రాగద్వేషములుగాని ఉండవు. వేదాంతి "ఇది నా మతము, అది మరొకరి మతము" అని చెప్పుటకు సిగ్గుపడును. నిజమైన వేదాంతి ఈ జగత్తుయొక్క సృష్టి-స్థితి, ప్రళయముల రహస్యమును గుర్తెరింగిన వాడైయుండును. నిజమైన వేదాంతి శ్రీకృష్ణుని యందును, శ్రీశంకరుని యందును, శ్రీరామునియందును, శ్రీజీసస్‌నందును, శ్రీమహమ్మద్‌నందును, శ్రీబుద్ధునియందును ఇంత ఏల? ప్రపంచములోని ప్రతిప్రాణియందును ఒకేయొక తత్త్వమును దర్శించును. నిజమైన వేదాంతి పూర్ణకాముడై యుండును. నిజమైన వేదాంతికి మతములను మార్చు తతంగమే తెలియదు. అతడన్నింటి యందును సమచిత్తుడై యుండును. కాబట్టి మన మందరమున్నూ నేతి బీరకాయ వంటి వేదాంతమును చేపట్టక "నీతి బీరకాయ"ను చేపట్టవలయును. వేదాంతమునుండి మతములను విడదీయుట సముద్రమునుండి నదులను విడదీయుట వంటిది. మతములనెడి నదులను వేదాంతమనెడి సముద్రమునందు కలుపుటయే "నీతిబీరకాయ" ను చేపట్టుట. "నేతి-నేతి" 'ఇదికాదు-ఇదికాదు' అనెడి వాక్యము యొక్క మననము ద్వారా మతములలోని మతులను పరిత్యజించి, వేదాంతమనెడి మహాసాగరమును మనము చేరుకొనవలసియున్నది. అట్టివారే! వేదాంత తత్త్వము తెలిసినవారుగా పరిగణింపబడుదురు. అట్లు కాదేని? మత మౌఢ్యమును కలిగియున్నవారందరును ''నేతిబీరకాయ''లుగా పరిగణింప బడుదురు. మనమందఱమున్నూ "నేతిబీరకాయ"లను "నీతిబీరకాయ"లు గా మార్చుటకు నడుము కట్టుదుముగాక!

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', సెప్టెంబరు/అక్టోబరు, 2013 సంచిక నుండి)

# 27. పంచామృతము

ఐదు రకములైన తీపి పదార్థముల మిశ్రమము "పంచామృతమ"ని చెప్పబడును. ఈ పంచామృతములో 1. తేనె, 2. పెరుగు, 3. పాలు, 4. అరటిపండ్లు, 5. చక్కెర అనెడి ఐదు రకములైన తీపి పదార్థములుండును. ఈ పంచామృతముతో దేవాలయములలోని దేవతామూర్తులకు, లేక విగ్రహములకు ప్రతిరోజు మూడు పూటలలో అభిషేకము చేయబడుచుండును. ఇట్లు అభిషేకము చేయుటచే అయా దేవతలు ప్రీతినొంది, మనుజుల యొక్క కోరికలను, వాంఛలను, అభీష్టములను నెఱవేర్చుచుందురు. సామాన్యముగా అభిషేకముచే శివుడు ప్రీతినొందును. అలంకారముచే విష్ణువు ప్రీతి నొందును. నమస్కారముచే సూర్యభగవానుడు ప్రీతి నొందును. ఒక పత్రమునుగాని, ఒక ఫలమునుగాని, ఒక పుష్పమును గాని, తుదకు ఒక ఉద్ధరిణెడు జలమునుగాని భక్తి ప్రపత్తులతో దేవతలకు సమర్పించినప్పుడు ఆయా దేవతలు ప్రీతినొందుదురు మఱియు భక్తుల కోరికలను, వాంఛలను, అభీష్టములను నెఱవేర్చుచుందురు. ఈ ప్రకారముగా

ప్రపంచములోని ప్రజలు సుఖజీవనమును గడుపుచుందురు. ఇక మన దేహము కూడా ఒక దేవాలయమే! కారణమేమి? ఈ దేహము నందు ఆత్మదేవుడు ప్రతిష్ఠితుడైయున్నాడు. దేవాలయములలోని దేవతలకు మనుష్యులచే ప్రాణ ప్రతిష్ఠ చేయబడును. కాని ఈ దేహములోని దేవాలయమునందు గల ఆత్మ దేవునికి పరమాత్ముడు స్వయముగా ప్రాణప్రతిష్ఠ చేసియున్నాడు. అంతేకాదు, పరమాత్ముడు స్వయముగా ఈ ఆత్మదేవునికి పంచామృతముతో అభిషేకము చేయుచుండును. అది ఎట్లు? పంచభూతములే! ఐదు విధములగు అమృతములు: 1. పృథ్వి, అనగా:– భూమి. మన ఈ చర్మ దేహము భూదేవికి సంబంధించినట్టిది. కావున దేవుడు ప్రసాదించిన ఈ దేహమును మనమెంతో జాగ్రత్తగా కాపాడుకొనవలసియున్నది. ఇట్లు చేయుటచే దేవుడొనర్చుచున్న పంచామృతాభిషేకమునకు మనము సహకరించినవారమగుదుము. భూదేవిపై స్థలనిర్ణయము లేకుండా ఉమ్మివేయుట, మలమూత్ర విసర్జనము చేయుట నుండి విరమించుకొనవలయును. ఈ దేహముచే సత్కర్మలను మాత్రము చేయుచుండవలయును. అప్పుడు దైవానుగ్రహము, లేక ఆత్మానుగ్రహము కలుగుటతో మన జీవితము సార్థకమగును. అనగా:– మనము మన జీవిత పరమ లక్ష్యమును చేరగలుగుదుము.

పరమాత్ముని పంచామృతములలో 2. రెండవది అప్పు, అనగా:– జలము. ఈ జలము కూడ పరమాత్ముడు ప్రసాదించినదే కదా! అందువల్ల పరిశుభ్రమైన జలమునే మనము పానము చేయుచుండవలెను. జలము పరిశుభ్రమెట్లగును? ప్రార్థనచేసి జలపానమొనర్చినప్పుడు మనము పవిత్రమైన జలమును పానమొనర్చినవారమగుదుము. నదులలోగాని, చెఱువులలోగాని, బావులలోగాని చెత్తచెదారమును పడవేయకుండా ఉన్నప్పుడు కూడా జలము పవిత్రమగును. ఇక పరమాత్ముని పంచామృతములలో 3. మూడవది తేజస్సు, అనగా:– అగ్ని. మన దేహమునందు జఠరాగ్ని లేకున్నచో, మనము భుజించుచున్న ఆహారము పచనము కాదు. కావున మనము భుజించుటకు ముందు శ్రీకృష్ణభగవానుడు వచించిన ఈ క్రింది శ్లోకమును పఠించి భుజింపవలయును. అదేమనగా:–

> **"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
> **ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥**

ఈ శ్లోకము శ్రీమద్భగవద్గీతలోని పదునైదవ అధ్యాయములోని పదునాల్గవ శ్లోకము. ఇట్లు చేయుటచే పురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానుడు ప్రీతినొందును. అప్పుడు మన జీవితము సార్థకమగును. అనగా:– మనము, మానవజీవిత పరమ లక్ష్యమును చేరగలుగుదుము. ఇక పరమాత్ముని పంచామృతములలోని 4. నాలుగవ అంశము వాయువు. ఈ వాయువు లేనిచో మనకు జీవితమే లేదు. ఆత్మశక్తిచే ముఖ్యముగా మన దేహములో ప్రాణాపానవాయువులు చలాయమానమగుచున్నవి. కావున మనమీ వాయువును పరిశుద్ధముగా నుంచవలయును. అది ఎట్లు? ధూమ్రపానమొనర్చి వాయువును కలుషితమొనర్పరాదు. మనము నిద్రించుటకు ముందు దైవ ప్రార్థన చేసినచో, మనము నిద్రలో శ్వాసించు వాయువు పవిత్రమగును. నిద్ర నుండి లేచిన తర్వాత మనము దైవప్రార్థన చేసినచో, దినమంతయు మనము పీల్చుచుండు గాలియున్నూ పవిత్రమగును.

ఈ ప్రకారముగా మనము పరమాత్ముని పంచామృతాభిషేకమునకు సహకరించిన వారమగుదుము. అంతే కాదు, మనము మన జీవిత లక్ష్యమును చేరుటకై వాయుదేవుడొక దివ్యమైన విమానమువలె మనకు సహకరించును. పరమాత్ముని పంచామృతములలోని 5. ఐదవ అంశము ఆకాశము. ఇది ప్రతి ప్రాణి హృదయము నందుడును. "ఆత్మనః ఆకాశః సంభూతః" అని ఉపనిషత్తు నుడువుచున్నది. అనగా:- అత్మనుండి ఆకాశము జనించినది. "ఆకాశాద్వాయుః" అనగా:- ఆకాశము నుండి వాయువు జనించినది. "వాయోరగ్నిః" అనగా:- వాయువు నుండి అగ్ని జనించినది. "అగ్నేరాపః" అనగా:- అగ్నినుండి జలము జనించినది. "అద్భ్యః పృథివీ" అనగా:- జలము నుండి పృథ్వి లేక భూదేవి జనించినది.

ఈ ప్రకారముగా పరమాత్ముడు పంచభూత సమ్మిశ్రితమగు పంచామృతముచే ఆత్మదేవునికి నిరంతరము అభిషేకమొనర్చుచున్నాడు. ఐతే, ఈ యాత్మదేవుడు శరీరమును త్యజించినప్పుడు పరమాత్ముడు పంచామృతముచే అభిషేకము చేయుచుండుటను విరమించుకొనునా? అది అసంభవము. అనగా:- మనము ఆ పురుషోత్తముని ప్రాప్తించునంతవరకు పరమాత్ముని ఈ పంచామృతాభిషేకము కొనసాగుచునేయుండును. అట్లు కాదేని, ఈ జగత్తు జనశూన్యమగును. ఏ ప్రాణియైనను మరణించిన తరువాత మరల పుట్టుచునే యుండును. కేవలము దేహము మాత్రము కర్మానుసారముగా మారిపోవుచుండును. ఆత్మదేవునికి మాత్రము మార్పులేదు. కావున పరమాత్ముని పంచామృతాభిషేకము నిరంతరము, అఖండముగా, సర్వకాల సర్వావస్థలయందు కొనసాగుచునేయుండును. ఐతే, పరమాత్ముడు అఖండముగా, నిర్విరామముగా, నిరంతరము పంచామృతాభిషేకము నొనర్చుచుండుటకు గల కారణమేమి? తమ సంతానము తమకు సుదూరముగా వెళ్ళినప్పుడు తల్లిదండ్రులు బాధ పడుచుందురు. అదే విధముగా పరమాత్ముడు తనకు సుదూరము నందున్న తన సంతానమైన జీవులను గాంచి బాధపడుచుండును. పరమాత్ముడు తండ్రివలె మనలను నిరంతరము ఎచ్చటున్నను పోషించుటకై ప్రకృతియనెడి తల్లి ద్వారా పంచభూతముల రూపమునందు పంచామృతాభిషేకమును చేయుచుండును. ఎంతవరకిట్లు చేయుచుండును? జీవాత్మ తన తండ్రి సన్నిధికి చేరుకొన్నంత వరకు, అనగా:- జీవాత్మ పరమాత్మ యందు లయించునంత వరకు చేయుచుండును. జీవుడు పరమాత్మ యందెప్పుడు లయించును? "పరమాత్ముని పంచామృతాభిషేకముచే నేను పోషింపబడుచున్నానని" జీవుడు తెలిసికొన్నప్పుడు, నిరంతరము, అఖండముగా దైవచింతన చేయగలిగినప్పుడు, మరణకాలమునందు కూడ మాధవుని ముఖారవిందమును దర్శింపజాలినప్పుడు జీవాత్మ పరమాత్మ యందు లయించును. అప్పుడాతనికి శాశ్వతానందము లభించును. జనన-మరణ పరిభ్రమణము నశించును. ఏతత్సమయము నందు జీవుడు బ్రహ్మానంద సాగరమునందు లయించుటతో జీవాత్మ పరమాత్మ మధ్యగల దూరము అదృశ్యమగును. ఈ కారణముచే పరమాత్మునికి పంచామృతాభిషేకము చేయు ఆవశ్యకత యుండదు. అప్పుడు జీవుడు సంసారసాగరమునుండి తరించి, మానవ జీవిత పరమ లక్ష్యమును చేరుకొనును. ఓం తత్సత్.

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', నవంబరు/డిశంబరు, 2013 సంచిక నుండి)

# 28. అద్వైత లక్ష్మి

**లక్ష్మి** అనగా:- ధనము, సంపద, ఐశ్వర్యమని అర్థము. ఐతే అద్వైతమును లక్ష్మీదేవితో పోల్చవచ్చునా? పోల్చుట కేలాటి అభ్యంతరమున్నూ లేదు. కారణమేమి? అద్వైతలక్ష్మి కేవలము ప్రాపంచిక ధనమును మనకొసంగదు. కాని ఏ ధనమును సంపాదించినచో మరికొంత ధనము కావలయుననెడి కోరిక మనకు కలుగదో, అట్టి లక్ష్మియే! అద్వైత లక్ష్మి. ఉద్యోగస్థులైతేనేమి? వ్యవసాయదారులైతేనేమి? వ్యాపారస్థులైతేనేమి? రాజకీయ నాయకులైతేనేమి? సర్వ ప్రయత్నములనొనర్చి తమ సంపదను పెంపొందించుకొనుచుందురు. ఐతే ఏ సంపదను పొందిన తర్వాత ఇంకను సంపాదింపవలయునను కోరిక కలుగదో, అట్టి సంపదయే! అద్వైత సంపద. ధన కనక వస్తువాహనములన్నియును కలిసి ఐశ్వర్యమని చెప్పబడును. అద్వైత లక్ష్మి యందు ధన కనక వస్తువాహనములే యననేల? మనకు తెలియని, మనకు అదృశ్యములైయున్న, మనకు అగోచరములైయున్న స్వర్గ లోక సుఖములు, భోగభాగ్యములు, ఐశ్వర్యములన్నియును ఈ "అద్వైత లక్ష్మి"యందుండును. అద్వైతలక్ష్మిని ఆశ్రయించిన వాని ఆనందమునకు అవధులుండవు. ఈ అద్వైత లక్ష్మి ఆనంద సాగరము వంటిది. ఈప్రపంచమే యననేల? పదునాలుగులోకములలోని అందచందములన్నియును ఈ అద్వైత లక్ష్మి నావరించియుండును. పదునాలుగు లోకములలోని ఆనందతరంగము లన్నియును ఈ అద్వైత లక్ష్మియనెడి సాగరము నందంతర్గతములై యుండును. అద్వైత లక్ష్మి యందు స్త్రీ-పురుష భేదము గాని, జాతి వైషమ్యముగాని, మత మతాంతరభేదములు గాని లేవు. ఇవి యన్నియును భౌతిక జగత్తునకు సంబంధించినవైయున్నవి. అద్వైత లక్ష్మి యందీ వైషమ్యములకు విలక్షణమైన ఆనందము తాండవమాడుచుండును. అద్వైత లక్ష్మియందు "సమత్వం యోగ ఉచ్యతే" అను వాక్యము యొక్క అనుభవము అనుక్షణము అనుభూతమగుచుండును. శ్రీగీతాధ్యానములోని ప్రథమశ్లోకమునందు " అద్వైతామృత వర్షిణీం భగవతీమంబ" అను పాదము కలదు. కావున శ్రీమద్భగవద్గీతలోని 18 అధ్యాయములలోను "అద్వైతామృతము" వర్షింపబడుచున్నదని భావము. అదెట్లనగా:- ప్రథమోఽధ్యాయము నందు అర్జునిని నిమిత్తముగాగొని శ్రీకృష్ణభగవానుడు నరులందఱి విషాదమును నశింపజేయుటకై అద్వైతలక్ష్మి యనెడి భవనమునకు పునాదులను వేసెను. ఇక ద్వితీయోఽధ్యాయయునందు ప్రకృతి-పురుషుల నైక్యమొనర్చి అద్వైతలక్ష్మిని మనందఱి హృదయ కమలములలో ప్రతిష్ఠింపజేసెను. తృతీయాఽధ్యాయమునందు కర్మయోగాభ్యాసముచే అద్వైతలక్ష్మి ప్రాప్తించునని నిరూపించెను.

ఇక చతుర్థోఽధ్యాయమునందు మనకున్న సంకుచిత జ్ఞానమును, స్వార్థపూరితములగు కర్మలను సన్న్యసించినప్పుడు అద్వైతలక్ష్మి పొందబడునని బోధించెను. పంచమోఽధ్యాయమునందు మనమొనర్చు సమస్త కర్మలయొక్క ఫలములను

త్యజించినప్పుడు అద్వైతలక్ష్మిని బడయవచ్చునని పలికెను. ఇక షష్ఠోఽ ధ్యాయమునందు అద్వైతలక్ష్మిని సమీపించుటకై ఆత్మనిగ్రహము అత్యావశ్యకమను విషయమును నిరూపించెను. సప్తమోఽ ధ్యాయమునందు జీవుని సంకుచిత జ్ఞానము అతిక్రమింపబడినప్పుడు పరమాత్మని విశేషజ్ఞానమును బడయుట ద్వారా అద్వైతలక్ష్మి అవగతమగునని ప్రబోధించెను. ఇక అష్టమోఽ ధ్యాయమునందు అవినాశియగు పరబ్రహ్మమునకు – అద్వైతలక్ష్మికి మధ్య భేదము లేదను విషయమును నిరూపించెను. నవమోఽ ధ్యాయమునందు అద్వైతలక్ష్మి విద్యలకెల్ల తలమానికమనియు, రహస్యములకెల్ల మిక్కిలి రహస్యమైనదనెడి సత్యమును వెల్లడించెను. ఇక దశమోఽ ధ్యాయమునందు ఈ ప్రపంచములోని సమస్తప్రాణులు సమస్త పదార్థములలోని సారము అద్వైతలక్ష్మి యందున్నదను విషయమును వివరించి చెప్పెను. ఏకాదశోఽ ధ్యాయమునందు అద్వైతలక్ష్మి యొక్క విశ్వరూపమును శ్రీకృష్ణభగవానుడు తనయందర్జునునికి దర్శింపజేసెను. ఇక ద్వాదశోఽ ధ్యాయమునందు దేహధారులకు అద్వైతలక్ష్మిని అర్థమొనర్చుకొనుట కష్టమని తలంచి శ్రీకృష్ణుడు ఉపాశక–ఉపాస్య సాధనావిధానమును ప్రబోధించెను. త్రయోదశోఽ ధ్యాయమునందు ద్వైతభావమును సూచించు క్షేత్రము – అద్వైతలక్ష్మిని సూచించు క్షేత్రజ్ఞుల గుఱించి వివరించి చెప్పెను. ఇక చతుర్థశోఽ ధ్యాయమునందు సత్త్వరజస్తమోగుణముల నతిక్రమించి శోభిల్లునట్టి అద్వైతలక్ష్మిని గూర్చి వర్ణించిచెప్పెను. పంచదశోఽ ధ్యాయమునందు సకలజీవరాశులనతిక్రమించి విలసిల్లు పురుషోత్తముడెట్లు తెలియబడునో, ఆ తెలియబడిన పురుషోత్తమునికి పర్యాయపదమే అద్వైతలక్ష్మియను విషయము నుడువబడెను. ఇక షోడశోఽ ధ్యాయమునందు దైవశక్తులు – అసురశక్తులు ఎట్టి లక్షణములను కలిగియుండెనో, అసురశక్తులను జయించి – దైవశక్తులనెట్లు పెంపొందించుకొనవలయునో, తద్వారా అద్వైతలక్ష్మియొక్క అనుగ్రహమునెట్లు పొందవలయునో తెలుపబడెను.

సప్తదశోఽ ధ్యాయమునందు ఎట్టి పురుషుడే రకమైన శ్రద్ధను కలిగియుండునో తదనుసార వ్యక్తిత్వము ప్రాప్తించుననియు, అద్వైతలక్ష్మి యందు శ్రద్ధను కలిగియున్న నరుడా అద్వైతలక్ష్మి యొక్క కుక్షిని వీడియుండడనియును చెప్పబడెను. ఇక అష్టాదశోఽ ధ్యాయమునందు అద్వైత లక్ష్మిని పొందుటకై ద్వైతపదార్థ సమన్వితమగు ప్రపంచమును సన్న్యసింపవలయుననియును శ్రీకృష్ణుదర్జునునికి ప్రబోధించెను. ఈ ప్రకారముగా శ్రీమద్భగవద్గీతయంతయు అద్వైతామృతవర్షమును అద్వైతలక్ష్మి ద్వారా కురిపింపజేయుచున్నది. అద్వైతామృతమును నీరసమైనదిగా తలంపరాదు. కారణమేమనగా:– అద్వైతలక్ష్మియే! అనందలక్ష్మి. ఇచ్చట ఏలాటి దుఃఖ లవలేశమున్నూ కానరాదు. ఇదియే! "మోక్షలక్ష్మి"యని కూడ చెప్పబడును. అత్యంత దుఃఖ నివృత్తి – పరమానందప్రాప్తియే! మోక్షమని చెప్పబడును. సకల దుఃఖములు నివారింప బడవలయునని కోరనివాడెవ్వడుండును! అదే విధముగా పరమానందము లభింపవలయునని కోరనివాడెవ్వడుండును? అద్వైతలక్షి యందు ప్రాపంచిక సుఖములు

లేవని తలంపరాదు. కేవలమీ పృథ్వీలోని సుఖములే కాక, 14 లోకములలో గల సుఖములన్నియును అద్వైతలక్ష్మి యందున్నవని తలంపవలయును. ఈ విషయము తెలిసిన నరుడు అద్వైతలక్ష్మిని ఉపాసింపకుండా ఎట్లుండగలుగును? అద్వైతశిఖరము నధిరోహించిన వారికీ ప్రపంచమొక తృణప్రాయముగా తోచును. అద్వైతలక్ష్మి చింతామణివలె కోరిన వస్తువులనెల్ల ఒసంగును. కల్పవృక్షమువలె వాంఛలన్నింటిని నెఱవేర్చును. కామధేనువు వలె జ్ఞానామృత దుగ్ధమును పానము చేయించును. కావున చింతామణిని విడిచి చింతలతో వెతలను పొందనేల? కల్పవృక్షమును విడిచి కట్టెపుల్లలతో గూడు కట్టుకొననేల? కామధేనువును విడిచి కామిని చేతిలో కీలుబొమ్మవలె సతమతము కానేల? ఆనందదాయినియగు అద్వైతలక్ష్మిని ఉపాసించి, మనమందరమున్నూ పరమానందధామమగు మోక్షలక్ష్మిని చేరి, మన జన్మలను తరింపజేసికొని సుఖించెదము గాక! అద్వైతలక్ష్మి శాంతికి, సంతోషమునకు, ఆనందమునకు కేంద్రము వంటిదని గ్రహించెదము గాక!

**(సేకరణ:** 'శ్రీశివానందవాణి', జనవరి/ఫిబ్రవరి, 2014 సంచిక నుండి)

# 29. ఆనందలక్ష్మి

"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ – ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే – ఆనందేన జాతాని జీవంతి – ఆనందం ప్రయంత్యభి సంవిశంతి"యని తైత్తిరీయోపనిషత్తులోని షష్ఠమ అనువాకము నుడువుచున్నది. అనగా:– ఆనందలక్ష్మియే! బ్రహ్మయని తెలిసికొనుము. ఆనందలక్ష్మినుండి సకలప్రాణులు ఉత్పన్నమైనవి. ఆనందలక్ష్మి చేతనే ప్రాణులన్నియును జీవించుచున్నవి. ప్రాణులు ఈ లోకమునుండి ప్రయాణమొనర్చి తుదకు ఆనందలక్ష్మియందే ప్రవేశించునని దీని భావము. కావున సకల చరాచర జీవులన్నియును ఆనందలక్ష్మినే కోరుచుండును. ఆనందలక్ష్మినొందుట కొరకే ఒక చీమ చక్కెర కొఱకై పరుగెత్తును. కాని మనుజుడా చక్కెరలో చీమను ప్రవేశింపజేయనీయడు. రక్తమును త్రాగి ఆనందలక్ష్మి నొందుట కొఱకే ఒక దోమ మనవుని శరీరమును కాటువేయును. కాని దోమ అట్లు చేరకుండానుండుటకై మనుజుడు తన రెండు చేతుల మధ్య దోమ వచ్చునట్లుచేసి దానిని చంపివేయును. ఒక శునకము ఒక ఎండిపోయిన ఎముకను కొరుకుచు దానినుండి రక్తము వచ్చుచున్నదని భావించి, తన నోటినుండి వచ్చుచున్న రక్తమునే త్రాగి సంతోషించును. ఒక పిల్లి పాలు త్రాగుచున్న సమయమును కనిపెట్టి, కుక్క మెల్లగావచ్చి, దానిని చంపి, తిని, ఆనందలక్ష్మిని పొందినట్లూహించును. నిజమునకు విషయపదార్థములచే, లేక ప్రపంచములోని ఏ భోగపదార్థముచేతను లభించునది సుఖమనబడునే కాని, అది ఆనందలక్ష్మియని చెప్పబడదు. ఒక ఎలుక పిల్లిచే హతమొనర్పబడి భక్షింపబడును. ఒక శూద్రుడు తన యజమానిని సేవించి, ధనమునార్జించి, ఆనందలక్ష్మినొందగోరును. ఒక వైశ్యుడు వ్యాపారనొనర్చి, ధనమును

సంపాదించి, సుఖింపగోరును. ఒక క్షత్రియుడు తన బలపరాక్రమములచే ఇతరులనోడించి, వారిని తన ఆధీనమునందుంచుకొని ఆనందలక్ష్మి ననుభవింపగోరును. ఒక బ్రాహ్మణుడు బ్రహ్మజ్ఞానమునార్జించి, బ్రహ్మానందమనెడి ఆనందలక్ష్మి యందైక్యమునొందదలంచును. ఇట్లు ప్రతివ్యక్తియు, ప్రతి ప్రాణియు, ప్రతిజీవియు ఆనందలక్ష్మిననుభవించుటకే ప్రాకులాడుచుండును. ఐతే, ఈ ప్రపంచములోని సుఖము నిజమైన ఆనందలక్ష్మి యనబడదు. కారణమేమి? ప్రాపంచక సుఖము క్షణికము. ఇక నిజమైన ఆనందలక్ష్మి యొక్క నివాసమెచ్చట? ఆమె నివసించు స్థానము మన హృదయ భవనమునందే యున్నది. మన హృదయక్షేత్రమునందున్న ఆనందమే! ఆనందలక్ష్మియని చెప్పబడును. ఒక వేళ మన హృదయ కమలము నందే ఆనందలక్ష్మి యున్నచో మనకు కష్టములు, దుఃఖములు, సంకటములు, శోకములు కలుగుటకు కారణమేమి?మనయందున్న ఆనందలక్ష్మి స్వరూపుడైన బ్రహ్మమును గుర్తెఱుంగకుండుటయే? దీనికి గల కారణము. బ్రహ్మమునందు బాహ్య పదార్థము లేదు. బాహ్యపదార్థమున్నదనుకొనుటయే! మన దుఃఖమునకు గల కారణము. బ్రహ్మజ్ఞానమునార్జించిన వాడు"సర్వంబ్రహ్మమయం రే రే, సర్వం బ్రహ్మమయమ్" అనెడి బ్రహ్మానంద సాగరమునందు నాట్యమాడుచుండును. అట్టివాడెట్టి స్థలమునందున్నను, ఏ కాలమునందున్నను బ్రహ్మమునే అనుభూతమొనర్చుకొను చుండును. అట్టి స్థితి సామాన్యమానవునికి సాధ్యమా? అను ప్రశ్న ఇచ్చట ఉదయించును. మహర్షులు,మహాపురుషులు, జీవన్ముక్తులందఱును జన్మించినప్పుడు సామాన్యమానవులేనై యుండిరి. కాని బ్రహ్మభావనా బలముచే వారు మహోన్నత స్థితినొందగలిగిరి.కావున ప్రయత్నముచేతను, దృఢ సంకల్పముచేతను, పట్టుదలచేతను సాధింపరానికార్యము లేదు. సాధకుడు ప్రప్రథమము నందు తనజీవిత లక్ష్యమేమియో గుర్తెఱుంగవలయును. దాని ఆవశ్యకతను అవగత మొనర్చుకొనవలయును. అప్పుడు అవలీలగా కార్యము సాధింపబడును. ఈ ప్రపంచము కేవలము ఒక ధర్మశాల వంటిదని, ఒక సత్రము వంటిదనియు తెలిసికొన్నప్పుడు ఈ ప్రపంచము పైనను, ఈ ప్రపంచములోని పదార్థములపైనను ప్రీతి సన్నగిల్లును. ఇదియే! వైరాగ్యమని చెప్పబడును. ఇక మోక్షమునందపేక్షను కలిగియుండుట ముముక్షుత్వమనబడును. ఈ రెండు లక్షణములను కలిగియున్నట్టి ఆధ్యాత్మిక సాధకుని జీవిత యాత్ర సఫలికృతమగును. అనగా:- అట్టివాడు తన జీవితలక్ష్యమును ఈ జన్మయందే పొందగలుగును. ఆధ్యాత్మిక జీవితము నందాసక్తి ఎంతకెంతకు పెంపొందుచుండునో, విషయభోగములయందనాసక్తి అంతకంతకు వృద్ధియగుచుండును. దీనికి మన మనస్సే కారణము. కాని గృహముగాని, ధనధాన్యములు గాని, భార్యాపుత్రులుగాని కారణము కాజాలవు. బంధమునకుగాని, మోక్షమునకు గాని మన మనస్సే కారణము. మనుజునికి బాగుగా ఆకలి వేసినప్పుడు తుదకు కూలిపని చేసియైనను ధనమునార్జించి, తన ఆకలిని తీర్చుకొనును. అదే విధముగా బ్రహ్మజ్ఞానము నార్జింపదలంచిన వ్యక్తి తన పూర్వజన్మలలోని సుసంస్కారబలముచే బ్రహ్మజ్ఞానులున్న స్థలమునకాకర్షింపబడును. ఆ స్థలమును చేరిన తరువాత మరొక స్థలముపై తనకు గల

వ్యామోహమును త్యజించును. ఒకవేళ అట్టి స్థలమునందుకూడా ప్రాపంచిక విషయ లోలతను విడువకుండునేని, అట్టివాని జీవితము వ్యర్థమైనదిగా తలంపవలయును. నిజమైన సాధకుడు ఎట్టి కార్యము నొనర్చినను, దానిని భగవంతుని సేవగా తలంచి, తత్ఫలితమును భగవంతునికర్పించును. భగవన్నామము నొనర్చునప్పుడా సాధకుని హృదయ కమలము వికసించును. దేవుడు "ఇందు గలడు – అందు లేడు" అనెడి సందేహము అతనికుండదు. భగవన్నామామృతమును గ్రోలుచుండువాని నుండి ప్రాపంచిక సమస్యలు పారిపోవును. కాముడున్నవాని హృదయమునందు రాముడుండడు. రాముడున్నవాని హృదయము నందు కాముడుండడు. కావున మనకు రాముడు కావలయునా? లేక, కాముడు కావలయునా? అను విషయమును మనము నిర్ణయించుకొనవలసియున్నది. పెద్ద ఉద్యోగము నొందదలంచినవాడు చిన్న ఉద్యోగమును తిరస్కరింపవలసియుండును. చిన్న ఉద్యోగమును వదలనంతవరకు అతనికి పెద్ద ఉద్యోగము లభింపదు. అదే ప్రకారముగా మనకు ప్రపంచము కావలయునా? లేక, ఈ ప్రపంచమును సృష్టించిన పరమాత్మ కావలయునా? అను విషయమును సాధకులమైన మనము నిర్ణయించుకొనవలసియున్నది. ఐతే, పరమాత్మునియందు ప్రపంచము లేదనుకొనుట తెలివితక్కువతనము. ఈ ఒక్క ప్రపంచమే యననేల? పదునాల్గు లోకములన్నియును పరమాత్ముని యందంతర్గతములై యున్నవి. ఈ విషయము మనకు తెలియని కారణముచే పరమాత్ముని, లేక ఆనంద లక్ష్మిని పొందు కార్యమునందు మనము వెనుకంజ వేయుచుందుము. అది ఆధ్యాత్మిక సాధకుని లక్షణమెంతమాత్రమును కాదు. కావున మనమందరమున్నూ నిస్సందేహులమై బ్రహ్మానందసాగరమును దరిజేరి, మననమనెడి కవ్వముచే చిలికి, ఆనందలక్ష్మిని ఆవిర్భవింపజేసికొనవలయును. అప్పుడు మన జీవితలక్ష్యము సాధింపబడును. ఆనందలక్ష్మి యొక్క సాక్షాత్కారమే! బ్రహ్మానందానుభవమనెడి విషయము సుస్పష్టమగును.

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', మార్చి/ఏప్రిల్, 2014 సంచిక నుండి)

# 30. మోక్ష లక్ష్మి

**మోక్ష** మనగా:-బంధనము నుండి విడుదల. మోక్ష మనగా:- కారాగారము నుండి బయటకు వచ్చుట. మోక్ష మనగా:- సంకెళ్ళను విచ్ఛేదమొనర్చుట. మనము బందనమునందున్నామా? అవును. ప్రప్రథమముగా మనము మాతృగర్భము నందు బంధింపబడియుంటిమి. మాతృగర్భము నుండి బయటికి వచ్చిన తర్వాత బంధవిముక్తి కలిగినదా? కలుగలేదు. ఏల? ఈదేహమనెడి కారాగారమునందు మనము బంధింపబడియున్నాము. "నేను, నా దేహము, నా గృహము, నా భార్యాపిల్లలు" అనెడి దేహవాసనయందు బంధింపబడియున్నాము. ఈ దేహమును త్యజించిన తర్వాత ఈబంధనము నుండి మనము విడివడుదుమా? విడివడజాలము. కారణమేమి? "నేను, నాది" మున్నగు వాసనాజాలము సూక్ష్మరూపమునందు మనలను వెంటాడుటతో, అది మరొక జన్మకు అనగా:- మరొక బంధనమునకు కారణమగును. ఈప్రపంచము ఒక కారాగారము వంటిది. కారణమేమి? ఈ ప్రపంచము నందున్నంతవరకు ప్రపంచమునకు పైనున్న విషయములు మనకు తెలియకుండును. అనగా:- సూర్య చంద్ర నక్షత్రాదులు ఆకాశమునందేవిధముగా ఉనికిని కలిగియున్నవి? వాటి ప్రభావము మనపై ఏవిధముగా పడుచున్నది? అవి లేకుండా మనము జీవింపగలమా? అనువిషయములు మనబుద్ధికి అతీతములై యున్నవి? మన ప్రపంచమునకు పైన ఏడులోకములు, దిగువ ఏడులోకములున్నవి. వాటి పరిజ్ఞానము మనకు కలదా? లేదు. ఈ కారణముచే మన మీ ప్రపంచమునందు బంధింపబడియున్నామని చెప్పవలసియున్నది. ఒక జైలునందున్నవాడు జైలుకు బయటనున్న విషయములను చూచి, తెలిసికొనజాలడు. అదేవిధముగా ఈలోకము నందున్న మనము పైలోకముల గురించిగాని, దిగువలోకముల గురించిగాని తెలుసుకొనజాలము. అన్నింటిని తెలుసుకొనజాలినప్పుడు మనము సర్వజ్ఞులమగుదుము. అదియే! మోక్షమని చెప్పబడును.

పరమాత్మ సర్వవ్యాపకము. మనము ఏకదేశీయులము. అనగా:- మనము ఇక్కడ ఉన్నప్పుడు అక్కడ ఉండజాలము. అక్కడ ఉన్నప్పుడు ఇక్కడ ఉండజాలము. మనమీ దేహమునందు బంధింపబడియుండుటయే! దీనికి గల కారణము. ఈ బంధనము తొలగుటకై మనము వాంఛారహితులము కావలసియుండును. వాంఛయనగా:- కోరిక. మన కోరికలన్నియును కేవలమీ ప్రపంచమునకు సంబంధించినవై యుండును. దేనినైనను కోరకుండా యున్నప్పుడు మనకన్నియును లభించును. కేవలము దేవునిపై కోరికను కలిగి యుండుట నిజమైన కోరిక యనబడును. నిజమైన దానిని తెలిసి కొనగోరుటయే! నిజమైనకోరిక. నిజమైనదేది? పరమాత్మయే! నిజమైనది. పరమాత్మ సర్వజ్ఞుడు. అనగా:- పరమాత్మకు తెలియని విషయమంటూ ఏదీలేదు. దేనిని తెలిసికొన్నచో, ఇంకను తెలిసికొనుటకేదియు మిగిలియుండదో, అది సర్వజ్ఞమని చెప్పబడును. అట్టి సర్వజ్ఞుడైన

పరమాత్మని తెలుసు కొనుటయే! మోక్షమని నుడువబడును. కారణమే మనగా:– అజ్ఞానమే! బంధమునకు హేతువు. జ్ఞానమే! బంధవిమోచనమునకు హేతువు. పరమాత్మయే! సత్పదార్థము. అన్ని కాలముల యందుండునది మఱియు అన్ని దేశముల యందుండునది సత్పదార్థమని చెప్పడును. అన్ని కాలముల యందుండు దానిని మనము తెలిసికొనగలమా? భూతకాలమును మఱచిపోయినప్పుడు అనగా:– భూతకాలములోని కర్మ రహితమైనప్పుడు మఱియు భవిష్యత్కాల భవన సౌందర్యము నందు వ్యామోహము లేనప్పుడు అనగా:– భవిష్యత్కాలము బంధమునకు కారణము కానప్పుడు మఱియు వర్తమానకాలము నందు కేవలము భగవత్స్మరణ చేయగలిగినప్పుడు మనము అన్ని కాలములయందున్న దానిని తెలిసికొనజాలుదుము. అణువణువు నందు పరమాత్మ దర్శనానుభవానందము నొందజాలి నప్పుడు మనకు మోక్షద్వారము తెరువబడును. ఐతే ఈ మోక్ష ద్వారము మరెచ్చటనో లేదు. అది మన హృదయ గుహయందే యున్నది. అది మన హృదయ క్షేత్రమునందే యున్నది. గుహ అంటే లోతైనది కాదు. క్షేత్రమంటే విశాలమైనది కాదు.

ఎంత లోతుకు వెళ్ళినచో ఇంకా లోతుకు వెళ్ళవలసిన అవసరముండదో, అదియే! నిజమైన లోతు. ఒక బావిని త్రవ్వినప్పుడు నీరుపడునంత వరకు మనము త్రవ్వుదుము. నీరు పడిన తర్వాత ఇంకా త్రవ్వవలసిన అవసరముండదు. దైవ కారుణ్యమే! ఈనీరు. దేవుని కరుణ కలిగిన తర్వాత మనకీ ప్రాపంచిక వ్యామోహము నశించును. మరొక విధముగా చెప్పవలయునేని, ప్రాపంచిక వ్యామోహము నశించినప్పుడు మనపై దేవుని కరుణ కలుగును. ఐతే ఈప్రపంచములోని సుఖములు దేవునియందు లేవని తలంపరాదు. దేవుని కరుణ కలిగినప్పుడు మనకు ద్రౌపదిదేవికి వలె అక్షయపాత్ర లభించును. అనగా:– అక్షయ సుఖముకలుగును. ఈ అక్షయ పాత్రను కడిగివేయవలసిన అవసరముండదు. కావున ఈ అక్షయపాత్ర అనంత సుఖము నొసంగును. ఈ యనంత సుఖమే! బ్రహ్మానందమని చెప్పబడును. ఈ బ్రహ్మానందానుభవమే! మోక్షము. మోక్షప్రాప్త్యనంతరము ఏలాటి కోరికలు కలుగుట కవకాశము లేదు. ఏలననగా:– సమస్త కోరికల ఫలితములు మోక్షమునందిమిడి యున్నవి. ఒకవేళ కోరికలున్నచో, అట్టివానికి మోక్షము కలుగలేదని అర్థమొనర్చుకొనవలయును.

మోక్షలక్ష్మి యందు స్వర్గ–మర్త్య–పాతాళ లోకములలోని సుఖములు, భోగములు, ఆనందములన్నియును ఇమిడి యున్నవి. కావున ఈ మోక్షలక్ష్మిని ప్రాప్తింపజేసికొనుటయే! మానవ జీవితమునకు కర్తవ్యము. "నేనీ దేహమును కాను" అను భావన బలపడినప్పుడీ మోక్షలక్ష్మి పొందబడును. "నేనీ చంచలమైన మనస్సునుకాను" అను భావన దృఢపడినప్పుడు మనకీ మోక్షలక్ష్మి లభించును. "నాబుద్ధి కించిజ్ఞమైనదగుటచే దోషభూయిష్టమైనది" అనుభావన బలపడినప్పుడీ మోక్షలక్ష్మి మనలను వరించును. సత్త్వరజస్తమో గుణములచే ఈ జగత్తు నిర్మింపబడినది. కావున సత్త్వరజస్తమో గుణముల నతిక్రమించినప్పుడీ మోక్షలక్ష్మి పొందబడును. మన అహంకారమును పూజ్య(సున్న) మొనర్చినప్పుడీ మోక్షలక్ష్మి పొందబడును. అహంకారమును సర్వవ్యాపక మొనర్చినప్పుడు

కూడా మోక్షలక్ష్మి పొందబడును. ఈ రెండు కార్యములలో ఏ ఒక్క కార్యమునైనా ఒనర్పజాలని మనమందఱమున్నూ జనన-మరణ చక్రమునందు పరిభ్రమించుచున్నాము. మోక్షలక్ష్మిని మించిన ఐశ్వర్యము మరొకటిలేదు. మోక్షలక్ష్మి యందు లవలేశమైన దారిద్ర్యముకూడా ఉండదు. కావున మన మందఱమున్నూ మానవ జీవితలక్ష్యమైనట్టి, పరమానందదాయకమైనట్టి, పరమోన్నత శిఖరము నధిష్ఠింపజేయుటకు కారణమైనట్టి మోక్షలక్ష్మి నార్జించుటకై క్షమాలక్ష్మి నాశ్రయించి, సత్యమైన నిత్యసుఖము ననుభవించుటకై నిరంతరము కృతప్రయత్నులమగుదుము గాక!

(**సేకరణ:** 'శ్రీశివానందవాణి', మే/జూన్, 2014 సంచిక నుండి)

ఓం

# 31. మననానికి మూడు మాటలు

THREE THINGS TO THINK

రచన: – **శ్రీ స్వామి హంసానంద**

1. భగవంతుడు సర్వవ్యాపకుడు. భగవంతుడు సర్వశక్తిమంతుడు. భగవంతుడు సర్వసంపూర్ణుడు.
2. సామాన్యుడవై యుండుము. విశ్వసనీయుడవై యుండుము. మౌనవ్రతుడవై యుండుము.
3. జీసస్‌నందు కృష్ణుని గాంచినప్పుడు చర్చి ఒక మందిరముగా మారును. కృష్ణునియందు జీసస్‌ను గాంచినప్పుడు మందిరమొక చర్చిగా మారును. మహమ్మద్ నందు మాధవుని గాంచినప్పుడు మసీదు ఒక మందిరముగా మారును.
4. ఇతరులను మోసగించుట నిన్ను నీవు మోసగించుకొనుటయే. నిన్ను నీవు మోసగించుట దేవుని మోసగించుటయే. దేవుని మోసగించుట నిన్ను నీవు ఛేదించుకొనుటయే.
5. భక్తిసాగరమునందు మునకలిడువాడే నిజమైన శిష్యుడనబడును. జ్ఞానసాగరమునందు మునకలిడువాడే నిజమైన భక్తుడనబడును. జ్ఞేయసాగరమునందు మునకలిడువాడే నిజమైనజ్ఞానియనబడును.
6. పిల్లిని కొట్టకుము. మేకను నరుకకుము. మాంసమును తినకుము.
7. ఇతరులను మూర్ఖులుగా తలంచువాడే మూర్ఖుడు. తన్ను తాను మూర్ఖునిగా తలంచనివాడే మూర్ఖుడు. పూర్ణత్వము నెఱుంగనివాడే మూర్ఖుడు.
8. అస్తిత్వమే దేవుడు. జ్ఞానమే దేవుడు. ఆనందమే దేవుడు.
9. హిమాలయములే తండ్రి. గంగాదేవియే తల్లి. దేవుడే సర్వస్వము.
10. నేను బ్రహ్మమును. నేనొక గడ్డిపోచను. నేనొక బట్టెను కూడా.
11. నేను పొడుగువాడను. నేను పొట్టివాడను. నేను అందఱియందున్నవాడను.
12. రామసాగరమునందు గంతువేయుము. శ్యాంసాగరమునందు గంతు వేయుము. ఓంసాగరమునందు గంతు వేయుము.
13. ముక్తికి మూలము భక్తి. భక్తికి మూలము భుక్తి. భుక్తికి మూలము శక్తి.
14. తినుటకై జీవింపకుము. మోసగించుటకై జీవింపకుము. దొంగతనముగా జీవింపకుము.

15. మనస్సే దుష్టము. మనస్సే దయ్యము. మనస్సే పోకిరికత్తె.
16. భగవన్నామముచే మనస్సు పవిత్రమగును. భగవన్నామముచే బుద్ధి పవిత్రమగును. భగవన్నామముచే పూర్ణత్వము సిద్ధించును.
17. అతిగా తినుట మంచిది కాదు. అతిగా నిద్రించుట మంచిది కాదు. అతిగా మాట్లాడుట మంచిది కాదు.
18. శాస్త్రమే జ్ఞానమునకు కీలకము. ప్రేయయే భక్తికి కీలకము. హృదయమే ముక్తికి కీలకము.
19. దేనినిగాని కోరకుము. కాని అన్నింటిని కోరుకొనుము. అన్నింటికై ఆ పరమేశ్వరుని కోరుము.
20. హరినామము నుచ్చరించుము. చీకు చింతలను త్యజించుము. సంతోష స్వాంతుడవై యుండుము.
21. నేనొక చీమను చూచితిని – దానియందు దేవుని దర్శించితిని. నేనొక యేనుగును చూచితిని – దానియందు దేవుని దర్శించితిని. నేనొక పిల్లిని చూచితిని – దానియందు దేవుని దర్శించితిని.
22. అనేక కోరికలకు అనేక సమస్యలుండును. ఒక కోరికకు ఒక సమస్య ఉండును. కోరికయే లేకున్నచో, సమస్యయే ఉండదు.
23. "భారతదేశమును వదలి వెళ్ళుమ"ని మహాత్మాగాంధీ పలుకును. "ప్రపంచమును వదలి వెళ్ళుమ"ని యమధర్మరాజు పలుకును. "పదునాలుగు లోకములను వదలి వెళ్ళుమ"ని పరమేశ్వరుడు పలుకును.
24. ఇతరులను ద్వేషింపకుము. ఇతరులను హింసింపకుము. ఇతరులను మోసగింపకుము.
25. దేవునితో దినమును ఆరంభించుము. దేవునితో దినమును అంతమొందించుము. దేవునితో దినమును నింపివేయుము.
26. తాకుము – కాని అనుభవింపకుము. రుచి చూడుము – కాని ఉవ్విళ్ళూరకుము. మరలుము – కాని భయపడకుము.
27. నిన్ను గూర్చి నీవు గుర్తెఱుంగుము. విశ్వమును గూర్చి గుర్తెఱుంగుము. వైశ్వానరుని గూర్చి గుర్తెఱుంగుము.
28. వివేకము మంచి చెడ్డలను గూర్చి విమర్శించును. విచారము శాశ్వతాశాశ్వతములను గూర్చి విమర్శించును. వేదాంతము జ్ఞానాజ్ఞానములను గూర్చి విమర్శించును.
29. ప్రపంచమే ఒక ఆశ్చర్యము. శబ్దమే ఒక ఆశ్చర్యము. పెరుగే ఒక ఆశ్చర్యము.
30. నీ శరీరమును ఎక్సురే తీసినచో, నీకు విరిగిన ఎముకలు కానబడును. నీ మనస్సును ఎక్సురే తీసినచో, నీకు మనస్సుయొక్క మాయ కానబడును. నీ బుద్ధిని ఎక్సురే తీసినచో, నీకు వక్రించిన బుద్ధి కానబడును.

31. నిన్నటిరోజు దాటిపోయినది – దానిని గూర్చి చింతింపకుము. రేపటి రోజు చాల దూరమునందున్నది – దానిని గూర్చి చింతింపకుము. ఈరోజు నీ చేతియందున్నది – దానిని సద్వినియోగమొనర్చుకొనుము.

32. మనుజుడు మరణించినప్పుడు ఆతడు సున్న యగును. మనస్సు తన ఆధారమును తెలిసికొన్నప్పుడు అది సున్నయగును. మనుజుడు భగవత్సాక్షాత్కారము నొందినప్పుడీ ప్రపంచము సున్నయగును.

33. పురుషులందఱియందుగల దేవుని గుర్తించుటకై ఈ నేత్రము లొసంగబడినవి. స్త్రీలందఱియందుగల దేవుని గుర్తించుటకై ఈ నేత్రము లొసంగబడినవి. చరాచరభూతములన్నింటియందుగల దేవుని గుర్తించుటకై ఈ నేత్రములొసంగబడినవి.

34. ఆతని కథను వినుటకై ఈ శ్రోత్రములొసంగబడినవి. ఆతని చరిత్రను వినుటకై ఈ శ్రోత్రములొసంగబడినవి. ఆతని ప్రతిభను వినుటకై శ్రోత్రములొసంగబడినవి.

35. ఆతని పాదపద్మముల యందర్పింపబడిన తులసిని ఆఘ్రాణించుటకై ఈ నాసిక ఒసంగబడినది. ఆతని చరణకమలముల యందర్పింప బడిన బిల్వదళము నాఘ్రాణించుటకై ఈ నాసిక ఒసంగబడినది. ఆతని చరణ సరోజములయందర్పింప బడిన గులాబీని ఆఘ్రాణించుటకై ఈ నాసిక ఒసంగబడినది.

36. ఆతని ప్రతిభను పాడుటకై ఈ నాలుక ఒసంగబడినది. ఆతని చరిత్రను పఠించుటకై ఈ నాలుక ఒసంగబడినది. ఆతని కథను చెప్పుటకై ఈ నాలుక ఒసంగబడినది.

37. దేవుని అన్నముచే ఈ శరీరము పోషింపబడుచున్నది. దేవుని పడక యందీ శరీరము నిద్రించుచున్నది. దేవుని ఇంటియందీ శరీరము పనిచేయుచున్నది.

38. ఆహారమును నింపుటకై నీ కడుపును ఖాళీ చేయుము. దైవభావములను నింపుటకై నీ మనస్సును ఖాళీ చేయుము. దేవుని ప్రతిష్ఠించుటకై నీ హృదయమును ఖాళీ చేయుము.

39. దేవుని కొరకై చేయబడిన పని పూజయే యగును. స్వార్థము కొరకై చేయు పూజ పనియే యగును. పని మఱియు పూజ ఈ రెండున్నూ కవలపిల్లల వంటివి.

40. దేవుని భయముచే ప్రతిదినము సూర్యుడు ఉదయించును. దేవుని భయముచే ప్రతిదినము గాలి వీచును. దేవుని భయము మనుజునికి లేనందుచే తన్నుతాను నాశనమొనర్చుకొనును.

41. దేవుని ప్రపంచమునందు పనిచేయుటకై ఈ చేతులొసంగబడినవి. దేవుని సంతానమును సేవించుటకై ఈ చేతులొసంగబడినవి. దేవుని పాదపద్మములను ప్రణమిల్లుటకై ఈ చేతులొసంగబడినవి.

42. దేవుని ప్రపంచమునందు నడచుటకై ఈ కాళ్ళొసంగబడినవి. దేవుని ఇల్లు చేరుటకై ఈ కాళ్ళొసంగబడినవి. దైవధామమునందు ప్రవేశించుటకై ఈ కాళ్ళొసంగబడినవి.

43. నదియే నా సోదరి. ఆమె జలధియందు ప్రవేశించును. నేను జగన్నాథునియందు ప్రవేశింతును.

44. నేను దేవుని కొరకై నిద్రింతును. నేను దేవుని కొరకై ఏడ్చెదను. నేను దేవుని కొరకై ఊడ్చెదను.

45. నేను దేవునియందు నడిచెదను. నేను దేవునియందు మాట్లాడుదును. నేను దేవునియందు హాస్యమాడుదును.

46. నేను దేవునియందు వెళ్ళుదును. నేను దేవునియందు వచ్చెదను. నేను దేవునియందు పరుగెత్తుదును.

47. నేను దేవునియందు కూర్చుందును. నేను దేవునియందు నిలబడుదును. నేను దేవునియందు చలింతును.

48. కర్మఫలమే దుఃఖము. కర్మఫలమే సుఖము. నా కర్మ పూర్తి కానంతవరకు నేనీ ప్రపంచమునకు వచ్చుచునేయుందును.

49. దానమొనర్చుటకై నేను ధనమునార్జింతును. రాముని ప్రతిభను చాటుటకై నేను ప్రతిభనార్జింతును. శ్యాముని కీర్తిని వెదజల్లుటకై నేను ప్రఖ్యాతి నార్జింతును.

50. క్రాసు అహంకారమును నశింపజేయుటను సూచించును. క్రాసు మమత్వమును మట్టిపాలు చేయుటను సూచించును. క్రాసు జీవబుద్ధిని తుత్తునియలు చేయటను సూచించును.

51. క్రాసు దేవుడు నిన్నాలింగనమొనర్చుటకు సిద్ధముగా నున్నాడని సూచించును. క్రాసు రిక్తహస్తములతో నీవు దేవుని దరిచేరవలయునని సూచించును. క్రాసు నీ కార్యములన్నింటికి దేవుడు సాక్షియైయున్నాడని సూచించును.

52. క్రాసు నీ జీవితమును దేవునికర్పించవలయునని సూచించును. క్రాసు దేవుడు సర్వవ్యాపకుడను విషయమును సూచించును. క్రాసు దేవుడు నీ హృదయమునందే యున్నాడను విషయమును సూచించును.

53. మురళి దేవుని హస్తముల నంటిపెట్టుకొనియుండుమని సూచించును. మురళి నీ యాలోచనలను ఖాళీ చేయుమను విషయమును సూచించును. మురళి సర్వసామాన్యమగు జీవితమును గడుపుమని సూచించును.

54. మురళి దేవుని పాటను పాడుమని సందేశము నొసంగును. మురళి నీ ద్వారా దేవుడు పాడుచున్నాడను సందేశము నొసంగును. మురళి దేవుని హృదయ పూర్వకముగా ప్రేమించుమను సందేశమునొసంగును.

55. మురళి తేలికయైన జీవితమును గడుపుమని సందేశము నొసంగును. మురళి నీ జీవితభారమును దేవుని కర్పించుమని సందేశమునొసంగును. మురళి దేవుని గుణగానము నొనర్చు చుండుమని సందేశము నొసంగును.

56. జీవితములోని ఒడిదుడుకులన్నింటిలో ఒర్పును కలిగి యుండుమని వృక్షము మనకు బోధించును. నీ ఆధ్యాత్మిక సాధనయందు సుస్థిరుడవై యుండుమని పర్వతము మనకు పాఠము నేర్పును. జీవితలక్ష్యము నొందునంతవరకు నీ సాధనను కొనసాగించు చుండుమని నది మనకు బుద్ధి చెప్పును.

57. సాగరము మనకు విశ్వప్రేమను బోధించును. సాగరము మనకు విశాలమైన బుద్ధిని నేర్పును. సాగరము జీవాత్మలు పరమాత్మకు భిన్నమై లేవను విషయమును ప్రబోధించును.

58. సాగరము మనకు ఆత్మ నియంత్రణను బోధించును. సాగరము మనకు ఆత్మజ్ఞానమును ప్రబోధించును. సాగరము మనకు ఆత్మసాక్షాత్కార పథమును నిర్దేశించును.

59. సాగరము మనకు నిర్భయత్వమును నేర్పును. సాగరము మనకు భగవద్ధ్యానమును నేర్పును. సాగరము మనకు భగవత్ప్రతిభను తెలుపును.

60. సూర్యుడు దేవుని గొప్పతనమును చాటిచెప్పును. సూర్యుడు అజ్ఞానాంధకారమును తొలగించును. సూర్యుడు భగవద్భక్తిని ప్రబోధించును.

61. సూర్యుడు దేవుని అస్తిత్వమును ఋజువుపరచును. సూర్యుడు దేవుని ప్రకాశమును ఋజువుపరచును. సూర్యుడు దేవుని బుద్ధి కౌశలమును ఋజువు పరచును.

62. సూర్యుడు మనుజునికి వినయ విధేయతను నేర్పును. సూర్యుడు మనకు దైవభక్తిని ప్రబోధించును. సూర్యుడు ఈ ప్రపంచము యొక్క అశాశ్వతత్వమును తెలియ జేయును.

63. అనవసరముగా వాదించకుము. అనావశ్యక విషయముల కొరకై వాదించకుము. అసందర్భములగు అంశముల కొరకై వాదించకుము.

64. నక్షత్రములు దేవుని సర్వతంత్ర స్వాతంత్ర్యతను తెలియజేయును. నక్షత్రములు మనకు దైవశక్తిని ప్రస్ఫుటమొనర్చును. నక్షత్రములు దేవుని అనంతత్వమును గూర్చి ప్రబోధించును.

65. నక్షత్రములు మనకు విశ్వప్రేమను నేర్పును. నక్షత్రములు మనకు మత సమైక్యతను ప్రబోధించును. నక్షత్రములు మనకు సాంఘిక శక్తిని తెలియజేయును.

66. నక్షత్రములు సామాన్యజీవన యాపనమును నేర్పును. నక్షత్రములు మానసిక స్థైర్యమును బోధించును. నక్షత్రములు 'శాంతి సందేశము' నొసంగును.

67. వర్షము దైవానుగ్రహమును తెలుపును. వర్షము దయాగుణమును బోధించును. వర్షము దైవశక్తిని ఋజువుపరచును.

68. వర్షము ఆరోగ్యము నొసంగును. వర్షము ఐశ్వర్యము నొసంగును. వర్షము శరీరమునకు బలము నొసంగును.

69. వర్షము జలము నొసంగును. వర్షము హర్షము నొసంగును. వర్షము సృష్టికర్తను స్మృతికి దెచ్చును.

70. చంద్రుడు మనస్సునకు చల్లదనము నొసంగును. చంద్రుడు ఊర్ధ్వ గమన సోపానములను సూచించును. చంద్రుడు అధోగమన సోపానములను కూడా సూచించును.

71. చంద్రుడు శివునికి శిరోభూషణము. చంద్రుడు బాలునికొక ఆట వస్తువు. చంద్రుడు పసిపాపకొక ఆనందగుళిక.

72. చంద్రుడు ఆనందము నొసంగును. చంద్రుడు వెన్నెల నొసంగును. చంద్రుడు రాత్రి యంతయు వెలుతురు నొసంగును.

73. దేవుడు నాలోనున్నాడు. దేవుడు నాకు బయట యున్నాడు. దేవుడు నన్ను చుట్టుముట్టియున్నాడు.

74. దైవానుగ్రహమునకై ప్రార్థించుము – కాని ప్రాపంచిక సుఖములకై ప్రార్థింపకుము. దైవానుగ్రహమునకై విలపించుము – కాని ప్రాపంచిక పదార్థములకై విలపింపకుము. దేవుని పాటలను పాడుము – కాని సినిమా పాటలను పాడకుము.

75. దేవుడు పదునాలుగు లోకములలో క్రీడించుచున్నాడు. దేవుడు నాలుగు దిక్కులలో ఆటలాడుచున్నాడు. దేవుడు పంచభూతములలో నాటకమాడుచున్నాడు.

76. చెడ్డమనుష్యుని కారణముచే మంచి మనుష్యుడు ప్రకాశించును. అవిశ్వసనీయుని కారణముచే విశ్వసనీయుడు ప్రకాశించును. అసత్యములాడువాని కారణముచే సత్యసంధుడు ప్రకాశించును.

77. సమస్యలన్నింటికి దేవుడే పరిష్కర్త. కష్టములన్నింటికి దేవుడే పరిష్కర్త. దుఃఖములన్నింటికి దేవుడే పరిష్కర్త.

78. దైవానుగ్రహము నొందినవాడే గొప్ప ధనవంతుడు. దైవానుగ్రహము నొందనివాడే నిరుపేదవాడు. దేవుని ఉనికి ననుభవించువాడే సంతోష స్వాంతుడు.

79. మనుజుని మరణము జ్ఞప్తియందుంచుకొనుము. 'శివుని నాట్యము' (ప్రళయము)ను జ్ఞప్తియందుంచుకొనుము. శునకమునందున్న ఈశ్వరుని జ్ఞప్తియందుంచుకొనుము.

80. రాముడు శివునికి భక్తుడు. శివుడు రామునికి భక్తుడు. ఉభయు లున్నూ వారి భక్తులకు భక్తులు.

81. దేవుని శరణుపొందినప్పుడు దైవానుగ్రహము లభించును. అనన్య చిత్తుడవైనప్పుడు దైవానుగ్రహము లభించును. 'ఇతఃపరంబెరుగన'న్నప్పుడు దైవానుగ్రహము లభించును.

82. విగ్రహమునందు దేవుని దర్శించుము. మూర్ఖునియందు దేవుని దర్శించుము. నిరక్షరకుక్షి యందు దేవుని దర్శించుము.

83. ఆధ్యాత్మిక జీవనమే దివ్యజీవనము. సామాన్య జీవనమే దివ్యజీవనము. విశ్వసనీయ జీవితమే దివ్యజీవనము.

84. దైవదత్త జీవనమే దివ్యజీవనము. భక్తిపారవశ్య జీవనమే దివ్యజీవనము. వివేకయుక్త జీవనమే దివ్యజీవనము.

85. జీసస్ ప్రభువును నేను ప్రేమింతును – కాని జీసస్ ప్రభువును అర్థమొనర్చుకొనని వారిని నేను ప్రేమింపను. బుద్ధదేవుని నేను ప్రేమింతును – కాని బుద్ధదేవుని

అర్థమొనర్చుకొనని వారిని నేను ప్రేమింపను. కృష్ణపరమాత్మను నేను ప్రేమింతును – కాని కృష్ణపరమాత్మను అర్థమొనర్చుకొనని వారిని నేను ప్రేమింపను.

86. నీ ఆస్తిపాస్తులు భూదేవికి చెందును. నీ దేహము పంచభూతములకు చెందును. నీవు స్వయముగా వైశ్వానరునికి చెందియున్నావు.

87. ఆకాశములోని పండుకై అఱ్రులు చాచకుము. కఠిన పరిశ్రమ నుండి తప్పించు కొనకుము. జగత్సత్యతను అంగీకరింపకుము.

88. ఓ దేవా! దేహబుద్ధిచే నేను నీ సేవకుడను. ఓ భగవంతుడా! జీవబుద్ధిచే నేను నీ యొక్క అంశమును. ఓ పరమేశ్వరా! ఆత్మబుద్ధిచే నీకును, నాకును మధ్య భేదమేమియును లేదు.

89. గొప్పవస్తువును గూర్చి బోధించువాడే గురువని చెప్పబడును. సంసార సాగరము నుండి తరింపజేయువాడే గురువనబడును. శిష్యుని అజ్ఞానమును తొలగించువాడే గురువని నుడువబడును.

90. నిజమైన శిష్యుడు గురువునందు దోషములను గాంచడు. నిజమైన శిష్యుడు గురువునందు కేవలము సద్గుణములనే గాంచును. నిజమైన శిష్యుడు తన పురోభివృద్ధిని మాత్రమే ఆకాంక్షించును.

91. దేనిని తెలిసికొన్న తర్వాత తెలిసికొనవలసిన మరియొక వస్తువుండదో, అదియే నిజమైన జ్ఞానము. దేనిని పొందిన తర్వాత చేయవలసినదేమియు మిగిలి యుండదో, అదియే నిజమైన శాంతి. ఏది లభించిన తరువాత మరియొక కోరిక మొలకెత్తదో, అదియే నిజమైన ఆనందము.

92. దేవుడు సూర్య చంద్రులనెడి రెండు నేత్రములతో చూచును. దేవుడు ఉత్తర – దక్షిణ – తూర్పు – పడమర లనెడి నాలుగు చేతులతో పనిచేయును. దేవుడు భూమ్యాకాశములనెడి రెండు కాళ్ళతో నడచును.

93. "ఇది" కూడానైయున్న "అది"యే నేను. "అది" కూడానైయున్న "ఇది"యే నేను. "అది – ఇది" ఏకమైయున్నదేదియో "అది"యే నేను.

94. ఈ ప్రపంచమందున్న దేవుని గాంచనివాడే గ్రుడ్డివాడు. ఈ ప్రకృతిలోని మధురమైన ధ్వనిని విననివాడే చెవిటివాడు. తన హృదయము నందున్న దేవాలయమునకు వెళ్ళనివాడే కుంటివాడు.

95. దేవునికొరకు పనిచేయుటయే తపస్సు. దేవునికొరకు పోరాడుటయే తపన. ప్రాపంచిక సుఖములను గూర్చి చింతించుటయే తమస్సు.

96. అహంకార నాశనమే నిజమైన మరణము. దైవభావ నిర్మాణమే నిజమైన ఆరోగ్యము. భగవన్నామ స్మరణయే నిజమైన ఐశ్వర్యము.

97. "శాంతి సందేశము" నొసంగిన దేవుడే జీసస్ ప్రభువు. "నిర్వాణానందము" నొసంగిన దేవుడే బుద్ధదేవుడు. "గీతామృతము" నొసంగిన దేవుడే శ్రీకృష్ణపరమాత్మ.

98. బిందువు సముద్రమునందున్నది, కాని సముద్రము బిందువునందు లేదు. వృక్షము అరణ్యమునందున్నది, కాని అరణ్యము వృక్షమునందు లేదు. కిరణము సూర్యునియందున్నది, కాని సూర్యుడు కిరణమునందు లేడు.

99. బిందువు సముద్రమునంతటిని ధ్యానించినప్పుడది సముద్రమగును. వృక్షము అరణ్యమునంతటిని ధ్యానించినప్పుడది అరణ్య మగును. కిరణము సూర్యునంతటిని ధ్యానించినప్పుడది సూర్యుడగును.

100. మనస్సు దేవునియందు లీనమైనప్పుడు, ధ్యానము ఫలవంతమగును. బుద్ధి దేవుని ఎదుట తన ఓటమిని అంగీకరించినప్పుడు, ధ్యానము ఫలవంతమగును. ఆత్మ పరమాత్ముని యందైక్యమైనప్పుడు, ధ్యానము ఫలవంతమగును.

101. ఇతరులను చూచి నవ్వకుము; కాని నిన్ను నీవు చూచుకొని నవ్వుము. ఇతరుల కొరకై దుఃఖింపకుము; కాని నీ కొరకై నీవు దుఃఖించుము. ఇతరులను ఉద్ధరించుటకై ప్రయత్నింపకుము; కాని నిన్ను నీవు ఉద్ధరించుకొనుము.

102. గడ్డిపరకలో దేవుని చూడుము. గాజుముక్కలో దేవుని చూడుము. గ్యాసు పొయ్యిలో దేవుని చూడుము.

103. ఇతరులకు బోధించుటకు యత్నింపకుము; కాని నీకు నీవు బోధించుకొనుము. ఇతరులకు నేర్పుటకై యత్నింపకుము; కాని నీ గురించి నీవు నేర్చుకొనుము. ఇతరులను చేరుటకై యత్నింపకుము; కాని నిన్ను నీవు చేరుటకు యత్నించుము.

104. గురువు అగుటకై యత్నింపకుము; కాని నిజమైన శిష్యుడ వగుటకై యత్నించుము. ఆశ్రమమును స్థాపించుటకై యత్నింపకుము; కాని ఆశ్రమ నియమములను పాటించుటకై ప్రయత్నించుము. మహామండలేశ్వరుడవగుటకై యత్నింపకుము; కాని మనస్సును నియంత్రణమొనర్చుటకై యత్నింపుము.

105. జీససే బుద్ధుడు – జీససే కృష్ణుడు. బుద్ధుడే జీససు – బుద్ధుడే కృష్ణుడు. కృష్ణుడే జీససు – కృష్ణుడే బుద్ధుడు.

106. జీసస్‌ను ప్రేమించుము – జీసస్ వలె జీవించుము. బుద్ధుని ప్రేమించుము – బుద్ధునివలె జీవించుము. కృష్ణుని ప్రేమించుము – కృష్ణునివలె జీవించుము.

107. ఓ క్రైస్తవులారా! సంతోష స్వాంతత యనెడి చర్చిని నిర్మించుటకై యత్నింపుడు. ఓ బౌద్ధులారా! కారుణ్యమనెడి బౌద్ధారామమును నిర్మించుటకై యత్నింపుడు. ఓ హిందువులారా! విశ్వప్రేమ యనెడి మందిరమును నిర్మించుటకై యత్నింపుడు.

108. నీ కోరికలను తగ్గించుకొనుము. నీ ఆలోచనలను తగ్గించుకొనుము. నీ వార్తలాపములను తగ్గించుకొనుము.

109. నీకు అవకాశము లేకున్నచో సన్న్యసింపకుము – కాని సన్న్యాసులను అవమానింపకుము. పాపిష్ఠులను ఏవగించుకొనకుము – కాని పాపకర్మలను ఏవగించుకొనుము. ఇతరులపై కనికరించకుము – కాని నిన్ను నీవు కనికరించుకొనుము.

110. ఎక్కువగా నేర్చుకొనుటకై ఇతరులకు బోధించుము. ఎక్కువగా బోధించుటకై ఇతరులనుండి నేర్చుకొనుము. ఎక్కువగా వినయవంతుడవగుటకై ప్రవచనముల నొసంగుము.

111. ఓ మానవుడా! సర్వజీవులను ప్రేమించుటకై దీర్ఘజీవనుడవగుము. ఓ మానవుడా! జీవితము అల్పాయుష్కమని తెలిసికొనుటకై దీర్ఘజీవనుడవగుము. ఓ మానవుడా! నీ హృదయమునందు దేవుని ప్రతిష్ఠించుకొనుటకై దీర్ఘజీవనుడవగుము.

# 32. నా గురుదేవులు

## MY GURU

రచన: – **శ్రీ స్వామి హంసానంద**

1 నా గురుదేవులు పరిపూర్ణ సత్యస్వరూపులు.

2. నా గురుదేవులు ఆనంద సాగరులు.

3. నా గురుదేవులు ఆత్మారాములు.

4. నా గురుదేవులు అనంతపురుషోత్తములు.

5. నా గురుదేవులు దేహ మానసములకతీతులు.

6. ఈ జగత్తులో నా ఉనికికి కారణము నా గురుదేవులు.

7. క్రిందనున్నది నా గురువే. పైనున్నది నా గురువే.

8. ఆద్యంతములు నా గురువే.

9. నా గురుదేవులంటారు, "ఇతరులను మోసగించుట నిన్ను నీవు మోసగించుకొనుటయే".

10. నా గురుదేవులంటారు, "మానసిక స్థితిపై శీలము ఆధారపడియుండును".

11. నా గురుదేవులంటారు, "దాతృత్వము కలవాడు సర్వ జనులచే ఆకర్షితుడగును".

12. నా గురుదేవులంటారు, "బాతాఖానీ మన సమయాన్ని వ్యర్థమొనర్చును".

13. నా గురుదేవులంటారు, "ఒక్కచోటనే త్రవ్వితే జలము లభించును".

14. నా గురుదేవులంటారు, "ఏ వొక్క వ్యక్తిపైగాక, దైవముపై మాత్రము ఆధారపడుము".

15. నా గురుదేవులంటారు, "గహనమైన జ్ఞానము వ్యక్తిని నిరహంకారిగా చేయును".

16. నా గురుదేవులంటారు, "ఈ జగత్తే నాటకము. ఇచ్చట ఏమి జరిగినను నీవు చింతించకుము".

17. నా గురుదేవులంటారు, "ప్రతి వస్తువు ప్రతి సమయములో ప్రతి చోటున ఉన్నది".

18. నా గురుదేవులంటారు, " మనస్సునంతమొందించుట ఆత్మ సాక్షాత్కృతికి ఆరంభమౌతుంది".

19. నా గురుదేవులంటారు, "సదా సత్తాను కలిగియున్న భగవంతుని యందే శాశ్వత శాంతి లభిస్తుంది".

20. నా గురుదేవులంటారు, "నిన్ను నీవు సున్న చేసుకొని, దానిని పరమాత్మతో నింపుము".

21. నా గురుదేవులంటారు, "నీవెచ్చటినుండి వచ్చితివో, నీవెచ్చటికి వెళ్ళుదువో కనుగొనుము"..

22. నా గురుదేవులంటారు, "దైవసాక్షాత్కారమునొందనంతవరకు బంధ విముక్తిని మనమెచ్చటను కనుగొనలేము".

23. నా గురుదేవులంటారు, “మనయొక్క మనస్సునంతయు భగవంతునియందు నిలుపుటయే భగవత్సాక్షాత్కారము”.

24. నా గురుదేవులంటారు, “భగవంతునియందు నిశ్చయాత్మకమైన శ్రద్ధయే ఆత్మసాక్షాత్కారమునొందు రహస్యము”.

25. నా గురుదేవులంటారు, “ఏవిధమైన చెడును నీవెక్కడ చూడలేవో, అక్కడ భగవంతుడుండును”.

26. నా గురుదేవులంటారు,“ప్రతి వ్యక్తియందును భగవంతుని చూచేవాడే మంచి వ్యక్తి”.

27. నా గురుదేవులంటారు, “'అంతవంతములగు వస్తువులను పొందుటయందు సమయాన్ని వృథాచేయువాడే దయ్యము.'.

28. నా గురుదేవులంటారు, “ఆధ్యాత్మిక సాధకునికి భగవంతుడు గురువు రూపముగా ఎదురుపడును”.

29. నా గురుదేవులంటారు, “జీవుడు దేవుని యందు లీనమైనప్పుడు ఆనందము ప్రాదుర్భవించును”.

30. నా గురుదేవులంటారు, “ఏ సమయమునందైనను భగవంతుని విస్మరించనివాడే ఆరోగ్యవంతుడు”.

31. నా గురుదేవులంటారు, “నీ చేతిపనులన్నింటిని భగవంతుని చేతికందజేయుము”.

32. నా గురుదేవులంటారు, “ఇతరులెవ్వరిపట్ల ద్వేషము లేనట్టి వానినే నేను ప్రేమించుదును”.

33. నా గురునాథులంటారు, “నీకు నేను అన్యుడను; నాకు నీవు అన్యుడవు”.

34. నా గురునాథులంటారు, “పరమ సత్యముతో మనలను తాదాత్మ్యము నొందించుటయే మన జీవిత లక్ష్యమై యున్నది”.

35. నా గురునాథులంటారు, “నేను అంటే ఏమిటో ఏమాత్రము తెలియనివాడే అజ్ఞాని”.

36. నా గురునాథులంటారు, “నీవు భగవంతునిలో లేవనుట సత్యమా?”.

37. నా గురునాథులంటారు, “సంతోషమే జీవిత సారము”.

38. నా గురునాథులంటారు, “సకల జీవులయందు భగవంతుని గాంచుట ద్వారా అసూయ అనెడి జబ్బును నయం చేయగలము”.

39. నా గురునాథులంటారు, “అజ్ఞానులైనట్టి జనులు ఎక్కడ నివసించుదురో ఆ చోటే అడవి”.

40. నా గురునాథులంటారు, “పరమాత్మ వైపు ప్రయాణము సాగించుటయే మన జీవిత లక్ష్యము”.

41. నా గురునాథులంటారు, “నీగుఱించి తెలిసికొనుటయే! సత్యమును తెలిసికొనుట”.

42. నా గురునాథులంటారు, “అజ్ఞానపు ముడియే! ఈ జగత్తులో మన జన్మకు కారణము”.

43. నా గురునాథులంటారు, “సాష్టాంగ నమస్కారము అహంకార పతనాన్ని చూచించును”.

44. నా గురునాథులంటారు, “భగవంతుని చేతులలోని గాలిపడగల వంటి వారము మనము”.

45. నా గురునాథులంటారు, “కర్మ అనునది మనకుగా మనము ఉత్పన్న మొనర్చుకొన్నది”.

46. నా గురునాథులంటారు, “నీ సమస్త వస్తుజాలమును దేవుని చేతులయందుంచుము”.

47. నా గురునాథులంటారు, “దైవ సామ్రాజ్యములో అడుగిడుటకు అహంకారమును చంపుకొనుటయే కీలకము.”

48. నా గురునాథులంటారు, “జగత్తునందలి సంతోషాలను త్రోసిపుచ్చి, జీవిత లక్ష్యాన్ని చేరుకొనుము.”

49. నా గురునాథులంటారు, “జీవితమంటే అనంతుడైన భగవంతుని వైపు సాగించే ప్రయాణము.”

50. నా గురునాథులంటారు, “తనను తాను మఱచునట్లు చేయునదే! ప్రేమ.”

51. నా గురునాథులంటారు, “విముక్తి దేశకాలాలకు పరిమితమై ఉండదు.”

52. నా గురునాథులంటారు, “అహంకార కవాటమును మూసివేసి పరిపూర్ణత్వ కవాటమును తెరవండి.”

53. నా గురునాథులంటారు, “ఆత్మచైతన్యాన్ని మూసివుంచే ఒక పలుచని పొరయే మనస్సు.”.

54. నా గురునాథులంటారు, “జగత్తులో పనిచేస్తున్న సత్యాలకు “నా స్వంతం” అను మాట వర్తించదు.”

55. నా గురునాథులంటారు, “డబ్బు ఈ జగత్తులో మనిషిని పెద్దవాణ్ణి చేస్తుంది.”

56. నా గురునాథులంటారు, “మనస్సు జగత్తులోని సంతోషాలను కోరినప్పుడది ఒక కోతిగా తయారవుతుంది.”

57. నా గురునాథులంటారు, “భగవంతుడు జ్ఞానవ్యవస్థకు ఆవలివైపున ఉండువాడగుటచే, ఆతనినెవ్వరూ తెలిసికొనజాలకున్నారు.”

58. నా గురునాథులంటారు, “భగవంతుని కావల ఏదియు ఉనికిని కలిగియుండదు.”

59. నా గురునాథులంటారు, “ఈ తుచ్ఛ జగత్తులో ఉన్నత వ్యక్తియు ఒక అనామకుడే!”

60. నా గురునాథులంటారు, "నిన్ను నీవు మరచిపొమ్ము, కాని భగవంతునెన్నడు మరువకుము."

61. నా గురుమహారాజులంటారు, "బల్లపైన ఉన్నది భగవంతుడే! వ్యాఘ్రమునందున్నది భగవంతుడే!"

62. నా గురుమహారాజులంటారు, "ఒక్క భగవంతునికి తప్ప దేనికిని ఉనికి లేదు."

63. నా గురుమహారాజులంటారు, "హృదయకవాటమును తెరచివుంచుము; ద్వేష గవాక్షమును మూసివుంచుము."

64. నా గురుమహారాజులంటారు, " ద్రష్టలోని భాగమే దృశ్యము."

65. నా గురుమహారాజులంటారు, "పరిపూర్ణత భాగరహితము."

66. నా గురుమహారాజులంటారు, "మనస్సంతా దైవములోనికి చొరబడితే, మనశ్శాంతి సుసాధ్యము."

67. నా గురుమహారాజులంటారు, "భగవచ్చింతనతో మనస్సు నింపబడినప్పుడతనికి నిర్మలత్వము సిద్ధించును."

68. నా గురుమహారాజులంటారు, "నీ సర్వశక్తులను అన్యమైన దాని కొఱకు కాక, దైవసాక్షాత్కారమునకై వినియోగించుము."

69. నా గురుమహారాజులంటారు, "జీవునియందు ప్రాణమెట్లు ప్రవేశించినదను ప్రశ్నకు సమాధానమునొందుటకే ఆధ్యాత్మిక సాధన.'

70. నా గురుమహారాజులంటారు, "ఆత్మజ్ఞానము లేకుండిన కారణముగనే రామ్ – రహీమ్‌ల మధ్య తగవులాట."

71. నా గురుభగవానులంటారు, "ఒక వస్తువు యొక్క రాశికంటె వాసి గొప్పది."

72. నా గురుభగవానులంటారు, "భగవత్సాక్షాత్కారము నొందితే తప్ప మన వాంఛాతృష్ణ తీరుట అసంభవము."

73. నా గురుభగవానులంటారు, "ధనవంతుని దేహము పసిడితోను, పేదవాని దేహము మట్టితోను తయారుచేయబడలేదు."

74. నా గురుభగవానులంటారు, "భగవంతుని ప్రతినిధిగా నీ గురువును తలపోయుము."

75. నా గురుభగవానులంటారు, "భగవత్సాక్షాత్కారమే! మానవ జీవితానికి మెప్పు."

76. నా గురుభగవానులంటారు, "పరిపూర్ణత నొందుటయే! జీవిత సమస్యలకు పరిష్కారము."

77. నా గురుభగవానులంటారు, "అందఱియందు భగవంతుని గాంచుము; ఎవ్వరి యందును చెడును గాంచకుము."

78. నా గురుభగవానులంటారు, "రానున్న అన్ని కాలాలలో భగవంతుని వైభవాన్ని కీర్తించుము."

79. నా గురుభగవానులంటారు, “ఒకే ప్రదేశమునందు కూర్చొని, ‘నే నెవరిని?’ అని నిన్ను నీవు ప్రశ్నించుకొనుము.”

80. నా గురుభగవానులంటారు, “ఆత్మ–భాస్కరుని ధ్యానించే దినము భానువారము.”

81. నా గురుపరమేశ్వరులంటారు, “భగవంతుని చింతించుటయే జీవించుట” యనునది సాధుపుంగవుల సుబోధ.”

82. నా గురుపరమేశ్వరులంటారు, “అహంకారాన్ని సమూలముగా నిర్మూలించు కొనుటకై యత్నించువాడే ఉత్కృష్టుడు.”

83. నా గురుపరమేశ్వరులంటారు, “సంపూర్ణ శరణాగతియే! సంపూర్ణ ప్రేమ రహస్యము.”

84. నా గురుపరమేశ్వరులంటారు, “దేవుని చేతిలో మనము ఆటబొమ్మలము.”

85. నా గురుపరమేశ్వరులంటారు, “ప్రపంచములోని ఖండములు పరమాత్ముని సంయుక్త రాష్ట్రములు.”

86. నా గురుపరమేశ్వరులంటారు, “దైవాన్ని చేరేటంతవరకు మనకు మనశ్శాంతి మృగ్యము.”

87. నా గురుపరమేశ్వరులంటారు, “జగత్తుకు గొడుగే నింగి.”

88. నా గురుపరమేశ్వరులంటారు, “అహంకారాన్ని రూపుమాపు కొనుటయే ఆధ్యాత్మిక సాధకుని కార్యము.”

89. నా గురుపరమేశ్వరులంటారు, “భగవంతుని తెలిసికొనుటయే మానవుని ఉనికికి హేతువు.”

90. నా గురుపరమేశ్వరులంటారు, “మనము మన పరిమిత దృష్టిని వదలితే దైవ దృష్టి సంభవమగును.”

91. నా గురుజగన్నాథులంటారు, “భగవంతుని దృశ్యము ఈ జగత్తు యొక్క దృశ్యమునకు వ్యతిరిక్తము.”

92. నా గురుజగన్నాథులంటారు, “మనము దైవాన్ని మరచినపుడు అపరాధుల మగుదుము.”

93. నా గురుజగన్నాథులంటారు, “భగవంతునికి సంపూర్ణముగా శరణాగతి నొందినపుడు జగత్తేల సృజింపబడినదను దానికి సమాధానము లభించును.”

94. నా గురుపరమేశ్వరులంటారు, “మనిషి ఈ జగత్తు యొక్క మూల కారణమును తెలిసికొన్నప్పుడు అతని విజ్ఞానము విశదమగును.”

95. నా గురుజగన్నాథులంటారు, “భగవంతుని ఆలోచనయే! జగత్సృష్టికి కారణము”.

96. నా గురుజగన్నాథులంటారు, “జగత్తునందు సంచరించుట దైవాన్ని తెలుసుకొనుటకు మార్గము కాదు”.

97. నా గురుజగన్నాథులంటారు, "ఎక్స్‌రే కిరణాలంటే సూర్యుని యొక్క సూక్ష్మ కిరణాలే".

98. నా గురుజగన్నాథులంటారు, "దారువు రూపమునొందిన దేవుడే! జగన్నాథ ప్రభువు."

99. నా గురుజగన్నాథులంటారు, "గయ్యాళి భార్య ఇంటికి నరకము వంటిది."

100. నా గురుజగన్నాథులంటారు, "అతిథి అభ్యాగతులకు ఆతిథ్యము నొసంగుట భారతీయ సంస్కృతి."

101. నా గురునారాయణులంటారు, "భగవంతుని కృపకై అశ్రులు చాచుట ఆధ్యాత్మిక సాధకుని ధర్మమైయున్నది."

102. నా గురునారాయణులంటారు, "ఈ దినము నిన్న అయినది. మఱియు ఈ దినము రేపు నిన్న అగును."

103. నా గురునారాయణులంటారు, "నీయందు, నాయందు, అతనియందు, ఆమెయందు, దానియందు– వీటన్నింటియందు సామాన్యముగా ఉన్నట్టిది ఆత్మ (self )యే! "

104. నా గురునారాయణులంటారు, "యౌవనము నిన్నటి బాల్యము; యౌవనము భవిష్యత్తులో ముసలితనమగును."

105. నా గురునారాయణులంటారు, "జంతుప్రదర్శనశాల భగవంతుని సృష్టిని మనకు ఎత్తిచూపును."

106. నా గురునారాయణులంటారు, "దైవసాక్షాత్కారము నొందాలనెడి పట్టుదల ఆధ్యాత్మిక సాధకునికి ఆవశ్యకము."

107. నా గురునారాయణులంటారు, "మన అహంకారాన్ని శూన్యమొనర్చుకొంటే, జగత్తున్నూ శూన్యమే యగును."

108. నా గురునారాయణులంటారు, "జిందవస్తా మనలను జీవిత లక్ష్యమునకు గొంపోవును."

**నా గురుదేవులు ది. 23-11-2001 తేదీన బ్రహ్మనిర్వాణము**

**నొందిన పిదప ఈ వాక్యములు వ్రాయబడినవి.**

హరి ఓమ్ తత్సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

(అనువాదము: శ్రీ యు. నారాయణరావు, రాజోలు)

# 33. నా మాతృమూర్తి ప్రబోధము

## So Says My Mother

*By:- Sri Swami Hamsanandaji*

1. "సృష్టిలోని సమస్త ప్రాణులు నా సంతానము" అని నా మాతృమూర్తి అంటున్నది.
2. "నా బిడ్డా! యావత్ప్రపంచములోని అన్ని బ్యాంకుల ధనము నా 'సొత్తు' అని నా మాతృమూర్తి అంటున్నది.
3. "నా బిడ్డా! సృష్టిలోని సమస్త దేశములు నాకు సంబంధించినవి" అని నా మాతృమూర్తి అంటున్నది.
4. "నా బిడ్డా! క్రైస్తవులు, ముసల్మానులు, హిందువులు, బౌద్ధులు అందరూ నా సంతానము" అని నా మాతృమూర్తి అంటున్నది.
5. "నా కుమారా! నీ తండ్రి, నీ తాత, నీ తాతకు తాత కూడ నా కుమారులే" అని నా మాతృమూర్తి అంటున్నది.
6. "నా బిడ్డా! నీ తల్లి, నీ అమ్మమ్మ, నీ అమ్మమ్మకు అమ్మమ్మ కూడ నా కుమార్తెలే" అని నా మాతృమూర్తి అంటున్నది.
7. "నా బిడ్డా! నన్ను ధ్యానించుటకొఱకై నిన్ను ముని–కి–రేతి పంపితిని, దానిని మని–కి–రేతి గావించవద్దు" అని నా మాతృమూర్తి అంటున్నది.
8. "నా కుమారా! సరళమైన జీవితమును జీవించుము. కాని జీవితాన్ని నిరర్థకముగా జీవించకుము" అని నా మాతృమూర్తి అంటున్నది.
9. "నా కుమారా! మరణమంటే భయపడకుము. శరీరము వస్త్రము వంటిది. నన్ను నిరంతరము చింతన చేయుము; నేను నీకు అతి సుందరమైన దేహమును ఇచ్చెదను" అని నా మాతృమూర్తి అంటున్నది.
10. "నా కుమారా! నన్ను మఱచిన వారిని నరకమునకు త్రోయుదును; నన్ను గుర్తుంచుకున్న వారికి స్వర్గమార్గమును చూపుదును" అని నా మాతృమూర్తి అంటున్నది.
11. "నా ప్రియమైన బిడ్డా! యావత్సృష్టి నాచే పోషింపబడుచున్నది; అందు నీవున్నూ ఉన్నావు" అని నా మాతృమూర్తి అంటున్నది.
12. "నా బిడ్డా! పదునాల్గు లోకములన్నీ నాచే ఆవరించబడినవి; నిజమునకు ఇతర వస్తువుకు ఎన్నడును సత్తా లేదు"అని నా మాతృమూర్తి అంటున్నది.
13. "నా బిడ్డా! యావత్సృష్టి ఒక పెద్ద స్వప్నము వంటిది. నీవు ఈ స్వప్నము నుండి మెలకువ నొందినప్పుడు నీవు నన్ను చూడగలవు" అని నా మాతృమూర్తి అంటున్నది.

14. “నా బిడ్డా! ప్రతి ఒక్కరు స్వేచ్ఛను వాంఛింతురు; కావున నీ స్వేచ్ఛలో కొంత త్యాగము చేయవలసియున్నది” అని నామాతృమూర్తి అంటున్నది.

15. “నా ఐదు వ్రేళ్ళతో ఈ జగత్తును సృష్టించితిని; అవియే ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి” అని నా మాతృమూర్తి అంటున్నది.

16. “నేను ఒకే ఒక్కదానినే అయినా వివిధ వ్యక్తులు నన్ను వివిధ నామాలతో పిలుచుచున్నారు” అని నా మాతృమూర్తి అంటున్నది.

17. “నా బిడ్డా! వ్యక్తి నాయందు లీనమైనప్పుడాతనికి ఆనందము సంప్రాప్తమగును” అని నా మాతృమూర్తి అంటున్నది.

18. “లోపల, బయట, ముందు, వెనుక, పైన, క్రింద నా ఉనికి ఉన్నది”అని నా మాతృమూర్తి అంటున్నది.

19. “ధనమును, పేరు ప్రతిష్ఠలను సంపాదించుట యోగమనిపించుకొనదు, బిడ్డా!” అని నా మాతృమూర్తి అంటున్నది.

20. “నా ప్రియకుమారా! విశ్వచైతన్యపు వెలుగునందు జీవించుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

21. “నా బిడ్డా! నీవు గాంచునదే ఈ విశ్వమనుకొనకుము, అది దానికి ఆవలనున్నది” అని నా మాతృమూర్తి అంటున్నది.

22. “నా బిడ్డా! నీవు నావైపు అడుగులు వేయుకొలదీ, నీవు అధికాధికముగా ఆనందమునొందుదువు” అని నా మాతృమూర్తి అంటున్నది.

23. “నా బిడ్డా! నీవు జగత్తు అధిగమించి వెళ్ళినప్పుడు నిజమైన స్వేచ్ఛను పొందుదువు” అని నా మాతృమూర్తి అంటున్నది.

24. “నా బిడ్డా! నీవు ఈ ప్రపంచములో శాశ్వత పౌరుడవు ఎంతమాత్రము కావు” అని నా మాతృమూర్తి అంటున్నది.

25. “నీ దేహము పరిమితమైనది కాగా, నీ ఆత్మ అపరిమితమైనది” అని నా మాతృమూర్తి అంటున్నది.

26. “నా బిడ్డా! నీవు భగవంతుని చెంతకు చేరగలిగినప్పుడు మరల నీవు ఈ జగత్తులో అడుగిడుటను వాంఛించవు ”అని నా మాతృమూర్తి అంటున్నది.

27. “యావద్విశ్వముతో నిన్ను అనుసంధించునదేదో అదియే భగవంతుడు’’ అని నా మాతృమూర్తి అంటున్నది.

28. “నిరంతర పరమానందానుభూతికి నిన్ను చేరవేయునదేదో అదియే పురోభివృద్ధి” అని నా మాతృమూర్తి అంటున్నది.

29. “నా బిడ్డా! నీలో ఉనికిని కలిగియున్న ద్రష్ట గోచరింపబడజాలడు’’ అని నా మాతృమూర్తి అంటున్నది.

30. “నా బిడ్డా! ఈ దేహము ఒక బంధిఖానా. నేను పిలిచిన వెంటనే నా చెంతకు చేరుటకు సదా సిద్ధముగా ఉండుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

31. “నా బిడ్డా! నీవు భగవంతునితో సంగమును, జగత్తుతో నిస్సంగము నొంది యుండుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

32. “ఓ నా కుమారా! నీ కష్టాలన్నీ అంతిమముగా మానసికమైనవి” అని నా మాతృమూర్తి అంటున్నది.

33. “జ్ఞానదివ్వెతో అవిద్యను వెదకుట కరదీపికతో చీకటిని వెదకుట వంటిది” అని నా మాతృమూర్తి అంటున్నది.

34. “ఓ నా కుమారా! నీ జ్ఞానము పరిమితమైనట్టిది; పరిపూర్ణతా పరీక్షకు అది నిలువజాలదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

35. “ఓ నా కుమారా! నా కుమారులందఱు నీ సహోదరులు; నా కుమార్తెలందఱు నీ సోదరీమణులు” అని నా మాతృమూర్తి అంటున్నది.

36. “నా బిడ్డా! నీవు నా చెంతకు చేరదలిస్తే ఈ ప్రపంచములో దేనితోను సంసర్గము పెట్టుకొనకుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

37. “మనిషి దేనిని చింతించునో దానిగానే అగును. అందువలన జరుగనున్న కాలమంతయు నన్ను మాత్రమే చింతించుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

38. “నా బిడ్డా! నీ జీవితమునంతటిని నేను కోరుదును కాని, నీ జీవితములో ఒక భాగమును కాదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

39. “నా బిడ్డా! దాతృత్వము లన్నింటికంటె భావ దాతృత్వము శ్రేష్ఠమైనది” అని నా మాతృమూర్తి అంటున్నది.

40. “నా బిడ్డా! సర్వుల సంక్షేమమే నీ సంక్షేమము” అని నా మాతృమూర్తి అంటున్నది.

41. “నా బిడ్డా! నన్ను చేరుటకు పది జన్మలనైనను పట్టనిమ్ము; కాని సదా నా నామమును ఉచ్చరించుచుండుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

42. “మనస్సులో అనుమానపుటూగిసలాట లేకుండా నాపై పట్టువీడని నమ్మకాన్ని కలిగియుండుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

43. “ఓ నా ప్రియమైన బిడ్డా! నిన్ను శూన్యపరచుకొనుటగాని,అనంతమునకు విస్తరించుకొనుటగాని చేసికొనుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

44. “నా బిడ్డా! ఆత్మ చైతన్యమే ఆనందము, దానిని కోల్పోవుట దుఃఖభాజనము” అని నా మాతృమూర్తి అంటున్నది.

45. “నా బిడ్డా! మొదటగా నీకు నీవుగా యోగమును అభ్యసించి, అప్పుడు దానిని ఇతరులకు బోధింపుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

46. “నా ప్రియమైన బిడ్డా! ఇతరవ్యక్తినెవరినీ కాక, ఎవరైతే నా అవసరాన్ని మాత్రమే అనుభూతమొనర్చుకొందురో, అట్టి వారే నన్ను చేరుదురు” అని నా మాతృమూర్తి అంటున్నది.

47 “నీ గురువు యొక్క ఆశీస్సుల వలన నా కృప నీ పై ప్రసరించును’’ అని నా మాతృమూర్తి అంటున్నది.

48. “ఓ నా కుమారా! దేహధారుడైన భగవంతుడే గురువు; దేహరహితుడైన గురువే భగవంతుడు. దీనిని బాగుగా అర్థము చేసికొనుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

49. “ఓ నా బిడ్డా! భగవంతుని స్వరము ఓంకారము” అని నా మాతృమూర్తి అంటున్నది.

50. “ఓ నా కుమారా! నేను ఉండగా, నీవు లేవు; నీవు ఉండగా నేను ఉండను” అని నా మాతృమూర్తి అంటున్నది.

51. “ఓ నా కుమారా! నీవు నదివైతే, నేను సముద్రమును” అని నా మాతృమూర్తి అంటున్నది.

52. “ఓ నా కుమారా! ప్రపంచము స్వప్నమువలె సత్యము, అది స్వప్నమువలె అసత్యమైనది కూడా” అని నా మాతృమూర్తి అంటున్నది.

53. “ఓ నా కుమారా! ఏదైతే నీవు ఇతరులకు చేసితివో, అదియే నీకు చేయబడును” అని నా మాతృమూర్తి అంటున్నది.

54. “ఓ కుమారా! ఋణము తీరునంతవరకు ఈ ప్రపంచమునెవ్వరు తప్పించుకొనలేర” ని నా మాతృమూర్తి అంటున్నది.

55. “పురుషుడు ప్రకృతి వైపు సాగించే పయనమే బంధము, ఓ నా కుమారా! ” అని నా మాతృమూర్తి అంటున్నది.

56. “ఓ కుమారా! ‘బ్రహ్మము’ నందు సమస్త వస్తువులు ఒక్కపెట్టున అనుభవింపబడును” అని నా మాతృమూర్తి అంటున్నది.

57. “ఓ నా కుమారా! ఈ ప్రపంచములోని ఆనందము, స్వర్గమునందలి పరమానందము మఱియు పదునాల్గు లోకాలలోని ఆనందానుభూతులు అన్ని ‘బ్రహ్మము’ లో అనుభవింపబడును” అని నా మాతృమూర్తి అంటున్నది.

58. “నా బిడ్డా! చైతన్యమును భాగములుగా విభజింపవీలుకాదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

59. “ఓ నా బిడ్డా! నేను సమస్తమును ఇమిడ్చుకొన్నట్టి దానిని. నన్ను అధిగమించిగాని, నాకు బాహ్యముగా గాని ఉనికిని కలిగియున్నదేదియు లేదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

60. “నా బిడ్డా! నిజానికి బాహ్యవస్తువులేవీ ఉనికిని కలిగియుండవు” అని నా మాతృమూర్తి అంటున్నది.

61. “నా బిడ్డా! సత్యమును పాక్షికంగా అర్థం చేసికొనుట మంచిది కాదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

62. ‘‘నా బిడ్డా! ప్రతి వస్తువు నందును ఉన్న వస్తువు ప్రతి చోటున ఉండును” అని నా మాతృమూర్తి అంటున్నది.

63. “నీకు వ్యక్తిత్వమున్నది. అందువలన ’నేనున్నూ ఒక పెద్ద వ్యక్తినే‘నని భావించు చున్నావు. కాని అది అట్లు కాదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

64. ‘‘నా బిడ్డా! మొమొమ్మదట నీవు జన్మను తీసికొనెడి ఆత్మను గూర్చి తెలిసి కొనవలసియున్నది” అని నా మాతృమూర్తి అంటున్నది.

65. ‘‘నా బిడ్డా! పంచభూతముల సంకలనాన్నే దేహము అందురు” అని నా మాతృమూర్తి అంటున్నది.

66. ‘‘నా బిడ్డా! ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళేటప్పుడు నీపై గురుకృప పనిచేస్తుంది” అని నా మాతృమూర్తి అంటున్నది.

67. ‘‘నా బిడ్డా! నీవు సూర్యలోకమునకు వెళ్ళినప్పుడు ఆత్మ పరిశుద్ధత నొందును” అని నా మాతృమూర్తి అంటున్నది.

68. ‘‘నా బిడ్డా! భగవంతుని అందము ముందు అన్నియును దిగదుడుపే. విష్ణుభగవానుడు మోహినీ అవతారమును ధరించినప్పుడు సాక్షాత్ శివుని పరిస్థితిని నీవు వినియుండలేదా?” అని నా మాతృమూర్తి అంటున్నది.

69. ‘‘నా బిడ్డా! భగవంతుని నీ స్నేహితుని వలె కూడ భావించవచ్చును! భగవాన్ శ్రీకృష్ణుడు అర్జునునికి మిత్రుడే కదా!” అని నా మాతృమూర్తి అంటున్నది.

70. ‘‘నా బిడ్డా! నీ సమస్త క్రియల ఫలితములను భగవంతునికి అర్పించుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

71. ‘‘నా బిడ్డా! భగవంతుడు సర్వవ్యాపి అగుటవలన అన్యులు భగవంతునిలో ఉనికిని కలిగి ఉండరు” అని నా మాతృమూర్తి అంటున్నది.

72. “ఓ బిడ్డా! ‘నేను అకర్తను’ అని నీవు భావించినప్పుడు నీ క్రియలు ఆధ్యాత్మికతను సంతరించుకొనును” అని నా మాతృదేవి అంటున్నది.

73. “నా బిడ్డా! కేవలము విశ్వాత్మను వాంఛించుచున్నవాడవైతే దానిని పొందుటకు నీవు అడుగు కదుపనవసరము లేదు” అని నా మాతృదేవి అంటున్నది.

74. ‘‘నా బిడ్డా! నీవు దేనిని గూర్చి ఆలోచించెదవో, అదియే అగుదువు” అని నా మాతృమూర్తి అంటున్నది.

75. ‘‘నా బిడ్డా! బ్రహ్మము నీలో ఉంటే, నీవు బ్రహ్మములో ఉన్నావు – ఇదియే వేదాంత సారము” అని నా మాతృమూర్తి అంటున్నది.

76. ‘‘నా బిడ్డా! సృష్టి వైభవమంతయు భగవంతుని వైభవము తప్ప మరేదియు కాదు” అని నా మాతృమూర్తి అంటున్నది.

77. “నా బిడ్డా! భగవంతుని పట్ల ఉన్న భయభక్తులచేతనే సూర్యుడు ప్రకాశించుచున్నాడు, అగ్ని మండుచున్నది మరియు గాలి వీచుచున్నది” అని నా మాతృమూర్తి అంటున్నది.

78. “నా బిడ్డా! సమస్త ప్రాణికోటిని భరించు బ్రహ్మమనెడి సాగరమునందు నీవు నిన్ను విదిల్చుకొంటే, నీవు ‘సద్యోముక్తి’ (కోరినవెంటనే ముక్తి)ని బడయుదువు” అని నా మాతృమూర్తి అంటున్నది.

79. “నా బిడ్డా! బ్రహ్మమును తెలుసుకొన్నవాడు ఇక్కడే ఇప్పుడే ముక్తిని బడయును” అని నా మాతృమూర్తి అంటున్నది.

80. “నా బిడ్డా! నేను నా కుమార్తెలను వారి రక్షణ నిమిత్తమై నా కుమారులనబడే వారికి ఇచ్చుచున్నాను. కాని నా కుమార్తెలను వారు తమ ఆస్తిగా తలచుచున్నారు. అప్పుడు నేను ‘కాళీ’ రూపాన్ని పొందుచున్నాను” అని నా మాతృమూర్తి అంటున్నది.

81. “ఓ నా బిడ్డా! కొంతమంది నా కుమార్తెలు తమ భర్తలను వారి బానిసలుగా చేసుకొనుచున్నారు. అప్పుడు కూడ నేను ‘కాళీ’రూపాన్ని ఎత్తుచున్నాను” అని నా మాతృమూర్తి అంటున్నది.

82. “నా బిడ్డా! నా కుమార్తెలు, కుమారులలో కొందఱికి పెద్ద ఉద్యోగాలను వారు పేదలకు సహాయకారులుగా ఉండగలరని ఇచ్చుచున్నాను. కాని వారు తమ సంపాదననంతయు వారి విలాసములకే వెచ్చించుచున్నారు. అప్పుడు నేను ‘కాళీ’రూపాన్ని ఎత్తుచున్నాను” అని నా మాతృమూర్తి అంటున్నది.

83. “నా బిడ్డా! కొందరు నా పిల్లలను దేశానికి సేవచేయుదురనే తలంపుతో రాజకీయవేత్తలను చేయుచున్నాను. ఐతే, సేవ పేరుతో వారు జాతి సంపదను మ్రింగివేయుచున్నారు. అటువంటప్పుడు నేను ‘కాళీ’రూపాన్ని ధరించుచున్నాను” అని నా మాతృమూర్తి అంటున్నది.

84. “ఓ నా బిడ్డా! సర్వ ఆచార్యులు, సర్వ గురువులు మరియు సర్వ సాధుపురుషులు నా పిల్లలే,” అని నా మాతృమూర్తి అంటున్నది.

85. “నా బిడ్డా! సృష్టి యందలి సమస్త ప్రాణులు నా పిల్లలు. అజ్ఞానులయిన నా పిల్లలకు ఎవరైతే నన్ను పరిచయము చేయుదురో వారు ధన్యులు,” అని నా మాతృమూర్తి అంటున్నది.

86. “ఓ నా బిడ్డా! తూర్పు పడమరలయందు, ఉత్తర దక్షిణములయందు, పైనా, క్రిందా అన్నిచోట్ల నన్ను చూడుము,” అని నా మాతృమూర్తి అంటున్నది.

87. “ఓ నా బిడ్డా! పేరు ప్రతిష్ఠల కొఱకు ఈ ప్రపంచములో పనులను చేయువారు స్వర్గములో ప్రవేశించు ద్వారము చెంత ఒక పొడవైన ‘క్యూ’లో వేచిఉండవలసి ఉన్నది” అని నా మాతృమూర్తి అంటున్నది.

88. “ఓ నా బిడ్డా! జీవిత పర్యంతము నేర్చుకొనుట తుదకు మోక్షమునకు దారితీయును,” అని నా మాతృమూర్తి అంటున్నది.

89. “ఓ నా బిడ్డా! అన్ని మతాలు నన్ను చేరుకొనుటకు వేర్వేరు దారులు. కావున ఏ మతాన్ని అసహ్యించుకొనకుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

90. “ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలందరు, ఆస్ట్రియాలోని ప్రజలందరు, అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

91. “బీహార్‌లోని ప్రజలందరు, బెల్జియంలోని ప్రజలందరు, బెంగుళూరులోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

92. “కోయంబత్తూరులోని ప్రజలందరు, కెనడాలోని ప్రజలందరు, కటక్‌లోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

93. “ఢిల్లీలోని ప్రజలందరు, డెన్మార్క్‌లోని ప్రజలందరు, డెహ్రాడూన్‌లోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

94. “అన్ని ప్రదేశాలలోని ప్రజలందరు, అన్ని కాలాలలోని ప్రజలందరు, ప్రతిచోట ఉన్న ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

95. “ఫరీదాబాద్‌లోని ప్రజలందరు, ఫిజిలోని ప్రజలందరు, ఫైజాబాద్‌లోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

96. “గాంధీనగర్‌లోని ప్రజలందరు, జర్మనీలోని ప్రజలందరు, గంగోత్రిలోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

97. “హైదరాబాద్‌లోని ప్రజలందరు, హాంకాంగ్‌లోని ప్రజలందరు, హిందూపూర్‌లోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

98. “ఇండియాలోని ప్రజలందరు, ఇటలీలోని ప్రజలందరు, ఇండోనేషియాలోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

99. “జార్ఖండ్‌లోని ప్రజలందరు, జపాన్‌లోని ప్రజలందరు, జామ్‌నగర్‌లోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

100. “కర్నాటకలోని ప్రజలందరు, కాశ్మీర్‌లోని ప్రజలందరు, కేరళలోని ప్రజలందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

101. “తూర్పు దేశస్థులందరు, పశ్చిమ దేశస్థులందరు, ఉత్తరాది వారందరు, దక్షిణాది వారందరు నా పిల్లలు” అని నా మాతృమూర్తి అంటున్నది.

102. “ఓ నా బిడ్డా! నీ శరీరము పట్ల జాగ్రత్తపడుము. శరీరాన్ని ఊతగా గొని మాత్రమే నీవు నన్ను చేరుకొనగలవు” అని నా మాతృమూర్తి అంటున్నది.

103. “ఓ నా బిడ్డా! దుర్గా రూపాన్ని సంతరించుకొని నేను నీ జీవితములోని ఆటంకములనన్నింటిని తొలగించుదును” అని నా మాతృమూర్తి అంటున్నది.

104. “ఓ నా బిడ్డా! లక్ష్మీరూపాన్ని సంతరించుకొని నీ జీవితములో సమస్త సంపదలను నీకు ప్రసాదించుదును” అని నా మాతృమూర్తి అంటున్నది.

105. “ఓ నా బిడ్డా! సరస్వతీరూపాన్ని సంతరించుకొని సమున్నత జ్ఞానముతో నిన్ను ఆశీర్వదించెదను; ఆ జ్ఞానముతో నీవు పరమానంద తీరానికి చేరుకొందువు” అని నా మాతృమూర్తి అంటున్నది.

106. “ఓ నా బిడ్డా! ఈ జగత్తులోని ఆటబొమ్మలతో ఆడుకొనుచు అరుదైన ఈ మానవ జన్మను వృథాపరచుకొనకుము” అని నా మాతృమూర్తి అంటున్నది.

107. “ఓ నా బిడ్డా! మరణము నీయొక్క జన్మహక్కు. జన్మరాహిత్యస్థితిని చేరుకోవడం నీ విధి” అని నా మాతృమూర్తి అంటున్నది.

108. ‘ఓ ‘నా ప్రియమైన బిడ్డా! ఈ ప్రపంచములోని ఆనందమంతయు, స్వర్గమునందలి ఆనందానుభూతులన్నియు మరియు 14 లోకముల పరమానందమంతయు మోక్షస్థితి యందున్నది” అని నా మాతృమూర్తి అంటున్నది.

109. “నా బిడ్డా! నీవు నా అందమైన వాహనానివి; నీవు ఎక్కడికి వెళ్ళదలిస్తే అక్కడకు నేను నిన్ను గొనిపోవుదును” అని నా మాతృమూర్తి అంటున్నది.

110. “నిన్ను గుఱించి ఆలోచించుటకు ‘నాకు సమయము లేదు’ అని అనవలదు. కేవలము నన్ను గుఱించి ఆలోచించుటకే నీకు సమయ మొసంగితిని. నన్ను తప్ప సర్వ విషయములను గూర్చి నీవు ఆలోచించుచు, ‘నాకు తీరికలేద’నుచుంటివి. ఎంత వింతయైన బిడ్డవురా నీవు!” అని నా మాతృమూర్తి అంటున్నది.

111. “నీవు దేనిని చూస్తున్నా కేవలము నన్నే చూస్తున్నావు. నీవు దేనిని వింటున్నా కేవలము నా గొంతునే వినుచున్నావు. నీవు దేనిని స్పర్శించినా కేవలము నన్నే స్పర్శించుచున్నావు. దీనిని సాక్షాత్కరించుకొని, ఆనందముగా ఉండుము, నా కన్నతండ్రీ!” అని నా మాతృమూర్తి అంటున్నది.

**నా మాతృమూర్తి నామమేమిటో తెలిసికొనదలచితిరా? ఓ పాఠకులారా! ఆమె మీకు కూడ తల్లియే. ఆమెకు లెక్కకుమించిన నామములు కలవు. ఆమె నామములలో ముఖ్యమైనవి మూడు: 1. అద్వైత లక్ష్మి, 2. ఆనంద లక్ష్మి, 3. మోక్షలక్ష్మి !**

ఓం తత్సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

నా మాతృమూర్తి విధేయ తనయుడు,

**(స్వామి హంసానంద)**

( అనువాదము: యు. నారాయణరావు, రాజోలు )

# 34. సనాతన ధర్మమనగానేమి?

– స్వామి హంసానంద

వేదముల సారము, ఉపనిషద్ధర్మము, పురాణ రహస్యము, భగవద్గీతోపదేశ తత్త్వమే సనాతన ధర్మమనబడును. ఇది ఋషీశ్వరులు, మునీశ్వరులు తమ జీవితముల యందాచరించిన జీవన విధానము.

"ధర్మోరక్షతి రక్షితః" అనగా ఎవ్వడు ధర్మము నాచరించునో, లేక రక్షించునో, అట్టివానిని ఆ ధర్మమే రక్షించును. భగవంతుని ఎడల, సృష్టి ఎడల, సోదర మానవుల ఎడల తనకుగల కర్తవ్యమే ధర్మమని చెప్పబడును. ఈ కారణములచేతనే మన పూర్వీకులు పంచమహాయజ్ఞములను విధించిరి. అవి: 1. దేవయజ్ఞము, 2. ఋషియజ్ఞము, 3. పితృయజ్ఞము, 4. మనుష్యయజ్ఞము, 5. భూతయజ్ఞము.

సత్కర్మాచరణ ద్వారా దేవతలను తృప్తి పరచుటయే దేవయజ్ఞ మనబడును. జప, ధ్యాన, స్వాధ్యాయముల ద్వారా ఋషీశ్వరులను తృప్తి పరచుటయే ఋషియజ్ఞమనబడును. పిండప్రదానము, తర్పణాదుల ద్వారా పితరులను తృప్తి పరచుటయే పితృయజ్ఞమనబడును. సాంఘికసేవ ద్వారా మనుష్యులను తృప్తిపరచుటయే మనుష్యయజ్ఞమనబడను. జీవజంతువులకు, పశుపక్ష్యాదులకు ఆహారమునొసంగుటయే భూతయజ్ఞమనబడును. ఈ కారణము చేతనే శ్రీవ్యాసభగవానులీ క్రింది శ్లోకమును నుడివిరి:

**"శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథ కోటిభిః ।**
**పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ॥"**

తా॥ కోటి గ్రంథముల యొక్క సారమును అర్థశ్లోకమునందు చెప్పుచున్నాను. ఓ జనులారా! వినుడు. ఇతరులకు ఉపకారము చేయుటయే పుణ్యమునకు కారణము; ఇతరులకు అపకారము చేయుటయే పాపమునకు కారణము.

ఈ జన్మలో కష్టములనుభవించువారందఱును పూర్వజన్మలో నిశ్చయముగా ఇతరులకు కష్టమునొసంగియుందురు. ఈ జన్మలో సుఖము ననుభవించువారందఱును నిశ్చయముగా పూర్వజన్మలో ఇతరులకు సుఖము నొసంగియుందురు. ఈ కారణము చేతనే శ్రీ సద్గురు శివానందస్వాములవారు సర్వోపనిషత్సారమును చిన్న చిన్న మాటలలో నుడివియున్నారు.

1. Serve అనగా :– సేవించి తరించుము.
2. Love అనగా :– సర్వులను ప్రేమించి, సర్వేశ్వరుని ప్రేమను చూరగొనుము.
3. Give అనగా :– ఇతరులకు దానము నొసంగి, జీవితమునందు సుఖము ననుభవించుము.

4. Purify అనగా :- నీవు పవిత్రుడవై ఇతరులను పవిత్రవంతులుగా నొనర్చుము.

5. Meditate అనగా :- దైవస్మరణ ద్వారా దైవధ్యానము ద్వారా దైవానుగ్రహము నొందుము.

6. Realise అనగా :- నీ జీవిత ధ్యేయమైయున్న, నీ జీవిత గమ్యస్థానమై యున్న, నీ నిజమైన గృహమైయున్న పరమేశ్వరుని సాక్షాత్కరించుకొనుము. ఇదియే సనాతన ధర్మము యొక్క సారమై యున్నది.

"సర్వం బ్రహ్మమయమ్" భావనను దృఢపరచుకొనుటయే శ్రవణ-మనన-నిధిధ్యాసనలకు లక్ష్యము. ఈ కారణముచేతనే శ్రీసద్గురు శివానందస్వాములవారిట్లు నుడివిరి.

పై వాక్యములనాచరించగలుగు మనుజుడెట్టి దశయందున్నను, ఎట్టి స్థితియందున్నను, ఏ జాతియందున్నను, ఏ స్థానమునందున్నను, దైవానుభూతిని బడయగలుగును. ఇట్టివాడే సనాతన ధర్మము నాచరించిన సౌభాగ్యశాలిగా విలసిల్లును. ఇట్టివాడు విశ్వాత్మభావనాసంభరితుడై ప్రకాశించును.

Start the day with God. End the day with God.
Fill the day with God. Live the day with God.
This is the way to God.

శ్రీ సద్గురు శివానందస్వాములవారు సాధకులకు, భక్తులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు క్రింది సూక్తిత్రయమును ప్రసాదించిరి. "God first, World next, Yourself last" - ఏతద్భావనానుసారవర్తనయే భారతీయులందఱికి ముఖ్యధర్మమై యుండవలయును. పాశ్చాత్యులు దీనికి భిన్నముగా "Myself first, World next, God last" అను సిద్ధాంతమును కలిగియుందురు. భారతీయులు కూడ ఇట్టి సిద్ధాంతము ననుకరింతురేని వారు పతితులగుట తప్పదు. ప్రతి కార్యము నందును పరమాత్ముని ప్రప్రథమముగా స్మరించువారెవ్వరైనను, సనాతన ధర్మావలంబులే యగుదురు. ప్రతి కార్యమునందును అహంకార-మమకారములను కలిగియుండు వారెవ్వరైనను అథఃపతనము నొందక తప్పదు. ఈ కారణముచే జీవిత లక్ష్యము నొందగోరు సాధకులందఱును శ్రీసద్గురు శివానందస్వాములవారి వాక్యములను శ్రవణమొనర్చి, మననమొనర్చి, నిధిధ్యాసనమొనర్చి, తదనుసార వర్తనులై తమ జీవితములను దివ్యానందసంభరితములుగా నొనర్చుకొందురు గాక!

సనాతన ధర్మమునకు అవధులు లేవు. ఇది సర్వమత సమ్మతమైన ధర్మము. దీనిచే మానవుడు శాశ్వత శాంతిని, శాశ్వతానందమును బడయగలుగును. దీనిచే విశ్వకళ్యాణమేర్పడును. ఆధునిక భారతీయులు సనాతన ధర్మము నుద్ధరించుటతో తమ జీవితముల నుద్ధరించుకొందురు గాక!

# 35. పరిశుద్ధమైన గీత

పరిశుద్ధమైన గీత పరిశుద్ధమైన హృదయమునందు ప్రస్ఫుటించును. "శిష్యస్తేఽహం శాధిమాం త్వాం ప్రపన్నమ్" అని దేవునికి, లేక గురువునికి ఆత్మార్పణమొనర్చుకొని, శరణు పొందిన వారి హృదయము పరిశుద్ధమైనదని నుడువవచ్చును. (1)

అహంకార మమకారములను శూన్యమొనర్చుకొన్నవారి హృదయము పవిత్రమైయుండును. "దేహోఽహమ్" భావనయే అహంకారమునకు మూలకారణమై యున్నది. ఈ యహంకార నాశమునకు గీతోపదేశమొక గొడ్డలిపెట్టు వంటిది. (2)

మనమనుభవించుచున్న దేహసుఖము, ఇంద్రియ సుఖము లన్నియును దైవదత్తములు. కావున వాటిని దైవమునకర్పింపకుండా భోగించువాడు చోరుడని చెప్పబడును. అట్టివారి హృదయము అపరిశుద్ధమై యుండును. (3)

గుణకర్మ విభాగముననుసరించి చతుర్విధ వర్ణములు భగవంతునిచే విభజింపబడినవి. కావున సద్గుణవంతుడు బ్రాహ్మణుడనియును, దుర్గుణోపేతుడు శూద్రుడనియును తెలిసికొని వర్తించువారి హృదయము పరిశుద్ధమైయుండును. (4)

చూచుచున్నప్పుడు, వినుచున్నప్పుడు, స్పర్శించుచున్నప్పుడు, వాసన చూచునప్పుడు, భుజించునప్పుడు, నడుచునప్పుడు, ఇచ్చునప్పుడు, తీసుకొనునప్పుడు, కన్నులు మూయునప్పుడు, కన్నులు తెరుచునప్పుడు తానేమియు చేయుటలేదనియు, అన్నియును ఆ పరాశక్తి ప్రభావము చేతనే జరుగుచున్నవనియును తలంచి, జీవించువాని హృదయము పరిశుద్ధమైనదని నుడువనగును. (5)

దేనిని పొందిన తరువాత మనుజుడు మరియొక లాభమును వాంఛింపడో, దేనియందు సుస్థిరుడై యున్నప్పుడు గొప్ప దుఃఖమును కలిగించు సంకటమేర్పడినను చలింపకయుండునో, అట్టివారి హృదయము పరిశుద్ధమైనదని చెప్పనొప్పును. (6)

వాసుదేవుడే సర్వస్వమని భావించు మహాత్ముడు దుర్లభుడై యుండును. అనేక జన్మలు గతించిన తర్వాత ఇట్టి భావన ఏర్పడును. ఇట్టి భావన కలవాడే జ్ఞానియని చెప్పబడును. అట్టి జ్ఞానియొక్క హృదయము పరిశుద్ధమైయుండును. (7)

ఎల్లవేళలలో పరమాత్ముని గూర్చి చింతించునట్టివాడే అంత్యకాలము నందుకూడ పరమాత్ముని చింతింపగలుగును. ఇట్టివానికి ప్రాపంచిక వాసన లంటుకొనవు. అతడు కమలముపైనున్న నీటిబిందువును పోలియుండును. అట్టి వాని హృదయము పరిశుద్ధమై యుండును. (8)

ఈ జగత్తుకు మాతయు, పితయు, పితామహుడున్నూ, ఆ పరమాత్ముడేనై యున్నాడు. కావున ఆ పరమాత్ముని శరణుజొచ్చువాడే నిజమైన భక్తుడు, జ్ఞాని, శూరుడు, ధీరుడు మఱియు వీరుడై యుండును. అట్టివాని హృదయము పరిశుద్ధముగానుండును. (9)

పర్వతములలో హిమాలయ పర్వతమెవ్వడో, నదులలో గంగానది ఎవ్వని విభూతియో, ఆదిత్యులలో సూర్యుడెవ్వడో, నక్షత్రములలో చంద్రుడెవ్వడో, జ్ఞానులలోని జ్ఞానమెవ్వని విభూతియో, అట్టివాడే పరమాత్ముడని తెలిసికొనువాని హృదయము పరిశుద్ధమైయుండును. (10)

ఎవ్వని దివ్యరూపము ఈ చర్మ చక్షువులచే తెలియబడదో, ఎవ్వని విశ్వరూపము కేవలము దివ్యచక్షువు చేతనే చూడబడునో, అట్టి దివ్య చక్షువు నార్జించినవాని హృదయము పరిశుద్ధమైయుండును. (11)

ఎవ్వడు తన మనస్సును మాధవునియందు లయమొనర్చునో, ఎవ్వడు తన బుద్ధిని వాసుదేవునియందు ప్రవేశపెట్టునో, ఎవ్వడెల్లప్పుడు దైవభావమునందే జీవించుచుండునో, అట్టివాని హృదయము పరిశుద్ధమై యుండును. (12)

ఎల్లెడల ఆ సర్వేశ్వరుని పాణిపాదములనెవ్వడు గాంచునో, ఎల్లెడల ఆ పరమాత్ముని శిరస్సును, ముఖములను, నేత్రములను దర్శించుచుండునో, అట్టివాని హృదయము పరిశుద్ధమైనదని చెప్పనగును. (13)

దేహసముద్భవములైన త్రిగుణముల నతిక్రమించినవాడై, జన్మమృత్యు-జరాదుఃఖములనుండి విడివడినవాడై అమృతత్వమునిండినవాని హృదయము పరిశుద్ధమై విరాజిల్లును. (14)

సర్వజగత్తును ప్రకాశింపజేయు సూర్యుని తేజస్సు, చంద్రుని యందున్న చల్లని కాంతి, అగ్నియందున్న వేడిమి ఎవ్వనియందు భాసించుచున్నదో, అట్టి పరమాత్ముని గుర్తెఱింగినవాని హృదయము పరిశుద్ధమైయుండును. (15)

కామ, క్రోధ, లోభములు మూడున్నూ నరకద్వారములని తెలిసికొని, ఈ మూడింటిని త్యజించి, ఆత్మానందమొందువారి హృదయము పరిశుద్ధముగానుండును. (16)

యజ్ఞము, దానము, తపస్సు పావనములని గుర్తెఱింగి, వాటిని తన జీవితమునందనుష్ఠించువాని హృదయము పరిశుద్ధమైయుండును. (17)

అహంకార-మమకారములను, బల-దర్పములను, కామ- క్రోధములను పరిత్యజించి, శాంతస్వభావుడై, పరిప్రశ్న-గురు శుశ్రూషతో సాధకుని హృదయము పరిశుద్ధమై శోభిల్లును. (18)

***ఇట్టి పరిశుద్ధమైన గీతను పఠించియు, శ్రవణ-మననాదుల నొనర్చియు, దానిలోని అంశములను హృదయంగమమొనర్చుకొని, జీవితము నందాచరించువాని హృదయము పరిశుద్ధమగుటతో ఆతడు పరబ్రహ్మానుభూతిని బడయజాలుననుటలో సందేహము లేదు.***

# 36. గీతామేచోత్తమం గృహమ్

– స్వామి హంసానంద

పై శీర్షిక శ్రీ వరాహపురాణమునందుగల గీతామాహాత్మ్యములోని 7వ శ్లోకములోని రెండవ పాదము. ఈ గీతామాహాత్మ్యము శ్రీ విష్ణుభగవానునిచే భూదేవికి చెప్పబడినది. గీతను అశ్రయించి నేను నివసించియున్నానని భగవంతుడు పలికెను. అంతేకాకుండా "గీత నాకు ఉత్తమమైన గృహము" అని పలికెను. అందువల్ల ఏ ఏ గృహమునందు భగవద్గీత యొక్క పారాయణము, పఠన పాఠనాదులు చేయబడునో, ఆయా గృహములలో తప్పక భగవంతుడు నివసించునని భావము. ఈ "గీతాజ్ఞానము నాశ్రయించి నేను మూడు లోకములను పరిపాలించుచున్నాన"ని కూడ శ్రీ విష్ణుభగవానుడు నుడివెను. దీనినిబట్టి గీతాజ్ఞానమెంత గొప్పదో మనము గ్రహింపవచ్చును. ఈ సంసారసాగరమును తరించుటకు గీతయనెడి నావలో కూర్చున్నచో చాలును. ఐతే, గీతాజ్ఞానము కలవాడే ఈ గీతయనెడి నావను నడుప గలుగును. ఇచ్చట గీతయే నావ, గీతయే నావికుడని అర్థమొనర్చు కొనవలయును.

ఈ గీతాజ్ఞానము చేతనే అర్జునుడు అపారమైన కౌరవసైన్యమును హతమొనర్ప గలిగెను కదా! గీతాజ్ఞానము మానవమాత్రులందఱికి అత్యవసరమైన ఔషధము వంటిది. భవరోగమును నివారించుటలో గీతాజ్ఞానమనెడి ఔషధము నిస్సందేహముగా ఉత్తమమైనది. "గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే" అనియును మాహాత్మ్యమునందు చెప్పబడినది. దుఃఖ భూయిష్ఠమైన పునర్జన్మను రహితమొనర్చుకొనదలంచినవారు గీతయనెడి గంగోదకమును పానము చేయవలయును. ఈ గీతాగృహమునకు 18 అధ్యాయములనెడి 18 అంతస్తులు కలవు. 18 వ అంతస్తును చేరిన వారికి మోక్షము చేకూరును. ఐతే, ఈ 18వ అంతస్తును చేరుటకై "అర్జున విషాద యోగము" నుండి ఒక్కొక్క అంతస్తును అధిరోహించుచుండవలయును. మొదటి మూడు అంతస్తులు కర్మయోగము ననుష్ఠింపజేయును. దిగజార కుండుటకై "ధ్యాన"మనెడి స్తంభమును గట్టిగా పట్టుకొనవలసి యుండును. తర్వాతి మూడు అంతస్తులు భక్తియోగము ననుష్ఠింపజేయును. అచ్చటినుండి దిగజారకుండుటకై "భక్తి"యనెడి స్తంభమును గట్టిగా పట్టు కొనవలసి యుండును. చివరి మూడు అంతస్తులు జ్ఞానయోగము ననుష్ఠింప జేయును. ఇచ్చట కూడ దిగజారు అవకాశమెంతోయుండును. కావున ఇచ్చట "అభ్యాసము, వైరాగ్యము" అనెడి రెండు స్తంభములను రెండు చేతులతో దృఢముగా పట్టువిడువకుండా పట్టుకొనవలసియుండును. శ్రీకృష్ణ భగవానుడు గీతాచార్యుడు. ఆధ్యాత్మిక సాధకుని గమనమును ఈ గీతాచార్యుడు పరికించుచుండును. శ్రీకృష్ణభగవానుని కృపాకటాక్షముచే ఏ యంతస్తు నుండియు క్రిందికి దిగజారుట సంభవింపదు. ఐతే సాధకుని యందు శ్రద్ధ, విశ్వాసము, సత్యసంధత యుండుట ఆవశ్యకమగును. జీవితము నందట్టి దివ్యమైన ఆచరణను కలిగియుండి, ప్రతివారు ప్రతి గృహములో ప్రతి రోజు పారాయణ పఠనాదులనొనర్చుచు, గీత యనెడి ఉత్తమ గృహమును అనగా మోక్షధామమునొంది, శాశ్వత సుఖము ననుభవించెదము గాక! (శ్రీ సహజానంద గీతాసమాజము, స్వర్ణోత్సవ సంచిక, పేజీలు: 126, 127 నుండి)

# 37. మంచిని మించిన మహిమ లేదన్న మాత

– స్వామి హంసానంద

మహిమలు చూపే మనుజులంటే మానవులందఱికి మోజుగా ఉంటుంది. కాని ఏ మహిమైనా ఎందుకు పనికి వస్తుంది. ఏ మహిమైనా మానవుడు తన కోరికలను తీర్చుకోవడానికి మాత్రమే పనికి వస్తుంది. కోరికలను కొంత వరకు తీర్చుకోవడం తప్పు కాదు. ఐతే కోరికలను తీర్చు కున్నప్పుడు, అవి కొంత వరకు మాత్రమే తృప్తిని కలిగిస్తాయన్న మాటను మనము గుర్తుంచుకోవాలి. ఒక కోరిక తీరిన తరువాత మరొక కోరిక మొలకెత్తుతుంది. కోరికలకు అంతమనేది ఉండదు. ఏ కోరిక తీరితే మరొక కోరిక కలుగకుండా ఉంటుందో, అదే నిజమైన కోరిక అని చెప్పబడుతుంది. ఆధ్యాత్మిక సాధకుని కోరిక ఇట్టిదై ఉంటుంది. ఇట్టి కోరికయే మోక్షాపేక్ష అని చెప్పబడుతుంది.

నేను శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మగారిని భౌతిక నేత్రాలతో దర్శింపలేదు. కాని జిలుగులను వెదజల్లే జిల్లెళ్ళమూడి అమ్మగారి పలుకులను శ్రీ చాగంటి వేంకట్రావుగారి ద్వారా వినడం జరిగింది. అమ్మ పలుకులు అతి సామాన్యంగా ఉంటాయి. ఐనను, ఆ పలుకులు తేనెలొలుకును. అవి శ్రుతి స్మృతి పురాణేతిహాసాల సారస్వరూపములగు అమృత గుళికలను పోలి ఉంటాయి.

ఉదాహరణకు ఒక మనుజునితో అమ్మ ఇలా అన్నది, “మంచిని మించిన మహిమ ఏముంటుంది, నాన్నా!” అని. ఇది అక్షరాల నిజమే కదా! కారణమేమనగా: రావణాసురుడు కైలాసమును కూడ కదిలించే మహిమ కలవాడై ఉండి కూడ మంచి చేయగలిగినాడా? పృథ్వినంతటిని దద్దరిల్లజేయు నంతటి మహిమను కలిగియున్న హిరణ్య కశిపుడు మంచి చేయగలిగినాడా? అందువల్ల మంచిచేయని మహిమలన్నీ నిష్ప్రయోజనములని తెలిసిన తల్లి, “మంచిని మించిన మహిమ ఏమున్నది, నాన్నా!” అని తన బిడ్డతో నిస్సంకోచముగా చెప్పగలిగింది.

“రూపాలు భేదం కానీ, అన్నీ దైవమే” అన్నది మరొక మాట. ‘‘ఉన్నది ఎప్పుడూ ఉండనే ఉంటుంది; లేనిది ఎప్పుడూ లేకుండానే ఉంటుంది.” “యద్ దృశ్యం తన్నశ్యం” అనేది అద్వైత సిద్ధాంతం. రూపాలన్నీ నశించేవి. ఈ రూపాలలో ఉన్న నాశనములేని పదార్థమే దైవం. ‘‘భేదం ఉన్నచోట బాధ ఉంటుంది; భేదం లేనిచోట బాధ రహితమౌతుంది” అనే సత్యాన్ని పై వాక్యం ప్రస్ఫుటం చేస్తుంది. ఒక భక్తుడు “జ్ఞాన నేత్రం ఇవ్వమ్మా” అని అమ్మను కోరెను. “నా కుంటే కదా, మీకు ఇవ్వడానికి” అని అమ్మ ఛలోక్తిగా పలికెను. నిజానికి జ్ఞాననేత్రం అందరిలోను ఉన్నది. అది ఇచ్చేది గాని, పుచ్చుకొనేది గాని కాదు. దానిని ఉపయోగించుకోవడం అమ్మకు తెలుసు. మనకు తెలియదని పై ఛలోక్తి యొక్క భావార్థము.

స్త్రీ పురుష భేదము దేహానికే కాని, దేవునికి ఉండదు. అంతా అమ్మే అనుకోవడం దేవీ ఉపాసన. అంతా ఆయనే అనుకోవడం దేవుని ఉపాసన. దేహభావము

కలవాడు అజ్ఞాని; దైవభావం కలవాడు సుజ్ఞాని. అమ్మ జన్మదినోత్సవం ఏప్రియల్, 13వ తేదీన జరుగనున్నది. 13ను హిందీ భాషలో "తేరా" అంటారు. దానికి "నీదే" అని మరొక అర్థం కూడ ఉన్నది. అందువల్ల అమ్మ భక్తులందరు కనీసం ఆ రోజైనా "అంతా నీదే అమ్మా" అనుకోవాలి. అటువంటివారే నిజమైన అనసూయాదాసులు అనబడతారు. "అనసూయ" అంటే అసూయలేని తల్లి అని అర్థం. అందువల్ల అసూయ లేనివారందఱూ అనసూయదాసులే. "అంతా నీవే అమ్మా!" అనుకున్నప్పుడు అసూయ అనేది ఉంటుందా? ఒకవేళ అసూయ ఉంటే "అంతా నీవే అమ్మా" అను మాటకు అర్థం ఉండదు.

మే 5వ తేదీన అమ్మ కళ్యాణ దినం. బ్రహ్మాండనాయకుడైన శ్రీ నాగేశ్వరరావుగారితో అమ్మ కళ్యాణం జరిగింది. మనమంతా సీతారాముల కళ్యాణం, పార్వతీపరమేశ్వరుల కళ్యాణం, రుక్మిణీ కళ్యాణములను జరుపుకొన్నట్లే అమ్మ విషయములో "బ్రహ్మాండ నాయకి కళ్యాణం బ్రహ్మాండ నాయకునితో జరిగింది" అని అనుకోవాలి. బ్రహ్మాండ నాయకుడు సాక్షి మాత్రుడు. చేసేది, చేయించేది, చూచేది, చూపించేది – అంతా బ్రహ్మాండ నాయకి అయిన అమ్మే. ఇట్టి సద్భావనతో మే నెల 5వ తేదీన అమ్మ కళ్యాణ దినం జరుపుకొంటే మనందఱికి అన్ని కార్యాలలోను కళ్యాణమే (శుభమే) జరుగుతుంది.

మే 12 వ తేదీన అమ్మ నిర్యాణదినం. లోకులందరికి అది అమ్మ నిర్యాణదినం. కాని సాధకులందఱికి అది అమ్మ నిర్వాణదినం. దేహమును త్యజించుట "నిర్యాణము"అని చెప్పబడుతుంది. ఇక జీవాత్మ పరమాత్మలో లీనమగుట "నిర్వాణము"అని చెప్పబడుతుంది. లోకంలోని తల్లి తన స్వంత పిల్లలను మాత్రమే ప్రేమించును. కాని లోకానికి తల్లియైన విశ్వజనని లోకంలోని తన పిల్లలందఱిని అననేల? ప్రాణులందఱిని చరాచర జీవులందఱిని ప్రేమించును. అందఱినీ ప్రేమించే అమ్మ "జగజ్జనని" లేక "విశ్వజనని" అని చెప్పబడును. అట్టి అమ్మను దర్శించినవారి జీవితములు ధన్యములు. ఇట్టి అమ్మల ఆవిర్భావం భారతమాతకు గర్వకారణం. అమ్మ యొక్క ఆదర్శాలను ఆచరించువారు ఆనందసాగరము నందోలలాడుదురు. అమ్మ దేహంతో ఉన్నా, లేకున్నా అమ్మ ప్రేమను అనుభూతిలోనికి తెచ్చుకొని ఆనందించడమే అసలైన ఆధ్యాత్మిక సాధకుల లక్షణం. అమ్మ కృపాకటాక్ష వీక్షణములు మోక్షమార్గము ననుసరించి, ముముక్షువులందఱిపై ఎల్లప్పుడు ప్రసరించుచునే యుండును. ఐతే, ఆ కృపాకటాక్ష వీక్షణములను ఎల్లప్పుడు అనుభూతికి తెచ్చుకొనుచుండువారి జీవితములు మాత్రమే సార్థకములగును. తమ జీవితములలో మంచిని పెంచుకొనదలచిన వారందఱున్నూ "మంచిని మించిన మహిమ లేదను మాత"ను ఆదర్శముగా నుంచుకొనవలయును. అట్టివారే ధర్మార్థకామమోక్షములనెడి చతుర్విధ పురుషార్థములను సాధింప గలుగుదురు. ఇట్టి సాధకులు అండ పిండ బ్రహ్మాండములన్నిం టినిలో నిండియున్న బ్రహ్మసాక్షాత్కారమును నొందినవారై బ్రహ్మానందామృతపానము నొనర్పజాలుదురు. ఇదియే మానవజీవితము యొక్క పరమలక్ష్యము. ఇట్టి జీవిత లక్ష్యము నొందుటకై విశ్వజనని యొక్క విశ్వప్రేమ విశ్వములోని జనులందఱిపై శాశ్వతముగా ప్రసరింపబడుచుండును గాక!

(– విశ్వజనని, ఏప్రియల్, 2003, పేజి–33,34)

# 38. పూజ్యశ్రీ స్వామివారితో నాకు గల పరిచయము

**అ**వి నేను శ్రీవ్యాసాశ్రమమునందంతేవాసిగా నుంటున్న రోజులు. ఆ సమయము నందు బ్రహ్మచారి శ్రీగోపాల్‌గారు (పూజ్యశ్రీ విద్యా స్వరూపానందస్వాములవారు) శ్రీవ్యాసాశ్రమమునకు సంబంధించిన ఆంతరిక మఱియు బాహ్యకార్య నిర్వహణాధికారిగా నుండిరి. ఒకరోజు పూజ్య శ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు ప్రప్రథమముగా గీతాజ్ఞాన యజ్ఞమును నిర్వహించుటకు పూర్వము– తన గురుదేవులైన శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి ఆశీస్సులను పొందుటకై శ్రీశుకబ్రహ్మాశ్రమము నుండి శ్రీవ్యాసాశ్రమమునకేతెంచిరి. అప్పుడు శ్రీస్వాములవారొక కరపత్రమును శ్రీవారి చేతికందించిరి. దానిలో నేను "శ్రీవిద్యాప్రకాశానంద మహారాజ్" అని చదువుచుండగా, శ్రీవారు "మహారాజ్" అను పదము సన్యాసులకు తగినది కాదని శ్రీవారిని హెచ్చరించిరి.

గురుదేవులు తమ శిష్యులనుద్ధరించుటకై ద్వంద్వార్థము నొసంగునట్లు మాట్లాడు చుందురు. ఈ ప్రత్యేక విషయమునందు "మహారాజ్" అను పదముచే సన్యాసులకు గర్వము, అహంకారము పెరుగునని శ్రీవారి భావము. కావున తన శిష్యునికి గర్వాహంకారములు రాకుండుటకై పై విధముగా హెచ్చరించిరి. ఇక రెండవ భావమేమనగా – "మహారాజ్" అను పదము "సన్యాసి" విషయములో మిక్కిలి స్వల్పమైన పదము. కారణమేమనగా – నిజమైన సన్యాసి బ్రహ్మవేత్తతో సమానమైయుండును. నిజమైన సన్యాసి దేవేంద్రుని కంటెను గొప్పవాడు. "మహారాజ్" అను పదము లౌకికార్థము నొసంగును. కావున "ఓ విద్యాప్రకాశానందస్వామి! నీవు బ్రహ్మవేత్తవు. కావున బ్రహ్మవిద్యాప్రకాశమును లేక ఆత్మ విద్యాప్రకాశమును విస్తరింపచేయుమని" శ్రీవారు తమ శిష్యోత్తముని హెచ్చరించిరి. తదనుగుణముగనే పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు గర్వాహంకార రహితులై 108 గీతాజ్ఞాన యజ్ఞములను నిర్వహించి బ్రహ్మవిద్యాప్రకాశమును భారతావని యందంతటను శోభాయమానముగా విస్తరింపజేసిరి.

పూవు పుట్టగనే పరిమళించునన్నట్లు పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు తమ ఉన్నతవిద్య పూర్తికాగానే మహర్షి మలయాలస్వాముల వారి చరణకమలముల నాశ్రయించి, శ్రీవ్యాసాశ్రమమునందు తమ యందంతర్నిహితమైయున్న విద్యను ప్రకాశింపజేసిరి. దీనికి చిహ్నముగా వారు "యోగవాసిష్ఠము"లోని సంస్కృతశ్లోకములను తెలుగుభాషయందనువదించి శ్రీవారి మన్ననలనందుకొనిరి. తదనంతరము "యోగవాసిష్ఠము" నాలుగు వాల్యుములను శ్రీవ్యాసాశ్రమము ప్రచురించిన విషయము పాఠకులకు సువిదితమే. శ్రీవేదవ్యాసులవారి కుమారుడు శుకయోగి. ఈ స్ఫూర్తినందగాగొని, పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు శ్రీకాళహస్తికి సమీపమునందు శ్రీశు కబ్రహ్మాశ్రమమును స్థాపించిరి. ఒకరోజు సద్గురు మలయాళస్వాములవారు, మరికొందఱు సాధువులతో పాటు సాధు శ్రీహరి (స్వామి హంసానంద) ని శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు వార్షికోత్సవ సందర్భముగా పంపించిరి. అప్పుడు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వామివారి

గీతాప్రవచనమును ప్రప్రథమముగా శ్రవణము చేయుట సంభవించెను. శ్రీ శుక బ్రహ్మాశ్రమము యొక్క ప్రశాంత వాతావరణము నాకెంతయో హృదయాహ్లాదము నొసంగెను.

నేను 1965లో ఋషీకేశ్‌లోని శ్రీశివానందాశ్రమమునందు చేరుట సంభవించెను. ఆ సమయమునందు బ్రహ్మచారి శ్రీగోపాల్‌గారు (పూజ్యశ్రీ విద్యాస్వరూపానంద స్వాములవారు) శ్రీ శివానందాశ్రమమున కెదురుగానున్న "పరమార్థనికేతన్"లో కొన్ని సంవత్సరములు సంస్కృతములో శ్రుతిస్మృతుల నభ్యసించిన తదనంతరము ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళి, బ్రహ్మవిద్యాస్వరూపులుగను, శ్రీశుకబ్రహ్మాశ్రమమునకు పీఠాధిపతిగను ప్రస్తుతము ప్రకాశించుచున్నారు. "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనునట్లు బ్రహ్మనిష్ఠులైన గురువుల నాశ్రయించినప్పుడు బ్రహ్మవిద్యయే తన జీవితమునకు ఆస్తియగును. "విద్యాతపోభ్యాం పూతాత్మా"యనునది మహర్షి మలయాళస్వాములవారి ప్రముఖవాక్యము. తదనుగుణముగా విద్యచేతను, తపస్సుచేతను పవిత్రాత్ములై పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ప్రకాశించిరి. ప్రస్తుతము వారి స్థానమునందు పూజ్యశ్రీ విద్యాస్వరూపానంద స్వాములవారు ప్రకాశించుచున్నారు.

నేను పూజ్యపాద కృష్ణానందస్వాముల (దివ్యజీవనసంఘ ప్రధాన కార్యదర్శి) వారి ఆదేశానుసారముగా 1970 సంవత్సరమునుండి శ్రీశివానందాశ్రమమునకు సంబంధించిన పోష్టాఫీసులో సేవచేయుచున్నాను. ఒకరోజు పూజ్యశ్రీవిద్యాప్రకాశానందస్వాములవారు తెలుగులో వ్రాసిన "గీతామకరందము"అను గ్రంథము ఆంగ్లభాషయందనువదింప బడినదను విషయమును తెలుసుకొని, పూజ్యపాద శ్రీకృష్ణానందస్వాములవారు తమకొక గ్రంథము కావలెనని నాకు చెప్పిరి. నేను శుకబ్రహ్మాశ్రమమునకు వ్రాయగా పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ఉచితముగా ఆ గ్రంథము నంపించిరి. దానిని పూజ్యపాద కృష్ణానంద స్వాములవారికివ్వగా దానిని వారు పఠించి మిక్కిలి ముదమునొందిరి. గీతామకరంద గ్రంథపఠనము – మధువు (తేనె) ను త్రాగుట వంటిది. ''మాండూక్యమేవాలం ముముక్షూణాం విముక్తయే'' అన్నట్లు నేటికాలములో "గీతామకరందమేవాలం ముముక్షూణాం విముక్తయే" యని చెప్పవచ్చును. ఇట్టి అత్యుత్తమ గ్రంథరచన గావించిన పూజ్యశ్రీ స్వామివారికి జోహార్లు.

ఇక విద్యాగంధములేని పామరజనుల నుద్ధరించుట కూడా అత్యావశ్యకమని పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వామి వారికి తోచెను. ఈ కారణముచే నిరక్షరకుక్షుల కొఱకు "జీవుడా! మేలుకో" వంటి పాటలను పాడి ప్రజలకు వినిపించిరి. ఇటువంటి పాటలకు శ్రీస్వామివారు "తత్త్వసారము" అను నామము నొసంగిరి. ఈ తత్త్వసారమును తెలిసికొనుటకై సద్గురుని చెంత వసింపవలయునని హెచ్చరించిరి. అప్పుడే ఈ జగత్తు యొక్క సారమైన సత్యవస్తువు తెలియబడునని తెలిపిరి. దీనిని తెలిసికొనుటచే లాభము కలుగునని మందలించిరి. ఈ లాభము ప్రాపంచిక లాభము కాదు, కాని ఇది పారమార్థిక లాభము. ఐతే ప్రాపంచిక లాభముచే పారమార్థిక లాభము పొందబడదు. కాని పారమార్థిక లాభముచే పరమార్థముతో పాటు ప్రాపంచిక లాభము కూడా పొందబడును. దీనికి కారణము పూర్తి ప్రపంచము

పరమాత్మయందున్నది. కాని పూర్తి పరమాత్మ ప్రపంచమునందు లేదు. ఈ ప్రపంచము కేవలము పరమాత్మ యొక్క నీడయే!

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు "వేదాంతభేరి" మాసపత్రిక ద్వారాను, 108 గీతాజ్ఞాన యజ్ఞముల ద్వారాను, 58 గీతా సదస్సుల ద్వారాను నిజంగానే వేదాంతభేరిని మ్రోగించిరి. ఆ భేరీనినాదము ఆధ్యాత్మిక సాధకులకు, భక్తులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు తప్పక వినబడును. శ్రీవారు గీతామకరందమే కాకుండా "మోక్షసాధన రహస్యము"ను విరచించి, ముముక్షువులకు మోక్షమార్గమును నిర్దేశించిరి. "భారత రత్నాకరము" ద్వారా మహాభారతములోని ఆచరణాత్మకములగు అంశములను మనకందించిరి. "భాగవత రత్నాకరము" ద్వారా భాగవతములోని భక్తుల గుణగానములను మన శ్రోత్రముల కందించిరి. ఇక "ఉపనిషద్రత్నాకరము" ద్వారా జీవిత లక్ష్యమగు జ్ఞానసారమును మనకందించిరి. "భక్త కన్నప్ప త్రినేత్ర ఉచిత వైద్యశాల"ను స్థాపించుట ద్వారా శ్రీస్వాములవారు ప్రజలకు జ్ఞాననేత్ర ప్రకాశంతో బాటు భౌతికనేత్రప్రకాశమును కూడ ప్రసాదించిరి.

2013 సంవత్సరము ఏప్రిల్ నెలలో మనము శ్రీస్వామివారి శత జయంత్యుత్సవము లను జరుపుకొనుచున్నాము. ఈ ఉత్సవము కేవలము ఆ సంవత్సరమునకే స్థగితమై యుండరాదు. ఈ యుత్సవము ఆధ్యాత్మిక సాధకులకు సంపూర్ణజ్ఞానార్జనకై తోడ్పడునట్టిదైయుండవలయును. దేనిని తెలిసికొన్నచో, మరియొకటి తెలిసికొనుటకు మిగిలియుండదో, అదియే సంపూర్ణజ్ఞానమని చెప్పబడును. "యంలబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః" అనెడి గీతావాక్యానుసారముగా ఆధ్యాత్మిక లాభమునకు మించిన మరొక సత్యములేదో అట్టి పరమ సత్యమును, పరమలాభమును, పరమ జ్ఞానమును పొందుటకు జీవితమంతయు కృషియొనర్చుట మన పరమ కర్తవ్యమైయున్నది. "గీతామకరందము"నకు వలెనే శ్రీస్వామివారి ఇతర గ్రంథములు కూడా నేటి అంతర్జాతీయ భాషయగు ఆంగ్లభాషయందనువదింప బడవలయుననియు, ఒకవేళ అది సాధ్యము కాకున్నచో ఆంగ్లీకరింపబడిన అంశములను ఆధునిక కాలానుగుణ్యముగా ఇంటర్‌నెట్ నందు ప్రవేశ పెట్టబడవలయుననియు నా ఆకాంక్ష.

అప్పుడు భారతీయ సత్యసంస్కృతి ప్రపంచమంతయు ప్రాకుటకు మరింత దోహదమొసంగును. పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములవారి ఆశీస్సులు మనందఱిపై ఎల్లప్పుడు ప్రసరింపబడుచుండును గాక!

ఓం తత్సత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

(– శతజయంతి సంచిక, పేజి. 14, 15, 16)

# 39. సయాతి పరమాం గతిమ్

-స్వామి హంసానంద

**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్**
**యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్ ॥**

అనెడి గీతావచనానుసారముగా ఎవడైతే ఏకైకాక్షరరూప బ్రహ్మమగు ఓంకారము నుచ్చరించుచు, తదర్థరూపుడనైన నా రూపమును ధ్యానించుచు, శరీరమును త్యజించునో అతడు పరమగతిని పొందును. ఇచ్చట పరమగతి ఆత్మసాక్షాత్కారానుభవమును, లేక బ్రహ్మసాక్షాత్కారానుభవమును సూచించును. అనగా సాధకుడు బ్రహ్మస్వరూపుడగును. అప్పుడాతడు జీవించియున్నను '*సర్వం బ్రహ్మమయం జగత్త్*'నెడి భావము అతనికి కలుగును. ఇదియే జీవన్ముక్తావస్థయైయున్నది. ఇదియే మహా సమాధి యనబడును. అప్పుడు బేధభావ సమన్వితమగు ఈ దృశ్య జగత్తు నశించి, పరమానందానుభవము కలుగును.

ఇట్టి పరమానందానుభవమునొందిన మహానుభావులలో ఒకరు బ్రహ్మలీనులైన పరమపూజ్యులైన స్వామి ఓంకార్. వారు అణువణువు నందును 'ఆత్మవత్సర్వభూతాని' యనెడి భావానుభూతి ననుభవించిరి. సర్వత్ర ఓంకారనాదమును శ్రవణ మొనర్చిరి. ఇదియే మీజన్మ హక్కని చాటి చెప్పిరి. విశ్వమంతటను విశ్వేశ్వరుని సందర్శించిరి. "*ఇందుగలడందులేడను సందేహమువలదు, చక్రి సర్వోపగతుండెందెందు వెదకి చూచిన నందందే కలడు*"అనెడి భక్త ప్రహ్లాదుని వాక్యమును తమ హృదయ ఫలకమునందు ప్రస్ఫుటితమొనర్చుకొనిరి. ఇదియే ఆధ్యాత్మిక సాధకులకు ఆదర్శము; ముముక్షువులకు మూల స్తంభము; జిజ్ఞాసువులకు జ్ఞేయవస్తువు; భక్తులకు కల్పతరువు; జ్ఞానులకు పరమగమ్యము. దీనిని పొందుటకు యత్నించుటయే మనము ఏటేటా జనవరి 21వ తేదీన ఏతెంచునట్టి శ్రీశ్రీశ్రీ స్వామి ఓంకార్‌కు సమర్పించుకొనదగిన జన్మదిన కానుకయైయున్నది. ఈ విధమగు కానుక చేతనే శ్రీవారి అనుగ్రహమునకు పాత్రులము కాగలగుదుము. అప్పుడు భగవద్వచనానుసారముగా మనము పరమగతి(మోక్షము)ని పొందజాలుదుము. ఇదియే శాంతి ధామము. ఇదియే విశ్రాంతికి నిలయము. ఇదియే సమస్త వాసనారాహిత్యస్థితి. ఇదియే యుగయుగములనుండి మానవుడు అన్వేషించుచున్న పరమానందానుభూతి. ఇదియే సర్వస్వము తానే అయియున్న సమత్వస్థితి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

(**సేకరణ: 'శాంతి'**, సంచిక నుండి)

# 40. శ్రీ శివానందజ్యోతి

– స్వామి హంసానంద

(బ్రహ్మజ్ఞాని, ఋషిపుంగవులు శ్రీశ్రీశ్రీ శివానంద సరస్వతిగారి శతజయంత్యుత్సవములు సెప్టెంబర్, 1986 నుండి సెప్టెంబరు, 1987 వరకు ఒక సంవత్సరము పాటు యావద్భారత దేశములోను, విదేశములలోను జరుపుకొనుచున్న సందర్భమును పురస్కరించుకొని)

శుభప్రదము, పవిత్రము మఱియు శ్రేయస్సు నొసంగునది శివ మనబడును. సాక్షాత్తుగా శివుని అవతారమే సద్గురు స్వామి శివానందుల వారు. శివుడు ఆనందపూర్ణుడు. స్వామిశివానందులు కూడ ఆనంద స్వరూపులు. వారు స్వయముగా ఆత్మానందము ననుభవించి, తమ తోటి మానవులకు దానిని వితరణ మొనర్చిరి. శివుడు జ్యోతిస్స్వరూపుడు. స్వామి శివానందులున్నూ బ్రహ్మవర్చస్సుతో శోభించి, ఆ తేజస్సును ప్రపంచములోని దశదిశలలో ప్రసరింపజేసిరి.

సమన్వయ యోగము స్వామి శివానందులవారి ముఖ్యసిద్ధాంతము. కావుననే "సేవించుము, ప్రేమించుము, పవిత్రుడవగుము, ధ్యానించుము, ఆత్మసాక్షాత్కారము నొందుము" అను సూత్రముల నాధారముగాగొని, శ్రీవారు 1936లో "దివ్యజీవన సంఘము"ను స్థాపించిరి. సేవించుట కర్మయోగమును సూచించును. ప్రేమించుట భక్తియోగమును సూచించును. పవిత్రుడగుట రాజయోగమును సూచించును. ధ్యానించుట ధ్యానయోగమును సూచించును. ఆత్మసాక్షాత్కారమునొందుట జ్ఞానయోగమును సూచించును. కావున కర్మ–భక్తి–రాజ–ధ్యాన–జ్ఞాన యోగములన్నింటిని తన జీవితమునం దాకళించుకున్న మనుజుడు మాత్రమే ఈ కలియుగమునందాత్మానుభూతి నొందజాలునని శ్రీవారు సెలవొసంగిరి.

"శునిచైవ స్వపాకేచ పండితాః సమదర్శినః" యను గీతావాక్యమును శ్రీసద్గురు శివానందస్వాములవారు పూర్ణముగా అనుష్ఠించిరి. ఉదయము లేవగానే పాకీవానిని చూచినప్పుడు శ్రీవారు తమ మనస్సులో ఆతనికి నమస్కరించుచుండిరి. కుక్కగాని, పిల్లిగాని, ఎలుకగాని, చీమగాని కానబడినపుడు శ్రీవారు వాటికి మానసికముగా నమస్కరించుచుండిరి.

శ్రీవారు స్వార్థమును పూర్తిగా విడనాడిరి. ఒకరోజు ఒక యాత్రికుడు శ్రీవారిని దర్శించుటకై ఏతెంచెను. అతడు ఆకలిగొనియుండెను. కాని అప్పుడు భోజన సమయము దాటిపోయియుండెను. శ్రీవారు తమ అంతేవాసిని "కుటీరమునందేమైన ఫలములున్నవా?" యని ప్రశ్నించిరి. కుటీరమునందున్న ఫలముల నిచ్చినచో, శ్రీవారు సాయంకాలము భుజించుటకై ఫలములుండవని తలంచి, అంతేవాసి "ఫలములు లేవ"ని బదులు పలికెను.

అప్పుడు శ్రీవారు బజారునుండి ఫలములను తెప్పించి ఇచ్చి ఆ యాత్రికుని ఆకలిని తీర్చివేసిరి. ఆ యాత్రికుడు వెళ్ళిన తరువాత శ్రీవారు స్వయముగా వంటగదిలోనికి వెళ్ళి ఫలముల కొఱకై వెదకిరి. ఒక గంప నిండా ఫలములుండుటను శ్రీవారు గమనించి, ఆశ్చర్యచకితులైరి. ఐనను అంతేవాసిని కోపగించుకొనలేదు. కాని ఆ ఫలములను తాను భుజించకుండ తెల్లవారి లేవగానే కోతుల కొఱకు విసరివేసి, ఆ ఫలములను కోతులు తినుచుండగా చూచి ఆనందించిరి. ఇది శ్రీవారి నిస్స్వార్థతకు మచ్చుతునక వంటిది.

శ్రీవారి సమన్వయ యోగసిద్ధాంతము కారణముచే శ్రీవారి శిష్య ప్రశిష్యులు విశ్వమంతయు వ్యాపించిరి. శ్రీస్వామి సహజానంద వారు "దక్షిణాఫ్రికా"లో కర్మయోగము నకు ప్రతీకలైయున్నారు. వారు శ్రీవారి గ్రంథములను ముద్రించుట, శివానంద చికిత్సాల యములను, శివానంద కళాశాలలను స్థాపించుట ఇత్యాది కార్యములనొనర్చుచున్నారు.

శ్రీస్వామి హృదయానంద మాతాజీ హాలెండ్, ఫ్రాన్స్‌దేశములలో శ్రీవారి సందేశములను వెదజల్లుచు, భజన-కీర్తనల ద్వారా అచ్చటి ప్రజలలో భక్తిబీజములను నాటుచున్నారు.

శ్రీస్వామి విష్ణుదేవానందగారు కెనడా, లండన్ ఇత్యాది దేశములలో హఠయోగమును నేర్పుచు దేహసౌష్ఠవముతోపాటు అచ్చటి ప్రజలకు మనశ్శాంతిని ప్రసాదించుచున్నారు.

శ్రీస్వామి జ్యోతిర్మయానందగారు అమెరికాలోని "ఫ్లోరిడా"లో "ఇంటర్నేషనల్ యోగ గైడ్" అను పేరుతో ఒక మాసపత్రికను నడుపుచు, జ్ఞానయోగ బీజములను వెదజల్లుచున్నారు.

శ్రీస్వామి సచ్చిదానందగారు వెర్జీనియాలో "ఇంటిగ్రల్ యోగ" అను మాసపత్రికను నడుపుచుండుటయేగాక, 'లోటస్ టెంపుల్' యొక్క నిర్మాణము ద్వారా సర్వమత సమైక్యతను ప్రజల హృదయసీమలలో చొప్పించు చున్నారు.

భారతదేశప్రభుత్వం 8-9-1986 రోజున శ్రీ సద్గురు శివానంద స్వాములవారి రు. 2/-ల విలువగల పోస్టల్‌స్టాంపును విడుదలచేసి, భారతీయ సాధుసత్పురుషుల మహిమను ప్రపంచమునకు వ్యక్తమొనర్చినది.

శ్రీశివానందజ్యోతి కారణముచే ఋషీకేశ్ (ఉత్తరప్రదేశ్- హిమాలయ పర్వత ప్రాంతము)లో శివానంద ఝూలా, స్వామి శివానంద మార్గ్, శివానందాశ్రమము ప్రవేశముఖద్వారములు వెలసినవి. శ్రీశివానంద సరస్వతీ మహారాజ్ (1887 నుండి 1987) శతజయంత్యుత్సవ సందర్భము నందు మనమందఱము శ్రీశివానంద సందేశజ్యోతిచే సమలంకృతుల మగుదుము గాక!

# 41. రథ సారథి

పూజ్యపాద శ్రీ స్వామి కృష్ణానంద గురుదేవులు 23-11-2001వ తేదీ శుక్రవారం సాయంకాలం గం॥4-30 ని॥కు ఋషీకేశ్, శ్రీశివానందాశ్రమములోని ఆనంద కుటీరములో మహాసమాధి నొందుటతో "దివ్యజీవన సంఘము" యొక్క దివ్యజ్యోతి దిగజారినదని చెప్పుట అతిశయోక్తి కాజాలదు. పూజ్యపాద శ్రీ స్వామి కృష్ణానంద స్వాములవారు 1944లో శ్రీ శివానందాశ్రమమున కేతెంచిరి. తమ 25వ ఏటనే శ్రీవారు "The Realisation of the Absolute" అనెడి అత్యుత్తమ వేదాంత గ్రంథమును ఆంగ్లభాషలో రచించిరి. ఈ కారణముచే శ్రీ సద్గురు శివానంద స్వాములవారు "వేదాంత కేసరి"యను బిరుదమును వారి కొసంగిరి. తర్వాత భగవద్గీతపైనను, ఉపనిషత్తులపైనను, బ్రహ్మసూత్రములపైనను గ్రంథములను రచించుటచే తమ గురువుగారిచే "ఆధునిక శంకరాచార్య"అను మరియొక ఉపాధిని పొందిరి. శ్రీవారు ప్రాగ్పశ్చిమ వేదాంత తత్త్వవేత్తలగుటచే ముముక్షువులందఱి మన్ననల నందుకొనిరి. అస్తు.

శ్రీ సద్గురు శివానందస్వాములవారి సమయములో పరమపూజ్య శ్రీచిదానంద స్వాములవారు విదేశములకేగిన సందర్భమునందు పూజ్యపాద శ్రీకృష్ణానందస్వాములవారు "దివ్యజీవన సంఘము"నకు ప్రధాన కార్యదర్శిగా నియమింపబడిరి. నాటినుండి 27వ ఆగష్టు, 2001 వరకు దివ్యజీవన సంఘమనెడి రథముయొక్క సారధ్యమును అత్యంత సమర్ధవంతముగాను, దక్షతతోను, దీక్షతోను జరిపిరి. తాము తమ దేహత్యాగమునకు సంసిద్ధులగుచున్న కారణముచే 27-8-2001వ తేదీన తన ప్రధాన కార్యదర్శి పదవికి సునిశ్చితమైన, అపరివర్తనీయమైన రాజీనామానొసంగిరి. దీనిచే శ్రీవారికి పరమాత్మతోగల ప్రేమ ప్రవాహ ప్రగాఢ సంబంధము మఱియు ప్రపంచముతోగల నిస్సంగత్వము స్పష్టముగా గోచరించుచున్నది.

శ్రీవారి ప్రప్రథమ దర్శనము నాకు బ్రహ్మలీన శ్రీ దేవానంద- చిన్నస్వాములవారి ద్వారా 1965 సెప్టెంబరు మొదటి వారము నందు లభించెను. శ్రీవారు భజనహాలులో తమ వేదాంతోపన్యాసమును ముగించిన తర్వాత సాయంకాలము 5 గంటలకు నేను శ్రీవారిని మొదటిసారి దర్శించితిని. శ్రీవారు నాకు శ్రీశివానందాశ్రమమునందుండుటకు దయతో అనుమతి నొసంగిరి. ఒకరోజు భజనహాలులో తమ భగవద్గీతోపన్యాసము తర్వాత ఆశ్రమ సాధకులందఱిని గీతాశ్లోకములను చదువమని ఆదేశించిరి. అప్పుడు నావంతు కూడ వచ్చుటచే నేను చదివి వినిపించగా అనందించి, "Where you learnt Gita?" అని ప్రశ్నించిరి. నేను "శ్రీవ్యాసాశ్రమమునంద"ని సమాధానమొసంగితిని. శ్రీవారు "Very good, very good" అని పలికి నాకు ప్రోత్సాహము నొసంగిరి.

ఒక సందర్భమునందు నేను ఋషీకేశ్‌లోనే మరొక సుప్రసిద్ధమగు ఆశ్రమమును చూచుటకై వెళ్ళితిని. నేను మరొక ఆశ్రమమునకు వెళ్ళినట్లు శ్రీస్వాములవారికి తెలిసెను. అప్పుడు వారు శ్రీగురుదేవ్ కుటీరము నందుండెడివారు. "అచ్చటికి వెళ్ళకు.

ఆ యాశ్రమాధిపతి బంగారు లేడి వంటివార”ని శ్రీవారు నాకు హితోపదేశమొనర్చిరి.

పరమపూజ్య శ్రీచిదానందస్వాముల వారిని దర్శించుటకై ఒక రోజొక భక్తుడు శ్రీశివానందాశ్రమమునకేతెంచి పూజ్యపాద శ్రీకృష్ణానంద స్వాములవారున్న గురుదేవ్ కుటీరము నందడుగిడెను. ఆ సమయమునందు శ్రీ చిదానంద స్వాములవారు పర్యటన యందుండిరి. "I am badly in need of him" అని భక్తుడడిగెను. అప్పుడు "In the same manner, other people also are in need of him" అని శ్రీకృష్ణానంద స్వాములవారు బదులు పలికిరి.

ఒకరోజు పూజ్యపాద కృష్ణానంద స్వాములవారు భజనహాలులో గీతోపన్యాసము నొనర్చుచుండగా పూజ్యశ్రీ చిదానంద స్వాములవారు శ్రోతల యందొకరుగా దిగువ కూర్చొని శ్రవణమొనర్చిరి.

ఒకప్పుడు నాకు కొంచము జ్వరముగా నుండెను. నేను ఔషధములను వాడుటకిష్టపడకుంటిని. కాని పూజ్యపాద శ్రీకృష్ణానంద స్వాములవారు స్వయముగా నన్ను తీసుకొనివెళ్ళి, శ్రీశివానంద ఛారిటబుల్ హాస్పటల్‌లో నాకు ఔషధము నిప్పించిరి.

1993లో నన్ను Europe తీసుకొని వెళ్ళుటకై శ్రీ Wolf Gang Seitz వారు పరమపూజ్య శ్రీచిదానంద స్వాములవారి వద్ద అనుమతిని పొందిరి. నేను పూజ్యపాద కృష్ణానందస్వాముల వారిని సమీపించి, అనుమతి కోరగా "If you go to Europe, do you realise God?" అని నన్ను హెచ్చరించిరి. ఈ వాక్యము కటువుగా తోచినను, ఈ వాక్యమెంతో హితప్రదమైనదని నేను Europe పర్యటన చేసి వచ్చిన తర్వాత తెలిసికొంటిని.

ఈ ప్రకారముగా పూజ్యపాద శ్రీకృష్ణానందస్వాములవారు ఆశ్రమములోని సాధకులకే గాక, ప్రపంచములోని ముముక్షువులకు, భక్తులకు, జిజ్ఞాసువులకు, ఆధ్యాత్మిక పథప్రదర్శన మొసంగుచుండిరి.

8-12-2001వ తేదీన శ్రీవారి పేరుతో “షోడశపూజ” జరిగిన సందర్భమునందు హరిద్వార్‌లోని జగద్గురు ఆశ్రమ పీఠాధిపతియు, మహామండలేశ్వరులునగు శ్రీశ్రీశ్రీ ప్రకాశానందస్వాములవారు పూజ్యశ్రీ కృష్ణానందస్వామివారిని గూర్చి ఈ రోజు నేను మాట్లాడుట నా సౌభాగ్యముగా భావించుచున్నానని సెలవొసంగిరి. ఇంకను అనేక మహామండలేశ్వర్లు, పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులు శ్రీవారిని వేనోళ్ళ పొగడిరి.

పూజ్యపాద శ్రీకృష్ణానంద సరస్వతీస్వాముల వారెల్లప్పుడు బ్రహ్మనిష్ఠులై, బ్రహ్మోపాసకులై, బ్రహ్మచింతనాపరులై యుండిరి. శ్రీవారు శ్రీశివానందాశ్రమ సాధకులకు “బ్రహ్మసూత్రము”లను గూర్చి తమ చిట్టచివరి ప్రబోధమునొనర్చిరి. శ్రీవారి దివ్యానుగ్రహము ప్రపంచములోని సాధకులపై, భక్తులపై, జిజ్ఞాసువులపై, ముముక్షువులపై ఎల్లప్పుడు ప్రసరింపబడుచుండును గాక!

(శివానందవాణి, పేజి-15, 16)

# Part - II

ఓం గం గణపతయే నమః ఓం గుం గురుభ్యో నమః ఓం ఐం సరస్వత్యై నమః

# ఆధ్యాత్మిక ఆలోచనలు

(రెండవ భాగము)

## 1. మోక్ష సామ్రాజ్యలక్ష్మి

మోక్షమనగా:- విడుదల, విడిచిపెట్టుట, లేక త్యజించుటయని అర్థము. దేనిని విడిచిపెట్టవలయును? చిన్నదానిని విడిచిపెట్టి పెద్దదానిని గ్రహింపవలయును. అది ఎట్లనగా:- ఒక చిన్న ఉద్యోగస్థుడు దానిని విడిచిపెట్టి, పెద్ద ఉద్యోగము సంపాదించును. ఒక విద్యార్థి చిన్న తరగతిని విడిచిపెట్టి, పెద్ద తరగతిలో ప్రవేశించును. ఒక ధనవంతుడు స్కూటరును అమ్మివేసి, మంచి కారును కొనుక్కొనును. అదే ప్రకారముగా చిన్నదానిని వదిలిపెట్టి పెద్దదానిని సంపాదించుట మోక్షము యొక్క లక్ష్యము. అన్నింటికంటె పెద్దదేది? అన్నింటికంటె పెద్దదానిని ఊహించుట మన తలకు సాధ్యముకాని విషయము. ఏల? మన తల చాలా చిన్నది. అనగా:- చిన్నచిన్న విషయములను మాత్రమే! ఆలోచించుచుండును. పెద్దపెద్ద విషయములను ఆలోచించు శక్తి దానికి లేదు. అది ఎట్లనగా:- అది కేవలము ఇంటిలోని విషయములను మాత్రమే! తెలిసికొనజాలును. కాని తన గ్రామములోని అన్ని విషయములను తెలిసికొనజాలదు. ఒకవేళ గ్రామాధికారికి ఆ గ్రామములోని విషయములన్నియు తెలిసినను, అతనికి మండలములోని విషయములు తెలియజాలవు. మండలాధికారికి ఆ మండలములోని విషయములు తెలిసినను, జిల్లాలోని విషయములు తెలియవు. జిల్లా తన స్వాధీనమునందున్న వానికి రాష్ట్రములోని విషయములు తెలియవు. ఇక రాష్ట్రములోని విషయములు తెలిసినవానికి తన దేశములోని విషయములు తెలియవు. దేశములోని విషయములు తెలిసినవానికి, తన ఖండములోని విషయములు తెలియజాలవు. ఇక, తన ఖండములోని విషయములు తెలిసినవానికి, భూమండలములోని విషయములు తెలియవు. భూమండలములోని విషయములు తెలిసినవానికి స్వర్గ-మర్త్య-పాతాళ లోకములలోని విషయములు తెలియవు. కేవలము

ఇవే కాకుండా పదునాలుగు లోకములలోని విషయములు తెలిసినను, వాటిని సృష్టించినట్టి సృష్టికర్త ఎవరో తెలియదు. పాఠకులకు సృష్టికర్త యొక్క తల ఎంత పెద్దదో ఇప్పుడు బోధపడినదని నేను భావించుచున్నాను. ఆ తలతో మన తలను పోల్చి చూచినచో, మన తల ఎందుకును కొరగానిదగును. అందువల్ల ఆధ్యాత్మిక సాధకులమైన మనమందరమున్నూ ఎల్లప్పుడు వినయవిధేయులమై యుండవలయును. అప్పుడు మాత్రమే! మన తలలో మేధాశక్తి పెంపొందుచుండును.

సృష్టికర్త సృష్టించిన సృష్టియే! సామ్రాజ్యమని చెప్పబడును. ఈ సామ్రాజ్యము నందు స్వర్గ-మర్త్య-పాతాళ లోకములతో పాటు పద్నాలుగు లోకములన్నియు ఇమిడియుండును. ఊర్ధ్వలోకముల నొందగోరువారు అధఃలోకములనన్నింటిని విడువ వలసియుండును. ఇక ఈ సామ్రాజ్యమునంతటిని పొందగోరువారు అధోలోకములతో పాటు ఊర్ధ్వలోకములను కూడా త్యజింపవలసియుండును. సమస్తమును త్యజించినపుడు సమస్తము పొందబడును. ఇది ఎట్లు సాధ్యమగును? అను సంశయమిచ్చట కలుగును. మోక్షసామ్రాజ్యలక్ష్మిని వరించినప్పుడు జది సాధ్యమగును. ఇచ్చట లక్ష్మి అనగా:- స్త్రీ అని భావించుట పొరపాటు. కారణమేమనగా:- మోక్షమునందు స్త్రీపురుషులుండరు. బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్రులు యుండరు. ధనవంతుడుగాని, దరిద్రుడుగాని యుండడు. శ్రేష్ఠుడుగాని, నికృష్టుడుగాని ఉండడు. అదియంతయు అద్వితీయము. అనగా:- అచ్చట రెండవ పదార్థముండదు. అచ్చట ఏకైక పరమపురుషుడుండును. అచ్చట పురుషోత్తముడుండును. అనగా:- అతడిని మించిన మరొక పురుషుడుండడు. అతనిని తెలుసుకున్నవాడే! వేదవేత్త. ఈ ప్రపంచములో సామాన్యముగా కొందఱు అధ్యాత్మిక సాధకులు, భక్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు తమ తమ ఆశ్రమములలో అష్టలక్ష్మి ప్రతిష్ఠలను గావించుచుందురు. కాని మోక్షసామ్రజ్యలక్ష్మి ఈ అష్టలక్ష్మి లందఱికీ అతీతమైయున్నది. ఏల? ఈ అష్టలక్ష్మిలు ఈ ప్రపంచములోని ఐశ్వర్యమునకు సంబంధించినవారు. ఉదాహరణమునకు ధనలక్ష్మి ఈ ప్రపంచములోని ధనమునకు సంబంధించిన దేవత. ధాన్యలక్ష్మి ఈ ప్రపంచములోని ధాన్యమునకు సంబంధించిన దేవత. ధైర్యలక్ష్మి క్షత్రియులకు సంబంధించిన దేవత. విజయలక్ష్మి ఈ ప్రపంచములో తన శత్రువులను జయించుటకు సహకరించునట్టి దేవత. కాని ఆ అష్టలక్ష్మిలందఱున్నూ మోక్షసామ్రాజ్యలక్ష్మి యందిమిడియున్నారు. ఈ కారణముచే మోక్షసామ్రాజ్యలక్ష్మి అన్నిటికంటెను గొప్పదేవత. ఈ దేవతయందు లేనిదేదియున్నూ ఈ ప్రపంచమునందు మనకు కానరాదనుట సునిశ్చయము. ఈ ప్రపంచమే కాదు, పద్నాలుగు లోకముల

యందున్న ఐశ్వర్యమంతయును మోక్షసామ్రాజ్యలక్ష్మియందున్నది. అయితే వీటన్నింటిని త్యజించినపుడు మాత్రమే! మోక్షసామ్రాజ్యలక్ష్మి పొందబడును.

మోక్షసామ్రాజ్యలక్ష్మిని మానవులైన మనమందరమున్నూ ఆర్జింపవలయును. ఇదియే! మనందరి కర్తవ్యము. దీనిని ఆర్జింపకున్నచో మనకు కలుగు నష్టమేమి? దీనిని ఆర్జింపకున్నచో, మనకు నష్టమే తప్ప మరియొకటి యుండజాలదు. ఇక దీనిని ఆర్జించినచో, లాభమే తప్ప మరియొకటి యుండజాలదు. అది ఎట్లనగా:- బంగారమునందు ఇతర లోహములన్నింటికి మించినట్టి విలువ యుండును కదా! ప్రపంచములోని, కాదు-కాదు, పద్నాలుగు లోకములలోని బంగారు ఆభరణములన్నింటిని ఈ "మోక్షసామ్రాజ్యలక్ష్మి" ధరించియుండును. ప్రపంచములోని భోగభాగ్యములన్నియును ఈ "మోక్షసామ్రాజ్యలక్ష్మి" యందుండును. దేనిని మించిన సుఖము మరియొకటి లేదో, అట్టి పరమ సౌఖ్యము "మోక్షసామ్రాజ్యలక్ష్మి" యందుండును. దేనిని మించిన శాంతి మరొకటి లేదో అట్టి పరమశాంతి "మోక్షసామ్రాజ్యలక్ష్మి" యందుండును. దేనిని తెలిసికొన్నచో మరియొకదానిని తెలిసికొను ఆవశ్యకత యుండదో అట్టి పరమ జ్ఞానము "మోక్షసామ్రాజ్యలక్ష్మి" యందుండును. దేనిని మించిన శక్తి మరొకటి లేదో, అట్టి పరాశక్తి "మోక్ష సామ్రాజ్యలక్ష్మి" యందుండును. సామాన్యముగా మనము దేశమును స్త్రీగా తలపోయుచుందుము. ఉదాహరణమునకు భారతమాత, భూమాత మున్నగునవి. ఇక కాలమును పురుషునిగా తలపోయుచుందుము. ఉదాహరణమునకు కాల పురుషుడు, కలిపురుషుడు మున్నగునవి. కాని ఈ "మోక్షసామ్రాజ్యము" స్త్రీయు కాదు - పురుషుడున్నూ కాదు. అట్టి దేశకాలముల కతీతమైయున్న "మోక్షసామ్రాజ్యము" నార్జించి మనమందఱమున్నూ పరమశాంతిని, పరమసౌఖ్యమును, పరమజ్ఞానమును పొందుటకై సర్వకాల సర్వావస్థలలో ప్రయత్నపరులమై యుందుము గాక! అప్పుడు మాత్రమే! మన జీవితములు సార్థకములగును. అట్లు కాదేని, ఎంతో విలువైన మన జీవితములు వ్యర్థము లగును. మనము అసత్పదార్థము నుండి విడుదల పొంది సత్పదార్థము నంటిపెట్టుకొనియుందుము గాక! మనమీ ప్రాపంచిక తమస్సు నుండి విడివడి, పారమార్థిక జ్యోతియందు ప్రకాశింతుము గాక! మనమీ మృత్యుగ్రస్తమైన ప్రపంచమును త్యజించి, అమృతమయమైన ఆనందసాగరము నందోలలాడుదుము గాక!

# 2. గురువు దేవుడెట్లగును?

మనకు కాళ్ళు-చేతులు, కండ్లు-చెవులు, ముక్కు-నోరు ఇత్యాదులున్నట్లే గురువుగారికి కూడా ఉన్నవి కదా! అట్టియెడల గురువు దేవుడెట్లగును? అని అనేకులు ప్రశ్నించుచుందురు. దీనికి సమాధానమొసంగబడుచున్నది. ప్రాపంచిక విషయములను గూర్చి నేర్పువారు బడిపంతులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లుగా వ్యవహరింపబడుదురు. బడిపంతులు అ-ఆ-ఇ-ఈ మున్నగు అక్షరములను, ఒకటి-రెండు-మూడు మున్నగు అంకెలను పిల్లలకు నేర్పును. ఉపాధ్యాయుడు వాచకములను, ఉపవాచకములను, వ్యాకరణము ఇత్యాదులను పాఠశాలలో విద్యార్థులకు నేర్పును. ఇక భౌతికశాస్త్రము, జీవశాస్త్రము, రసాయనశాస్త్రము ఇత్యాదులను కళాశాలలో ప్రొఫెసర్లు నేర్పుదురు. ఇవి అన్నియును ప్రాపంచిక విద్యలే! అనగా:- ఈ ప్రపంచములో మనమున్నంతవరకు పనికివచ్చు విద్యలు. అయితే గురువుగారు నేర్పునదేమి? గురువుగారు మనమీ ప్రపంచమును విడిచిపెట్టిన తరువాత, మనమీ ప్రపంచమునందున్నప్పుడు కూడా ఆత్మాధిరోహణము నొనర్పజేయునట్టి విద్యను నేర్పును. మనమీ దేహమును త్యజించిన తరువాత కూడా మన జీవితము కొనసాగుచునే యుండును. ఎంతవరకు కొనసాగును? దేనిని చేరినచో మరొక దానిని చేరు ఆవశ్యకత మనకు కలుగదో, దేనిని నేర్చిన తరువాత మరొకదానిని నేర్చుకొను ఆవశ్యకత మనకుండదో, దేనిని పొందిన తర్వాత మరొక దానిని పొందు కోరిక మనకు కలుగదో, అంతవరకు మన జీవితము కొనసాగుచుండును. అంతము లేనట్టి అనంతవస్తువును, నాశము లేనట్టి శాశ్వతమైన పదార్థమును పొందిన తర్వాత మన సమస్త కోరికలు నశించును. మన సమస్త వాంఛలు ఉడిగిపోవును. అప్పుడు మనమొనర్పవలసిన కార్యమిసుమంతైనను శేషించియుండదు. అప్పుడు మన ప్రారబ్ధకర్మ అంతయు నశించును. అట్టి పరమోన్నత స్థానమును చేర్చుటకై శిష్యునికి క్రమశిక్షణ యొసంగి, అజ్ఞానావరణను తొలగించి, మన హృదయ క్షేత్రమునందు జ్ఞాన భాస్కరుని ప్రకాశింపజేయువాడే! గురుదేవుడు.

"గుకారస్త్వంధకారః స్యాత్, రుకారస్తన్నిరోధకః ।
అంధకార నిరోధత్వాత్, గురురిత్యభిధీయతే ॥" అని గురుగీత నుడువుచున్నది.

"గు" అను అక్షరమునకు అంధకారమని అర్థము. "రు" అను అక్షరమునకు ప్రకాశమని అర్థము. కావున అజ్ఞానమనెడి అంధకారమును తొలగించి, జ్ఞానమనెడి ప్రకాశము నొసంగువాడే! గురుదేవుడు. గురుదేవుడేమి చెప్పును? "నీవు దేహము

కాదు. నీవు మనస్సు కాదు. నీవు ఇంద్రియములు కాదు. నీవు బుద్ధి కాదు. వీటన్నింటిని తొలగించిన తర్వాత మిగులునదేదో, అదియే! ఆత్మ." ఈ ఆత్మ యొక్క ఉనికిచేతనే మన దేహములోని ఇంద్రియములన్నియు పనిచేయుచున్నవి. ఈ ఆత్మ చేతనే! మన బుద్ధి వివేచింపజాలుచున్నది. మన బుద్ధి ఆత్మ నుండి శక్తిని అరువు తెచ్చుకొనును. ఇక మనస్సు శక్తిని బుద్ధి నుండి అరువు తెచ్చుకొనును. దేహము తన శక్తిని మనస్సు నుండి అరువు తెచ్చుకొనును. ఇంద్రియములు తమ శక్తులను దేహమునుండి అరువు తెచ్చుకొనును. ఈ ప్రకారముగా ఈ ప్రపంచములోని ప్రాణులన్నియు, సకల చరాచర జీవరాసులన్నియును ఆత్మశక్తి చేతనే! చలించుచున్నవి, లేక ఉనికిని కలిగియున్నవి. కావున "ఆత్మ" అన్నింటికి మూలమై ఉన్నది. మూలకారణమైనట్టి "ఆత్మ విద్య" ను గురుదేవుడు సాధకునికి నేర్పును. ఈ "ఆత్మ" విశ్వవ్యాపకమైనప్పుడు "బ్రహ్మమ"ని చెప్పబడును. ఈ ఆత్మవిద్యను, లేక బ్రహ్మవిద్యను నేర్పునట్టి నేర్పరియగుట చేతనే గురువు గురుదేవుడని చెప్పబడును. "ఇందుగల డందులేడను సందేహము వలదు చక్రి సర్వోపగతుండెందెందు వెదకి చూచిన అందందే కలడు తండ్రి" అని ప్రహ్లాదుడు తన తండ్రియైన హిరణ్యకశిపునికి చెప్పిన ప్రకారముగా దేవుడు పర్వవ్యాపకుడై ఉన్నాడని ఋజువు చేయుటకై ప్రహ్లాదుడు ఒక స్తంభము నుండి "నరసింహావతారము" ను ఉద్భవింపజేయుటకై కారకుడయ్యెను. జీవాత్మ "నరుడ" ని చెప్పబడును. పరమాత్మ "సింహమ" ని చెప్పబడును. కావున నరసింహావతారము జీవబ్రహ్మైక్యమును సూచించును. గురుదేవుడు తన శిష్యునికి బ్రహ్మైక్య రహస్యమును ప్రబోధించును.

గురుదేవుని యందు శ్రద్ధ, విశ్వాసము, భక్తి ఉన్నప్పుడు మాత్రమే! గుర్వనుగ్రహము మనకు లభించును. గురుదేవునియందు గల శ్రద్ధ జీవాత్మను శుద్ధమొనర్చును. గురుదేవుని యందు గల విశ్వాసము మనుజుని శాశ్వతత్వము నొందింపజేయును. గురుదేవుని యందు గల భక్తి మనలను ముక్తి నొందింపజేయును. ఏకలవ్యుని గురువు ద్రోణాచార్యుడు. కాని అతడు తన గురువును చూచియుండలేదు. గురుదేవుని విగ్రహమును తయారు చేసి, ఆ విగ్రహమునందు తన మనస్సును నిగ్రహించిన కారణముచే ఆతడు విలువిద్యను సునాయాసముగా గ్రహింపగలిగెను. ఇది శ్రద్ధ– విశ్వాసము– భక్తి యొక్క ఫలితము. మనము కేవలము ఈ ప్రపంచమునకు సంబంధించిన వారము కాము. పద్నాలుగు లోకములలో ఈ ప్రపంచమొకటి. ఈ పద్నాలుగు లోకముల కావలయున్నవాడే! పరమాత్మ. అట్టి పరమాత్మను పొందింపజేయువాడే! గురుదేవుడు. కావున గురువే! బ్రహ్మ. గురువే! విష్ణువు. గురువే!

శివుడని శాస్త్రములు ఉద్ఘోషించుచున్నవి. గురుదేవుని యందు శ్రద్ధ, భక్తి, విశ్వాసములను కలిగియున్న సాధకుడు క్రమక్రమముగా పదునాలుగు లోకములను దాటి, పరబ్రహ్మానుభవమును నొందగలుగును. మనము ఎంతకెంతకు త్యాగమొనర్చు చుందుమో, అంతకంతకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి నొందుచుందుము. అందువల్లనే గురుదేవునికి సాధకుడు తను, మన, ధనముల నర్పింపవలమునని చెప్పబడినది. తనువును అర్పించుట అనగా:– గురుసేవకై, లేక దేవుని సేవకై, లేక జనతా జనార్ధనుని సేవకై ఈ శరీరమును వినియోగించుట. మనస్సును అర్పించుట అనగా:– ఎల్లప్పుడు గురువుగారిని ధ్యానించుట, లేక, నిర్గుణరూపమునందున్న గురువు (దేవుని) గూర్చి చింతించుట, ధనమును అర్పించుట అనగా:– భగవంతుడు తన కిచ్చిన ఐశ్వర్యమును దానము చేయుట. తను – మన– ధనముల నర్పించుటచే త్రికరణశుద్ధి కలుగును. అప్పుడు పూర్వజన్మ సంస్కారములు, వాసనలు నశించును. ఈ కారణముచే దైవసాక్షాత్కారము, ఆత్మసాక్షాత్కారము, లేక బ్రహ్మ సాక్షాత్కారము సుసాధ్యమగుటతో మానవ జన్మ యొక్క లక్ష్యము నెఱవేరును. దీనికి మూల కారణము గురువు. కాబట్టి గురువు దేవుడే! యనుట సునిశ్చితము.

## 3. దహింపబడునదే! దేహము.

"దేహము" అను పదమునకు దహింపబడునదని వ్యుత్పత్తి అర్థము. అది ఎట్లనగా:– మనము ప్రతిరోజు భుజించుచున్న ఆహారమును మనయందున్న జఠరాగ్ని దహించి, జీర్ణము చేయుచున్నది. దీని వలన మనము బలసంపన్నుల మగుచున్నాము. ఐతే ఈ దహనముతో పాటు అది మన ఆయుష్యమును కూడా క్షణక్షణము దహింపచేయుచున్నది. ఈ కారణము చేతనే! మన మందఱమున్నూ ఏదో ఒక రోజు మరణింపక తప్పుటలేదు. మరణమనగానే మన మందఱము భయకంపితులమగు చున్నాము. కారణమేమనగా:– మరణము మన నైజస్వరూపము కాదు. మరణము కేవలము ఈ దేహమునకు సంబంధించినది. ఈ దేహమునందున్నదేదో, అదే మన నిజమైన స్వరూపము. మన దేహమునందు మనస్సున్నది. ఇది కూడా మన నిజ స్వరూపము కాదు. కారణమేమి? మనస్సెల్లప్పుడు మార్పునొందుచుండును. మార్పు నొందునదంతయు మాయకు సంబంధించియుండును. ఈ మనస్సునకు మించినది బుద్ధి. ఈ బుద్ధి కూడా మన నిజమైన స్వరూపము కాదు. ఈ బుద్ధి కూడా మార్పు నొందుచుండును. కావున ఇదియున్నూ మాయకు సంబంధించినదే! ఇక ఈ బుద్ధికి

అతీతమైనది ఆత్మ. ఇది శాశ్వతమైనది. దీనియందు మార్పుకించిత్తైనను ఉండదు. ఈ ఆత్మను అనుభూత మొనర్చు కొనుటయే! మానవ జీవితమునకు లక్ష్యమైయున్నది. ఐతే ఈ ఆత్మ కేవలము మన దేహమునందు మాత్రమే! ఉన్నదనుకొనుట పొరపాటు. ఇది సర్వజీవ హృదయాంతర్యామియై యున్నది. ఇది దేశకాలములకు అతీతమై యున్నది. ఇది యొకచోట యున్నది – మఱొక చోట లేదు, అనుకొనుటకు వీలులేదు. ఈ సమయమునందున్నది – ఆ సమయమునందు లేదు, అనుకొనుటకు ఆస్కారము లేదు. దీనికి బాహ్యాభ్యంతరములు లేవు. ఇది లేని స్థలము లేదు. ఇదిలేని సమయము లేదు. ఈ దేహమునకు మఱియు నా దేహమునకు మధ్య కూడా దీనికి ఉనికి యున్నది. మనమెంత దూరము వరకు వెళ్ళినను దీని అంతమును కనుగొనజాలము. ఇది మనకు ఎంతో సమీపము నందున్నది. దీని వైశాల్యము సూర్య – చంద్ర– నక్షత్రాదులకు మించియుండును. ఈ కారణముచే ఇది అనంతమని చెప్పబడును.

ఆత్మయే! పరమాత్మ. దేహమునందున్న దేవుడు ఆత్మయని చెప్పబడును. ప్రపంచమంతటా నిండియున్న దేవుడు పరమాత్మయని చెప్పబడును. కేవలమీ ప్రపంచమే! యన నేల? పదునాల్గు లోకములలో ప్రకాశించుచున్న దేవుడే! పరమాత్మయని చెప్పబడును. ఒక సముద్రములోని కెరటమునకు – సముద్రమునకు మధ్య భేదము లేనట్లే, పరమాత్మకు మఱియు ఆత్మకు మధ్య భేదము లేదు. భేద భావమే! బోధరాహిత్యము. ఎచ్చట భేదభావముండునో, అచ్చట జ్ఞానోదయము కలుగదు. జ్ఞానోదయము కలుగుటకై జీవాత్మ నిరంతరము ఒక నదీ ప్రవాహము వలె పరమాత్మవైపు పరుగులు తీయుచుండవలయును. ఒక నది సముద్రమునందు కలిసిన తర్వాత, ఆ నదికి నామరూపములుండవు. అదే ప్రకారముగా జీవాత్మ పరమాత్మయందు లయించినపుడు జీవాత్మకు నామరూపాలుండవు. నామరూపములు నశించిన మాత్రముచే జీవాత్మకు కలుగు నష్టమిసుమంతయు లేదు, సరికదా! అది "మహాత్మ"యగును. అది బృహదాత్మయగును. అది సర్వవ్యాపకమైయున్న పరమాత్మగా పరిణమించును. అప్పుడు కేవలానందమే! శేషించును. ఇట్టి ఆనందము ఏలాటి అడ్డు లేనిదై అఖండముగా ఉనికిని కలిగియుండును. ఈ ఆనందమునకు పూర్తిపేరు "సచ్చిదానందము". అనగా:– ఈ ఆనందమే! సత్పదార్థమైయున్నది. ఆ ఆనందమునకు మాయ అడ్డురాదు. ఈ ఆనందమునందు దుఃఖము లవలేశమైనను ఉండదు. ఈ ఆనందమునందు చిత్‌పదార్థముండును. అనగా:– ఇది ప్రజ్ఞా సమన్వితమైయుండును. అనగా:– దీనికి సమస్తము తెలిసియుండును. సమస్తము తెలిసినవానికి ఓటమి

యనునదుండదు. అజ్ఞాని మాత్రమే! మాటిమాటికి అన్నింటియందు ఓడిపోవుచుండును. అజ్ఞానావరణము లేనిదేదో, అదియే! సచ్చిదానందము. సత్-చిత్-ఆనందములు పరస్పరము భిన్నమైనవి కావు. సత్-చిత్-ఆనందములు ఎప్పుడును విడివడునవి కావు. ఒక తెల్లని గులాబి పుష్పము నుండి దాని తెలుపుదనమును, దాని సువాసనను విడదీయజాలము కదా! అదే ప్రకారముగా, సత్-చిత్-ఆనందములను మనము విడదీయజాలము.

మన దేహమే! మనకు దేవాలయము. కారణమేమి? ఈ దేహమునందే దేవుడున్నాడు. మన దేహము పంచభూతములతో నిర్మింపబడియున్నది. మరణానంతరము ఈ దేహములోని పంచభూతములు ప్రకృతిలో కలిసిపోవును. శేషించునది ఆత్మయేయైనను, అది ప్రారబ్ధ కర్మానుసారముగా మఱొక దేహమును ధరించును. సంచితము, ప్రారబ్ధము, ఆగామికి సంబంధించిన కర్మలన్నియును నిశ్శేషముగా నశించినప్పుడు జీవాత్మ శుద్ధాత్మగా పరిణమించును. ఈ శుద్ధాత్మ పరిశుద్ధమైన పరమాత్మయందు లయించును. ఇదియే! మోక్షమని చెప్పబడును. మోక్షము జీవితలక్ష్యముగాలేని మనుజుని జీవితము వ్యర్థము. మానవజీవితము వ్యర్థమైనప్పుడు, మరల మనకీ మానవజీవితము లభించునని మనము చెప్పజాలము. కావున మరల 84 లక్షల జీవరాశుల యోనులలో పరిభ్రమింపవలసివచ్చును. ఇంతకు మించిన నష్టము మరేమైనా కలదా! కావున కష్టనష్టములకు తావులేనట్టి "సచ్చిదానందరూప పరబ్రహ్మము"నొందుటకు మాత్రమే! మనమందఱమున్నూ అహర్నిశము ప్రయత్నింపవలసియున్నది. ఇట్లు ప్రయత్నించని మనుజుడు "అజ్ఞాని" కాక మరేమగును? జ్ఞానము లేనివాడు అజ్ఞాని. అనగా:- ఆత్మజ్ఞానము లేనివాడు అజ్ఞాని. వివేకము లేనివాడు అవివేకి. అనగా:- నిత్యానిత్య వస్తువివేకము లేనివాడు అవివేకి. కావున అనిత్యమైన దేహాభాస లేనివారమై మనమందఱమున్నూ "దేహి"యైన ఆత్మావలోకనముచే అహర్నిశము జీవితమును గడుపుదుము గాక! అప్పుడే! మన జీవితము సార్థకమగును. అప్పుడు మాత్రమే! మన జీవితము లాభాన్వితమగును. మనకు లాభము కావలయునా? నష్టము కావలయునా? యోచించుకొని, సర్వకాల సర్వావస్థలలో లాభాన్వితులమగుటకై సకల విధములగు ప్రయత్నములొనర్చి, పరమాత్మ కృపకు పాత్రులమై జీవన్ముక్తావస్థనొంది, మన జీవితములను తరింపజేసుకొనుదుము గాక! ఇందు నిమిత్తమై ఋషులు, మునులు, మహాత్ములు, బ్రహ్మవిద్యా గురువుల ఆశీస్సులు మనందఱిపై సదా సర్వదా వర్షింపబడుచుండును గాక!

# 4. మనము మన జీవితమునందేమి చేయవలయును?

మనకీ మానవ జీవితమును తిని, త్రాగి, పరుండుటకై పరమాత్మ దొసంగియుండలేదు. మానవ జీవితమునకు మఱియు పశుపక్షి క్రిమి కీటకాదుల జీవితములకెంతో భేదమున్నది. మానవేతర జీవులన్నియును తిని, త్రాగి పరుండుటకే జీవించుచున్నవి. అవి యన్నియును కర్మయోనులని చెప్పబడును. అనగా:- కేవలము కర్మానుభవమునకు మాత్రమే! అవి జీవించుచున్నవి. కాని మానవ జీవికి ప్రత్యేకత యున్నది. ఆ ప్రత్యేకత ఏమిటి? ఇతర జీవులకంటె విశేషముగా బుద్ధిని భగవంతుడు ప్రసాదించియున్నాడు. బుద్ధి వివేకమును సూచించును. వివేకము జ్ఞానమును సూచించును. ఆహారము, నిద్ర, భయము, మైథునము పశువులు చేయు కార్యములు. మనమున్నూ అవే కార్యములను చేయుచుందుము కాని, బుద్ధియనునది పశువులనుండి మనలను వేరుచేయుచున్నది. కావున మనము మన పనులన్నింటిని బుద్ధిని ఉపయోగించి చేయుచుండవలయును. ఐతే "బుద్ధిః కర్మానుసారిణీ" అనే పెద్దలు చెప్పుదురు. అనగా:- మన బుద్ధి మన పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితము ననుసరించియుండును. ఒకవేళ మనము మన పూర్వజన్మలో దొంగతనము చేసియుండినచో, దాని సంస్కారము ఈ జన్మకు తీసుకొని రాబడును. మనము మన పూర్వజన్మలో స్త్రీలోలురమై యుండినచో, దాని సంస్కారము ఈ జన్మకు తీసికొని రాబడును. ఈ కారణముచే మన ప్రస్తుత జన్మలో శుభాశుభ కర్మఫలములు మిశ్రితములైయుండును. అందువలన మనము మన బుద్ధిని శుద్ధమొనర్పవలసి యుండును. మన బుద్ధి ఎట్లు శుద్ధమగును? "జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే-ర్జున" అని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని కుపదేశించియున్నాడు. కావున మనము జ్ఞానమనెడి అగ్నిని మన మేధస్సునందు రగుల్కొలుపవలసియుండును. అట్లొనర్చినచో ఒక గదిలో సేకరింపబడిన దూది ఒక్క అగ్నికణముచే ఒక్క క్షణములో ఎట్లు భస్మమగునో అట్లే మనము భూతకాలములో ఒనర్చిన కర్మలు, కర్మఫలితములు క్షణకాలములో భస్మమగును. అప్పుడు మన బుద్ధి శుద్ధమగును. శుద్ధమైన బుద్ధితో చేయబడిన శుభకర్మలు భవిష్యత్తులో పుణ్యమును పండించును. ఈ కారణముచే మానవ జీవితము తరించుట కవకాశమున్నది. పుణ్యకర్మలచే స్వర్గాది పుణ్యలోకములు ప్రాప్తించును. కాని పుణ్యకర్మల ఫలితము సమాప్తమైన వెంటనే మనము మరల ఈ

భూలోకమునకు తిరిగి రావలసియుండును. కావున మోక్షప్రాప్తికై పుణ్యపాప కర్మఫలములు నిశ్శేషముగా నశింపవలసియున్నది.

"జన్మదుఃఖం, జరాదుఃఖం జాయాదుఃఖం పునఃపునః । సంసారసాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత ॥" యని శ్రీశంకర భగవత్పాదులు పలికియున్నారు. అనేకులకు జన్మ దుఃఖమునకు కారణమను విషయము తెలియదు. తెలిసినను, కించిత్సుఖ కారణముచే మహాదుఃఖమును వారు గమనింపకుందురు. మనుజుడు ఈ భూలోకమునందు పుట్టిన వెంటనే ఏడ్చును. యౌవనావస్థలో భార్యాపుత్రాదుల సమస్యలచే దుఃఖ సంతప్త హృదయుడగును. వృద్ధావస్థలో రోగములు, బలహీనత కారణముచే దుఃఖించును. కావున ఈ సంసారసాగరము పూర్తిగా దుఃఖభూయిష్ఠమై యున్నది. ఈ కారణముచే జనన మరణ రాహిత్యమే! మోక్షమని చెప్పబడినది. మోక్షమనగానే అజ్ఞానులు భయభీతులగుచుందురు. మోక్షమునందు ప్రాపంచిక భోగభాగ్యము లన్నియును మిళితములై యుండునని పాపము వారికి తెలియదు. ఇంతేకాదు, స్వర్గలోక సుఖములు కూడా మోక్షమునందిమిడియుండును. పదునాలుగు లోకములలోని సుఖములన్నియును మోక్షమునందిమిడియుండును. కావున సర్వ దుఃఖ నివృత్తి మఱియు పరమానంద ప్రాప్తియే! మోక్షమని చెప్పబడినది. మోక్షము దేశకాలముల నతిక్రమించును. అనగా:- మోక్షానందము ఒక చోట ఉండి, మరొకచోట ఉండకపోవుట అనునదుండదు. అంతేకాదు, ఇప్పుడుండి, భవిష్యత్తులో ఉండకపోవుట అనునదుండదు. అందువలన మానవులమైన మనము మోక్షానందము నొందుటకే అహర్నిశము పాటుపడుచుండ వలయును. పరోపకారమొనర్చుట పావనమైన కార్యము. సాంఘికసేవ యొనర్చుట సత్కార్యము. ఐతే, సత్యమైన వస్తువును తెలిసికొని, దాని నార్జించి, ఇతరులకున్నూ ఆ సత్యవస్తువును గూర్చి ఉపదేశించుట సామాన్యమైన సాంఘికసేవ కన్నా మిన్నయైన కార్యము. ఇక రాజకీయము కేవలము ఒక రాజ్యము యొక్క ప్రజల క్షేమమునకై పాటుపడును. దీనిచే ఇతర రాజ్యములకు అసంతృప్తి కలుగును. ఈ కారణముచే ద్వేషములు, కలహములు, యుద్ధములు, పోరాటములు సంభవించును. రాజకీయములు రామరాజ్యముగా మారినప్పుడు విశ్వములోని ప్రజలందరును సుఖింతురు. సర్వత్ర ప్రశాంతత నెలకొనును. అన్ని చోట్లలో ఆనందము తాండవమాడును. ధర్మము జగద్వ్యాప్తమగును. ప్రజలందఱును దైవానుగ్రహముచే శోభింతురు. అన్ని స్థలములలో ప్రజలందఱును సత్సంగములను జరుపుకొందురు. ఎచ్చటను జార చోర భయముండదు. ఇతరులు దేనిని చేసినచో తనకు సుఖము కలుగునో, దానిని తాను ఇతరులకు చేయుచుండును.

ఇక మోక్ష సామ్రాజ్యలక్ష్మి యందు 14 లోకములున్నూ ఇమిడి యుండును. దేనిని పొందినచో మరొక దానిని పొందుటకేమియు శేషించియుండదో, అదియే! మోక్షము. దేనిని చేరినచో మరొక దానిని చేరుట కేమియును మిగిలియుండదో, అదియే! మోక్షము. ఏ సుఖము ననుభవించినచో మరొక సుఖము ననుభవించుటకేమియు శేషించి యుండదో, అదియే! మోక్షము. ఏ ఆనందము ననుభవించినచో మరొక రకమగు ఆనందము ననుభవించుటకేమియు మిగిలియుండదో, అదియే! మోక్షానందము. మోక్షానందము శాశ్వతమైనది. నిత్యమైనది, పరిపూర్ణమైనది. ఏలాటి లోటు లేనిదేదియో అదియో! మోక్షము. ఏలాటి త్రుటిలేనిదేదియో అదియే! మోక్షము. ఏలాటి దుఃఖము లేనిదేదియో, అదియే! మోక్షము. ఏలాటి సమస్య లేనిదేదియో, అదియే! మోక్షము. మోక్షమనగా:- విడుదల. దేని నుండి విడుదల? దుఃఖము నుండి విడుదల. బంధమునుండి విడుదల. సమస్యల నుండి విడుదల. సంసార సాగరము నుండి విడుదల. ఇట్టి మోక్షధామము నొందుటయే! మనందఱి కర్తవ్యము. ఈ కర్తవ్యమును ఎవరికొఱకో చేయుట కాదు. మన కొఱకే మనము చేసికొను కర్తవ్యము. శ్రీరాముడు రావణుని చంపుట తన కొరకు కాదు. రావణుడు పెట్టుచున్న బాధలు లోకములోని ప్రజలకు రాకుండా చేయుటకే శ్రీరాముడు రావణుని సంహరించెను. శ్రీకృష్ణుడు కంసుని చంపుట తన కొరకు కాదు. కంసుని బాధలు వ్రజవాసులకు రాకుండా చేయుటకే శ్రీకృష్ణుడు కంసుని సంహరించెను. అవతార పురుషులు కేవలము లోకక్షేమము కొరకే అవతరింతురు. ఐతే లోకము ఎప్పుడు క్షేమముగా నుండును? మన కర్తవ్యమును మనము నెఱవేర్చినప్పుడు లోకము క్షేమముగా నుండును. కావున మనమెల్లప్పుడు దైవ ప్రార్థన, దైవ చింతన, దైవ స్మరణలతో కాలమును గడుపుచుండవలయును. రామకృష్ణాద్యవతారములను పూజించుచు, ఉపాసించుచు మనమందఱమున్నూ మన కర్తవ్యములను నెఱవేర్చుచుండవలయును. అప్పుడు లోకమంతయు క్షేమముగా నుండును. ఆసురిక శక్తులు క్షీణించి, దైవ సంపద సమృద్ధియగును. అంతతోగత్వా మనము మోక్షధామమునందు ప్రవేశించి, పరమసుఖము ననుభవింతుము. ఇదియే! మన స్వధర్మము. ఇతరమైనదంతయును పరధర్మమే! యగును. ఇదియే! మనము మన జీవితమునందొనర్పవలసినట్టి సత్కార్యము.

# 5. ఏది సత్యము? ఏది అసత్యము?

సత్యమైన పదార్థము ఎల్లప్పుడు ఉనికిని కలిగియుండును. అసత్యమైన పదార్థము ఒకప్పుడు కానబడి, మఱొకప్పుడు కానబడకుండును. సత్యము తెలియబడినప్పుడు అసత్యము నశించును. ప్రకాశమేర్పడినప్పుడు అంధకారము నశించును. జ్ఞానమనెడి ప్రకాశముచే అజ్ఞానమనెడి అంధకారము నశించును. సర్పమనెడి భ్రాంతి తొలగినప్పుడు, త్రాడు అనెడి నిజమైన వస్తువు తెలియబడును. మన మనస్సే! మన భ్రాంతికి కారణము. మనస్సే లేనిచో, భ్రాంతియే యుండదు. మనస్సే! మాయ. మాయవల్లనే మనకీ ప్రపంచము గోచరించుచున్నది. అనగా:– మనస్సువల్లనే మనకీ ప్రపంచము తెలియబడుచున్నది. మనస్సు రహితమైనప్పుడు ప్రపంచమే! లేదు. అది ఎట్లనగా:– గాఢనిద్రలో మనస్సు లేకుండుటచే మనకీ ప్రపంచము తెలియబడుట లేదు కదా! ఈ ప్రపంచమునందు సకల చరాచర జీవులు అస్తిత్వము కలిగి జనన–మరణముల నొందుచున్నవి. మనో రాహిత్యముచే జనన– మరణములు రహితమగును. అప్పుడు అశేష దుఃఖనివృత్తి–పరమానంద ప్రాప్తి కలుగును. ఐతే ఈ మనస్సు యొక్క ఉత్పత్తి స్థానమేది? మాయయే! దీనికి ఉత్పత్తి స్థానము. అనగా:– అజ్ఞానమే! దీనికి ఉత్పత్తిస్థానము. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యము దృఢపడినప్పుడు, "ఈ జగమంతా బ్రహ్మ మయము" అను వాక్యము అనుభూతమైనప్పుడు ఈ మాయ తొలగిపోవును. పామును చూచినప్పుడు త్రాడు కానబడదు. ఇక త్రాడును చూచినప్పుడు పాముకానబడదు. అదే ప్రకారముగా మనమీ ప్రపంచమును చూచినప్పుడు పరమాత్మ కానబడడు. ఇక పరమాత్మను చూచినప్పుడు ప్రపంచము కానబడదు. ఈ విషయము స్పష్టముగా తెలియబడినప్పుడు, అద్వైత సిద్ధి కలుగును. నామరూపములు నశించును. ఏకైక సత్యము ప్రకటీకృతమగును. అద్వైతమే సత్యము. ద్వైతమే! అసత్యము. ఇదియే! నిత్యా నిత్య వస్తు వివేకమనబడును. "ద్వితీయాద్వై భయం భవతి" అనగా:– రెండవ వస్తువు యొక్క ఉనికి వల్లనే భయము ఏర్పడును. రెండవ వస్తువే! లేనప్పుడు భయము ఎక్కడిది? దేవునికి రెండవ వస్తువు లేదు. అందువల్ల అతనికి ఏ వస్తువు వల్లను భయములేదు. మనము అసంఖ్యాక వస్తుజాలముచే చుట్టబడియున్నాము. అందువల్ల మనకు భయము కల్గుచుండును.

దేవుడొక దొంగవలె మన హృదయ గుహయందే దాగియున్నాడు. అతని ఉనికి తెలిసికొనుటయే! జ్ఞానము. అతడే! సత్యవస్తువు. ఆ సత్యవస్తువు లేకున్నచో,

మన దేహము చలింపదు. మన మనస్సు ఆలోచింపదు, మన బుద్ధి పనిచేయదు. అదే విధముగా సత్య వస్తువు లేకున్నచో, వృక్షములు ఫలములనివ్వవు. మేఘములు వర్షము నొసంగవు. నదులకు పారుదలయుండదు. పక్షులు ఆకాశము నందెగురజాలవు. గోవులు పాల నొసంగజాలవు. బాలుడు యువకుడుగను, అటు పిమ్మట వృద్ధుడుగను మారజాలడు. మనుజుని తలలో వెండ్రుకలు పెరుగజాలవు. మనము మన హస్తములతో కాగిదముపై వ్రాయజాలము. నేత్రములతో దేనినైనను చూడజాలము. చెవులతో ఏలాటి శబ్దమునైను వినజాలము. ముక్కుతో రకరకములగు వాసనలను అనుభవింపజాలము. నాలుకతో నానారకములగు రుచులను గ్రహింపజాలము. చర్మము స్పర్శజ్ఞానమును కలిగియుండజాలదు. ఆ సత్య వస్తువే! దేవుడు. ఆ సత్య వస్తువే! పరమాత్మ. అతనిని గుర్తెఱుంగుటయే! మన కర్తవ్యము. అతనిని గుర్తెఱుంగనిచో మనకు కలుగు నష్టమేమి? యని పాఠకులు ప్రశ్నింపవచ్చును. అతనిని గుర్తెఱుంగకున్నచో, మనలను అంధకారమావరించును. మనము మాయా మోహమునందు చిక్కుకొందుము. మన జీవితము కష్టపరంపరల నెదుర్కొనవలసి యుండును. మన జీవితము అసంఖ్యాకములగు సమస్యలకు గుఱియగును. మన దేహము వ్యాధిగ్రస్తమగును. మన మనస్సు చంచలమగును. మన బుద్ధి వివేకశక్తిని కోల్పోవును. ఇక దేవుని అస్తిత్వమును గుర్తించుటచే మన జీవితము తేజస్వంతమగును. మన నేత్రములు జ్యోతికిరణములను ప్రసరింపచేయును. మన దేహము స్వాస్థ్యముతో విరాజిల్లును. మన మనస్సు సుస్థిరమగును. మన బుద్ధి ప్రకాశవంతమగును. మన జీవితమునందు ప్రశాంతత ఏర్పడును. మనము తలపెట్టిన ఎట్టి కార్యమైనను ఫలవంతమగును. హృదయములోని ఆందోళన తొలగిపోవును. నిర్భయత్వము తాండవమాడును. మన ముఖము తేజస్వంతమగును. ఎట్టి సందర్భమునందైనను చిఱునగవు మనలను వీడియుండదు. మన మనస్సు చీకు, చింత లేనిదగును. వాక్కు శుద్ధమగును. కాయము బలిష్ఠమగును.

సత్యమునకు భిన్నమైనదే! అసత్యము. నామరూప రహితమైనదే! సత్యము. నామరూప సహితమైనదే! అసత్యము. శాశ్వతమైనదే! సత్యము. అశాశ్వతమైనదే! అసత్యము. సత్యవస్తువునకు నాస్తిత్వము లేదు. ఇక అసత్యమునకు అస్తిత్వము లేదు. సత్యము ప్రకాశమునకు మూలము. అసత్యము అంధకారమునకు మూలము. సత్యము ఆనందమునకు నిలయము. అసత్యము దుఃఖమునకు ఆలయము. సత్యము సచ్చిదానంద స్వరూపము. సత్యమున్నచోట అసత్యముండదు. ఇక, అసత్యమున్నచోట

సత్యముండజాలదు. సత్యమే! ఆత్మ. అసత్యమే! అనాత్మ. సత్యము త్రిగుణాతీతము. ఇక అసత్యము త్రిగుణ సమన్వితము. సత్యము అనంతము. అసత్యము అంతవంతము. సత్యము అఖండము. అసత్యము ఖండము. సత్యము ఛేదింపబడదు. అసత్యము ఛేదింపబడును. సత్యము దహింపబడదు. ఇక, అసత్యము దహింపబడును. ఆత్మ సత్యము, దేహము అసత్యము. పరమేశ్వరుడు సత్యము. ప్రపంచము అసత్యము. నేత్రము నందున్నవాడు సత్యము. నేత్రము అసత్యము. చెవిలోనున్నవాడు సత్యము, చెవి అసత్యము. ముక్కులోనున్నవాడు సత్యము, ముక్కు అసత్యము. నాలుకలోన్నువాడు సత్యము. నాలుక అసత్యము. చర్మమునందున్నవాడు సత్యము. చర్మము అసత్యము. పంచభూతములకు కారణమైనవాడు సత్యము. పంచభూతములు అసత్యము. జాగ్రదవస్థ సత్యము. స్వప్నావస్థ అసత్యము. మోక్షము సత్యము. బంధనము అసత్యము. ఈ ప్రకారముగా ఏది సత్యము? ఏది అసత్యము అని మనస్సులో వితర్కించుకొని సత్యవస్తువును చేపట్టి, అసత్యమును వర్జించుటయే! మానవజీవిత లక్ష్యము. దీనిని సాధించినప్పుడు భవబంధము త్రెంపబడును. శాశ్వతానందము పొందబడును. సకల దుఃఖనివృత్తి కలుగును. కావున మనమందరమున్నూ మానవజీవిత లక్ష్యము నొందుటకు మార్గమును నిర్దేశించునట్టి సద్గురువునాశ్రయించి, ఆతని శరణు పొంది, తదనుసార వర్తనులమై, మానవజీవితమును సార్ధకమొనర్చుకొని పరమానంద ప్రాప్తిని బడయుదుము గాక! ఏతత్కార్యము సఫలీకృతమగుటకై శ్రీ సద్గురుదేవుల దివ్యానుగ్రహము మనందఱిపై ప్రసరింపబడును గాక! యని హృదయపూర్వకముగా ప్రార్థించుచున్నాము.

## 6. నా నిర్ణయము

ఈ రోజు నేను ఉదయం 9 గంటలకు పూజ్యశ్రీ ముకుందానంద స్వామి వారివద్దకు వెళ్ళి దర్శించివచ్చితిరి. తరువాత సాయంకాలం 5 గంటలకు శ్రీ గురుదేవ్ కుటీరమునకు వెళ్ళి భజన-కీర్తనలలోను, శ్రీకృష్ణభగవానునికి, గురుభగవానునికి హారతి- గంగాహారతిలోను పాల్గొంటిని. రేపటిరోజు 8 గంటలకు ఆశ్రమమునకు సంబంధించిన పోస్టాఫీసులో సేవచేయుటకు వెళ్ళుదును. నిజమునకు నేనెచ్చట ఉన్నానో, నా కర్థమగుట లేదు. నేను 1965 లో ఋషీకేశ్‌కు రావడానికి పూర్వము ఏర్పేడు-శ్రీవ్యాసాశ్రమము లోను, గుంటూరు-గౌడీయమఠములోను, మధుర-బృందావనములలోను ఉంటిని. నిజమునకు నేనెక్కడ ఉన్నానో నాకర్థమగుటలేదు. నేను 1979లోను, 1981లోను, 1987లోను ద్వాదశజ్యోతిర్లింగములను,

కన్యాకుమారి ఇత్యాదులను దర్శించితిని. నేను 1993లో ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలలో యూరప్ ఖండములోని, జర్మనీ, ఇటలీ, స్పేన్, ఫ్రాన్స్, ఆష్ట్రియా, స్విట్జర్లాండ్, హాలెండ్, బెల్జియం, జక్ రిపబ్లిక్ లను దర్శించితిని. నిజమునకు నేనెక్కడ ఉన్నానో నాకర్థమగుట లేదు. నేనీ ప్రపంచమును చూచుటకు పూర్వము నా తల్లి గర్భమునందు 9 మాసములుంటిని. దానికి పూర్వము నేనెచ్చట యుంటినో నాకు తెలియదు. నిజమునకు నా నిజమైన నివాసమెచ్చటయున్నదో నాకు తెలియదు. ఈ దేహమెచ్చటెచ్చటికి వెళ్ళుచున్నదో, నా మనస్సు కూడా అచ్చటచ్చటికి వెళ్ళుచున్నది. లేక, నా మనస్సెచ్చటెచ్చటికి వెళ్ళుచున్నదో, నా దేహమచ్చటచ్చటికి వెళ్ళుచున్నది. నా మనస్సు, నా దేహము ఉన్నచోట నా బుద్ధి కూడా అచ్చటున్నది. నాదేహము, నా మనస్సు, నా బుద్ధి ఎల్లప్పుడు చలించుచున్నవి. అనగా:- మార్పునొందుచున్నవి. నిజమునకు మార్పులేని, చలనము లేని పదార్థమును పొందుటకై ఇవి అన్నియును చలించుచున్నవి, లేక, మార్పునొందుచున్నవి. మన భూగోళము కూడా చలనములేని, మార్పులేని పదార్థము నొందుటకై రాత్రింబవళ్ళు చలించుచున్నది, లేక, మార్పునొందుచున్నది. ఇంతఏల? ఈ సూర్య, చంద్ర, నక్షత్రాదులతో కూడిన ప్రపంచమంతయు ప్రపంచమునకు ఆధారమై చలనములేని, మార్పులేని పదార్థమునొందుటకై నిరంతరము చలించుచున్నది, లేక, మార్పునొందుచున్నది. పదునాలుగు లోకములు కూడా లోకాతీతుడైన లోకేశ్వరుని పొందుటకై చలించుచున్నవి, లేక, మార్పునొందుచున్నవి.

ఈ ప్రపంచములోని 84 లక్షల యోనులలో పరిభ్రమించుచున్న జీవరాసులన్నియును శాశ్వత సుఖమునొందుటకై అఖండముగా చలించుచున్నవి, లేక మార్పునొందుచున్నవి. నశించు పదార్థములన్నియును నాశములేని దానిని పొందుటకై ప్రాకులాడుచున్నవి. నేను ఏ స్థలమునందున్నానో, ఆ స్థలము నాది కాదు. ఏలననగా:- ఎల్లప్పుడు నేను స్థానభ్రష్టుడనగుచున్నాను. నేను ఏ ఇంటియందున్నానో, ఆ ఇల్లు నాది కాదు. ఏలననగా:- నేను నా ఇంటినుండి ప్రతిరోజు బయటికి వెళ్ళవలసి వచ్చుచున్నది. నేను ఏ దేశమునందున్నానో, ఆ దేశము నాది కాదు. ఏలననగా:- పొట్టపోసుకొనుటకై నేను దేశాటన మొనర్పవలసి వచ్చుచున్నది. నేను ఏ లోకము నందున్నానో, ఆ లోకము నాది కాదు. కారణమేమనగా:- మరణ సమయమునందు నేనీ లోకమును వీడి వెళ్ళవలసి వచ్చుచున్నది. ఇంతకూ నా నిజమైన స్థలమేదో నాకు తెలియకున్నది. ఐతే, శాస్త్రములు,

పురాణములు, ఋషులు, మునులు, మహాత్ములు చెప్పునదేమనగా:- దేశ, కాలములకతీతమైనట్టి వస్తువొకటి ఉన్నది. అది శాశ్వతమైనది. అదే చలనము లేనిది. అదే మార్పు లేనిది. అదియే! బ్రహ్మము. లేక, పరబ్రహ్మమని చెప్పబడును. అదియే! ఆత్మ, లేక పరమాత్మయని చెప్పబడును. అదే సచ్చిదానంద స్వరూపము. నేను ఎచ్చట కూర్చొనియున్నానో, నేను ఎచ్చట నిలబడియున్నానో, నేను ఎచ్చట నడుచుచున్నానో, నేను ఎచ్చట పరుగెత్తుచున్నానో, నేను ఎచ్చట గంతులు వేయుచున్నానో, నేను ఎచ్చట నాట్యమాడుచున్నానో, నేను ఎచ్చట నిద్రించుచున్నానో, నేను ఎచ్చట స్వప్నములను గాంచుచున్నానో, నేను ఎచ్చట పరుండియున్నానో, ఈ కార్యములన్నియును ఒకే స్థలమునందు జరుగుచున్నవి. ఆ స్థలము పేరు అనంతము. నేనీ ప్రపంచమునందు దేనిని చూచుచున్నానో, దేనిని తెలిసికొనుచున్నానో, దేనిని గ్రహించుచున్నానో, అట్టి సమైక్య జ్ఞానమునకు పేరు ఆత్మజ్ఞానము, లేక బ్రహ్మజ్ఞానము. ఏ ఆహారమును భుజించుటచే నాకు సంతృప్తి కలుగుచున్నదో, ఏ సౌందర్యమును చూచి నాకు సంతోషము కలుగుచున్నదో, ఏ శబ్దమును వినుటచే నాకు శ్రవణానందము కలుగుచున్నదో, దేనిని స్పర్శించుటచే నాకు స్పర్శానందము కలుగుచున్నదో, అట్టి సమైక్యానందము ఆత్మానందము, లేక, బ్రహ్మానందమని చెప్పబడును. ఈ యానందము విషయానందమునకు అతీతమైనది. ఇది ఏకైకము. కావున దీనియందు భిన్న భిన్నములైన ఆనందములుండవు. దీనికి మించిన ఆనందము మరియొకటి ఉండదు. కావున ఇది పరమానందమని చెప్పబడును.

నిజమునకు నేను సత్ –చిత్– ఆనంద స్వరూపుడను. నేను నిరంతరము, ఎల్లప్పుడు, అహర్నిశము నాకు తెలియకుండానే అప్రయత్నముగా "సో–హం" జపమును చేయుచున్నాను. ఈ విషయము మనకు తెలియని కారణముచే అజ్ఞానులముగా పరిగణింపబడుచున్నాము. తెలిసికొన్నప్పుడు మన యందు ఆత్మ జ్ఞానము ప్రకాశించును. "సో–హం" అనగా:– 'అతడే! నేను' అని అర్థము. బ్రహ్మము, లేక పరబ్రహ్మమునకు స్త్రీ పురుష నపుంసక లింగ భేదములేదు. "సర్వం బ్రహ్మమయమ్" అంతా బ్రహ్మమే! "ఇందుగల దందులేద"ను సందేహము వలదు; అణువణువునందును ఆతడే! నిండి యున్నాడు. ఆతని ఉనికి, లేక అస్తిత్వము లేనిదే ఒక చీమ కూడా చలింపజాలదు. ఈ జగన్నాటక మంతయు ఆ జగన్నాటక సూత్రధారిచే జరిగిపోవుచున్నది. పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఆ పరబ్రహ్మమే! నిండియున్నది. భూతభవిష్యద్వర్తమాన కాలములన్నియును, ఆ పరబ్రహ్మముచే నిండియున్నవి. కావున

నే నేదేశమునందున్నను, ఏ కాలమునందున్నను, నిలబడియున్నను, కూర్చొనియున్నను, కండ్లు తెఱచినను, కండ్లు మూసినను, నడుచుచున్నను, పరుగెత్తుచున్నను, మెలకువతోయున్నను, స్వప్నములను గాంచుచున్నను, గాఢనిద్రయందున్నను, అన్నియు ఆ పరబ్రహ్మమునందే జరుగుచున్నవనియు, ఆ పరమాత్మయందే జరుచున్నవనియును నా నిర్ణయము. కారణమేమి? పరమాత్మ సర్వవ్యాపకుడు. ఈ కారణముచే నాకు అస్తిత్వము లేదు. నీకున్నూ అస్తిత్వము లేదు. పరమాత్మ సర్వశక్తిమంతుడు. ఈ కారణముచే నా శక్తి, నీ శక్తి అందఱి శక్తులన్నియును ఆ పరమాత్మకు సంబంధించినవే! పరమాత్మ సర్వజ్ఞుడు. ఈ కారణముచే నాకు తెలిసినది, నీకు తెలిసినది, అందఱికి తెలిసినది అన్నియును ఆ పరమాత్మకు సంబంధించినవే! అహంభావమే! అజ్ఞానము. సో-హంభావమే! విజ్ఞానము. మన మందఱమున్నూ సర్వాంతర్యామియైన పరమాత్మకు శరణు పొందెదము గాక! మన మందఱమున్నూ సర్వశక్తిమంతుడమైన పరమేశ్వరునికి శరణు పొందెదము గాక! మన మందఱమున్నూ సర్వజ్ఞుడైన సర్వేశ్వరునికి శరణు పొందెదము గాక! ఇట్టి నిర్ణయము సుదృఢమైనప్పుడు సచ్చిదానంద సాగరము మనముందుండును. సచ్చిదానంద స్వరూపులమే! మన మగుదుము.

## 7. ఏది లాభము? ఏది నష్టము?

సామాన్యముగా మన మందఱమున్నూ ఇతరుల నుండి డబ్బును గాని, వస్తువులను గాని, నిత్యావసర పదార్థములను గాని పొందుట లాభమనియు-ఇతరులకు మనము డబ్బును గాని, వస్తువులను గాని, నిత్యావసర పదార్థములను గాని ఇచ్చుట నష్టమనియును తలంచుచుందుము. కాని ఇది ఏ మాత్రము నిజము కాదు. ఇది శుద్ధమైన అబద్ధము. కారణమేమి? మనము దేనిని ఇతరులకు ఇచ్చెదమో, అదే మనకు తిరిగి లభించును. అది ఎట్లు? ఈ ప్రపంచములోని సమస్త వస్తువులు, సమస్త పదార్థములు ఒకదాని కొకటి సంబంధమును కలిగియున్నవి. ఒకరి దేహము మఱొకరి దేహమునకు భిన్నమైయున్నను, ఒకరి మనస్సు మరొకరి మనస్సునకు భిన్నమైయున్నను, ఒకరి బుద్ధి మరొకఱి బుద్ధికి భిన్నమైయున్నను వీటన్నింటిని కలుపునట్టి ఆత్మయనెడి పదార్థమొకటి యున్నది. ఈ ఆత్మ పదార్థము "సూత్రే మణిగణా ఇవ" అన్నట్లు ఒక దారములోని పూసలు ఒకదాని కొకటి కలిసికొనియున్నట్లు ఈ ప్రపంచములోని పదార్థములు, జీవులు పరస్పరము కలిసికొని యున్నారు. ఈ కారణముచే నేనెవర్నినైనా తిట్టినప్పుడు ఆ తిట్టు ప్రపంచమంతయు చుట్టి చుట్టి తిరిగి నాకే ఆ తిట్టు ఎవరి

ద్వారా నైనను లభించును. అదే విధముగా నేనెవరినైనను కొట్టినప్పుడు, ఆ కొట్టు ప్రపంచమంతయు చుట్టి చుట్టి తిరిగి ఎవరి ద్వారానైనా నాకే లభించును. ఒక తోటలోని పుష్పమును మనము కోసినప్పుడు, దాని ప్రభావము ఆకాశమునందున్న నక్షత్రముపై పడును. ఈ విషయమును గుర్తెఱింగిన కారణము చేతనే శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు "పుష్పవిలాపము"ను వ్రాయుట జరిగెను. ఒకవేళ మనమెవరినైనను ద్వేషింతుమేని, ఆ ద్వేషము ప్రపంచమంతయు చుట్టి చుట్టి చివరికి ఇతరులచే మనము ద్వేషింప బడుదుము. ఒకవేళ మనమెవ్వరిపై యైనను క్రోధమును చూపింతుమేని, ఆ క్రోధము ప్రపంచమంతయు పరిభ్రమించి తుదకు ఇతరులు మనల నాగ్రహించుటకు కారణమగును. అదే విధముగా మనమెవ్వరినైనను ప్రేమింతుమేని, ఆ ప్రేమ ప్రపంచమంతయు చుట్టి చుట్టి తిరిగి ఇతరులు మనలను ప్రేమించునట్లొనర్చును. సామాన్యముగా ప్రపంచమునందున్న మన మందఱమున్నూ ఎక్కువగా ధనమును ఆర్జింప గోరుచుందుము. ఒకవేళ మన జీవిత పోషణకు సరిపడు దానికంటె ఎక్కువ ధనమును మన మార్జింతుమేని, మనము పరోక్షముగా ఇతరుల ధనము నపహరించిన వారమగుదుము.

ఒకవేళ మనము 8 మంది భార్యలను కలిగియుందుమేని, పరోక్షముగా మనము ఇతరుల 8 మంది భార్యలను అపహరించిన వారమగుదుము. కావుననే శ్రీ రామచంద్ర భగవానుడు ఏకపత్నీ వ్రతము నవలంబించి, మానవులందఱికి ఆదర్శప్రాయుడై "మర్యాదా పురుషోత్తముడు" గా కీర్తింపబడెను. ఐతే శ్రీకృష్ణ భగవానునికి అష్ట మహిషులున్నారు కదా! యని మీరడుగవచ్చును. ఈ కారణముచేతనే శ్రీకృష్ణ భగవానుడు దశావతారములో ఒకరైన వామనుడు (బ్రహ్మచారి)గా అవతరింపవలసి వచ్చెను. అందువల్ల దేవతలకు కూడా కర్మఫలము ననుభవింపక తప్పదని తెలియుచున్నది. ఆధ్యాత్మిక సాధకుడు అందఱితో తాదాత్మ్యమునొంది జీవింపవలసి యుండును. అప్పుడు కర్మఫలము ననుభవించుట జరుగదు. ఒకవేళ అనుభవించినను దాని ప్రభావమంతగా నుండదు. "నేను–నాది" అనుకొన్న వానికి కర్మఫలమునను భవింపక తప్పదు. "నేను" అనుకొన్నప్పుడు మనము శరీర భావమును, లేక అహంకారమును కలిగియున్న వారమగుదుము. "నాది" అనుకొన్నప్పుడు మనము అజ్ఞానమును కలిగి యున్న వారమగుదుము. కారణమేమి? ఈ ప్రపంచమునందు "నాది" యనునదేదియున్నూలేదు. "ఈశావాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్" అనగా:– ఈ ప్రపంచము నందంతట ఈశ్వరుడు నిండియున్నాడు. అంతటా

ఈశ్వరుడున్నప్పుడు మనకు స్థలమెచ్చట మిగిలి యుండును? ఈ ప్రపంచములో నాకు స్థలమున్నదను కొనుటయే! అజ్ఞానము. ఈ ప్రపంచములో నేనున్నానను కొనుటయే! అజ్ఞానము. కారణమేమి? నా శరీరము పృథ్వి, అగ్ని, వాయువు, జలము, ఆకాశమనెడి పంచభూతములచే నిర్మింపబడినది. పంచభూతముల చేత నిర్మింపబడిన ఈ దేహము "నేను" ఎట్లగుదును? పంచభూతములు నా ఆస్తి కాదు కదా! కావున "నేను" అనుకొనుట అసత్యము. అదే విధముగా "నాది" అనుకొనుటయున్నూ అసత్యమేయగును. నేనే లేనప్పుడు నాకు సంబంధించిన విషయమెట్లుండును? లేని దానిని ఉన్నదనుకొని మనమందఱమున్నూ నిజమైన ఆస్తిని కోల్పోయి గొప్ప నష్టము పాలగుచున్నాము. నిజముగా ఉన్నట్టి పరమేశ్వరుని పొందినప్పుడు మనము గొప్ప లాభము నొందినట్టి వారమగుదుము.

మనము ఎక్కువ లాభమును పొందదలంచినచో మనమేమి చేయ వలయును? ఈ ప్రపంచములోని ప్రజలు, ఆస్తులు, ఐశ్వర్యములన్నియును ఆ పరమేశ్వరునికి చెందియున్నవి. కావున ఈ ప్రపంచములోని ఆస్తులన్నింటిని మనము హస్తగత మొనర్చుకొనదలంతుమేని, మనమా పరమేశ్వరునికి శరణు పొందవలసి యున్నది, లేక పరమేశ్వరునికి పుత్రుడు, లేక పుత్రికగా మారవలసియున్నది. అట్లు మారుటకై మనమేమి చేయవలయును? ఇది చాల సులభమైన విషయము. సర్వకాల సర్వావస్థలలో మనమా సర్వేశ్వరుని గూర్చి చింతించుచుండవలయును. కాని నేటి కాలమునందు మనకీ విషయము కష్టతరముగా గోచరించును. ఇంతవరకు 84 లక్షల యోనులలో భ్రమణ చేసిన కారణముచే "నేను-నాది" అనెడి మొసళ్ళు మనలను కుడి-ఎడమలలో లాగుచు పీడించుచున్నవి. ఇట్లు మనమందఱమున్నూ బంధనము నందు చిక్కుకొని యున్నాము. ఈ బంధనము నుండి విడివడునదెప్పుడు? "నేను-నాది" అను మొసళ్ళను తెగనరకి నప్పుడు మన మీ బంధనము నుండి విడివడ గలుగుదుము. "నేను కిరణమును కాను. నేను సూర్యుడనే!" అనుకొన్న మనుజుడు సూర్యుడే! యగును. "నేను నీటి బిందువును కాను. నేను సముద్రమును" అనుకొన్న మనుజుడు సముద్రమే! యగుట నిశ్చయము. కావున కిరణావస్థ నుండి బయలుదేరి ప్రయాణము చేసి చేసి, తుట్టతుదకు సూర్యుడుగా మారుటయే! గొప్ప లాభము. నీటి బిందువు నుండి బయలుదేరి ప్రయాణము చేసి చేసి, చివరికి సముద్రముగా మారుటయే! గొప్ప లాభము. ఈ విషయమును తెలిసికొన్న వాడే! జ్ఞాని యనబడును. ఈ విషయమును గుర్తెంతిగినవాడే! యోగియనబడును. ఈ విషయమును గ్రహించిన

వాడే! యోగియనబడును. ఈ విషయమును గ్రహించిన వాడే! స్థితప్రజ్ఞుడనబడును. ఈ విషయమును అవగత మొనర్చుకొన్నవాడే! జీవన్ముక్తుడన బడును. ఇదియే! ఆధ్యాత్మిక సాధన యొక్క లక్ష్యము. దీని కంటె గొప్ప లాభము మరియొకటి లేదు. దీనికి మించిన లాభము మరియొకటి ఉండబోదు. దీనికంటె పెద్ద సంపద మరియొకటి ఉండజాలదు. దీనికంటె గొప్ప ఆస్తికి అస్తిత్వము లేదు. ప్రాపంచిక విషయ వాంఛలన్నింటిని విడిచి, ఈ ప్రపంచమునకు సృష్టికర్తయైన పరమేశ్వరుని ఆశ్రయించి, పరమేశ్వరుని శరణు పొంది, పరమేశ్వరునికి పుత్రులమై, పరమేశ్వరునికి పుత్రికలమై తద్వారా పరమేశ్వరుని ఆస్తినంతటిని హస్తగత మొనర్చుకొని, మనకు మించిన ధనవంతుడు, ఐశ్వర్యవంతుడు లేని గొప్ప హోదాను పొంది, పరమానందము అనుభవించెదము గాక!

## 8. ఎంత కాలా మోర్చియుందునురా?

అది భారతదేశమును ముసల్మానులు పరిపాలించుచున్న సమయము. గోల్కొండ నవాబు శ్రీరామదాసును తాహసీల్దారుగా నియమించెను. అందువల్ల ప్రజలనుండి పన్నును సేకరించి దానిని నవాబుకు సమర్పించుట ఆతని కర్తవ్యము. ఐతే దానికి విరుద్ధముగా శ్రీరామదాసుగారు ప్రజల నుండి పన్నును సేకరించి, దానిని నవాబుకు ఇచ్చుటకు బదులుగా శ్రీ రామభక్తి పారవశ్యముచే భద్రాచలములో శ్రీసీతారామలక్ష్మణాంజనేయ దేవాలయమును నిర్మించుటకై ఆ డబ్బును ఖర్చు చేసెను. గూఢచారులీ విషయమును నవాబైన తానీషాకు తెలియజేసిరి. తానీషా శ్రీ రామదాసు (పూర్వ నామము గోపన్న) ను కారాగారము నందు బంధింపజేసెను. అది మామూలు జైలు కాదు. గోల్కొండలోని గోయలోని జైలు. అందువల్ల బయట చూచుటకేమియు కానరాకుండెను. అంతేకాదు– తినుటకై ఎండు రొట్టెలను, పాసిపోయిన అన్నమును, కూరలను పెట్టుచుండిరి. ఇది చాలక శ్రీ రామదాసు దేహమును కొరడాలతో తీవ్రముగా మోదుచుండిరి. ఆ సమయమునందు “ఎంత కాలా మోర్చియుందునురా? శ్రీరామచంద్రా! నేనెంత కాలామోర్చియుందునురా?” అని ఆర్తితో మొఱపెట్టుకొనుచు శ్రీరామదాసు విలపించు చుండెను. శ్రీ రామదాసు యొక్క ఆర్తి మిన్నుముట్టెను. శ్రీ మద్భాగవతములోని గజేంద్రుని ఆర్తి వైకుంఠము నందున్న విష్ణుమూర్తి యొక్క వీనులకు వినబడినట్లు, శ్రీరామదాసు యొక్క ఆర్తి శ్రీరామలక్ష్మణుల వీనుల యందు ప్రవేశించెను. శ్రీ రామలక్ష్మణుల హృదయములు ద్రవించెను. వారు వెంటనే నవాబు

తానీషా వద్దకు పరోక్షవేషము నందు వెళ్ళి శ్రీరామదాసు చెల్లింపవలసిన పన్ను నంతటిని సమర్పించిరి. అంతేకాదు, నవాబు నుండి రసీదును కూడా తీసికొని ఆ రసీదును శ్రీరామదాసు ఉన్నట్టి జైలులో పడవేసిరి. ఈ ప్రకారముగా శ్రీరామదాసు బంధవిముక్తుడయ్యెను. ఇది మొన్న మొన్నటి మాట. ఏ కాలము నందైనను, ఏ స్థలమునందైనను, ఎవరైనను ఆర్తితో, హృదయపూర్వకముగా ప్రార్థించినచో, వారి భవబంధము నిస్సంశయముగా తొలగిపోవునని చెప్పుటకు పై వృత్తాంతము తార్కాణము. పంచపాండవుల పత్నియైన ద్రౌపదిదేవి కూడా దేహాభిమానమును త్యజించి, హృదయ పూర్వకముగా రెండు చేతులను పైకెత్తి ప్రార్థించినప్పుడే కదా? శ్రీ కృష్ణుడామెకు అనంతములైన వలువలనొసంగి ఆమె యొక్క మానమును కాపాడెను? తన సర్వస్వమును సమర్పించిన వారికి సర్వజ్ఞుడు సహకరించును.

మన మందఱమున్నూ ఆధ్యాత్మిక సాధకులము. అనగా:- సంచిత కర్మ నివారణకై దివి నుండి భువికి దిగి వచ్చిన మానవులము. ఇప్పుడు మనము అచ్చమైన ఆర్తితో దేవదేవుని ప్రార్థించి, భువి నుండి దివి కేగవలసియున్నది. ఇందు నిమిత్తమై తమతమ ఇష్టదేవతలను హృదయపూర్వకముగా ప్రార్థింపవలసియున్నది. మనమీ ప్రపంచములో ఉదయము నుండి రాత్రి వరకు వివిధములగు కార్యములనొనర్చుచు అలసిపోవు చుందుము. అలసట తీరుటకై రాత్రి నిద్రాదేవి యొక్క ఒడిలో ప్రవేశించుచుందుము. ఐతే ఎంత వరకీ నిద్ర? సూర్యోదయము వరకే! మరల కాయికమైన కర్మ, మానసికమైన కర్మలను చేయకతప్పదు. దేహపోషణకై జీవితాంతము వరకు ఏదో ఒక కార్యమును చేయవలసియుండును. ఐతే తినుట, త్రాగుట, నిద్రించుట కొరకే మనకీ మానవజన్మ లభించినదా? అట్లైనచో పశువు, మానవుని మధ్యగల వ్యత్యాసమేమి? 84 లక్షల యోనులలో పరిభ్రమించిన తర్వాత మనకీ మానవజన్మ మనసుకృతముచే లభించినది. దీనిని సార్థకమొనర్చుకొనుట మన ప్రథమ కర్తవ్యము. ఇందు నిమిత్తమై పూర్వజన్మల యందార్జించిన సంచిత కర్మను క్షయ మొనర్చుకొన వలయును. అంతవరకు మనకు జన్మపరంపరలు తప్పవు. ఈ జన్మకు తీసుకొని రాబడిన ప్రారబ్ధము ననుభవింప వలసియుండును. ఈ జన్మయందొనర్చిన సత్కర్మలచే భవిష్యత్తులో బంగారము పండును. ఆధ్యాత్మిక సాధకులమైన మనమందఱమున్నూ కేవలము వ్యాధిగ్రస్తులమైనప్పుడు, లేక వృద్ధావస్థయందున్నప్పుడే కాక సర్వకాల సర్వావస్థలలో "ఎంతకాల మోర్చియుందునురా? శివా!" అనియో, "ఎంతకాల యోర్చియుందునురా? రామా!" అనియో, "ఎంతకాల మోర్చియుందునురా? మురుగా!"

అనియో, "ఎంతకాల మోర్చియుందునురా? అచ్యుతా!" అనియో "ఎంతకాల మోర్చియుందునురా? శ్రీకృష్ణా!" అనియో, "ఎంతకాల మోర్చియుందునురా? కేశవా!" అనియో "ఎంతకాల మోర్చియుందునురా? నారాయణా!" అనియో "ఎంతకాల మోర్చియుందునురా? విష్ణూ" అనియో "ఎంతకాల మోర్చియుందునురా? ఈశ్వరా"అనియో "ఎంతకాల మోర్చియుందునురా? మాధవా" అనియో "ఎంతకాల మోర్చియుందునురా? కరుణానిధీ!" అనియో "ఎంతకాలమోర్చియుందునురా? పరమాత్మా! అనియో ఆర్తితోను, హృదయపూర్వకముగను ప్రార్థించుచున్నచో అవశ్యముగా ఫలితము లభించును. భవబంధకవాటము తెఱువబడును.

మన తను-మన- ధనములను పరమేశ్వరునికి సమర్పించిననే తప్ప మనము భవబంధము నుండి విడివడ జాలము. నిజమునకు తనువు మనదా? కాదు, ఏల? ఇది పంచభూతములచే నిర్మింపబడినది. ఈ పంచభూతములకు సృష్టికర్త పరమేశ్వరుడు. అందువల్ల ఈ దేహము మనము కాము. ఇక మనస్సు మనదా? కాదు. ఏల? మనస్సు కోరికల పుట్ట. మనమున్న స్థాయి నుండి ఉన్నత స్థాయికేగుట కొరకే మనలో కోరికలు జనించుచుండును. పరమోన్నత స్థానమే! పరమేశ్వరుడు. అందువల్ల మన మనస్సు కూడా పరమేశ్వరునికి సంబంధించినదే! ఇక ధనము మనదా? కాదు. ఏల? ధనము జడపదార్థము. దానిని ఆర్జించుటకై చిజ్జడగ్రంధి యనెడి దేహము-మనస్సు పనిచేయుచుండ వలయును. కష్టార్జిత ధనము మాత్రమే! మనకు ఉపకరించును. అన్యాయముచే ఆర్జించిన ధనము దొంగలపాలగును. లేక మనము వివిధములగు వ్యాధులచే చుట్టుముట్టబడి ఆ ధనమంతటిని వైద్యుల హస్తములలోను, డాక్టర్ల హస్తములలోను పెట్టవలసియుండును. దేహపోషణకు సరిపడు ధనము మాత్రమే! మనది. దానికి అధికముగా సేకరించిన ధనము మనలను కష్టపరంపరలకు గురి చేయును. మన తను-మన-ధనములను భగవంతుని కర్పించినప్పుడు మన దేహము అస్వస్థతకు గుఱికాదు. మన మనస్సులలో చిందర వందర కోరికలు మొలకెత్తవు. ధనము సద్వినియోగమగును. మనము నిద్రలేచిన వెంటనే "ఈ దినము నా చివరి దినము" అనుకొనవలయును. ఏలననగా:- యమధర్మరాజు ఎప్పుడు, ఎచ్చట, ఏ క్షణములో మనలను దఱిజేరునో మనకు తెలియదు. అట్లొనర్చిన దినమంతయు భగవచ్చింతనచే దివ్యత్వము నొందును. మనము ఏ కార్యము చేయుచున్నను "దేవుని ఉనికి చేతనే! నేనీ కార్యమును చేయగలుగుచున్నాన"ని తలంపవలయును. దేహము దేవునికి వాహనము వంటిది. విష్ణుదేవునికి గరుత్మంతుని

వంటిది. సరస్వతీదేవికి హంస వంటిది. సుబ్రహ్మణ్యస్వామికి నెమలి వంటిది. శివునికి నంది వంటిది. అందువల్ల దేహము మన వశము నందుండవలయునే కాని, మనము దేహము యొక్క వశమునందుండరాదు. అప్పుడు “ఎంత కాల మోర్చియుందునురా?” అను ప్రశ్నకు తావుండదు. దేవుని కార్యము చేయుచున్న దేహము యొక్క భారము తగ్గిపోవును. “ఎంతకాల మోర్చియుందునురా?”అను దుఃఖము నివారింపబడును. ఇట్లు పరమానంద ప్రాప్తి సుగమమగును. మానవ జీవితలక్ష్యము పొందబడును.

## 9.శాంతి వృక్షము

ఈ పృథ్వియందు జన్మించిన ప్రతి మానవుడున్నూ ఒక శాంతి వృక్షము వంటివాడు. అనగా :- ప్రతిమానవుడున్నూ తన జీవితము నందు శాంతినే కోరుచుండును. “శాంతము లేక సౌఖ్యము లేద”ని భక్త త్యాగరాజు గారు నుడివి యున్నారుకదా! కావున  శాంతియే! సుఖము; సుఖమే! శాంతి. ప్రతి యొక్కరు శాంతిని, లేక సుఖమునే కోరుచుందురు. ఐతే శాంతికి బదులుగా అశాంతి, సుఖమునకు బదులుగా దుఃఖము మనకెట్లు దాపురించుచున్నది? దీనికి కారణము మనమే! లేక మన మనస్సే! అని చెప్పవలసియున్నది. మన మీ పృథ్వి పై జన్మించిన వెంటనే మన పరిసరములు మనపై ప్రభావము చూపును. మన పరిసరములు ప్రశాంతములై యున్నచో, మన మనస్సు కూడా ప్రశాంతముగానే యుండును. ఒకవేళ మన పరిసరములలో అశాంతి ఆవరించియున్నచో, దాని నివారణకై మనము అహర్నిశము పాటుపడవలసియుండును. ఇట్లు  పాటుపడుటకై మనము మనయందున్న ఆత్మయొక్క తేజస్సును గుర్తింపవలసి యుండును. మన హృదయమునందే ఆత్మసూర్యుడు ప్రకాశించుచున్నాడని తెలిసికొనవలసి యుండును. ఇట్లు తెలుసుకొన్న  భక్తులలో ప్రహ్లాదుడు, ధ్రువుడు, మార్కండేయుడు, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ సద్గురు శివానందస్వాములవారు, శ్రీ స్వామి ఓంకార్ గారు, శ్రీ రమణ మహర్షి, శ్రీ అరవిందఘోష్, మాఁ ఆనందమాయి, భక్త మీరాబాయి, మహాత్మాగాంధీ మున్నగువారిని పేర్కొనవచ్చును.  పూర్వజన్మ కర్మానుసారముగా  మన పరిసరములు అనుకూలముగను, లేక ప్రతికూలముగను ఉండును.  శాంతి వృక్షము చిగురించి, పుష్పించి, ఫలించుటకై అనుకూలములైన పరిసరములు దోహదమొసంగును. ఐతే నిజమైన సాధకునికి ప్రతికూలములైన  పరిసరములు అడ్డురావు. అడ్డు వచ్చినను ఆటంకములన్నింటిని తన ఆత్మ శక్తిచేతను, ప్రజ్ఞాపాటవము చేతను తొలగించుకొని, శాంతి వృక్షము

యొక్క ఎదుగుదలకై నిరంతనము శ్రమించుచుండును. ఇట్టి సాధకుడు పాఠశాలలోని విద్యార్థులందరి శాంతి వృక్షముల ఎదుగుదలకై సహకరించుచుండును. ఈ ప్రకారముగా ఆధ్యాత్మిక సాధకుడు తన ఆత్మశక్తిచే శాంతి వృక్షము సర్వత్ర చిగురించునట్లు, పుష్పించుచున్నట్లు, ఫలించునట్లు చేయును. తన గృహ ప్రాంగణమునందు కూడా శాంతి బీజములను నాటి కుటుంబ సభ్యులందఱి జీవన క్షేత్రములలో శాంతి వృక్షములు వర్థిల్లునట్లు కృషి యొనర్చును. ఇది నెఱవేరుటకై తన హృద క్షేత్రములోని పరమాత్మను ప్రార్థించుచుండును.

మనము ఆహారమును భుజించినప్పుడు మనకు తృప్తి, లేక శాంతి కలుగును. ఐతే, ఇది తాత్కాలిక తృప్తి–తాత్కాలిక శాంతి మాత్రమే! ఏలననగా:– కొంత సమయము తర్వాత మనకు మరల ఆకలి వేయును. అందువలన ఇది పూర్ణతృప్తి కాదు, పూర్ణశాంతి కాదు. మన విద్యాభ్యాసమునందున్నూ మనకు కొఱత యుండును. కారణమేమి? దేనిని తెలిసికొన్నచో మనకు పరమశాంతి కలుగునో, దేనిని తెలిసికొన్నచో మనకు పరమానందము కలుగునో, అట్టిదానిని పాఠశాలలలోని విద్యకాని, కళాశాలలలోని విద్యగాని మనకు నేర్పవు. అయితే, పాఠశాలలలోను, కళాశాలలలోను చదువుకొనరాదని దీని భావము కాదు. అవి తప్పకుండా మనకు జీవనోపాధిని కల్పించుటతోపాటు సుఖజీవనమునొసంగును. ఈ శరీరపోషణకై ఏదోయొక కర్మచేయక తప్పదు. కావున శాంతివృక్షమును పోషించుటకై శరీరవృక్షమును కూడా పోషించుకొనుట అత్యావశ్యకమగును. శాంతివృక్షము పెరుగుచున్న కొలది దానికి శాఖోపశాఖలేర్పడును. ఈ శాంతివృక్షము యొక్క మూలము ఊర్ధ్వలోకమునందున్నది. ఇక, శాఖోపశాఖలు మనమున్న నిమ్నలోకమునందున్నవి. కావున, ఈ శాఖోపశాఖలన్నింటిని మనము ఊర్ధ్వముఖముగా మళ్ళింపవలసియున్నది. ఇట్లొనర్చుటకై శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడునైన, శ్రేష్ఠుడైన గురువు ఆవశ్యకమగును. ఒకవైపు శాంతివృక్షము ఎంతకెంతకు పెరుగుచుండునో, మరియొకవైపు అశాంతివృక్షము కూడా అంతకంతకు పెరుగుచుండును. శాంతివృక్షము అంతరంగమునందు పెరుగుచుండును. ఇక అశాంతివృక్షము బాహ్యమునందు పెరుగుచుండును. కావున బాహ్యమునందున్న అశాంతివృక్షమును "అసంగశస్త్రము"చే ఖండింపవలసియుండును. అశాంతివృక్షము అహంకారమనెడి అశుద్ధజలముచే పోషింపబడుచుండును. ఇక శాంతివృక్షము నిరహంకారమనెడి పరిశుద్ధమైన, అమృతోపమానమైన జలముచే పోషింపబడు చుండును. కావున మనము మన అహంకారమును కృష్ణపక్షచంద్రునివలె దినదినము

క్షీణింపచేయుచుండవలయును. అహంకారము పూర్తిగా నిశ్శేషమైనపుడు మనము శాంతి వృక్షములోని సుమధురములగు ఫలములను అనుభవింపగలుగుదుము. మఱొక మార్గమేమనగా:- మన అహంకారమును "ఇంతింతై వటుడింతయై" అన్నట్లు వామనావతారము వలె భూనభోంతరాళములలో వ్యాపించునట్లు పెంచవలయును. అప్పుడు కూడా మనము శాంతి వృక్షములోని సుమధురములగు ఫలముల నాస్వాదింప జాలుదుము. కారణమేమనగా:- ఇట్టి అహంకారము "అహంబ్రహ్మాస్మి" ని సూచించును.

శాంతివృక్షమును శాంతిసాగరముతో కూడా పోల్చవచ్చును. శాంతివృక్షములో శాఖోపశాఖలున్నట్లే శాంతిసాగరములో అలలు, తరంగములు, బుద్బుదములు ఇత్యాదులుండును. ఒక అల నేను ఒంటరిదానిననుకొన్నప్పుడు దానికి భయము కలుగును. అదే అల నేను సముద్రమునకు సంబంధించినదానిననుకొన్నప్పుడు దాని భయము నివారింపబడును. అదే విధముగా ఒక తరంగము నేను ఒంటరిదానిననుకొన్నప్పుడు దానికి భయము కలుగును. అదే తరంగము నేను సముద్రమునకు సంబంధించినదానిననుకొన్నప్పుడు దాని భయము నివారింపబడును. అదే విధముగా ఒక బుద్బుదము నేను ఒంటరిదానిననుకొన్నప్పుడు దానికి భయము ఆవరించును. అదే బుద్బుదము నేను సముద్రమునకు సంబంధించిన దానిననుకొన్నప్పుడు దాని భయము నివారింపబడుట తథ్యము. అయితే, ఒక అల-ఒక తరంగము-ఒక బుద్బుదమునకు మధ్య ఏ మాత్రము ఖాళీస్థలముండదు. ఏలననగా:- అలగాని, తరంగముగాని, బుద్బుదముగాని అంతా ఏకైక సముద్రమే కదా! సముద్రమే! అల, సముద్రమే! తరంగము, సముద్రమే! బుద్బుదము. ఇదే ప్రకారముగా జీవుడు-దేవుని మధ్య కూడా స్థలము లేదు. ఖాళీ స్థలమున్నది కదా! అనుకున్నచో ఆ ఖాళీస్థలములో కూడా సూక్ష్మరూపమునందు దేవుడు విరాజమానుడైయున్నాడు. ఈ శరీరము పంచభూతములచే నిర్మింపబడినది. ఇక, పంచభూతములకు సృష్టికర్త పరమాత్ముడే కదా! అందుచే పంచభూతములలో కూడా దేవుని ఉనికి యున్నది. ఐతే, ఈ శరీరము, ఈ మనస్సు, ఈ బుద్ధి సైతము మనలను దేవుని మరపింపజేయుచుండును. కారణమేమనగా:- వీటియందు సత్త్వ-రజ-స్తమో గుణములు నిండియుండును. కావున ఇవి మాయాదేవి యొక్క రూపములు. మాయాధీశుడైన మాధవుని శరణు జొచ్చినప్పుడు మనము మాయను అతిక్రమింప జాలుదుము. అప్పుడు అశాంతివృక్షము ఖండింపబడుటతో శాంతివృక్షమునందు,

లేక, శాంతిసాగరమునందు, లేక శాంతిభాస్కరునియందు మనము ప్రవేశించి, పరమానందము నొందజాలుదుము. కావున మనమందఱమున్నూ శాంతిసాగరమునందోలలాడుటకై అహంకారమనెడి రాక్షసుని హతమార్చి నిత్యానంద సాగరమునందు నిర్భయులమై ప్రవేశించెదము గాక! శాంతివృక్షము ఒక కల్పవృక్షము వంటిది. అనగా:- ఈ కల్పవృక్షమునందు పదునాల్గు లోకములలోని సుఖసంపద యంతయు సమ్మిళితమైయున్నదని గ్రహింపవలయును.

## 10. నీవున్న చోట నేను కూడా ఉన్నాను.

పై వాక్యము పాఠకులకు విడ్డూరముగా తోచకమానదు. ఏలననగా :- మనమందఱమున్నూ "దేహో-హం" అను భావనను కలిగియున్నాము. కొంచెము లోతుగా విచారించినచో పై వాక్యము సత్యమే! అను విషయము స్పష్టమగును. నేను దేహమునని భావించినప్పుడు నీ వున్నచోట నేనుండజాలను. మఱియు నే నున్నచోట నీవుండజాలవు. నిజమునకీ దేహమునకు ఉనికి లేదు. ఇది జడమైన పదార్థము. ఐతే ఈ జడమైన పదార్థమెట్లు చలించుచున్నది? ఒక ఎడ్లబండి ఎట్లు చలించుచున్నదో, అట్లు చలించు చున్నది. బండి జడమైన పదార్థము. దానిని రెండెద్దులు చలింపజేయుచున్నవి. ఈ ఎద్దులను సరియైన మార్గములో చలింపజేయుటకొక యజమాని కూడా అవసరమై యుండును. ఈ మూడింటివల్ల ప్రయాణము కొనసాగును. మన దేహమొక బండి వంటిది. ఈ దేహమునందున్న మనస్సు మఱియు బుద్ధి రెండెద్దుల వంటివి. ఈ మనస్సు మఱియు బుద్ధిని సక్రమమైన మార్గమునందు నడిపించుటకై ఆత్మ యనెడి యజమానియు ఆవశ్యకమైయుండును. ఈ మూడింటిచేతనే! మన ఆధ్యాత్మిక ప్రయాణము కొనసాగుచుండును. ఐతే ఈ యాత్మ యొక్క ఉనికి ఎక్కడ? ఈ యాత్మ సర్వత్ర వ్యాపించియున్నది. దేహమునందున్న ఆత్మ జీవాత్మయనబడును. ఇక, విశ్వమునందంతట వ్యాపించియున్న ఆత్మ పరమాత్మ యనబడును. సముద్రమే! పరమాత్మ. ఆ సముద్రములోని ఒక నీటిబిందువే! జీవాత్మ. ఈ విశ్వమునందు కేవలము మనుష్యులే కాకుండా పశువులు, పక్షులు, కీటకములు, చీమలు, దోమలు, ఏనుగులు, గుఱ్ఱములు, గాడిదలు, కుక్కలు, నక్కలు, సింహములు, పులులు, పాములు, తేళ్ళు మున్నగు 84 లక్షల యోనుల జీవరాశులున్నవి. వీటన్నింటిని సృష్టించి, పోషించి, లయింపజేయువాడే! పరమాత్మ. ఆత్మ, లేక పరమాత్మ సర్వవ్యాపకము కాకున్నచో జీవుల సృష్టి-స్థితి-లయములు జరుగజాలవు. ఈ ప్రకారముగా ఆత్మ

సర్వవ్యాపకమైయున్నదను విషయము నిరూపింప బడుచున్నది. ఐతే ఈ యాత్మ విద్యుచ్ఛక్తి కంటెను మిక్కిలి సూక్ష్మమైనదగుటచే మన భౌతిక నేత్రములకు కానబడదు. కావున నీవున్నచోట నేను కూడ ఆత్మరూపమునందు ఉనికిని కలిగియున్నానను మాట నిజమని తెలియుచున్నది. నాలోను, నీలోను, నాకు, నీకు మధ్యను ఈ ఆత్మ విరాజిల్లియున్నది.

ఇక నేను మనస్సును కూడా కాను. నీ మనస్సు ఒక విధముగా ఆలోచించినచో, నా మనస్సు మరొక విధముగా ఆలోచించును. ఈ ప్రపంచము నందెందఱు మనుజులున్నారో, లేక ఎన్ని ప్రాణులున్నవో, అవి యన్నియును భిన్నభిన్నముగా ఆలోచించుచుండును. దీనినిబట్టి కూడా నేనుండజాలను. ఈ మనస్సున కాధారమైయున్న పదార్థమొకటి యున్నది. అదే! అత్మ. మనస్సు చెప్పిన దానిని బుద్ధి నిశ్చయించును. కావున మనస్సును, బుద్ధిని ఏకముగానే గ్రహింపవలయును. మనస్సు ప్రాపంచిక పదార్థములకై పరుగెత్తుచుండును. ఇది ఒక చేప గాలమునకు తగుల్కొనుట వంటిది. చేప నిజమునకు గాలమునకు తగుల్కొనియున్న పదార్థమును తినుటకై పరుగెత్తును. కాని గాలమునకు చిక్కుకొని మరణించును. మనుజులమైన మనమున్నూ ఇట్టి కార్యమునే చేయుచున్నాము. సాంసారిక సుఖమునకాశించి, సంసారమునందు బంధింపబడుచున్నాము. ఈ బంధమునందు తగుల్కొనకుండా యుండుటకై మనము సాధుసాంగత్యమును చేయవలసియున్నది. లేక, శాస్త్రజ్ఞాన నిష్ణాతుడును, బ్రహ్మనిష్ఠుడునైన గురుదేవుని సమీపింపవలసియున్నది. ఇట్లు సమీపించిన శిష్యుని గురుదేవుడు సక్రమమైన మార్గమునందు నడిపించి, బంధవిముక్తుని గావించి, మానవజీవిత గమ్యస్థానమును చేర్చును. గురుదేవుడు "తత్ త్వం అసి" అను మహావాక్యమును బోధించును. "తత్" అనగా అది, లేక బ్రహ్మము అని అర్థము. 'అది' – అంటే అక్కడ ఉన్నది, ఇక్కడ లేనిదని అర్థమొనర్చుకొనరాదు. బ్రహ్మము తెలియబడ నంతవరకు "అది" యను పదమును ఉపయోగింపక తప్పదు. "త్వం" అంటే నీవు అని అర్థము. అంటే ఈ దేహమునందు బంధింపబడిన జీవుడని భావము. "అసి" అంటే ఉన్నావు అని అర్థము. ఈ ప్రకారముగా "తత్ త్వం అసి" అంటే నీవే బ్రహ్మమై యున్నావని భావము. బ్రహ్మము సర్వవ్యాపకమైనది. కావున నీవున్నచోట నేను కూడా ఉన్నానను విషయము దోషభూయిష్టము కాదని స్పష్టమగుచున్నది. నీవున్న చోట నేను కూడా ఉన్నానను విషయము తెలియబడుటకై ఈ దేహము నేను కాను, ఈ మనస్సు నేను కాను, ఈ బుద్ధి నేను కాను, ఈ ఇంద్రియములు నేను

కాను అను విషయము దృఢపడవలయును. కారణమేమనగా:- పైన తెలుపబడిన వన్నియును అశాశ్వతములైన ప్రాపంచిక విషయములను మాత్రమే! గ్రహింపగలుగును. సర్వవ్యాపకమైన, సర్వజ్ఞమైన, సర్వశక్తివంతమైన, శాశ్వతమైన పదార్థమగు బ్రహ్మమును తెలిసికొను సామర్థ్యము వాటికి లేదు. కావున మనము జడమైన పదార్థములను త్యజించి, శాశ్వత చైతన్యము నంటిపెట్టుకొని యుండవలయును.

"నీవున్నచోట నేనున్నాను" అనుటకు బదులుగా "నేనున్నచోట నీవున్నావు" అను మాట కూడా ఉచితమేయగును. కారణమేమి? మనమిప్పుడు దేహము, మనస్సు, బుద్ధియనెడి భూమికలను దాటి, ఆత్మచైతన్యభూమిక నధిరోహించియున్నాము. చైతన్యము, ప్రజ్ఞ, విజ్ఞానము- ఈ మూడున్నూ పర్యాయపదములు. అజ్ఞానము చీకటి వంటిది. విజ్ఞానము వెలుతురు వంటిది. అజ్ఞానమే! బంధమునకు కారణము. విజ్ఞానమే! బంధవిమోచనమునకు, లేక మోక్షమునకు కారణము. సర్వదుఃఖనివృత్తి మరియు పరమానంద ప్రాప్తియే! మోక్షమని చెప్పబడును. ఆత్మ, లేక పరమాత్మ సత్యమైనది. అనగా:- శాశ్వతముగా ఉండునది. అది అన్ని స్థలములలోను, అన్ని వేళలలోను ఉనికిని కలిగియున్నది. ఆత్మ, లేక పరమాత్మ చైతన్యవంతమైనది. అనగా:- ఆత్మకు తెలియని పదార్థమేదియును లేదు. పరమాత్మకు తెలియని పదార్థము అణుమాత్రమైనను లేదు. ఇక ఆత్మ, లేక పరమాత్మ ఆనందఘనమైయున్నది. ఈ కారణముచే పరమాత్మ సచ్చిదానందస్వరూపమని చెప్పబడినది. స్వప్రయత్నముచేతను, గుర్వనుగ్రహము చేతను సత్యమైన వస్తువు తెలియబడినప్పుడు మనము సర్వవ్యాపకుల మగుదుము. అంటే ఈ దేహము సర్వవ్యాపకమగుననుకొనుట పొరపాటు. పురుష ప్రయత్నము చేతను, గురుకరుణచేతను ఆత్మ, లేక పరమాత్మ తెలియబడినప్పుడు మనము సర్వజ్ఞులమ గుదుము. అనగా:- మనకు తెలియని పదార్థమేదియును శేషించి యుండదు. తన ప్రయత్నముచేతను, గురువుగారి కారుణ్యముచేతను ఆత్మ, లేక పరమాత్మ తెలియబడినప్పుడు మనకు పరమానందము ప్రాప్తించును. ఇట్లు మనము సచ్చిదానంద స్వరూపులమగుదుము. ఈ స్థితిని పొందుటకై మనము మన జీవితమంతటిని వెచ్చింపవలసియుండును. బ్రహ్మచారి బ్రహ్మచింతన చేయుచుండవలయును. గృహస్థుడు భార్యాపిల్లలయందును, ఇరుగుపొరుగువారి యందును భగవద్భావనను కలిగియుండవలయును. గర్భిణి తన గర్భమునందు ప్రహ్లాదుడు, ధ్రువుడు లేక మీరాబాయి యున్నదని తలంపవలయును. వానప్రస్థుడు నేను-నాది యనువాటిని శూన్యమొనర్చుకొనవలయును. ఇక సన్న్యాసి నిరంతరము సత్సాంగత్యమునే

కలిగియుండవలయును. అనగా:- సత్యవస్తువునంటిపెట్టుకొని యుండవలయును. అప్పుడు దేవుడున్నచోట నేనుందును. మఱియు, నేనున్నచోట దేవుడుండును. ఇదియే! నాలుగు మహావాక్యముల సారము. ఇదియే! అనుభవైక అద్వైత వేదాంత సారము. ఇదియే! అమృతత్వప్రాప్తి. ఇదియే! పరమానందసాగరము.

## 11. అస్తమించని సూర్యుడే! ఆత్మదేవుడు

ఈ ప్రపంచమునందు సూర్యుడు ప్రతిదినము ఉదయించుచు, అస్తమించుచుండును. అస్తమించిన సూర్యుడు ఎచ్చటికి వెళ్ళును? ఆతడీ భూగోళము యొక్క మరొక భాగమునకు వెళ్ళును. ఈ కారణము చేతనే 12 గంటల తర్వాత మరల మనకు ప్రత్యక్ష మగును. కావున సూర్యుడు శాశ్వతమైనవాడే! కాని అశాశ్వతమైన వాడు కాడు. ఇక చంద్రుని విషయమేమి? చంద్రుడున్నూ ఆ పరమేశ్వరుని ఆదేశానుసారముగా అమావాస్య నుండి కొద్ది కొద్దిగా పెరుగుచు 15 రోజుల తర్వాత పూర్ణచంద్రుడగును. తర్వాత కొద్దికొద్దిగా తరుగుచు 15 రోజుల తర్వాత శూన్యచంద్రుడగును. ఈ వృద్ధిక్షయములకు గల కారణమేమి? చంద్రునికాధారమై యున్న శాశ్వతుడైన పరమేశ్వరుని ఆజ్ఞయే! దీనికి గల కారణము. సూర్యుని ఉదయాస్తమయములకు గల కారణము కూడా ఆ పరమేశ్వరుని ఆదేశమే! యగును. ఇక నక్షత్రముల మాట ఏమి? అమావాస్య చీకటియందాకాశము నందు నక్షత్రములు మిణుకు మిణుకు మనుచు మెఱయుచుండును. పూర్ణచంద్రుని సమక్షమునందు వాటి మిలమిలలు కొంత తడబడును. ఇక మధ్యాహ్న సూర్యుని సమక్షమునందు తమ కాంతియే! కోల్పోవును. అంతమాత్రముచే నక్షత్రములు నిశ్శేషముగా తమ కాంతిని కోల్పోయినవని చెప్పుటకు వీలులేదు. కారణమేమనగా:- అవి దేశ-కాల-పరిస్థితులననుసరించి తమ కాంతిని వెదజల్లుచు మరల మిలమిల మెఱయుచుండును. ఈ కారణముచే ఇవి శాశ్వతమైనవే! కాని అశాశ్వతములని నుడువుటకు వీలులేదు. ఐనను సూర్యుడైతేనేమి? చంద్రుడైతేనేమి? నక్షత్రములైతేనేమి? ప్రళయకాలమునందు తమ తమ అస్తిత్వములను కోల్పోవలసియుండును. ఈ కారణముచే ఇవి శాశ్వతమైనవనియున్నూ చెప్పుటకు వీలులేదు. ఈ జగత్తున్నంతవరకు మాత్రమే! ఇవి శాశ్వతములుగా పరిగణింపబడును. ప్రళయకాలానంతరము మరల ఈ జగత్తు సృష్టింపబడినప్పుడు, ప్రళయ కాలములో సూక్ష్మరూపమునందున్న ఈసూర్యచంద్ర నక్షత్రాదులు మరల వ్యక్తములగును. జగన్నాటకమీ ప్రకారముగా సాగిపోవుచుండును.

శాశ్వతమైన పదార్థము మఱొక పదార్థముపై ఆధారపడియుండదు. ఆత్మ పదార్థము ఈ పదార్థములన్నింటికి ఆధారమైయున్నది. ఆత్మ పదార్థము దేవతలన్నింటికి దేవత. ఈ ఆత్మ పదార్థము వల్లనే మన దేహములోని ఇంద్రియములన్నియును పని చేయుచున్నవి. ఆత్మ పదార్థము చేతనే మన మనస్సు ఆలోచింపగలుగుచున్నది. ఆత్మ పదార్థము చేతనే మన బుద్ధి వివేచనా శక్తిని కలిగియున్నది. ఆత్మ పదార్థము చేతనే మన దేహములోని పంచ ప్రాణములు పనిచేయుచున్నవి. ఈ కారణముచే ఆత్మ శాశ్వతమైయున్నది. స్వర్గలోకములోని దేవతలందఱును ఆత్మ శక్తిచేతనే భోగభాగ్యముల ననుభవింపగలుగుచున్నారు. ఆత్మ శక్తిచేతనే పదునాలుగు లోకములు తమతమ స్థానములలో విరాజమానములైయున్నవి. ఆత్మ శక్తి చేతనే! ఈ జగన్నాటక మంతయును చలాయమానమగుచున్నది. ఆత్మశక్తి చేతనే ఈ జగత్తులోని నదులన్నియును నిర్విరామముగా ప్రవహించుచు, తుట్టతుదకు తమకు గమ్యస్థానమైన సాగరమునందు లీనమగుచున్నవి. ఆత్మశక్తి చేతనే పర్వతములు చలింపక “అచలము”లని పేరు గాంచినవి. ఆత్మశక్తి చేతనే ఋతువులు మారుచున్నవి. ఆత్మశక్తి చేతనే సింహము గర్జించుచున్నది. ఆత్మశక్తి చేతనే ఏనుగు ఘీకరించుచున్నది. ఆత్మశక్తి చేతనే గుఱ్ఱము సకిలించుచున్నది. ఆత్మశక్తి చేతనే గాడిద ఓండ్ర పెట్టుచున్నది. ఆత్మశక్తి చేతనే కుక్క మొఱుగుచున్నది. ఆత్మశక్తి చేతనే పాము పృథ్విపై ప్రాకుచున్నది. ఆత్మశక్తి చేతనే ఆకాశమునందు పక్షులు ఎగురుచున్నవి. ఆత్మశక్తి చేతనే గాలి వీచుచున్నది. ఆత్మ శక్తి చేతనే అగ్ని జ్వలించుచున్నది. ఆత్మ శక్తి చేతనే పృథ్వి తన చుట్టు తాను తిరుగుచు సూర్యదేవునికి పరిక్రమ చేయుచున్నది. ఆత్మశక్తి చేతనే ఒక కుటుంబములోని సభ్యులు తమ తమ కార్యములను నెఱవేర్చుచున్నారు. ఆత్మశక్తి చేతనే ఒక గ్రామములోని ప్రజలు తమ విధులను నెఱవేర్చుచున్నారు. ఆత్మశక్తి చేతనే ఒక పట్టణములోని ప్రజలు తమతమ కర్తవ్యములను నిర్వహించుచున్నారు.

ఆత్మశక్తి చేతనే ఒక మండలములోని ప్రజలు సంఘీభావమును కలిగియున్నారు. ఆత్మశక్తి చేతనే ఒక జిల్లాలోని ప్రజలు సుఖముగా జీవించుచున్నారు. ఆత్మశక్తి చేతనే ఒక రాష్ట్రములోని ప్రజలు ఐకమత్యమును కలిగియున్నారు. ఆత్మశక్తి చేతనే! ఖండఖండాంతరములలోని ప్రజలు అఖండానందము ననుభవించుచున్నారు. ఆత్మశక్తి చేతనే పదునాలుగు లోకములు కూలిపోకుండా ఒకదొంతి వలె ఒకదానిపై మరొకటి నిలచియున్నవి. కాని ఈ యాత్మశక్తి మన నేత్రములకు కానబడదు. కారణమేమనగా:–ఇది విద్యుచ్ఛక్తి కంటెను సూక్ష్మాతి సూక్ష్మమైయున్నది. విద్యుచ్ఛక్తిని

మనము మన నేత్రములతో చూడజాలకున్నను, దాని చేతనే మన ఇంటిలోని బల్బు వెలుగుచున్నది. మన గదిలోని పంఖా తిరుగుచున్నది. మన ఇంటిలోని వంటకములను తయారుచేయుచున్నది. చలికాలములో వెచ్చదనమునిచ్చుచున్నది. వేసవికాలములో చల్లదనము నొసంగుచున్నది. అదే ప్రకారముగా ఆత్మశక్తి సర్వకార్యముల నొనర్చుచున్నది. ఈ విద్యుచ్ఛక్తికి ఆధారము ఆత్మశక్తియే సుమా! "ఆత్మై వేదం సర్వమ్" అని వేదము నుడువుచున్నది. అనగా:– అది ఆత్మయే! ఇదియున్నూ ఆత్మయే! ఆత్మ నుండియే! ఆత్మ సృష్టింపబడుచున్నది. ఒకవేళ ఆత్మ నుండి ఆత్మను తీసివేసినచో, ఆత్మయే శేషించును. ఆత్మ పూర్ణమైనది. అందుచే దానిలో విభాగములుండవు. నీ ఆత్మ నా ఆత్మకు భిన్నమైనది కాదు. కాని నీ దేహము నా దేహమునకు భిన్నమైయున్నది. ఈ దేహముచే ఒనర్పబడినట్టి విభిన్నమైన కర్మలే! దీనికి గల కారణము. కర్మలన్నియును నిశ్శేషమైనప్పుడు పరిశుద్ధమైన ఆత్మ ప్రకాశించును. మలినము లేని దర్పణమునందు ప్రతిబింబము స్పష్టముగా కానబడును కదా! ఆత్మ దేవుడు అస్తమించినచో, ఈ జగత్తుకే ఉనికి యుండదు. అప్పుడు పదునాలుగు లోకముల దొంతియున్నూ దొరలి క్రిందబడును. సూర్యచంద్ర నక్షత్రాదులన్నియును అస్తమించును. అట్లు జరుగకుండుటకు గల కారణమీ ఆత్మదేవుడే! ఈ విషయమును పరిగ్రహించి అనుభవమునకు తెచ్చుకొనుటయే! ఆత్మానుభవమనబడును అదియే! ఆత్మ సాక్షాత్కారము. ఇది దైవ సాక్షాత్కారము, లేక బ్రహ్మ సాక్షాత్కారమనియున్నూ చెప్పబడును. ఇదియే! మానవ జీవిత కర్తవ్యము.

## 12. కన్నీరు కార్చనేల?

ఈ ప్రపంచములో జన్మించిన బాలుడైతేనేమి? యువకుడైతేనేమి, వృద్ధుడైతే నేమి, కర్మ యోగియైతేనేమి, భక్తి యోగియైతేనేమి, రాజయోగియైతేనేమి, జ్ఞానయోగియైతే నేమి ప్రత్యక్షముగనో, పరోక్షముగనో తమ జీవితమునందు కనీసము ఒకసారియైనా కన్నీరు కార్చకుండాయుండజాలడు. కారణమేమి? మనము మన నిజమైన గృహమును వీడి, పరాయి గృహము నందు నివసించుచుండుటయే! దీనికి గల కారణము. మన నిజమైన గృహము శాశ్వతమైనది. మనము ప్రస్తుతముంటున్న గృహము అశాశ్వతమైనది. మన నిజమైన గృహమునందెల్లప్పుడు ఆనందమే! తాండవమాడుచుండును. కాని ప్రస్తుతము మనమున్న గృహము "దుఃఖాలయమ"ని చెప్పబడుచున్నది. ఈ గృహము (ప్రపంచము) లో దుఃఖము తప్ప మఱియొకటి

లేదు. ఐతే భుజించుట యందును, రతిక్రియ యందును, సుషుప్తియందును మనము కొంతసుఖము ననుభవించుచున్నాము. ప్రపంచమున కాధారముగా పరమాత్మ నిలచియుండుటయే! దీనికి కారణము. ప్రాపంచిక క్రియాకలాపములన్నియును పరమాత్ముని నియతి ప్రకారముగా జరిగిపోవుచున్నవి. అందువలన మనము కేవలము పరమాత్మునిపై ఆధారపడవలసి యున్నది. అప్పుడే! మనకు పరమసుఖము ప్రాప్తించును. కుండయే! కుండలోని నీటికాధారము. అదే విధముగా పరమాత్మయే! ప్రపంచములోని పదార్థములన్నింటికి ఆధారము. పరమాత్ముని ఉనికి చేతనే నా నేత్రములు చూడగలుగుచున్నవి. విశ్వేశ్వరుని ఉనికి చేతనే నా చెవులు వినగలుగుచున్నవి. సర్వేశ్వరుని ఉనికి చేతనే నా ముక్కు వాసన చూడగలుగుచున్నది. జగన్నాథుని ఉనికిచేతనే నా చర్మము స్పర్శింపజాలుచున్నది. లోకేశ్వరుని ఉనికి చేతనే నా నాలుక రుచి చూడగలుగుచున్నది. పరమపిత ఉనికి చేతనే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు ఆకాశమునందు ప్రకాశించుచున్నవి. పరమేశ్వరుని ఉనికి చేతనే సముద్రము చెలియలికట్ట దాటకుండా నిలచియున్నది. ఇట్లు నాలోని, జగత్తులోని క్రియాకలాపము లన్నియును రాత్రింబగళ్ళు అఖండముగాను, నిర్విరామముగాను, ప్రశాంతముగాను, ఒక్కొక్కప్పుడు ప్రచండముగాను జరిగిపోవుచున్నవి.

దుఃఖాలయమునందు జన్మించిన కారణముచేతనే మాతృగర్భమునుండి బయల్వెడలిన బిడ్డ రోదన చేయుచున్నది. అప్పుడు తల్లి తన స్తన్యమునిచ్చి, ఆ బిడ్డను ఓదార్చును. బిడ్డ పెరిగి పెద్దదై పాఠశాలకేగుట ప్రారంభించును. కాని, పాఠశాలలో నేర్పబడునదంతయు ప్రాపంచిక విషయములే! కాని ప్రపంచమునకాధారమైయున్న పరమాత్ముని గూర్చి తెలుపుటకు ఉపాధ్యాయులు సాహసింపరు. కలియుగములోని నేటి పాఠశాలలలో "ప్రార్థన" కూడా విద్యార్థులచే జరిపించుట లేదు. ఇంతకన్నా ఘోరమైన కృత్యము మరొకటుండునా? పాఠశాలలలోను, కళాశాలలలోను విఘ్నములను హరించు విఘ్నేశ్వరుని ప్రార్థించుట పొరపాటా? విద్యలకు తల్లియైన సరస్వతీదేవిని ప్రార్థించుట నేరమా? వివిధములగు విద్యలను నేర్పునట్టి గురువు (ఉపాధ్యాయుడు)ను ప్రార్థించుట దోషమా? మీదుమిక్కిలి కనీసము 10 నిమిషములైనను దైవప్రార్థనలను జరిపిన పిమ్మట విద్యార్థులు తమతమ తరగతులకేగి, విద్యాభ్యాసము నొనర్చుట విద్యార్థులకెంతో శ్రేయస్కరము. విద్యను గఱపిన ఉపాధ్యాయులకున్నూ శ్రేయస్కరవేు! ఆధ్యాత్మిక బీజములు నాటబడిన హృదయక్షేత్రములు గల విద్యార్థులు యువకులైన పిమ్మట ఆధ్యాత్మిక బీజములు నాటబడిన హృదయక్షేత్రములు గల యువతులను పెండ్లాడినచో, అట్టివారికి

ఆధ్యాత్మిక బీజములు నాటబడిన హృదయములుగల సంతానమను పంటపండును. అట్టి గృహము భూతల స్వర్గమువలె శోభిల్లును. ఇందుకు విరుద్ధముగా ప్రవర్తించువారి నేత్రముల నుండి భవిష్యత్తులో కన్నీరు కారక మానునా? దట్టమైన పునాది వేయబడినప్పుడు దృఢమైన భవన నిర్మాణము జరుగును. దట్టమైన పునాది లేని గృహము వలె ఆధ్యాత్మికబీజములు నాటబడని హృదయములు గల మనుజులు తమ జీవితములను పతనమొనర్చు కొనుచుందురు. అప్పుడు వారు తమ వృద్ధాప్యము నందు కన్నీరు కార్చవలసి వచ్చును. బలహీనతవల్ల కన్నీరు కార్చుట జరుగుచుండును. ఈ బలహీనత అజ్ఞానమువల్ల ఏర్పడును. ఆత్మ-పరమాత్మల జ్ఞానము కలవారికి అజ్ఞానము నశించును. నేనెవడను? ఎచ్చటనుండి ఇచ్చటికేతెంచితిని? అను విషయములను గురుముఖతః తెలిసికొన్నవారికి అజ్ఞానము నశించును. అప్పుడు బలహీనతయు శూన్యమగును. అజ్ఞానముతోపాటు బలహీనతయు నశించినప్పుడు కన్నీరు కార్చుట జరుగదు.

జీవితగమ్యస్థానము నొందు నంతవరకు ప్రతి యొక్కరు ప్రత్యక్షముగనో, పరోక్షముగనో కన్నీరు కార్చుట జరుగుచుండును. జీవితము నందు పూర్ణతృప్తి కలుగనంత వరకు మనుజుడు మానసికముగానైనను కన్నీరు కార్చుచునేయుండును. సుఖమైనను, దుఃఖమైనను కర్మానుభవమును ప్రతియొక్కరు అనుభవింపక తప్పదని తెలిసికొన్నప్పుడు కన్నీటిలో కనక బిందువులు రాలుచుండును. నిశ్శేష కర్మ క్షయమే! మోక్షమను విషయమును తెలుసుకున్నప్పుడు కన్నీరు పన్నీరుగా మారును. ఈ ప్రపంచమొక కర్మభూమి. అందువల్ల ప్రతియొక్కరు కర్మలనాచరించవలయును. ఈ జన్మయందు మనము తీసుకొని వచ్చిన ప్రారబ్ధకర్మ నశించునంతవరకు ఓర్పుతోను, శాంతితోను, ప్రసన్నవదనముతోను కర్మలను నిస్స్వార్థ బుద్ధితో చేయుచుండవలయును. స్వార్థమునకై చేసిన కర్మలచే మరికొన్ని కర్మలు మనలనావరించి, మనస్సును అశాంతిపాలు చేయును. కావున ఎల్లప్పుడు నిష్కామకర్మలనే చేయుచుండవలయును. "నేను-నాది" అనునవి నశించినప్పుడు జీవితములో కన్నీరు కార్పనవసరముండదు. "నేను- నాది" అను భావనచే మనము ఇతరులకు దూరమగుదుము. నిజమునకు మనమీ విశ్వమునకు సంబంధించినవారము. కావున "ఇతరులు" అను శబ్దమునకు తావుండదు. ఆ జగన్నాథునికి ఈ జగత్తులోని జనులందఱును కన్నబిడ్డలే! కావున సకలజీవులను ప్రేమించుచుండవలయును. అప్పుడు "శత్రువులు" అనువారు శూన్యులగుదురు. మిత్రులున్నప్పుడు శత్రువులు కూడా ఉందురు. కావున ఆ పరమేశ్వరుడే! మన

తండ్రియనియు, ఆ పరమేశ్వరియే! మన తల్లియనియును తలంచి, వారి సంతానమై నట్టి మనమందఱమున్నూ సోదరీ–సోదరులమే! యను భావన దృఢపడినప్పుడు కన్నీరు కార్చవలసిన ఆవశ్యకతయుండదు. అద్వైత భావనలో "తల్లి– తండ్రి" భేదము కూడా నశించును. అప్పుడు ఏకైక సత్యము ప్రస్ఫురించి ప్రకాశించును. చైతన్యచంద్రిక మిలమిలలాడును. నిస్తరంగయుక్తమైన ఆనందసాగరము తాండవమాడును. ఇదియే! పరమోన్నత స్థితి. ఇదియే! ఆధివ్యాధులు లేని సమాధి స్థితి. ఇదియే! సచ్చిదానంద సాగరము. ఈ సాగరము నందు మన కన్నీరు కలిసిపోయినప్పుడు మనము జీవన్ముక్తులుగా శోభిల్లుదుము.

## 13. ఆత్మ చింతన

మానవులమైన మనమందఱమున్నూ అహర్నిశము ఆత్మచింతనను చేయుచుండవలయును. ఇదియే! మనుజునికి ముఖ్యమైన కర్తవ్యము. ఇదియే! ఆతని జీవితలక్ష్యమైయున్నది. కారణమేమి? ఆత్మ అంటే తానే! ఐతే ఈ "తాను, లేక నేను"ఎవరు? నేనెవరో నాకు తెలియదా? రెండు చేతులు, రెండుకాళ్ళు, రెండు కళ్ళు, రెండు చెవులు, ఒక నోరు, ఒక ముక్కు మున్నగునవి కలిగియున్న వానినే నేను అని సామాన్యముగా మనము సమాధానమును చెప్పుచుందుము. కాని ఇది సరియైన సమాధానముకాదు. కారణమేమి? నా చేతులు తినుటకు గాని, వ్రాయుటకు గాని, పనిచేయుటకు గాని పనికి వచ్చు ఉపకరణములు మాత్రమే! నిజమునకు వాటిలో బలముగాని, శక్తిగాని లేదు. ఈ శక్తి, బలము మన మనస్సునుండి వచ్చుచున్నది. మనస్సు దేనిని తలంచునో, దానిని చేతులు చేయుచుండును. కావున చేతులలోని బలముగాని, శక్తిగాని మన మనస్సుపై ఆధారపడి యున్నవని తెలియుచున్నది. ఇంకను లోతుగా ఆలోచించినచో ఈ బలము గాని, శక్తిగాని మన మనస్సుకు సంబంధించినది కాదు. అది తనకు ఆధారమైయున్న బుద్ధికి సంబంధించినది. మనస్సు తన ఇష్టానుసారముగా వర్తించుటకు వీలుపడదు. అది తన బుద్ధిపై ఆధారపడి యుండును. బుద్ధి మనకు ఇది వక్రమార్గమనియు, ఇది సక్రమమార్గమని యును తెలుపును. ఈ జగన్నాటకమంతయు సత్త్వరజస్తమోగుణములచే జరుగుచున్నది. మనస్సు సత్త్వగుణయుక్తమైయున్నప్పుడు ప్రశాంతముగానుండును. అప్పుడు మన బుద్ధి నిలుకడను కలిగియుండును. మనస్సు రజోగుణయుక్తమై యున్నప్పుడు మనస్సు చాంచల్యమును కలిగియుండును. అప్పుడు మన బుద్ధి కూడా కలతనొందియుండును.

ఇక మనస్సు తమోగుణయుక్తమైయున్నప్పుడు మనస్సు పనిచేయదు. బుద్ధిమాంద్యము కలుగును. స్తబ్ధత ఏర్పడును. ఏ కార్యమునైనను చేయుటకు మనస్సు ఇష్టపడదు. ఉ త్సాహము నశించును. ఏకాగ్రతను కోల్పోవును. దేహము నిస్సత్తువను కలిగియుండును. మనుజుడు అట్టి స్థితిలో ఇతరుల అవహేళనకు గుఱియగును. దానిచే క్రోధమేర్పడును. అప్పుడా మనుజుడు మోహగ్రస్తుడగును. జ్ఞాపకశక్తి నశించును. ఈ ప్రకారముగా మనుజుడు పతనమునొందును. అప్పుడాతని జీవిత పురోగమనము ఆగిపోవును. కర్మబంధము బిగిసిపోవుటచే నానారకములగు క్లేశములకు గుఱియగును. ఇట్లు జీవితమంతయు ఉక్కిరిబిక్కిరి యగును.

గాఢనిద్రయందు మన ఇంద్రియములుగాని, మనస్సుగాని, బుద్ధిగాని పనిచేయవు. గాఢనిద్రయందు ఇవి అన్నియు ఏమైనవి? ఇది మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయము కదా! గాఢనిద్రలో శ్వాస మాత్రము నడుచుచుండును. శ్వాసయే! ప్రాణము. ప్రాణమే! శ్వాస. ఐతే ఈ శ్వాస దేనిని ఆధారముగాగొని నడచుచున్నది. అదియే! అత్మ. ఇదియే! అన్నింటికి మూలాధారము. ఆత్మ అన్నా- పరమాత్మ అన్నా- ఒక్కటే! ఆత్మకు మించిన పదార్థము మరొకటి లేనందువలన అది పరమాత్మయని చెప్పబడుచున్నది. అత్మకు మించిన సుఖము మరొకటి లేనందువలన అది పరమానందమని చెప్పబడుచున్నది. ఆత్మకు మించిన శాంతి మరొకటి లేనందువలన అది పరమశాంతియని చెప్పబడుచున్నది. అత్మకు మించిన శక్తి మరొకటి లేనందువల్ల అది పరాశక్తియని చెప్పబడుచున్నది. ఆత్మ అమరమైనది. అనగా:- దానికి చావు-పుట్టుకలు లేవు. ఆత్మ శాశ్వతమైనది. ఆత్మ అఖండమైనది. అనగా:- ఆత్మ సర్వవ్యాపకమైనది. నిజమునకు మనమందఱమున్నూ ఇట్టి ఆత్మ స్వరూపులమైయుండగా మనకీ జనన-మరణములతో కూడిన సంసారబంధమెట్లు దాపురించినది? దీనికి కారణము కర్మానుభవమని చెప్పక తప్పదు. మనమేకర్మ చేసినను దేనినైనను సాధించుటకు చేయుచుందుము. ఈ కర్మ ప్రాపంచిక పదార్థములను పొందుటకై చేయబడుచున్నది. కాని, ప్రపంచములోని పదార్థములేవియునూ శాశ్వతములు కావు. కావున ఈ ప్రపంచము "దుఃఖాలయమశాశ్వతమ్" అని శ్రీకృష్ణ పరమాత్మ శ్రీమద్భగవద్గీతలో నుడివియున్నాడు. పరమాత్మయనెడి సముద్రము నందుంచబడిన కుండయే! ఈ ప్రపంచము. మట్టి కుండవలె ఈ ప్రపంచము ఎన్నటికైనా నశింపక తప్పదు. కావున ఈ ప్రపంచమునకతీతమైన పరమాత్ముని ఆధారముగా గైకొనుటయే! వివేకవంతుని లక్షణము. వివేకవంతుడు భావనాబల సంపన్నుడై యుండును.

భావనాబలము కలవానికి 14 లోకములకధిపతియైన విశ్వేశ్వరుడు సహకరించును. మనమా విశ్వేశ్వరునికి భిన్నులమై లేమనియు, మనమా విశ్వేశ్వరునియందే ఇమిడియున్నామనెడి భావనచే మనకు ఆత్మబలము సునాయాసముగా లభించును. ఇట్టి భావనను గురువాక్యముచే శ్రవణమొనర్చి తదనంతరము మననము చేయవలయును. అటుపిమ్మట నిధిధ్యాసన నొనర్పవలయును.

ఆత్మచింతనచే ఆత్మవికాసము కలుగును. అప్పుడు మనయందున్న సంకుచిత భావము నశించును. నేను ఈ దహింపబడు దేహమును కానను విషయము తెలియబడును. ఈ చంచలమైన మనస్సును కానను విషయము గ్రహింపబడును. ఈ యనిశ్చితమైన బుద్ధిని కానను విషయము స్థిరపడును. అన్నింటికి ఆధారమైయున్న ఆత్మయే! నేనను భావన దృఢపడినప్పుడాతడు ఆత్మ నిష్ఠుడగును. ఆత్మనిష్ఠుడన్నా–బ్రహ్మనిష్ఠుడన్నా ఒకే అర్థము. ఆత్మను వెదుకుటకై మనము ఇటునటు పరుగెత్తవలసిన అవసరము లేదు. నేనెచ్చట ఉన్నానో, అచ్చటనే ఆత్మ ఉన్నది. నేనెచ్చట లేనో, అచ్చట కూడా ఆత్మ ఉన్నది. నీవెచ్చట ఉన్నావో, అచ్చట ఆత్మ ఉన్నది. నీవెచ్చట లేవో, అక్కడ కూడా ఆత్మ ఉన్నది. ఆత్మ సర్వవ్యాపకమైనదగుటయే! దీనికి గల కారణము. ఆత్మచేతనే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు ప్రకాశించుచున్నవి. ఆత్మ చేతనే! ఈ జగత్తంతయు చలాయమానమగుచున్నది. బ్రహ్మదేవుడీ జగత్తును సృష్టించుటకు గల కారణమీ ఆత్మదేవుడే! విష్ణుమూర్తి ఈ విశ్వమును పోషించుటకు గల కారణమీ ఆత్మదేవుడే! ఈశ్వరుడీ నశ్వరమైన విశ్వమును నశింపజేయుటకు గల కారణమీ ఆత్మదేవుడే! ఆత్మ దేవుడు సగుణుడు మఱియు నిర్గుణుడు కూడా! ఆత్మదేవుడీ చరాచర ప్రాణికోటియందంతటను నిండియున్నాడు. ఆత్మదేవుడు పొందబడినప్పుడు మరొక దానిని పొందవలసిన అవసరముండదు. సమస్తము ఆత్మదేవునియందున్నప్పుడు మనము చిన్నచిన్న కోరికలను కోరనేల? ఆత్మవిశ్వాసము లేనివాడు ఆత్మద్రోహియని చెప్పబడును. ఆత్మనిష్ఠుడు కానివాడు ఆత్మహత్యనొనర్చుకొన్నవానితో సమానము. శరీరమును బలాత్కారముగా హత్యచేసినవాడు కాని, చేసికొన్నవాడు కాని 'అజ్ఞాని' యని చెప్పబడును. కావున మనమందఱమున్నూ అహర్నిశము ఆత్మచింతన చేయుచు ఆత్మజ్ఞానము నార్జించి, ఆత్మనిష్ఠులమై ఆత్మానంద సాగరమునందు మునకలిడుదుము గాక! ఆత్మానంద సాగరమునందు భౌతికమైన జలముండదు, కాని దానియందు పంచభూతముల కతీతమైన సత్యవస్తువు, చైతన్యపదార్థము మఱియు కేవలానందములు తాండవమాడుచుండును. ఇట్టి పరమలక్ష్యమును సాధించుటకై మన మహర్నిశము ప్రయత్నించుచు, మానవజన్మను సార్థకమొనర్చుకొందుము గాక!

# 14. మన కోరికలే! మన సమస్యలు.

ఈ ప్రపంచములోని ప్రతిజీవియు, ప్రతి ప్రాణియు, ప్రతి మానవుడున్నూ ఏదో ఒక కోరికను కలిగియుండును. కారణమేమి? కోరికయే లేకున్నచో, జీవితమే లేదు. జీవితములన్నియును కోరికలను తీర్చుకొనుటకే సృష్టింపబడినవి. ఐతే ఈ కోరికలలో చిన్న కోరికలు, పెద్దకోరికలు, తుచ్ఛమైన కోరికలు, స్వచ్ఛమైన కోరికలు, నిమ్నమైన కోరికలు– ఉన్నతమైన కోరికలు అను భేదములున్నవి. ఉదాహరణము నకు ఒక బాలుడు ఆడుకొనుటకై ఒక బంతిని కోరుకొనును. ఈ బాలుడే! పెరిగి పెద్దవాడైన తర్వాత బడికి వెళ్ళునప్పుడు పలక–బలపమును కోరుకొనును. ఇక యువకుడైన తర్వాత యువతిని కోరుకొనును. ఈ ప్రకారముగా ఎన్ని కోరికలను తీర్చుకున్నను మనుజునికి పూర్ణతృప్తి కలుగజాలదు. అందువలన వృద్ధావస్థలో చింతాగ్రస్తుడై యుండును. కావుననే శ్రీమచ్ఛంకర భగవత్పాదులిట్లు నుడివిరి, “బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్ తరుణీసక్తః వృద్ధస్తావత్ చింతాసక్తః పరమే బ్రహ్మణి కో–పినసక్తః”. ఒక బాలుడు ఆటలాడుకొనుచు తృప్తినొందును. కాని అది కొంతకాలము వరకే! ఒక యువకుడు వివాహమొనర్చుకొని దాంపత్య సుఖము ననుభవించును. కాని బాలుడుగాని, యువకుడుగాని ఎన్నో సమస్యల నెదుర్కొనక తప్పదు. బాలుడొక బంతితో ఆడుకొనునప్పుడు అది ఎగిరి ముండ్లకంపలో పడిపోయినచో దుఃఖించును. లేక, ఆటలాడు ఇతర బాలురచే ఓడింపబడినప్పుడు దుఃఖమునొందును. యువకుకొక యువతిని పెండ్లాడిన తర్వాత సంతానము కలుగకున్నచో దుఃఖించును. సంతానము కలిగినను భార్యాపిల్లలను పోషింపలేక దుఃఖించును; లేక, భార్యావియోగముచే చింతాక్రాంతుడగును. లేక, విడాకులు పుచ్చుకొనవలసివచ్చినప్పుడు దుఃఖింపవలసివచ్చును. కొందఱు తమ కుమారులకు ఉద్యోగములు లభింపలేదని చింతించుచుందురు. ఉద్యోగములు లభించినను, పెద్ద ఉద్యోగము రాలేదని బాధపడుదురు. కొందఱు తమ కుమార్తెలకు వివాహము కాలేదని బెంగపెట్టుకొందురు. వివాహమైనను అల్లుడు త్రాగుబోతని మనస్తాపము నొందుదురు. మరికొందఱు మనుమలు, మనుమరాళ్ళకై ప్రాకులాడుదురు.

ఈ ప్రకారముగా ఏ కోరికను కోరుకున్నను రకరకములగు సమస్యల నెదుర్కొనవలసివచ్చును. ఈ సమస్యలకు అంతమనునది లేదు. కేవలము కోరికలు అంతమైనప్పుడు మాత్రమే! సమస్యలు అంతమగును. కోరికలు ఎప్పుడంతమగును?

పూర్ణతృప్తి కలిగినప్పుడు కోరికలు అంతమగును. పూర్ణతృప్తి ఎప్పుడు కలుగును? మన మనస్సు పరబ్రహ్మమునందు లీనమైనప్పుడు పూర్ణతృప్తి కలుగును. కాని మాయాప్రభావము వలన మనమా పరబ్రహ్మమునందు ఆసక్తిని కలిగిలేకున్నాము. మాయ లేదా అజ్ఞానము అనగానేమి? పరబ్రహ్మమనగా ఏమిటో తెలియకపోవుటయే! అజ్ఞానము, లేక మాయ యనబడును. పరబ్రహ్మమునందాసక్తి కలుగుటకై మనము జ్ఞానము నార్జింపవలసియున్నది. కాని జ్ఞానము అజ్ఞానమనెడి మేఘముచే కప్పబడియున్నది. ఈ అజ్ఞానమనెడి మేఘమును తొలగించుటకై గురుదేవుడు ఆవశ్యకమగును. ఒకవేళ గురువు లేకున్నను మనము జ్ఞానము నార్జింపవచ్చునని తలంచినచో, అది అసాధ్యమైన కార్యము. పూర్ణావతారుడైన శ్రీకృష్ణ భగవానునికి కూడా "సాందీపుడ"నెడి గురువుండెను. మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్ర ప్రభువు కూడా"వశిష్ఠుడ"నెడి గురువును కలిగియుండెను. పరీక్షిన్మహారాజు శుకమహర్షిచే ఆత్మజ్ఞానమును బడసి ఏడురోజులలో పరబ్రహ్మమునందైక్యమయ్యెను. పదునాలుగు లోకములలోని సుఖములన్నియును పరబ్రహ్మము నందిమిడియున్నవనెడి విశ్వాసమునెవ్వరు కలిగియుందురో, వారు మాత్రమే! పూర్ణతృప్తిని బడయజాలుదురు. ఏ సుఖమును మించిన సుఖము మరియొకటి లేదో, అదియే! బ్రహ్మానందము, లేక పరబ్రహ్మానందమని చెప్పబడును. నిజానందమన్నను, నిత్యానందమన్నను, శాశ్వతానందమన్నను, అనంతానందమన్నను, ఆత్మానందమన్నను, బ్రహ్మానందమన్నను, పరబ్రహ్మానందమన్నను ఒకే అర్థమును సూచించును. దీనిని పొందినప్పుడు ప్రాపంచిక సుఖములైతేనేమి, స్వర్గలోక సుఖములైతేనేమి, మరి ఏ ఇతర సుఖములపైనను ఆసక్తి కలుగదు. కారణమేమి? ఆరూఢస్థితినొందిన వానికి ఈ సుఖములన్నియును స్వప్నసుఖములుగా తోచును.

జీవితమే! ఒక పెద్ద సమస్య. ఈ సమస్యను తీర్చుకొనుటకే మనకీ మానవ జన్మ ప్రాప్తించినది. కావున ఈ జీవిత సమస్యను తీర్చుకొనుటయే! మన ముఖ్యమైన కర్తవ్యము. ఇదియే! మన కేవల కర్తవ్యము. ఈ మానవ జీవితమును వ్యర్థమొనర్చినచో, దానికి మించిన నష్టము మఱొకటి లేదు. ఈ జీవితమును సార్థకమొనర్చినచో, దానికి మించిన లాభము మఱొకటి లేదు. ఐతే నిజమైన లాభమేదియో, నిజమైన నష్టమేదియో మనకు తెలియకున్నది. జీవితమంతయు ఆధ్యాత్మిక మార్గమునందు గడిపినప్పుడు మనము మన గమ్యస్థానమును చేరుకొనగలుగుదుము. ఆధ్యాత్మిక సాధన చేయుటకై మన దేహమొక సాధనమువంటిది. అందువలన మనమీ దేహమును

ఆరోగ్యముగను, బలిష్ఠముగను ఉంచుకొనవలసియుండును. అప్పుడు మన మనస్సు కూడా సుస్థిరమైయుండును. మనస్సుయొక్క చాంచల్యముడిగినప్పుడు బుద్ధి స్థిరముగా నుండును. బుద్ధి స్థిరముగానున్నప్పుడు "నిత్యానిత్య వస్తు వివేకము" కలుగును. అప్పుడు మనము నిత్యమైన దానిని చేపట్టి, అనిత్యమైన దానిని త్యజింపగలుగుదుము. ఈ విషయములన్నింటిని "పరిప్రశ్నేన సేవయా" అనెడి గీతా వాక్యానుసారముగా గురుదేవుని సేవించి, ప్రశ్నించి, సమాధానమును గ్రహించి, ఆచరించినప్పుడు మన గమ్యస్థానగమనము మనకు సుగమమగును. జనన– మరణములు దుఃఖపరంపరలకు కారణములు. కావున "నజాయతేమ్రియతేవా" అను గీతా వాక్యానుసారముగా జనన–మరణములు లేని ఆత్మానుభవము నొందవలయును. అప్పుడు మన జీవిత సమస్యలన్నియును తీరిపోవును. "పునరపి జననం– పునరపి మరణం" అను సమస్యలు అంతమగును ఈ కారణముచే మన కోరికలు కూడా అంతమగును. సమస్త సమస్యలకు కారణములైన సమస్త కోరికలు నశించును. శ్రీమచ్ఛంకరాచార్యుల వారు నుడివినట్టి "పరమే బ్రహ్మణికో–పి న సక్తః" అను వాక్యముచే పౌరుషము నొంది మనము "పరమే బ్రహ్మణి అహమాసక్తః" అను సమాధానమొసంగి, మన సర్వస్వమును పరబ్రహ్మమునకు సమర్పించి మన జీవిత సమస్యలనన్నింటిని పోగొట్టుకొని, పూర్ణానంద సాగరమునందు లయించెదము గాక! ఈ పూర్ణానంద సాగరమునందు 14 లోకములలోని సుఖములన్నియును ఇమిడియున్నవను విషయమును మరువకుందుము గాక!

## 15. విద్య - అవిద్య

విద్య అంటే జ్ఞానము– అవిద్య అంటే అజ్ఞానమని అర్థము. విద్య అంటే తెలియుట– అవిద్య అంటే తెలియకుండుట అని అర్థము. ఏదైన విషయము మనకు తెలియకున్నచో, ఆ విషయములో మనము అజ్ఞానులమగుదుము. ఒక పసిబిడ్డకు తన తల్లి ఒడి తప్ప మరేమియు తెలియకుండును. కాని ఆ పసిబిడ్డ అజ్ఞానియని చెప్పుటకు వీలులేదు. కారణమేమి? ఆ పసిబిడ్డకు ప్రాపంచిక విషయములను. ప్రపంచములోని ప్రతి పదార్థమును తెలిసికొను ఆకాంక్ష కలదు. కావుననే ఆ పసిబిడ్డ ఇటునటు పరుగెత్తుచుండును. ప్రతి పదార్థమును పరీక్షించుచుండును. అదే విధముగా మనము యువకులమైన తర్వాత కూడా ప్రతి వస్తువును పరీక్షించుచుండవలయును. ఆ వస్తువులన్నింటిలో "నేను" అను వస్తువు ప్రధానమైనది. అస్తిత్వము కలదేదియైనను

"వస్తువ"ని చెప్పబడును. నాకు అస్తికత్వమున్నది. అనగా:- ఉనికియున్నది. ఈ ఉనికి, లేక అస్తిత్వము ఎచ్చటున్నది? మనము ఏ ఏ స్థలములకు వెళ్ళుచుందుమో, ఆయాస్థలములలో మనకు అస్తిత్వమున్నది. ఒక ఎడ్లబండికి అస్తిత్వమున్నది. కాని అది ఎచ్చటికి వెళ్ళజాలదు. అది మరియొక చోటికి వెళ్ళుటకై ఎద్దులు అవసర మగును. ఐతే ఎద్దులకు ఏ మార్గము గుండా బండిని నడుపవలయునో తెలియదు. అందువల్ల ఆ ఎడ్ల బండిని నడుపుటకై ఒక మనుష్యుడు అవసరమగును. ఆ మనుజుడా ఎడ్ల బండిని తాను అనుకున్న స్థలమునకు తీసుకొని వెళ్ళజాలును. వ్యవసాయదారుడు ఎడ్ల బండిని పొలమునకు తీసుకొని వెళ్ళును. ధాన్యము సిద్ధమైనప్పుడా ధాన్యమును తన ఇంటికి చేర్చుటకై ఎడ్లబండిని ఉపయోగించును. ఐతే, మన దేహము కూడా ఒక ఎడ్లబండి వంటిదే! మనయందున్న జీవుడొక ఎద్దువంటివాడు. కారణమేమి? అజ్ఞానవశముచే ఈ జీవికి తన గమ్యస్థానము తెలియదు. మన జీవిత గమ్యస్థానమేదో తెలిపి, ఆ స్థలమునకు తీసుకొని వెళ్ళువాడే! గురువని చెప్పబడును. మన గమ్యస్థానమును చేర్చుటకీ దేహమొక సాధనము వంటిది.

ఆధునికయుగములో ముఖ్యముగా రెండురకములైన గురువులు కలరు. ఒకరు బాధగురువు; మరొకరు బోధగురువు. బాధగురువు అజ్ఞాని కోవకు చెందును. బోధగురువు జ్ఞాని కోవకు చెందును. స్వార్థమునకై తన శిష్యుని ఉపయోగించుకొనువాడు బాధగురువు; ఇక బోధగురువు తాను తరించినవాడై, తన శిష్యుని కూడా తరింపజేయును. బాధగురువు ప్రేయోమార్గమునకు చెందినవాడై యుండును. ఇక, బోధగురువు శ్రేయోమార్గమునకు చెందినవాడైయుండును. బాధగురువు ప్రాపంచిక సుఖములనాశించినవాడై అజ్ఞానమనెడి రోగముచే ఆవరింపబడియుండును. ఇక బోధగురువు ప్రాపంచిక సుఖములకతీతుడై శాశ్వతానంద ప్రాప్తి నాకాంక్షించినవాడై అజ్ఞానమనెడి రోగమునుండి విముక్తుడై యుండును. "అంధేనైవనీయమానా యథాంధాః" అనునట్లు బాధగురువు తన జీవితలక్ష్యమునొందు మార్గము నెఱుంగనివాడగుటచే తన శిష్యుని కూడా ఆజ్ఞానాంధకార కూపమునందు పడవేయును. నిజమునకీ ప్రపంచమంతయు అజ్ఞానాంధకార బంధురమై యున్నది. కావున జ్ఞానజ్యోతిని ఏ మూల యందైనను వెలిగించునట్టివాడే! బోధగురువని చెప్పబడును. బాధగురువు తన కెంతకెంతకు ప్రాపంచికైశ్వర్యము సమకూరుచుండునో అంతకంతకాతనికి ఆత్మ వికాసము కలుగుచున్నదని అజ్ఞానవశముచే అనుకొనుచుండును. కాని బోధగురువునకీ ప్రపంచమంతయు ఒక దీర్ఘస్వప్నముగా భాసించును. కావున ఈ స్వప్నమునుండి తాను మేల్కొన్నవాడై తన శిష్యుని కూడా

జ్ఞానామృతమనెడి ఔషధమునొసంగి మేల్కొలుపును. నేటి కాలములో విద్యావంతులమని చెప్పుకొనువారెవ్వరును నిజమునకు విద్యావంతులు కారు. కారణమేమి? వారు నేర్చుకొన్న విద్యచే ఈ స్వప్నప్రపంచమునుండి వారికి విముక్తి కలుగదు. ఈ స్వప్నప్రపంచమునుండి విముక్తినొందుట అవసరమా? అను ప్రశ్నకు సమాధాన మేమనగా:- ఈ స్వప్నప్రపంచము నుండి విడుదల నొందుటకు సహకరించునట్టి ఈ మానవదేహ సమన్వితమైన జన్మను పరమేశ్వరుడు మనకిచ్చియున్నాడు.

విద్య బోధగురువుకు సంబంధించినది. ఇక అవిద్య బాధగురువుకు సంబంధించినది. కావుననే "అవిద్యయా మృత్యుంతీర్త్వావిద్యాయా-మృతమశ్నుతే" యని శ్రుతి నుడువుచున్నది. అవిద్య మనలను మృత్యుముఖమునకు గొంపోవును. అదేవిధముగా బాధగురువు మనలను జననమరణచక్రమునందు పడవేయును. ఇక విద్యవల్ల అమృతము పొందబడును. కావున బోధగురువు తన జీవిత గమ్యస్థానము నెఱింగినవాడగుటచే, తన శిష్యుని కూడా అట్టి పరమగమ్యస్థానమును చేర్చును. ఇదియే! విద్య-అవిద్యల యొక్క రహస్యము. ఇదియే! బాధగురువు-బోధగురువుల యొక్క రహస్యము. అవిద్య శాశ్వత దుఃఖమునకు దారితీయును. ఇక విద్య పరమానందప్రాప్తికి దారితీయును. మనము ఎనుబదినాలుగు లక్షల యోనులలో సంచారము చేసిచేసి, ఇప్పుడీ మానవజన్మను ధరించితిమి. కావున జన్మ జన్మాంతరముల సంస్కారములచే మన అంతఃకరణము నిండియున్నది. బోధగురువీ సంస్కారములనన్నింటిని భస్మమొనర్చును. అవిద్యాగ్రంథి ఈ ప్రపంచమునందు జన్మించిన ప్రతిజీవియందుండును. జ్ఞానాంజన శలాక చే ఈ గ్రంథి విడదీయబడును. అప్పుడు మనకు జీవ-జగత్తుల రహస్యము తెలియబడును. జీవుడు అవిద్యాస్వరూపుడు. గురు దేవుడు విద్యాస్వరూపుడు. కావున విద్యాస్వరూపుడైన గురుదేవుడే! ఈ అవిద్యాగ్రంథిని తొలగింపజాలును. "నేను దేహమును" అనుకొనుచున్నంత వరకు అజ్ఞానగ్రంథి తొలగిపోదు. గురుదేవుని ద్వారా "తత్త్వమసి" మహావాక్యమును శ్రవణమొనర్చి, "అహం బ్రహ్మోస్మి" యని సమాధానమొసంగిన శిష్యుడు ఆత్మజ్యోతిచే ప్రకాశించును. అట్టివాడు బ్రహ్మప్రకాశముచే శోభించును. అట్టివాడు ఆనందసాగరము నందోలలాడును. కావున మనమందఱమున్నూ బాధగురువులను దరిజేరక, కోటిసూర్యసమప్రభుడైన బోధగురువును దరిజేరి, అట్టివానికి తన సర్వస్వము నర్పించినప్పుడు మనమా సర్వేశ్వరునియందైక్యమై, మన జీవితగమ్యస్థానమునొంది, శాశ్వతమైన ఆనందసాగరమునందు ప్రవేశించి, జననమరణ చక్రమునుండి విడివడజాలుదుము.

# 16. మన కోరికలన్నియును తీఱునదెప్పుడు?

ఈ ప్రపంచమునందున్న ప్రతిప్రాణియును ఏదో ఒక కోరికను కలిగియుండును. కోరికల యొక్క పుట్టయే! మనస్సు. మనస్సులేని మానవుడు లేడు. కావున రూపముదాల్చిన కోరికలే మానవుడు. ప్రతి మనుజునికి ఆహారమవసరము. ఆహారమును సంపాదించుటకై ధనము అవసరము. ధనమును సంపాదించుటకై కర్మ చేయుట అవసరము. ఐతే ఎంత కర్మచేసినను మనవాంఛలన్నియును నెఱవేరవు. వాంఛలన్నింటిని నెఱవేర్చుకొనుటకై ఈ జీవితము చాలదు. అందువల్ల శేషించిన వాంఛలను తీర్చుకొనులకై మరల మరల మనము జన్మనెత్తవలసి వచ్చుచున్నది. కోరికలకు అంతము లేదు. అందువల్ల జనన-మరణములకు కూడా అంతములేదు. ప్రతిప్రాణికి మరణమంటే భయము. తన కోరికలన్నియును తీరకపోవుటయే! దీనికి గల కారణము ఐతే మన కోరికలన్నియును తీరునదెప్పుడు? శాశ్వతానందము లభించినప్పుడు మన కోరికలన్నియును తీరిపోవును. ఐతే శాశ్వతానందమెప్పుడు లభించును? శాశ్వతముగా ఉనికి కలిగినవానినుండి మనకు శాశ్వతానందము లభించును. శాశ్వతముగా నుండువాడెవ్వడు? అతడే! పరమేశ్వరుడు. పరమేశ్వరుని శరణు పొందినప్పుడు మనకు శాశ్వతానందము లభించును. ఐతే మనము పరమేశ్వరుని శరణు పొందునప్పుడా పరమేశ్వరుడు తన ఆనందమును మనకిచ్చినచో ఆతని ఆనందము తగ్గిపోవును కదా! అను అనుమానము మనకు కలుగక తప్పదు. ఈ సమస్య తీఱుటకై మనమా పరమాత్మని యందైక్యము కావలసియుండును. నదులన్నియును సముద్రమును చేరినప్పుడవి సముద్రస్వరూపమును దాల్చును. సముద్రము నదిలో ప్రవేశించుట అసంభవము. కావున నదియే! సముద్రమునందు ప్రవేశింపవలసియుండును. అదే విధముగా పరమేశ్వరుడు జీవుడగుట అసంభవము. కావున జీవుడే! పరమేశ్వరునియందు ప్రవేశింపవలయును. ఇందు నిమిత్తమై జీవుడు తన తల్లి గర్భము నుండి బయల్వెడలినదాదిగా అనుదినము, క్షణక్షణము ప్రయత్నము, కృషి, సాధనను అఖండముగాను, నిర్విరామముగను సలుపవలసియుండును. పట్టుదల, శ్రద్ధ, విశ్వాసములచే సాధింపజాలని కార్యము లేదు.

నది సముద్రమునందు ప్రవేశించునప్పుడది తన అహంకారమును నశింపజేసి కొనును. నేను, నాది అను సంబంధమును పోగొట్టుకొనును. ఉదాహరణమునకు గంగానది గోగర్భమునందు జన్మించును. తర్వాత గంగోత్రి, ఉత్తరకాశి, ఋషీకేశ్,

హరిద్వార్, అలహాబాద్, వారణాసి, ప్రయాగమున్నగు ప్రాంతములలో ప్రయాణము చేసి చేసి, తుట్టతుదకు కలకత్తాలోని గంగా సాగరమును చేఱుకొనును. అప్పుడది తన స్వరూపమును పోగొట్టుకొని సాగరమే!యగును. ఈ విధముగా అది అద్వైతసిద్ధిని పొందును. మనము ఒక పైసా భాగము మనస్సును భగవంతునికిచ్చినచో, ఒక పైసా భాగము దైవానుగ్రహము మనకు లభించును. ఒక పావలా భాగము మనస్సు నర్పించినచో, భగవంతుడు మనకు ఒక పావలా భాగము అనుగ్రహమును ప్రసాదించును. అర్ధ భాగము మనస్సునిచ్చినచో, అర్ధ భాగము దైవానుగ్రహము మనము పొందుదుము. ముక్కాలు భాగము మనస్సునర్పింతుమేని, ముక్కాలు భాగము దైవానుగ్రహము మనకు లభ్యమగును. ఇక ఒక రూపాయి మనస్సును పూర్తిగా భగవంతునికర్పించినచో, పూర్తి దైవానుగ్రహము మనకు ప్రసాదింపబడును. ఇది దైవనియతి. ఇక ఈలోకమునందున్నూ మనము మన ఐశ్వర్యమును ఎంత భాగము ఇతరులకొసంగుదుమో, అంత భాగము మనకు సుఖము కలుగును. ఎన్ని కష్టములను ఇతరులకు మనమొసంగుదుమో, అన్ని కష్టములు మనకు ఏదో ఒక కాలమునందు, ఏదో ఒక స్థలమునందు, ఏదో ఒక సందర్భమునందు కలుగక మానవు. కారణమేమి? ఈ ప్రపంచములో ఇతరులనువారే లేరు. "అంతా రామమయం ఈ జగమంతా రామమయం" శ్రీరాముడు లేని స్థలమే లేదు. శ్రీకృష్ణుడు లేని స్థలమే లేదు. శ్రీ శివుడు లేని స్థలమే లేదు. ఒకే భగవంతునికి మనము నానారకములగు రూపములను కల్పించుచుందుము. నానా రకములగు రూపములను కల్పించుచుందుము. నానా రకములగు నామములను కల్పించుచుందుము. ఈ జగత్తులోని ప్రతి ప్రాణియందును పరమేశ్వరుడు నిండి నిబిడీకృతుడై యున్నాడు. కావున చీమయందును, దోమయందును– కుక్కలోను, నక్కలోను, అశ్వమునందును– విశ్వమునందును ఏకైక పరమేశ్వరుని దర్శించుచు, ఎట్టి ప్రాణినైనను హింసించుటను మానుకొనవలయును. అప్పుడు మనకు మనోవికాసముతో పాటు ఆత్మ వికాసము కలుగును.

ఇక మన కోరికలన్నియును ఎప్పుడు నెఱవేరును? అను ప్రశ్నకు సమాధానమేమి? దేనిని పొందినచో ఇక కోరుకొనవలసినదేమియు మిగిలియుండదో, దానిని పొందినప్పుడు మన కోరికలన్నియును నెఱవేరును. ఈ ప్రపంచమంతటికి మనము చక్రవర్తియైనప్పటికిన్నీ మన కోరికలు పూర్తికావు. స్వర్గలోకసుఖములు మిగిలి యుండుటయే! దీనికి కారణము. ఇక, స్వర్గలోకమునకధిపతియైన దేవేంద్రపదవిని మనమధిష్ఠించినను, మన కోరికలు పూర్తికావు. కారణమేమి? 14

లోకములలో 2 లోకముల సుఖములను మాత్రము మనము పొందగలిగితిమి. ఇంకను 12 లోకముల సుఖములు శేషించియున్నవి కదా! అందువల్ల కోరికలకు అంతము లేదు. ఈ కోరికలు అన్నియు అంతమొందుటకై మనము అహర్నిశము కర్మలను చేయుచు, వాటి ఫలితములను భగవంతునికర్పించినచో మనము కర్మబంధము నుండి విముక్తులమగుదుము. అప్పుడు మనము దేవుని బిడ్డలగుదుము. అహంకార రాహిత్యము చేత మాత్రమే! మనము దేవుని బిడ్డలమగుటకవకాశమున్నది. మనము నిజముగా దేవుని బిడ్డలమైనప్పుడు దేవుడు వేరు, నేను వేరు అను భావము నశించును. అప్పుడు "అహం బ్రహ్మాస్మి"యను మహావాక్యము అనుభూతమగును. దేవునికి–జీవునికి మధ్యగల దూరము అదృశ్యమగును. ప్రారబ్ధకర్మ నశించును. సంచితకర్మ భస్మమగును. ఆగామి కర్మకు అవకాశముండదు. కారణమేమి? మనము పూర్ణకాములమగుటయే! దీనికి గల కారణము. కేరికలే లేనప్పుడు మనము చేయవలసినదేమియు మిగిలియుండదు. ఐతే, ఈ భూమికను చేరుకొనుటకై భూలోకసుఖములను త్యజింపవలసియుండును. స్వర్గలోక సుఖములను త్యజింపవలసియుండును. 14 లోకములలోని సుఖములను త్యజింపవలసియుండును. తత్ఫలితముగా శాశ్వతానందము, పూర్ణానందము, నిత్యానందము, భూమానందము, బ్రహ్మానందము ప్రాప్తించును. బ్రహ్మానందము నందు 14 లోకములలోని ఆనందము కంటె మించిన ఆనందముండును. ఇదియే! మోక్షమని చెప్పబడును. "సర్వదుఃఖనివృత్తి–పరమానందప్రాప్తియే మోక్షము. ఇట్టి అక్షయ సుఖము నొసంగునట్టి మోక్షమునొందుటకై మనము నిశ్శేషవాంఛారహితులమగుదుము గాక! అహంకార సమన్వితుడైన జీవుడనెడి కుండ పగిలిపోయినప్పుడు అనంతానంద సాగర సౌఖ్యము మనకు లభ్యమగును.

# 17. ఏకము సత్యమా? లేక, అనేకము సత్యమా?

"ఏకం సత్ విప్రా బహుధా వదంతి" యని శ్రుతి నుడువుచున్నది. అనగా:- సత్యము ఒక్కటే! దానినే సాధకులు, ముముక్షువులు, జిజ్ఞాసువులు అనేక రకములుగా పేర్కొనుచున్నారు. అది ఎట్లనగా:- సూర్యుడు ఒక్కడేయైనను, సూర్యకిరణములు అనేకములు కదా! సముద్రము ఒక్కటేయైనను అలలు అనేకములు కదా! శరీరము ఒక్కటేయైనను శరీరములోని కాళ్ళు-చేతులు-చెవులు-కళ్ళు మున్నగునవి అనేకములు కదా! భూదేవి ఒక్కటేయైనను ఆసియా, యూరపు, అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, అంటార్కిటికా యను ఖండములు అనేకములు కదా! విశ్వము ఒక్కటేయైనను భూలోకము, భువర్లోకము, సువర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము ఇత్యాది లోకములు అనేకములు కదా! ఐతే, ఈ విభిన్నమైన వాటన్నింటికి మూలాధారము ఏకమేనైయున్నది. కావున ఏకమే సత్యమైయున్నది. అనేకము సత్యము కాదు. సూర్యుడు లేకున్నచో కిరణములుండవు. కావున సూర్యుడే! సత్యము. సముద్రము లేకున్నచో అలలకు ఆస్కారము లేదు. కావున సముద్రమే! సత్యము. శరీరము లేకున్నచో అవయవములు లేవు. కావున శరీరమే! సత్యము. ఇంకను లోతుగా ఆలోచించినచో ఆత్మ లేకున్నచో శరీరములేదు. కావున ఆత్మయే! సత్యము. శరీరముగాని, అవయవములుగాని సత్యము కావు. భూదేవి లేకున్నచో ఆసియా ఇత్యాది ఖండములు లేవు. కావున భూదేవియే! సత్యము. విశ్వము లేకున్నచో 14 లోకములు లేవు. కావున విశ్వమే! సత్యము. ఇంకను లోతుగా విచారించినచో, ఈ విశ్వమంతటికి ఆధారమైయున్న విశ్వేశ్వరుడే! సత్యము. ఈ విశ్వముగాని, ఈ విశ్వములోని 14 లోకములుగాని సత్యము కావు. ఈ విశ్వము విశ్వేశ్వరునికి ఒక స్వప్నము వంటిది. మనము నిద్రించినప్పుడు స్వప్నమునెట్లు చూచెదమో, మేలుకొన్న తర్వాత స్వప్నమెట్లు అదృశ్యమగునో, అట్లే మనుజుడు ఆత్మ సాక్షాత్కారమును, లేక బ్రహ్మసాక్షాత్కారము నొందినప్పుడు ఈ జగత్ స్వప్నమాతనికి అదృశ్యమగును.

ఏకమునుండి అనేకము ఉత్పన్నమగును. ఒకే తల్లి నుండి అనేక మంది పిల్లలు ఉత్పన్నమగుదురు. అదే విధముగా ఒకే ప్రకృతి మాత నుండి ఈ విశ్వములోని సకల చరాచర జీవులు ఉత్పన్నమగుచున్నారు. ఒకే విద్యుచ్ఛక్తి నుండి మనము

బల్బును వెలిగింపగలుగుదుము; ఫ్యాన్‌ను త్రిప్పగలుగుదుము; ఇంటిలోని వంటకములను తయారుచేయగలుగుదుము. దూది ఒక్కటేయైనను దూదిచే తయారుచేయబడిన ధోవతులు, చీరెలు, లుంగీలు, పైజామాలు అనేకములు. మట్టి ఒక్కటే యైనను మట్టితో చేయబడిన కుండలు, కూజాలు, మూకుళ్ళు అనేకములు. బంగారము ఒక్కటేయైనను బంగారముతో చేయబడిన ఆభరణములు అనేకములు. ఇనుము ఒక్కటేయైనను ఇనుముతో చేయబడిన పనిముట్లు అనేకములు. కావున ఏకమే సత్యము. అనేకము అసత్యము. ఈ విశ్వములోని వృక్షములు, జంతువులు, నదులు, సముద్రములు, పర్వతములు, సూర్య చంద్రులు, నక్షత్రములు ఇత్యాదులన్నియును సృష్టింపబడుటకు కారణము ఆ విశ్వేశ్వరుడే! కావున ఏకము నుండి అనేకము సృష్టింపబడినవి. అనేకమును ఆధారముగా గొని మనమా ఏకైక వస్తువును చేఱుకొనవలసియున్నది. ఏకము తెలియబడినప్పుడు అనేకము అప్రయత్నముగా తెలియబడును. "నేను మేను" అనుకొన్నప్పుడు మనలోని శక్తి క్షీణించును. కారణమేమి? "మేను" (దేహము) నాశవంతమైనది. "నేను" (ఆత్మ) అవినాశి. కావున నేను– మేను కాను. ఆత్మ అన్నింటిని ఆకళించుకొనును. కావున ఆత్మబలమే! గొప్ప జ్ఞానము ఆత్మ బలమునందన్ని బలములు ఇమిడి యుండును. ఆత్మశక్తి యందన్ని శక్తులు ఇమిడియుండును. ఆత్మ జ్ఞానము నందన్ని జ్ఞానములు ఇమిడియుండును. దేహబలము కలవాడు ఆత్మ బలము కలవానిచే ఓడిపోవును. ఇతర శక్తులన్నియును ఆత్మ శక్తిచే ఓడిపోవును. ఇతర జ్ఞానములన్నియును ఆత్మ జ్ఞానము కలవానికి లొంగిపోవును.

నేటి కాలములో ఏ ఖండమునందున్నవాడైనను, మరియొక ఖండమునందున్న వ్యక్తితో మాట్లాడగలుగుచున్నాడు. అంతే కాదు– ఏ భూభాగమునందున్న వ్యక్తియైనను, మరియొక భూభాగమునందున్న వ్యక్తిని దర్శింపగలుగుచున్నాడు. దీనిని బట్టి ఈ విశ్వమంతయునుఏకైక శక్తిచే చలాయమానమగుచున్నదని తెలియుచున్నది. కాని "నేను వేఱు–నీవు వేఱు" అనుకొన్నప్పుడే! కష్ట పరంపరలు ఉత్పన్నమగును. నదులన్నియును సాగరమును చేఱుకొనుటకై అహర్నిశము పరుగెత్తుచున్నవి. అదే ప్రకారముగా ఈప్రపంచములోని ప్రాణులన్నియును అప్రయత్నముగా పరమాత్ముని వైపు పరుగెత్తుచున్నవి. ఒక నది మరియొక నదితో జగడమాడినను, తుదకు ఆ రెండు నదులున్నూ సాగరమును చేఱుకొనక తప్పదు. అదే విధముగా ఒక వ్యక్తి మఱొక వ్యక్తితో జగడమాడినను, తుట్టతుదకు ఈ ఇరువురు వ్యక్తులున్నూ అవ్యక్తమును

చేటుకొనక తప్పదు. కావున ఏకమే! సత్యము. అనేకము అసత్యము. మన దేహములోని ఒక అవయవము మఱొక అవయవముతో జగడమాడినను, ఈ అవయవములన్నిటికి మూలాధారమైయున్న ప్రాణము పైకి లేచినప్పుడు, ఈ అవయవములన్నియును శవరూపమును ధరింపక తప్పదు. కావున ఏకమే! సత్యము. అనేకము అసత్యము. ఒక దేశము మఱొక దేశముతో పోరాడినను, ఈ దేశములన్నింటికి మూలమైయున్న భూదేవి కంపించినప్పుడు దేశములన్నియును పతనముకాక తప్పదు. అందువల్ల ఏకమే! సత్యము. అనేకమేఅసత్యము. దేవతలు, రాక్షసులు పరస్పరము పోరాడినను– ఈ యుభయులకు ఆధారమైనయున్న పరాశక్తి విజృంభించినప్పుడు దేవ–దానవులందఱును ఆ పరాశక్తిని శరణు వేడక తప్పదు. అందువల్ల ఏకమే! సత్యము. అనేకము అసత్యము. ఏకమే సత్యము– ఏకమే చైతన్యము. ఏకమే ఆనందము. అనేకమే అసత్యము– అనేకమే జడము, అనేకమే దుఃఖము,లేక నిరానందమని గుర్తెఱింగినవారమై మనమందఱమున్నూ ఈ ఏకైక పరమాత్మ పథముననుసరించి జీవితలక్ష్యమైన మోక్షలక్ష్మిని వరించి, తరించెదముగాక!

## 18. ఆత్మకథ

ఆత్మకథ అంటే నీ కథ కాదు, నా కథ కాదు. ఆత్మకథ అంటే అతని కథ కాదు, ఇతని కథ కాదు. ఆత్మకథ అంటే ఆమె కథ కాదు, ఈమె కథ కాదు. ఆత్మకథ అంటే దాని కథ కాదు, దీని కథయు కాదు. ఐతే, ఆత్మకథ అంటే ఎవరి కథ? ఇది అందఱి కథ. ఇది అందఱి వ్యక్తుల కథ. ఇది అన్ని వస్తువుల కథ. అందువల్ల ఆత్మకథను అందఱు వ్యక్తులు, అన్ని వస్తువులు వ్రాయవలసియుండును. కాని అది సాధ్యమగు కార్యము కాదు. కేవలము ఒక వ్యక్తియున్నూ వ్రాయుటకు సాధ్యము కాదు. ఐనను, ఈ సమస్య తీరుటకు ఒక యుక్తియున్నది. సూర్యుని కిరణము తెలియబడినప్పుడు సూర్యుడు తెలియబడును. సముద్రములోని బిందువు తెలియబడినప్పుడు సముద్రమంతయు తెలియబడును. అదే ప్రకారముగా ఒక వ్యక్తి తెలియబడినప్పుడు అందఱు వ్యక్తులు తెలియబడుదురు. ఒక వస్తువు తెలియబడినప్పుడు అన్ని వస్తువులు తెలియబడును. అది ఎట్లు? మట్టి తెలియబడినప్పుడు మట్టితో చేయబడిన కుండలు, కూజాలు, మూకుళ్ళు అన్నియు తెలియబడును. ఇనుము తెలియబడినప్పుడు ఇనుముతో చేయబడిన కత్తి, కత్తెర, గడపార మున్నగునవన్నియును తెలియబడును. దూది తెలియబడినప్పుడు దూదిచే నేయబడిన ధోవతి, చీర, రుమాలు

మొదలగునవన్నియును తెలియబడును. బంగారము తెలియబడినప్పుడు బంగారముతో చేయబడిన ముక్కుపోగు, చెవిపోగు, గొలుసు మున్నగునవన్నియును తెలియబడును. ఒక వ్యక్తి అయితేనేమి? ఒక వస్తువైతేనేమి? ప్రపంచములోని ఏ పదార్థమైనను కేవలము పంచభూతములచే నిర్మింపబడినవి. అవియే! పృథ్వ్యప్తేజోవాయురా కాశములు. ప్రపంచమంతయు పంచభూతములచే నిర్మింపబడినది. పదునాలుగు లోకములున్నూ ఈ పంచభూతములచే నిర్మింపబడినవి. ఐతే, ఈ నిర్మాణములో కేవలము స్థూల-సూక్ష్మ భేదములుండును. ఈ పంచభూతములకు మూలకారణము పరమాత్మ. ఆత్మ-పరమాత్మలకు భేదము లేదు. *జీవునియందున్న దేవుడు ఆత్మయనబడును. ప్రపంచమునందున్న దేవుడు పరమాత్మ యనబడును.* మాతృగర్భమునందున్న పిండమునందున్నూ, శిశువునందును, బాలునియందును, యువకునియందును, వృద్ధునియందును ఒకే ఆత్మ ప్రకాశించుచున్నది. శరీరమునకు వృద్ధి-క్షయములుండును. ఆత్మకు వృద్ధిక్షయము లుండవు. మనస్సు అటునిటు పరుగెత్తుచుండును. ఆత్మ నిశ్చలమైయుండును.

మన దేహములోని నేత్రములు ఆత్మశక్తిచేతనే చూడగలుగుచున్నవి. మన దేహములోని చెవులు ఆత్మశక్తి చేతనే వినగలుగుచున్నవి. మనదేహములోని నాలుక ఆత్మశక్తి చేతనే రుచిచూడగలుగుచున్నది. మన దేహములోని నాసిక ఆత్మశక్తి చేతనే వాసన చూడగలుగుచున్నది. మన దేహములోని చర్మము ఆత్మశక్తి చేతనే స్పర్శింపగలుగు చున్నది. ఈ కారణముచే మన దేహమునందు ఆత్మశక్తికి వినా మరియొక శక్తి లేదు. అందువల్ల "ఆత్మై వేదం సర్వమ్" అని ఉపనిషత్తు నుడువుచున్నది. ఇది యంతయు ఆత్మయే! యని దీని భావము. కేవలము మన దేహమే యననేల? ఈ విశ్వములోని కార్యములన్నియును ఆత్మశక్తి చేతనే నిర్వహింపబడుచున్నవి. భూలోకమే యననేల? స్వర్గలోకములోని కార్యములన్నియును ఆత్మశక్తిచేతనే సంభవించుచున్నవి. స్వర్గలోకమే యననేల? పాతాళలోకములోని కార్యములన్నియును ఆత్మశక్తి చేతనే కొనసాగుచున్నవి. కేవలము ఈ మూడు లోకములే! యననేల? పదునాలుగు లోకములలోని కార్యము లన్నియును ఈ యాత్మశక్తి చేతనే నిర్వహింపబడుచున్నవి. ఆత్మయే! సమస్త కర్మలకు కార్యనిర్వహణాధికారి. మనము నిద్రించినప్పుడు స్వప్నములను దర్శించుచుందుము. ఈ స్వప్నదర్శనము కూడా ఆత్మశక్తి చేతనే కలుగుచున్నది. మనము గాఢనిద్ర (సుషుప్తి) యందున్నప్పుడు ఆత్మశక్తి మనయందు నిహితమైయుండును. అట్లు కాదేని మనకు మరల మరల మెలకువ వచ్చునా? ఈ

కారణముచే జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థలన్నియును ఆత్మశక్తిచేతనే సంభవించుచున్నవి. అదే ప్రకారముగా ఈ విశ్వము యొక్క సృష్టి-స్థితి-లయములన్నియును ఆత్మశక్తి చేతనే జరుగుచున్నవి. సృష్టిరూపమునందున్న ఆత్మశక్తి "బ్రహ్మ"యని చెప్పబడును. స్థితిరూపమునందున్న ఆత్మశక్తి "విష్ణువ"ని చెప్పబడును. లయరూపమునందున్న ఆత్మశక్తి "శివుడ"ని చెప్పబడును. ఈ శక్తులు వరుసగా "సరస్వతి-లక్ష్మి-దుర్గ అనియున్నూ చెప్పబడును. సరస్వతీదేవి జ్ఞానమునొసంగును. లక్ష్మీదేవి ఐశ్వర్యమునొసంగును. దుర్గాదేవి దుర్గుణములను నశింపజేయును. ఆత్మ జ్ఞానముద్వారా మనలోని దుర్గుణములు నశించినప్పుడు మనకు మోక్షసామ్రాజ్యలక్ష్మి లభించును. దీనిచే మానవజన్మ సార్థకమగు ననుట నిస్సంశయము.

ఆత్మకథ అనంతము. అనగా:- దానిని వ్రాయుటకు ఎవరున్నూ సమర్థులు కారు. ఆత్మకథ అనాది. అందువల్ల ఆదిని-అంతమును కలిగియున్న మనము దానిని వ్రాయజాలము. ఆత్మకథ సత్యమైనది. కావున అసత్యమైన మనము దానిని వ్రాయజాలము. ఆత్మకథ జ్ఞానస్వరూపము. కావున అజ్ఞానులమైయున్న మనము దానిని గూర్చి వ్రాయజాలము. ఆత్మకథ ఆనంద ప్రపూర్ణము. కావున సుఖ-దుఃఖ మిశ్రితములగు జీవితములను గడుపుచున్న మనము ఆత్మకథను వ్రాయజాలము. ఆత్మకథ "అహం బ్రహ్మాస్మి"యను ఢంకాను మ్రోగించును. కావున అహంకారయుక్తులమై యున్న మనము ఆత్మకథను వ్రాయజాలము. ఆత్మకథ "అయమాత్మాబ్రహ్మా" అను వేదాంతభేరిని మ్రోగించును. కావున ఆత్మతత్త్వము తెలియని మనము ఆత్మకథను వ్రాయజాలము. ఆత్మకథ "తత్త్వమసి" అను మహావాక్యమును తెలుపును. కావున "తత్" పదమును గూర్చిన అవగాహన లేని మనము ఆత్మకథను వ్రాయజాలము. ఆత్మకథ "ప్రజ్ఞానం బ్రహ్మ" యను మహావాక్యమును ప్రబోధించును. కావున అజ్ఞానాంధకారమునందున్న మనము ఆత్మకథను వ్రాయజాలము. ఈ ఆత్మకథ అద్వైతమును సూచించును. అనగా:- రెండవవస్తువు లేనిదే! ఆత్మ. రెండవవస్తువున్నప్పుడు ఇప్పుడు కాకున్నను, ఎప్పుడైనను దానిచే మనము భయకంపితులము కావలసియుండును. రెండవవస్తు దర్శనముచే మనలను అజ్ఞానము ఆవరించును. అద్వైతము-అమరత్వము ఈ రెండున్నూ పర్యాయ పదములు. కావుననే శ్రీమద్భగవద్గీతలోని ధ్యానశ్లోకములో "అద్వైతామృత వర్షిణీమ్" అని చెప్పబడినది. అనగా:- భగవద్గీత అద్వైతామృతమును వర్షింపజేయును. దీనిచే భవరోగము నశించును. అనగా:- జనన-మరణములతో కూడిన సంసారము నశించును.

అద్వైతామృతముచే ఆత్మజ్ఞానము కలుగును. ఆత్మజ్ఞానముచే ఆత్మసాక్షాత్కారము కలుగును. ఆత్మసాక్షాత్కారముచే ఆత్మానందము పొందబడును. ఇదియే! మానవజీవితము యొక్క పరమలక్ష్యము. ఈ లక్ష్యమును సాధింపని, లేక సాధించుటకు ప్రయత్నింపని మానవజన్మ వ్యర్థము. ఈ లక్ష్యమును సాధించిన, లేక సాధించుటకు ప్రయత్నించిన మానవజన్మ అర్థవంతమై శోభించును. ఇదియే! ఆత్మకథ. ఇది మనందఱి కథ. కథ కల్ల. అనగా:– మనము అబద్ధము; ఆత్మ నిజము. ఆత్మయే! మన నిజమైన అస్తిత్వము. మనమందఱమున్నూ ఆత్మసంపన్నులమై పూర్ణసంతుష్టులమై ప్రకాశింతుము గాక!

## 19. తిరుగు ప్రయాణము

మనమందఱమున్నూ మన నిజమైన గృహమును వదలిపెట్టి ప్రస్తుతము ఈ లోకమునందు పరిభ్రమించుచున్నాము. ఈ లోకమునందు మనకు నిజమైన గృహము లేకుండుటచే నిరంతరము అశాంతి, దుఃఖము, చింత ఇత్యాది జీవిత సమస్యలకు గుఱియగుచున్నాము. కేవలము ఈ లోకమే యననేల? పదునాలుగు లోకములలో పరిభ్రమించినను, మనము మన నిజమైన గృహములోని సౌఖ్యము ననుభవింపజాలము. ఐతే మన నిజమైన గృహమేది? అను ప్రశ్న ఇచ్చట ఉదయించును. మనము తిరుగుప్రయాణ మొనర్చినప్పుడు మనము నిజమైన గృహమును చేరుకొనగలుగుదుము. తిరుగుప్రయాణమనగానే మరణమని అనుకొనరాదు. “సత్యము”నెడి మాతయొక్క మాటను విన్నప్పుడు మనము మన నిజమైన గృహమును చేఱుకొనజాలుదుము. “జ్ఞానము” అనెడి పిత(తండ్రి) యొక్క మాటను విన్నప్పుడు మనము మన నిజమైన గృహమును కనుగొనజాలుదుము. “క్షమ” (ఓర్పు)అనెడి పత్ని యొక్క సహకారమును పొందినప్పుడు మనము మన నిజమైన గృహము నందు ప్రవేశింపజాలుదుము. “దయ” యనెడి స్నేహితుని మాటను విన్నప్పుడు మనము మన నిజమైన గృహముయొక్క జాడను తెలిసికొనజాలుదుము. “శాంతి” యనెడి పుత్రిక యొక్క ఓదార్పును పొందినప్పుడు మనము మన నిజమైన గృహమునందు సుఖింపజాలుదుము. “ప్రేమ”యనెడి సోదరుని కలిగియున్నప్పుడు మనము మన నిజమైన గృహములోని ప్రేమను అనుభవింప జాలుదుము. పైన నుడువబడిన ఆరుగురు బంధువుల సంబంధ బాంధవ్యములచే మనకు మన నిజమైన గృహము తెలియబడును. ఐతే ఈ లోకములోని ఆరుగురు బంధువులు సత్యమైన,

శాశ్వతమైన బంధువులు కారు. కారణమేమి? ఈ లోకములోని బంధువులకు నామరూపములున్నవి. సత్య వస్తువునకు నామరూపములు లేవు. కావున అది శాశ్వతమైనది. జ్ఞానమునకు నామరూపములు లేవు. కావున అది శాశ్వతమైనది. క్షమకు నామములు లేవు. కావున అది శాశ్వతమైనది. శాంతికి నామరూపములు లేవు. కావున అది శాశ్వతమైనది. ప్రేమకు నామరూపములు లేవు. కావున అది శాశ్వతమైనది. దయకు నామ రూపములు లేవు. కావున అది శాశ్వతమైనది. పై ఆరుగురు బంధువులకు నామములున్నను, రూపములు లేవు. మనము మన నిజమైన గృహమును చేఱుకొనుటకు పైన నుడువబడినవి ఆరు మార్గములని చెప్పవచ్చును.

మనమీ ప్రపంచమునకు ఏ ఏ మార్గములలో ప్రయాణము చేసి వచ్చినామో, ఆయా మార్గముల గుండా తిరుగు ప్రయాణము చేసినప్పుడు మనము మన నిజమైన గృహమును చేఱుకొనజాలుదుము. మనము మన గృహము నుండి బయలుదేరి మన నేత్ర ద్వయముచే మనకు బాహ్యముగానున్న ప్రపంచమును దర్శించుచున్నాము. కావున మనమిప్పుడు బాహ్య ప్రపంచమునుండి బయలుదేరి తిరుగు ప్రయాణము చేయుచు హృదయగుహలో దాగుకొనియున్న మన నిజమైన గృహమును అన్వేషింపవలసి యున్నది. మనము మన శ్రోత్రద్వయముచే మనకు బాహ్యముగా నున్న ప్రపంచములోని ఇష్టానిష్ట ధ్వనులను శ్రవణము చేయుచున్నాము. ఇప్పుడు మనము తిరుగు ప్రయాణము చేయుచు మన నిజమైన గృహములో ప్రశాంతమైన ఆత్మ వీణా తంత్రీ నాదమును శ్రవణము చేయవలసియున్నది. మనము మన నాసికాపుట ద్వయముచే బాహ్య ప్రపంచములోని నానారకములగు వాసనలను అనుభవించుచున్నాము. ఇప్పుడు మనము తిరుగు ప్రయాణము చేయుచు ఈ వాసనలన్నింటిని నశింపజేసి, వాసనా రాహిత్యస్థితికి నిలయమైన మన నిజమైన గృహమును చేఱుకొనవలసియున్నది. మనము మన జిహ్వచే ఈ ప్రపంచములోని షడ్రుచులను చవి చూచుచున్నాము. ఇప్పుడు మనము తిరుగు ప్రయాణము చేయుచు "రసో వైసః" అనునట్లు మన హృదయాంతర్గతమైయున్న నిజమైన అమృతరసపానము నొనర్పవలసియున్నది మనము మన స్పర్శేంద్రియముచే ఈ ప్రాపంచిక పదార్థములను స్పర్శించుచున్నాము. ఇప్పుడు మనము తిరుగు ప్రయాణము చేయుచు భౌతికతకు వ్యతిరిక్తమైన స్పర్శానందము ననుభవింపవలసియున్నది. మనము మన మనస్సుచే గాలి మేడలను కట్టుచు, ఆ మేడలలో – మిద్దెలలో సుఖమున్నదని తలంచుచున్నాము. ఇప్పుడు మనము తిరుగు ప్రయాణము చేయుచు గాలి మేడలు స్వప్నములోని మేడలవంటివని గ్రహించి, మన నిజమైన గృహమగు భగవద్ధామమును చేరి

సుఖింపవలసియున్నది తిరుగు ప్రయాణమును ప్రపంచమునందు జన్మించిన ప్రతి ప్రాణియు చేయకతప్పదు. కాని ఆ తిరుగు ప్రయాణమునందు త్రోవ తప్పరాదు. సరియైన మార్గములో నడుచుటకై సత్యము, జ్ఞానము ఇత్యాది బంధువులతోపాటు ఆత్మబంధువైన గురుదేవుని ఆదేశము ననుసరించి జీవితమును పురోగమింపజేసికొనుట శ్రేయస్కరమగును.

భగవద్ధామమనగానే మరణమని భావించునట్టి మహానుభావులెందఱో కలరు. భగవద్ధామమే! మన నిజమైన గృహమైన కారణముచే అసలు విషయము తెలియకుండానే అప్రయత్నముగా మరణించిన వ్యక్తి భగవద్ధామము నొందినాడని మనము చెప్పుచుందుము. మహాత్ములు, మహాపురుషులు శరీరమును త్యజించినప్పుడు మనము ఆ వ్యక్తి మహాసమాధి చెందినాడని పలుకుచుందుము. మహాసమాధి మానసిక సుస్థిరతను సూచించును. మనస్సు పరమాత్ముని యందు లీనమగుటయే! మహాసమాధియని చెప్పబడును. ఒకవేళ జీవించియున్నప్పుడే ఒకవ్యక్తి యొక్క మనస్సు పరమాత్మయందు లీనమగునేని అది "జీవన్ముక్తి"ని సూచించును. మనమనస్సు కేవలము ప్రాపంచిక విషయములను గూర్చియే ఆలోచించుచుండును. ఈ ప్రపంచమొక జడపదార్థమగుటచే మనస్సు మోసపోవుట సంభవించి, మానసిక క్లేశములతో పాటు శారీరిక కష్టముల ననుభవింపవలసి వచ్చును. కావున మనమీ ప్రపంచము నుండి క్రమక్రమముగా తిరుగుప్రయాణము చేయుచు, ప్రపంచమునకు ప్రాణమైన పరమాత్ముని చేఱుకొనవలసియున్నది. తద్వారా పరమానందము ననుభవింపవలసి యున్నది. ఇదియే! మన జీవిత పరమలక్ష్యము. మన తిరుగు ప్రయాణము గంగా ప్రవాహమువలె అఖండముగా కొనసాగుచుండవలయును. గంగా ప్రవాహము ముగియునదెప్పుడు? సముద్రమును చేఱినప్పుడు. అదే ప్రకారముగా మన తిరుగు ప్రయాణము ముగియునదెప్పుడు? సచ్చిదానంద సాగరమును చేఱుకొన్నప్పుడు. ఈ సచ్చిదానంద సాగరమునందు ఆరుగురు బంధువుల సమ్మేళనముండును. సత్యము, జ్ఞానము, క్షమ, దయ, శాంతి, ప్రేమ అనునవే! ఈ ఆరుగురు బంధువులు. ఈ ఆరుగురు బంధువులు ఒకరి నుండి మఱొకరు విడిపోవువారు కారు. ఈ బంధువులలో వైరముగాని, విడాకులు గాని ఉండవు. ప్రతివారికి తిరుగు ప్రయాణము తప్పనిసరియైయున్నది. అటువంటప్పుడు చింతతో, దుఃఖముతో, ఏడుపు ముఖముతో పోనేల? నా నిజమైన గృహమును చేరుకొందుననెడి ఉత్సాహముతో, నగుమెగముతో, ఆహ్లాదకరముగా మనము తిరుగు ప్రయాణమును చేయవలయును. ఈ తిరుగు ప్రయాణము మనలను

సచ్చిదానంద సాగరమును చేర్చును. ఇది శాశ్వత శాంతిని, శాశ్వత సుఖమును, పరమానందమును మనకందించును. కావున తిరిగి మనము అనిత్యమైన, అసుఖమైన జగత్తునందు ప్రవేశించకుండా నుండుటకై శ్రీకృష్ణుడు మనలననుగ్రహించునుగాక!

## 20. ఉన్నదానికి లేమి లేదు- లేనిదానికి ఉనికి లేదు

పై శీర్షిక పాఠకులకు విడ్డూరముగా తోచవచ్చును. ఐతే లోతుగా విచారించినచో, దానిలోని అంతరార్థము మనకు అవగతమగును. కారణమేమనగా:- ఉన్నట్టిది ఎల్లప్పుడు ఉండును. అది మనము నశించినను, మన తాతముత్తాతలు నశించినను, సూర్యచంద్రాదులు అదృశ్యములైనను ఉండియే యుండును. అటువంటి పదార్థమేదో, మనము విచారింపవలసియున్నది. ఇక లేని దానికి ఉనికి యుండదు. అనగా:- రేపటి రోజుగాని, మరొక సంవత్సరమునకు గాని, నాలుగు యుగములు ముగిసినప్పుడు గాని తుట్టతుదకు మహాప్రళయము సంభవించినప్పుడు గాని దేనికి నామ-రూపములు నశించునో,అట్టి దాని అస్తిత్వమునకు ఉనికిలేదని అర్థము. దేనికి నామము మఱియు రూపమున్నదో, దానికి ఉనికియుండదు. అది ఇప్పుడైనను, ఎప్పుడైనను నశింపక తప్పదు. కావుననే! "యద్దృశ్యం తన్నశ్యం" అని చెప్పబడినది. కన్నులకు కానబడునవి, చెవులచే వినబడినవి, నాలుకచే రుచి చూడబడినవి, ముక్కుచే వాసన చూడబడునవి, మఱియు చర్మముచే స్పర్శింపబడునవన్నియును ఒకప్పుడు నశించి తీరును. ఏది దేశమునందున్నదో, ఏది కాలమునందున్నదో, అవి యన్నియును నశింపక తప్పదు. కారణమేమి? ఒక దేశమునందున్న పదార్థము మరియొక దేశమునందుండదు. ఒక కాలమునందున్న పదార్థము మరియొక కాలమునందుండదు. అందువల్ల దేశకాలములయందున్న పదార్థములు శాశ్వతములు కావు. కావున అవి శాశ్వత సుఖము నొసంగజాలవు. నాశములేని పదార్థముయొక్క స్వరూపమెట్టిదనగా:- అది శబ్ద-స్పర్శ-రూప-రస-గంధముల కతీతమైయుండును. అది దేశ-కాలముల కతీతమైయుండును. అది అమరము మఱియు శాశ్వతమైయుండును. అది అచలము మఱియు చైతన్యవంతమైయుండును; అది పరిపూర్ణము మఱియు పరమానంద ప్రదమైయుండును. అదియే! పరబ్రహ్మమని చెప్పబడును. శ్రీమద్భగద్గీతలోని రెండవ అధ్యాయములోని పదునారవ శ్లోకమునందు శ్రీకృష్ణభగవానుడిట్లు నుడివెను.

"నా సతో విద్యతేభావో నాభావోవిద్యతే సతః।
ఉభయోరపి దృష్టో-ంతస్త్వనయోస్తత్త్వదర్శిభిః॥ (భ.గీ. 2-16)

ఈ శ్లోకము యొక్క భావముపైన విశదీకరింపబడినది. ఐతే ఈ పరబ్రహ్మము రసవిహీనమైనదా? కాదు-కాదు. "రసోవైసః" ఈ పరబ్రహ్మము రస సంభరితమైయున్నది. అది సారవంతమైయున్నది. నిస్సారమైనది సంసారము (ప్రపంచము). పంచభూతములతో కూడినదే! ప్రపంచము. నిజమునకిది జడమైనది. ఈ పంచభూతములను ప్రచలితమొనర్చునట్టి పరాశక్తికి మూలమైనదే! పరబ్రహ్మము. పరబ్రహ్మము నిర్గుణమైనది. అనగా:- త్రిగుణములకతీతమైనది. అనగా:- మాయాతీతమైనది. త్రిగుణముల కలయికయే! మాయ. ఈ మాయ మాయాతీతుడైన పరబ్రహ్మముచే ప్రచలితమొనర్ప బడుచున్నది. ఈ సృష్టియంతయు పరమేశ్వరునికొక స్వప్నము వంటిది. మనమందరమున్నూ ఈ మహా స్వప్నములో భాగస్వాములమే! ఈ మహా స్వప్నమునుండి మేల్కొన్నప్పుడు మనకు నిజముగా ఉనికిని కలిగియున్న శాశ్వత వస్తువు తెలియబడును. ఇంత ఏల? "అదియే!" మనమనెడి అనుభూతి మనకు కలుగును. మన దేహము జడపదార్థము. ఈ దేహమునకు సంబంధించినవన్నియును జడపదార్థములే! చైతన్యశక్తిచే ఈ జడపదార్థములన్నియును చలింపజేయబడుచున్నవి. ఈ ప్రపంచములోని భోగభాగ్యములన్నియును, స్వర్గలోకములోని భోగభాగ్యములన్నియును, ఇంత ఏల? పదునాలుగు లోకములలోని భోగభాగ్యములన్నియును ఆ పరబ్రహ్మము నందిమిడియున్నవి. కారణమేమి? వీటికన్నింటికి మూలకారణమా పరబ్రహ్మమే కదా! అజ్ఞానాంధకార కారణముచే మనమీ విషయమును తెలిసికొనజాలకున్నాము. మన మెల్లప్పుడు స్వల్పమైన, అల్పమైన పదార్థములనే కోరుకొనుచుందుము. కాని శాశ్వత సుఖకందము, పూర్ణానందకందమైన దానిని కోరుకొను వాంఛ మనయందు పొడమదు. కారణమేమి? మన దేహము జడము మఱియు సంకుచితమైయున్నది. మన మనస్సు అరువు తెచ్చుకొన్న శక్తిచే చలించుచుండుటచే అదియున్నూ సంకుచితమై యున్నది. మన బుద్ధి శరీరమునకు మఱియు మనస్సుకు దాసియగుటచే అదియున్నూ సంకుచితమైయున్నది. మన కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు మఱియు మనస్సు ఇచ్చిన సందేశముల ప్రకారముగా మన బుద్ధి ఒక నిర్ణయమునకు వచ్చును. ఈ కారణముచే మన బుద్ధి కూడా సంకుచితమైనదే!యగును.

కావున అంతవంతములు మఱియు సంకుచితములైయున్న వాటన్నింటికి అతీతులమై అనంతమైన దానినాకాంక్షించుటయే! మన జీవిత లక్ష్యమైయుండ వలయును. అట్లు కాదేని ఒక నూతిలోని కప్ప సముద్రము యొక్క వైశాల్యమును తెలిసికొనజాలనట్లు మనమున్నూ ఆ పరబ్రహ్మానంద సాగరము యొక్క వైశాల్యమును తెలిసి కొనజాలకున్నాము. ఈ కారణముచే ఒక కప్ప ఒక గుంటలో నుండి చెఱువు లోనికి వెళ్ళినట్లు, మరల ఆ చెఱువు నుండి ఒక దిగుడు బావిలోనికి వెళ్ళినట్లు, అనంతరమా బావి నుండి ఒక ఈదుడు బావిలోనికి వెళ్ళినట్లు మనమున్నూ నానా విధములగు జన్మలనెత్తవలసి యుండును. అనేకరకములగు కడగండ్లకు, కష్ట పరంపరలకు గుఱికావలసియుండును. దీనికంతటికి కారణము మన యొక్క అవివేకమే! యని చెప్పవలసియున్నది. అందువల్ల మనము నిత్యానిత్య వస్తువివేకము కలవారమై అనిత్యవస్తువులను త్యజించి, నిత్యవస్తువు నాశ్రయింపవలసియున్నది. ఇహాముత్రఫలభోగవిరాగమును కలిగియున్నప్పుడు మనమీ జనన మరణముల నుండి, దుఃఖ పరంపరలనుండి తప్పుకొనజాలుదుము. ఇహలోక సుఖములను, పరలోక సుఖములను అనుభవించు కోరికను త్యజించుటయే! “ఇహాముత్ర ఫలభోగ విరాగమ”ని చెప్పబడును. ఇహలోకముగాని, పరలోకము గాని మనకు శాశ్వత మైన సుఖము నొసంగజాలవు. ఈ సుఖములచే మనము బంధింపబడినప్పుడు, బ్రహ్మానంద సుఖమెట్టిదో మనకు ఏ మాత్రము అవగతము కాకుండును. ఇహలోక సుఖముగాని, పరలోక సుఖముగాని స్వప్నావస్థలోని సుఖముల వంటివి. ఒకవేళ మనము స్వప్నములో చక్రవర్తియైనచో, మెలకువ రాగానే ఆ చక్రవర్తి పదవి అదృశ్యమగును. అప్పుడు మనము దుఃఖసాగరమునందు మునుగవలసియుండును. కావున ఈ సంసారమనెడి దుఃఖసాగరమును దాటుటకై అసత్పదార్థమును తృణీకరించి, సత్పదార్థము నాశ్రయింపవలయును. ఈ విషయమై గురుదేవులు మనకు సహకరించును. కావుననే! గురుమహిమ అపారమైనదని చెప్పబడినది. గురుదేవుడనెడి నావను ఆశ్రయించి, మనమందఱమున్నూ ఈ సంసారసాగరమును దాటి, బ్రహ్మానంద సాగరమునందోల లాడుదుము గాక!

# 21. కలికాల కల్మష కారణ నివారణము

ఈ ప్రపంచములోని సామాన్య మానవులైతేనేమి, అసామాన్య మానవులమైతే నేమి, మహాత్ములైతేనేమి, మహానుభావులైతేనేమి ఇంతో అంతో కలికాల కల్మషములను కలిగియుందురు. కలి అంటే కలహము. కలహములు కేవలము బహిరంగములై యుండక అంతరంగములు కూడానై యుండును. బహిరంగ కలహములకంటె అంతరంగిక కలహములు బలవత్తరములై యుండును. అదియే! కొంతకాలము తర్వాత బహిరంగ యుద్ధములుగా పరిణమించును. "ద్వితీయాద్వై భయం భవతి" అనగా:- రెండవ వస్తువు, రెండవ పురుషుడు, రెండవ స్త్రీ లేక రెండవ జంతువు, రెండవ కీటకము, రెండవ ప్రాణి మాత్రముచే భయము కలుగుచుండును. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" అనగా:- సత్య వస్తువు ఒక్కటే! దానినే అనేక మహానుభావులు అనేక విధములుగా చెప్పుచుందురు. "అద్వైత భావన"లో భయముండజాలదు. అద్వైత భావనలో పూర్ణత్వముండును. పూర్ణస్వాతంత్ర్యముండును. ఒక వ్యక్తి అద్వైతమును గూర్చి మహా మహోపన్యాసములనొనర్పవచ్చును. కాని ఆచరణయందాతడు ద్వైత భావమునే విస్తరింపజేయుచుండును. మఱొక వ్యక్తి "కాకవిష్ఠా సమంకీర్తిః" అనగా:- కీర్తి ప్రతిష్ఠలు కాకిరెట్ట వంటివని ప్రబోధించుచుండును. కాని అట్టివాడు కేవలము కీర్తి ప్రతిష్ఠల కొఱకే తన జీవితమును ధారపోయుచుండును. ఇంకొక వ్యక్తి ద్వేషాసూయలు పనికిరావని ప్రగల్భములను పలుకుచుండును. కాని ఆతని అంతరంగమునందు ద్వేషాసూయలు జాజ్వల్యమానములై ప్రజ్వరిల్లుచుండును. వేఱొకవ్యక్తి ఆడంబరములు ఆధ్యాత్మిక సాధకులకు పనికిరావని చెప్పుచుండును. కాని ఆతడు బాహ్యముగా నిరాడంబరుని వలె గోచరించినను, ఆంతరంగికముగా డాంబికాగ్రేసరుడై విరాజిల్లుచుండును. ఇంతకూ వీటన్నింటికి కారణము అహంకారమే! ఒక విధమగు అహంకారము పాతాళలోకమునందు పడవేయును. మఱొక విధమైన అహంకారము "అహం బ్రహ్మాస్మి" అనువాక్యము ననుభూతమొనరింపజేయును. ఒకవ్యక్తిలోని అహంకారము నిశ్శేషమైనప్పుడు మోక్షము లభించును. ప్రాపంచిక జీవితమునకు-ఆధ్యాత్మిక జీవనమునకు మధ్య"అహంకారము" అడ్డుగోడ వంటిది.

ఇక అహంకారము సర్వవ్యాపకమైనప్పుడు కూడా మోక్షము లభించును. కారణమేమి? అహంకారము నిశ్శేషమైనప్పుడు కేవలము పరబ్రహ్మము మాత్రమే! శేషించును. ఇదియే! మోక్షము. ఇక అహంకారము సర్వవ్యాపకమైనప్పుడు తానే

బ్రహ్మమగును ఇదియే!మోక్షము."నేనున్నాను-దేవుడుకూడా ఉన్నాడు" అనుకొన్న వానికి, లేక అన్నవానికి మోక్షము సున్నయగును. కాముడేలు హృదయములో రాముడులేడు. రాముడేలుహృదయములో కాముడులేడు. కావున ముందుగా మనము కామమును జయింపవలయును. కామము అంటే కోరిక. ఆధ్యాత్మిక సాధకునికి ఏలాటి ఇతర కోరికలు లేనప్పుడు తాను కోరిన ఏకైక వస్తువగు మోక్షము లభించును. "అక్కడఉండే పాండురంగడు ఇక్కడ ఉన్నాడు" అన్నట్లు అక్కడగాని, ఇక్కడగాని, ఎక్కడగాని ఆ సర్వేశ్వరుని దర్శించుచుండవలయును. ఇంద్రియవాంఛలు లేనివాడే! జితేంద్రియుడని చెప్పబడును.ద్వైతభావనకలవాడే! ప్రాపంచికుడు. అద్వైతభావన కలవాడే! మోక్షసామ్రాజ్య లక్ష్మిని వరింపగలుగును. "దేహ"భావన కలవాడు నానారకములగు దేహములను చూచుచుండును. "దేహి" భావన అనగా:- ఆత్మ భావన కలవాడు ఆత్మానందము నొందుచుండును. ఈ ప్రపంచమే! సత్యమనుకొనుటచే భ్రమ. కాని ఈ ప్రపంచమును సృష్టించిన బ్రహ్మయే! సత్యమనుకొనుటచే భ్రమ నివారింపబడును. "నేను" అనునది మూడు రకములుగా నుండును. మొదటి రకమైన నేను నిశ్శేషమైన "నేను". దీనిచే కలికాల కల్మషము నివారింపబడును. ఇక రెండవ రకమైన నేను సర్వవ్యాపకమైన "నేను". దీనిచేత కూడా కలికల్మషము నివారింపబడును. మూడవ రకమైన "నేను" మోసపూరితమై, సమస్యాగ్రస్తమై, దుఃఖదాయకమై, కష్టప్రదమై, క్లిష్టజీవితమున కాస్కారమగును. ఇది చాల అపాయకరమైనది. ఈ "నేను"చే కలికాల కల్మషము విస్తరిల్లుచుండును. ఇది వినాశకరమైన, విధ్వంసకరమైన "నేను" వ్యక్తిత్వమునందు స్వల్పాతి స్వల్పమైన శక్తియుండును. వ్యక్తులందఱు ఏకత్రితిమైనప్పుడు అవ్యక్తమైయున్న శక్తి వ్యక్తమగును. ఒకే ఒక దారమును త్రెంచి వేయుట సులభము. కాని వేయిదారములను పెనవేసినప్పుడది ఒక త్రాడుగా మారును. ఇట్టి త్రాటిచే ఏనుగు కూడా బంధింపబడును. ఈ త్రాటియందొక విశేష శక్తియుండును.

దారముగాని, త్రాడుగాని జడపదార్థములు. ఒక చైతన్యవంతుడైన మనుజునిచే దారములు పెనవేయబడును. అదే ప్రకారముగా సచ్చిదానంద స్వరూపుడైన పరమేశ్వరునిచే ఈ చిత్ర విచిత్రమైన ప్రపంచము సృష్టింపబడినది. కావున అస్తిత్వము, ఐశ్వర్యము, బలము, శక్తి, ఆనందములన్నియును పరమేశ్వరునియందున్నవి. కాని ప్రపంచమునందు లేవు. ప్రాపంచిక దృష్టిచే పరమాత్ముడు తెలియబడడు. కేవలము పారమార్థిక దృష్టి చేతనే! పరమాత్ముడు తెలియబడును. అనగా:- "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా" అను వాక్యము యొక్క అంతరార్థము తెలియబడినప్పుడు మాత్రమే!

కలికాల కల్మషము యొక్క కారణము నివారింపబడును. ఒక ఉల్లిగడ్డను ఉదాహరణముగా తీసుకొందము. ఉల్లిగడ్డలోని పొరలను విప్పగా విప్పగా చివరకు ఏమియు మిగులదు. అదే విధముగా ఈ దేహములో, లేక ఈ ప్రపంచములోని పంచభూతాదులన్నింటిని "నేతి నేతి" న్యాయము ద్వారా తొలగించినప్పుడు, తుదకేమియు శేషించదు. అనగా:– కేవలము పరమేశ్వరుడే! ఈ ప్రపంచమంతటిని సృష్టించిన వాడు కూడా పరమేశ్వరుడే! ఆ పరమాత్మ సూక్ష్మాతి సూక్ష్మమగుటచే మన కంటికి కానబడదు. సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాత్మ స్థూలాతి స్థూలములైన ఈ ప్రపంచమును, ఈ విశ్వమును, పదునాలుగు లోకములను సృష్టింపజాలును. ఈ రహస్యమును గుర్తెఱింగిన వారు మాత్రమే! కలికాల కల్మష కారణమును నివారింపజాలుదురు. అన్యులందఱును కలికాల కలహ కరాళములచే సతమతమగుచుందురు, కావున మనమందఱమున్నూ అద్వైతామృతమును పానముచేసి, పరమ సత్యమును గుర్తెంఱిగినవారమై, కలికాల కలుషితమైయున్న బుద్ధికి బుద్ధిచెప్పి, పరిశుద్ధాంతఃకరణులమై, పరమేశ్వర ధామమునందు ప్రవేశించుట ద్వారా జీవన్ముక్తులమై, పరమానందము నొంది, మానవ జీవిత లక్ష్యమును సాధించి తరించెదము గాక!

## 22. లక్ష్మియొక్క లక్ష్యము

కేవలము మన వద్ద నున్నధనము, లేక పోస్టాపీసులో పెట్టబడిన ధనము, లేక బ్యాంకులలో పెట్టబడిన ధనము "లక్ష్మి" యని చెప్పబడదు. ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి ఇత్యాది అష్టలక్ష్మీలు కూడా పూర్ణలక్ష్మికి సరితూగజాలవు. కేవలమీ ప్రపంచములోని ఐశ్వర్యమే కాక, శేషించిన 13 లోకములలోని ఐశ్వర్యమంతయున్నూ పూర్ణలక్ష్మి అనబడజాలదు. కేవలము మోక్షలక్ష్మి మాత్రమే! పూర్ణలక్ష్మి యని చెప్పుట ఉచితమగును. కావున మోక్షలక్ష్మిని బడయుటయే! 14 లోకములలోని ఐశ్వర్యమంతటికి, లేక అష్టలక్ష్మీలన్నింటికి లక్ష్యమైయున్నది. ఐతే ఈ మోక్షలక్ష్మిని బడయుటెట్లు? అను ప్రశ్న ఇచ్చట ఉదయించును. మోక్షము అనగా విడుదల. దేని నుండి విడుదల? ఏది మోక్షలక్ష్మిని బడయుటకు సామర్థ్యమును కలిగిలేదో, దానినుండి విడుదల. ఆసియా ఖండమును వదలినప్పుడు మాత్రమే! మనము అమెరికా ఖండమును చేరుకొనగలుగుదుము. అదే విధముగా ఐహిక ఐశ్వర్యమును వదలుకొన్నప్పుడు మాత్రమే! ఆముష్మిక ఐశ్వర్యమనెడి "మోక్షలక్ష్మి"

మనకు ప్రాప్తించును. ఈ సందర్భమునందు మోక్షలక్ష్మియందు విశ్వాసము, నమ్మకము అత్యావశ్యకమగును. మోక్షలక్ష్మి మనకంటికి కానబడని పరమోన్నతమైన ఊర్ధ్వశిఖరము వంటిది. ఐతే అట్టి పరమోన్నత స్థానమును చేరుకొనుటకు మనకు సాధ్యమగునా? యని మనము భయకంపితులము కానవసరము లేదు. ఏల? మోక్షలక్ష్మి ఎంత దూరమునందున్నదో, అంత సమీపమునందు కూడా ఉన్నది. కావున మోక్షలక్ష్మిని ఇప్పుడిచ్చటనే బడయుటకవకాశమున్నది. "తద్దూరే తద్వంతికే" అని ఉపనిషత్తు ఘోషించుచున్నది. మోక్షము, బ్రహ్మము, పరమాత్మ అనునవి పర్యాయ పదములు. ఆ బ్రహ్మము మనకెంత దూరమునందున్నదో, అంత సమీపమునందున్నూ ఉన్నది. "ఇందు గల డందు లేడను సందేహమువలదు" అన్నట్లు బ్రహ్మము సర్వవ్యాపకుడను విశ్వాసమును మనము కలిగియుండవలయును. ఒకవేళ బ్రహ్మమే లేకున్నచో మన యొక్క ఉనికికే అస్తిత్వముండజాలదు.

అన్నింటిని వదలు కొన్నప్పుడు అన్నియు లభించును. కొన్నింటిని వదలుకొన్నప్పుడు కొన్ని మాత్రమే! లభించును. అహంకారమును వదలుకొనుటయే! అన్నింటిని వదలుకొనుట. అహంకారము "నేను-నాది" అని భావించి మనలను సంకుచితత్వము పాలు చేయును. అహంకారనాశముచే "అనంతత్వము" ప్రాప్తించును. అహంకారనాశముచే మూగవాడు వాచాలుడగును. అహంకార నాశముచే కుంటివాడు పర్వతమును దాటగలుగును. ఇదియంతయు కేవలము మాధవుని కృపచే, శ్రీకృష్ణుని అను గ్రహముచే, శ్రీరామానుగ్రహముచే సాధ్యమగును. అహంభావము నశించినప్పుడు "అహం బ్రహ్మోస్మి"యను మహావాక్యము అనుభూతమగును. బ్రహ్మమునకు, జీవునికి మధ్య అహంకారమనెడి అడ్డుగోడనిలచియున్నది. ఇదియే! మాయయని చెప్పబడును. రామచరిత మానస గ్రంథములో శ్రీ తులసిదాసుగారు శ్రీరాముడు వనగమనమునకేగిన పద్ధతిని సుమధురముగా వర్ణించి చెప్పిరి. శ్రీరాముడే! పరబ్రహ్మము. శ్రీలక్ష్మణుడే! జీవుడు. ఈ జీవునికి- ఆ పరబ్రహ్మమునకు మధ్య సీతాదేవియనెడి "మాయ" అడ్డుగా నిలచియున్నది. ఈ మాయ తొలగిపోయినప్పుడు జీవాత్మ-పరమాత్మయందు ఐక్యము కాగలుగును. అప్పుడు మోక్షలక్ష్మి మనకు హస్తగతమగును. రావణాసురుడు సీతాపహరణ మొనర్చినప్పుడు మాయ తొలగిపోయిదనుకొనరాదు. సూక్ష్మ రూపమునందున్న మాయ ఇంకను శేషించియున్నది. స్థూల-సూక్ష్మ- కారణ శరీరములు నశించినప్పుడు మాత్రమే! అహంకారము నిశ్శేషముగా నశించును. మాయ మాయముకాజాలును. అప్పుడు మాత్రమే! అహంకారము, లేక మాయ నుండి పూర్తిగా విడుదలనొందినప్పుడు మాత్రమే! మోక్షలక్ష్మి ప్రాప్తించును.

“నేనుదేహమును కాను,నేను మనస్సును కాను నేను బుద్ధిని కాను. నేను కేవలము ఆత్మ స్వరూపుడను” అను భావము సుస్థిరపడినప్పుడు మోక్షలక్ష్మి పొందబడును. ఆత్మ పదార్థమునొందుటకై అనాత్మ పదార్థములన్నింటిని త్యజింపవలసియున్నది. అది ఎట్లనగా:- జాగ్రదవస్థలో స్వప్నములోని పదార్థములన్నియును నశించును. అదే విధముగా ఆత్మ పదార్థము పొందబడినప్పుడు అనాత్మపదార్థములన్నియును అప్రయత్నముగా నశించును. దీపమును వెలిగించినప్పుడు చీకటి అప్రయత్నముగా నశించును. జ్ఞానభాస్కరుడు ఉదయించినప్పుడు అజ్ఞానతిమిరము అప్రయత్నముగా నశించును. ఈ జ్ఞానము ద్వారానే మోక్షలక్ష్మి పొందబడును. జ్ఞానమునార్జించుటకై గురుదేవుని శరణు పొందవలసియున్నది. “అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా। చక్షురున్మీలితంయేన తస్మైశ్రీ గురవే నమః” యని గురుగీత నుడువు చున్నది. కావున గురుసేవద్వారా గురు కృపనార్జించినప్పుడు మన అజ్ఞానమనెడి అంధకారము తొలగిపోవును. అప్పుడు “సోహం” భావన సుసాధ్యమగును. జీవిత లక్ష్యము పొందబడును. మన మీ దేహమునందున్న “దేహి”ని అనగా:- ఆత్మ పదార్థమును ఎల్లప్పుడు జ్ఞప్తియందుంచుకొనవలయును. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము ఇత్యాది అనాత్మ పదార్థములను తొలగించినప్పుడు ఆత్మ భాస్కరుడు దేదీప్యమానముగా ప్రకాశించును. జీవాత్మయనెడి నది పరమాత్మ యనెడి సముద్రమునందు లీనమగును. అదియే! మోక్షలక్ష్మియనినుడువబడును. దీనిని బడయుటకై 14 లోకములలోని ఐశ్వర్యములనన్నింటిని త్యజింపవలసియున్నది. అనగా:- పిపీలి కాది బ్రహ్మ పర్యంతముగల కోరికలనన్నింటిని త్యజింపవలసియున్నది. “ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినో-ర్జున” అని శ్రీకృష్ణుడర్జునునికి బోధించెను. మనమే లోకమునకేగినను, ఆయా లోకములలోని భోగములననుభవించిన పిమ్మట తిరిగి భూలోకమునకేతెంచి మోక్షలక్ష్మి నొందు ప్రయత్నమునొనర్పవలసి యుండును. కావున మొదటనే సమస్తైశ్వర్య వాంఛను త్యజించుట ఉచితమగును. ఈ ఐశ్వర్యములన్నియును స్వప్నములోని ఐశ్వర్యములవంటివి. కావున అవి నిజమైన ఐశ్వర్యములుకావు. నిజమైన ఐశ్వర్యము మనయందే ఆత్మ రూపమునందున్నది. అది చూచును. కానిచూడబడదు. చూడబడు పదార్థము లన్నియును నశ్వరములు. చూచునది లేక ద్రష్ట శాశ్వతమైనది. ఆత్మలక్ష్మియే! మోక్షలక్ష్మియై యున్నది. దీనిని పొందుటయే! లక్ష్మి యొుక్క లక్ష్యమై యున్నది. మఱియు మనందఱి జీవితలక్ష్యమైయున్నది. దీనిని సాధించి, మన జీవితములను ధన్యమొనర్చుకొందుము గాక!

# 23. కర్తవ్య కర్మ

ఈ ప్రపంచమునందున్న స్త్రీ పురుషులకైతే నేమి, పశుపక్షులకైతేనేమి, క్రిమికీటకములకైతేనేమి, ప్రతి యొక్కరికి స్వస్థులమైయుండుటయే! కర్తవ్య కర్మయై యున్నది. స్వస్థులమైయుండుట అనగానేమి? తనలో తానుండుట, లేక మనలో మనముండుటయని అర్థము. ఇచ్చట "మనలో మనము లేమా?" యను ప్రశ్న ఉదయించును. "మనలో మనము లేము" అనునది సమాధానము. ఏల? ఒకవేళ మనలో మనముండియున్నచో, మనమనస్సు బాహ్య ప్రపంచము వైపు పరుగెత్తదు. కాని మనమనస్సెల్లప్పుడు బాహ్య ప్రపంచము వైపునకు పరుగెత్తుచుండును. దీనికి కారణమేమి? మన మనస్సుకు తగిన ఆహారములభించుట లేదు. మన పొట్టనింపుకొను ఆహారమునకొక మితియుండును. కాని మనస్సు యొక్క పొట్టను నింపుట కొరకై ఎంత ఆహారమొసంగినను, దానికి సంతృప్తి కలుగదు. ఈ సమస్య తీరుటకై మనమేమి చేయవలసియున్నది? మనము స్వస్థులము కావలసియున్నది. అనగా:- మనలో మనము ఉనికిని కలిగియుండవలసి యున్నది. దీని నిమిత్తమై మన మేమి చేయవలయును? మన మనస్సును ప్రపంచమునకతీతముగా తీసుకుని వెళ్ళవలెను. అనగా ప్రపంచమంతటిని మన మనస్సునందిమిడ్చు కొనవలయును. అప్పుడు మనస్సునకు గల కోరికలు నశించును. ఈ కారణముచే ప్రపంచమున కతీతమైయున్నదానియందు మనస్సు స్థిరపడును. ప్రపంచమునకతీతమైయున్నదేది? ఈ ప్రపంచమును సృష్టించిన పరమాత్మయే! ప్రపంచమునకతీతుడైయున్నాడు. ఐతే పరమాత్ముడు కేవలము మన ప్రపంచమును మాత్రమే! సృష్టించియుండలేదు. 14 లోకములు కలిగియున్న విశ్వమంతటిని పరమాత్ముడు సృష్టించియున్నాడు. ఆ 14 లోకములలో మన ప్రపంచమొకటి. కావున మన మనస్సు ఈ ప్రపంచమున కతీతముగా ప్రయాణము చేసినను, దానికి పూర్ణతృప్తి కలుగదు. అది మిగిలిన 13 లోకములను కూడా కబళించుటకై ఉవ్విళ్ళూరు చుండును. ఈ 14 లోకములన్నింటికి సారాంశముగా మనము స్వర్గ - మర్త్య - పాతాళలోకములని చెప్పుచుందుము. స్వర్గలోకములో దేవతలుందురనియు, మర్త్యలోకములో మానవులు, జంతువులు, కీటకము లుండుననియు, పాతాళలోకములో పాపాత్ములుందురనియును పురాణములు పలుకును.

ఐతే మన మనస్సును ఉన్నతోన్నత స్థితికి తీసుకొని వెళ్ళుటకై ఒక క్రమమైన పద్ధతి నవలంబింపవలసియున్నది. ఉట్టినే అందుకొనలేనివాడు ఊర్ధ్వలోకమైన

స్వర్గలోకమునందుకొనగలడా? కావున ప్రప్రథమముగా "ఈ దేహము నేను కాదు" అను విషయమును సుస్థిరమొనర్చుకొనవలసియున్నది. ఇందు నిమిత్తమై దేహమును త్యజింపవలసిన అవసరము లేదు. కాని దేహభావనను మాత్రము త్యజింపవలసి యున్నది. తర్వాత "ఈ కుటుంబము నాది కాదు" అను భావనను సుస్థిర మొనర్చుకొనవలసియున్నది. ఇందు నిమిత్తమై కుటుంబమును త్యజింపవలసిన అవసరము లేదు. కాని కుటుంబభావనను మాత్రము త్యజింపవలసియున్నది. తర్వాత తానున్న గ్రామమును నా గ్రామమనుకొనువాడు ఇందునిమిత్తమై గ్రామమును త్యజింపవలసిన అవసరము లేదు. అటు పిమ్మట మండలమును త్యజింపవలయును. అనగా:– నా మండలమను భావనను మాత్రము త్యజింపవలయును. అనంతరము జిల్లాను త్యజింపవలసియున్నది. అనగా:– నా జిల్లా అను భావనను త్యజింప వలయును. ఆ తర్వాత భూమిక (స్టేట్)ను త్యజింపవలయును. అనగా:– నా స్టేట్ అను భావనను త్యజింపవలయును. ఆ తర్వాత ఖండమును త్యజింపవలసియున్నది. అనగా:– ఆసియా ఖండము, అమెరికా ఖండము, యూరపు ఖండము ఇత్యాది భావనలను త్యజింపవలసియున్నది. అనంతరము ఈ ఖండములన్నింటిని కలిగియున్న ఈ ప్రపంచమును త్యజింపవలసియున్నది. అనగా:– నా ప్రపంచము, లేక మన ప్రపంచము అను భావనను త్యజింపవలయును. మన ప్రపంచమును త్యజించిన పిమ్మట శేషించిన 13 లోకములను కూడా త్యజింపవలసియున్నది. అనగా:– వాటిని నా లోకము లనుకొనరాదు. ఐతే, ఆ లోకము లెవరివి? "లోకంబులు లోకేశులు లోకస్థులు తెగిన తుది పెంజీకటి కవ్వల నేకాకృతి వెలుంగు నెవ్వడో" వాని లోకములవి. ఇట్టి మహోన్నత భావము నెవ్వడు కలిగియుండునో, అట్టివాడు స్వస్థుడైయున్నాడని చెప్పవలసియున్నది. ఇట్టి స్వాస్థ్యము నొందుటకై చేయు ప్రయత్నమే! కర్తవ్యకర్మయని చెప్పబడును. ఈ విశ్వమునందు విశ్వేశ్వరుడు తప్ప మరియొకడు లేదు. ఆ విశ్వేశ్వరుని సంకల్పము పూర్తిచేయుటయే! మన కర్తవ్య కర్మయైయున్నది. ఆ విశ్వేశ్వరుని సంకల్పమేమి? "లోకాః సమస్తాః సుఖినోభవంతు" లోకములన్నియును సుఖముగా నుండును గాక! అనునది ఆ విశ్వేశ్వరుని సంకల్పము.

స్వస్థుడైయుండువాని మనస్సు చలింపక సుస్థిరమైయుండును. ఇట్టి స్థితియే! సమాధిస్థితియని చెప్పబడును. నిజమైన సమాధిస్థితి యందున్నవాని మనస్సు బహిర్గతము కాజాలదు. కారణమేమి? అట్టివానికి బాహ్యవస్తువులనవి లేవు. సమస్త వస్తుజాల సమన్వితమైయున్న 14 లోకములాతని కుక్షియందుండును. ఈ కారణముచే

ఆతనికి ఆకలివేయదు. అనగా:- ఏలాటి కోరికకున్నూ ఆస్కారముండదు. ఒక పసిబాలుడు ఆకాశములోని చంద్రుని చూచి, అది నాకు కావలయునని రోదించును. అప్పుడాతని తల్లి ఒక పళ్ళెములో నీటినినింపి, ఆ చంద్రుని పళ్ళెములోని నీటిలో ప్రతిబింబింపజేసి, ఆ పసిబాలుని రోదనమును నివారించును. అదే ప్రకారముగా ఆధ్యాత్మిక సాధకులమైయున్న మన కోరికలన్నింటిని నెఱవేర్చుటకై గురుదేవుడు బ్రహ్మానందామృతము నొసంగి సాధకుని కోరికలన్నింటిని నివారించును. అమృతపానముచే అమరత్వము కలుగును. అనగా:- జనన మరణరాహిత్యము సిద్ధించును. దీనిచే మనకు నిజమైన, పూర్ణస్వాస్థ్యము చేకూరును. ఈ ప్రపంచము భవరోగముగా వర్ణింపబడినది. గురుదేవుడు భవరోగవైద్యుడుగా పేర్కొనబడినాడు. కావున మనము పూర్ణస్వాస్థ్యమునొందుటకై భవరోగవైద్యుడైన శ్రీ గురుదేవుని శరణువేడవలసియున్నది. మానసికస్వాస్థ్యమున్నప్పుడు దేహము కూడా స్వాస్థ్యముగా నుండును. కావున మనమందఱమున్నూ మానసిక స్వాస్థ్యము కొఱకై ప్రయత్నింపవలసియున్నది. ఇందు నిమిత్తమై మనము మన మనస్సును గురుదేవుని చరణ కమలముల యందర్పించ వలయును. ఇదియే! మనందఱికి కర్తవ్యకర్మ. ఈ కర్తవ్యకర్మచే మన జీవితలక్ష్యము పొందబడును. అప్పుడు మన మనస్సు నిశ్చలముగాను, ప్రశాంతముగాను ఉండునని నుడువుట కంటె మనస్సు మాధవునియందు లీనమగునని చెప్పుట ఉచితమగును. మన మందఱమున్నూ మన కర్తవ్యకర్మలను నిర్వహించి, ప్రారబ్ధకర్మలను భస్మీకృత మొనర్చుకొని, పూర్ణ స్వాస్థ్యము నొంది, బ్రహ్మానందామృత పానమొనర్చి మన జన్మలను కృతార్థమొనర్చు కొందుము గాక! మనమెచ్చటనుండి ఇచ్చటికేతెంచినామో, మరల ఇచ్చటి నుండి అచ్చటి కేగినప్పుడు మన స్వంత గృహమునకేగినప్పుడు మనము పరమానందము ననుభవింపజాలుదుము. అట్లు కాదేని జీవితమును వ్యర్థమొనర్చుకొన్న వారమగుదుము.

## 24. ఒడి - బడి - గుడి

మనమందఱమున్నూ పుట్టిన వెంటనే అమ్మఒడిలో నవ్వుచు, ఆడుచు, కేరింతలు కొట్టుచు ఆనందించియున్నాము. అమ్మ యొక్క ప్రేమయనెడి కమ్మదనమును అనుభవించి యున్నాము. అమ్మ యొక్క ప్రేమ నిస్స్వార్థమైనది. అందువల్ల అది పరిశుద్ధమైన ప్రేమ. అమ్మ తన పిల్లలను బాలకృష్ణుని వలె, లేక బాలరాముని వలె, లేక బాలికయైన రాధాదేవి వలె, లేక బాలికయైన సీతాదేవివలె భావించి, ప్రేమించి,

సేవించినప్పుడది వాత్సల్యభక్తిగా పరిణమించును. అప్పుడు తల్లి– బిడ్డలిద్దరికిన్నీ ఆధ్యాత్మిక లాభము చేకూరును. అనగా:– జీవిత లక్ష్యము నొందుటకు దారి తెలియబడును. అమ్మ ఒడిలోని మహిమ వర్ణనాతీతమైనది. అమ్మయొక్క మనస్సు పరిశుద్ధమైయున్నచో, ఆ పారిశుద్ధ్యము స్తన్యము ద్వారా శిశువుకు కూడా సంక్రమించి, శిశువు తన భవిష్యజ్జీవితములో ఉన్నత స్థాయినొందుటకు సహకరించును. అమ్మ ఒడిలోనున్న శిశువును దర్శించుటకై ఇరుగుపొరుగు వారందఱున్నూ ఏతెంచుచుందురు. శిశువులోని అహంకార శూన్యతయే! దీనికి గల కారణము. అహంకారము ఆరంభమైననాటి నుండి ఆ బాలుని చూచుట కెవ్వరున్నూరారు, సరికదా ఒక్కొక్కసారి కసరుకొనుట కూడా సంభవించును. ఈ కారణముచే మనము అహంకార శూన్యతను జీవితమంతయు పోషించుచుండవలయును. అహంకార శూన్యుడైన వ్యక్తి అందరిచేతను ఆదరింపబడును. అహంకార రహితుడైన వ్యక్తి విశాల హృదయుడైయుండుటచే ఆతడు తన తల్లితండ్రులకు, వంశమునకు పేరుతెచ్చును. అమ్మఒడి లోని బిడ్డపెరిగి పెద్దవాడై కూర్చుండుట, నడచుట నేర్చుకున్నప్పుడు ఇంటిలోని కడప వరకు సరదాగా నడచివెళ్ళి, కడపను దాటలేక మరల వడివడిగా పరుగెత్తుకొనివచ్చి, తన తల్లి ఒడిని శరణు జొచ్చును. మొట్టమొదటిసారిగా ప్రాకుచున్న చీమను చూచి భయకంపితుడగును. అప్పుడు తల్లి తన ఉపదేశామృతముచే తన బిడ్డయొక్క భయమును పోగొట్టును. అది శరణాగతి యొక్క ఫలితము. ఆధ్యాత్మిక సాధకుని విషయమునందున్నూ ఇది వర్తించును.

బాలునికి ఐదారు సంవత్సరములు నిండిపప్పుడు తల్లిదండ్రులాబాలుని బడిలో ప్రవేశపెట్టుదురు. అప్పుడు బాలునికి మనోవికాసము కలుగుటతో హృదయము విశాలమగును. ఆ బాలుడు బడిలోని సహపాఠకులతో కలిసిమెలసి తిరుగును. బడిలోని బాలురందఱును సమవయస్కులగుటచే దాదాపు వారందఱును ఒకే మనస్తత్వము కలవారై యుందురు. కాని వారి పూర్వజన్మసంస్కారములు భిన్నములైయుండుటచే ఒక్కొక్కప్పుడు బాలురు పరస్పరము కలహించుట, దెబ్బలాడుట, తిరస్కరించి మాట్లాడుట జరుగుచుండును. ఈ సందర్భమునందు బడిపంతులు వారికి ఉపదేశామృతమునొసంగి, వారిని శాంతింపజేయవలసియుండును. తల్లి తన ఒడిలోని బిడ్డను హృదయపూర్వకముగా ఎట్లు ప్రేమించునో, అట్లే బడిపంతులు తన బడిలోని పిల్లలను హృదయపూర్వకముగా ప్రేమించవలసియుండును. అప్పుడాపాఠశాల అందఱికాదర్శవంతమై శోభిల్లును. బడి పిల్లలందఱి మనస్సులు ఆనందోత్సాహములచే తాండవమాడుచుండును. అట్టి బడి తల్లి ఒడికి వలె పిల్లలందఱికి శాంతిని

ప్రసాదించును. నేటికాలములోని బడిపంతులు కేవలము తనకు వచ్చు నెలజీతము కొఱకై కాచుకొనియుండును. కాని బడిపిల్లల బాగోగులను విచారించుట లేదు. ఇది మిక్కిలి శోచనీయమైన విషయమైయున్నది. ఇట్లొనర్చినచో బడి పిల్లల భవిష్యత్తు బాగుపడదు సరికదా, బడిపంతులుగారి భవిష్యత్తు కూడా భాగ్యవిహీనమగును. అట్లు గాక బడిపంతులు తన బడిలోని పిల్లల హృదయములలో, లేక తన తరగతి గదిలోని పిల్లల హృయములలో ప్రేమామృతమును నింపగలిగినప్పుడు అట్టి బాలురు లేక బాలికలు భారతమాతకు నిజమైన బిడ్డలుగా భాసింతురు. తల్లి ఒడిలో పెరిగిన ఉపాధ్యాయుడు, తల్లి ఒడిలో పెరిగిన విద్యార్థిని తన సోదరునిగా, లేక సోదరిగా భావింపవలయును. ఇచ్చట ఉపాధ్యాయునికి మఱియు విద్యార్థికి బడిగాని, పాఠశాలగాని, కళాశాలగాని తల్లి ఒడిగా మారవలసియుండును. అప్పుడా విద్యార్థి తన ఇంటికంటె బడినే ఎక్కువగా ప్రేమించును. కారణమేమి? ఒడిలోని ప్రేమామృతము కంటె బడిలోని ప్రేమామృతము మిక్కిలి విలువైనదని విద్యార్థి గ్రహించును. అప్పుడు తల్లి ఒడిని విడనాడిన బాధ ఆతనికుండదు.

తల్లి ఒడిలోని బిడ్డ తల్లితో పాటు తాను కూడ గుడికి వెళ్ళుచుండును. ఆ సంస్కారబలముచే బడినుండి బయటికి వచ్చిన బాలుడు కూడా దేవుని గుడికి వెళ్ళి దైవప్రార్థన చేయుచుండును. ఇట్టి దైవప్రార్థనచే జీవితలక్ష్యము సాధింపబడును. ఒకవేళ బడినుండి బయటికి వచ్చిన బాలుడు గుడికి వెళ్ళుట సంభవింపకున్నను, తన దేహమునే దేవాలయముగా భావించుచుండును. ఆ దేవాలయమునందున్న తాను విశ్వేశ్వరునితో సంబంధము కలవాడగును. జగత్తులోనున్న తాను జగదీశ్వరునితో సంబంధము కలవాడగును. ప్రపంచములోనున్న తాను పరమాత్మతో సంబంధము కలవాడగును. ప్రపంచములోని బంధుబాంధవుల సంబంధము ఒకనాడు తెగిపోవును. ఒకవేళ జీవితాంతము వరకు సంబంధము కలవాడైయున్నను, ఒకనాడు మృత్యుదేవత వచ్చి ఆ సంబంధమును త్రెంచివేయును. కాని విశ్వేశ్వరుని సంబంధము అట్టిది కాదు. విశ్వేశ్వరుని సంబంధము శాశ్వతమైనది. జగన్నాథుని సంబంధము జన్మరాహిత్యము కలుగునంతవరకుండును. పరమాత్మయొక్క సంబంధము ఆత్మ –పరమాత్మలో లీనమగునంతవరకుండును. కావున నిజమైన దేవుని గుడి ఇటుకలు, రాళ్ళు, సిమెంటు మున్నగువాటితో కట్టబడిన గుడి కాదు. నిజమైన దేవుని గుడి భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములచే నిర్మింపబడియున్నది. ఇక మన దేహము కూడా ఈ పంచభూతములచే నిర్మింపబడియున్నది. ఈ కారణముచే దేవుని గుడికి– మన దేహమునకు మధ్య భేదము లేదు. ఈ ప్రపంచములోని వ్యక్తులందఱున్నూ

ఈ పంచ భూతములచే నిర్మింపబడినవారే! ఐతే, ఈ ప్రపంచము రాగద్వేషములకు కారణమెట్లైనది. అహంకారమే! దీనిక గల కారణము. అహంకారము నివారింపబడినప్పుడు సో-హం భావము మొలకెత్తును. దీనిచే జీవాత్మ పరమాత్మతో తాదాత్మ్యమునొందును. ఏ వ్యక్తి యైనను తల్లి ఒడిని గ్రామములోని బడిగా విశాలమొనర్చి, తదనంతరము విశ్వేశ్వరుని గుడిగా మార్చగలుగునేని, ఆ వ్యక్తి అవ్యక్తము, అనిర్వచనీయమైన బ్రహ్మానందము నందోలలాడుచు, శేషించిన వ్యక్తులందఱికి తన ప్రేమామృతమును, కరుణామృతమును, బ్రహ్మానందామృతమును వితరణ చేయగులుగును. మనమందఱమున్నూ "ఒడి"యనెడి కర్మయోగమును "బడి"యనెడి భక్తియోగమును. "గుడి"యనెడి జ్ఞానమునునుష్ఠించి, జీవిత పరమార్థమును సాధింతుము గాక!

# 25. "సర్వం శక్తిమయం జగత్"

సకలచరాచర జీవకోటి సమన్వితమైన ఈ జగత్తునందేపదార్థమున్నూ, ఏ ప్రాణియున్నూ శక్తిరహితమైన ఉనికిని కలిగియుండజాలదు. శక్తియే అస్తిత్వము. అస్తిత్వమే శక్తియని చెప్పుటయుక్తమగును. ఉదాహరణమునకు, మానవ జీవులమైయున్న మనము మన తల్లిదండ్రుల శుక్ల శోణితముల యందున్న ప్రాణశక్తిచే మన మాతృగర్భము నందు ప్రవేశించితిమి. మాతృగర్భము నందు పిండరూపము నందున్న మనము ప్రాణశక్తిచే జీవ రూపమును దాల్చితిమి. తొమ్మిది మాసముల తర్వాత మాతృగర్భము నుండి బయల్వెడలిన కొంత సమయమునకు అంబాడుట ప్రారంభించితిమి. అప్పుడు భూదేవి యొక్క శక్తి మనలో ప్రవేశించుటచే కూర్చొని, నిలబడి, నడచుట ప్రారంభించితిమి. కొంత కాలము తర్వాత పరుగెత్తుట కూడా నేర్చుకొంటిమి. అనంతరము పాఠశాలలలోను, కళాశాలలలోను విద్యార్జనమొనర్చి తమ తమ అర్హత ననుసరించి కొందఱము ఉపాధ్యాయులముగను, కొందఱము డాక్టర్లుగను, కొందఱము వకీళ్ళుగను, కొందఱము పార్లమెంటు సభ్యులముగను, కొందఱము ముఖ్యమంత్రులముగను, ప్రధాన మంత్రులముగను, అఖిల దేశాధ్యక్షులముగను పరిణామము నొందితిమి. మన యందున్న దైవశక్తియే! దీనికంతటికి కారణమైయున్నది. ఈ శక్తియంతటికి ఆధారము పరమాత్మ. అందువల్ల శ్రీకృష్ణ పరమాత్మమీడీ శక్తిని భగవద్గీతలో మాయా శక్తియని పేర్కొనెను. "మమ మాయా దురత్యయా। మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే ॥ " అని

నుడివెను. అనగా:- ఎవరైతే నన్ను మాత్రమే శరణు పొందుదురో, వారీ మాయాశక్తి నుండి తరింతురని భావము. దైవశక్తిని మనము సద్వినియోగమొనర్చు కొనవచ్చును. లేక, దుర్వినియోగమొర్చుకొనుటకు కూడా అవకాశమున్నది. మన మనస్సు దైవోన్ముఖమైనప్పుడా శక్తి సద్వినియోగమగును. ఇక దైవ విముఖమైనప్పుడు దుర్వినియోగమగును.

అది ఎట్లనగా:- రావణాసురుడు దైవ దత్తమైన తన శక్తిని దుర్వినియోగ మొనర్చు కొనెను. ఇక ఆంజనేయుడదే శక్తిని దైవకార్యమునకై వినియోగించి, సద్వినియోగమొనర్చెను. హిరణ్యకశిపుడాశక్తిని దుర్వినియోగమొనర్చెను. ఇక ప్రహ్లాదుడాశక్తిని సద్వినియోగమొనర్చి, దశావతారములయందొకటైన శ్రీ నృసింహావ తారమునకు కారకుడయ్యెను. ఆధునిక కాలమునందు మహాత్మాగాంధీ గారు దైవదత్తమైన తన శక్తిని సద్వినియోగమొనర్చి, పాశ్యాత్యుల పాశవిక చర్యలనుండి భారతమాతకు విముక్తిని ప్రసాదించెను. ఇక "జిన్నా"అదే శక్తిని దుర్వినియోగమొనర్చి అందఱిచేత "ఛీ!ఛీ!"అనిపించుకొనెను. కౌరవులు దైవదత్తమైన తమ శక్తిని దుర్వినియోగమొనర్చి, తుదకు తమ వంశ నాశమునకు కారకులైరి. ఇక పాండవులు తమ శక్తిని సద్వినియోగమొనర్చి విజయ పతాకము నెగురవేయుటయే గాక, శ్రీకృష్ణ పరమాత్ముని వదనారవిందము నుండి "శ్రీమద్భగవద్గీత" ఆవిర్భవించుటకు కారకులైరి. దైవ శక్తి అందఱి యందును సమానముగానుండును. కాని దైవాసుర భావములచే అది తారుమారగుచుండును. ఏ శక్తిచే ఈ జగత్తు సృష్టింపబడినదో, అది బ్రహ్మశక్తియని చెప్పబడును. ఏ శక్తిచే ఈ జగత్తు పోషింపబడుచున్నదో, అది విష్ణు శక్తియని చెప్పబడును ఏ శక్తిచే ప్రళయ కాలమునందీ జగత్తు పరమేశ్వరుని యందు లీనమగునో, అది శివశక్తియని చెప్పబడును. ఈ మూడు శక్తులు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తియనియు చెప్పబడును. దుర్గాదేవి తన శక్తిచే దుర్గతిని దూరము చేయును. లక్ష్మీదేవి తన శక్తిచే మన జీవిత పోషణకు కావలసిన వాటినన్నింటిని సమకూర్చును. ఇక సరస్వతీ దేవి మనకు జ్ఞానమునొసంగి, మనము మన జీవిత పరమలక్ష్యమునొందుటకు సహకరించును. ఈ కారణముచేతనే శరన్నవరాత్రులలో శ్రీ దుర్గాదేవి, శ్రీలక్ష్మీదేవి, శ్రీసరస్వతీ దేవి భక్తులచే పూజింపబడుచుండును. ఈ విషయమును తెలుసుకొన్న ముముక్షువులు తమ జీవిత లక్ష్యమగు మోక్షలక్ష్మిని పొందుటలో విజయమును సాధింతురు. అదియే "విజయదశమి" యని చెప్పబడును. ఇంత మాత్రముచే కేవలము పది రోజులలో మోక్షము లభించునని మనము తలంపకుందుము గాక!

మోక్షప్రాప్తికై జీవితమంతయు ప్రయత్నమునొనర్పవలసి యుండును. ఏ శక్తిని మించిన మరియొక శక్తిలేదో అది "పరాశక్తి"యని చెప్పబడును. ఈ పరాశక్తి వల్లనే మోక్షలక్ష్మి సాధింపబడును. ఈ జగత్తులోని సమస్త శక్తులను మూటగట్టినప్పుడు అది "పరాశక్తి" యనబడును. ఇట్టి పరాశక్తి చేతనే పరమాత్మ పొందబడును. ఈ జగన్నాటకమంతయు ఈ పరాశక్తి చేతనే కొనసాగుచున్నది. పరమాత్ముడు పరాశక్తిని వ్యక్తమొనర్చినప్పుడది ఈ విశ్వముగా పరిణమించును. ఇక పరమాత్ముడు పరాశక్తిని, లేక మాయా శక్తిని తనయందు లీనమొనర్చుకొన్నప్పుడీ జగత్తు కూడా తనయందు లీనమగును. ఈ కారణముచేతనే! ఈ జగత్తు స్వప్న జగత్తని చెప్పబడుచున్నది. పరమేశ్వరుని స్వప్నమే! ఈ జగత్తు. మనమున్నూ ఈ స్వప్నమునందిమిడియున్నాము. కావున మనమందఱమున్నూ ఈ స్వప్నమునుండి మేల్కొనవలసియున్నది, ఇట్టి మేలుకొలుపే! ఆత్మ సాక్షాత్కారము, దైవసాక్షాత్కారము, లేక బ్రహ్మ సాక్షాత్కారమని నుడువబడును. భగవంతుని సమీపించుటచే మన శక్తి సద్వినియోగమగును. ఇంతే కాకుండా సర్వశక్తులు మనలను సమీపించును. ఇక మనము భగవంతునికి దూరమైనప్పుడు, మనశక్తి దుర్వినియోగమగును. అంతేకాకుండా మనయందున్న కొద్ది శక్తులు కూడా ఊడిపోవును, లేక బలహీనములగును. నిజమునకు మనము భగవంతునికి ఏ కాలమునందును, ఏ దేశమునందును దూరము కాజాలము. కాని భగవంతుని మఱచిపోయినప్పుడు భగవంతుడు మనకు దూరమగును. ఇది మామూలు మరణము కంటెను మిక్కిలి ఘాతుకమైన మరణము. ఇక సర్వాంతర్యామియైన భగవంతుని సర్వకాల సర్వావస్థలలో జ్ఞప్తియందుంచుకొనుటయే! నిజమైన జీవనమనబడును. మనము భగవద్భక్తితో మనయందున్న శక్తినంతటిని క్రోడీకరించి మన మనస్సును, బుద్ధిని, హృదయమును దైవార్పణ మొనర్చినప్పుడు మనకు మోక్షలక్ష్మి లభ్యమగును. ఇంతకూ "సర్వం బ్రహ్మమయం జగత్తే"న్నా, "సర్వం విష్ణుమయం జగత్తే"న్నా, "సర్వం శివమయం జగత్తే"న్నా, "సర్వం శక్తిమయం జగత్తే"న్నా ఒకే భావమును స్ఫురింపజేయును. దీనిని అనుభూతమొనర్చుకొన్నప్పుడు ''అహం బ్రహ్మోస్మి"యను మహావాక్యము సార్థకమగును, మఱియు మానవ జీవిత పరమలక్ష్యము పొందబడును.

# 26. అద్వైతామృతము

అద్వైతము అమృతము వంటిది. అనగా:- అద్వైతభావము కలవారు అమరులగుదురు; అనగా:- వారికి జననమరణములుండవు. అనగా:- వారు ఈ సంసారసాగరమును దాటివేయుదురు. కావుననే "శ్రీ గీతాధ్యానము" నందు "అద్వైతామృతవర్షిణీం భగవతీం అష్టాదశాధ్యాయినీమ్" అని చెప్పబడినది. పదునెనిమిది అధ్యాయములుగల శ్రీమద్భగవద్గీత అద్వైతమనెడి అమృతమును వర్షింపజేయుచుండునని దీని భావము. ఈ అద్వైతామృతవర్షము శ్రీ కృష్ణభగవానునిచే అర్జునునిపై వర్షింప జేయబడినది. ఈ కారణముచేతనే అర్జునుడు శ్రీ కృష్ణభగవానుని విశ్వరూపమును సందర్శించగలిగెను. విశ్వరూపమును దర్శించిన తరువాత అర్జునుడు మరల మామూలు వ్యక్తిగా మారుటకు గల కారణమేమి? ఇది కూడా భగవత్సంకల్పమే! శ్రీ కృష్ణుడు అధర్మమును నశింపజేసి, ధర్మమును స్థాపింపవలసియున్నది. ఈ కార్యమును శ్రీ కృష్ణుడు అర్జునుని ద్వారా చేయించెను. అద్వైతము నందు రాగ ద్వేషములుండవు. అద్వైతమునందు భయభ్రాంతులుండవు. అద్వైతమునందు బలహీనతయుండదు. కారణమేమి? రెండవ వ్యక్తిగాని, రెండవ వస్తువుగాని, లేకపోవుటయే! అద్వైతమనబడును. "ద్వితీయాద్వైభయం భవతి" అనగా :- రెండవ వస్తువున్నప్పుడే! భయమకలుగును. అద్వైతమునందు కేవలము నిర్భయముండును. ఒక తేలునుగాని, పామునుగాని, లేక ఏదైన క్రూరమృగమునుగాని చూచినప్పుడు మనకు భయముకలుగును. కారణమేమి? అది అన్యవస్తువు. ఐతే తేలుకు తేలు పిల్ల భయపడదు. పాముకు పాముపిల్ల భయపడదు. క్రూరమృగమునకు దాని సంతానము భయపడదు. అవి వాటితో తాదాత్మ్యము నొందియుండుటయే! దీనికి గల కారణము. అట్లే మనమున్నూ ప్రతి జీవియందును, ప్రతి ప్రాణియందును ఒకే దైవమును దర్శించి, వాటితో తాదాత్మ్యమునొందియుందుమేని, అవి మనకేలాటి హానినిగాని, కీడునుగాని ఒనర్పజాలవు. ఈ కారణముచే మహాత్ములు, మహామునులు కీకారణ్యములలో నివసించుచు, కేవలము భగవద్ధ్యాన నిమగ్నులై యుండుటచే క్రూరమృగములు వారి కేలాటి హాని నొనర్పజాలవు. భగవచ్ఛక్తి వారియందు నిండి నిబిడీకృతమై యుండును.

అద్వైతసిద్ధిని పొందుటకై మనమెల్లప్పుడు సంసిద్ధులమైయుండవలయును. ఇక అద్వైతసిద్ధి సాధ్యమా? అనుసంశయముకలుగకమానదు. మానవులమైయున్న

మనకు సాధ్యముకాని విషయమంటూ ఏదియునులేదు. ఐతే ఇచ్చట మనస్సు యొక్క ఏకాగ్రత అత్యావశ్యకమగును. గ్రీష్మకాలములో సూర్యభగవానుని వేడిమిని మనము భరింపజాలము. అదే విధముగా మానసిక ఏకాగ్రత లేక తపఃశక్తి యొక్క వేడిని ద్వైతభావము భరింపజాలదు. ఇదియే! ధారణాశక్తియని చెప్పబడును. అద్వైతభావము నందు ద్వైతభావమునకు ఉనికిలేదు. మానసిక ధారణయనెడి వేడికి ద్వైతభావమనెడి మంచు కరిగి పోవును. అప్పుడది అద్వైతామృతముగా పరిణమించును. శ్రీమద్భగవద్గీత లోని పదునెనిమిదవ అధ్యాయము యొక్క 73వ శ్లోకమునందర్జునుడు శ్రీ కృష్ణభగవానునితో "కరిష్యే వచనంతవ" అనిపలికెను. అనగా:- "ఇప్పుడు నాసందేహములన్నియు తొలగిపోయినవి. కావున మీ వాక్యమును నేను పాలించెదనని పలికెను". ద్వైతభావమునందు మన మనస్సు రకరకములగు సందేహములచే పీడింపబడుచుండును. అద్వైతసిద్ధి కలిగినప్పుడు సమస్త సందేహములు విచ్ఛిన్నములగును. అర్జునుని యందు "మమకారమ"నెడి మోహమునశించినది. ఈ కారణముచే "నేను యుద్ధము చేయను" అన్నవాడే! తిరిగి యుద్ధ సన్నద్ధుడయ్యెను. "స్మృతిర్లబ్ధా"అంటే నాకు జ్ఞానము కలిగినదని అర్థము. ఏ రకమైన జ్ఞానము కలిగినది? అద్వైత జ్ఞానము కలిగినదని భావము. అద్వైత జ్ఞానమెట్లు లభించును? "త్వత్ ప్రసాదాత్" అనగా:- శ్రీకృష్ణుని అనుగ్రహమువలన లభించును. ఇక కలికాలము నందిహలోకములోని మానవులైన మనకు గురువు గారి కరుణ, లేక అనుగ్రహము లభింపవలసియున్నది. గుర్వనుగ్రహము కొరకు గురు శుశ్రూష అత్యవసరము. "పరిప్రశ్నేనసేవయా" సేవ చేతను మరల మరల విషయము స్పష్టమగునంత వరకు ప్రశ్నించుట చేతను సమస్త సంశయములు ఛేదింపబడును. పరిపూర్ణ జ్ఞానము కలుగుటకై ప్రశ్నించు ప్రశ్న "పరిప్రశ్న" యని చెప్పబడును. గురువుగారి యందు దైవభావమున్నప్పుడు మాత్రమే! సాధకుని సంశయములన్నియును నివారింపబడును. గురువుగారి యందు మానవ మాత్రభావమున్నప్పుడు ఫలితము సున్నయగును.

అద్వైతము ఆనంద సాగరము వంటిది. దానియందు దుఃఖము లవలేశమైనను ఉండదు. ఒకవేళ ఏ కారణము చేతనైనను మనకు దుఃఖము కలిగినచో మనకు "అద్వైతసిద్ధి" కలుగలేదని గ్రహింపవలయును. సంచిత- ఆగామికర్మలు రహితమైనప్పుడు మాత్రమే అద్వైతసిద్ధి కలుగును అంతవరకు జనన-మరణ చక్రమునందు భ్రమింపక తప్పదు. కేవలము గుర్వనుగ్రహము వల్లనే సంచిత ఆగామికర్మలు రహితములగును. "ప్రారబ్ధకర్మ"ను మాత్రము ప్రతియొక్కరు

అనుభవింపకతప్పదు. ప్రారబ్ధకర్మ చేతనే! మనకీ శరీరము కలిగినది. "అద్వైతసిద్ధి" యనెడి సూర్యుడు ఉదయించినప్పుడు ప్రారబ్ధకర్మానుభవము కష్టముగా తోచదు. అది స్వప్నానుభవము వలె సులభసాధ్యమగును. "జీవన్ముక్తావస్థ- అద్వైతసిద్ధి" ఈ రెండున్నూ పర్యాయపదములు. జీవించియున్నప్పుడే! ముక్తిని బడయుట జీవన్ముక్తావస్థయనబడును. అద్వైతభావముతో జీవించినప్పుడు అద్వైతసిద్ధి కలుగును. ఈ రెండు భూమికలలోను దేహభావముండదు. అప్పుడు మనస్సులోని కోరికలన్నియు నశించును. ఈ కారణముచే మనోనాశమేర్పడును. మనోనాశమే! జ్ఞానసిద్ధి. మనోనాశనమే! జీవన్ముక్తావస్థ. ఇదియే "సో-హం భావము. అహంభావము నశించినప్పుడు "సో-హం భావము" కలుగును. అహం భావము ద్వైతభావముచే అలముకొనియుండును. నిరహంకారముచే "దేహమ"నెడి ఆవరణ తొలగిపోవును. అప్పుడు "సో-హం భావ" మేర్పడును. అద్వైతమునందు కేవలానందముండును. అద్వైతమే! పరమసత్యము. అద్వైతమే! పరమానందము. అద్వైతమే! పరంజ్యోతి. కావున మనమందరమున్నూ అహంకార-మమకారములను తొలగించుకొన్నవారమై, దేహభావమును దహింపజేసి, ద్వైత భావవిముఖులమై, సో-హం భావపరులమై, సత్పథగాములమై, అనన్యచిత్తులమై, నిస్సంశయభూమికచే శోభితులమై, బ్రహ్మ భావసంయుతులమైయుండవలయును, గంగానది తన దారిలోని ఆటంకముల నన్నింటిని తొలగించుకొని, ఆవుదూడ ఆతురతతో తన తల్లియగు ఆవును చేరుకొనునంత వరకు పరుగెత్తుచుండునట్లు చివరకు గంగాసాగరమును చేరుకొనునంతవరకు పరుగెత్తును. అట్లే మనము అద్వైతామృత సాగరమును చేరుకొనునంతవరకు అఖండమైన నిరంతర కృషియొనర్చి, మన జీవితలక్ష్యమును చేరుకొని తరించెదము గాక!

## 27. సాంఘిక సేవగొప్పదా? స్వాత్మ సేవగొప్పదా?

కొందఱు జనుల సమూహము "సంఘమ"ని చెప్పబడును. కొన్ని రాష్ట్రముల సమూహము దేశమని చెప్పబడును. ఇవి యన్నియును సంకుచితమైనవే కాని, విశ్వాత్మక భావమును కలిగియుండవు. మహాత్మాగాంధీగారు ఆత్మదృష్టి కలవారైయుండుటచే అనాత్మదృష్టిగల పాశ్చాత్యులను భారతదేశము నుండి పారద్రోలగలిగిరి. 26-1-2016వ తేదీన భారతదేశము యొక్క 66వ గణతంత్ర దినోత్సవము జరిగినది. కాని మహాత్మాగాంధీగారి సందేశమే కాకుండా, ప్రతి మహాత్ముని సందేశ సారమైనట్టి

ఆత్మ దృష్టిని మనము కలిగియున్నామా? అను విషయమును మనమందఱమున్నూ ఎవరికి వారే ఆలోచించుకొనవలసియున్నది. నేటి కాలములో ఆత్మదృష్టికి బదులుగా స్వార్థదృష్టి పెరిగిపోయినది. ఇది మనకే కాకుండా మన దేశమంతటికి గొప్ప అనర్థమును తెచ్చి పెట్టునను విషయమును మనము గ్రహింపజాలకున్నాము. ఐతే, ప్రస్తుతము మన కర్తవ్యమేమి? నేటి కాలములో సాంఘికసేవ స్వార్థసేవగా పరిణామము నొందుటచే, దానిని స్వాత్మసేవగా మార్చవలసియున్నది. ఇచ్చట "స్వాత్మ" అంటే జీవాత్మ అనుకొనరాదు. ఆత్మ నిశ్చయముగా స్వార్థపూరితమైయుండును. కావున "స్వాత్మ" యనగా పరమాత్మయని భావము. స్వార్థము లేనిదేదో, అదే పరమాత్మ. ఈ కారణము చేతనే ప్రతిరోజు సూర్యుడు మనకు పగలు ప్రకాశమునిచ్చుచున్నాడు. చంద్రుడు మనకు రాత్రియందు ప్రకాశమునిచ్చుచున్నాడు. అమావాస్యరోజు మనకు నక్షత్రములు ప్రకాశము నిచ్చుచున్నవి. వర్షములు కురిసి పంటలు పండుటతో మన పొట్టలు నిండుచున్నవి. నిస్స్వార్థమైన ఇట్టి సేవయే "స్వాత్మసేవ" యనబడును. స్వాత్మసేవ చేయువాడు విశ్వమంతటికి సేవ చేసినవాడగును. ఆత్మదృష్టి లేని సాంఘికసేవ కొంత కాలమునకు నిర్జీవముగా పరిణమించును. సంఘము విశ్వమునందు కేవలమొక భాగమై యుండుటయే! దీనికి గల కారణము. చక్రవర్తులకు చక్రవర్తియైనను అమరుడు కాజాలడు. అదే ప్రకారముగా విశ్వములోని ఎంతగొప్ప సంఘమైనను శాశ్వతముగ మనజాలదు.

"కలసి ఉంటే కలదు సుఖము" అనునొక సామెత కలదు. ఐతే కలిసి ఉండడమంటే ఏమిటి? కొందఱు సభ్యులు కలిసి ఒకే ఇంటిలో ఉండుట కలిసియుండుట కాదు. ఇంటిలోనున్న వారందఱిని ఆత్మదృష్టితో చూచుటయే! కలిసియుండుట అనుదాని కర్థము. ఒక గ్రామమునందున్న వారందఱును ఆత్మదృష్టిని కలిగియున్నప్పుడు ప్రపంచములోనున్న అన్ని గ్రామములలోని ప్రజలందఱికి వారు ఆదర్శ పురుషులగుదురు. అనాత్మ దృష్టిని తరిమివేయుటయే! ఆత్మదృష్టికి లక్ష్యము. "ఈ దేహము నేను. ఈ మనస్సు నేను. ఈ బుద్ధి నేను" అనుకొనుటయే! అనాత్మదృష్టి. ఆత్మదృష్టిచే "నీ బుద్ధి వేఱు – నా బుద్ధి వేఱు" అను భావము మటుమాయమగును. కారణమేమి? శరీరము, మనస్సు, బుద్ధి – ఇవియన్నియును ఆత్మ యొక్క అధీనమునందుండి పనిచేయుచున్నవి. ఆత్మకు భిన్నమైనదే అనాత్మ. అనాత్మ నశించినప్పుడు ఆత్మ శేషించును. ఆత్మ సూర్యప్రకాశముచే అనాత్మ అంధకారము తొలగును. స్వాత్మసేవ ఆత్మసాక్షాత్కారమునకు కారణమగును. అందఱూ

ఆత్మసాక్షాత్కారమునొందినచో, ఈ ప్రపంచమేమగును? అను అనుమానము కలుగుటకవకాశమున్నది. ఆత్మసాక్షాత్కారము ప్రపంచమునకు భిన్నమైనది కాదు, సరికదా! దానియందు సృష్టి సర్వస్వము మిళితమైయుండును. కావున సృష్టియందొడిదొడుకులుండవు. ఈశ్వరసృష్టి ఈశ్వరసంకల్పానుసారముగా జరుగుచుండును. కాని జీవసృష్టియే! భేదభావమునకు కారణమగును. జీవసృష్టిచే అనాత్మ భావము విజృంభించును. జీవసృష్టిచే స్వార్థపరత్వము పెంపొందును. జీవసృష్టి నశించినప్పుడు మాత్రమే! అనాత్మ భావము నశించును. అప్పుడు ఆత్మదృష్టి సృష్టింపబడును. ఆత్మ సాక్షాత్కారమే! స్వాత్మసేవకు లక్ష్యము. కావున మనమందఱమున్నూ స్వాత్మసేవాపరులమై శోభిల్లుదుము గాక! అజ్ఞానము చేతనే భేదభావము కలుగును. భేదభావము నశించుటయే! స్వాత్మసేవకు లక్ష్యము. నేను "నేను–నాది" అన్నప్పుడు ఇతరులు కూడా "నేను–నాది" అనుటకవకాశమేర్పడును. అట్లు కాకుండా "నీవు–నీదే" యనుచు భగవచ్ఛరణాగతి నొందినప్పుడు స్వాత్మసేవా ఫలితము మనకు లభించును.

"స్వాత్మసేవ" చేయువారందఱును దివ్యజీవనమును గడుపుచుందురు. దివ్యజీవనయాపనము ప్రతి కుటుంబమునకు, ప్రతి గ్రామమునకు, ప్రతి పట్టణమునకు, దేశమునకు, ప్రతి ఖండమునకు సంబంధించినదైయున్నది. భూలోకములోని ప్రతి వ్యక్తియు దివ్యజీవనమును గడిపినప్పుడు భూతలము స్వర్గలోకముగా మారిపోవును. ఐతే, స్వర్గలోకమునందున్నూ రాగ–ద్వేషములుండును. ఈ రాగ–ద్వేషములు మరల ఆనాత్మదృష్టికి కారణమగును. అనాత్మదృష్టి అజ్ఞానమునకు కారణమగును. ఈ కారణముచే మర్త్యలోకము, స్వర్గలోకము, పాతాళలోకము ఇత్యాది భేదములు కూడా రహితము కావలసియుండును. అది స్వాత్మసేవకు ఫలితము. స్వాత్మసేవచే ఆత్మానందము లభించును. ఆత్మానందము బ్రహ్మానందమునకు దారితీయును. సాంఘికసేవ స్వల్పసుఖము నొసంగును. స్వాత్మసేవ అనంతానందము నొసంగును. స్వాత్మసేవకు మించిన మరొక సేవ లేదు. "నేనెవడను?" తెలిసికొన్నవాడు స్వాత్మసేవను చేయగలుగును. శ్రీ రమణమహర్షిని ఒక వ్యక్తి ఇట్లు ప్రశ్నించెను. "మీరీ విరూపాక్షగుహలో తపస్సు చేయుటకు బదులుగా బయటకు వచ్చి సాంఘికసేవ చేయుట శ్రేష్ఠముగదా!" దానికి శ్రీ రమణమహర్షి వారిట్లు సమాధానమొసంగిరి. "నేను సాంఘికసేవ చేయుట లేదని మీరెట్లు తలంచుచున్నారు? ప్రపంచములో సాంఘికసేవ చేయుచున్న వారందఱికంటె వెయ్యి రెట్లు నేను సాంఘికసేవ చేయుచున్నాను. ఆ విషయము మీకు "స్వాత్మసేవ" అనగా ఏమియో తెలిసికొన్నచో

తెలియును". "నేనెవరో" తెలుసుకొనుటయే "స్వాత్మసేవ"కు ఫలితము. స్వాత్మసేవయందు సర్వాత్మభావము ఇమిడియుండును. దానియందు సంకుచితభావమునకే మాత్రము తావు లేదు. శ్రీ రామకృష్ణ పరమహంస వారి తపఃప్రభావము చేత, లేక స్వాత్మసేవ చేతనే శ్రీ వివేకానందస్వామి వారు అనాత్మ వాదులైన పాశ్చాత్యులకు స్వాత్మసేవాప్రభావ సందేశము నొసంగగలిగిరి. కావున మనమందఱమున్నూ సాంఘికసేవ కంటె స్వాత్మసేవయే! గొప్పదను విషయమును గుర్తెఱింగినవారమై, తద్వారా ఆత్మసాక్షాత్కారము నొందినవారమై, దైవానుగ్రహ సంభరిత హృదయులమై, బ్రహ్మానందానుభవమునొందిన వారమై మానవజన్మను సార్థకమొనర్చు కొందుము గాక! స్వాత్మసేవాప్రభావమును దిగ్దిగాంతరాళములలో ప్రకాశింపజేసెదము గాక!

## 28. సత్యవ్రతము

ఆధ్యాత్మిక జీవనము ననుష్ఠింపదలంచిన వారందఱున్నూ అవశ్యముగా సత్యవ్రతమును కలిగియుండవలయును. సత్యవ్రతమును కలిగియుండుటయనగా:- సత్యమును విడువకుండుట. ఇచ్చట సత్యమనగానేమి? అను ప్రశ్న ఉదయించును. అన్ని దేశములలోను, అన్ని కాలములలోను అఖండముగా ఏది విరాజమానమైయున్నదో, అదియే! సత్యము. ఈ కారణముచే మనము సత్యమును విడిచియుండుటకు అవకాశమే లేదు. ఐతే, సత్యవ్రతమనగానేమి? సర్వత్ర సర్వవేళలలో అఖండముగా విరాజమానమైయున్న ఈ సత్యమును మఱువకుండా ఉండుటమే సత్యవ్రతము. మన మనస్సు సర్వత్ర విరాజమానమైయున్న సత్యమును మఱచునట్లు చేయుచుండును. అది ఎట్లు? ప్రాపంచిక విషయములలో మన మనస్సు మునిగియున్నప్పుడు సత్యవస్తువు మఱుగున పడిపోవును. కావున మంత్రదండముచే ఈ మనోమర్కటమును అదలింపవలసియుండును. ఈ మనోమర్కటమునకు సత్యమును కప్పిపుచ్చునంతటి శక్తి ఎట్లు వచ్చినది? దీనికి కారణము మాయ. దేనికి నిజమైన ఉనికి లేదో, అది మాయ యని చెప్పబడును. అంతేకాదు - నిజముగా ఉనికియున్న దానిని కప్పిపుచ్చునదే! మాయ. ఈ మాయ ఎట్లు తొలగిపోవుననగా:- "బ్రహ్మార్పణమ్" మన మనస్సును బ్రహ్మమున కర్పించినప్పుడు మాయ తొలగిపోవును. "బ్రహ్మాహవిః" మనము భుజించు ప్రతిపదార్థమును భగవంతునికర్పించినప్పుడు మాయ తొలగిపోవును. "బ్రహ్మాగ్నౌ" బ్రహ్మమనెడి అగ్నియందు మనలను ఆహుతియొనర్ప వలయును. ఇది "ఆత్మహత్య" అనుకొనరాదు. మన ఆత్మను బ్రహ్మమనెడి అగ్నియందు

రగుల్కొలుప జేసినప్పుడు మాయ నిశ్శేషముగా తొలగిపోవును. ఇది "బ్రహ్మణాహుతమ్" అను పదమున కర్థము. "బ్రహ్మైవతేన గంతవ్యమ్" ఈ రకమైన కర్మయోగముననుష్ఠించిన మనుజుడు బ్రహ్మమును చేఱుకొనును. ఇది "బ్రహ్మకర్మ"యనెడి సమాధిగా గీతలో చెప్పబడినది.

జన్మజన్మలనుండి మనము అసత్యజీవితమును గడుపుచుండుటయే గాక, ఇదియే! సత్యజీవితమని భ్రమించుచున్నాము. ఈ భ్రమ తొలగిపోవుటకై శ్రీకులశేఖరాళ్వారుగారు మనకొక ఉత్తమమైన మార్గమును నిర్దేశించియున్నారు. వారు తమ శరీరములోని అవయవములన్నింటిని సంబోధించుచు ఇట్లు పలికిరి. "జిహ్వే! కీర్తవ కేశవమ్" ఓ నాలుకా! కేశవుని కీర్తన చేయుము. "చేతో భజ శ్రీధరమ్" ఓ చిత్తమా! ఆ శ్రీధరుని భజన చేయుము. "పాణి ద్వంద్వ సమర్చయ" ఓ రెండు చేతులారా! అచ్యుతుని అర్చన చేయుడు. "అచ్యుత కథాం శ్రోత్ర ద్వయత్వం శ్రుణు" ఓ రెండు చెవులారా! అచ్యుతుని కథలను శ్రవణము చేయుడు. "లోకం లోకయ లోచనద్వయ" ఓ రెండు నేత్రములారా! సర్వమును ప్రకాశింపజేయునట్టి ఆ ప్రభువును దర్శించుడు. "హరేర్గచ్ఛాంఘ్రియుగ్మాలయమ్" ఓ రెండు కాళ్ళూ! మీరు ఆ శ్రీహరి యొక్క ఆలయమునకు వెళ్ళుడు. "జిఘ్రఘ్రాణ ముకుందపాద తులసీమ్" ఓ ముక్కూ! నీవు ముకుందుని పాదముల చెంతయున్న తులసిని వాసన చూడుము. "మూర్ధన్న మాధోక్షజమ్" ఓ శిరస్సా! ఆ అధోక్షజునికి నమస్కరించుము. శ్రీ కులశేఖరాళ్వారు గారు సత్యమైన ఆ నిత్యవస్తువును గ్రహించిన వారగుటచే తన శరీరములోని అవయవములన్నింటిని పై విధముగా ఆ విష్ణుమూర్తి కర్పించి తమ జన్మను సార్థకముగావించుకొనిరి. ఇదియే! సత్యవ్రతమని చెప్పబడును. అది భక్తి యోగముయొక్క పరాకాష్ఠ. ఇక జ్ఞానయోగమెట్టిదనగా:- ఆ పరమాత్మ ఈ శరీరమునందే విరాజమానుడైయున్నాడు. కావుననే "దేహో దేవాలయః ప్రోక్తః" అని చెప్పబడినది. అనగా:- ఈ దేహమే! దేవాలయము. "జీవో దేవః సనాతనః" అనగా:- ఈ దేహమనెడి దేవాలయమునందున్న జీవుడే! సనాతనమైన దేవుడు. "త్యజేదజ్ఞాననిర్మాల్యమ్" అనగా:- ఈ దేవాలయములో ప్రతి రోజు, ప్రతిగంట, ప్రతి నిముషము, ప్రతి సెకండులోను అజ్ఞానమనెడి నిర్మాల్యమును తొలగించుచుండవలయును. "సో-హంభావేన పూజయేత్" అనగా:- "సో-హమ్" భావముతో పూజ చేయుచుండవలయును. "సో-హమ్" అంటే అతడే నేను అని అర్థము. అనగా:- ఆ బ్రహ్మమే! నేను అని అర్థము. ఇది ఎట్లుసాధ్యమగును? భగవంతుడు, లేక బ్రహ్మము సర్వాంతర్యామి అని తెలుసుకున్నప్పుడు సాధ్యమగును.

సర్వవ్యాపకుడైయున్న భగవంతుడు నాలో లేడని చెప్పుటకు వీలు లేదుకదా! ఐతే, అజ్ఞానకారణముచే మనమాతనిని తెలుసుకొనజాలకున్నాము. ఏది అజ్ఞానము? "భగవంతుడు సర్వాంతర్యామి కాడు" అనుకొనుటయే! అజ్ఞానము. ఒక బంతిలో గాలిని నింపుటకై మొదట ఆ బంతిని శూన్యమొనర్పవలసియుండును. అదే విధముగా జీవుని యందు దేవుని నింపుటకై జీవ భావమును ఖాళీ చేయవలసియుండును. అహం భావమును అణచివేయవలసియుండును. మమకారమును మసి చేయవలసియుండును. జన్మజన్మాంతరముల నుండి జీవ భావమును పోషించుకొని వచ్చుచున్న మనకీ కార్యము దుస్సాధ్యముగా గోచరింపక మానదు, ఇట్టి తరుణము నందు మనకు గురుదేవుడు ఆవశ్యకమగును. గురుదేవుడు నిర్దేశించిన ప్రకారముగా మనము మన జీవితయాత్రను సాగింతుమేని, నిశ్చయముగా మనము మన గమ్యస్థానమును చేఉకొనగలుగుదుము. ఒక వేళ గురుదేవుడు చెప్పిన దానికి వ్యతిరేకముగా ప్రవర్తించెదమేని, జీవితము అస్తవ్యస్తము కాకతప్పదు. ఐతే గురుదేవుని ఆదేశమును ప్రేమతోను, శ్రద్ధతోను, విశ్వాసముతోను పాటించుచుండవలయును. అప్పుడు మన హృదయము సత్యామృతముతో నింపబడును. మన నేత్రములు సత్యప్రకాశమును విరజిమ్ముచుండును. మన జిహ్వా హరిస్మరణమును విడనాడకుండును. ఆధ్యాత్మిక సాధకుడు జీవితమంతయు ఒకేయొక కార్యము నొనర్పవలసియుండును. అది ఏమి? ఆ దేహమనెడి దేవాలయము నుండి అజ్ఞామనెడి నిర్మాల్యమును తొలగించుకొనుచుండుట. మనమీ కార్యము నొనర్చినప్పుడు మన జీవిత గమ్యము అరచేతిలోని అరటిపండు వంటిదగును. మనము మన జీవితగమ్యమును చేరుకొననంతవరకు అజ్ఞానమనెడి ఆవరణ, లేక నిర్మాల్యము మనల నంటిపెట్టుకొనియేయుండును. ఇట్టి రకమైన సత్యవ్రతము ననుష్ఠించు మనుజుడు పూర్ణకాముడై, పూర్ణతృప్తుడై, పూర్ణానందమును బడయుటతో తన జీవిత లక్ష్యమును సాధించి తన జీవితమును సార్థకమొనర్చుకొన్నవాడగును.

## 29. స్వంత ఇల్లు

కేవలము ఆధ్యాత్మిక సాధకులే కాకుండా ఈ ప్రపంచమునందు జన్మించిన ప్రతి మనుజుడున్నూ "నా స్వంత ఇల్లు ఏది?" అను విషయమును గూర్చి నిరంతరము విచారణ చేయుచుండవలయును. మనమీ పుడమిపై పుట్టుటకు పూర్వము 9 మాసముల వరకు మన మాతృగర్భమునే మన స్వంత ఇల్లుగా భావించియున్నాము. జన్మించిన

తర్వాత నాలుగు గోడల మధ్యనున్న స్థలమునే మన స్వంత ఇల్లుగా భావించి యున్నాము. మరొక ఇంటి నుండి వచ్చిన యువతిని పెండ్లాడిన తర్వాత ఆమెను అర్ధాంగినిగా భావించి, మన స్వంత ఇంటిని ఆ స్త్రీకి అప్పగించుట జరిగెను. తదనంతరము సంతానము కలిగిన పిమ్మట పుత్రులాగృహమును తమ స్వంత ఇల్లుగా భావింపసాగిరి. తల్లిదండ్రులు దేహమును త్యజించిన తర్వాత పుత్రులు పూర్తిగా ఆ గృహమును తమదనుకొనిరి. అన్నదమ్ములా గృహమును పంచుకొనుటలో తగవులాడుల ప్రారంభించిరి. అందువల్ల ఆ గృహమును మరియొకరికమ్మి అన్నదమ్ములు సొమ్మును పంచుకొనుటకు అంగీకరించిరి. ఈ ప్రకారముగా ఆ గృహము ఇతరుల వశమయ్యెను. "స్వంత ఇల్లు" నామరూపములు లేకుండా నశించెను. కావున ఏ గృహమునైనను ఇది "నా స్వంత ఇల్లు" అనుకొనుట పొరపాటు. నిజమునకు మన శరీరమే మనకు స్వంత ఇల్లు. కాని ఒకరోజు ఈ ఇంటికి కూడా ప్రమాదము తప్పదు. యమరాజు ఏ సమయములో, ఎచ్చట, ఏ క్షణములో ఈ ఇంటిని కబళించునో ఎవరికిన్నీ తెలియదు. ఈ కారణముచే దీర్ఘముగా విచారించినచో ఈ దేహమును కూడా ఇది నా "స్వంత ఇల్లు" అనుకొనుట పొసగదు. ఐతే మన స్వంత ఇల్లు ఏది? ఈ దేహమునందున్న మనస్సుగాని, బుద్ధిగాని చలించు స్వభావమును కలిగియున్నవి. కావున ప్రాణ ప్రయాణ సమయములో ఇవియున్నూ ప్రయాణము చేయును. ఈ కారణముచే దేహము, మనస్సు, బుద్ధి, అహంకారము మున్నగు వాటికి మూలమైయున్నట్టి "ఆత్మ"యే! మన "స్వంత ఇల్లు" అని తెలియుచున్నది. దీనికి చలనము లేదు. ఎవరున్నూ దీనిని దొంగిలింపలేరు.

ఎవరున్నూ ఈ ఇంటిని నశింపచేయజాలరు. ఈ ఇంటిని శస్త్రములు ఛేదింప చేయుజాలవు. అగ్ని దహింపజాలదు. జలము తడుపజాలదు. గాలి ఎండింపచేయజాలదు. ఇదియే! శాశ్వతమైన గృహము. అంతేకాదు. ఈ ఇల్లు సర్వవ్యాపకమైనది. అందువల్ల ఇది అందరిల్లు. ఈ ఇంటిని పంచుకొనుటకై అన్నదమ్ముల తగవులాటగాని, అక్క చెల్లెండ్రు తగవులాటగాని ఉండదు. ఇది అందటికి అందుబాటులోనున్న గృహము. ఈ గృహము ప్రపంచములోని ప్రతి ప్రాణికి చెందియున్నది. అందువల్ల ఏలాటి తగవులాటకు తావులేదు. ఈ ఇంటిలో శయనించిన నరుడు రకరకములగు స్వప్నములను గాంచుచుండును. ఆ స్వప్నములో సూర్యచంద్ర నక్షత్రాదులు కానబడును. అసంఖ్యాకములగు నదులు, పర్వతములు, సముద్రములు, కానబడును. అసంఖ్యాకములగు ఆవులు, ఏనుగులు, గుఱ్ఱములు, ఒంటెలు, గాడిదలు, మున్నగు పశువులు కానబడును. సింహములు, పులులవంటి క్రూరమృగములు

కానబడును. తేళ్ళు, పాములు వంటి విషపూరితములగు ప్రాణులు కానబడును. ఈగలు, దోమలు, చీమలు, రకరకములగు పక్షులు కానబడును. స్త్రీలు– పురుషులు, రాజులు, రాణులు, బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, సన్యాసులు, సాధువులు, అసాధువులు, ఋషులు, మునులు మున్నగు వారున్నూ కానబడుదురు. రకరకములగు చెట్లు, చేమలు, పాడిపంటలు, ఎడారులున్నూ కానబడును. వెయ్యేల? ఈ ప్రపంచములోని సమస్తమును మనమీ స్వప్నములో చూడజాలుదుము. ఈ కారణముచే మనమీ జగత్తును స్వప్న జగత్తని చెప్పుదుము. ఐతే ఇవన్నీ నశించినను మన "స్వంత ఇంటి"కి నాశము లేదు. ఐనను దీనిని జడమైనదిగా భావింపరాదు సుమా! ఈ ఇంటిని సచ్చిదానంద స్వరూపమని చెప్పవచ్చును. ఈ ఇంటికి కన్నము వేయుటకై చోరులెవ్వరునురారు. ఈ ఇల్లు ఇటుకలు, రాళ్ళు, మట్టి, సున్నము, కలప, సిమెంటు ఇత్యాదులతో నిర్మింపబడినది కాకుండుటయే! దీనికి కారణము. ఈ గృహమునకు యజమాని బ్రహ్మము. అనగా:– నేనే సుమా!

ఈ ఇంటిలో నేనున్నాను అనుటకంటే "ఈ ఇల్లే నేను" అనుట ఉచితమగును. ఈ ఇల్లు జడమైనది కాదు అను విషయము మఱొక పర్యాయము నుడువబడుచున్నది. ఈ గృహమునందు కేవలము ఆనందమే తాండవమాడుచుండును. ఈ గృహము నందన్యులు లేరు. అందువల్ల రాగద్వేషముల కవకాశము లేదు. ఈ ఇల్లు మన స్వాధీనమునందున్నదని చెప్పుటకు వీలు లేదు. మనమీ ఇంటికి స్వాధీనులమై యున్నామనియున్నూ చెప్పుటకు వీలులేదు. ఈ ఇంటిలో "నేను–నాది" అను వస్తువు లేదు. ఈ గృహమునందు "సర్వం బ్రహ్మమయం రేరే–సర్వం బ్రహ్మమయమ్" అనెడి సుమధురమైన గానము నిరంతరము వినబడుచుండును. ఈ గృహము "ఏకో–హం బహుస్యామ్" అను ఉపనిషద్వాక్యమును ఎల్లప్పుడు నినదించు చుండును. ఒకే గృహము మాయను సహాయముగా గొని, అనేక గృహములుగా పరిణమించినదని దీని భావము. కావున ఈ ఇంటియందు సంభవించినట్టివి, సంభవించుచున్నట్టివి మఱియు సంభవింపబోవునట్టి వన్నియును స్వప్నములే! ఈ గృహమును బ్రహ్మదేవుడు దర్శించి, సృష్టికార్యము నొనర్చును. సృష్టింపబడిన సమస్తమును విష్ణుదేవుడు పోషించుచుండును. ఇక పోషింపబడినవాటినన్నింటిని నశింపజేయుట శివుడు, లేక రుద్రుని కార్యము. ఇదంతా చిన్నపిల్లలు ఇసుకతో ఇల్లు కట్టుకొని దానిలో వంటచేసి – భుజించి, మరల ఆ ఇంటిని కూలద్రోయుటవంటిది. ఈ కారణముచే సృష్టి–స్థితి–లయములచే ఆత్మదేవుడు క్షుభితుడు కాడు. ఆత్మదేవుడు అచంచలుడై, నిశ్చలుడై,

ప్రశాంతమనస్కుడైయుండును. ఆత్మదేవుడే! నేను. అదే నా "స్వంత గృహము". ఈ గృహమునకు ప్రళయకాలము నందున్నూ నాశము లేదు. ఈ ఆత్మదేవునికి సత్యము కోటగోడ వంటిది. ఆత్మదేవుడే! చైతన్యము. చైతన్యమే! ఆత్మదేవుడు. ఆత్మదేవుడే! పరమానందము. పరమానందమే! ఆత్మదేవుడు. ఈ ఆత్మదేవుడే నా "స్వంత ఇల్లు". దీనిని గురుకృపచే చేరుకొని మనమందఱమున్నూ ఆత్మానంద సాగరము, లేక పరమానంద సాగరమునందు మునకలిడుదుము గాక!

## 30. నూరేండ్లు నిండుట అనగానేమి?

"నూరేండ్లు నిండుట"యను శబ్ద సమూహమునకు రకరకములగు మనుజులు రకరకములగు అర్థములనొసంగుచుందురు. కొందఱు నూరేండ్లు నిండుట మరణమును సూచించునని పలుకుదురు. మరికొందఱు తమకు వందనమునొనర్చిన వారిని "నూరేండ్లు నిండును గాక!" యని ఆశీర్వదింతురు. ఇక మాయాతీతులైన మహాత్ములు, మహానుభావులు "నీవు పూర్ణత్వమును బడయుదువు గాక!"యని తమ శిష్యులనాశీర్వదింతురు. పై మూడు భావనలలో ఉత్తమమైన మఱియు శ్రేష్ఠమైన భావమేది? శ్రేష్ఠమైన ఫలితమునొసంగునదేదో, అదియే! శ్రేష్ఠమైన భావము. కొందఱి అభిప్రాయము ననుసరించి నూరేండ్లు నిండుట మరణమును సూచించును. కాని ఇది సరియైన భావము కాదు. కారణమేమి? మరణము ఈ దేహమునకు మాత్రమే! సంబంధించినట్టిది. మరణించిన మాత్రముచే జీవుడు మోక్షమునొందజాలడు. అహంకారము నిశ్శేషముగా నాశమునొందినప్పుడు మాత్రమే! జీవుడు మోక్షమునొందును. మనయందు జన్మజన్మాంతరములలో పేరుకొనియున్న సంస్కారములన్నియును నశింపనంతవరకు అహంకారము నశింపదు. ఇక, నూరేండ్లు నిండుట అహంకార నాశమును మాత్రమే! సూచించును. అనగా:- జన్మజన్మాంతరములలో మనమార్జించినట్టి దుష్ట సంస్కారములు గాని, శిష్టసంస్కారములుగాని సమస్తము నశించుటయే! నూరేండ్లు నిండుటకర్థము. అహంకారము పూర్తిగా నశించినప్పుడు మనము "అహంబ్రహ్మాస్మి" యనెడి ఘంటానాదమును వీనులవిందుగా శ్రవణమొనర్పగలుగుదుము. ఈ ఘంటానాదమును శ్రవణమొనర్చుటకు మరియొక పద్ధతి ఏమనగా:- అహంకారముతో ఈ విశ్వమంతటిని నింపివేయవలయును. సూచ్యగ్రభాగమైనను సందులేకుండా నింపబడిన అహంకారము బ్రహ్మమే యగును. ః

ఇక తమకు వందనమొనర్చిన వారికి "నీకు నూరేండ్లు నిండును గాక!"యని ఆశీర్వదించుటయున్నూ లోపభూయిష్టమైయున్నది. కారణమేమి? వారి ఈ యాశీర్వాదము కూడా శరీరమునకు సంబంధించినదైయున్నది. ఈ దేహమునకు నూరేండ్లు నిండినంత మాత్రముచే మోక్షము లభించుననుకొనుట వెఱ్ఱితనము. మఱియు, తెలివి తక్కువ తనము. ఎలుకయై ఎన్ని సంవత్సరములు జీవించినను ప్రయోజనము లేదు. కాని చిలుకయై కొన్ని సంవత్సరములు జీవించినను జన్మసార్థకమగును. మనుజుడీ పృథ్వియందు తన జన్మను సార్థకమొనర్చుకొనుటకే జన్మించియున్నాడు. ఐతే జన్మను సార్థకమొనర్చుకొనుటెట్లు? మనమీ భూమిపై అర్థవంతముగా జీవించినప్పుడు మన జన్మ సార్థకమగును. అర్థవంతముగా జీవించుటెట్లు? జీవిత పరమార్థమును తెలుసుకొన్నప్పుడు మనము అర్థవంతముగా జీవించిన వారమగుదుము. జీవిత పరమార్థమనగానేమి? మనమీ ప్రపంచమునందు జన్మించుటకు గల కారణమేమి? యను ప్రశ్నకు సమాధానమును పరిశోధించుటయే! జీవిత పరమార్థము. మనమెచ్చటి నుండి ఈ ప్రపంచమునకేతెంచితిమో, మరల అచ్చటికేగి పరమశాంతిని మఱియు పరమానందము ననుభవించుటయే! జీవిత పరమార్థము. ఒక పక్షి దినమంతయు ఆహారము కొరకై తిరిగి, తిరిగి మరల తన గూడును చేఱుకొని విశ్రమించును. అదే విధముగా నిజమైన సుఖము, నిజమైన ఆనందము, నిజమైన శాంతి కొరకై మనమసంఖ్యాక జన్మ పరంపరలలో పరిభ్రమించి, తుట్టతుదకు దేవుని శరణు పొందుదుము. అప్పుడు దేవుడు తన కారుణ్యామృతమును మనపై చిలికించును. అప్పుడు మాత్రమే! మన జీవితము సార్థకమగును. అప్పుడే మనకు నిజముగా నూరేండ్లు నిండును. ఇదియే! మన జీవితపరమార్థము. ఈ జీవిత పరమార్థమును సాధించుటకై ముముక్షుత్వముతో పాటు ఇహాముత్ర ఫలభోగ విరాగము అత్యంత ఆవశ్యకమైయుండును.

ఇక మహాత్ములు, మహర్షులు, మహానుభావులు తమ శిష్యుల నాశీర్వదించునట్టి "నీవు పూర్ణత్వమును బడయుదువు గాక!" యను వాక్యమున్నూ "నీకు నూరేండ్లు నిండును గాక!" యను వాక్యమునకు సరితూగును. కాని మొదటి రెండు రకములైన "నీకు నూరేండ్లు నిండును గాక!" యను వాక్యమునకున్నూ, మహాత్ముల వాక్యమునకున్నూ హస్తిమశకాంతర భేదము కలదు. ఇచ్చట నూరేండ్లు నిండుట పూర్ణ బ్రహ్మానుభవమును సూచించును. మనము నూరును అంకెలలో వ్రాయునప్పుడు 100 అని వ్రాయుదుము. దీనిలోని ఒకటి (1)పూర్ణ బ్రహ్మమును సూచించును.

దానికి ప్రక్కనున్న సున్న (0) ప్రపంచమును సూచించును. అనగా:- ఈ ప్రపంచమంతయు శూన్యమని భావము. అనగా:- ఒకటి యనెడి పూర్ణ బ్రహ్మములేకున్నచో ఈ ప్రపంచమునకు విలువయుండదు. ఇక రెండవ సున్న "నేను" కూడా శూన్యమగును కదా! ఏలననగా:- నేను ప్రపంచములోనే ఉన్నాను. ప్రపంచమునకు బాహ్యముగా నేను లేను. అందువల్ల ప్రపంచము శూన్యమైనప్పుడు అప్రయత్నముగా "నేను" కూడా శూన్యుడనేయగుదును. ఈ కారణముచే దేవుడొక్కడే! ఉనికిని కలిగియున్నాడు. ప్రపంచమునకుగాని, జీవునికి గాని ఉనికిలేదు. ఇవి స్వప్నములోని పదార్థముల వంటివి. ప్రపంచము, ప్రపంచములోని పదార్థములు మన కన్నులకు కానబడుచున్నవి కదా! యన్నచో, దేవుని ఉనికి వల్లనే అవి మనకు కానబడుచున్నవి. దేవుని తీసివేసినచో. అనగా:- నూరులోని ఒకటిని తీసివేసినచో రెండు సున్నాలకు విలువయుండునా? ఉండదు. అందువల్ల నూరేండ్లు నిండుటయనగా:- ఆత్మసాక్షాత్కారము, దైవ సాక్షాత్కారము, లేక బ్రహ్మ సాక్షాత్కారమని అర్థమొనర్చు కొనవలయును. బ్రహ్మ సాక్షాత్కారమనగా:- శాశ్వతమైన బ్రహ్మానందానుభవమునొందుట. కావున మనమందఱమున్నూ బ్రహ్మానుభవము నొంది "నూరేండ్లు నిండిన వారి" గా శోభిల్లుదుము గాక!

## 31. జీవన్మృతుడు- జీవన్ముక్తుడు

జీవన్మృతుడనగా:- బ్రతికియుండియు చచ్చినవాడని అర్థము. ఇక జీవన్ముక్తుడనగా:- చచ్చియుండియు బ్రతికిన వాడని అర్థము. జీవన్ముక్త దశనొందనంత వరకు మానవుడు జీవన్మృతుడనియే! చెప్పబడును. అది ఎట్లు? మన దేహము మరణ శీలమైయున్నది. ఇది జడ పదార్థము. ఈ జడ పదార్థమును ఏది కదలించుచున్నదో అదియే! జీవన శక్తి, ప్రాణ శక్తి, లేక ఆత్మ శక్తియని చెప్పబడును. ఆత్మ శక్తిని గుర్తెఱుంగని మనుజుడు జీవన్మృతుడుగానే పరిగణింపబడును. ఆత్మ బుద్ధికి శక్తినొసంగును. బుద్ధి మనస్సుకు శక్తి నొసంగును. మనస్సు శరీరమునకు శక్తినొసంగును. ఆత్మశక్తి లేకున్నచో మన బుద్ధి గాని, మన మనస్సు గాని, మన శరీరముగాని పనిచేయవు. అవి పనిచేయనప్పటి స్థితి మరణమని చెప్పబడును. అవి పని చేసినప్పుడు జీవితమని చెప్పబడును. మన శారీరిక బలమును, బుద్ధి బలమును సద్వినియోగమొనర్చినప్పుడది జీవన్ముక్తికి దారి తీయును. దుర్వినియోగమొనర్చినప్పుడది జీవన్మృతికి దారి తీయును. నిజమునకు ఆత్మ ఈ శరీరమనెడి శవమును మోసికొని

వెళ్ళుచున్నది. ఎచ్చటికి మోసికొని వెళ్ళుచున్నది? "బుద్ధిః కర్మానుసారిణీ" అనగా:- మన బుద్ధి మన కర్మననుసరించి పనిచేయుచుండును. మన బుద్ధి మన శరీరముద్వారా మన మొనర్చిన కర్మ ఫలితముల ననుభవింపజేయును. కావున ఆయా కర్మలు ఏఏ స్థలములలో, ఏఏ సమయములలో, ఎట్లు అనుభవింపవలసియున్నదో, తదనుగుణముగా ఈ శరీరమును ఆత్మ మోసికొని వెళ్ళును. ఆత్మ మోసుకొనివెళు ్ళనని చెప్పుట కూడా సరికాదు. ఆత్మ సహాయముతో బుద్ధి మఱియు మనస్సనెడి రెండు ఎద్దులు ఈ శరీరమనెడి వాహనమును మోసుకొని వెళ్ళును. కఠోపనిషత్తులోని, ప్రథమాధ్యాయములోని రెండవ వల్లీలోని మూడవశ్లోకమిట్లు చెప్పుచున్నది. "ఆత్మయే రధికుడు. శరీరమే రథము. బుద్ధియే సారధి. మనస్సే పగ్గము'' బుద్ధి అనెడి సారథి మనస్సనెడి పగ్గముచే దేహమనెడి రథమును ఇంద్రియములనెడి గుఱ్ఱములచే ఎటువైపు త్రిప్పునో, అది అటువైపే వెళ్ళును. ఒకవేళ ప్రేయోమార్గము వైపు త్రిప్పినచో ఆత్మ ప్రేత, భూత. పిశాచములకు చిక్కి నానా విధములగు బాధలననుభవింపవలసివచ్చును. కావున వివేకవంతుడు శ్రేయోమార్గమునే అనుసరించును.

శ్రేయోమార్గమువైపు త్రిప్పినచో జీవాత్మ తన జీవితలక్ష్యమును చేరుకొని సుఖించును. మనము శ్రేయోమార్గమునందు ప్రయాణము చేయుచున్నప్పుడు అది జీవన్ముక్తికి దారితీయును. ఇక ప్రేయోమార్గము నందు ప్రయాణము చేయుచున్నప్పుడది జీవన్మరణమునకు దారితీయును. ఏ ప్రాణిగాని, ఏ జీవుడుగాని, ఏ మానవుడుగాని మరణించుటకిష్టపడడు. కారణమేమి? మరణము మనకు సహజమైనది కాదు. జీవనమే మనకు సహజమైనది. ఒక వ్యక్తి మరణించినప్పుడు బంధుబాంధవులందఱును దుఃఖింతురు. అదే సమయమునందు తమకు కూడా మరణమున్నదను విషయమును మఱచిపోవుదురు. ఒకవేళ జ్ఞప్తియందున్నను స్మశానము నుండి గృహమును చేరుకొను వరకు మాత్రమే! జ్ఞప్తియందుండును. తరువాత ప్రేయోమార్గమునందే తమ జీవితమును కొనసాగించుచుందురు. ఇదే! మనయందున్న దోషము. మనము శ్రేయోమార్గగాముల మగుటకై మన మరణమును గూర్చి ఏ కాలమునందున్నూ మరువరాదు. ఈ మరణము కేవలము దేహమునకు మాత్రమే సంభవించునను విషయమును మరువరాదు. ఆత్మ అమరమైనదను విషయమును కూడా మరువరాదు. ఆత్మజ్ఞానము నార్జించుటయే! శ్రేయో మార్గమునకు లక్ష్యమైయున్నది. మన ప్రస్తుత దేహము శవముగా మారినప్పుడు ఈ దేహమనెడి రథము శిధిలమైనదని భావము. కావున మన బుద్ధియనెడి సారథికి మరొక రథము ఆవశ్యకమగును. మరొక రథమునధిరోహించుటకై జీవుడు పునర్జన్మ నొందును. పూర్వజన్మలో ప్రేయోమార్గము ననుసరించినప్పుడు ఈ జన్మలో కూడా

జీవుడు ప్రేయోమార్గము ననుసరించుటకు ప్రేరేపింపబడును.  ఇక పూర్వజన్మలో శ్రేయోమార్గము ననుసరించియుండినచో ఈ జన్మలో కూడా జీవుడు శ్రేయోమార్గము ననుసరించుటకు ప్రేరేపింపబడును. ప్రేయోమార్గము ననుసరించినప్పుడు ఈ విలువైన నరజన్మ వృథాయగును. అది జీవన్మృతికి కారణమగును. ఇక శ్రేయోమార్గము ననుసరించిన నరుడు జీవన్ముక్తావస్థ నొందును. జనన మరణ బంధము నుండి విడివడుటయే! జీవన్ముక్తి. జనన మరణముల నుండి ఏల విడివడవలయును? శాశ్వతానందము ననుభవించుటకు, ఆత్మసాక్షాత్కారము నొందుటకు, దైవసాక్షాత్కారము నొందుటకు, బ్రహ్మసాక్షాత్కారము నొంది, నిత్యానంద సాగరమునందోలలాడుటకు శ్రేయోమార్గము జీవన్మృతికి గొంపోవును. ఇక ప్రేయోమార్గము జీవన్మృతికి గొంపోవును. ఎవరికేది కావలయునో వారు దాని ననుసరింపవచ్చును.

ఐతే శ్రేయోమార్గము ననుసరించుటకు నరుడు జీవితమునందేమి చేయవలయును? నరరూపమునందున్న నారాయణుని సేవింపవలయును. నరరూపము నందున్న నారాయణుడే! గురువు. గురువును సేవించుట అనగానేమి? గురూపదేశ వాక్యములను జీవితమునందాచరించుట మఱియు నిరంతరము గురూపదేశ మంత్రమును జపించుట. మంత్రము రెండు రకములుగానుండును. ఒకటి పొడి మంత్రము. రెండవది తడి మంత్రము. గ్రంథములలోనున్న కొన్ని మంత్రముల నెన్నుకొని, జపము చేయుట పొడిమంత్రమనబడును. ఇట్లు జపించిన మంత్రము బలహీనమైయుండును. దీనియందు మానసిక బలముగాని, బుద్ధిబలముగాని, ఆత్మబలముగాని ఉండదు. అందువలన కొంతకాలము తర్వాత మంత్రశక్తి, లేక మంత్రము యొక్క మహిమ క్షీణించును. ఈ కారణముచే మరల అది ప్రేయోమార్గమునకే దారితీయును. ఇట్టి మంత్రజపముచే గర్వము, అహంకారము, స్వార్థపరత్వము మున్నగు దుర్గుణములు మనకు తెలియకుండానే మనలో ప్రవేశించును. కావున జీవితపరమలక్ష్యమును ఈ జన్మయందే పొందగోరువారు కేవలము గురూపదిష్ట మంత్రమునే జపించుచుండవలయును. నరరూపమునందున్న నారాయణుని నుండి స్వీకరించిన మంత్రము తడిమంత్రమని చెప్పబడును. ఈ మంత్రము నందు గురుదేవుని కరుణ, వాత్సల్యము, ప్రేమ, దయ, అనుగ్రహము అనెడి పంచామృతములుండును. ఈ పంచామృతములచే తడుపబడిన మంత్రజపముచే మన మనస్సు ప్రశాంతమగును. మన బుద్ధి వికాసము నొందును. మనయందాత్మజ్యోతి ప్రవేశించును. ఈ మంత్రజపముచే సాధకునికి నలువైపుల నుండి దివ్యవాణి వినబడును. ఒకవైపునుండి

"తత్త్వమసి" అను గురూపదేశము వినబడును. రెండవవైపునుండి "అహంబ్రహ్మాస్మి" అను మహావాక్యముచే శిష్యుడు సుశోభితుడగును. మూడవవైపు నుండి "ప్రజ్ఞానంబ్రహ్మ" యనెడి ధ్వనిని శ్రవణమొనర్చిన శిష్యునికి ఆత్మజ్ఞానము కలుగును. నాల్గవవైపునుండి "అయమాత్మాబ్రహ్మ" యనెడి మహావాక్యమును సాధకుడు శ్రవణమొనర్చును. ఇట్లు శిష్యుడు పూర్ణకాముడగును. ఇదియే! తడిమంత్రముచే పొందబడు శ్రేయోమార్గమునకు ఫలము. ఆ ఫలమే! జీవన్ముక్తియనబడును. కావున మనమందఱమున్నూ ప్రేయో మార్గము ననుసరింపక, శ్రేయోమార్గగాములమై, జీవన్ముక్తులమై శోభిల్లుదుము గాక!

## 32. గృహప్రవేశము

సామాన్యముగా మనమొక క్రొత్త ఇల్లును కట్టుకొని, ఆ గృహము నందు ప్రవేశించుట "గృహప్రవేశమ"ని చెప్పబడును. కాని పై శీర్షిక ఇట్టి గృహప్రవేశమును సూచింపదు. అది ఒక ప్రత్యేకమైన, గంభీరమైన, అసామాన్యమైన, అసాధారణమైన గృహప్రవేశమును సూచించును. మనము జన్మించుటకు పూర్వము మాతృగర్భమనెడి గృహము నందు ప్రవేశించియున్నాము. మాతృగర్భమునుండి బయల్వెడలిన తర్వాత మన తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రున్న గృహములో పెరిగి పెద్దవారమైతిమి. ఐతే మనము మాతృగర్భమనెడి గృహములో ప్రవేశించుటకు పూర్వము మనమే గృహము నందుంటిమి? అదే మన నిజమైన గృహము. ఆ గృహమునందే మనకు నిజమైన శాంతి లభించును. ఆ గృహమునందే మనకు నిజమైన సుఖము లభించును. కాని ఆ గృహము ఎక్కడున్నదో, ఎట్లున్నదో, ఏ రూపమును కలిగియున్నదో మనకు తెలియదు. దానిని తెలిసికొనవలెననెడి తీవ్రమైన ఇచ్ఛ కూడా మనలో లేదు. ఇదే మనయందున్న దోషము! ఈ దోషము వల్లనే మనమీ సంసారసాగరములో మునుగుచు, తేలుచు, తికమక పడుచున్నాము. ఈ సంసారసాగరమును దాటుటకు ఉపకరణము, లేక నావ ఎచ్చటున్నదో, మనకు తెలియుట లేదు. కాని సంసారసాగరమును దాటుటకు తీవ్రమైన కోరిక కలవారికి నావతో పాటు నావికుడు కూడా మనకు తప్పక లభించును. భగవన్నామమే! ఆ నావ. భగవంతునికి ప్రతినిధియైన గురుదేవుడే! నావికుడు. ఐతే, అనుమానము కలవారికి, సందేహము కలవారికి, విశ్వాసహీనులకు, చంచలమైన మనస్సు కలవారికి మనఃస్థైర్యము లేనివారికి, నానావిధములగు కోరికలచే ఈడ్వబడుచున్నవారికి నావికుడుగాని, నావగాని సహకరింపజాలవు. "నేను అంధకారమునందున్నాను" అనుకొను వారికే జ్యోతి

దర్శనమగును. “నేను అజ్ఞానమునందున్నాను” అనుకొనువారికే జ్ఞానభాస్కరుడు దర్శనమొసంగును. నేనీ జన్మయందే నా నిజమైన గృహమునందు ప్రవేశింపవలసియున్నద”ని దృఢచిత్తులైయున్నవారికే మార్గదర్శనము లభించును. మనము మన గృహమునుండి బయటికి వెళ్ళినప్పుడు తిరిగి మన గృహమును చేరుకొనునంతవరకు మనకు మనశ్శాంతియుండదు. అదే విధముగా మనము మన నిజమైన గృహమునుండి బయలుదేరి వచ్చి, పరగృహమునందు పరిభ్రమించుచున్నాము. ఈ ప్రపంచమే! పరగృహము! అది ఎట్లు? ఒకవేళ ఇది పరగృహము కాకున్నచో, మరణమాసన్నమైనప్పుడు మనమీ గృహమునుండి నిష్క్రమించుటకు గల కారణమేమి? ఏదో ఒక రోజు మనమీ ప్రపంచమును త్యజింపక తప్పదు. అటువంటప్పుడు ఈ ప్రపంచము మన గృహమెట్లగును? ఐతే, మన నిజమైన గృహమేది? మన నిజమైన గృహమును గూర్చి వర్ణించు ఈ పద్యమును పఠింపుడు: “ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై ఎవ్వనియందుడిందు పరమేశ్వరుడెవ్వడు? మూలకారణం బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు? సర్వము దానయైనవాడెవ్వడు? వానినాత్మభవునే శరణంబు వేడెదన్” అన్నట్లు ఈ జగత్తు ఎవ్వనిచే జనించినదో, ఎవ్వనియందీ జగత్తు నెలకొనియున్నదో, ఈ జగత్తుకు మూలకారణంబెవ్వడైయున్నాడో, ఆది–మధ్యాంతములు లేనివాడెవ్వడో, అంతయు తానై యున్నవాడెవ్వడో అట్టి పరమాత్మయే! మన నిజమైన గృహము. ఐతే, ఈ గృహమునందు ప్రవేశించుటెట్లు? బుద్ధిమంతునికీ ప్రశ్న కఠినమైన సమస్యగా తోచదు. కారణమేమి? మనమీ గృహమునందు ప్రవేశించియేయున్నాము. కాని ప్రవేశించితిమని మనమనుకొనుట లేదు. ఇదియే! మనయందున్న దోషము. మనమందఱమున్నూ అమావాస్యనాటి చీకటివలె అజ్ఞానమనెడి అంధకారమునందు మునిగియున్నాము. భగవన్నా మోచ్చారణమనెడి నావచే అజ్ఞానతీరము నుండి క్రమక్రమముగా జ్ఞానతీరమును చేఱుకొనగలుగుదుము. అమావాస్యరోజు చంద్రునికి పూర్తిగా నాశముండదు. ఒకవేళ నాశమున్నచో ఒక్కొక్కరోజు ఒక్కొక్క కళను పెంచుకొనుచు, పూర్ణిమరోజు ‘పున్నమచంద్రుడ’ని పిలవబడజాలడు. అదే విధముగా మనము నిశ్శేషముగా జ్ఞానశూన్యులము కాము. కావున జ్ఞానప్రకాశవికాసమునకై మనము జ్ఞానభాస్కరుడైన గురుదేవుని ఆశ్రయింపవలయును. అప్పుడీ గురుదేవుడనెడి నావికుడు మనలను మన నిజమైన గృహమునందు ప్రవేశింపజేయును. లేక, మనయందొక బిందువువలెనున్న దివ్యత్వమును సముద్రమంతటిదిగా వికసింపజేయును.

"సంసారసాగరం ఘోరం తర్తుమిచ్ఛతి యో నరః। గీతానావం సమారుహ్య పారం యాతి సుఖేనసః ॥" అని శ్రీవరాహపురాణములోని గీతామహాత్మ్యము నుడువుచున్నది. అందువల్ల ఈ సంసారసాగరమును దాటుటకు శ్రీమద్భగవద్గీత యనెడి నావకూడా మనకు ఉపకరించును. ఐతే నావికుడు శ్రీకృష్ణ భగవానుడు. అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని దర్శించినట్లు మనమిప్పుడు శ్రీ కృష్ణ భగవానుని దర్శింపజాలము. కావున గురుదేవుని యందు మనము శ్రీకృష్ణ భగవానుని దర్శింపవలసియున్నది. శ్రీకృష్ణుడు అర్జునునికి భగవద్గీతోపదేశము నొసంగెను. ప్రస్తుతము గురుదేవుడు మనకు భగవన్నామోపదేశము నొసంగును. కావున భగవన్నామమనెడి నావ ద్వారా గురుదేవుడనెడి నావికుని సహాయముతో సంసారసాగరమును దాటి, మన నిజమైన గృహమును చేరవలసియున్నది. మన నిజమైన గృహము మనకెంతో దూరమునందు లేదు. మన నిజమైన గృహము ఇప్పుడిచ్చుటనేయున్నది. ఈ విషయమును మనము గురుదేవుని ద్వారా తెలిసికొనవలసియున్నది. మనము మన నిజమైన గృహమును చేరినతర్వాత మనశ్శాంతికి కొఱతయుండదు. మనము మన నిజమైన గృహమును చేరినతర్వాత ఆనందమునకు కొఱతయుండదు. ఐతే మనము మన నిజమైన గృహమును చేరుటకు ఎంతకాలము పట్టును? ఎంతోకాలముపట్టదు సుమా! కారణమేమి? ఈ క్షణమునందు మనము మననిజమైన గృహమునందేయున్నాము. మనమున్న స్థలమునందే మన నిజమైన గృహమున్నది. మన నిజమైన గృహము అన్ని దిక్కులయందున్నది. అది అన్నివేళల యందున్నది. సముద్రములోని చేపకు జలమయమైయున్న సముద్రము నందు తానున్నట్లు తెలియక దాహముతో పరితపించుచుండును. అదే విధముగా మనమున్నా మనగృహము ఇప్పుడిచ్చటనే యననేల? మనయందుయున్నదని తెలియక, కష్టపరంపరలకు గుఱియగుచున్నాము. జనన మరణములకు గుఱియగుచున్నాము. జీవిత సమస్యలకు గుఱియగుచున్నాము. ఇప్పటికైనా మన మందరమున్నా మన నిజమైన గృహము మనయందేయున్నదని తెలిసికొని , స్వాత్మ గృహమును దర్శించి, దానియందు ప్రసన్నచిత్తులమై ప్రవేశించి, పరమ శాంతిని, పరమసౌఖ్యమును, పరమానందమును బడయుదము గాక! ఈ గృహప్రవేశమునకు మరియొక పేరు "సద్యోముక్తి".

# 33. అపూర్ణ సతోమా పూర్ణ సద్గమయ

పూర్ణిమ రోజు సముద్రము ఉల్లాసముతో ఉప్పొంగుచుండును. శరత్పూర్ణిమ రోజు శ్రీకృష్ణుడు గోపికలతో "రాసలీల" యొనర్చెను. ప్రతి సంవత్సరము ఆషాఢ పూర్ణిమ రోజు గురుపూజ, లేక శ్రీవ్యాసపూజ ఒనర్పబడుచుండును. వీటన్నింటికి గల కారణమేమి? పూర్ణత్వమునందే పరమానందము కలదని సముద్రము మనకు పాఠమునేర్పును. "పూర్ణ పురుషుడనైన నన్ను చేఱుటయే! గోపికల రూపమునందున్న జీవులందఱికి కర్తవ్యమ"ని శ్రీకృష్ణుడు మనకు ప్రబోధించును. శ్రీకృష్ణునిగాని, శ్రీవ్యాసులవారిని గాని ప్రత్యక్షముగా మనమిప్పుడు చూడజాలము. అందువల్ల గురురూపము నందున్న పూర్ణపురుషుని పూజించుటయే! మన కర్తవ్యమని గురుపూర్ణిమ మనకు ఉద్భోధించును. "ఓ దేవా! అపూర్ణమైన సత్యమునుండి నన్ను పూర్ణమైన సత్యము వైపు తీసుకొని వెళ్ళుమ"ని పై శీర్షిక యొక్క భావము. కేవలము మనమేయననేల? ఈ ప్రపంచమంతయును అప్రయత్నముగా అపూర్ణమైన సత్యమునుండి పూర్ణమైన సత్యము వైపుఈడ్వబడుచున్నది. ఇక ఈ ప్రపంచమేయననేల? పదునాలుగు లోకములన్నియును అపూర్ణ సత్తాను కలిగియున్నవని చెప్పవలసియున్నది. ఏల? పూర్ణత్వము, లేక సత్పదార్థము నందు ఒక చోటునుండి మరియొక చోటుకేగుటయనునదుండదు. ఈ పదునాలుగు లోకములన్నియును తర-తమ భేదములను కలిగియున్నవి. అనగా:- కొన్ని నిమ్నములు మరికొన్ని ఉన్నతములై యున్నవి. ఈ కారణముచే పదునాలుగు లోకములలో ఏ లోకమున్నూ పూర్ణమనిగాని, సత్యమనిగాని మనము చెప్పజాలము. ఐతే ఉన్నతమైన "సత్యలోకమ" నునదొకటియున్నది. ఇదియున్నూ సత్పదార్థమునకత్యంత సమీపమునందున్న లోకమే కాని, సత్పదార్థము, లేక పూర్ణత్వమని చెప్పబడజాలదు. ఇక స్వర్గలోకము మాటచెప్పనేల? మనుజుడీ భూలోకము నందొనర్చిన సత్కర్మల పుణ్యఫలమును ఎంతవరకు అనుభవింపవలయునో, అంతవరకు మాత్రమే! స్వర్గలోక భోగముల ననుభవించుట కాతనికి అనుమతి లభించును. తదనంతరము అధఃపతితుడై యథాస్థానము నలంకరింపవలసి వచ్చును. మరల ఆ స్థానమునుండి ఆతడు శాశ్వతమైన ధామమును చేరుటకు ప్రయత్నము నొనర్పవలసియుండును. ఏ పదార్థమైతేనేమి? ఏ కీటకమైతేనేమి? ఏ జంతువైతేనేమి? ఏ మానవుడైతేనేమి? దేవుని, భగవంతుని, లేక పరమాత్ముని విడిచియుండజాలదు. దేవుని అస్తిత్వకారణము చేతనే!

ఇవి యన్నియును అస్తిత్వమును కలిగియున్నవి. ఐతే ఈ ప్రపంచములోని ప్రాణులు దుఃఖములను, కష్టములను, సంకటములను, సమస్యలను కలిగియుండుటకు గల కారణమేమి? తన సత్తాను తాను గుర్తెఱుంగకుండుటయే! దీనికి గల కారణము. తాను సత్యమునాశ్రయించియున్నానని తెలిసికొనకుండుటయే! దీనికిగల కారణము. దైవజ్ఞాన శూన్యుడగుటయే! దీనికి గల కారణము. దైవజ్ఞాన శూన్యతయే! జడత్వము. ఈ జడత్వము చేతనే మనుజుడు దేవునికి బదులుగా దయ్యమును దర్శించుచున్నాడు. రజ్జువుకు బదులుగా సర్పమును దర్శించుచున్నాడు. రజ్జు జ్ఞానమే! సత్య జ్ఞానము. సర్పభ్రాంతియే! అజ్ఞానము. సర్పభ్రాంతి తొలగుటకై గురుప్రబోధ జ్ఞానము అవసరమగును. గురుదేవుని కరుణచే, అనుగ్రహముచే అజ్ఞానాంధకారము పటాపంచలగును. భ్రాంతి దర్శనము తొలగిపోవును. దేవేంద్రుడు కూడా అపూర్ణసత్తాను కలిగియున్నాడని చెప్పవలసియున్నది. కారణమేమి? ఏ వ్యక్తియైనను శతక్రతువులను (నూరు యాగములను) చేయునేని, దేవేంద్రుడు తన పదవి నుండి తొలగిపోవలసి యుండును. కావున దేవేంద్రుడు కూడా పూర్ణ సత్తా యందు స్థితిని కలిగిలేదని తెలియుచున్నది. ఇక ఏది పూర్ణమైనది? పూర్ణత్వమునకు చాంచల్యముండదు. పూర్ణత్వము దేనిచేతను భయకంపితము కాజాలదు. పూర్ణత్వమునకు నాశమనునది లేదు. ఇక ఈ ప్రపంచమునకు చాంచల్యమున్నది. ఇది మరొక లోకముచే భయకంపిత మగుచుండును. ప్రళయకాలమునందీ ప్రపంచము నశించును. కావున ప్రపంచ మంతయును అపరిపూర్ణమైనదే! అపూర్ణమైన పదార్థము మనకు పూర్ణతృప్తి నొసంగజాలదు. అపూర్ణమైన పదార్థము పరమశాంతినొసంగజాలదు. అపూర్ణ మైన పదార్థము పరమానందము నొసంగజాలదు. కావున ఈ సందర్భమునందు వైరాగ్యము యొక్క ఆవశ్యకత ఏర్పడును. పూర్ణతృప్తి నొసంగు పదార్థమునాశ్రయించి, పూర్ణతృప్తి నొసంగని పదార్థమును త్యజించుటయే! "వైరాగ్యమ"ని చెప్పబడును.

పెద్ద ఉద్యోగములో ప్రవేశింపదలంచిన వాడు చిన్న ఉద్యోగమును వదలిపెట్టక తప్పదు. అదే ప్రకారముగా పూర్ణ బ్రహ్మానంద సాగరము నందోలలాడదలంచిన వాడీ అపరిపూర్ణమైన సంసారమును పరిత్యజింపవలసియుండును. గొప్ప ఉద్యోగము నొనర్చుటకై గొప్ప విద్యకూడా ఆవశ్యకమగును. అదే ప్రకారముగా పూర్ణబ్రహ్మము నపేక్షించు వానికి బ్రహ్మజ్ఞానమనెడి ఆధ్యాత్మిక విద్యకూడా ఆవశ్యకమగును. బ్రహ్మజ్ఞానమనగా:- ఏ చెట్టుపై నున్న పిట్టయో అనుకొనరాదు. బ్రహ్మజ్ఞానము నార్జించుటకై శ్రీ సద్గురు శివానందస్వాముల వారు ప్రబోధించినట్టి అమృతతుల్యమైన

"God first, world next, yourself last"అను వాక్యములను మన జీవితము నందనుష్ఠింపవలసియుండును. అనగా:– మనమొనర్చు ప్రతి కార్యమును దైవస్మరణతో ప్రారంభించవలయును. తర్వాత దైవమునందంతర్నిహితులైయున్న మనకు బాహ్యముగా కానబడుచున్న ప్రపంచములోని ప్రజలందఱిని దైవభావముతో సేవించుచుండ వలయును. ఐతే ఈ సేవనొనర్చుటకు ఉపకరణమైన మన దేహసౌష్ఠవమును కూడా కాపాడుకొనుచుండవలయును. ఈ మూడు మార్గములు బ్రహ్మజ్ఞానమునకు దారితీయుననుట నిశ్చయము. దీనిననుష్ఠింపజాలనివారు పరమపూజ్య శ్రీ చిదానందస్వాములవారు పలికిన "Look, but see not; Listen, but hear not; Relish, but taste not" అను వాక్యములను మన జీవితములయందా చరించుట యుక్తమగును. అనగా:– ప్రాపంచిక విషయములను చూడకుము. కాని ప్రపంచములో పరమాత్మని దర్శించుము. ప్రాపంచిక విషయములను వినకుము, కాని పారమార్థిక విషయములను శ్రవణముచేయుము. ప్రాపంచిక వస్తువులను రుచి చూడకుము, కాని పారమార్థిక వస్తువులను చవిచూడుమని భావము. ఇక ఇదియున్నూ ఆచరించులకు కష్టముగా తోచునేని, పూజ్యపాద శ్రీ కృష్ణానందస్వాముల వారు నుడివినట్టి "Behold the world with the eye of God." అను వాక్యమునునుష్ఠింపవలసియుండును. అనగా:– ఈ ప్రపంచమును దేవుని నేత్రముతో దర్శింపుమని భావము. పై ముగ్గురు మూర్తుల వాక్యములననుష్ఠించినప్పుడు మనము "అపూర్ణ సతోమా పూర్ణ సద్గమయ" అని దేవునితో ప్రార్థించుటకు పూర్వమే మనము పరిపూర్ణబ్రహ్మానంద సాగరమునందోలలాడుచుందుము. అప్పుడు మనయందున్న అపూర్ణత నిశ్శేషమగును. అప్పుడు మనకు మరొక దానిని పొందు ఆవశ్యకత ఉండజాలదు.

## 34. జీవితములో విజయదశమి

ప్రతిసంవత్సరము దేవీనవరాత్రి పూజలు జరిపిన తర్వాత 'విజయదశమి" కార్యక్రమము జరుపుకొనుట దాదాపు భారతీయులందఱికి తెలియును. ఐతే, జీవితములో విజయదశమిని జరుపుకొనుటెట్లో అనేకులకు తెలియదు. జీవితములో విజయదశమిని జరుపుకొనుట కేవలము భారతీయులకే స్థగితమైయుండదు. అది ప్రపంచములోని ప్రతి మనుజునికి, ప్రతిప్రాణికి, ప్రతివ్యక్తికి సంబంధించినదైయున్నది. అది ఎట్లనగా:– దేవీనవరాత్రులలోని మొదటి మూడు రోజులలో మనము

శ్రీదుర్గాదేవిని పూజింతుము. దుర్గతిని నశింపజేయునదే! ఈ దుర్గాదేవియని చెప్పబడును. ఐతే మనము దుర్గతియందున్నామా? యను విషయమును మనము మొదట తెలిసికొనవలసియున్నది. నిజమునకు మనమీ ప్రపంచమునందు జన్మించుటయే! దుర్గతి, లేక అథఃపతనమని చెప్పవలసియున్నది. అది ఎట్లు? మన పూర్వజన్మసంస్కారములు, పూర్వజన్మవాసనలు, పూర్వజన్మవాంఛలు ఈ జన్మకు కారణములైయున్నవి. వాటన్నింటిని నశింపజేయుటకే శ్రీదుర్గాదేవి పూజింప బడుచుండును. పూర్వజన్మసంస్కారములు, పూర్వజన్మవాసనలు, పూర్వజన్మవాంఛలు రాక్షసులవంటివి. అవి మనుజుని అష్టకష్టముల పాలుజేయును. కొన్ని సంస్కారములు సుఖమునిచ్చును. కొన్ని సంస్కారములు దుఃఖము నొసంగును. సుఖము దుఃఖమునకు కారణమగును; దుఃఖము సుఖమునకు కారణమగును. కావున ఈ రెండున్నూ ఒకే నాణెము యొక్క బొమ్మ–బొరుసుల వంటివి. ఈ రెండింటిని నశింపజేయుటయే! ఆధ్యాత్మికసాధకుని లక్షణము. ఈ రెండింటిని నశింపజేసినప్పుడు అనగా:– పూర్వజన్మసంస్కారములను, వాసనలను, వాంఛలను శూన్యమొనర్చినప్పుడు ఆధ్యాత్మిక సాధకుని మార్గము సుగమమగును. ఆధ్యాత్మిక సాధకుని మార్గమేది? జీవితలక్ష్యమును చేరుకొనుటకు దోహదమొసంగునదేదో, అదియే! ఆధ్యాత్మికసాధకుని మార్గము. ఇక జీవితలక్ష్యమేది? సర్వదుఃఖనివృత్తి మఱియు పరమానందప్రాప్తియే! జీవితలక్ష్యము. *అనందము సుఖమునకు భిన్నమైయున్నది. సుఖము ప్రపంచమునకు సంబంధించినది. ఆనందము పరమాత్మకు సంబంధించినది.* ప్రాపంచిక సుఖములన్నియును నాశవంతములు మఱియు తాత్కాలికములు; పారమార్థిక సుఖము, లేక బ్రహ్మానందము శాశ్వతమైనది మఱియు అవినాశి. కావున వివేకవంతుడైన ఆధ్యాత్మిక సాధకుడు ప్రాపంచిక సుఖములపట్ల వైరాగ్యమును కలిగియుండును.

దేవీ నవరాత్రులలో తర్వాతి మూడురోజులు శ్రీలక్ష్మీదేవి పూజింపబడును. లక్ష్మీదేవి ఈ ప్రపంచములోని సకలైశ్వర్యములను సూచించును. అంతేకాదు, ప్రపంచాతీతమైన పరమానందము, లేక బ్రహ్మానందము నొందుటకు దోహద మొసంగును. ప్రపంచములోని సకలైశ్వర్యములు పరిత్యజింపబడినప్పుడు పరమానందము ప్రాప్తించును. కామ– క్రోధ– లోభ– మోహ– మద–మాత్సర్యములనెడి అరిషడ్వర్గమును జయించినప్పుడు పరమానందము ప్రాప్తించును. మొదట కామమనెడి శత్రువును జయించినచో, మిగిలిన ఐదుగురు శత్రువులను సునాయాసముగా జయింపవచ్చును. ఏ కోరికయైనను ప్రపంచమునకు సంబంధించినదైయుండును.

కామము కోరికను సూచించును. పరమానందము నొందగోరు వ్యక్తి ప్రాపంచిక సుఖములనే కాదు, స్వర్గలోక సుఖములను కూడా కాకి రెట్టవలె పరిత్యజింపవలసియుండును. కారణమేమి? స్వర్గలోకములో కూడా కామ– క్రోధ– లోభ– మోహ– మద–మాత్సర్యములనెడి ఆరుగురు శత్రువులుందురు. అందువల్లనే రాక్షసులు కూడా కొన్ని సమయములలో దేవేంద్రుని జయింపగలుగుచున్నారు. కోరిక నెరవేరనప్పుడు క్రోధము జనించును. క్రోధముచే ఒక కోరిక నెఱవేరినప్పుడు, మరొకటి కావలయుననెడి లోభము జనించును. లోభకారణముచే కొన్ని ఐశ్వర్యములు పొందబడినప్పుడు వాటిపై “నాది” యనెడి మోహముత్పన్నమగును. అప్పుడు తానే సర్వాధికారియనెడి మదము కలుగును. ఈ మదము బలపడినప్పుడది మాత్సర్యముగా మారును. మాత్సర్యము కలవానికి మన్ను–మిన్ను తెలియకుండును. కావున ఈ ఆరుగురు శత్రువులను జయించుటయే! లక్ష్మీదేవిని పూజించుటయగును. విష్ణుమూర్తి భూదేవి నాశ్రయించి భూలోకము నేలుచుండును. మఱియు శ్రీదేవి నాశ్రయించి వైకుంఠము నేలుచుండును. కావున లక్ష్మీదేవిని పూజించువారికి ఇహలోక–పరలోక సౌఖ్యములన్నియును చేకూరును. కాని ధనలక్ష్మియే! సర్వస్వమనుకొనువారికి పరమానంద ప్రాప్తి అసంభవము. కేవలము ధనలక్ష్మి నాశ్రయించి జీవించువారి సంస్కారములు, వాసనలు, వాంఛలు దిన దినము వృద్ధినొందుచుండును. ఇట్టివారికి మోక్ష సామ్రాజ్యలక్ష్మి లభించుటకల్ల. కారణమేమనగా:– సాధకుడు ప్రాపంచిక సుఖములకు మఱియు స్వర్గలోక సుఖములకున్నూ తిలాంజలి యొసంగినప్పుడు మాత్రమే! అతడు మోక్షలక్ష్మి సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుడు కాగలుగును. ఈ సామ్రాజ్యమునందు సమస్త కోరికలు నెఱవేరుటచే అతడు కోరవలసిన ఏలాటి కోరికయు శేషించియుండదు.

ఇక దేవీనవరాత్రులలో చివరి మూడు రోజులు మనము సరస్వతీదేవి నారాధింతుము. సరస్వతీ దేవి తెల్లనివస్త్రమును ధరించును. అనగా:– సరస్వతీ దేవియందు మనకు వలె సంస్కారములుగాని, పూర్వవాసనలుగాని, పూర్వవాంఛలు గాని ఏమియు ఉండవు. అట్టి సరస్వతీదేవిని పూజించినప్పుడు మన మనస్సు పరిశుద్ధమగును. ఈ పరిశుద్ధమైన మనస్సులో భగవంతుని అస్తిత్వము ప్రతిబింబించును. అప్పుడా మనుజుడు దివ్య ప్రకాశముచే శోభిల్లును. అట్టి దివ్య ప్రకాశముచే ఆతడు తన పరిసరమునందున్న ప్రజలను ప్రకాశవంతమొనర్చును. అతడున్న ప్రదేశము ప్రశాంతమైన వాతావరణముగా పరిణమించును. శ్రీ సరస్వతీదేవి యొక్క

హస్తమునందొక పుస్తకముండును. ఆ పుస్తకములోని విద్య మానవుని మస్తకమును పరిశుద్ధమొనర్చును. ఏ విద్య మానవుని మస్తకమును పరిశుద్ధమొనర్చునో, అదియే! నిజమైన విద్య, లేక బ్రహ్మవిద్యయని చెప్పబడును. ఆ పరిశుద్ధమొనర్పబడిన మస్తిష్కముచే మనుజుడు దైవకార్యములను చేయగలుగును అట్టివాడు శ్రీకృష్ణునికి అర్జునునివలె పరమాత్మునికి పరమ ప్రేమాస్పదుడగును. నవరాత్రిపూజ పూర్తి ఐన తర్వాత పదవరోజు విజయదశమియని చెప్పబడును. పంచకర్మేంద్రియములను, పంచజ్ఞానేంద్రియములను జయించుటయే! విజయదశమియగును. అనగా:- ఈ పంచకర్మేంద్రియములను, పంచజ్ఞానేంద్రియములను ప్రపంచములోని పదార్థములను పొందుటకై వినియోగింపక, ఈ ప్రపంచమును సృష్టించిన పరమాత్ముని పొందుటకై వినియోగించుటయే! ఇంద్రియములను జయించుటయగును. చంద్రలోకమునకేగుట, అంగారకుని చేరుట కొంత వరకు ఇంద్రియజయమని చెప్పబడినను, అది పూర్తి ఇంద్రియ జయము కాజాలదు. కారణమేమనగా:- ఏ వ్యక్తియైనను సూర్యలోకమునకేగుటకు ప్రయత్నించునేని, ఈ వ్యక్తియే! భస్మీభూతుడగును. కావున పరమేశ్వరుని అపారమహిమను, శక్తిని గుర్తెఱింగి "త్వమేవ శరణం మమ" అను భావముతో ఈ పరాశక్తిని పూజించి, అర్చించి, తరించెదము గాక! జీవితమంతయు ఇట్టి సాధన యొనర్చిన వాడెవ్వడైనను నవరాత్రులనెడి తొమ్మిది సంఖ్యగల ప్రపంచమును జయించి, 10 సంఖ్యగల విజయదశమి యనెడి పరమాత్మను పొంది, పరమానందమునొందుటలో విజయమును సాధింపజాలుననుట తథ్యము. జీవితములో మోక్షధామమును చేఋకొనుటలో విజయమును సాధించుటయే! "జీవితములో విజయదశమి"యని చెప్పబడును.

## 35. విద్యా ధనం సర్వధనాత్ప్రధానమ్

విద్యయనెడి ధనము అన్ని ధనముకంటె ప్రధానమైనది, ఉన్నతమైనది, శ్రేష్ఠమైనదని పై శీర్షిక యొక్క భావము. ఏల? విద్యాధనమునందు ఇతర ధనము లన్నియును మిళితమైయున్నవి. ఇచ్చట విద్యయనగా:- పాఠశాలలో, కళాశాలలలో, విశ్వవిద్యాలయములలో నేర్పబడుచున్న విద్య ఏ మాత్రము కాదు. నేటి కాలములో ఆ విద్యలన్నియును కేవలము పొట్టకూటికి మాత్రమే ఉపయోగపడుచున్నవి. ఇంతేకాదు- ఆ పాఠశాలలను, ఆ కళాశాలలను, ఆ విశ్వవిద్యాలయములను నిర్వహించువారున్నూ ఒక పెద్దవ్యాపార దృష్టితో నిర్వహించుచున్నారే కాని, విద్యార్థులకు

నిజమైన విద్యను బోధింపవలయుననెడి ఇచ్ఛ ఏమాత్రము లేనివారైయున్నారు. ఇది మిక్కిలి శోచనీయమైన విషయము. "విద్వత్వం చ నృపత్వం చ నైవతుల్యం కదాచన, స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే" అనగా:– ఒక విద్వాంసునికి – ఒక రాజుకు మధ్య ఏమాత్రము పోలిక లేదు. కారణమేమనగా:– రాజు కేవలము తన దేశమునందు మాత్రమే! పూజింపబడును. విద్వాంసుడు సర్వత్ర పూజింపబడును ఏల? రాజునకు రాజ్యాధికారము, మంత్రాంగ బలము, సైనిక బలము ఇత్యాదులుండును. ఇవి యన్నియును ఇతర దేశములతో యుద్ధమొనర్చి జయించుటకు గాని, ఓడిపోవుటకు గాని ఉపయోగపడును. కాని నిజమైన విద్వాంసునికి ఓటమియనునది ఉండదు. అట్టివాడెచ్చటికి వెళ్ళినను జయజయ ధ్వానములు మిన్నుముట్టుచుండును. ఒకే స్థలమునందున్నను భక్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు ఆకర్షింపబడుచుందురు. దీనికి కారణము తనను తాను జయించుట; అనగా:– తన బుద్ధిని, మనస్సును, దేహమును ఆత్మ జ్ఞానమునార్జించుటకై వినియోగించుట. ఆత్మ జ్ఞానియే! నిజమైన విద్వాంసుడనబడును. కేవలము గ్రాంథిక జ్ఞానము కలవాడు విద్వాంసుడని చెప్పబడుటకర్హుడు కాడు. అట్టివారు "అవిద్యాయా మంతరే వర్తమానాః స్వయంధీరాః పండితం మన్యమానాః" వంటివారు. అనగా:– స్వయముగా అంధకారము, లేక అజ్ఞానకూపము నందు పడియుండి తమకు తాము ధీరులుగను, పండితులుగను తలంచునట్టి వారైయుందురు. ఇట్టివారు ఇతరులను పెడదారి పట్టింతురు.

ప్రపంచములోని ప్రతివ్యక్తియు నిజమైన విద్వాంసుడగుటకై ప్రయత్నింపవలసియున్నది. ఇదిఎట్లు సాధ్యమగును? ప్రపంచములోని బాలబాలికల కందఱికి "మాతృదేవోభవ" "పితృదేవోభవ" "ఆచార్యదేవో భవ" వంటి నీతి (వేద) వాక్యములను వారి హృదయ క్షేత్రములలో ప్రవేశపెట్టవలసియున్నది. ఇక ప్రపంచములోని కళాశాలలలోని యువతీ యువకులకందఱికి "ఆత్మ కళ"ను బోధింప వలసియున్నది. "ఆత్మకళ"ను బోధించినచో జీవనోపాధికై ఉద్యోగము లభించునా? యని మీరు ప్రశ్నింపవచ్చును. "ఆత్మకళ"యందు ఉద్యోగములన్నియును అంతర్నిహితములైయుండును. కావున "ఆత్మకళ"ను నేర్చుకొన్నవాడు తన గ్రామము నందున్న వారందఱికిని ఉద్యోగముల నొసంగుటకు శక్తివంతుడైయుండును. కేవలము ఒక్క గ్రామవాసులందఱికి ఉద్యోగము లభించినప్పుడు పరిసరగ్రామములయందున్న వారందఱికి ఉద్యోగము లభించును. ఇచ్చట ఉద్యోగమనగా:– కేవలము జీవనోపాధికై

ఒనర్చబడు కార్యము. కాని భోగభాగ్యములకు, కేళీవిలాసములకై చేయబడు ఉద్యోగము కాదు. సామాన్యమైన ఉద్యోగము ప్రజలందఱికి సుఖశాంతులనొసంగుననుటలో సందేహము లేదు. ఒకవేళ గొప్ప ధనము నార్జించు ఉద్యోగము లభించినను, అట్టివాడు స్వల్పధనము నార్జించువారికి సహకరించు చుండవలయును. ఇక ప్రపంచములోని విశ్వవిద్యాలయములలో విద్యాభ్యాసము నొనర్చువారు నిజముగా "విశ్వవిద్యాలయము"న కర్థము తెలియనివారైయుందురు. "విశ్వమ"నగా ఏమియో తెలిసికొనుటయే "విశ్వవిద్య". ఈ విశ్వమును విశ్వేశ్వరుడు పరిపాలించుచున్నాడను విషయము విశ్వవిద్యాలయములోని విద్యార్థులకు తెలియునా? ఒకవేళ తెలిసినచో, అట్టి విద్యార్థి విశ్వశ్రేయస్సునకు మూల పురుషుడుగా భాసించును. ఇంత ఏల? తన దేహమునెవ్వడు పోషించుచున్నాడను విషయము తెలిసినచో చాలును. అన్నము, రొట్టె, పప్పు, నెయ్యి, కూరగాయలు ఇత్యాదులను సేవించిన మాత్రముచే మనుజుడు పోషింపబడు చున్నాడనుకొనుట పొరపాటు. ఏల? ఈ పదార్థములను జీర్ణింపజేయుటకై వైశ్వానరుడున్నాడు కదా! అతడు లేనిచో మనము భుజించు పదార్థములు జీర్ణింపబడవు. జీర్ణింపబడనప్పుడు దేహమునకు బలము కలుగదు. దీనిని తెలిసికొనుటయే! ఆత్మవిద్య. ఇట్టి విద్య నేటి విశ్వవిద్యాలయము లలో నేర్పబడవలసియున్నది. ఇతర విషయము లెన్నియున్నను, వాటన్నింటిని విశ్వవిద్య, లేక ఆత్మవిద్యతో జోడింపవలసియున్నది.

నిజమైన విద్య నరునికి సుందరమైన రూపము నొసంగును. భౌతికసంపదను దొంగలు దొంగిలింతురు. కాని విద్యాధనమును ఎవ్వరును దొంగిలింపజాలరు. భౌతిక ధనము ఎంతకెంతకు ఖర్చగుచుండునో, అంతకంతకు తరిగిపోవుచుండును. కాని విద్యాధనమును ఇతరులకెంతకెంతకు ఇచ్చుచుందుమో, అంతకంతకు వృద్ధియగు చుండును. విద్య (ఆత్మవిద్య) సకల విధములగు భోగములనొసంగును, కీర్తి నొసంగును, సుఖమునొసంగును. విద్య గురువులకు గురువు వంటిది. అనగా:- అది అజ్ఞానాంధకారమును తొలగించును. విద్యావంతుని జనులందఱును చుట్టుముట్టి బంధువులగుచుందురు. విదేశములలో కూడా ఆత్మజ్ఞాని యొక్క దేహము తేజోవిరాజితమై ప్రకాశించుచుండును. విద్యాదేవతయగు సరస్వతీమాత జనుల అజ్ఞానాంధకారమును రూపుమాపును. రాజభవనములన్నింటియందును విద్యావంతుడు (ఆత్మజ్ఞాని) పూజింపబడును. కాని కేవలము ధన కనక వస్తు వాహనములు కలవానిని ఆత్మజ్ఞానితో పోల్చుట ఒక మిణుగురుపురుగును సూర్యభగవానునితో పోల్చుటవంటిది.

విద్యలేనివాడు వింతపశువు వంటివాడు. అనగా:– రెండు కాళ్ళున్న పశువు వంటివాడు. కావున ఆత్మ జ్ఞానము నార్జించుటయే! విశ్వవిద్యాలయ విద్యార్థికి ధ్యేయమైయుండ వలయును. ఆత్మజ్ఞానము, లేక బ్రహ్మజ్ఞానము నొందుటయే! ప్రతి మనుజునికి ప్రథమకర్తవ్యమై యున్నది. నిజమునకీ ప్రపంచములోని జీవరాశులన్నియును పరమేశ్వరునివైపు పరుగులెత్తుచున్నవి. ఆ పరుగుల మధ్య మాయాదేవి తన లావణ్యమైన సౌందర్యమును ప్రదర్శించి, జీవులను పరుగిడకుండాచేసి, తన చేజిక్కించు కొనుచుండును. ఈ కారణము చే జీవులు నానారకములగు బాధలను, కష్టములను అనుభవించవలసివచ్చుచున్నది. కాని, నిరంతర భగవన్నామోచ్చారణచే మాయదేవి యొక్క చేష్టలు అరికట్టబడును. అప్పుడు పారమార్థిక పంథా సుగమమగును. వ్యక్తిగతముగాను, సాంఘికముగాను, రాజకీయముగాను జీవనము గడుపువారెవ్వరైనను నిస్స్వార్థసేవ చేయగలుగుదురేని, ప్రపంచమునందంతట ధార్మిక సుగంధము వెల్లివిరియును. తనను తాను తెలిసికొనుటయే! స్వధర్మమని చెప్పబడును. స్వధర్మనిర్వహణచే విశ్వవిద్యాలయము లన్నియును బ్రహ్మవిద్యా పాఠశాలలుగాను, కళాశాలలుగాను పరిణమించును. ఇట్టి బ్రహ్మ విద్యాపాఠశాలలలో ప్రాదుర్భవించిన బ్రహ్మజ్ఞానముచే ఇహలోకమే కాక, బ్రహ్మాండమంతయును తేజోవిరాజితమగును.

## 36. దేవుని ఇల్లు

ఈ దేహమే! దేవుని ఇల్లు. ఈ ప్రపంచమే! దేవుని ఇల్లు. ఈ విశ్వమే! దేవుని ఇల్లు. దేవుని ఇల్లు కానిదేదియును ఈ విశ్వమునందు లేదు. దేవుడు సర్వవ్యాపకుడై యుండుటయే! దీనికి గల కారణము. ఐతే దేహము దేవుని ఇల్లు, కాని దేహమే దేవుడు కాదు. ఈ విశ్వము దేవుని ఇల్లు, కాని విశ్వము దేవుడు కాదు. అది ఎట్లనగా:– ఒక కుమ్మరివాడు కుండలను చేయుచుండును. కుండ కుమ్మరివాడు కాజాలదు. రాత్రి నిద్రించునప్పుడు మనుజుడు కలలను కనుచుండును. కలలో కానబడు పదార్థములు మనుజుడు కాదు. ఒక త్రాడు చీకటిలో సర్పమువలె తోచును. కాని ఆ సర్పము త్రాడు కాజాలదు. ఎండమావిలో నీరున్నట్లు తోచును. కాని అట్టి నీరు మన దాహమును తీర్చజాలదు. అదే ప్రకారముగా ఈ నశ్వరమైన దేహము మనకు సుఖము నొసంగజాలదు. కాని "దేహి" అనగా దేహమునందున్న "ఆత్మ" వల్ల మనకు సుఖము కలుగుచున్నది. అట్లే ఈ ప్రపంచములోని పదార్థములు మనకు సుఖము నొసంగజాలవు. కాని ఈ ప్రపంచమునకు కారణమైన పరమాత్మచే మనకు

సుఖము కలుగుచుండును. పదునాలుగు లోకములు, అండపిండబ్రహ్మాండములన్నియు కలిసి విశ్వమని చెప్పబడును. ఈ విశ్వము మనకు సుఖము నొసంగజాలదు. కాని ఈ విశ్వమునకు కారణమైయున్న విశ్వేశ్వరుడే! మనకు సుఖము నొసంగును. దేహము నశించును. కాని దేహమునందున్న ఆత్మకు నాశము లేదు. ఈ ప్రపంచమునందున్న పరమేశ్వరునికి నాశము లేదు. ఈ విశ్వమునందున్న విశ్వేశ్వరునికి నాశము లేదు. మఱొకవిధముగా చెప్పవలయునేని ఆత్మ చేతనే! దేహము ఉనికిని కలిగియున్నది పరమాత్ముని వల్లనే! ప్రపంచము ఉనికిని కలిగియున్నది. విశ్వేశ్వరుని చేతనే! ఈ విశ్వము ఉనికిని కలిగియున్నది. ఈ విషయము తెలిసినవాడే వివేకి, లేక జ్ఞానియని చెప్పబడును. ఈ విషయము తెలియనివాడు అవివేకి, లేక అజ్ఞాని యని చెప్పబడును. వివేకము కలిగి జీవించుటయే! మానవజీవితమునకు సార్థకత. కావుననే పెద్దలు వివేకము లేనివాడు వింతపశువని పలికిరి.

ఆధ్యాత్మిక చింతన కలవారి గృహములన్నింటియందును “దేవుని గది” యుండును. దేవుని మరచిపోకుండాయుండుటకు ఈ గది మనకు సహకరించును. ఐతే దేవుడీ గదిలోనే ఉన్నాడు, మరొకచోట లేడనుకొనుట పొరపాటు. మన గృహములో దేవుని గది యున్నట్లే, మన దేహమునందున్నూ హృదయమనెడి దేవుని గది యున్నది. ఈ గదియందు దేవుడుండి ఉచ్ఛ్వాస నిశ్వాసలను జరుపుచుండును. కావున మన దేహము చలించుచున్నది. అదే విధముగా ప్రపంచమునందున్నూ పరమేశ్వరుడుండి, సూర్య–చంద్ర–నక్షత్రాదులను చలింపజేయుచున్నాడు. మఱియు విశ్వమునందు విశ్వేశ్వరుడుండి బ్రహ్మ–విష్ణు–రుద్రాదులను చలింపజేయుచున్నాడు. ఒకేయొక శక్తి దేహమునందును, ప్రపంచమునందును, విశ్వమునందున్నూ పనిచేయుచుండును. అట్టి శక్తి పరాశక్తియని చెప్పబడును. దేవుడు జగత్తును సృష్టించినప్పుడాతడు “బ్రహ్మ”యని చెప్పబడును. దేవుడు జగత్తును పోషించినప్పుడు “విష్ణు”వని చెప్పబడును. దేవుడీ జగత్తును తనలో లయింపజేసికొన్నప్పుడాతడు “రుద్రుడ”ని చెప్పబడును. ఐతే, దేవుడీ సృష్టి–స్థితి–లయముల నొనర్చుటకుగల కారణమేమి? ఒక బాలుడు ఇసుకతో ఒక చిన్న ఇల్లును నిర్మించి, దానిని చూచి, సంతోషించి, తుదకు దానిని నిర్మూలించును. ఇది కేవలము తన సంతోషమునకై తాను చేయు కార్యము. అదేవిధముగా “లోకవత్తు లీలా కైవల్యమ్” అనెడి బ్రహ్మసూత్ర సిద్ధాంతానుసారముగా దేవుడున్నూ తన లీలానాటకము నందు లోకములను సృష్టించి, పోషించి, లయింపజేయుచుండును. ఈ ఆటలో మనమున్నూ పాల్గొన్నచో మనకు లవలేశమైన

దుఃఖముగాని, చింతగాని, సమస్య గాని ఉండదు. జగన్నాటక సూత్రధారి యొక్క ఆదేశమును పాలించుచున్నచో, మనము ఆనందసాగరము నందోలలాడగలుగుదుము. అట్లుగాక మనము మన ఇష్టానుసారవర్తనులమగుదుమేని, మనకు కష్టపరంపరలు తప్పవు. మనకు ఇల్లు ఉన్నంత వరకు ఇంటినుండి బయటికి వెళ్ళుట, బయటినుండి ఇంటిలో ప్రవేశించుట జరుగుచుండును. అదే విధముగా శ్వాస రూపమునందున్న జీవుడు నాసిక ద్వారా లోనికి వెళ్ళుట, బయటికి వచ్చుట జరుగుచుండును. ఆత్మ దేహమునందు బంధింపబడి జీవుడనబడును. ఈ జీవునికి దైవస్మరణ ఎంతకెంతకు పెరుగుచుండునో, అంతకంతకాతనికి ఉన్నతజన్మ లభించుచుండును. ఇక దేవుని మఱచిపోయినప్పుడీ జీవుడు ఉన్నత యోనిని వదలి క్షుద్రయోనిలో ప్రవేశించుచుండును.

కావున మానవులమైన మనమందఱమున్నూ అహర్నిశము మాధవుని చింతించుచుండవలయును. పరమధామమునొందినప్పుడు జీవుడు జనన మరణములనుండి విముక్తుడగును. ఒక నది సముద్రమునందు ప్రవేశించునంతవరకు తన ప్రయాణమును నిరంతరము కొనసాగించుచుండును. సముద్రమునందు ప్రవేశించిన తర్వాత ప్రయాణము ఆగిపోవును. అందువలన మనమీ ప్రపంచమునందున్నంత వరకు మన ప్రయాణమును కొనసాగించుచునే యుండవలయును. ఒక్కొక్కప్పుడు నది ప్రవహించుచు ప్రయాణము చేయుచున్నప్పుడు దారిలో కొండలు, గుహలు అడ్డుపడుచుండును. ఐనను తన ధ్యేయమునందు నిష్ఠతో అడ్డంకులన్నింటిని తొలగించుకొని, నది ప్రయాణము చేయుచునేయుండును. చివరకు "నదీనాం సాగరోగతిః" అన్నట్లు గంగానది గంగాసాగరమును చేరుకొనును. అంతటితో గంగానదియొక్క ప్రయాణము సమాప్తమగును. కాని ఈ సముద్రములోని జలము ఎండ కాలములో ఆవిరియై, తదనంతరమది మేఘరూపమును దాల్చి, వర్ష కాలములో వర్షించుటచే మరల నది తన రూపమును ధరించును. "ఆత్మనః ఆకాశ స్సంభూతః ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ" అనగా:– ఆత్మనుండి ఆకాశముద్భవించినది. ఆకాశము నుండి వాయువు జనించినది. వాయువు నుండి అగ్ని ఉత్పన్నమైనది. అగ్ని నుండి జలమేర్పడినది. జలమునుండి పృథ్వి జనించినది. నిజమైన సాధకుడు ఈ సోపానములనన్నింటినధిగమించి, ఆత్మానంద సాగరమును చేరుకొనును. అప్పుడు "యద్గత్వాన నివర్తంతే తద్ధామ పరమంమమ"అను వాక్యార్థమునను భూతమొనర్చుకొనును. ఇందు నిమిత్తమై దేహమును ఒక దేవాలయముగా భావింపవలయును. "దేహోదేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః

। త్యజేదజ్ఞాన నిర్మాల్యం సో-హం భావేనపూజయేత్” ఏర్పడును. అనగా దేహమే! దేవాలయము; దీనియందున్న జీవుడే! దేవుడు. కాని అజ్ఞానమనెడి నిర్మాల్యమును తొలగింపవలయును. అప్పుడు “సో-హం భావన” ఏర్పడును. అనగా:- దేవునికి- జీవునికి మధ్య భేదముండదు. కావున దేవుని ఇల్లైన ఈ దేహమును పరిశుద్ధ మొనర్చుకొని, పరమాత్ముని దర్శించుకొని నిత్యానంద సాగరమునందోలలాడుదుము గాక!

## 37. ఆశ్చర్య వత్పశ్యతి

“ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః।
ఆశ్చర్యవచ్చైన మన్యః శృణోతి, శ్రుత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్॥”

పై శ్లోకము శ్రీమద్భగవద్గీతలోని రెండవ అధ్యాయమునందలి 29వ శ్లోకము. ఈ శ్లోకములోని “ఏనం” పదమునకు “ఆత్మ”యను అర్థమును స్వీకరింప వలయును. మొదటిపాదమునకు ఈ ఆత్మను ఒకానొకడు ఆశ్చర్యముతో చూచునని అర్థము. ఆత్మ కంటికి కానబడునట్టి వస్తువు కాదు కదా! అట్టి ఎడల దీనిని చూచుట ఎట్లు సంభవించునను ప్రశ్న ఉదయించును. జ్ఞాననేత్రముతో చూచునని చెప్పవచ్చును. మఱియు “ఆత్మవత్సర్వా భూతాని” అనెడి ఆర్యోక్తి ఒకటి కలదు. సకల భూతములలో, సకల పదార్థములను చూచినను, ఆత్మ చూచినట్లే యగును. ఐతే ఆత్మ నశించునది. కాదు కదా! పదార్థములన్నియును నశించును కదా! యను సందేహమిచ్చుట కలుగును. పదార్థములు నశించినను పదార్థములలోని సారవస్తువు నశింపదు. కుండ నశించినను మట్టికి నాశములేదు. దేహము నశించినను దేహములోని ఆత్మకు నాశములేదు. ప్రపంచము నశించినను ప్రపంచమును సృష్టించిన పరమాత్మకు నాశములేదు. తల్లిగర్భము నుండి జన్మించిన ప్రతి పసిబిడ్డయు ప్రపంచమును చూచి ఆశ్చర్యము నొందును. పొయ్యిలో వెలుగుచున్న అగ్నిని చూచి, ఆశ్చర్యముతో దానిని పట్టుకొనబోవును. కాని తల్లి ఆ పసిబిడ్డను అగ్ని వైపు పోకుండా వారించును. ఆకాశములోని చంద్రుని చూచి, పసిబిడ్డ ఆశ్చర్యము నొందును. తర్వాత ఆ పసిబిడ్డ గృహములోనికి రాగానే ఆ విషయమై మరచిపోవును. ఇంటిలో ప్రాకుచున్న చీమను చూచి, పసిబిడ్డ ఆశ్చర్యముతో దానిని పట్టుకొనబోవును. కాని చీమకుట్టినచో పసిబిడ్డ బాధపడునని తలంచి, తల్లి పసిబిడ్డను ఆ చీమ నుండి వైదొలగునట్లు చేయును.

ఇక పై శ్లోకములోని రెండవపాదమునకు “ఈ ఆత్మను గూర్చి మరియొకడు ఆశ్చర్యముతో పలుకున”ని అర్థము. ఆత్మ అనిర్వచనీయము, అవర్ణనీయము. కావున దానిని గూర్చి పలుకుట ఎవరికిన్నీ సాధ్యము కాదు. ఐనను విద్వాంసులు, కవులు, జ్ఞానులు, భక్తులు దానిని గూర్చి పలుకుటకై ప్రయత్నించిరి. “రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ” అనెడి సామెత కలదు. అనగా:- రామరావణుల యుద్ధము రామరావణుల యుద్ధమువలె ఉన్నదని అర్థము. కారణమేమనగా:- రామరావణుల మధ్య జరిగిన యుద్ధముతో పోల్చుటకు తగిన మరియొక యుద్ధము లేదని భావము. అదే విధముగా “సాగరం సాగరోపమమ్” అను సామెత కలదు. అనగా:- సముద్రము సముద్రమువలె ఉన్నదని అర్థము. కారణమేమనగా:- సముద్రముతో పోల్చుటకు తగిన మరియొక పదార్థములేదు. అదే విధముగా ఆత్మను ఆత్మతోనే పోల్చవలసియుండును. ఆత్మయందన్ని పదార్థములును గర్భితములైయున్నవి. కావున ఆత్మను ఆత్మయే వర్ణింప గలుగును. ఆత్మను ఆనాత్మ వర్ణింపజాలదు.

“ మరియొకడు ఈ ఆత్మనుగూర్చి ఆశ్చర్యముతో శ్రవణము చేయున”ని పై శ్లోకములోని మూడవపాదమునకర్థము. ఆత్మజ్ఞుడైన గురువు ఆత్మ అనగా ఏమియో తెలియని శిష్యుని కుపదేశించును. ఆత్మకు సంబంధించిన విషయములన్నింటిని శిష్యుడు ఆశ్చర్యముతో శ్రవణము చేయుచుండును. సముద్రమును చూడనివానికి సముద్రము గుఱించి ఎంతగా వర్ణించి చెప్పినను, ఆతనికి బోధపడదు. ఆతడా సముద్రమును దర్శించినప్పుడు మాత్రమే! చక్కగా బోధపడును. అదే విధముగా ఆత్మ సాక్షాత్కారము నొందనంతవరకు ఆత్మ విషయమై మనము తెలికొనజాలము. ఆత్మప్రబోధమును గురువుగారి నుండి శ్రవణము చేసిన తర్వాత దానిని మననము చేయుచుండ వలయును. మననము చేయగా, చేయగా మనస్సు తన చంచలమైన స్వరూపమును కోల్పోయి, ఆత్మస్వరూపము నొందును. ఇది “భ్రమరకీటక న్యాయము” వంటిది. సామాన్యమైన ఒక కీటకమును తెచ్చి, తుమ్మెద దానిని తన గూటియందుంచి, దాని చుట్టు తిరుగుచు, ఝంకారము చేయుచుండును. ఆ ఝంకారమును విని, విని, తుట్టతుదకా కీటకము తుమ్మెదగా మారిపోవును. ఐతే ఆత్మను గూర్చి ఎంత శ్రవణము చేసినను దానిని తెలిసికొనుట కష్టము. ఏల? ఆత్మను గూర్చి తెలిసికొన్న తర్వాత అనాత్మ ఆత్మగా మారిపోవును. ఇది కీటకము భ్రమరముగా మారుటవంటిది. ఆత్మ తెలియబడనంత వరకే అజ్ఞాన కారణముచే అన్ని రకములగు సమస్యలుండును. ఆత్మజ్ఞానము కలిగిన తర్వాత సమస్యలన్నియును సమసిపోవును. ఈ ప్రపంచము

నందున్నంత వరకు మన మీ ప్రపంచములోని సుఖదుఃఖములకు గుఱియగుచుందుము. పుణ్యఫలముచే  మనము స్వర్గలోకమునకు వెళ్ళినప్పుడు స్వర్గలోక భోగముల ననుభవింపవలసి వచ్చును. ఇక "క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి"యనునట్లు పుణ్యఫలము సమాప్తమైన వెంటనే మన మీ భూలోకమునందు పతనమగుట సంభవించును. కావున పతనము లేని భూమికను చేరుకొనుటయే! ఆత్మసాక్షాత్కార మనబడును. ఆత్మసాక్షాత్కారము నొందిన తర్వాత మనము కృతకృత్యుల మగుదుము. అనగా:– చేయవలసిన దానిని చేసినవార మగుదుము.

మనమీ ప్రపంచములో చేయవలసినదేమి కలదు? దేనిని చేసినచో ఇక చేయవలసిన దేమియు మిగిలియుండదో దానిని చేయవలయును. మనము దేవుని దర్శించినచో, అన్నియు దర్శించినట్లగును. ఇచ్చట దేవుడనగా:– దేవాలయములు, గుళ్ళు, గోపురములలోని దేవుడని అర్థము కాదు. ఈ దేవుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడైన దేవుడు. ఇట్టి దేవుని గూర్చి వర్ణించినచో, అన్నింటిని వర్ణించినట్లే యగును. కావున ఇట్టి దేవుని గూర్చి తెలిసికొన్నచో, అన్నింటిని తెలిసికొన్నట్లేయగును. ఆత్మ సాక్షాత్కారము నొందినవ్యక్తి సూర్యునితో కలిసి ప్రపంచమును ప్రకాశింప జేయుచుండును. చంద్రునితో కలిసి రాత్రివేళ వెన్నెల నొసంగును. సముద్రముతో కలిసి గర్జన చేయుచుండును. వాయువుతో కలిసి వీచుచుండును. భూదేవితో కలిసి భూమండలమును పరిపాలించుచుండును. ఆతడన్నింటితో తాదాత్మ్యమునొంది, అన్నియు తానై భాసించుచుండును. "అహంబ్రహ్మాస్మి" వాక్యముననుభూత మొనర్చుకొన్నవాడే! ఆత్మసాక్షాత్కారము నొందగలుగును. అప్పుడు తాను ప్రపంచమును చూచి, ఆశ్చర్యము నొందుటకు బదులుగా, ప్రపంచమే! అట్టి వానిని చూచి, ఆశ్చర్యము నొందుచుండును.

## 38. ఇదం శరీరమ్

"ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే।
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః॥"

పై శ్లోకము శ్రీ మద్భగవద్గీతలోని 13వ అధ్యాయములోని 1వ శ్లోకము. ఈ శ్లోకమును శ్రీకృష్ణభగవానుడు అర్జునుని సంబోధించి చెప్పెను; అనగా:– అర్జునుని నిమిత్తముగా చేసుకొని  ఆధ్యాత్మిక సాధకులందఱికి  చెప్పెనని భావము. అర్జునుడు కుంతీపుత్రుడు. అందువల్ల పై శ్లోకమునందర్జునుడు "కౌంతేయ"అని సంబోధింప బడెను. అర్జునునివలె  మనమందఱమున్నూ తల్లిగర్భమునుండి వచ్చిన వారమే

కదా! ఐతే, తల్లి గర్భమునుండి కేవలము శరీరముమాత్రము బయటికి రాలేదు. శరీరముతో పాటు శరీరి కూడా బయటికివచ్చెను. శరీరి అంటే శరీరమునందున్న ప్రాణము, లేక ఆత్మ యని అర్థము. ఒకవేళ శరీరము మాత్రమే బయటికి వచ్చియుండినచో తల్లి, తండ్రి, బంధు బాంధవులందఱును కన్నీరు కార్చియుండెడివారు. కాని శరీరి వచ్చిన కారణముచే తల్లిదండ్రులతో పాటు బంధుబాంధవులందఱును ఆనందోత్సవమును జరుపుచుందురు. కావున ఈ దేహము అసత్పదార్థమని తెలియుచున్నది.

ఈ శరీరము క్షేత్రమని చెప్పబడునని శ్రీకృష్ణుడు పలికెను. పంటచేలను, ఫలవృక్షములను కలిగియుండునది క్షేత్రము. అదేవిధముగా ఈ దేహము వివిధములగు కర్మఫలములను కలిగియుండును. ఒక వృక్షముయొక్క బీజము మరొక వృక్షమునకు కారణమగునట్లే, ఈ దేహము మరొక దేహమునకు కారణమగును. కావున ఈ దేహము క్షేత్రమని చెప్పబడినది. ఈ దేహమును తెలుసుకొనువాడు క్షేత్రజ్ఞుడు. ఈ క్షేత్రజ్ఞుడు మన దేహమునందేయున్నాడు. ఆ దేహమునందున్నట్టి వాడే "నా దేహము, నా నేత్రము, నా శ్రోత్రము, నా చేయి, నా కాలు, నా ఉదరము, నా వీపు" అని పలుకుచున్నాడు. కావున ఈ దేహమును, దేహములోని ఇంద్రియములను తెలుసుకొనువాడు క్షేత్రజ్ఞుడని చెప్పబడును. "దహ్యతే ఇతి దేహః" దహింపబడునదేదో, అది దేహమని చెప్పబడును. "శీర్యతే ఇతి శరీరమ్" నశించు స్వభావమును కలిగియుండుటచే శరీరమని చెప్పబడును. ఇక "దేహి" లేక "శరీరి"యొక్క స్వభావమెట్టిదో తెలిసికొందము. "దేహి" అంటే దేహమునందున్న పదార్థమని అర్థము. "శరీరి" అంటే శరీరమునందున్న పదార్థమని అర్థము. దీనిని తెలిసికొనుటయే! మనందఱి కర్తవ్యమైయున్నది. దీనిని తెలిసికొనుటచే మనము కృతకృత్యుల మగుదుము. అనగా:- చేయవలసిన దానిని చేసినవారమగుదుము.

ఈ దేహమునందున్న ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. జలము తడుపజాలదు. గాలి ఎండింప జాలదు. ఇక దేహమో శస్త్రములచే ఛేదింపబడును. అగ్నిచే దహింపబడును. జలముచే తడుప బడును. గాలిచే ఎండింపబడును. కావున ఈ దేహి- దేహముల మధ్య భూమ్యాకాశములవంటి భేదము కలదు. ఈ ఉపమానము కూడా అనుచితమని చెప్పవచ్చును. ఏలననగా:- భూమి, ఆకాశము రెండున్నూ పంచభూతములలో చేరును. ఇక దేహమునందున్న ఆత్మ పంచభూతముల కతీతమైయున్నది. అంతేకాదు, మనస్సు, బుద్ధి, చిత్తము,

అహంకారములకున్నూ అతీతమైయున్నది. ఆత్మ మనస్సుచే తెలియబడదు. బుద్ధిచే యోచింపబడదు. చిత్తముచే చింతింపబడదు. అహంకారముచే పీడింపబడదు. కావున ఆత్మ వీటన్నింటికి అతీతమైయున్నది. ఈ కారణముచే ఆత్మ అసంగమని చెప్పబడును.ఆత్మయందు సత్త్వరజస్తమోగుణములు కూడా లేవు. ఈ కారణముచే ఆత్మ నిర్గుణమని చెప్పబడును. ఆత్మయందు అజ్ఞానాంధకారము లేదు. ఈ కారణముచే ఆత్మ నిరంజమని చెప్పబడును. ఆత్మయందు విభాగములు లేవు. కావున ఆత్మ నిష్కళమని చెప్పబడును.

దేహి ఆత్మ–దేహము అనాత్మ; దేహి పురుషుడు– దేహము ప్రకృతి; దేహి క్షేత్రజ్ఞుడు– దేహము క్షేత్రము. "నన్ను క్షేత్రజ్ఞునిగా తెలిసికొనుము"ని శ్రీకృష్ణుడు అర్జునునితో పలికెను. ఆ పరబ్రహ్మమే! శ్రీకృష్ణుని రూపమును ధరించెనని దీనిని బట్టి తెలియుచున్నది. నిజమునకు ఆ పరబ్రహ్మమే! మనందఱి శరీరములను ధరించినది. ఐతే ఆ విషయము మనకు తెలియదు. ఈ కారణముచేతనే మనకు దుఃఖపరంపరలు తప్పుట లేదు. "దేహము నేన"ను కొనుటయే! మహాపాపము."దేహిని నేన"ను కొన్నవానికి దేహము నశించునను చింతలేదు. స్వప్నమునందు మనమెన్నో దేహములను చూచుచుందుము. మేల్కొన్నప్పుడవి యన్నియును నశించును. అంతమాత్రముచే మనము దుఃఖించుచున్నామా? లేదు. అట్లే క్షేత్రము నశించినను క్షేత్రజ్ఞుడు దుఃఖింపడు. క్షేత్రజ్ఞుడు లేనిచో క్షేత్రమునకు ఉనికి లేదు. అది ఎట్లనగా:– దారములేనిచో వస్త్రమునకు ఉనికిలేదు కదా! మట్టి లేనిచో కుండకు ఉనికి లేదు కదా! బంగారము లేనిచో ఆభరణమునకు ఉనికి లేదు కదా! కఱ్ఱ లేనిచో కుర్చీలు, బల్లలు, మేజాలకు ఉనికియుండదు కదా!

ఈ ప్రపంచమొక పెద్ద క్షేత్రము వంటిది. ఈ ప్రపంచమును సృష్టించిన వాడే పరమాత్మ! కావున పరమాత్మయే క్షేత్రజ్ఞుడు. జీవులమైన మనము అజ్ఞానాంధకారము నందు మునిగియున్న కారణముచే క్షేత్రజ్ఞుని తెలిసికొనజాల కున్నాము. కావుననే జనన మరణ చక్రమునందు పరిభ్రమించుచున్నాము. ఈ జననమరణ బంధమునుండి విడివడుటకై మనము క్షేత్రజ్ఞుని తెలిసికొనవలసి యున్నది. ఐతే ఈ క్షేత్రజ్ఞుని నివాసమెచ్చట? మన హృదయ గుహయే! ఈ క్షేత్రజ్ఞునికి నివాసము. ఈ హృదయేశ్వరుని తెలిసికొన్నవాడు సకలజీవుల హృదయాంతర్వాసియైన హృదయేశ్వరుని కూడా తెలిసికొనజాలును. మన దేహము ఎంత వరకు మృణ్మయమైయుండునో, అంతవరకు మనము మన హృదయేశ్వరుని తెలిసికొనజాలము.

మన దేహముచిన్మయమైనప్పుడు మనలోని హృదయేశ్వరునే గాక, సకల జీవుల హృదయాంతర్వాసియైన హృదయేశ్వరుని కూడా తెలిసి కొనజాలుదుము. అఖండ భగన్నామ స్మరణచే మన దేహము చిన్మయమగును. మహావాక్య చతుష్టయమును శ్రవణ-మనన-నిదిధ్యాసనల నొనర్చుటచే మన దేహము చిన్మయమగును.

మన దేహము మట్టిలో కలిసిపోయినను, అగ్నిలో దహింపబడినను, గంగానదిలో పడవేసినను, సముద్రమునందు త్రోయబడినను, కొందఱి ఆచారము ప్రకారముగా కాకులు-గ్రద్దలు తినుటకు అరణ్యమునందు పడవేయబడినను మరణభీతినొందనివాని దేహము "చిన్నయమ"ని చెప్పవచ్చును. మన భావము దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములకు అతీతమైయుండుటయే! చిన్మయానందము, లేక చిదానందములనొందుట. అట్లుకాదేని మృణ్మయా నందమునొందిన వారమగుదుము. అనగా:- వారి ఆనందము దేహమున్నంత వరకే పరిమితమై యుండును. ఈ దేహము నపుంసక లింగము. ఈ దేహము నందున్నవాడు పురుషుడు. స్త్రీత్వము, పురుషత్వము కేవలము దేహమునకు సంబంధించినదైయున్నది. నిజమైన పురుషుడు స్త్రీపురుషులందఱియందును, సకల చరాచర జగత్తంతయు వ్యాపించియున్నాడు. ఇట్టి పురుషోత్తముని సాక్షాత్కారించుటయే! సాధకుల యొక్క జిజ్ఞాసువుల యొక్క, భక్తుల యొక్క, ముముక్షువులయొక్క జీవిత లక్ష్యమైయున్నది.

## 39. ఉత్తమః పురుషస్త్వన్యః

పై శీర్షిక శ్రీమద్భగవద్గీతలోని పదునైదవ అధ్యాయమునందలి పదునేడవ శ్లోకములోని ఒక భాగము. ఉత్తమ పురుషుడెవ్వడను విషయమా శ్లోకమునందు చర్చింపబడినది. పరమాత్మయే! ఆ ఉత్తమపురుషుడు. ఆత్మలన్నింటికి ఆత్మయే! పరమాత్మ. ఆతడు భూః, భువః, సువః అనెడి మూడులోకములలోను వ్యాపించి, ఆ లోకత్రయమును పోషించుచున్నాడు. ఈ పురుషునికి నాశములేదు. అందువల్ల ఈశ్వరుడని చెప్పబడుచున్నాడు. ఇక పదహారవ శ్లోకమీ క్రింది విధముగానున్నది:

"ద్వావిమౌ పురుషౌలోకే క్షరశ్చాక్షర ఏవచ ।
క్షరః సర్వాణి భూతాని కూటస్థో-క్షర ఉచ్యతే ॥

అనగా:- ఈ లోకమునందు క్షర-అక్షర అనెడి రెండు రకముల పురుషులున్నారు. సకల భూతములయందుండువాడు క్షరపురుషుడు. ఆక్షరపురుషుడు కూటస్థుడని

చెప్పబడును. ఈ కూటస్థుడు అక్షరుడు. అనగా:- నాశము లేనివాడు. అనగా:- ఈ మూడులోకములున్నంతవరకాతనికి నాశము లేదు. ప్రళయకాలములో ఈ మూడు లోకములు పరమాత్మునియందు లయమైనప్పుడీ అక్షరపురుషుడు కూడా లయమగును.

కావున ఈ అక్షరపురుషుడు దీర్ఘకాలము తర్వాత నశించుననని భావము. అదెట్లనగా:- స్వప్న-సుషుప్త్యవస్థలతో పోల్చినప్పుడు జాగ్రదవస్థ శాశ్వతమనబడును. ఇక మరణముతో పోల్చినప్పుడు ఈ జాగ్రదవస్థ కూడా అశాశ్వతమేయగును. అదే విధముగా క్షరపురుషునితో పోల్చినప్పుడు అక్షరపురుషుడు శాశ్వతుడు. ఇక పరమాత్మతో పోల్చినప్పుడు అక్షర పురుషుడు కూడా అశాశ్వతుడే! యగును. కావున సాధకుడు ఉత్తమపురుషుని పొందుటయే! లక్ష్యముగా కలిగియుండవలయును. కావుననే పదునైదవ అధ్యాయమునకు "పురుషోత్తమ ప్రాప్తియోగమ"ని పేరు. ఈ పురుషోత్తముని తెలిసికొన్నవాడు "సర్వవిత్" అగును. అనగా:- అతడన్నింటిని తెలిసికొనగలుగును. అతనికి తెలిసికొనవలసిన విషయము మరొకటి శేషించియుండదని భావము. ఈ పురుషోత్తముని తెలుసుకొన్నవాడు కృతకృత్యుడగును. అనగా:- ఆతడన్నింటిని చేసినవాడగును. అతనికి చేయవలసిన మరియొక కర్తవ్యము మిగిలియుండదని భావము. ఈ కారణముచే ఆతడు పూర్ణకాముడై, పూర్ణ సంతృప్తుడైయుండును.

ఐతే ఈ పురుషోత్తముని తెలిసికొనుటెట్లు? పురుషోత్తముని తెలిసికొనుటకై ఆధ్యాత్మిక సాధకుడు ద్వంద్వరహితుడై యుండవలయును. అనగా:- రెండవ వస్తువుపై మనస్సును పోనీయరాదు. ఇప్పుడు నిజమునకు రెండవ వస్తువు ఉన్నదా? అను ప్రశ్న ఏతెంచును. రెండవ వస్తువునకు ఉనికి లేదు. కారణమేమి, భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు. ఇక భగవంతుడు సర్వవ్యాపకుడైనచో, రెండవ వస్తువులేదు. కారణమేమి? నానాత్వమే! ఈ జగత్తు. అందువల్లనే ఇది ద్వంద్వ జగత్తని చెప్పబడుచున్నది. ప్రస్తుతము మనము నిజమైన ఆధ్యాత్మిక సాధకుని విషయమై చర్చించుచున్నాము. నిజమైన ఆధ్యాత్మిక సాధకుడు సర్వకాల సర్వావస్థలలో "సర్వం బ్రహ్మమయం జగత్త"ను భావము నందనురక్తుడై యుండును.

నిజమైన ఆధ్యాత్మిక సాధకుడు జాతి, నీతి, కుల, గోత్ర దూరగుడై యుండును. జన్మనుబట్టి జాతి ఏర్పడును. జన్మ శరీరమునకు సంబంధించినది. "శీర్యతే ఇది శరీరః" శరీరమునకు నశించు స్వభావము కలదు. కావున జనన మరణ రహితుడైన పురుషోత్తముని యందునికి కలవానికి జాతి ఎక్కడిది? నీతినియమాలు ఈ ప్రపంచమునకు సంబంధించినవి. ఈ ప్రపంచమునందున్నంతవరకు ప్రతి

మనుజుడున్నూ నీతిని పాటించుట అత్యవసరము. ఇతరుల కష్టములు తన కష్టములే! యని భావించుట నీతికి లక్షణము. ఇక ఇతరులే లేనప్పుడు నీతితో అవసరమే ముందును? కులము ఒక మనుజుని మరొక మనుజునితో ఎడబాటును కలిగించును. పురుషోత్తమ ప్రాప్తియే! లక్ష్యముగా కలిగియున్న సాధకుడు కులము అనెడి కుడ్యమును కూలద్రోయును. ఒక వ్యక్తి అభినస గోత్రమునందు జన్మించినవాడను కొనుడు. ఆ గోత్రము ఆత్మసాక్షాత్కారము నొందిన ఆ ఋషికి సంబంధించినది. అందువల్ల ఆత్మసాక్షాత్కారము నొందుటయే! మన జీవిత లక్ష్యమగును. కాని గోత్రము యొక్క గొప్పలను చెప్పుకొనుట కాదు.

ఇక మతము గూర్చి కొంత చర్చింతము. ఏ మతమైనను ఆ పరమాత్మను చేరుటకొకమార్గమే! అట్టి ఎడల మతకలహము లేలయుండవలయును? మతకలహ మొనర్చువానికి మతమనగా ఏమియో తెలియదని అర్థము. ఒక మతము కాలిబాట వంటిది కావచ్చును. మరొక మతము సైకిల్‌పై ప్రయాణము చేయుట వంటిది కావచ్చును. ఇంకొక మతము స్కూటర్‌పై పయనించునట్టిది కావచ్చును. వేరొక మతము బస్సులో ప్రయాణమొనర్చుట వంటిది కావచ్చును. ఇంకొక మతము కారులో ప్రయాణించుట వంటిది కావచ్చును. వేరొక మతము రైలుబండిలో పయనించుట వంటిది కావచ్చును. మరొక మతము విమానములో ప్రయాణమొనర్చుట వంటిది కావచ్చును. ఐతే ఈ మతములన్నియును ఒకే లక్ష్యమును చేర్చునను విషయమును మరువరాదు. మతములన్నియును ఒకే పాఠశాలలోని భిన్నమైన తరగతులవంటివి. పరమాత్మ మతములన్నింటికి అతీతమైనది. మతములన్నియును ఈ ప్రపంచమునకు సంబంధించినవి. ఇక ప్రపంచమంతటా పరమాత్ముడు నిండియున్నాడు. కావున మతము లన్నింటియందును పరమాత్మ యొక్క అస్తిత్వమున్నదని భావము. నాస్తికునియందున్నూ ఆ పరమాత్మ యొక్క అస్తిత్వమున్నది. దేవుడు లేడని చెప్పువాడు నాస్తికుడనబడును.

దేవుడు లేడని చెప్పుచున్నవాడెవ్వడు? అతడే! పరమాత్మ. దేవుడు లేడని చెప్పుట "నా నోటిలో నాలుక లేద"ని చెప్పుట వంటిది. నాలుకయే లేనిచో ఎవడైనా నోటితో మాట్లాడగలుగునా? పరమాత్ముని మాయ కడుంగడు విచిత్రమైనది. అతడీ ప్రపంచమంతటను నిండియుండియు ఈ చర్మచక్షువుల కగోచరుడై యున్నాడు. నిజమునకు ఉత్తమపురుషుని చేరుటకు మనము ప్రయాణము చేయవలసిన అవసరమేలేదు. అతడిప్పుడిచ్చటనే పొందబడును. కాని ఇందు నిమిత్తమై వ్యక్తిత్వము

అవ్యక్తము కావలసియుండును. పూర్వసంస్కారము లన్నియును దహింపబడవలసి యుండును. నూతనసంస్కారములకవకాశము లేకుండా యుండవలసియుండును. కేవలము అట్టి సందర్భమునందు మాత్రమే! జీవుడు దేవుడగుట కవకావము కలదు. జీవాత్మ పరమాత్మ స్వరూపము నొందుట కవకాశము కలదు. అప్పుడు మాత్రమే! సాధకుడు "అహం బ్రహ్మోస్మి" యని ఘోషించుట కర్హుడగును. అప్పుడు మాత్రమే! గురుదేవుడు "తత్త్వమసి" యని శిష్యుని కుపదేశింపగలుగును. అప్పుడు మాత్రమే! శిష్యుడు "అయమాత్మా బ్రహ్మ"యనియు "ప్రజ్ఞానం బ్రహ్మ"యనియు తెలిసికొని, చతుర్వేదసారము ననుభూతమొనర్చుకొని, బ్రహ్మానందసాగరమునందోలలాడగలుగును. అప్పుడు మాత్రమే! గురుశిష్య సంబంధము చరితార్థమగును. అప్పుడు మాత్రమే! ఆత్మసాక్షాత్కారము, దైవసాక్షాత్కారము, లేక బ్రహ్మసాక్షాత్కారము పొందబడును.

## 40. చదువులలోని మర్మము

"చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!"యని భక్తప్రహ్లాదుడు తన తండ్రియగు హిరణ్యకశిపునితో పలికెను. ఐతే "చదువులలో మర్మమనగానేమి?" అను విషయమును గూర్చి మనమిప్పుడు విచారింతము. చదువులతల్లి సరస్వతీ దేవి. ఈ దేవి తెల్లని చీరెను ధరించును. ఇది సత్త్వగుణమునకు ప్రతీకము. ఈ దేవి ఒక హస్తమునందు పుస్తకమును ధరించును. మరొక హస్తమునందు వీణను ధరించును. వీణ ఓంకార నాదమునకు ప్రతీకము. పుస్తకము ఆత్మజ్ఞానమునకు ప్రతీకము. కావున సాధకుడు సత్త్వగుణమును సంపాదించుకొని, ఓంకారోపాసన ద్వారా ఆత్మజ్ఞానము నార్జించుటయే! చదువులోని మర్మమని స్పష్టమగుచున్నది.

గణపతికి ఏనుగుతలయుండును. ఇది బుద్ధిశక్తికి ప్రతీకము. గణపతికి చెవులు పెద్దవిగానుండును. ఇది శ్రవణశక్తిని సూచించును. గణనాథుని వాహనము ఎలుక. ఇది మనస్సుయొక్క నియంత్రణను సూచించును. కావున సాధకుడు బుద్ధిశక్తిని పెంపొందించుకొని, గురూపదేశమును బాగుగా శ్రవణమొనర్చి, మనస్సును నిగ్రహించి, మోక్షసామ్రాజ్యమును సాధించుటయే చదువులలోని మర్మమని తెలియుచున్నది.

శ్రీకృష్ణుడు మురళిని చేతియందు ధరించును. మురళి అహంకార నిర్మూలనమునకు ప్రతీకము. శ్రీకృష్ణుడు అర్జునుని రథమునకు సారథియయ్యెను. ఇది దేహమనెడి రథమునకు పరమాత్మయే సారథియను విషయమును సూచించును. శ్రీకృష్ణుడు గోవులను రక్షించెను. ఇది సకలజీవ సంరక్షణను సూచించును. కావున

సాధకుడు తన అహంకారమును నిర్మూలించుకొన్నప్పుడాతని దేహమనెడి రథమును పరమేశ్వరుడు నడుపుచుండగా దైవానుగ్రహముచే రక్షింపబడును. తుదకు గోలోకమును చేరుకొనును. ఇదియే! చదువులలోని మర్మము.

గరుత్మంతుడు విష్ణుమూర్తికి వాహనము. శేషుడు విష్ణుమూర్తికి శయ్య, లక్ష్మీదేవి విష్ణుమూర్తి యొక్క వక్షస్థలమునందు వసించును. విషయవాసనలనెడి సర్పములను భక్షించునట్టివాడు గరుత్మంతుడు. మనస్సనెడి శయ్యయే శేషుడు. మోక్షసామ్రాజ్యమే లక్ష్మీదేవి. కావున సాధకుడు విషయవాసనలను నశింపజేసి, మనస్సును మట్టువరచినప్పుడే మోక్షసామ్రాజ్యలక్ష్మిని వరింపజాలునని తెలియుచున్నది. ఇదియే! చదువులలోని మర్మము.

శంకరభగవానుని శిరస్సునందు చంద్రకళ యుండును. ఇది క్షీణించిన మనస్సుకు ప్రతీకము. శివుని జటాజూటము నుండి గంగ ప్రవహించును. ఇది జీవుడు దేవలోకము నుండి భూలోకమునకు పతనమైన విషయమును సూచించును. శివుని దేహము భస్మలేపనమును కలిగియుండును. ఇది దేహము భస్మీభూతమగుటను సూచించును. కావున సాధకుడు భూలోకమునకు పతనమైన తన పరిస్థితిని గమనించినవాడై, దేహము ఒకప్పుడు భస్మీపటలమగునను విషయమును గ్రహించినవాడై, మనస్సులోని వాసనలను క్షీణింపజేసికొని, మోక్షధామమునొందుటకు ప్రయత్నింప వలయును. ఇదియే! చదువులలోని మర్మము.

వైజ్ఞానిక శాస్త్రవేత్తలెంతటి గొప్పవారైనను, వారు కేవలమీ ప్రపంచములోని పరిజ్ఞానమును మాత్రము కలిగియుందురే కాని, ప్రపంచాతీతమైన వస్తుపరిజ్ఞానము వారికుండదు. దేనిని తెలిసికొన్నచో తెలిసికొనవలసిన మరియొక వస్తువు మిగిలి యుండదో, దానిని తెలిసికొనుటయే! చదువులోని మర్మమును తెలిసికొనుటయగును. ఈ మర్మమును తెలిసికొనుటకై వైజ్ఞానిక శాస్త్రవేత్తలకు చేతకాని పని.

“పలికెడిది భాగవతమట – పలికించెడివాడు రామభద్రుండట” యనియు, “ముగురమ్మల మూలపుటమ్మ” యనియు “తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి” యనియును పోతనామాత్యుడు శ్రీమదాంధ్ర భాగవతమునందు పలికెను. కావున సాధకుడు ఆ శ్రీహరి పలికింపజేసెడి పలుకులను మాత్రము పలుకుచుండవలయును. ముగురమ్మల మూలపుటమ్మను తెలిసికొనుటకే తన జీవితమును వెచ్చింపవలయును. గురుదేవుడే హరి జేరుమని చెప్పెడి తండ్రికదా! అందువల్ల అట్టి తండ్రిని మాత్రమే

దరి జేరవలయును. ఈ ప్రకారముగా సాధకుడు హరిజేరుమనెడి తండ్రిని సమీపించి, శ్రీహరి పలికింపజేసెడి పలుకులను మాత్రము పలుకుచు, ముగురమ్మల మూలపుటమ్మను సాక్షాత్కరించుకొనుటకై ప్రయత్నింపవలయును. ఇదియే చదువులలోని మర్మము. ఇట్టి మర్మమును తెలిసికొన్నప్పుడు కర్మక్షయమగును. అప్పుడు అక్షయ సుఖధామము ఆతనికి ప్రాప్తించును. ఇదియే మోక్షధామమని చెప్పబడును.

"సర్వం విష్ణుమయం జగత్" ఈ జగమంతా విష్ణువుచే నిండియున్నది. అను విషయమును తెలిసికొనుటయే చదువులలోని మర్మము. "సర్వం బ్రహ్మమయం జగత్" ఈ జగమంతా బ్రహ్మముచే వ్యాపించియున్నది. అను విషయమును గ్రహించుటయే చదువులలోని మర్మము. ఇచ్చట విష్ణువునకు - బ్రహ్మమునకు భేదములేదు. "ఏకో-హం సర్వభూతాత్మా" "సకలపదార్థములయందున్న ఆత్మను నేనే" అను విషయమును అనుభవమునకు తెచ్చుకొనుటయే చదువులలోని మర్మము. "ఏకమేవా-ద్వితీయం బ్రహ్మ" "రెండవ వస్తువులేని ఒకేయొక పదార్థమునకు ఉనికి యున్నది" - అను విషయమును పరిగ్రహించుటయే చదువులలోని మర్మము. "ఏకం సద్విప్రా బహుధావదంతి" "సత్యమైన వస్తువు ఒక్కటే, దానినే పండితులు నానారకములుగా చెప్పుచుందురు" - అను విషయమును అనుభూతమొనర్చుకొనుటయే చదువులలోని మర్మము. "ఏకో వశీ సర్వభూతాంతరాత్మా" "అంతరాత్మ యందున్న ఒకే పదార్థము సకలజీవులను వశపఱచుకొనియున్నది" అను విషయమును అర్థమొనర్చుకొనుటయే చదువులలోని మర్మము. ఈ మర్మము తెలియనివారికి కర్మానుభవము తప్పదు; జనన మరణములు తప్పవు; సంసారసాగరములో పడిపోవుట తప్పదు; ఈతి బాధలు తప్పవు; జీవిత సమస్యలు తప్పవు. ఈ మర్మమును తెలిసికొనుటకై ఈ మర్మము తెలిసికొన్న గురుదేవుని దరిజేరవలసియుండును. తన తల్లిగర్భమునందున్న ప్రహ్లాదునికి నారదుడు దివ్యమంత్రోపదేశము నొసంగిన కారణముచేతనే ఆతనికి "సర్వం విష్ణుమయం జగత్తు" ను భావబీజమేర్పడెను. ప్రహ్లాదుడు తల్లిగర్భమునుండి జన్మించిన తర్వాత ఈ భావము బృహద్రూపము నొందుటచే తన తండ్రితో "ఇందుగల డందులేడను సందేహము వలదు తండ్రి" యని వాదించుటయే గాక, అనుభవ పూర్వకముగా ఒక జడమైన స్తంభమునుండి నరసింహావతారము ఆవిర్భవించునట్లు చేయగలిగెను. దీనికి కారణము ప్రహ్లాదుడు చదువులలోని మర్మమును తెలిసికొనుటయేకదా!

సాధకులు, భక్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులమైన మనమున్నూ ఇట్టి చదువులలోని మర్మమును తెలిసికొనుటకై మన జీవితములను వెచ్చించెదము గాక! మన మనస్సులను ఇందు నిమిత్తమై వినియోగించెదము గాక! మన హృదయములను మన హృదయేశ్వరుని యందు చొప్పించెదము గాక! ఇట్లొనర్చిననే తప్ప మనకా బ్రహ్మానందధామము ప్రాప్తించుటకల్ల. ఎల్లవేళలలో మన ఉల్లములు ఎల్లకాలముల యందున్న పరమేశ్వరుని యందు నిహితములై యుండును గాక! ఈ కార్యమును చదువులలోని మర్మమును తెలిసికొన్నవాడు మాత్రమే సాధింపగలుగును.

## 41. నాణ్యమైన వస్తువు

ప్రపంచములోని ప్రతి మానవుడున్నూ నాణ్యమైన వస్తువునే కోరుకొను చుండును. ఒక బాలుడు అందమైన, రమణీయమైన ఆటవస్తువులను కోరుకొనును. ఒక యువకుడు అందమైన, శీలవతియైన యువతిని కోరుకొనును. ఒక గృహిణి వంటచేయుటకై లేతవైన, మృదువైన వంకాయలను, బెండకాయలను కోరి, ఏరి అంగడిలో ఖరీదుచేయును. దేహాలంకరణయందభిలాషగల స్త్రీ అచ్చపు బంగారముతో చేయబడిన ఆభరణములను కోరుకొనును. తల్లిదండ్రులు తమ కుమారునికి అందాలరాశియు, సద్గుణవంతురాలునైన కన్యతో వివాహమొనర్పగోరుదురు. వస్త్రములను కొనువాడు ఎక్కువ కాలము మనునట్టి మఱియు శోభాయమానమైనట్టి నాణ్యమైన వస్త్రములను ఖరీదుచేయును. కడవలను, మట్టికుండలను కొనువాడు వాములో బాగుగా కాలినట్టి, టింగుమని మ్రోగునట్టి కుండలను కొనును. భూమిని కొనువాడు సారవంతమైన, ఎక్కువగా పంటలను పండింపగలుగునట్టి భూమిని ఖరీదుచేయును.

ఐతే ఈ ప్రాపంచిక పదార్థములన్నియును నాణ్యమైన వస్తువులే అగునా? కాదా? అను విషయమును మనమిప్పుడు విచారింపవలసియున్నది. దేనిని మించిన మరొక వస్తువు లేదో, అదియే! అత్యంత శ్రేష్ఠమైన నాణ్యమైన వస్తువుగా పరిగణింప బడును. ఏది ఎల్లకాలముండునో, అదియే! నాణ్యమైన వస్తువుగా పరిగణింపబడును. ఏది శాశ్వతానందము నొసంగునో, అదియే! నాణ్యమైన వస్తువుగా తలంపబడును. ఏది పూర్ణశాంతి నొసంగునో, అదియే! నాణ్యమైన వస్తువని చెప్పబడును. ఈ దేహము శాశ్వతమైనదా? కాదు. కావున అది నాణ్యమైన వస్తువని చెప్పుటకు వీలులేదు. ఈ మనస్సు మనకు పూర్ణశాంతి నొసంగునా? ఒసంగదు. కావున అది నాణ్యమైన

వస్తువని చెప్పబడదు. ఈ బుద్ధి నిర్వ్రక్రమమైనదా? కాదు. కావున అది శాశ్వతానందము నొసంగజాలదు. ఈ ప్రపంచము శాశ్వతమైనదా? కాదు, ఏల? "యద్దృశ్యం తన్నశ్యమ్" అని శాస్త్రము ఉద్ఘోషించుచున్నది. మఱియు ప్రళయకాలము నందీ ప్రపంచము ఉనికి లేకుండాపోవును. కావున అదియున్నూ నాణ్యమైన వస్తువని చెప్పుటకు వీలులేదు. ఈ ప్రపంచమే! నాణ్యమైన వస్తువుకాదు కదా! ఇక ఈ ప్రపంచములోని పదార్థములు నాణ్యమైన పదార్థములని మనమెట్లు చెప్పగలము?

ఏది ఎల్లకాలముండదో, అది అశాశ్వతము, లేక అసత్యమైన పదార్థమని చెప్పబడును. ఐతే ఎల్లకాలముండునట్టి పదార్థమేది? ఎల్ల శరీరధారుల ఉల్లముల యందున్న పదార్థమే! శాశ్వతమైనది. అదియే! ఆత్మపదార్థమని చెప్పబడును. ఆత్మకు– పరమాత్మకు గల భేదమేమి? భేదము లేదు. కారణమేమి? సూర్యునికి– సూర్యకిరణమునకు మధ్య భేదములేనట్లే, సముద్రమునకు– తరంగమునకు మధ్య భేదము లేనట్లే, కుండకు – మట్టికి మధ్య భేదము లేనట్లే, ఆత్మకు – పరమాత్మకు మధ్య భేదము లేదు. ఉపాధితో కూడినవాడు జీవాత్మ అనియును, ఉపాధిరహితుడు పరమాత్మయనియున్నూ చెప్పబడును.

ఈ కారణముచే పరమాత్మయే! సర్వశ్రేష్ఠమైన, అత్యంత ఉత్కృష్టమైన నాణ్యమైన వస్తువని చెప్పవలసియున్నది. ఈ పరమోత్కృష్టమైన పదార్థమును పొందుటెట్లు? అజ్ఞానాంధకారము తొలగింపబడినప్పుడు జ్ఞానప్రకాశమునందీ నాణ్యమైన వస్తువు దర్శింపబడును. స్వప్నములోని పదార్థములన్నియును అసత్యములే. స్వప్నములోని ధన కనక వస్తు వాహనములన్నియును విలువలేనివే! ఒక నిరుపేదవాడు స్వప్నమునందు చక్రవర్తి అయినంతమాత్రముచే ప్రయోజనమేమి? అదే ప్రకారముగా ఈ ప్రపంచమునందెన్ని భోగభాగ్యములున్న వ్యక్తియైనను, తుట్టతుదకు వీటినన్నింటిని విడిచి వెళ్ళక తప్పదు కదా! అప్పుడాతడు దుఃఖితుడు కాక తప్పదు. ఈ ప్రాపంచిక పదార్థములన్నియును నశ్వరములే! ఈ హేతువుచే మనమీ ప్రాపంచిక పదార్థములను గాని, ప్రపంచమును విశ్వసించువారిని గాని ఏ మాత్రము విశ్వసింపరాదు.

సత్యమైన, నిత్యమైన, నాణ్యమైన వస్తువు తెలియబడుటకై భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, యోగవాసిష్ఠము ఇత్యాది సద్గ్రంథ పఠనము ఉపకరించును. ఐతే వీటియందు నిహితమైన, రహస్యాతిరహస్యమైన అర్థమును తెలిసికొనుటకై బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడైన, శ్రోత్రియుడైన ఆచార్యుడు ఆవశ్యకమగును. ఈ ఆచార్యుడు అజ్ఞానాంధకారమును పటాపంచలొనర్చగలుగువాడై యుండవలయును.

ఈ ఆచార్యుడు బ్రహ్మజ్ఞానతేజోవిరాజితుడై యుండవలయును. ఈ ఆచార్యుడు సత్యసంధుడై యుండవలయును. ఈ ఆచార్యుడు "బ్రహ్మసత్యం జగన్మిథ్య" అను వాక్యార్థమును గుర్తెఱింగినవాడై యుండవలయును. ఈ ఆచార్యుడు అహంభావము నణచివేసి, "అహం బ్రహ్మాస్మి" యనెడి అనంతమైన ఆనందామృతము నాస్వాదించినవాడై యుండవలయును. ఈ ఆచార్యుడు తన ప్రజ్ఞాపాటవముచే "ప్రజ్ఞానం బ్రహ్మ" యనెడి వాక్యార్థము ననుసంధించుకొన్నవాడై యుండవలయును. ఈ ఆచార్యుడు "తత్త్వమసి" వాక్యార్థమును జీర్ణించుకొన్నవాడై యుండవలయును. ఈ ఆచార్యుడు "అయమాత్మా బ్రహ్మ" అనెడి మహావాక్యము యొక్క అనుభవజ్ఞానము కలవాడై యుండవలయును. ఈ ఆచార్యుడు జగద్గురు శ్రీమచ్ఛంకరాచార్యులవారి అద్వైత సిద్ధాంతము నాకళించుకొన్నవాడై యుండవలయును.

మిక్కిలి శ్రేష్ఠమైన, అత్యంత నాణ్యమైన వస్తువుకు ప్రళయకాలమునందు కూడా నాశనముండదు. అది జ్యోతులకు జ్యోతి, ప్రకాశములన్నింటికి ప్రకాశమై సూర్య–చంద్ర–నక్షత్రాదులన్నింటిని ప్రకాశింపజేయుచుండును. ప్రపంచము లేకున్నను, పరమాత్మకు ఉనికి యుండును. కాని పరమాత్మ లేకున్నచో ప్రపంచమునకు ఉనికి యుండదు. అది ఎట్లనగా:– స్వప్నావస్థ లేకున్నను, జాగ్రదవస్థకు ఉనికి యుండును. కాని జాగ్రదవస్థ లేకున్నచో, స్వప్నావస్థకు ఉనికి ఉండదు కదా! దేహము లేకున్నను దేహియైన ఆత్మకు ఉనికి యుండును. కాని దేహియైన ఆత్మకు ఉనికి లేకున్నచో, దేహమునకుగాని, మనస్సుకుగాని, బుద్ధికిగాని, అంతఃకరణ చతుష్టయమునకు గాని, అంతరింద్రియములకుగాని, బాహ్యేంద్రియములకుగాని ఉనికి యుండదు.

కావున మనమందఱమున్నూ శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురుదేవుని ఆశ్రయించి, అజ్ఞానాంధకారమును పోగొట్టుకొని, నాణ్యమైన వస్తువును పొందినవారమై, బ్రహ్మజ్ఞాన తేజోవిరాజితులమై, ఆత్మజ్ఞానామృతము నాస్వాదించి, సుఖించెదము గాక! ఇదియే! మానవజీవితలక్ష్యమైయున్నది. ఇదియే! ఆధ్యాత్మిక సాధకులకు గమ్యమైయున్నది. ఇదియే! జిజ్ఞాసువులు అన్వేషించదగినదై యున్నది. ఇదియే! ముముక్షువులు కోరదగినదై యున్నది. ఈ నాణ్యమైన వస్తువును పొందకుండా మానవ జీవితమును వ్యర్థమొనర్చు నరుడు "పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం" అనెడి సంసార చక్రమునందు పరిభ్రమింప వలసియుండును. ఇట్టి భయంకరమైన పరిస్థితి నుండి తప్పుకొనుటకై నాణ్యమైన వస్తువైన ఆత్మయందు నిష్ఠను కలిగియుందుము గాక!

# 42. ఋజుమార్గ వర్తనము

"ఋజుమార్గ వర్తన"మనగా:- సూటియైన మార్గమునందు నడచుట యని అర్థము. సూటియైన మార్గమనగా నేమి? మానవజీవిత లక్ష్యమేమియో తెలిసికొని, కేవలము దానిని పొందుట కొరకే జీవించుట ఋజుమార్గవర్తనమనబడును. ఇక మానవజీవిత లక్ష్యమేమి? యను విషయమును తెలిసికొనవలసియున్నది. మన మీ ప్రపంచమునకెచ్చటి నుండి వచ్చితిమో, తిరిగి అచ్చటికి చేరుకొనుటయే! మానవ జీవితలక్ష్యము. మన మీ ప్రపంచమున కెచ్చటి నుండి వచ్చితిమి? ఈ ప్రపంచమున కాధారమైయున్నదేదో, దానినుండి మన మీ ప్రపంచమునకేతెంచితిమి. ఈ ప్రపంచమున కాధారమైయున్నదేది? దేనికి మరొక ఆధారములేదో, అదే ఈ ప్రపంచమునకాధారమై యున్నది. దేనికి మరొక ఆధారము లేదో, అదిఏది? అదియే! పరమాత్మ, అదియే! పరబ్రహ్మము, అదియే! పరంజ్యోతి, అదియే! పరమప్రకాశము, అదియే! పరమానందము. పరమానందమనగా:- శాశ్వతమైన, శ్రేష్ఠమైన, ఉన్నతమైన, దివ్యమైన ఆనందము. ఈ ప్రపంచములో 99 వంతుల దుఃఖము, ఒకవంతు సుఖముకలదు. అజ్ఞాన కారణముచే మనమీ విషయమును గ్రహింపజాలకున్నాము. ఈ ప్రపంచమంతయు ఒక చిజ్జడగ్రంథియై యున్నది. అనగా:- చైతన్యవంతమైన పదార్థము జడమైన పదార్థమునందు ముడివడియుండుట. ఈ ముడి విడిపోవుటెట్లు? దానిని విచారించి, తదనుసార జీవితమును గడుపుటయే! ఋజుమార్గవర్తనము. ఎంత విచారించినను, ఎవరికి వారు తనను గూర్చి తాను సంపూర్ణముగా తెలిసికొనజాలరు. అదిఎట్లగా:- ఒక సింహపు పిల్ల పొరపాటుచే ఒక మేకల గుంపులో కలిసిపోయెను. అది తన తల్లిని విడిచియుండుటవల్ల తన సింహపులక్షణములను పోగొట్టుకొనెను. కొన్ని సంవత్సరములు గడిచిన తర్వాత అదిమేకవలెనే అరవసాగెను. మేకవలెనే గడ్డిని తినసాగెను. మరికొన్ని సంవత్సరముల తర్వాత తల్లికి సింహపు పిల్ల మేకలగుంపులో కలిసిపోయిన విషయము తెలిసిపోయెను. అప్పుడా సింహము గర్జించి, తన పిల్లను మేకలగుంపునుండి వేఱుపరచెను. దానిని నది ఒడ్డుకు తీసుకొనివెళ్ళి నీటిలో చూడుమని చెప్పి, తన రూపము-సింహము పిల్ల రూపము ఒకటే! యనిచెప్పెను. అప్పుడా సింహపుపిల్లకు తన పూర్వపువాసన ఉబికి వచ్చెను. కావున సింహపుపిల్ల వలె గర్జింపసాగెను. అప్పుడా సింహపుపిల్లను చూచి మేకలన్నియును వణకసాగెను.

ఈ ప్రకారముగా తన స్వస్వరూపమును తెలిసికొనుటకై యత్నించుటయే! ఋజుమార్గవర్తనమని చెప్పబడును. జీవుడు తన తల్లిగర్భమునందున్నప్పుడే! ఋజుమార్గవర్తనము నలవరచుకొనుట శ్రేష్ఠము. ఇందునిమిత్తమై తల్లిదండ్రులు ఋజుమార్గవర్తనము కలవారై యుండవలయును. గర్భిణి స్త్రీ స్వాత్త్వికాహారమునే భుజింపవలయును. అప్పుడు తనకు పుట్టినబిడ్డ స్వాత్త్వికతతో కూడియుండును. తదనంతరమా బిడ్డ సాత్త్వికాహారమునే ! భుజింపగోరును. ఇట్టి సాత్త్వికాహారమును జీవితాంతము వరకు స్వీకరించుచుండవలయును. అప్పుడు రజోగుణ, తమోగుణములు మనదరికి చేరజాలవు. ఐతే పిల్లలు పెరుగుచున్నకొలది తోటి స్నేహితులు కూడా పెరుగుచుందురు. కావున మన మెల్లప్పుడు సాత్త్విక ప్రవృత్తిగల స్నేహితులనే! కలిగియుండవలయును. ఇదియే! ఋజువర్తనమునకు మార్గము. ఈ కారణముచేతనే జగద్గురు శ్రీ శంకరభగవత్పాదులవారీ దిగువ శ్లోకమును రచించిరి.

“సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం ।
నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥

ఋజుమార్గగాములమగుటకై మనమందరమీ శ్లోకములోని భావమును హృదయంగమ మొనర్చుకొనవలసియుండును. సత్పురుషుల సాంగత్యముచే నిస్సంగత్వము కలుగును. “నేను–నాది” యనెడి భ్రమ తొలగుటయే! నిస్సంగత్వము. “నేను– నాది” యను భ్రమ తొలగినప్పుడు మోహము తొలగిపోవును. ఉన్నదానిని లేదను కొనుట– లేని దానినిఉన్నదనుకొనుటయే! మోహము. అది ఎట్లనగా:– ఈ శరీరమునకాధారమై యున్నదే! ఆత్మ. మనము అట్టి ఆత్మ లేదనుకొనుచు, ఈ దేహమే! ఉన్నదనుకొను చున్నాము. ఒకప్పుడీ శరీరమునశించును. దేహము దహింప బడును.మన మీ విషయమును మఱచిపోయి మోహమునందు మునిగిపోవుచున్నాము. సత్సాంగత్యము ఇట్టి మోహముతొలగిపోవునట్లొనర్చును. మోహముతొలగిపోయినప్పుడు మనస్సునిశ్చలమగును. అట్టి సమయము నందు నిశ్చలమైన, నిర్వికల్పమైన, నిరంజనమైన, నిర్వికారమైన ఆత్మతత్త్వము తెలియబడును. ఆత్మతత్త్వము తెలియబడినప్పుడు జీవన్ముక్తి కరతలామలకమగును. జీవన్ముక్త పురుషుడు అజ్ఞాననిద్రయందున్న వారినందఱిని మేల్కొలుపగలుగును. జీవన్ముక్త పురుషుడు మాయ నతిక్రమించినవాడైయుండును. త్రిగుణాత్మికమైనదే! మాయ. అహంకారమే! మాయ. ఈ మాయనతిక్రమించుటకై “నేను–నాది”యనుకొనుటను మానుకొని “అహం బ్రహ్మాస్మి” యనెడి మహావాక్యమునన్వర్థమొనర్చుకొనవలయును.

కేవలము బ్రహ్మోపదేశము చేతనే! బ్రహ్మానుష్ఠానము సిద్ధించును. "బ్రహ్మోపదేశమ"నగానే! భయపడవలసిన అవసరములేదు. కారణమేమి? భయమును పోగొట్టునదే! బ్రహ్మము. భయమును కలిగించునదే! భ్రమ. అది ఎట్లనగా:- చీకటిలోనున్న త్రాడునుచూచి పామనుకొనుటవలన భయముకలుగును. ఆ సమయమునందొక మిత్రుడు లాంతరును తీసుకొనివచ్చి "ఇదిపాము కాదు ఇది త్రాడు" అను విషయమును స్పష్టముచేయును. అప్పుడు మనభయము తొలగిపోవును. అదే విధముగా నిజమునకు మనమీ దేహముకాదు. దేహమే! నిజమని తలంచినప్పుడు మరణ భయము మనలనావరించును. మదాలస తనబిడ్డలను ఊయల యందూపునప్పుడు "శుద్ధో-సి బుద్ధో-సి నిరంజనో-సి సంసారమాయా పరివర్జితో-సి"అనెడి జోలపాటను పాడెను. మన భారతమాత "మదాలస" వంటి తల్లులను కనవలసియున్నది. అప్పుడా తల్లులకు సాత్త్విక సంపన్నులైన సంతానము కలుగును. అనగా:- ఋజుమార్గవర్తనులగు సంతానము కలుగును. అట్టివారు నిర్భయులై జీవించుచు, ప్రపంచమునందు భయకంపితులైయున్న వారి భయమును కూడా తొలగింప జాలుదురు. వారు మానవ సంఘము నంతటిని సంస్కరింపజాలుదురు. పాఠశాలలోను, కళాశాలలలోను ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు సంస్కారవంతులై యున్నప్పుడు విద్యార్థులు కూడా సంస్కార వంతులుగా పరిణమింతురు. అప్పుడు భారతీయ సంస్కృతి విదేశీయ సంస్కృతికి దాసో-హమనెడి దీనస్థితి కలుగదు. శ్రీ విశ్వామిత్రుడు శ్రీ వసిష్ఠుని నూరుగురు కుమారులను హతమార్చినను, శ్రీ వసిష్ఠుడు నిశ్చలచిత్తుడై యుండెను. అప్పుడు శ్రీ విశ్వామిత్రుడు "ధిక్ క్షత్రియబలం, బ్రహ్మతేజోబలం బలమ్" అని పలికెను. బ్రహ్మతేజమునకు మించిన బలము మరొకటి లేదు. కావుననే విదేశీయులెందరో వచ్చి భారతమాతను వశీభూతమొనర్చుకొనదలంచినను, బ్రహ్మతేజోకిరణములకు తాళజాలక వెనుదిరిగి పోవలసివచ్చుచున్నది. ఉజ్జ్వల భవిష్యత్తుకై భారతదేశములోని ప్రతిబాలుడు, ప్రతిబాలిక, ప్రతియువకుడు, ప్రతి యువతి, ప్రతివృద్ధుడు, ప్రతివృద్ధురాలున్నూ ఆత్మ బలమును, లేక బ్రహ్మతేజోబలమును సంపాదించుటకై యత్నింపవలసియున్నది. ఆత్మబల సంపన్నుడు మనోబలము కలవాడై, దృఢచిత్తుడై యుండును. ఆతడు శారీరిక దార్ఢ్యము కలవాడై యుండును. అప్పుడు భారతమాతబిడ్డలు శారీరకముగాను, సాంఘికముగాను, ఆర్థికముగాను సుసంపన్నులై శోభింతురు. ఆత్మబలము, లేక బ్రహ్మతేజోబలము చేతనే ఇది సాధ్యమగును. ఇదియే! ఋజుమార్గవర్తనమనబడును.

# 43. "నిశ్శేష కర్మక్షయమే! మోక్షము"

ఈ ప్రపంచములోని ప్రతిమానవుడు, ప్రతిజీవి, ప్రతిప్రాణియున్నూ కర్మానుభవము కొఱకే జన్మించినవి. అనుభవింపబడిన కర్మ నశించును. అప్పుడు మనకు కర్మభారము లేకుండును. ఈ కారణముచే జీవితము కొంత సుఖప్రదమగును. ఐతే, జన్మజన్మాంతరములలో మనమొనర్చిన కర్మలన్నియును ఒక గొప్ప పర్వతముల రాశివలె ప్రోగుపడియున్నవి. ఆ రాశియే! సంచితకర్మయని చెప్పబడును. ఆ రాశిలోని కొంతభాగమును మనమీ జన్మయందు తీసికొనివచ్చితిమి. అదియే! ప్రారబ్ధమని చెప్పబడును. ప్రారబ్ధకర్మ క్షీణించిన పిమ్మట మన ప్రస్తుతజన్మ అంతమొందును. తదనంతరము శేషించిన కర్మననుభవించుటకై మరొక జన్మ లేక జన్మపరంపరల నెత్తవలసి యుండును. కాని వివేకసంపన్నుడును, సత్యసంశోధకుడును, జీవిత లక్ష్యమునొందగోరి నట్టియు మనుజునకు మఱొక జన్మనెత్తవలసిన ఆవశ్యకత యుండదు. కారణమేమి? మానవజన్మనెత్తిన మనము నిశ్శేషకర్మ క్షయమునకై మార్గమును వెదకుచుందుము. నిశ్శేషకర్మక్షయమునకై గురుదేవుని శరణుపొందక తప్పదు. గురుదేవుడు మనకు సన్మార్గమును నిర్దేశించును. ఆ మార్గముననుసరించి మనకు సత్సంకల్పములు కలుగుచుండును. పరమసత్యమును బడయునట్టి అభిలాషయే! సత్సంకల్పమనబడును. పరమ సత్యము, లేక పరబ్రహ్మమునొందుటకై సత్యనిష్ఠ, లేక బ్రహ్మనిష్ఠ ఆవశ్యకమగును. ఇందు నిమిత్తమై సత్యముపై, లేక బ్రహ్మముపై ఏకాగ్రత ఆవశ్యకమగును. ఇట్టి ఏకాగ్రతయే! ధ్యానసాధనగా పరిణమించును. ఇట్టి ధ్యానమునకు మఱొక పేరు "తపస్సు". తీవ్రమైన తపస్సు నాచరించినప్పుడు తమోగుణ–రజోగుణములు నశించి, మనస్సు సత్త్వగుణ సంపన్నమై శోభిల్లును. అప్పుడు మనము మన జీవితములో కేవలము సత్కర్మలను మాత్రమే! చేయుచుందుము. సత్కర్మలచే సదాచారమలవడును. ధ్యాననిష్ఠ చేతను, తీవ్రమైన తపస్సు చేతను మన హృదయమునందు జ్ఞానభాస్కరుడు ఉదయించును. ఈ జ్ఞానభాస్కరుడు మన సంచితకర్మలను భస్మమొనర్చుటకు ఉపక్రమించును. క్రమక్రమముగా అది నిశ్శేషకర్మక్షయమునకు కారణమగును. దానిచే చిత్తశుద్ధి కలుగును. చిత్తశుద్ధిచే భావశుద్ధి ఏర్పడును. భావశుద్ధిచే ఆత్మవికాసము కలుగును. ఆత్మవికాసము ఆత్మసాక్షాత్కారమునకు కారణమగును.

సంచితకర్మరాశి భస్మమైనప్పుడు మనకీ ప్రపంచములో చేయవలసిన దేమియును మిగిలియుండదు. అప్పుడు మన జీవితము జీవన్ముక్తికి ఆస్పదమగును. ప్రారబ్ధమును మాత్రము రోగియైనను, యోగియైనను, రాజైనను, చక్రవర్తియైనను, సామాన్య మానవుడైనను, మహాత్ముడైనను, అందఱున్నూ అనుభవింపవలసియుండును. కావున ప్రారబ్ధకర్మ నిశ్శేషముగా నశించినప్పుడు మాత్రమే! “విదేహముక్తి” కలుగును. ఇదియే! మోక్షమని చెప్పబడును. ఇక, ఆగామికర్మ అనగానేమి? మనము తెలిసికొనవలసి యున్నది. ఈ జన్మలో మనము చేసిన మంచి, లేక చెడ్డకర్మల ఫలితములే! ఆగామి కర్మగా పరిణమించును. కావున మనమెల్లప్పుడు మంచికర్మలనే చేయుచుండవలయును. ఐతే, మంచికర్మలు మంచిఫలమును, అనగా:- సుఖమునొసంగును. చెడుకర్మలు చెడ్డ ఫలమును, లేక దుఃఖము నొసంగును. మంచి-చెడుగులు కవల పిల్లలవంటివి. మంచి కర్మల ఫలమగు సుఖమును స్వర్గలోకాదులలో అనుభవించిన తర్వాత మరల మనమీ భూలోకమునకు తిరిగి రావలసి వచ్చును. కావున మంచి కర్మలు శాశ్వతసుఖము నొసంగవు. ఆ కారణముచే మనము మంచిచెడుగులకు అతీతులము కావలసియుండును. అప్పుడు మనము శాశ్వత సుఖమును, లేక బ్రహ్మానందమును బడయుటకు అవకాశముండును. కేవలము మానవజన్మలయందు మాత్రమే! శాశ్వతసుఖమును బడయజేయు ప్రయత్నము నొనర్చుట సాధ్యమగును. అందువలన ఈ మానవజన్మ ముగియులోపల మనము నిశ్శేషకర్మక్షయమును గావింపవలసి యున్నది. అప్పుడు మాత్రమే! మనకు మోక్షము సిద్ధించును. మోక్షమనగా :- విడుదల. దేనినుండి విడుదల? కర్మబంధమునుండి విడుదల. ఈ కర్మబంధము చేతనే! మనుజుడు “పాపి”యనబడు చున్నాడు. ఏదైనా తప్పుపని చేసినప్పుడు మనము శిక్షననుభవింపక తప్పదు. ప్రపంచమునకు సృష్టికర్తయైన, ప్రపంచములోని 84 లక్షల జీవరాశులన్నింటిని సృష్టించి, పోషించుచున్నట్టి ఆ భగవంతుని మఱచియుండుటయే! మనము చేసిన, చేయుచున్న తప్పు; అదియే! మహాపాపము. ఈ పాపము యొక్క కారణముచేతనే! మనకు కర్మబంధమేర్పడినది. నిజమునకు మనకీ దేహమొక కారాగారము వంటిది. జన్మజన్మాంతరముల నుండి మనము రకరకములగు కారాగారములలో బంధింపబడు చున్నాము. బంధనముల కలవాటు పడుటచే మనకీ బంధనము బంధనముగా తోచుట లేదు. అనేక సంవత్సరముల వరకు కారాగారశిక్ష ననుభవించుచున్న వారికి ఆ కారాగారమే! తన సొంతగృహముగా తోచును. మనమున్నూ ఈ దేహమనెడి కారాగారములో శిక్షననుభవించుచున్నను, ఇదే మన సొంతగృహముగా తోచుచున్నది.

ఈ కారగారశిక్షనుండి మనము విడిబడినప్పుడు మనకు మోక్షము కరతలామలకమగును. అప్పుడు చిదాకాశమంతయు మనదే!యగును. అప్పుడు మనము సత్యస్వరూపులుగా భాసింతుము. అప్పుడు మనము బ్రహ్మానందసాగరము నందోలలాడుదుము. ఐతే, ఈ చిదాకాశమెచ్చటయున్నది? అది లేనిచోటు లేదు. అనగా:– అది సర్వత్ర యున్నది. సత్యమెచ్చట దాగియున్నది? శాశ్వతమైనదేదియో అదియే! సత్యము. దేనియందు రెండవవస్తువు కానబడదో, అదియే! సత్యము. సత్యవస్తువు నందు విభాగములుండవు. నిశ్శేషకర్మక్షయముచే మనమిట్టి సత్యస్వరూపులమగుదుము. ఇక బ్రహ్మానందసాగరమెచ్చటయున్నది? దేనియందు లవశేషమైన దుఃఖమైనను లేదో, అదియే! బ్రహ్మానందసాగరము. దేనియందు అశేష దుఃఖనివృత్తి మఱియు పరమానందప్రాప్తి కలుగునో, అదియే! బ్రహ్మానందసాగరము. దీనియందు ప్రవేశించినప్పుడు ''అహంబ్రహ్మా–స్మి''అను మహావాక్యము అనుభూతమగును. "అహంబ్రహ్మా–స్మి" యనగా:– అహంకారమును పెంచుకొనుట కాదు. అది అహంకారమును త్రెంచుకొనుట. కేవలము దేహాభిమానము చేతనే! అహంకారము పెంపొందును. నిశ్శేషముగా కర్మ క్షయమైనప్పుడు అహంకారము నామరూపములు లేకుండా నశించును. అప్పుడు "సో–హం" భావన దృఢపడును. ఈ కారణముచే చిదాకాశ తాదాత్మ్యత కలుగును. ఈ తాదాత్మ్యతయందు నామ రూపము లుండవు; సుఖదుఃఖములుండవు. వృద్ధిక్షయములుండవు. అప్పుడు మనము కేవలాత్మ అనగా:–పరమాత్మ స్వరూపులమై వెలుగొందుచుందుము. నిరంతర ప్రయత్నముచే ఇది సాధ్యమగును. "శ్రీకృష్ణశ్శరణం మమ" అను మహావాక్యమననముచే ఇది సాధ్యమగును. ఇచ్చట శ్రీకృష్ణుడనగా :– జీవులందఱిని ఆకర్షించువాడని అర్థము. శ్రీకృష్ణుని శరణు పొందినప్పుడు ఆతని అనుగ్రహము మనకు కలుగును. నిశ్శేషముగా కర్మ క్షయమగుటకు మానవప్రయత్నము మఱియు దైవానుగ్రహము అత్యవసరము. నిశ్శేషకర్మక్షయముచే అక్షయానందము లభించును. ఈ అక్షయానందమే! "మోక్షమ"ని చెప్పబడును. మనమందఱమున్నూ దీక్షాయుక్తులమై నిశ్శేషకర్మక్షయము నొనర్చుకొని, అక్షయ సుఖము నొసంగునట్టి మోక్షధామమునందు ప్రవేశించి కర్మబంధమనెడి కారాగారము నుండి విముక్తులగుదుము గాక!

# 44. అజ్ఞానము

ఆత్మజ్ఞానోపలబ్ధికై జ్ఞానము గూర్చి తెలిసికొనుట ఎంత అవసరమో, అజ్ఞానము గూర్చి తెలిసికొనుట కూడా అంతే అవసరము. జ్ఞానము లేకపోవుటయే! అజ్ఞానము. ఇచ్చట జ్ఞానమనగా చర్మచక్షువులతో చూచి తెలుసుకొనునట్టి సామాన్య జ్ఞానము కాదు. “నేనెవరు? నేనెచ్చటి నుండి వచ్చితిని?ఈ లోకములో నేను చేయవలసిన కర్తవ్యమేమి? ఈ లోకమును విడిచిన తర్వాత నేనెచ్చటికి వెళ్ళుదును?” మున్నగు ప్రశ్నలకు సమాధానమును తెలిసికొనుటయే! నిజమైన జ్ఞానమనబడును. తెలిసికొనకుండా ఉండుటయే! అజ్ఞానము. “నేనెవరు?” అని తెలిసికొనుట ప్రతి మానవునికి అవసరము. దీనిని తెలిసికొనకపోవుట వలన కలుగు నష్టమేమి? “మహతీ వినష్టిః”అని ఉపనిషత్తు పలుకుచున్నది. అనగా:- దీనికి మించిన నష్టము మఱొకటిలేదని భావము. జీవితమే! వ్యర్థమగునని అర్థము. దీనిని తెలిసికొనకున్నచో మనుజుడు జననమరణ చక్రమునందు పరిభ్రమింప వలసివచ్చును. జననమరణ చక్రమునందు పరిభ్రమించినచో కలుగు నష్టమేమి? సుఖదుఃఖములకు గుఱికావలసి వచ్చును. సుఖమున్నచోట దుఃఖము తప్పకుండా ఉండును. అందువల్ల శాశ్వతమైన సుఖము మనకు లభింపదు. శాశ్వత సుఖమే! ఆనందమని చెప్పబడును. ఈ ఆనందమునందున్నూ ఎన్నో రకములున్నవి. ముఖ్యమైనవి రెండు (1) విషయానందము (2) బ్రహ్మానందము. విషయానందము మనలను జననమరణ చక్రమునందు పడవేయును. బ్రహ్మానందము నొందుటచే ఈ జననమరణ చక్రమునుండి మనము విడివడుదుము. కేవలము జ్ఞానము చేతనే! ఈ బ్రహ్మానందము మనకు అభించును. కావున బ్రహ్మానందమునొందని వారందఱును అజ్ఞానభూమిక యందున్నారని చెప్పవలసియుండును. బ్రహ్మానందమునొందిన వారికి చలనస్వభావముండదు. ఏ నదియైనను తాను ఉత్పన్నమైన స్థలమునుండి సముద్రమును చేరునంతవరకు ప్రవహించుచునే యుండును. అదే విధముగా ప్రతిజీవియు, ప్రతిప్రాణియు, ప్రతిమనుజుడున్నూ ఆ పరబ్రహ్మమునొందునంత వరకు జననమరణ ప్రవాహమునందు దొర్లుచునే యుండును. ఇదియే! జీవుని అజ్ఞానదశ. బ్రహ్మానందసాగరమును చేఱునంతవరకు జీవుడు సుఖదుఃఖములకు గుఱికావలసి యుండును. కావున మనుజుడు బ్రహ్మానందసాగరమును చేరుటయే! లక్ష్యముగా కలిగియుండవలయును. “నేనెవరు?” అను విషయమును తెలిసికొననంతవరకు మనుజుడు తన జీవితలక్ష్యమును

తెలియజాలడు. మనము మన జీవిత లక్ష్యమును తెలిసికొనుటకై విషయానందము అడ్డుపడుచుండును. కావున విషయానందమును విషమువలె త్యజించుట సాధకులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు అవసరమైయున్నది.

మనుజుని మనస్సు సంకుచితమై యుండుటచే ఎల్లప్పుడది విషయానందము నొందుటకే పరిభ్రమించు చుండును. బ్రహ్మానందమునకు దిగువస్థాయి యందున్న ఆనందము లన్నియును విషయానందములనియే చెప్పవచ్చును. విషయానందము ధనకనక వస్తువాహనాది ఏదో ఒక విషయమును ఆలంబనముగా కలిగియుండును. ఆ విషయము నశించినప్పుడు, లేక మార్పు నొందినప్పుడు మనుజుడు దుఃఖసాగరము నందు మునిగిపోవును. స్వర్గలోకము కూడా విషయానంద ప్రపూర్ణమై యున్నదని చెప్పవచ్చును. ఏలననగా:- మనుజుడు తన పుణ్యకర్మ ఫలము ననుభవించుటకై స్వర్గలోకమునకు వెళ్ళి రంభ, ఊర్వశి, మేనక ఇత్యాదులతో స్వర్గలోక సుఖము ననుభవించును. కాని ఆ పుణ్యకర్మఫలము సమాప్తమైన వెంటనే భూపతనమునొందును. అప్పుడాతని దుఃఖమునకు మేరలేకుండును. కావున సుఖదుఃఖములు రెండింటిచేతను మనుజునికి శాశ్వతసుఖము లభింపదు. వివేకవంతుడైన మనుజుడు శాశ్వతా శాశ్వతజ్ఞానమును కలిగియుండును. అజ్ఞానావరణ తొలగిపోవుటెట్లు? అజ్ఞానము అంధకారము వంటిది. ఈ అంధకారము తొలగిపోవుటకై జ్ఞానభాస్కరుడు మన హృదయాకాశము నందుదయింపవలసియుండును. అప్పుడు మన జ్ఞాననేత్రము తెరువబడును. జ్ఞానభాస్కరుడెవరు? గురుదేవుడే! జ్ఞానభాస్కరుడు. చిన్నమనస్సుగల మనకు పెద్దమనస్సుగల గురుదేవుడు ఉపదేశింపవలసియుండును. అప్పుడు మాత్రమే! మన అజ్ఞానము తొలగిపోవును. గురుదేవుడు మనకు జ్ఞానధనమును ప్రసాదించును. ఈ ధనమును మనము సదుపయోగమొనర్చుకొందుమేని, విషయానందమున కతీతమైన బ్రహ్మానందమును మనమార్జింప వచ్చును. గురుదేవుడు మనకేమి ఉపదేశించును? "ఈ ప్రపంచము నశ్వరమైనది; దీనియందు నిజమైన సుఖములేదు. ఈ ప్రపంచములోని సుఖము స్వప్నములోని సుఖమువంటిద"ని గురుదేవుడు పలుకును. ఈ మాటలు నిజమా? కావా? యని మనము మాటిమాటికి మననముచేసి కొనుచుండవలయును. నిజమని నమ్మువాడు తన నిజానంద ధామమును చేరుకొనును. విశ్వాసము లేనివాడు అశాశ్వత ధామమును చేరుకొనును.

మనము శాశ్వతమైన బ్రహ్మానంద ధామమును చేరుకొనుటకు పూర్వమే గురుదేవుడు తమ దేహమును చాలించెననుకొనుడు. ఐనను నిజమైన ముముక్షువుకు

నష్టములేదు. ఏల? గురుదేవుడు దేహాతీతుడు. దేహమునందున్నప్పుడు గురుదేవుడు చెప్పిన మాటలను ఆచరించుచు, జీవితమును గడుపుదుమేని, దేహాతీతుడైన గురువు సూక్ష్మరూపమునందుండి మనకు సహకరించుచుండును. "బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్, ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్"అని గురుదేవుడు వర్ణింపబడెను. గురుదేవుడు బ్రహ్మానందస్వరూపుడగుటచే ఆతడు మనకు బ్రహ్మానందమును ప్రసాదించును. గురుదేవుడు పరమసుఖస్వరూపు డగుటచే మనకాతడు పరమ సుఖమునొసంగును. గురుదేవుడు కేవలము జ్ఞానమూర్తి యగుటచే మన అజ్ఞానమునాతడు పోగొట్టి జ్ఞానప్రకాశమును ప్రసాదించును. రూపముదాల్చిన పరబ్రహ్మమే! గురుదేవుడగుటచే, ఆతడు ద్వంద్వాతీతుడై యున్నాడు. గగనములోని విహంగమువలె మనము గురుదేవుని కారుణ్యముచే ఆత్మస్వాతంత్ర్యముతో విహరింపజాలుదుము. ''తత్త్వమసి'' మహావాక్యమును గురుదేవుడు మనకుపదేశించును. దానిని మననము చేసికొని మనము మన అజ్ఞానమును నివర్తింప జేసికొని, "అహం బ్రహ్మాస్మి" యను మహావాక్యముననుభూతికి తెచ్చుకొనవలయును. అప్పుడు మనము మన జీవితలక్ష్యము నొందజాలుదుము. జీవితలక్ష్యము నొందుటకై మనయందు విషయవాసన లేశమైనను ఉండరాదు. భగవంతునియందాసక్తి కలిగినప్పుడు మాత్రమే! ప్రపంచమునందనాసక్తి ఏర్పడును. మనకోరికలన్నియును కోదండరాముని యందేకత్రిత మొనర్పబడవలయును. మన ముఖములన్నియును మరళిమనోహరునివైపు త్రిప్పబడవలయును. మన శిరస్సులన్నియును శివునిముందు వంచబడవలయును. మన శరీరములన్నియును ఆ పరాశక్తికి సమర్పింప బడవలయును. కేవలము అప్పుడు మాత్రమే! మన అజ్ఞానము నశించును. అజ్ఞాననాశముచే మనోనాశమేర్పడును. మనోనాశముచే విషయవాంఛలు నశించును. విషయవాంఛలు నశించుటచే ప్రపంచమునందాసక్తి సన్నగిల్లును. అప్పుడు సాధకునికి పరబ్రహ్మానుభవము కరతలామలకమగును. కావున మనమందరమున్నూ అజ్ఞానాంధకారమును నశింపజేసికొని మన జీవితలక్ష్యము నొందుటకై జ్ఞానభాస్కరుడైన శ్రీ గురుదేవుని చరణకమలముల నాశ్రయించెదము గాక!

# 45. తన్మయత్వము

"తన్మయత్వము"అంటే దానియందు మనస్సు లగ్నమగుటయని అర్థము. దానియందు అంటే దేనియందు? కన్నులకు కానబడని వస్తువుపై మనస్సు లగ్నమగుటయని అర్థము. ఈ ప్రపంచము మన నేత్రములకు కానబడుచున్నది. కావున ఇది దృశ్యప్రపంచమని చెప్పబడును. ఈ ప్రపంచమునకు మూలాధారమైయున్నదేదియో, అదియే పరమాత్మ! అది మన నేత్రములకు కానబడదు. కావున ఆ పరమాత్మయందు మనస్సు లగ్నమగుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును. తన్మయత్వము నొందుటయే! ఆధ్యాత్మిక సాధకులందఱికి జీవితలక్ష్యమై యున్నది. ఈ దృశ్యప్రపంచము చర్మచక్షువులచే తెలియబడును. అయితే కేవలము చర్మచక్షువులు ఈ ప్రపంచమును చూడజాలవు. ఈ చర్మచక్షువులలో అత్యంత సూక్ష్మమైయున్న మరొక చక్షువున్నది. అదియే! పరమాత్మ. దానియందు మనస్సును లయమొనర్చుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును. ఆ పరమాత్మ వివేకశక్తి, లేక జ్ఞానచక్షువుచే తెలియబడును.

మన చెవులు మధురమైన సంగీత స్వరములను, భక్తిగానములను, కమ్మని పాటలను వినుచుండును. అయితే, కేవలము చర్మనిర్మితములైన చెవులు వీటిని వినజాలవు. ఈ చెవులయందతర్నిహితమైన మరొక సూక్ష్మాతి సూక్ష్మమైన చెవి కలదు. అదియే! పరమాత్మ. దానియందు మనస్సు లయము నొందుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును.

మన నాలుక షడ్రషోపేతములైన రకరకములైన పదార్థములను రుచి చూచుచుండును. అయితే, చర్మనిర్మితమైన ఈ నాలుకకు రుచి చూచు శక్తి లేదు. దీనియందంతర్నిహితమైయున్న మరొక అతి సూక్ష్మమైన నాలుక కలదు. అదియే! పరమాత్మ. దానియందు మనస్సు లగ్నమగుటయే! "తన్మయత్వమ"ని నుడువబడును.

మన ముక్కు రకరకములగు సుగంధద్రవ్యములను, పరిమళభరితములైన పుష్పములను, ఊదొత్తులను ఆఘ్రాణించుచుండును. ఐతే, చర్మనిర్మితమైన ఈ ముక్కుకు వాసన చూచు శక్తి లేదు. దీనియందంతర్నిహితమైన మిక్కిలి సూక్ష్మమైన మఱొక ముక్కు కలదు. అదియే! పరమాత్మ. దానియందు మనస్సు లగ్నమగుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును.

మనము కఠినమైన, లేక సున్నితమైన పదార్థములను స్పర్శించుచుందుము. అయితే కేవలము ఈ చర్మమునకు స్పర్శించు శక్తి లేదు. ఈ చర్మమున కంతర్నిహితమై యున్న అత్యంత సూక్ష్మమైన శక్తిచే చర్మము స్పర్శించుచుండును. అదియే! పరమాత్మ. దానియందు మనస్సు లగ్నమగుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును.

ఇక మనస్సు అనేక విషయములను గూర్చి ఆలోచించుచుండును. నిజమునకు ఈ మనస్సుకు ఆలోచించు శక్తి లేదు. కారణమేమి? గాఢనిద్రయందీ మనస్సు మరొక దానియందు లయించును. కాని, ఈ స్థితి "తన్మయత్వమ"ని చెప్పబడదు. కారణమేమి? మనుజుడు మేల్కొన్న వెంటనే మరల దృశ్యపదార్థములను గూర్చి మాత్రమే! ఆలోచించు చుండును. గాఢనిద్రయందాతని మనస్సు తమోగుణముచే ఆవరింపబడియుండెను. అయితే, ఈ మనస్సుకు ఆలోచించు శక్తి నొసంగునదేది? అదియే! పరమాత్మ. దానియందు మనస్సు లయించుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును.

ఇక, బుద్ధి– "ఇది మంచిది - ఇది చెడ్డది, ఇది శాశ్వతము - ఇది అశాశ్వతము" అను వాటిని విచారించుచుండును. ఐతే ఈ బుద్ధి కూడా సుషుప్త్యవస్థ యందు లయించును. కాని ఇది నిజమైన "తన్మయత్వము" కాదు. కారణమేమి? ఇచ్చట బుద్ధి అజ్ఞానముచే ఆవరింపబడియుండును. అజ్ఞానరహితమైన, పరిశుద్ధమైన ఆత్మయే! పరమాత్మ. దానియందు బుద్ధి లయించినప్పుడు "తన్మయత్వమ"ని చెప్పబడును.

ఇక, అహంకారము "నేను ఆ కార్యము నొనర్చితిని - నేను ఈ కార్యము నొనర్చితిని" అని పలుకుచుండును. నిజమునకు అహంకారమునకు ఏలాటి కార్యము నొనర్చుటకైనను సామర్థ్యము లేదు. ఏల? ఆ అహంకారము మహదహంకారము యొక్క అంశమైయున్నది. అహంకారము, మహదహంకారము రెండున్నూ దేనినుండి ఉత్పన్నమగునో, అట్టి పరమాత్మ యందవి లయించుటయే! "తన్మయత్వమ"ని చెప్పబడును.

అయితే ఈ "తన్మయత్వము"చే కలుగు ప్రయోజనమేమి? తన్మయత్వముచే జీవిత సమస్యలన్నియును తీరిపోవును. తన్మయత్వమునందు ఆత్మానందము చవి చూడబడును. తన్మయత్వమునందు శారీరక బాధలు, మానసిక వ్యథలు తొలగిపోవును. తన్మయత్వము నందు తాను తనువు కాదనియు, తాను "తత్" పదార్థమనియును తెలియబడును. తన్మయత్వమునందు "తత్త్వమసి" మహావాక్యము యొక్క గూఢార్థము

తెలియబడును. తన్మయత్వమునందు ప్రాపంచిక వాంఛలు అంతమొందును. తన్మయత్వమునందు బ్రహ్మానందము అనుభవింపబడును. నిజమునకు ఒక దేహము మఱొక దేహముతో కలిసినప్పుడు ఆనందము కలుగదు. కాని ఒక ఆత్మ మరొక ఆత్మతో కలిసి నప్పుడు ఆనందము కలుగును. దేహమునకు అస్తిత్వమే లేదు. దేహమొక జడపదార్థము. కేవలము ఆత్మకు మాత్రమే! అస్తిత్వము కలదు. "ఆత్మానం రథినం విద్ధి, శరీరం రథమేవతు" అన్నట్లు ఈ ఆత్మయే! శరీరమనెడి రథమును నడుపునట్టి సారథి. కావున సారథి చెప్పినట్లు రథము యొక్క గమనముండవలయును. మన మనస్సే! మనకు శత్రువు వంటిది. కారణమేమి? అజ్ఞానవశముచే అది దేహమనెడి రథమును తప్పుడు త్రోవలలో నడుపుచుండును. మనస్సు పవిత్రమైనప్పుడు అది మనకు మిత్రుడగును. ఈ కారణముచేతనే "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అని చెప్పబడినది.

మనస్సు తన్మయత్వమునొందినప్పుడది మనలను బంధమును తొలగించి, ముక్తిని బడయజేయును. ఇక మనస్సు ప్రాపంచిక విషయములలో సంచరించునప్పుడది బంధహేతువగును. ఏకాంతసాధనయందు మనస్సు తన్మయత్వము నొందగలుగును. జనసమూహము నందది విక్షేపమునకు కారణమగును. సాంఘికసేవచే సంఘములోని జనుల సంస్కారములు మనకు తెలియకుండానే అలవడుచుండును. కావున ఆధ్యాత్మిక సాధకుడు సాత్త్వికాహారముచే శరీరమును పోషించుకొనుచు, మనస్సును గమ్యస్థానము నందుంచి, బుద్ధిని శుద్ధమొనర్చి, చిత్తమును చిత్స్వరూపము నందుంచి "తన్మయత్వము" నొందుటకై నిరంతరము క్రియాశీలుడైయుండవలయును. ఇట్టి తన్మయత్వసాధనచే జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లి సంచితకర్మ భస్మమగును. ఆగామికర్మకు ఆస్కారముండదు. ప్రారబ్ధమున్నూ భోగానుభవముచే భస్మమగును. సాధకుడిట్లు క్రమక్రమముగా సిద్ధారూఢస్థితినొందును. భిక్షాధిపతిగాయున్న సాధకుడిప్పుడు లక్ష్యాధిపతి యగును. అనగా:– తన జీవితలక్ష్యమును చేరుకొన్నవాడగును. ఇట్టి "తన్మయత్వ"స్థితి నొందుటకై తగిన కృషి యొనర్చినవారమై మనమందఱమున్నూ మన జీవితములను తరింపజేసికొందుము గాక!

# 46. తథ్యమైన విషయము

"పుట్టినవాడు గిట్టక తప్పదు" అనునది తథ్యమైన విషయము. కాని ఎవరున్నూ ఈ విషయమును గమనించుట లేదు. గణించుట లేదు, గ్రహించుట లేదు. ఇదియే! మాయ యొనర్చు కార్యము. మాయ ఉన్నదానిని లేనిదిగను, లేనిదానిని ఉన్నదిగను తోపింపజేయును. నశించు పదార్థమును లేనిదిగను, నాశములేని పదార్థమును ఉన్నదిగను భావించుట వివేకవంతుల లక్షణము.

"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ" యని వేదములు ఘోషించుచున్నవి. "తల్లిని దేవతగా భావించుము, తండ్రిని దేవతగా భావించుము, ఆచార్యుని దేవతగా భావించుము, అతిథిని దేవతగా భావించుము" అని పై వాక్యముల కర్థము. మనము తల్లి గర్భమునందు ప్రవేశించినప్పటినుండియు, పెరిగి పెద్దవారమగునంతవరకు తల్లి అనేక రకములైన కష్టముల కోర్చి, ఎంతో సహనముతో మనకు వివిధములగు సౌకర్యములను కలుగజేసి, మనకు సుఖము నొసంగును. కావున తల్లి ఋణమును తీర్చుకొనుట మన కర్తవ్యము. తల్లి ఋణమునుండి విముక్తుడు కానివాడు తన జీవితమునందనేక విధములగు సమస్యల నెదుర్కొన వలసివచ్చునను మాట తథ్యము.

ఇక తండ్రి మనకు విద్యాబుద్ధులను గరపి, తాను ఆర్జించిన ధనమును మన విద్యార్జనకై వినియోగించి, మనకు మహోపకారము నొనర్చెను. అందువల్ల మనము మన తండ్రి ఋణమును తీర్చుకొనవలసియున్నది. ప్రహ్లాదుడు మరొకవిధముగా తన తండ్రిఋణమును తీర్చుకొనెను. "తండ్రి హరిజేరు మనియెడి తండ్రితండ్రి" యని పలికి తన తండ్రికి తండ్రివలె భాసించెను. తాను తల్లిగర్భము నందున్నప్పుడు నారదుడు "నారాయణమంత్రము" నుపదేశించుటయే! దీనికిగల కారణము. తన తండ్రికి నరసింహావతారరూపమునందు శ్రీహరిని దర్శింపజేసి, ప్రహ్లాదుడు తన తండ్రి ఋణమునుండి విముక్తుడయ్యెను. ఈ ప్రకారముగా తండ్రి ఋణమునుండి ముక్తులయ్యే కుమారులెందరున్నారీ ప్రపంచమునందు? లేరనియే చెప్పవచ్చును. కావున తండ్రికి జీవితాంతము వరకు సకలవిధములగు సౌకర్యములను సమకూర్చి, సుఖమును కలిగించుట ప్రతికుమారుని కర్తవ్యమై యున్నది. ఇంతేకాదు, తండ్రి మరణానంతరము తన జీవితాంతము వరకు శ్రాద్ధములనొనర్చు పద్ధతికలదు. ఈ కార్యముల నొనర్పని కుమారుడు తన జీవితమునందనేక రకములగు సమస్యలనెదుర్కొనవలసి యుండుననుమాట తథ్యము.

ఆచార్యుడు జ్ఞానప్రదాత. జీవితమునెట్లు సార్థకమొనర్చుకొనవలయునను విషయమును ఆచార్యుడు మనకు ప్రబోధించును. ఆచార్యుని ఈ జ్ఞానప్రబోధము వల్లనే! మన నిజమైన జీవితము ప్రారంభమగును. ఆచార్యప్రబోధము లేని జీవితము నిరర్థకమగును. జీవితమునందెట్టి ఆచరణను కలిగియుండవలయునో, ఆచార్యుడు మనకు ప్రబోధించును. తదనుగుణముగా వర్తించు నరుడు తన జీవితలక్ష్యము నందుకొనజాలును. ఆచార్యుడు మనకు జ్ఞాననేత్రమును ప్రసాదించును. ఈ జ్ఞాననేత్రముచే అజ్ఞానాంధకారము దూరమగును. జ్ఞాననేత్రము ద్వారా ఈ ప్రపంచము దేనిపై నిలుకడను కలిగియున్నదో, ఆ విషయము సుస్పష్టముగా తెలియబడును. కావున మనుజుడు నిరంతరము ఆచార్యుని సేవించుచుండవలయును. ఆతని ఆజ్ఞలను పాలించుచుండవలయును. ఆచార్యుని సేవింపక, ఆతని ఆజ్ఞలను పాలింపకయుండు నరుడు అనేక సమస్యల నెదుర్కొనవలసివచ్చును. జీవిత సమస్యలు నివారింపబడుటకై ఆచార్యుని సేవించుట, పూజించుట, ఉపాసించుట అత్యంతావశ్యకమను విషయము తథ్యము.

అతిథి అనగా :– తిథి లేని వాడని అర్థము. ఆతడు గృహస్థుని గృహమునకు 24 గంటలలో ఏ సమయమునందైనను రావచ్చును. అతిథి రాకను దేవుని రాకగా భావించి, గృహస్థుడాతనికి గౌరవమర్యాదల నొనర్పవలయును. అతిథి రూపమునందు వచ్చిన శత్రువైనను, ఆతనిని సత్కరించి, ఆతిథ్యము నొసంగినచో, మిత్రునిగా మారిపోవును. ఈ రోజులలో అతిథి సత్కారము కుంటుపడిన కారణము చేతనే! దేశములోని ప్రజలు రకరకములగు సమస్యల నెదుర్కొనవలసివచ్చుచున్నది. నిజమునకు అతిథిసేవ శ్రీమన్నారాయణుని సేవయే! అతిథిసేవ ఆ పరమేశ్వరుని సేవయే! అతిథిసేవచే సకల దేవతలు తృప్తి నొందుదురు. అతిథి సత్కారము పుణ్యప్రదము. అతిథి సత్కారముచే ప్రారబ్ధకర్మ క్షీణించును. సంచితకర్మ బలహీనమగును. ఆగామికర్మ ఆనందదాయకముగా పరిణమించును. కావున అతిథి సత్కారము అందఱూ ఆచరింపదగినది. అతిథి సత్కారముచే ద్వేషభావము నశించును. అతిథి సత్కారముచే సర్వాత్మభావమేర్పడును. అతిథిసత్కారముచే సకలవిధ సమస్యలు నివారింబడును. అతిథి సత్కారమునందు నిష్ఠను కలిగియుండు గృహస్థునికి జీవిత సమస్యలు వైదొలగుటయే గాక, ఆతడు తన జీవితలక్ష్యమును పొందగలుగుననుట తథ్యము.

భారతదేశముయొక్క సంస్కృతి మిక్కిలి ఉత్కృష్టమైయున్నది. ఈ కారణము చేతనే గృహస్థులందఱికి పాతివ్రత్యము స్త్రీలకు, ఏకపత్నీవ్రతము పురుషులకు విధింపబడినది. దేశములోని స్త్రీ–పురుషులందఱును పై రెండు నియమముల నాచరించినచో ప్రపంచమంతయు స్వర్గతుల్యమగును. కాని వీటినాచరింపని కారణముచేతనే! దేశమంతయు అల్లకల్లోలములకు, అలజడులకు, అమానుష కృత్యములకు గుఱియగుచున్నది. కొందఱు స్త్రీలు ద్రౌపదికి ఐదుగురు భర్తలున్నారు కదా!యని ప్రశ్నించుచుందురు. ఐతే, ద్రౌపది తన హృదయపూర్వక ప్రార్థనచే కౌరవసభలో శ్రీకృష్ణభగవానుని అనుగ్రహము నార్జించి, అంతులేని వలువలను పొంది, దుశ్శాసనుడు మూర్ఛిల్లి తలవంచుకొనునట్లు చేసెను. ఏ స్త్రీయైనను అట్లు చేయగలిగినచో, ఐదుగురేమి? ఐదువందల భర్తలను కలిగియున్నను దోషములేదు. ఇక, పురుషులు శ్రీకృష్ణుడు 16వేలమంది కన్యలను వివాహమాడెను కదా!యని ప్రశ్నించుచుందురు. శ్రీకృష్ణునివలె గోవర్ధనపర్వతమును కొనగోటిపై పైకెత్తగలిగినచో, ఏ పురుషుడైనను 16వేల కన్యలేమి? 16లక్షల కన్యలనైనను వివాహమాడినచో దోషము లేదను మాట తథ్యము.

మానవుడు తన శక్తిసామర్థ్యముల కనుగుణముగా జీవితమును గడుపుచుండ వలయును. మనకు దైవవిశ్వాసమెంతకెంతకు అధికమగుచుండునో, అంతకంతకు మనయందు శక్తిసామర్థ్యములు పెంపొందుచుండును. ప్రాణులయందున్న శక్తి యంతయు ప్రాణప్రదాతకు సంబంధించియున్నది. పరమేశ్వరుడే! ప్రాణప్రదాత. కావున ప్రతిప్రాణియు నిరంతరము పరమేశ్వరుని ప్రార్థించుచుండవలయును. అప్పుడే! పరమేశ్వరుడాప్రాణిని కాపాడగలుగును. ప్రాపంచిక మాయాజాలమునుండి తప్పించుటయే! పరమేశ్వరుని రక్ష. ప్రాపంచిక మాయజాలమునందు తగుల్కొనజేయుట పరమేశ్వరుడు మనకు విధించునట్టి శిక్ష. కావున నిజమైన సాధకుడెల్లప్పుడు పరమేశ్వరుని కరుణాకటాక్షము నాకాంక్షించుచుండవలయును. భక్తిభావముచే భావాతీతుడగుచుండ వలయును. ఇదియే! ఆధ్యాత్మికసాధకుడు ప్రపంచమునకొనర్చునట్టి నిజమైన సేవ. ఇట్టి సేవ విశ్వశాంతికి కారణమగును. విశ్వశాంతిచే విశ్వేశ్వరుడు సంతసించును. విశ్వేశ్వరుని కారుణ్యము నార్జించుటకై మానవుడా విశ్వేశ్వరుని శరణు పొందవలసియుండును. అప్పుడాతని జన్మ తరించుననుట తథ్యమైన విషయము.

# 47. దారిద్ర్యము

దారిద్ర్యమనగా:- బీదతనము, లేమితనము, హీనస్థితి, దీనస్థితియని అర్థము. దారితప్పినవాడు దారిద్ర్యము ననుభవించుచుండును. దారితప్పుటయనగానేమి? భగవదున్ముఖ మార్గమునకు భిన్నముగా నడచుట. భగవంతుడు సర్వవ్యాపకుడను విషయమును గుర్తింపకుండుటయే! భగవదున్ముఖమార్గమునకు భిన్నముగా వర్తించుట. భగవంతుడు సర్వశక్తివంతుడను విషయమును తెలిసికొనకుండుటయే! భగవదున్ముఖమార్గమునకు భిన్నముగా వర్తించుట. భగవంతుడు సర్వజ్ఞుడను విషయమును అవగాహన మొనర్చుకొనకుండుటయే! భగవదున్ముఖమార్గమునకు భిన్నముగా వర్తించుట.

ఈ ప్రపంచమునందు దారిద్ర్యముననుభవింపని వాడెవ్వడు లేనేలేడని చెప్పవచ్చును. ఈ విషయము మీకు అబ్బురముగా గోచరింపవచ్చును. కాని నిబ్బరముగా ఆలోచించినచో, అబ్బురపడుట కవకాశము లేదు. అది ఎట్లనగా:- ఈ ప్రపంచము నందేమియును కోరవలసిన అవసరము లేనివాడు ధనికుడని చెప్పబడును. కోరికలు లేనివాడెవ్వడైనా ఈ ప్రపంచమునందు కలడా? లేడు. కారణమేమి? ఈ ప్రపంచము నందు పూర్ణతృప్తి కలవాడెవ్వడును లేడు, కావున పూర్ణతృప్తి కలుగునంతవరకు కోరికలు నివారింపబడుట అసాధ్యము, ఆశాపిశాచ పీడితుడు కానివానికి కోరికలు స్వల్పముగా నుండును. కేవలము దేహధారణ కావశ్యములగు కోరికలు కోరికలుగా పరిగణింప బడవు. సిరిసంపదలను, భోగభాగ్యములను, ఐశ్వర్యమును అనుభవింప వలయునను కోరిక కోరికయనబడును. ఈ కోరికల ననుభవించుటచే అగ్నిలో ఆజ్యమును పోసినట్లు అవి పెరుగుచునేయుండును. కాని తరుగవు. ఈ కారణముచే మనుజుడు మనశ్శాంతిని కోల్పోవును. మనశ్శాంతి లేనివాడెంత గొప్పధనికుడైనను, ఆతనికి సుఖముండదు. కావున అట్టివాడు దరిద్రుడుగానే పరిగణింపబడును. సిరిసంపదలను, భోగభాగ్యములను, ఐశ్వర్యమును అనుభవింపవలయునను కోరిక కోరికయనబడును. ఈ కోరికల ననుభవించుటచే అగ్నిలో ఆజ్యమును పోసినట్లు అవి పెరుగుచునే యుండును. కాని తరుగవు. ఈ కారణముచే మనుజుడు మనశ్శాంతిని కోల్పోవును. మనశ్శాంతి లేనివాడెంత గొప్ప ధనికుడైనను, ఆతనికి సుఖముండదు. కావున అట్టివాడు దరిద్రుడుగానే పరిగణింపబడును.

దారితప్పుట అజ్ఞానియొక్క లక్షణము. నిత్యానిత్యవస్తువివేకియైనవాడు తప్పటడుగులను వేయజాలడు. అతడు ప్రతివిషయమును భగవచ్చింతనాయత్త మొనర్చును. అణువణువునందాతడు భగవత్తేజమును గాంచుచుండును. అడుగడుగు నందాతడు తడబడక తన్మయుడై యుండును. అన్యచింతన లేనివాడు 'అనన్యభక్తుడ'ని చెప్పబడును. నిజమునకు అన్యమేమియును లేదు. అన్యవస్తువు కలదని తలంచునట్టి వాడే అజ్ఞాని. ఈ భౌతికదేహము పంచభూతములచే నిర్మింపబడినది. పంచభూతములు భగవంతుని సొత్తే కాని, మన సొత్తు కాదు. కావుననే అహంకార–మమకారములు కలవాడు అజ్ఞానియని చెప్పబడును. ఇది దరిద్రుని లక్షణము. మనస్సును విషయవస్తువులపై వేగముగా పరుగెత్తునట్లు చేయువాడు కూడా భగవంతుడే! కావున నా మనస్సు విషయవస్తువులపై పరుగెత్తుచున్నదని పలుకుట కూడా అజ్ఞానియొక్క లక్షణమే! ఇది దరిద్రుని లక్షణము కూడా. మన బుద్ధికి విచేచనాశక్తిని ప్రసాదించినవాడు భగవంతుడు. కావున నేను బుద్ధిమంతుడనుకొనుటయున్నూ అజ్ఞాని యొక్క లక్షణమే! ఇదియే దరిద్రుని లక్షణము !

ఈ ప్రపంచమునందు భగవంతుడొక్కడే! ధనవంతుడు. ఏలననగా:– భగవంతునికి సంబంధించని పదార్థమంటూ ఈ ప్రపంచమునందేదియును లేదు. మానవులమగు మనమందఱమున్నూ దరిద్రులమని చెప్పినచో దోషము లేదు. ఐతే, దరిద్రులలో కూడా హోదాలుండును. ధనమును కోరువాడు దరిద్రుడనబడును. స్త్రీని కోరువాడు కామదరిద్రుడనబడును. ఇక కీర్తిప్రతిష్ఠలను కోరువాడు కీర్తి దరిద్రుడనబడును. స్థాయిని కోరువాడు స్థాయిదరిద్రుడనబడును. డంబము చూపువాడు డంబదరిద్రుడనబడును. నిజమునకు దారిద్ర్యమునకంతము లేదు. కోరికలున్నంత వరకు దారిద్ర్యము మన వెంటాడుచుండును. ఐతే, మానవుని ఈ దారిద్ర్యము తొలగిపోవుటెట్లు? కేవలము భగవంతునికి పూర్ణశరణాగతి నొందుటకు పూర్ణవైరాగ్యము కూడా ఉండవలయును. పెద్ద ఉద్యోగము దొరికినవాడు చిన్న ఉద్యోగమును తృణీకరించును కదా! అదే విధముగా భగవదైశ్వర్యము ననుభవింపగోరువాడు దారిద్ర్యముతో కూడినట్టి ఈ ప్రపంచమనెడి గృహమును త్యజింపవలయును. ఈ ప్రపంచమనెడి గృహముతో పాటు ఈ గృహమునందున్న వస్తువులన్నియును ఆ పరమేశ్వరునికి సంబంధించినవని భావన చేయుటయే! ప్రపంచమును త్యజించుట. మనము ఉదయము నిద్రనుండి లేవగానే భూదేవిపై కాలుమోపినప్పుడా భువనేశ్వరి యొక్క అనుగ్రహము చేతనే నేనీ పుడమిపై నడువగలుగుచున్నానని భావింపవలయును.

మనము శ్వాసోచ్ఛ్వాసలను జరుపుచున్నప్పుడా వాయుదేవుని కృపచేతనే! అట్లు చేయగలుగు చున్నామని తలంపవలయును. మనము భుజించిన ఆహారము జీర్ణమైనప్పుడు వైశ్వానరుడను అగ్నిదేవుని యొక్క అనుగ్రహము మనయందున్నదని తలంపవలయును. మనము జలమును పానమొనర్చునప్పుడు జలదేవత యొక్క అనుగ్రహము చేతనే! మన దప్పిక తీరుచున్నదని తలంపవలయును. ఆకాశము నందున్న మన అస్తిత్వమునకు కారణమా ఆదిదేవుడే! యను భావనను కలిగియుండ వలయును. అదియే! మన దారిద్ర్యము తొలగిపోవుటకు మార్గము.

ఈ ప్రపంచమొక సుప్రీంకోర్టు వంటిది. పరమేశ్వరుడే! మనకందఱికి అంతిమ తీర్పు నొసంగును. పరమేశ్వరుని తీర్పు ఎట్టిదై యుండునో, మన జీవితాచరణచే మనము తెలిసికొనవచ్చును. ఈ ప్రపంచములో ఏ పదార్థమైనను "నాది" అనుకొన్నవానికి తీవ్రమైన శిక్ష తప్పదు. ఈ ప్రపంచములోని ప్రతిపదార్థము "నీదే" (పరమేశ్వరునిదే) అనుకొన్నవాని ఆనందోత్సాహములకంతులేదు. అట్టివాడే! ధనికులలోకెల్ల ధనికుడు. ఈ ధనికుని ముందు ప్రాపంచిక ధనికులెల్లరును బానిసల వంటివారు. ఇప్పుడచ్చుటనే! భగవదనుభూతిని పొందువాడు నిజమైన ఐశ్వర్యవంతుడు. అట్టివాని నుండి దారిద్ర్యము దూరముగా పరుగెత్తివెళ్ళును. ఐశ్వర్యవంతుని రక్షణ యందున్నట్టివాడు కూడా ఐశ్వర్యవంతుడుగానే పరిగణింపబడును. సుప్రీంకోర్టు నందున్న ద్వారపాలకునికి కూడా జనులు గౌరవము నొసంగుదురు కదా! అదే ప్రకారముగా భగవద్దర్శనమునకు ద్వారపాలకుడనదగిన "సద్గురుదేవుని" మనము గౌరవింప వలసియుండును. సద్గురుదేవుని కృపచే సచ్చిదానంద స్వరూపుడైన పరమేశ్వరుని దివ్యదర్శనము మనకు కలుగును. అప్పుడు మన దారిద్ర్యమంతయును పటాపంచలగును. అప్పుడు మనము సకలైశ్వర్యములతో సుశోభితులమగుదుము. ఇదియే దైవసాక్షాత్కార ఫలము. ఇదియే! ఆనందసాగర నిమజ్జనము. ఇదియే! సకల సమస్యా నివారణము. ఇదియే! పరమానందసాగరము. ఇదియే! దారిద్ర్య నిర్మూలనము. ధ్యానసాధనచే జ్ఞానధనము మనకు ప్రాప్తించును. జ్ఞానధనముచే "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"గా నిర్వచింపబడినట్టి బ్రహ్మసాక్షాత్కారానుభవము మనకు కలుగును. దీనిచే జనన మరణ రాహిత్యము మఱియు పరమానందప్రాప్తికి మనము పాత్రులమగుదుము. ఈ ప్రకారముగా మన దారిద్ర్యము తొలగిపోయి, మనము ఐశ్వర్యసంపన్నులము కాగలుగుదుము.

# 48. ధన్యాత్మ

ధనవంతుడయ్యు, దానవత్వమును వీడి, దయగల హృదయము కలవాడై, దీనులైన జనులకు దాతృత్వముతో దానధర్మముల నొనర్చునట్టివాడు ధాన్యత్మయని చెప్పబడును. దీనజనుల దారిద్ర్యమును బాపు నిమిత్తమై భగవంతుడు ధనవంతులకు ధనము నొసంగియున్నాడు. "ధనవంతులమైన మేము మా పుణ్యకర్మల ఫలితము ననుభవించుచున్నాము. దరిద్రులు తామొనర్చిన పాపకర్మల ఫలితము ననుభవించు చున్నారు. కావున మేము దరిద్రులకు సహకరింపవలసిన ఆవశ్యకతలేద"ని ధనవంతులు పలుకవచ్చును. కాని "పుణ్యకర్మల ఫలితము పూర్తియైన తర్వాత నా గతి ఏమి?"యని

ధనవంతులు విచారింపవలసియున్నది. "దారిద్ర్యమే వారికి గతి" యనునది సమాధానము. ఒకవేళ ధనికులు భవిష్యత్తునందు దారిద్ర్యముననుభవింపదలంచినచో, వారు దరిద్రులకు సహకరింపవలసిన అవసరములేదు. ఇక దరిద్రులు తామొనర్చిన పాపకర్మల ఫలితముననుభవించుచున్నామని తలంచివారై అధర్మమార్గమును త్యజింపవలసియుండును. పూర్వజన్మలలో తాము ధనికులైయుండి, ధనములేనివారిని తృణీకరించిన కారణముచే, వారీజన్మయందు దారిద్ర్యముననుభవించుచున్నారు. అట్టివారు ధనికులకు ధనికుడైనట్టి ధర్మదేవత నారాధింపవలసియుండును. ధర్మమే! దేవుడు. దేవుడే! ధర్మము. ధర్మచక్రముచేతనే! భగవంతుని సృష్టియంతయును చలాయమాన మగు చున్నది.

"ధర్మోరక్షతి రక్షితః" అనగా :– ధర్మమునెవ్వడు రక్షించునో, ఆతనిని ధర్మమే! రక్షించునని అర్థము. బ్రహ్మజ్ఞానము నార్జించుటయే! బ్రాహ్మణులకు ధర్మమైయున్నది. మరొకవిధముగా చెప్పవలయునేని, బ్రహ్మజ్ఞానము నార్జించినవాడే! బ్రాహ్మణుడని చెప్పబడును. అట్టివాడు పురుషోత్తముడుగా పరిగణింపబడును. అట్టివాడగ్రజన్ముడుగా భావింపబడును. అట్టివాడే! ధన్యాత్మయని చెప్పబడును.

బలహీనులను, అబలలను రక్షించుటయే! క్షత్రియధర్మము. "ధర్మమును తప్పుట కంటె అధర్మమును సహించుటయు మహాద్రోహమ"ని శ్రీ గురుగోవింద్‌సింగ్ పలికెను. కావున అధర్మమును నశింపజేయుటయే! క్షత్రియధర్మము. అధర్మమ నగానేమి? ఆధ్యాత్మిక మార్గమునకు విరుద్ధముగా వర్తించుటయే! అధర్మమనబడును.

ఇక ఆధ్యాత్మిక్ మార్గమనగానేమి? సకలచరాచర ప్రాణికోటియందేకాత్మ భావమును కలిగియుండుటయే!

ఆధ్యాతికమార్గమనబడును. అనగా:- ఇతరులకు కలుగు బాధను సహింప కుండుటయే! ఆధ్యాత్మిక మార్గమనబడును. మన భారతదేశమునందు కుక్షింభరులగు లక్షలాది రక్షకభటులు కలరు. కాని ప్రయోజనమేమి? వారు భక్షకభటులవలె ప్రవర్తించు చుందురు. ఇది క్షత్రియధర్మమెంత మాత్రమున్నూ కాదు. దీనిని క్షమించుటకు వీలులేని శత్రువుల ధర్మమని చెప్పుటయుక్తమగును. నిజమైన క్షత్రియునికి అధర్మము మాత్రమే! శత్రువైయుండును. "బలహీనులను రక్షించుటకే కదా! భగవంతుడు బలవంతులను సృష్టించెను?" అని సాలమన్ చక్రవర్తి పలికెను. ఒకరోజు తాను గుఱ్ఱముపై స్వారి చేయుచుండగా ఒకచీమల పుట్ట ఎదురయ్యెను. అప్పుడా చక్రవర్తి తన గుఱ్ఱమునకు కళ్ళెమువేసి, మరొకమార్గమునందు పోనిచ్చెను. ఈ ప్రకారముగా బలహీనులను రక్షించి, ఏకాత్మ భావమును పోషించునట్టివాడే! నిజమైన క్షత్రియుడని చెప్పబడును. అట్టివాడే! ధన్యాత్మయని నుడువబడును.

ఇక విశ్వాత్మభావము కలవాడే! నిజమైన వైశ్యుడుగా పరిగణింపబడును. వై

శ్యుడు సమృద్ధిగా ధనమును సంపాదింపవలయును. కాని అట్లు సంపాదించిన ధనముతో దానధర్మములను చేయుచుండవలయును. గోమాతను రక్షించుచుండ వలయును. గీతామృతపానమొనర్చు చుండవలయును. జ్ఞానగంగయందు స్నానమొనర్చుచుండ వలయును. భారతమాత యొక్క కీర్తిప్రతిష్ఠల నినుమడింప చేయుచుండవలయును. తన తండ్రి ఆజ్ఞానుసారముగా శ్రీ గురునానక్ అంగడిలో ధాన్యమును అమ్ముచున్నప్పుడు ముంతతో ధాన్యమును కొలుచుచుండెను. ఏక్, దో, తీన్ అంటూ "తేరా" వరకు వచ్చెను. తేరా- అంటే పదమూడు అని అర్థము "నీదే" అని మరొక అర్థము శ్రీ గురునానక్‌యొక్క మనస్సు రెండవఅర్థమునందు తగుల్కొనెను. కావున "తేరా-తేరా-తేరా"యని కొలుచుట ప్రారంభించెను. నిజమునకు ఈ ప్రపంచములోని ఐశ్వర్యమంతయు భగవంతునిదే! కదా! ఏ తద్భావముతో ఏ పనిచేసినను, భగవంతుడు ప్రీతినొందును. అనన్యచింతనను కలిగియుండువాడు భగవంతుని ప్రీతిపాత్రుడగును ఆతనిపై దైవానుగ్రహము నిండుగానుండును. అట్టివాడన్ని స్థలములలోను పూజింపబడును. గురునానక్‌దేవ్ హిందువులచేతను, ముసల్మానుల చేతను పూజింపబడెను. ఇట్టి సర్వాత్మభావ సంపన్నుడు ధన్యాత్మయనబడును.

"పద్భ్యాం శూద్రో అజాయత" అని పురుషసూక్తము నుడువుచున్నది. పద్మనాభుని పాదములనుండి శూద్రుడు ఉద్భవించెనని దాని భావము. పద్మనాభుని పాదములను నాలుగు వర్ణములవారున్నూ పూజించుచున్నారు కదా! పద్మనాభుని పాదద్వయము శూద్రులకు తల్లిదండ్రులవంటిది. కావున శూద్రులున్నూ పద్మనాభుని పాదములను పూజించుటకర్హులే! యగుదురు. కావున నాలుగువర్ణములవారున్నూ పరస్పరము సోదరులు మఱియు సోదరీమణులే!యగుదురు. పై వర్ణములవారికి శూద్రుడు కనీసము కనిష్ఠ సోదరుడగును. కావున ఆతడందఱిచేతను ఆలింగనమొనర్చు కొనబడవలయును. ఐతే దైవవిముఖులైన వారినిగూర్చి ఇచ్చట చెప్పబడుట లేదు. దైవోన్ముఖులైన శూద్రులను గూర్చియే! చెప్పబడుచున్నది. ఏలననగా:– దైవవిముఖులైన వారేవర్ణమునకు చెందినను, వారు దైత్యులుగానే పరిగణింపబడుదురు. ఈ జగత్తంతయు త్రిగుణముల నాటకమైయున్నది. ఈ త్రిగుణముల నతిక్రమించినవాడు బ్రహ్మస్వరూపుడే! యగును. త్రిగుణములచే బంధింపబడినవాడు జీవుడని చెప్పబడును. త్రిగుణముల నతిక్రమించినవాడు దేవుడే! యగును. శూద్రుడు పురుషోత్తముడగు శ్రీమన్నారాయణుని పాదపద్మములనుండి జన్మించిన కారణముచే, త్రిగుణముల నతిక్రమించి, తన నిజస్వరూపమును తెలిసికొనజాలినప్పుడాతడు బ్రహ్మస్వరూపుడే! యగును. బ్రాహ్మణుడు పురుషోత్తముని ముఖమునుండి జన్మించినను, త్రిగుణముల నతిక్రమించి, తన నిజస్వరూపమును తెలిసికొనజాలకుండునేని, అట్టివాడు శూద్రుడుగానే పరిగణింపబడును. ఈ భేదద్వయమును తెలిసికొని ద్వంద్వాతీతుడైనవాడే! ధన్యాత్మయని చెప్పబడును.

ఇంద్రియములను నిగ్రహించినవాడు ఉపనిషత్తుల నిశ్చితార్థమును తెలిసికొన్నవాడు, సమస్తక్రియలను పరమార్థదృష్టితో ఆచరించునట్టివాడీ పృథ్వియందు ధన్యాత్మయని చెప్పబడును. రాగద్వేషములు, మదమోహములు ఇత్యాది శత్రువులను జయించి, జ్ఞానామృత పానమొనర్చి బ్రహ్మవిద్యయనెడి కాంతతో సుఖమననుభవించువాడు ధన్యాత్మ యనబడును. అధోగతికి కారణమైన గృహమోహమును త్యజించి, ఆత్మజిజ్ఞాసచే బ్రహ్మామృతమును పానమొనర్చి, విషయభోగవిరక్తుడై, నిస్సంగభావముతో జనశూన్య స్థలములలో విహరించువాడు ధన్యాత్మ యనబడును. అహంకార–మమకారములను త్యజించి, సమదర్శియై, కర్మఫలములను దేవునికర్పించువాడు ధన్యాత్మయని చెప్పబడును. ఈషణత్రయమును త్యజించి, హృదయపీఠమునందు పరాత్పరజ్యోతిని దర్శించువాడు ధన్యాత్మయని నుడువబడును. సదసత్తులు కాని, స్త్రీపురుషులు కాని

బ్రహ్మమును ఏకాగ్ర చిత్తముతో చింతించుచుండువారు ధన్యాత్ములనబడుదురు. జరామరణ సమన్వితమగు సంసారబంధమును జ్ఞానరూపఖడ్గముచే ఖండించువారు ధన్యాత్మయని చెప్పబడును. ఎవ్వడు జనసమూహమును సర్పసమూహమువలె విడనాడునో, ఎవ్వడు సుందరస్త్రీని శివశక్తివలె భావించునో, విషయములనెవ్వడు విషమువలె విడిచిపెట్టునో, అట్టి పరమహంస ధన్యాత్ముడనబడును. పరబ్రహ్మమును సాక్షాత్కరించుకొన్నవానికి ఈ సంసారమొక నందనవనము వంటిదగును. అట్టివాని చేష్ట లన్నియును పరమార్థమయము లగును. అట్టివాడు ధన్యాత్మయని చెప్పబడును.

## 49. "నతాతో నమాతా"

పై శీర్షిక జగద్గురు శ్రీశంకరాచార్యులవారు రచించిన "భవాన్యష్టకము" లోని ప్రథమ శ్లోకములోని ప్రథమపాదము. మానవుడు భవబంధ విమోచనము నొందుటకై భవానిదేవికి పూర్ణశరణాగతిని ఎట్లు బడయగలుగునో ఈ "భవాన్యష్టకము" స్పష్టముగా వివరించి చెప్పినది. "యద్దృశ్యం తన్నశ్యమ్" అనగా:- కంటికి కానబడున దంతయు ఒకప్పుడు నశించునట్టిదేయని అద్వైతవేదాంత సిద్ధాంతము. ఈ కారణముచే సృష్టి సమస్తమునందున్న జీవరాసులన్నియును నశించునట్టివే యగును. అందువల్ల వాటియందు విశ్వాసమునుంచునట్టి వారు ప్రాపంచిక జనులనబడుదురు. ఇక నాశము లేనట్టి, నశించు పదార్థములన్నింటి కాధారభూతమై యున్నట్టి పరమోత్కృష్టమైన చైతన్య శక్తిని విశ్వసించుటయే! పారమార్థిక జిజ్ఞాసువుల లక్షణమై యుండును. అట్టి చైతన్యశక్తియే భవాన్యష్టకమునందు "భవాని"గా శ్రీ జగద్గురు శంకరాచార్యుల వారిచే వర్ణింపబడినది. తల్లి, తండ్రి, బంధువు, పుత్రుడు, పుత్రిక, భర్త, భార్య ఇత్యాది వారెవ్వరున్నూ విశ్వసింపదగినవారు కారు. కాని వీటన్నింటికి ఆధారభూతమైయున్న "భవాని" మాత్రమే విశ్వసింపదగినది. అట్టి పరాశక్తిని నేను శరణుపొందుచున్నానని ప్రథమ శ్లోకమునందు వర్ణింపబడినది.

"ఓ భవానీ! నేనీ సంసారసాగరమునందు దుఃఖముతోను, క్లేశముతోను సతమతమగుయున్నాను. లోభము కలవాడనై, కామపీడితుడనై, మహాసంకటగర్తము నందు పడియున్నాను. నేనీ సంసారపాశముచే బంధింపబడియున్నాను. ఓ భవానీ! ఈ గొప్ప సమస్యనుండి వైదొలగుటకై నీవే నాకు దిక్కు" అని రెండవ శ్లోకము నందు వర్ణింపబడినది.

"ఓ భవానీ! నాకు దానము చేయుట తెలియదు. కారణమేమందువా? నీవే దాతవు. నేను ఎవరికైనా, ఏమైనా ఇచ్చినచో అదియంతయు నీ సొత్తే కదా! నాకు ధ్యానముచేయుట తెలియదు, ఏలయందువా? నీవు నాకంటె భిన్నమైయున్నప్పుడు మాత్రమే! నేను నీ గురించి ధ్యానము చేయగలుగుదును. నీవు నాలోనే ఉన్నావు కదా! కావున నిన్ను గూర్చి ధ్యానించు యోగ్యతనాలో లేదు. మంత్ర, యంత్ర, తంత్రములు నాకు తెలియవు. వాటన్నింటికి నీవే! మూలమైయున్నావు కదా! నిన్ను పూజించుట, స్తోత్రము చేయుట నాకు తెలియదు. కాని నాలో నీవున్నావని తెలిసికొను ప్రయత్నమునందేదో యొకటి వాగుచుందును. నీవే నాకు దిక్కు" అని మూడవ శ్లోకమునందు వర్ణింపబడినది.

"ఓ భవానీ! నాకు పుణ్యము తెలియదు. తీర్థము తెలియదు. కారణమే మందువా? నిన్ను శరణుపొందుటలోనే ! పుణ్యములన్నియు, తీర్థములన్నియు దాగియున్నవి కదా! నాకు ముక్తిగాని, లయముగాని తెలియదు. హేతువేమందువా? మనస్సును నీ యందు చేర్చుటయే! లయమనబడును కదా! హృదయకమలమునందు నిన్ను గాంచుటయే! ముక్తియగును కదా! ఓ తల్లీ! నాకు భక్తిగాని, వ్రతముగాని తెలియదు, కారణమేమందువా? భక్తిభావము, వ్రతాచారములన్నియును నిన్ను చేరుట కొఱకే కదా! కావున నీవే నాకు దిక్కు" అని నాల్గవ శ్లోకమునందు చెప్పబడినది.

"ఓ భవానీ! నేను దుష్టసాంగత్యమునందున్నాను. దుష్కర్మలను చేయుచున్నాను. నా బుద్ధి భ్రష్టమైయున్నది. నా దృష్టి వక్రీకరించినది. నేను దుర్భాషలాడుచుందును. నేను నీకు దూరమై యుండుటయే! వీటన్నింటికి కారణము. కావున ఓ తల్లీ! నిన్ను నేను శరణు పొందుచున్నాన"ని ఐదవ శ్లోకము నుడువుచున్నది.

"ఓ భవానీ! నాకు రాజుగాని, చక్రవర్తిగాని, ఇంద్రుడుగాని, శివుడుగాని, విష్ణువుగాని, సూర్యచంద్రులుగాని తెలియదు. కారణమేమందువా? వారందఱున్నూ నీ శక్తిచేతనే కార్యకలాపముల నాచరించుచున్నారు కదా! అందువల్ల ఓ తల్లీ! కేవలము నిన్నే నేను శరణుపొందుచున్నాన"ని ఆరవ శ్లోకము నుడువుచున్నది.

"ఓ భవానీ! నేను వివాదమునందున్నను, విషాదమునందున్నను, ఏకాంత స్థలమునందున్నను, జలమునందున్నను, అగ్నియందున్నను, పర్వతమస్తకము నందున్నను, అరణ్యమునందున్నను, శత్రుమధ్యమునందున్నను కాపాడుదానవు నీవే! యని నమ్మి నిన్ను శరణుపొందుచున్నాన"ని ఏడవ శ్లోకము వివరించుచున్నది.

"ఓ భవానీ! నేను అనాథుడను. కారణమేమందువా? నన్ను రక్షించు వారెవ్వరున్నూ నాకు లేరు. నేను దరిద్రుడను. కారణమేమందువా? అష్టవిధములైన ఐశ్వర్యములకు నీవే! మూలాధారమై యున్నావు కదా! నేను వృద్ధాప్యముచేతను, రోగములచేతను సతమతమగుచున్నాను. హేతువే మందువా? నిన్ను శరణుపొందని కారణముచే బాధల ననుభవించుచున్నాను. నేను విపత్సాగరమునందు మునిగియున్నాను. ఈ సమస్యలన్నియును నివారింపబడుటకై నేను కేవలము నిన్నే! శరణుపొందుచున్నాను." అని ఎనిమిదవ శ్లోకము నుడువుచున్నది.

ఈ ప్రకారముగా జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు చిచ్ఛక్తియొక్క మహిమను గూర్చి ఈ "భవాన్యష్టకము"నందు వర్ణించియున్నారు. ఈ సృష్టియంతము చిచ్ఛక్తిచేతనే! చలాయమానమగుచున్నది. చిచ్ఛక్తికి వినా ఈ ప్రపంచమునకు ఉనికిలేదు. బ్రహ్మాండము యొక్క సూక్ష్మరూపమే! పిండాండము. పిండాండముయొక్క సూక్ష్మరూపమే! అండాండము. తల్లి గర్భమునందు మానవజీవి సూక్ష్మరూపమునందుండును. గర్భమునుండి వెలువడిన తర్వాత కండ్లు, చెవులు, కాళ్ళు, చేతులు ఇత్యాదులతో కూడిన పూర్ణవ్యక్తి వ్యక్తమగును. మన దేహము పృథ్వీతత్త్వముచే నిర్మింపబడినది. మన నోటియందున్న లాలాజలమునకు కారణము జలతత్త్వము. మన ఉదరము నందున్న జఠరాగ్నికి కారణము అగ్నితత్త్వము. మన నాసికలోని శ్వాసకు కారణము వాయుతత్త్వము. మన హృదయగుహలోని శూన్యమునకు కారణము ఆకాశతత్త్వము. ఈ హృదయగుహయందే పంచభూతముల కతీతుడైయున్న పరమాత్మ వెలుగొందు చున్నాడు. ఈ దేహమునకు మరణమున్నను, దేహియగు పరమాత్మకు మరణము లేదు. మరణమంటే మరేమియు కాదు, మార్పే! మరణము. పంచభూతములచే నిర్మింపబడిన ఈ దేహము తిరిగి పంచభూతములయందే లయించును. ఇదే మరణమని చెప్పబడును. ఇక పరమాత్మకు మార్పు లేదు. మార్పులేని పరమాత్మయే! పరమసత్యము. మాటిమాటికి- క్షణక్షణము మార్పునొందుచున్న ప్రపంచమే! అసత్యము. కావున అసత్యమైన ఈ ప్రపంచమును త్యజించి, పరమసత్యమైన పరమాత్మను శరణుపొందుటయే! సాధకులందఱి జీవితలక్ష్యమై యుండవలయును. ఈ ప్రపంచము "మాయ"యని శాస్త్రములు వక్కాణించుచున్నవి. "యామా సామాయా" అనగా:- దేనికి ఉనికి లేదో, అదియే! మాయయని అర్థము. ప్రపంచమునకు నిజమైన ఉనికి లేదు. కారణమేమి? అది మార్పునొందుచుండును. పరమాత్మకు "లేమి" లేదు. కారణమేమి? అది స్వయంసత్తాగా సుస్థిరమై, మార్పులేనిదై విరాజిల్లుచున్నది.

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అనెడి ఈ చిన్న వాక్యమునందు బ్రహ్మము యొక్క వర్ణన కలదు. బ్రహ్మమునకు మార్పులేదు. కావున అది పరమసత్యమై యున్నది. బ్రహ్మమునకు తెలియని విషయమంటూ లేదు. కావున అది జ్ఞానస్వరూపమైయున్నది. బ్రహ్మము సర్వత్ర వ్యాపించియున్నది. కావున అది అనంతమైయున్నది. బ్రహ్మమును తెలిసికొనుటకై మనము సత్యసంధులమై యుండవలయును. బ్రహ్మజ్ఞానము నొందుటకై భవానీదేవిని శరణు పొందవలసియుండును. అనంతమైయున్న బ్రహ్మమును తెలిసికొనుటకై అంతము గల మనము అంతము కావలసియుండును. అనగా:- దేహభావనను రహిత మొనర్చుకొనవలసియుండును. మన నాస్తిత్వముచే నిజమైన అస్తిత్వము గల బ్రహ్మము పొందబడును. అట్టి "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" ను పొందగలుగునట్టి సామర్థ్యమును భవానీ దేవి మనకు ప్రసాదించును గాక!

## 50. పాప పంక ప్రక్షాళనము

ఇంతో అంతో పాపమునొనర్పని వాడీ ప్రపంచమునందెవ్వడున్నూ లేడనియే! చెప్పవచ్చును. కారణమేమి? పాపమొనర్చినామని నిరూపించునట్టిదీ శరీరమే! నిజమునకు పాపమనగానేమి? జీవుడు పరమాత్మకు దూరస్థుడైయుండుటయే! పాపము. ఈ పాపము చేతనే! జీవుడు జనన మరణములనొందుచు దుఃఖభూయిష్ఠుడగుచుండును. కావున ఈ ప్రపంచమంతయు పాపపంకిలమునందు మునిగియున్నదని చెప్పినచో తప్పులేదు. మనమెవరినైనా "ఓ పాపీ" యని పిలచినచో ఆతడు కోపోద్రిక్తుడగును. కారణమేమి? పాపకార్యము మన సహజ స్వభావముకాదు. పుణ్యకార్యమే! మన సహజ స్వభావము. సత్కర్మలను చేయుటచే పుణ్యము లభించును. సత్కర్మలన్నియును పరోపకారముపై ఆధారపడియుండును. ఇతరులకు అపకారము చేసినప్పుడది దుష్కర్మయని చెప్పబడును. సత్కర్మలచే పుణ్యఫలము లభించును. దుష్కర్మలచే పాప ఫలము లభించును. నిస్వార్థతచే పుణ్యము లభించును. స్వార్థపరత్వముచే పాపము లభించును. స్వమత వాదులందఱున్నూ స్వార్థపరులనియే! చెప్పబడుదురు.

భగవద్భక్తులు "పాపోహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః త్రాహిమే కృపయా శంభో! శరణాగత వత్సలః" అని ప్రార్థించుచుందురు. పై శ్లోకము దేహభావము, మనోభావము కలవారికి సంబంధించినది. కేవలము దేహమును పోషించుకొని, దేహ సౌఖ్యము నొందదలంచువారు స్వార్థపరులైయుందురు. అట్టివారు

పాపకర్మల నాచరించు చుందురు. ఇక ఇతరుల దేహములను పోషించుచు, ఇతరులకు దేహసౌఖ్యము నొసంగు నట్టివారు స్వార్థరహితులని చెప్పబడుదురు. దీనిచే పుణ్యము లభించును. ఐతే, పుణ్యమైతే నేమి? పాపమైతేనేమి? వాటివాటి ఫలముల ననుభవించుటకై మనుజుడీ పుడమి యందు జన్మింపవలసియుండును. అతిశయించిన పుణ్యము నార్జించినవాడు స్వర్గలోకమునకేగి, స్వర్గలోక సుఖముల ననుభవించును. కాని పుణ్యఫలము క్షీణించిన వెంటనే అతడీ పృథ్విపై పతనమగును. కాని జననమరణ చక్రమునుండి తప్పించుకొనజాలడు. ఈ కారణముచే పుణ్యము బంగారు సంకెలగా వర్ణింపబడినది. పుణ్యమున్నూ బంధన కారణమే సుమా! అస్తు.

జననమరణ రహితమగు మోక్షమును బడయుటకై పాపపంకిలము (బురద) తొలగవలసియుండును. దానితోపాటు పన్నీరును బోలిన పుణ్యము కూడా తొలగవలసి యుండును. జీవులొనర్చు కర్మలు త్రివిధములుగా విభజింపబడినవి. (1) సంచితకర్మ, (2) ప్రారబ్ధకర్మ, (3) ఆగామికర్మ. పూర్వజన్మలలో చేసికొన్న కర్మఫలరాశి సంచితకర్మ యని చెప్పబడును. ఇక శేషించిన కర్మఫలము మరుజన్మయందాగామి కర్మగా పరిణమించును. ఈ జన్మయందు కర్మక్షయము కొరకై క్షణక్షణమును వినియోగించినప్పుడు మఱియు జ్ఞానప్రకాశమేర్పడినప్పుడా జ్ఞానాగ్నిచే సంచిత కర్మ భస్మమగుట కవకాశము కలదు. ఈ జన్మయందు నిస్స్వార్థకర్మల నొనర్చిన వారికి ఆగామి కర్మానుభవముండదు. అందువల్ల వివేకవంతుడు కర్మక్షయము నొనర్చుకొని, అక్షయసుఖానుభూతి నొసంగు మోక్షధామమునందు ప్రవేశించుటకై నిరంతరము కృషి యొనర్పవలసియుండును.

మానవుడు మోక్షమునొందుటకై దేహము, మనస్సు, బుద్ధి అడ్డుగోడలవలె నిలచియున్నవి. కావున దేహము దహింపబడునట్టిదని తెలిసికొని దేహియగు “ఆత్మ” యందే దృష్టిని కలిగియుండవలయును. ఇక మనస్సు చంచల స్వభావము కలిగియున్నదని తెలిసికొని, అచంచలమైన ఆత్మయందు దానిని ప్రవర్తింపజేయ వలయును. ఇక బుద్ధి మన కొసంగినట్టి జ్ఞానము పరిమితమై యున్నందువలన “యో బుద్ధేః పరతస్తుసః” అని శ్రీ గీతాచార్యుడు సెలవిచ్చియున్నాడు. కావున పరమపదప్రాప్తికై మనము దేహమనోబుద్ధీంద్రియముల నతిక్రమింపవలసియుండును. మన మెంతకెంతకు సర్వేశ్వరుని సన్నిధి కేగుచుందుమో, అంతకంతకు మన మొనర్చిన పాపము సన్నగిల్లుచుండును. మఱియు పుణ్యము పెరుగుచుండును. ఇక మనమెంతకెంతకు పరమాత్మునికి దూరమగుచుందుమో, అంతకంతకు పాపము వృద్ధి నొందుచుండును. మఱియు పుణ్యము క్షీణించుచుండును. భగవన్నామస్మరణచే పాప క్షయమగును. విస్మరణచే పుణ్యక్షయమగును.

పాప పంక ప్రక్షాళనకై గురుదేవుని చేయూత కూడా అత్యవసరమగును. గురుదేవుని చేయూత లేని మనుజుడు పాపపంకిలమునందు పడిపోవుట కవకాశము కలదు. సత్యాన్వేషకుడైన నిజమైన సాధకుడు తన సర్వస్వమును గురుదేవునికర్పించి "శ్రీ గురుదేవ మమ దేహి కరావలంబమ్"అని పలుకుచుండును. సత్య సంధుడైన సాధకుడు అహంకారశూన్యుడై గురుదేవుని అస్తిత్వమే! తన అస్తిత్వముగా భావించుచుండును. అనగా:- తన నాస్తిత్వమే! గురుదేవుని అస్తిత్వముగా తలపోసి ఆనందించుచుండును. ఒక చిన్నని అగ్నికణము రగుల్కొన్నప్పుడు ఒక గదియందున్న దూదియంతయు క్షణములో భస్మమగును. అదే ప్రకారముగా ఆత్మ జ్ఞాన లవలేశముచే జీవుని పాపరాశియంతయు భస్మమగును "అహం బ్రహ్మాస్మి" యనెడి మహావాక్యమునను భూతమొనర్చుకొన్నప్పుడు ఆత్మ జ్ఞానోదయమగును. ఇందు నిమిత్తమై గురూపదేశ మంత్రమైన "తత్త్వమసి" యనెడి మహావాక్యమును పదేపదే మనన మొనర్చుకొను చుండవలయును. అప్పుడు మనయందున్న విజ్ఞానము "ప్రజ్ఞానం బ్రహ్మ"గా పరిణామమునొందును. అప్పుడు "అయమాత్మా బ్రహ్మ" యనెడి మహావాక్యము సార్థకమగును.

కేవలము ఆత్మజ్ఞాన ధనమునార్జించినట్టివాడు మాత్రమే! తన పాపపంకమును ప్రక్షాళన మొనర్చుకొనజాలును. కేవలము గురూపదేశవాక్యమును మననమొనర్చు కొనుచు, గురుదేవుని యందు సుదృఢమైన నిష్ఠను కలిగియుండునట్టివాడే! బ్రహ్మ నిష్ఠాగరిష్ఠుడని చెప్పబడును. సూర్యరశ్మికి బాగుగా కరిగినట్టిమంచు నీరుగా మారును. అదే విధముగా విషయవాసనలయందు కరుడుగట్టిన మనస్సు జ్ఞానభాస్కరుడైన గురూపదేశము ద్వారా సూక్ష్మమగును. మనస్సు ఎంతకెంతకు సూక్ష్మమగుచుండునో, అంతకంతకది సూక్ష్మాతిసూక్ష్మమైన ఆత్మయందు ప్రవేశించుచుండును. మనస్సు ఎంతకెంతకు సూక్ష్మమగుచుండునో, అంతకంతకు పాపపంక ప్రక్షాళనమున్నూ జరుగుచుండును. పరిశుద్ధమైన మనస్సు మాత్రమే! పరిశుద్ధమైన బ్రహ్మమునందు ప్రవేశింపజాలును. అట్లు ప్రవేశించిన మనస్సు తిరగి ఉత్పన్నము కాకుండుటయే! మోక్షమని చెప్పబడును. అప్పుడు నిశ్శేషముగా పాపపంకిలము ప్రక్షాళనమైనదని చెప్పవచ్చును. ఇదియే! నిజమైన ఆధ్యాత్మిక సాధకులొనర్పవలసిన కార్యమైయున్నది. సాధకులము, భక్తులము, జిజ్ఞాసువులము, ముముక్షువులమైన మనమందరమున్నూ నిశ్శేష పాపపంక ప్రక్షాళనము ద్వారా పరమానందప్రాప్తిని బడయుటకై నిరంతరము ప్రయత్నపరులమై యుందుముగాక!

# 51. ఫాలనేత్రము

ఫాలనేత్రము అంటే నుదుటియందున్న కన్ను, లేక నుదురు అనెడి కన్ను అని అర్థము. దీనిని మూడవనేత్రము, లేక జ్ఞాననేత్రము అని కూడా చెప్పుదురు. ఈ జ్ఞాననేత్రము సామాన్యముగా శ్రీ శివునికి ఆపాదింపబడును. ఈ జ్ఞాననేత్రము చేతనే! శివుడు కామదేవుని భస్మమొనర్చెను. అనగా:- కోరికల రాశిని భస్మీకృతమొనర్చెను. కోరికలను భస్మమొనర్చినప్పుడు మిగులునదేమి? కోరికలు లేని స్థితి. కోరికలు లేని స్థితి ఎప్పుడు కలుగును? సమస్తకోరికలు నెఱవేరినప్పుడు. సమస్తకోరికలు ఎప్పుడు నెఱవేరును? సమస్తము మన స్వాధీనము నందున్నప్పుడు. సమస్తము మన స్వాధీనము నందెప్పుడుండును? సర్వేశ్వరుని జ్ఞానము కలిగినప్పుడు. సర్వేశ్వరుని జ్ఞానమెప్పుడు కలుగును? సకలపదార్థములలోను, సర్వజీవులలోను ఆ సర్వేశ్వరుని దర్శింప గలిగినప్పుడు. సర్వత్ర మనమా సర్వేశ్వరుని ఎట్లు దర్శింపగలుగుదుము? మొదట మన అంతఃకరణమునందున్న అంతర్యామిని దర్శింపగలిగినప్పుడు మన అంతఃకరణము నందున్న అంతర్యామిని ఎట్లు దర్శింపగలుగుదుము? అంతఃకరణశుద్ధి కలిగినప్పుడు అంతఃకరణశుద్ధి ఎట్లు కలుగును? కర్మ పరిపక్వమైనప్పుడు కర్మ ఎట్లు పరిపక్వమగును? క్రియ- ప్రతిక్రియలను పరిశీలించినప్పుడు. క్రియ - ప్రతిక్రియలను పరిశీలించుట ఎట్లు? ఏ కార్యము నొనర్చినచో ఏ ఫలితము కలుగునో తెలిసికొన్నప్పుడు. పాపకార్యము నకు పాపఫలము లభించును. పుణ్యకార్యమునకు పుణ్యఫలము లభించును. కావున ఫాలము అనగా:- ఫలమునొసంగునది అని అర్థము. “నుదుట వ్రాసిన వ్రాత తుడిచివేయుట తరమా? ” అని మనము చెప్పుచుందుము. అనగా:- ఎవరెవరు ఏఏ కార్యము నొనర్తురో, వారు వారు ఆయాకార్యము యొక్క ఫలమునను భవింప వలసి యుండును. మనము మన చిన్నతనము నందొనర్చిన కార్యములే మనకిప్పుడు జ్ఞప్తి యందుండవు. ఇక పూర్వ జన్మలయందొనర్చిన కార్యములు జ్ఞప్తియందుండునా? ఉండవు. ఈ కారణముచే పూర్వజన్మ కర్మలను, కర్మఫలములను మనము అదృష్టమని చెప్పుచుందుము. అదృష్టమనగా:- దృష్టికి గోచరింపనిదని అర్థము. ఇదియే! పాపపుణ్యఫలముల రాశి. ఈ పాప-పుణ్యముల రాశిని భస్మమొనర్చుటయే! జ్ఞాననేత్రమును, లేక ఫాలనేత్రమును తెఱచుట. ఈ జ్ఞాననేత్రమును తెఱచినప్పుడు మాత్రమే! మానవునికి ఆత్మసాక్షాత్కారము, లేక దైవసాక్షాత్కారము కలుగును. కర్మఫలములు తొలగిపోయినప్పుడు మాత్రమే! ఫాలనేత్రము తెఱువబడును. ఫాలనేత్రము తెఱువబడినప్పుడు కోరికలన్నియును నశించును. అనగా:- సమస్త

కోరికలు నెఱవేరునని అర్థము. ఒక రాజునుండి, లేక చక్రవర్తినుండి పదార్థములను కోరుకొనుట కంటె ఆ రాజును, లేక చక్రవర్తినే కోరికొనుట తెలివైన పని. అదే విధముగా సమస్త కోరికలను నెఱవేర్చునట్టి పరమాత్మను కోరుకొనుటయే! మిక్కిలి శ్రేష్ఠమైన కార్యము.

జీవాత్మలన్నియును పరమాత్మ యొక్క అంశములు. జీవాత్మలు కిరణములవంటి వారు; పరమాత్మ సూర్యునివంటి వాడు. జీవాత్మలు కెరటములవంటి వారు; పరమాత్మ ఈ కెరటములకన్నింటికాధారమైయున్న సముద్రము వంటివాడు. కావున పరమాత్మ అంశములన్నింటికాధారమైయున్న అంశియని చెప్పబడును. ఏ అంశమైనను ఆంశిని చేరనంతవరకు పూర్ణతృప్తి కలుగదు. పసిబిడ్డ తన తల్లిని చేరుటకై తహతహలాడు చుండును. తన తల్లిని చేరిన తరువాత పసిబిడ్డకు పూర్ణతృప్తి కలుగును. జీవాత్మ పరమాత్మను చేరుకొననంతవరకు కష్టపరంపరల నొందుచునేయుండును. కేవలము పరమాత్మ ప్రాప్తిచేతనే! జీవాత్మకు కష్టపరంపరలు అంతమొందును. ఐతే, పరమాత్మను ప్రాప్తించుకొనుట ఎట్లు? పరమాత్మ ఇప్పుడు-ఇచ్చటనే కలడను విషయమును అనుభూతమొనర్చుకొన్నప్పుడు పరమాత్మ ప్రాప్తి కలుగును. ఈ విషయమును అనుభూత మొనర్చుకొనుటకు గురువు యొక్క సహకారము అత్యవసరమగును. జీవులందఱును అజ్ఞాననిద్రయందు మునిగియున్నారు. గురుదేవులు అజ్ఞానమనెడి అంధకారమును తొలగించును. అప్పుడు జ్ఞాననేత్రము, లేక ఫాలనేత్రము తెఱువబడును. ఫాలనేత్రము తెఱువబడుటతో కర్మబంధము విచ్ఛేదమగును. కర్మబంధము విచ్ఛేదమైనప్పుడు జనన మరణములు అంతమొందును. ఈ జనన మరణ రాహిత్యమే! ఆత్మసాక్షాత్కారమని చెప్పబడును. ఆత్మసాక్షాత్కారము పరమానందమునకు, పరమశాంతికి హేతువగును. అప్పుడు శాశ్వతానందము, ఆత్మానందము, నిత్యానందము, లేక బ్రహ్మానందము పొందబడును. దీనిని సాధించుటయే! మానవజీవిత లక్ష్యము. ఈ లక్ష్యమును సాధించినవాడు జీవన్ముక్తుడని చెప్పబడును. జీవన్ముక్తుని దర్శనమాత్రముచే జీవులందఱును తరింతురు. నిజమైన జీవన్ముక్తుని పాదస్పర్శచే పాపరాశియంతయును భస్మీపటలమగును. ఇట్టి జీవన్ముక్తునితో సంభాషించుటచే కోటితీర్థములను సేవించినంతటి ఫలము లభించును. నిస్స్వార్థుడైన జీవన్ముక్తునికి వందనమాచరించుటచే అక్షయసుఖము నొసంగునట్టి మోక్షము లభించును. ఐతే, సరియైన, సత్యసంధుడైన జీవన్ముక్తుని లక్షణము లను మనము గుర్తెఱుంగవలసియుండును.

నేటికాలములో ధనసంపద, ధాన్యసంపద, శుష్కజ్ఞానముగల శిష్యకోటి యున్నవాడే! జీవన్ముక్తుడుగా పరిగణింపబడుచున్నాడు. కాని ఇది ఎంతమాత్రమున్నూ సత్యము కాదు. నిజమునకీ ప్రపంచము యొక్క మిథ్యాత్వమును మఱియు బ్రహ్మము యొక్క సత్త్వమును తన నరనరములలో జీర్ణించుకొన్న నరుడే! జీవన్ముక్తుడని చెప్పబడును. సుకృతకర్మ ఫలవిశేషముచే ఒక వేళ ఆధ్యాత్మిక సాధకునికి ధనసంపద లభించినను, దానినాతడు సద్వినియోగమొనర్పవలయును. అనగా:- దుష్టులను దునుమాడుట యందును. శిష్టులను రక్షించుటయందును తన వద్దనున్న ధనమునే కాక, తన సర్వస్వమును వినియోగింపవలసియుండును. అప్పుడు మాత్రమే! మనకు దైవానుగ్రహము కలుగును. నిజమునకు గుర్వనుగ్రహమే! దైవానుగ్రహమునకు కారణమగును. అగ్నియందాహుతి యొనర్పబడిన పదార్థములన్నియును దేవతలకు చేరుకొనును. అదేవిధముగా గురుదేవుని కర్పించిన దేదియైనను వ్యర్థము కాదు. అది అర్థవంతమై సకలాభీష్టములను నెఱవేర్చును. చిట్టచివరకు జీవితము యొక్క పరమలక్ష్యము నొందింపజేయును. గుర్వాజ్ఞను పరిపాలించిన నరుడు పూర్ణకాముడగును. గుర్వాజ్ఞను పాలించినట్టి నరుని ఫాలనేత్రము తెఱువబడును. అప్పుడాతని అజ్ఞానమనెడి అంధకారము పటాపంచలగుటతో జ్ఞానప్రకాశమేర్పడును. కేవలము బ్రహ్మవిద్యను బడయుట కొఱకే! గురుదేవుడు ఆవశ్యకమగును. ప్రాపంచికవాంఛలను నెఱవేర్చుకొన దలంచినవారు రాజకీయనాయకులను ఆశ్రయింపవలసియుండును. అట్లు ఆశ్రయించినవారు కొండపైకెక్కి నెమ్మదిగా పైనుండి క్రిందికి దొర్లవలసిన స్థితి నొందవలసివచ్చును. ఇక గురుదేవుని ఆశ్రయించినవారు దిగువనుండి పైకివెళ్ళి ప్రశాంతమైన సాగరమును చేరుకొందురు. అప్పుడు వారి ఫాలనేత్రము తెఱువబడుటతో వారికీ ప్రపంచమంతయును ఒక గడ్డిపరకవలె కానబడును. మఱియు ఆతడు బ్రహ్మానందసింధువునందోలలాడగలుగును.

## 52. "బలం బలవతాం చాహమ్"

శ్రీమద్భగవద్గీతలోని సప్తమాధ్యాయమగు "జ్ఞానవిజ్ఞానయోగము" నందు భగవంతుడు పలికిన పదునొకండవ శ్లోకములోని ప్రథమపాదమే! పైవాక్యము. నిజమునకు మనయందున్న బలమేది? బలవంతమైన బాహ్యదేహము కలవాడు బలవంతుడని చెప్పబడునా? నిజముగా దేహమే! బలము కలదైనచో, మరణానంతరము మనమా దేహమునేల దహింపజేయుచున్నాము? కావున నిర్జీవమైన, జడమైన ఈ దేహమునకు బలమేమాత్రమున్నూ లేదని తెలియుచున్నది. దేహమునకు

ప్రాణశక్తి బలము నొసంగును. ప్రాణమీ దేహమును వదలివెళ్ళిన తర్వాత ఈ దేహమునకేలాటి విలువ యుండదు. ఎంతకాలము వరకు కూడుకుడిచినను, ప్రాణత్యాగానంతరమీ దేహము కాటికి వెళ్ళక తప్పదు. ఈ కారణముచే ప్రస్తుతమీ దేహమునకున్న బలము నిజమునకు దేహికి సంబంధించినదే! యని తెలియుచున్నది. ఏది దేహమును ధరించుచున్నదో అదియే ''దేహి''యని చెప్పబడును. ప్రాణమునకాధారము "ఆత్మ" కావున అదియే! దేహియని చెప్పబడును. ఆత్మకు ఆధారము మరియొకటి లేదు.

బ్రాహ్మణవేషమునందున్న హనుమంతుడు ప్రప్రథమముగా శ్రీరాముని దర్శించినప్పుడాతడు "నీవెవరవ"ని హనుమంతుని ప్రశ్నించెను. హనుమంతుడీ క్రింది విధముగా చక్కని సమాధానము నొసంగెను.

"దేహబుద్ధ్యా తవ దాసో-హం, జీవబుద్ధ్యా త్వదంశకః ।
ఆత్మబుద్ధ్యా త్వమేవాహం, ఇతిమే నిశ్చితామతిః ॥"

పై సమాధానమును విని శ్రీ రామచంద్రుడు మిక్కిలి ప్రసన్నుడై ఆంజనేయ స్వామిని కౌగలించుకొనెను. కారణమేమి? శ్రీ రాముడు శ్రీ ఆంజనేయుని బుద్ధి బలమును గాంచి ఎంతో సంతోషించెను. దేహమునందేలాటి బలములేదు. అందువల్ల దేహదృష్టితో "నేను నీకు దాసుడన"ని ఆంజనేయుడు పలికెను. మనము భగవంతునికి దాసులమైనప్పుడు మాత్రమే! భగవత్ప్రసాదితమైన బలమును మనము పొంద గలుగుదుము. మఱియు హనుమంతుడు సముద్రమును లంఘింపగలిగినట్లు మనమీ సంసారసాగరమును లంఘింపజాలుదుము. ఇక మనము జీవులమను కొన్నప్పుడు భగవంతుని అంశమే! యగుదుము. రాజుకువలెనే రాచబిడ్డను కూడా ప్రతియొక్కరు గౌరవింతురు, కావున మనము భగవంతుని యందొక భాగమైనప్పుడు, మనమన్ని విధములుగా భాగ్యవంతులమే! యగుదుము. భర్తలేని భార్య అభాగ్యురాలుగను, అబలగను పరిగణింపబడును. అదే విధముగా భగవంతుని వీడియున్న జీవుడు అభాగ్యుడుగానే పరిగణింపబడును. దేహదృష్టిని వీడి ఆత్మదృష్టిని కలిగియున్న అబలయు సబలయే! యగును. ఇక ఆత్మదృష్టిని వీడి, దేహదృష్టిని కలిగియున్న పురుషుడు "అబల"యే! యగును. ఆత్మదృష్టిగల సతీసావిత్రీదేవి యమలోకమునకేగి, తన పాతివ్రత్య మహిమచే తన భర్తయొక్క ప్రాణములను తిరిగి తెప్పించుకొనుటచేతనే కదా! "సతీసావిత్రి"ని నేటికిని మనము కొనియాడుచున్నాము. ఇక ఆధునికకాలములోని జిల్లెళ్ళమూడి అమ్మగారు ఆత్మదృష్టిని కలిగియున్నందువల్లనే కదా! భర్తగారి నధిగమించినదై నేటికిని కీర్తింపబడుచున్నది!

భౌతిక ప్రపంచములోని కోరికలన్నియును నశించినప్పుడు మాత్రమే! మానవుడు ఆత్మబుద్ధిని కలిగియుండజాలును. మరొకవిధముగా చెప్పవలయునేని, ఆత్మబుద్ధిని కలిగియున్నవాని కోరికలన్నియును అప్రయత్నముగా నెఱవేరును. అందువల్ల ఆత్మబుద్ధిని కలిగియున్నవారికి కోరుకొనవలసినదేమియును ఉండజాలదు. ఆత్మబుద్ధిని కలిగియున్నవాడు పూర్ణకాముడై యుండును. "ధిక్ క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్" అని విశ్వామిత్రమహర్షి తన జీవితమునందనుభవించి పలికినమాట. శ్రీ వసిష్ఠుని పరీక్షించుటకై, లేక ద్వేషపూరితుడై విశ్వామిత్రుడు శ్రీ వసిష్ఠుని యొక్క నూరుగురు కుమారులను సంహరించెను. కాని ఈ కార్యముచే శ్రీ వసిష్ఠుడేమాత్రము ప్రభావితుడు కానివాడై, అచంచలచిత్తుడై, గాంభీర్యదృష్టి కలవాడై యుండెను. శ్రీ వసిష్ఠునియందున్న బ్రహ్మతేజస్సే! దీనికిగల కారణము. ఇట్టి సిద్ధయోగి ఆత్మబుద్ధి కలవాడని చెప్పబడును. ఆత్మబుద్ధి కలవాడు భగవంతునితో తాదాత్మ్యము నొందియుండును. ఆతనికి "అహం బ్రహ్మోస్మి" యనెడి మహావాక్యము అనుభూతమై యుండును. అట్టివాడు గురూపదిష్టమైనట్టి "తత్త్వమసి" యను మహావాక్యమును కూడా జీర్ణించుకొన్నవాడై యుండును. అట్టివాడు "ప్రజ్ఞానం బ్రహ్మ" యనెడి మహావాక్యమును సైతము అన్వర్థమొనర్చుకొన్నవాడై యుండును. మఱియు అట్టివాడు "అయమాత్మాబ్రహ్మ" యనెడి మహావాక్యము యొక్క అంతరార్థము గ్రహించినవాడై యుండును. బలములకెల్ల బలము ఆత్మబలము. కారణమేమి? ఆత్మ వినా ఈ ప్రపంచమునందొక అణువైనను చలించుట కవకాశములేదు. అణువునందాత్మశక్తి సూక్ష్మరూపమునందున్న కారణముచే అణుబాంబు యొక్క శక్తిమహత్తరమై యుండును. ఐతే అణుబాంబును మించిన శక్తి ఆత్మయందుండును. కారణమేమి? అణువుకు కారణము ఆత్మ. కాని ఆత్మకు కారణము అణువు వాదు. ఆత్మానుభూతి నొందినవాడు ఆత్మానందసాగరమునందోలలాడు చుండును. అట్టివాడు పూర్ణకాముడైయుండును. అందువల్ల ఆతనికేలాటి కోరికలుండవు.

"బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్" అని శ్రీ కృష్ణపరమాత్మ పలికెను. బలములకెల్ల బలమైనవాడే! భగవంతుడు. లేక బలవంతులకెల్ల బలవంతుడైన వాడే! భగవంతుడు. అట్టి భగవత్సాక్షాత్కారము నొందినవానికి కామముగాని, రాగముకాని ఉండవు. రాగములేనప్పుడు ద్వేషముకూడా ఉండదు. అందువల్ల ఆతడు సర్వసముడై యుండును. కావున శ్రీ కృష్ణపరమాత్మ "సమో–హం సర్వభూతేషు" అని పలికెను. అనగా:– సమస్త పదార్థములలో సమముగా నున్నవాడే! సర్వేశ్వరుడని భావము. బ్రహ్మజ్ఞానియైనవాడు దేహము, మనస్సు, బుద్ధికి అతీతమైయున్న

ఆత్మపదార్థమునే ! సకల జీవులయందును దర్శించుచుండును. ఈ ఆత్మబలమే! బలములలోకెల్ల బలము. ఆత్మజ్ఞానము లేనివాడెంతటి గొప్పవాడుగా ఈ ప్రపంచమునందు ప్రఖ్యాతిచెందినను బలహీనుడుగానే పరిగణింపబడును. శ్రీ మోహన్‌దాస్ కరంచంద్ గాంధీగారు రాజకీయమునందాధ్యాత్మికతను చొప్పించి నందువల్లనే కదా! బలష్ఠమైన బ్రిటీష్ పరిపాలనను తొలగింపగలుగునంతటి శక్తి సామర్థ్యములను సముపార్జించి, మహాత్ముడుగా శ్లాఘింపబడెను! "బలవంతమైన సర్పము చలిచీమల చేతజిక్కి చావదె సుమతీ" యన్నట్లు బలవంతమైన బ్రిటిష్ సామ్రాజ్యమనెడి సర్పము మహాత్మాగాంధీగారిచే సంఘటితమొనర్పబడిన చలిచీమలవంటి భారతీయులచేత చిక్కి చావవలసి వచ్చెను కదా! కావున ఆత్మజ్ఞాన విహీనుడైనవానికంటె గొప్ప అంధుడు మరొకడు లేడు. కావున మనమందఱమున్నూ బలములలో కెల్ల బలమైన ఆత్మబలమును సంపాదించి, భగదనుగ్రహమునకు పాత్రులమై, మన జీవితములను చరితార్థమొనర్చు కొందుము గాక!

## 53. భయము

ఈ ప్రపంచమునందు భయము లేనివాడెవడున్నూ లేడనియే! చెప్పవచ్చును. కారణమేమి? "సర్వం వస్తుభయాన్వితం భువిన్నృణాం వైరాగ్యమే వా భయమ్" అని శ్రీభర్తృహరి నుడివియున్నాడు. భోగముల ననుభవించునప్పుడు రోగము కలుగునేమోయను భయముండును. ధనవంతుడై యున్నప్పుడు ధనమును చోరులపహరింతురేమో యను భయముండును. బలిష్ఠమైన, సౌష్ఠవమైన దేహము కలవాడైయున్నను, మరణమెప్పుడు సంభవించునో యను భయముండును. ఈ ప్రకారముగా ఈ ప్రపంచములోని వస్తువులన్నియును భయమునకు కారణములై యున్నవి. ఐతే ఈ భయమునుండి వైదొలగుటెట్లు? "వైరాగ్యమే వా భయమ్" అని శ్రీ భర్తృహరి సమాధానమొసంగియున్నాడు. వైరాగ్యమనగా:- ఈ ప్రపంచములోని వస్తువులు అసత్యములగుటచే వాటిపై గల ఆశను త్యజించుట. ఐతే దేనిని ఆశించి మానవుడు జీవింపవలయును? సత్యమైన దానిని ఆశించి, సత్యమైనదానిపై ఆధారపడి మానవుడు జీవింపవలయును. ఐతే సత్యమైన వస్తువేది? ఎల్లకాలము, ఏలాటి మార్పులేకుండా శాశ్వతముగా ఉందునది సత్యమైన వస్తువు. అదియే! ఆత్మ, పరమాత్మ, దేవుడు, పరబ్రహ్మము ఇత్యాది నామములచే పేర్కొనబడుచున్నది.

"భయాద స్యాగ్నిస్త పతి భయాత్తపతి సూర్యః ।
భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః ॥" (కఠ. ఉ.2- 33)

సత్యమైన పదార్థముచే అసత్యమైన పదార్థములన్నియును భయకంపితములగు చుండును. సత్యమైన వస్తువుకు భయపడి అగ్ని దహించుచున్నది. సత్యమునకు భయపడి సూర్యుడు తపించుచున్నాడు. సత్యమునకు భయపడి, ఇంద్రుడు దేవలోకమును పాలించుచున్నాడు. సత్యమునకు భయపడి వాయువు వీచుచున్నది. ఇక సత్యమునకు భయపడి యముడు జీవుల ప్రాణములను బలిగొనుచున్నాడు. కావున ఈ ప్రపంచము లోని సమస్త పదార్థములు సత్యము నాశ్రయించియున్నవని తెలియుచున్నది. ఇచ్చట సత్యమనగా:- పరబ్రహ్మము, పరమాత్మ, లేక ధర్మదేవతయని అర్థము. ధర్మమనగా:- కర్తవ్యమని భావము. ధర్మనిర్వహణయే! మానవుని కర్తవ్యము.

ఐతే ఈ భయమునుండి నివారింపబడుటెట్లు? అనగా:- ఈ కర్తవ్య నిర్వహణ ఎప్పుడు సమాప్తమగును? ద్వితీయాద్వై భయంభవతి" యని శాస్త్రములు నుడువుచున్నవి. అనగా:- రెండవ పదార్థము యొక్క ఉనికిచే భయము కలుగుచుండును. అనగా:- కర్తవ్యనిర్వహణ తప్పనిసరి యగును. నిజమునకు రెండవ పదార్థమున్నదా? లేదు. కారణమేమి? "సర్వం బ్రహ్మమయం జగత్" ఈ జగత్తంతా బ్రహ్మమయమై యున్నది. ఇట్టి బ్రహ్మమును తెలిసికొన్నవాడే! నిజమైన వైరాగ్యము కలవాడని చెప్పబడును. నిజమునకీ బ్రహ్మము భయమునకు కారణము కాదు. ఏల? అన్యపదార్థమే లేనప్పుడు భయమెక్కడి నుండి వచ్చును? అన్యపదార్థమున్నదనుకొనుటయే! భ్రమ. ఈ భ్రమ తొలగిపోయినప్పుడు బ్రహ్మము తెలియబడును. ఈ భ్రమ ఉన్నంతవరకు ఆ బ్రహ్మమే మన భయమునకు కారణమగును. భ్రమ తొలగిపోయిన వెంటనే! కేవలము బ్రహ్మానందమే! శేషించియుండును. ఆ పరబ్రహ్మము యొక్క శక్తియే! ఈ విశ్వమంతటికి కారణమైయున్నదని గ్రహింపవలయును. ఆ శక్తి లేకున్నచో విశ్వము తన సత్తాను కోల్పోవును. బ్రహ్మశక్తియే! ఈ జగద్రచనకు కారణము. విష్ణుశక్తియే! ఈ జగత్తంతటిని పోషించుచున్నది. ఇక శివశక్తి చేతనే! ఈ విశ్వమంతయు తిరిగి తన మూలకారణము నందు లయించుచున్నదని గుర్తెఱుంగవలయును.

ఐతే ఈ బ్రహ్మశక్తి- విష్ణుశక్తి - శివశక్తులు ఒకదానికొకటి భిన్నమైనవా? కావు. ఒకేఒక పరాశక్తి, లేక, పరబ్రహ్మశక్తి బ్రహ్మశక్తిగాను, విష్ణుశక్తిగాను, శివశక్తిగాను వ్యక్తమై ఈ జగన్నాటకమును గోచరింపజేయుచున్నవి. ఈ సత్యమును తెలుసుకొన్నవారి హృదయమునుండి భయము దూరముగా పారిపోవును. కొందఱు శివునికంటె విష్ణువు

గొప్పయనియు, మరికొందరు విష్ణువు కంటె శివుడు గొప్పయనియు, ఇంకను కొందరు వీరిరువురి కంటె శక్తి గొప్పదనియున్నూ వాదించుచుందురు. భేదభావమనెడి పెనుభూతమే! ఈ వాదనకు కారణమైయున్నది. రెండవవస్తువు యొక్క అస్తిత్వము వల్లనే భయము కలుగుచుండును. భేదభావము లేనప్పుడు భయమున్నూ ఉండజాలదు. నిజమునకు భవరోగమే! భయమునకు మూలకారణము.

భవరోగమనగా:- జనన మరణములనొందుట. కావున, జన్మరాహిత్యమే! మోక్షమని చెప్పబడును. మోక్షమునొందినవారి దరికి యముడు రాజాలడు. జన్మించిన ప్రతివాడు ప్రాపంచిక సుఖముల నొందగోరును. కాని, నిజమునకీ ప్రపంచమునందు సుఖములేదు. సుఖమున్నదనుకొన్నను, అది స్వప్న సుఖము వంటిది. అనగా:- తాత్కాలిక సుఖము. ప్రపంచము మనకు శాశ్వత సుఖము నొసంగజాలదు. జనన-మరణ రాహిత్యముచే మోక్షము నొందినప్పుడు మనము శావ్వత సుఖము ననుభవింప గలుగుదుము. జనన మరణముల నుండి ముక్తి లభించినప్పుడు భయమునకు తావే యుండదు. ప్రాపంచిక సుఖము క్షణికము. ఐతే, స్వర్గలోక సుఖము శాశ్వతమని అనుకొనుచున్నావా? స్వర్గలోక సుఖమున్నూ శాశ్వతమైనది కాదు. ప్రాపంచిక సుఖము కంటె స్వర్గలోక సుఖము సాంద్రతయందు గరిష్ఠమై యుండునను మాట నిజమే! ఐతే, స్వర్గలోక సుఖము పుణ్యకర్మల ఫలముచే లభించును. ఆ పుణ్య కర్మల ఫలము క్షీణించిన వెంటనే! ఆ జీవుడు భూపతనము నొందును. అప్పుడాజీవి మరల కష్టపరంపరల నెదుర్కొనవలసివచ్చును. బ్రహ్మతేజస్సు భవరోగభయమునకు దివ్యమైన ఔషధము వంటిది. కావున ప్రతిమానవుడున్నూ సంపూర్ణముగా భయరహితుడగుటకై బ్రహ్మతేజస్సునార్జింపవలసి యున్నది. బ్రహ్మతేజస్సు కలవాడు బ్రహ్మానందము నొందును. బ్రహ్మతేజోవిరాజితుడు విశ్వమునకు మహాజ్యోతివలె భాసించును. అట్టివాడే! బ్రహ్మజ్ఞానియనబడును. "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనగా:- బ్రహ్మమును తెలిసికొన్నవాడు బ్రహ్మమే యగును. అట్టివాడు నిశ్శేషముగా భయ వివర్జితుడగును. అట్టివాడే! ఆత్మసాక్షాత్కారము, దైవసాక్షాత్కారము, లేక బ్రహ్మసాక్షాత్కారము నొందినవాడని చెప్పబడును. ఇట్లు సంపూర్ణ నిర్భయత్వ భూమిక నొంది, భవరోగమునుండి విముక్తి నొందుటయే! మానవజీవితమునకు లక్ష్యమై యున్నది. ఈ పరమలక్ష్యమును సాధించుటకై మనమందఱము ముందడుగు వేయుదుము గాక!

# 54. మాయ

"యామా సామాయా" అని "మాయ" శబ్దమునకు నిర్వచనము. అనగా:- దేనికి నిజమైన ఉనికి లేదో, అదే మాయయని చెప్పబడును. మన దేహమునకు నిజమైన ఉనికి యున్నదా? లేదు. ఏల? ఈ దేహమునుండి నిజమైన వస్తువు బయటికి వెళ్ళిన తరువాత ఈ దేహమును కొందఱు దహనము చేయుదురు. కొందఱు పూడ్చి వేయుదురు. మరికొందఱు గంగలో వేయుదురు. ఇంకను కొందరు అడవిలో నివసించు వన్యమృగము లకు ఆహారమగునట్లు పారవేయుదురు. అందువల్ల ఈ దేహము నిజమైన వస్తువు కాదని తెలియచున్నది. దేహమే! మాయ. "యద్దృశ్యం తన్నశ్యం" అనగా:- ఏది మన భౌతికనేత్రములకు కానబడుచున్నదో, అది తప్పక నశించునని తెలిసికొన వలయును. ఇట్లు నశించునట్టి పదార్థమే! మాయ. కంటికి కానబడునదంతయును మాయయని మనమర్థమొనర్చుకొనవలయును.

మన మనస్సు కూడా మాయయని చెప్పబడుచున్నది. ఏల? జాగ్రదవస్థలోను, స్వప్నావస్థలోను మనస్సు పనిచేయుచున్నను, సుషుప్త్యవస్థలో మనస్సు పనిచేయదు. ఐతే గాఢనిద్ర (సుషుప్త్యవస్థ)లో మన మనస్సెక్కడికి వెళ్ళినది? మనస్సుకు కారణమైన దానియందు లయించినది. ఐతే గాఢనిద్రలో ఈ బుద్ధి కూడా పనిచేయదు. ఈ మనో బుద్ధులు రెండున్నూ తమకు కారణమైన, హృదయస్థితమైయున్న ఆత్మయందు లయించును. అందువల్ల మనస్సు, బుద్ధి ఈ రెండున్నూ మాయయొక్క స్వరూపములే! యని చెప్పక తప్పదు. ఎప్పుడు కూడా మనస్సు సత్యమైన పదార్థమును తెలిసికొనజాలదు. అదే విధముగా బుద్ధికూడా సత్యమైన పదార్థమును తెలిసికొనజాలదు. ఇక సత్యమైన పదార్థమును తెలిసికొనుటకు మార్గము లేదా? ఉన్నది. బల్లపైనున్న తన తల్లి చేతిని అందుకొనుటకు ప్రయత్నించుచు, తన చేతిని పైకి చాచు పసిపిల్లను బోలి మనముండవలయును. అప్పుడు తల్లి కరుణించి, దఱి జేర్చును.

"మమ మాయా దురత్యయా మా మేవయే ప్రపద్యంతే మాయా మేతాం తరంతితే" అని శ్రీకృష్ణభగవానుడు స్వయముగా శ్రీమద్భగవద్గీత యందుపదేశించి యున్నాడు. అనగా:- "నా మాయ దాటరానిది. ఎవరైతే నన్ను శరణు పొందుదురో, వారీ మాయను దాటగలుగుదురు". ఇక, శ్రీకృష్ణుని శరణు పొందుటెట్లు? సకల చరాచర జీవరాసులలో శ్రీకృష్ణుని దర్శింపగలుగుటయే! శ్రీకృష్ణుని శరణు పొందుట. ఈ కార్యము కష్టసాధ్యమని చెప్పక తప్పదు. ఏల? సింహము, పులి, పాము, తేలు

మున్నగు జీవులలో కూడా శ్రీకృష్ణుని దర్శింపవలసియుండును. గోపికలు శ్రీకృష్ణునితో రాసక్రీడ యొనర్చినట్లు, గోపబాలురు శ్రీకృష్ణునితో ఆడుకొన్నట్లు మనము సింహము, పులి, పాము, తేలు ఇత్యాదులతో ఆడుకొనగలమా? అసాధ్యము. అందువల్ల మనకు వలెనే మానవరూపమును ధరించినట్టి గురుదేవుని శరణు పొందవలసియుండును. భగవంతుడు సర్వవ్యాపకుడగుటచే గురుదేవుని యందున్నూ భగవంతుడున్నాడనుట నిర్వివాదాంశము.

మాయ త్రిగుణాత్మకమైనది. అనగా:- సత్త్వరజస్తమోగుణములతో కూడుకొని యున్నది. కావున మాయను అతిక్రమించుటకై ఈ త్రిగుణములను జయింపవలసి యుండును. తమోగుణనాశముచే జడమైన దేహధ్యాస తొలగిపోవును. రజోగుణ నాశముచే చంచలత్వము తొలగిపోవును. సత్త్వగుణనాశముచే బుద్ధిమాంద్యము తొలగిపోవును. అప్పుడు మాయాజాలము విచ్ఛిన్నమగుటతో అఖండైకరసమైన, అనంతానందదాయకమైన, సత్యజ్ఞాన సంపన్నమైన ఆత్మానుభవము, లేక బ్రహ్మానుభవము కలుగును. ఈ మాయ నతిక్రమించుటకు శ్రోత్రియ-బ్రహ్మనిష్ఠుడైన గురువు యొక్క శుశ్రూష చేయుట ఆవశ్యకమగును. గురుశుశ్రూషచే మనము గురుకరుణకు పాత్రులమగుదుము. అప్పుడు మనము సర్వసంపన్నులమగుదుము. గుర్వనుగ్రహమే! భగవదనుగ్రహము. అయితే గురుదేవుడు మనలోనున్న అజ్ఞానమనెడి అంధకారమును పోగొట్టునట్టివాడై యుండవలయును. హృత్తాపమును హరించునట్టివాడై యుండవలయును. కాని విత్తము నపహరించునట్టివాడై యుండరాదు.

"మా యాంతు ప్రకృతిం విద్యాత్ - మాయిసంతు మహేశ్వరమ్" అనగా:- త్రిగుణాత్మకమైన ప్రకృతియే! మాయ. మాయాధీశుడే! ఈశ్వరుడు. కావున ఈశ్వరుని శరణుపొందినప్పుడు మనము మాయను జయింపగలుగుదుము. అయితే ఈశ్వరుని శరణు పొందుటెట్లు? అందునిమిత్తమై ఈ దిగువ శ్లోకమును పరిశీలింపుడు:

"ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేద విభాగినే ।
వ్యోమవద్వ్యాప్త దేహాయ శ్రీ దక్షిణామూర్తయే నమః ॥"

ఈశ్వరుడే! గురువు. గురువే! ఆత్మయని పై శ్లోకము యొక్క భావము. కావున గురువుయందు ఈశ్వరుని దర్శింపవలయును. మఱియు గురువులో ఆత్మను దర్శింప వలయును. కేవలము అప్పుడు మాత్రమే! మనకు ఆత్మోన్నతి కలుగును. కేవలము అప్పుడు మాత్రమే! మనము మాయను అతిక్రమింపగలుగుదుము. కేవలము అప్పుడు మాత్రమే! మనము ఆత్మసాక్షాత్కారము నొందజాలుదుము. కేవలము అప్పుడు

మాత్రమే! మనము బ్రహ్మానుభూతిని బడయుజాలుదుము. త్రిగుణాతీతుడు లోకత్రయమును జయింప జాలును. త్రిగుణాతీతునికి పదునాలుగు లోకములు దాసోహమనును.

"నేను-నాది" అను భావము లేనివాడు త్రిగుణముల నతిక్రమింపజాలును. నిస్స్వార్థపరుడు త్రిగుణముల నతిక్రమింపగలుగును. సత్యసంధుడు త్రిగుణముల నతిక్రమింపజాలును. "యస్మాన్నోద్విజతేలోకో - లోకాన్నోద్విజతే చయః" అనగా:- లోకము ఎవనిచేత ఉద్విగ్నము కాదో, మఱియు లోకముచేత ఎవడు ఉద్విగ్నుడు కాడో - అట్టివాడు త్రిగుణముల నతిక్రమింపగలుగును. "యస్మిన్ స్థితోన దుఃఖేన గురుణా-పి విచాల్యతే" - అనగా:- ఎవడు ఏలాటి పరిస్థితియందున్నూ గొప్ప దుఃఖముచేత కూడా విచలితుడు కాడో, అట్టివాడు త్రిగుణాతీతుడని చెప్పబడును. "యం లబ్ధ్వా చా పరం లాభం మన్యతే నాధికం తతః" అన్నట్లు దేనిని పొందినచో దానికి మించిన మరియొక లాభము లేదో, అట్టిదానిని పొందినవాడే! గుణాతీతుడని చెప్పబడును. కావున సత్త్వరజస్తమో గుణములనెడి త్రిగుణముల నతిక్రమించుటయే! మానవుని కర్తవ్యమైయున్నది. మాయకు లోబడినవాడు మానవుడు. మాయను లోబరచుకున్నవాడు మాధవుడు. త్రిగుణాతీతుడే! మాయాతీతుడు. అట్టి మాయాతీతుడైన మానవుడు సద్యోముక్తిని బడసి, బ్రహ్మానందమునందోలలాడుచుండును.

## 55. యతిధర్మము

యతి ధర్మమైతేనేమి, సతి ధర్మమైతేనేమి, పతి ధర్మమైతేనేమి, పితృధర్మమైతేనేమి, భ్రాతృధర్మమైతేనేమి, భగినీ ధర్మమైతేనేమి, మిత్రధర్మమైతేనేమి, తుదకు శత్రుధర్మమైతేనేమి? తమ తమ జీవితముల నుద్ధరించుకొనుటకు దోహదమొసంగు ననుటలో ఏలాటి సందేహము లేదు. అది ఎట్లనగా:- శ్రీమద్రామాయణమునందు శ్రీరామచంద్ర భగవానుడు తన తండ్రి ఆజ్ఞలను పాలించుటకై 14 సంవత్సరములు వనవాసమున కేగెను. ఇక తండ్రియగు దశరథుడు తన పుత్రుడైన శ్రీరామచంద్రునికి వనవాసము వెళ్ళుమని చెప్పుటకు వెనుకంజ వేసెను. ఆ మాటను చివరికి శ్రీరామచంద్రునికి చెప్పి, తన కర్తవ్యమును నెఱవేర్చుకొనెను. ఇక, పతిదేవునను గమించుట సతికి ధర్మమగుటచే సీతాదేవి తన పతియగు శ్రీరామచంద్రుని బాట ననుసరించెను.

ఇక, భ్రాతృప్రేమ ఎట్టిదనగా:- శ్రీ లక్ష్మణునికి ఊర్మిళాదేవితో వివాహమైనను త్యాగమూర్తియై, రూపము దాల్చిన భ్రాతృప్రేమ కలవాడై, శ్రీరామచంద్రుడెంత వారించినను వినక, తన అన్నతో వనవాసమునకేగి, తన భ్రాతృప్రేమను నిరూపించు కొనెను. ఆహా! నిజమైన భ్రాతృప్రేమను వారింపనెవరి తరము? ఇక, భరతుడు చిత్రకూట పర్వతమునకేతెంచి, శ్రీరాముని అయోధ్యకు తిరిగివచ్చి రాజ్యమునేలుమని అర్థించెను. కాని శ్రీరాముడందులకియ్యకొనని కారణముచే, భరతుడు భ్రాతృప్రేమ సంభరితుడై శ్రీరామచంద్రుని పాదుకలను తీసికొనివెళ్ళి, శ్రీరామచంద్రునికి ప్రతినిధిగా రాజ్యము నేలెను. తన అన్నయైన శ్రీరామచంద్రుడు తిరిగివచ్చునంతవరకు జటావల్కలధారియై, తపోనిష్ఠుడై రాజ్యమును పాలించెను. శ్రీరామచంద్రుడు తిరిగి అయోధ్యకు వచ్చునంతవరకు క్షణక్షణమాతని కొఱకై వేచియుండెను. ఇట్టి తపస్సు ఇంద్రియ నిగ్రహమునకు కారణమై యుండుటచే, ఇట్టి భ్రాతృప్రేమ రాజయోగముతో సమానమగును.

ఇక, దశరథుడు ఇంద్రియనిగ్రహము లేనివాడగుటచే ముగ్గురు భార్యలను వివాహమాడి, అనేక ఇబ్బందులకు మనఃక్లేశములకు గుఱికావలసివచ్చెను. అయితే, రావణాసురుని సంహరించు నిమిత్తమై ఇది దైవసంకల్పము యొక్క యోజనయని చెప్పవలసియున్నది. ఇక సుగ్రీవునికి మంత్రియైన శ్రీ ఆంజనేయస్వామి తన సేవక ధర్మమును తు.చ. తప్పకుండా నిర్వహించినవాడై, శ్రీరామకార్యనిర్వహణా ధురంధరు డయ్యెను. అపారమైన సముద్రమును లంఘించి, లంకానగరమునందు ప్రవేశించుట ఎవ్వరికైనా సాధ్యమైన కార్యమా? కాని నిరంతర రామస్మరణశక్తిచే ఆ కార్యమును సాధించినవాడే, శ్రీహనుమ! శ్రీలంకానగరమును ప్రవేశించిన తరువాత అశోకవనము నందు శ్రీ సీతామహాలక్ష్మిని దర్శించి, శ్రీరామచంద్రుడిచ్చిన 'ఉంగరము'ను ఆ మహాతల్లి హస్తములయందుంచెను. ఆహా! ప్రభుభక్తి, ప్రభ్విభక్తి ఎంతటి ఘనమైనదో కదా! ఇదియే! మహాయోగు లొనర్చెడి కార్యము. ఇదియే! యతిధర్మనిర్వహణ. ఇదియే! సకలేంద్రియము లను నిగ్రహించు సూత్రము. ఇదియే! మనస్సును జయించుటకు పాయము. ఇదియే! భవసాగరమును దాటుటకు కీలకము. ఇదియే! శ్రీరామకార్య నిర్వహణాధురంధరత్వము. ఇదియే! సీతామనోభిరామునియందుగల పరమభక్తికి నిదర్శనము. ఇదియే! సీతామహా లక్ష్మిని దర్శింపజేయునట్టి నిలువుటద్దము. ఇదియే! గరిమ-లఘిమాది సిద్ధులను బడయుటకు మూలమంత్రము. ఇదియే! శ్రీరాముని చరణకమలములయం దాసీనుడగుటకు యోగ్యతాపత్రము.

రావణుడు శ్రీరామపత్నిని అపహరించి, శ్రీరామునికి శత్రువయ్యెను. అయితే, ఎవరేమి చెప్పినను వినక, ఈ శత్రుత్వమును తాను శ్రీరాముని చేతులలో మరణించు నంతవరకు కొనసాగించెను. శత్రుత్వకారణముచే తన జీవితాంతము వరకు శ్రీరాముని గూర్చి తలంపవలసివచ్చెను. కావున అంత్యమునందు శ్రీరామునియందైక్యమయ్యెను. ఏ కారణముచేతనైనను భగవంతుని స్మరించుటచే, తలంచుటచే, చింతించుటచే అది ధర్మముగా మారిపోవును. కారణమేమనగా:- భగవంతుని చేర్చుటయే! ధర్మము యొక్క లక్ష్యము. ధర్మమును ఎవరు రక్షింతురో వారిని ధర్మస్వరూపుడైన భగవంతుడు రక్షించును. కావుననే 'ధర్మోరక్షతి రక్షితః' అని చెప్పబడినది.

ప్రస్తుతము మన చర్చనీయాంశము 'యతిధర్మము'. తన మనస్సును, ఇంద్రియములను నిగ్రహించినవాడు 'యతి' యని చెప్పబడును. ఐతే మనస్సును, ఇంద్రియములను ఏల నిగ్రహింపవలయును? ఇంద్రియములు కేవలము భౌతిక పదార్థముల సుఖమునకై పరుగెత్తుచుండును. కాని ఈ భౌతొక పదార్థములు శాశ్వతమైన సుఖమునొసంగజాలవు. కావున శాశ్వత సుఖము నొందుటకై ఇంద్రియములను నిగ్రహించుట ఆవశ్యకమగును. అదే విధముగా మనస్సు కేవలము పరిమితిగల పదార్థముల వైపే పరుగెత్తుచుండును. కావున పరిమితిగల పదార్థములొసంగు సుఖము అంతమైనప్పుడు, మనము మనశ్శాంతిని కోల్పోవుదుము. కావున శాశ్వతసుఖము నొందుటకై మనోనిగ్రహము మిక్కిలి ఆవశ్యకమగును. ఇంద్రియములను, మనస్సును జయింపని వ్యక్తి రాగద్వేషములను కలిగియుండుటచే బలహీనుడుగా పరిగణింప బడును. అనగా:- ఆతడు కొన్ని పదార్థములను ప్రేమించి, కొన్ని పదార్థములను ద్వేషించును. అందువల్ల ఆతడు స్వార్థపూరితుడై యుండును. స్వార్థపూరితుడైయున్న వ్యక్తి ఎంతటి ఘనకార్యముల నొనర్చినను, ఆతడు యతి ధర్మమును నెఱవేర్చినవాడు కాజాలడు. విశ్వంభర ప్రేమను సముపార్జించుకొన్నవాడే! యతి ధర్మమును నెఱవేర్చినవాడుగా పరిగణింపబడును.

యతిధర్మమును తమ జీవితమునందాచరింప దలంచువారు జగద్గురు శ్రీ శంకరాచార్య భగవత్పాదులవారు రచించిన "సాధన పంచకము"ను పఠించి, అందుగల అంశములననుష్ఠింప వలసియుండును. "సంగః సత్సు విధీయతామ్" అనునది సాధన పంచకములోని ఒక అంశము. దీనినాచరించినవారు యతి ధర్మమునునుష్ఠించిన వారే యగుదురు. కొందఱు యతివేషధారులు దుస్సాంగత్యమొనర్చి, తమ మతిని భ్రష్టమొనర్చుకొని, ఇతరుల మతులను కూడా పాడుచేయుచుందురు. యతిధర్మము

నసుష్ఠించు నిమిత్తమై ముముక్షువులు ఏకాంతవాస మొనర్పవలయును. లేక ఏదైన ఒక ఆశ్రమమునందు నియమనిష్ఠలు కలవారై తమ జీవితములను గడుపుచుండ వలయును. తమ జీవితలక్ష్యమును పొందునంతవరకు సాధనను కొనసాగించు చుండవలయును. యతి ధర్మము నాచరించువారు తమ జీవితమును బహిర్ముఖమొ నర్పరాదు. పరమలక్ష్యము, లేక శాశ్వతానందము, లేక బ్రహ్మానందము, లేక ఆత్మసాక్షాత్కారము, లేక దైవసాక్షాత్కారము నొందుటకై నిరంతరము ప్రయత్నశీలుడై యుండు పురుషుడు యతి ధర్మము నాచరించిన వాడని చెప్పబడును. యతివేషము వేఱు, యతిధర్మము వేఱు అను విషయమును మన మిచ్చట గమనింప వలసియున్నది.

## 56. రహస్యం హ్యేత దుత్తమమ్

పై శీర్షిక శ్రీ మద్భగవద్గీతలోని నాల్గవ అధ్యాయములోని మూడవ శ్లోకము యొక్క నాల్గవ పాదము. శ్రీ కృష్ణ పరమాత్మ అర్జునునికీ అధ్యాయమునందు అత్యుత్తమమైన పరమ రహస్యమును వెల్లడించెను. అర్జునుని ద్వారా మనందఱికి తెలియజేసెననుట ఉచితమగును. ఆ ఉత్తమమైన పరమ రహస్యమేది? పరమేశ్వరుని యొక్క మూలస్థానమును పరిగ్రహించుటయే! ఆ పరమ రహస్యము. మనమీ భౌతిక దేహమే! సర్వస్వమని భావించు చుందుము. అది అజ్ఞానము యొక్క లక్షణము. ఈ దేహమొకనాడు దహింపబడును, లేక భూమిలో పూడ్చబడును కదా! అప్పుడది సర్వస్వమెట్లగును? "ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహమవ్యయమ్" అను వాక్యముతో ఈ నాలుగవ అధ్యాయము ప్రారంభమయ్యెను. అనగా "నేను పురాతన కాలములో ఈ పరమ రహస్యమును సూర్యుని కుపదేశించితి"నని అర్థము. అప్పుడర్జునునికి గొప్ప సందేహము కలిగెను. ప్రస్తుత దేహధారియై యున్న శ్రీకృష్ణుడు సూర్యదేవునికెట్లు పరమ రహస్యమును బోధింపగలిగెనను సందేహము అర్జునునికి కలిగెను. ఈ సందేహమును నివారించుటకై శ్రీ కృష్ణుడిట్లు సమాధానము నొసంగెను.

"బహూని మేవ్యతీతాని జన్మాని తవచార్జున ।
తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరం తప ॥"

"ఓ అర్జునా ! నీకున్నూ, నాకున్నూ ఎన్నో జన్మలు గడచినవి. ఆ జన్మలన్నియును నీకు తెలియదు" ఇదియే! పరమ రహస్యము. తనకెన్ని జన్మలు గడచెనో, మనకెన్ని జన్మలు గడచెనో పరమేశ్వరునికి తెలియును. ఐతే జన్మరహితుడైన పరమాత్మకు జన్మలెక్కడివి? అను గొప్ప సందేహమిచ్చట కలుగును. పరమేశ్వరుడు

ప్రకృతిని తన స్వాధీనమునందుంచుకొని జన్మలను ధరించును. ఇక మనము ప్రకృతికి స్వాధీనులమై జన్మల నెత్తుచుందుము. ప్రకృతి ఎవ్వరి స్వాధీనమునందుండునో, అట్టివారు త్రికాల జ్ఞానులైయుందురు. ఇక ప్రకృతియొక్క స్వాధీనమునందున్న నరుడు అజ్ఞానాంధకారము నందున్న కారణముచే దుఃఖపూరితుడై జనన మరణముల నొందుచుండును. ప్రపంచమనెడి కారాగారమునందు బంధింపబడినవాడే! జీవుడు. ఈ కారాగారమున కధిపతియే! దేవుడు.

ధర్మమునకు విరుద్ధమైన వర్తనము కలవాడే ! జీవుడు. ధర్మమునకు హానికలిగినప్పుడు ధర్మమునకు ప్రాణమును పోయువాడే! పరమాత్మ. మానవులమైన మనమందఱమున్నూ స్వధర్మమనగానేమి? తెలిసికొనవలయును. తన నిజస్వరూపమును తెలిసికొను జీవన విధానమును గడుపుటయే! స్వధర్మము. నిజస్వరూపమునకు విరుద్ధమైన వర్తనమే! అధర్మము. నిజస్వరూపము నొందుటకు చేయు కర్మ అకర్మగా పరిణమించును. అనగా:– కర్మబంధనమాతనికుండదు. తన సంకల్పమును వదలిపెట్టి భగవత్సంకల్పానుసారముగా వర్తించుటయే! స్వధర్మము. మన మొనర్చు కర్మలన్నింటిని బ్రహ్మార్పణ మొనర్పవలయును. అప్పుడు బ్రహ్మమే! పొందబడును. దేనిని పొందిన తర్వాత మరొక వస్తువును పొందు ఆవశ్యకత ఉండదో, అదియే! బ్రహ్మము. దేనిని పొందిన తర్వాత మరొక కోరిక ఉత్పన్నము కాదో, అదియే! బ్రహ్మము. దేనిని పొందిన తర్వాత నిండుకుండ వలె మనస్సు తొణకిస లాడదో, అదియే! బ్రహ్మము. దేనిని పొందిన తర్వాత ఈ ప్రపంచమంతయు ఒక గడ్డి పరకవలె గోచరించునో, అదియే! పరబ్రహ్మము. దేనిని తెలిసికొన్న తర్వాత తెలిసికొనవలసిన మరొక పదార్థము శేషించియుండదో, అదే పరబ్రహ్మము.

ఈ జనన మరణ సాగరమును దాటుటకై కేవలము జ్ఞానమనెడి నావయే! సహకరించును. జ్ఞానమనెడి అగ్ని పుణ్యపాప కర్మలనన్నింటిని దహించును. అప్పుడు మాత్రమే! జనన మరణములు రహితములగును. పుణ్యము కూడా బంగారు సంకెల వంటిది. పుణ్యపురుషులను గాంచి పాపకర్ములు ఈర్ష్యాసూయల నొందుచుందురు. అప్పుడది చిత్తక్షోభమునకు కారణమగును. కావున జ్ఞానాగ్ని ద్వారా పుణ్యపాప కర్మలనన్నింటిని భస్మమొనర్పవలయును జ్ఞానమును మించిన పవిత్రమైన పదార్థము మరొకటి లేదు. శ్రద్ధకలవాడే! జ్ఞానము నార్జింపగలుగును. జ్ఞానముచే పరమశాంతి లభించును. జ్ఞానమనెడి ఫలమును బడయుటకై గురువనెడి తరువు నాశ్రయింప వలసియుండును. ఒక మామిడి మొక్కను నాటి, కొంతకాలము వరకు నీరును

పోయుచున్నచో, ఒకానొక దినమునందు మనము మామిడిపండును పొంద గలుగుదుము. అదే విధముగా తగినంత కాలమువరకు గురుశుశ్రూష చేసిన తర్వాతనే! మనకు జ్ఞానమనెడి ఫలము లభించును. జ్ఞానఫలము నొందినవాడు కర్మలెనన్ని చేసి నొందినవాడు కర్మఫలములచే బంధింపబడజాలడు.

"సంశయాత్మా వినశ్యతి" అనెడి వాక్యానుసారముగా జీవిత లక్ష్యము నొందగోరు జీవునికేలాటి సంశయము, లేక సందేహముండరాదు. ఉదాహరణమునకు దేహమొకప్పుడు నశించునను వాక్యమునందు సందేహముండరాదు. ఎల్లప్పుడీ వాక్యమును మననము చేసికొనుచుండవలయును. పరమాత్మను చేరినప్పుడు మాత్రమే! పరమానందము ప్రాప్తించునను విషయమునందేలాటి సందేహముండరాదు. పరమాత్ముడు సర్వవ్యాపకుడై యున్నాడను వాక్యమునందేలాటి సందేహముండరాదు. పరమాత్ముడు సర్వశక్తివంతుడను వాక్యమునందేలాటి సందేహముండరాదు. పరమాత్ముడు సర్వజ్ఞుడను విషయమునందేలాటి సందేహముండరాదు. పరమాత్ముడు సర్వవ్యాపకుడను విషయము దృఢపడినప్పుడు అహంకారము అంతమొందును. "నాహం కర్తా" నేను కర్తను కానను భావము దృఢపడును. "హరిః కర్తా" ఆ సర్వేశ్వరుడే! సర్వము నొనర్చుచున్నాడను భావము చేకూరును. ఇక పరమాత్ముడు సర్వశక్తివంతుడను భావము చేకూరును. ఇక పరమాత్ముడు సర్వశక్తివంతుడను భావము దృఢపడినప్పుడు తన నేత్రములచే పరమేశ్వరుడు చూచుచున్నాడనియు, తన శ్రోత్రములచే పరమాత్మ శ్రవణము చేయుచున్నాడనియు, తన నాసికచే పరమాత్మ డాఘ్రాణించుచున్నాడనియు, తన జిహ్వాచే రుచి చూచుచున్నాడనియు, తన చర్మముచే పరమాత్మ పరమాత్మను స్పర్శించు చున్నాడనియును తలపోయును.

ఇక పరమాత్ముడు సర్వజ్ఞుడను భావము దృఢపడినప్పుడు జీవుడు రహస్యముగా చేయు పనులేవియును శేషించియుండవు. 'అహం' శూన్యమైనప్పుడు 'ఆహా' యనెడి పరమానందము పొందబడును. దేహభావన నశించినప్పుడు ఆత్మానందము పొందబడును. ఆత్మానందమే! పరమానందము. అనగా:– దీనికి మించిన ఆనందము మఱొకటి లేదని అర్థము. పరమానందమే! బ్రహ్మానందము. భ్రమ తొలగిపోయినప్పుడు బ్రహ్మానందము పొందబడును. రెండు పదార్థములున్నప్పుడు ఈ రెండింటిలో ఏది నిజము? యనెడి భ్రమ ఏర్పడును. 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' సర్వత్ర సర్వాకారములలో ఒకే ఒక బ్రహ్మము విరాజమానమైయున్నదను భావన దృఢపడినప్పుడు పరమానందము ప్రాప్తించును. ఏదైన పదార్థము తెలియబడనప్పుడది 'రహస్యమ'ని చెప్పబడును.

జ్ఞాన నేత్రము తెఱువబడినప్పుడు సకల పదార్థములు తెలియబడును. అప్పుడు 'రహస్యము' రహితమగును. ఈ బ్రహ్మరహస్యమును గుర్తెఱింగినప్పుడు మనమీ సంసారసాగరము నుండి తరించి, బ్రహ్మానందామృత సాగరమును చేరి, పరమసుఖము ననుభవింపజాలుదుమను మాట తథ్యము.

## 57. లాభము

ఈ ప్రపంచమునందు ప్రతిప్రాణియు, ప్రతిజీవియు, ప్రతి మానవుడున్నూ ప్రతి సమయమునందు లాభమునే కోరుకొనుచుండును. కాని నష్టమును కోరుకొనడు. ఐతే కొందఱికి లాభము, మరికొందఱికి నష్టము కలుగుచునే యుండును. దీనికిగల కారణమేమి? పూర్వజన్మలలోగాని, ఈ జన్మలోగాని మనము ఇతరుల కొనర్చిన లాభమే మనకు తిరిగి వచ్చుచుండును. కాని భగవంతుడు పక్షపాతము కలవాడని చెప్పుటకు వీలులేదు. భగవంతుడు కరుణాసముద్రుడు, దయాసాగరుడు, కృపాసింధువు అందువల్లనే! మనమన్ని విధములుగా పోషింపబడుచున్నాము. సూర్యరశ్మి మనకు చైతన్యమునొసంగు చున్నది. వాయువు మనకు ప్రాణశక్తి నొసంగుచున్నది. ఆకాశమునందు మనము ఒకచోట నుండి మరొకచోటకు కదలి వెళ్ళగలుగు చున్నాము. మేఘములు వర్షించుట, నదులు ప్రవహించుట, ఋతువులేర్పడుచుండుట ఇవన్నియును భగవంతుని కరుణను నిరూపించుచున్నవి కదా!

ఐతే ఒకప్పుడు మనకు లాభము కలిగినను, మరొకప్పుడు నష్టము కలుగుటకు గల కారణమేమి? మరొకవిధముగా చెప్పవలయునేని ఒకప్పుడు సుఖము, మరొకప్పుడు దుఃఖము కలుగుటకు గల కారణమేమి? మనము భగవంతునికి విముఖులమై యుండుటయే! దీనికి గల కారణము. ఇతరులకు నష్టము నొనర్చుటయు భగవంతునికి విముఖులమగుటయే కదా! భగవంతుడు సర్వవ్యాపకుడు కదా! భగవంతుని సర్వవ్యాపకతను గ్రహింపకుండుటయే! భగవంతునికి విముఖులమగుట. చేప సముద్రమునందే యుండును. కాని అది తననోటిని తెరువకున్నచో, దాహముచే తల్లడిల్లవలసి వచ్చును. అదే విధముగా మనమున్నూ భగవంతుని సర్వవ్యాపకతను గ్రహింపకున్నచో, మనకు సుఖము సున్నయగును. లాభమునకు బదులుగా నష్టము కలుగుచుండును. సుఖమునకు బదులుగా కష్టము కలుగుచుండును. శాంతికి బదులుగా అశాంతి కలుగుచుండును జీవనమునకు బదులుగా మరణము కలుగుచుండును. అహర్నిశము దైవస్మరణ, దైవచింతనగల జీవితమే! నిజమైన జీవితమని చెప్పబడును.

ఒక బాలుడు నదీతటమునందున్న ఇసుకతో ఒకచిన్న ఇల్లును కట్టుకొని, ఎంతో లాభమును పొందినట్లు మురిసిపోవుచుండును. దానినెవరైనా చెరపివేసినచో, ఎంతో నష్టము కలిగినట్లు ఏడ్చును. ఆతడు దానియందు విలువను దర్శించుటయే! దీనికిగల కారణము. ఒక మట్టికుండ పగిలిపోయినచో, గృహిణి బాధపడును. మట్టికుండయందామె విలువను దర్శించుటయే! దీనికిగల కారణము. ఇక శ్మశానవాటిక యందు దేహము దహింపబడుచున్నప్పుడు దేహసంబంధముకల భార్యాపుత్రులందఱును రోదించుచుందురు. దేహమునందు విలువను దర్శించుటయే! దీనికి గల కారణము. ఈ ప్రకారముగా లాభనష్టములు మనము ప్రాపంచిక వస్తువుల కొసంగునట్టి విలువలపై ఆధారపడియుండును. కాని నిజమునకు ఈ ప్రపంచమంతయు స్వప్నతుల్యమగుటచే ఈ ప్రపంచములోని పదార్థములకేలాటి విలువయున్నూ లేదు. "యద్దృశ్యం తన్నశ్యమ్" అనగా:- కంటికి కానబడునదంతయు నశించితీరును. స్వయముగా నేత్రములతో మనము చూడగలుగుచున్నాము. కావున ఇవియున్నూ నశించితీరును. కాని ఈ నేత్రములలో పనిచేయుచున్న అదృశ్యమైన శక్తికి మాత్రము నాశము లేదు.

అత్యంత విలువగల పదార్థము మనయందే దాగుకొనియున్నది. ఆత్మానాత్మా వివేకముచే విలువైన పదార్థము తెలియబడును. అనాత్మ నశించును. ఆత్మనాశ రహితము. మార్పునొందుటయే! నశించుట. నశించు పదార్థమునకు, లేక మార్పునొందు పదార్థమునకు విలువలేదు. మార్పులేని నాశరహితమైన పదార్థము విలువ కలదై యుండును ఆత్మానందమునకు మించిన సుఖము మరియొకటి లేదు. దానికి మించిన లాభము మరియొకటి లేదు. కావుననే శ్రీ కృష్ణ పరమాత్మ శ్రీ మద్భగవద్గీతలోని ఆరవ అధ్యాయమునందు గల 22వ శ్లోకమునందిట్లు నుడివెను. "యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః । యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే " దేనిని పొందినచో దానికి మించిన లాభము మరియొకటి లేదో, దేనియందు స్థితిని కలిగియున్నచో ఎంత గొప్ప దుఃఖము కలిగినను చలింపకుండా యుండునో, అదియే! పరమలాభమని దీని భావము. ఆత్మధన సంచయమే! పరమ లాభము. "ఆత్మవత్సర్వ భూతాని" సమస్త పదార్థములయందాత్మ యున్నది. అట్టి ఆత్మసంస్థుడై యుండుటయే! గొప్ప లాభము.

కామ-క్రోధ- లోభ- మద- మాత్సర్యములనెడి అంతఃశత్రువులను జయించి నప్పుడు ఆత్మలాభమును బడయవచ్చును. నాశవంతమైన పదార్థములపై కోరిక లేకుండుటయే! కామమును జయించుట. అహంకారమును శూన్యమొనర్చుటయే!

క్రోధమును జయించుట. అంతా నాదే అనుకొనుటను మానుకొనుటయే! లోభమును జయించుట. అశాశ్వతమైన దానియందు అందము లేదని దృఢనిశ్చయుడై యుండుటయే! మోహమును జయించుట. నన్నుమించిన శక్తిసంపన్నుడు లేడనెడి భ్రమను భ్రష్టమొనర్చుటయే! మదమును జయించుట. ఇతరులను హింసించుటను, ఇతరుల ఎడల క్రూరముగా వర్తించుటను వదలుకొనుటయే! మాత్సర్యమును జయించుట. ఈ ప్రకారముగా అరిషడ్వర్గమును అనగా ఆరుగురు శత్రువులను జయించినప్పుడు ఆత్మానందము పొందబడును. ఇదియే! గొప్పలాభము. ఇదియే! మహాలాభము. ఇదియే! పరమలాభము. కారణమేమి? దీనికి మించిన లాభము మరియొకటి లేదు. ఈ లాభమునకు నాశము లేదు. ఈ లాభమును పొందిన తర్వాత మనకే విధమైన నష్టమున్నూ రాదు.

అజ్ఞానముచే నిజమైన లాభము తెలియబడదు. అహంకార-మమకారము లచే నిజమైన లాభము తెలియబడదు. అజ్ఞానము తొలగుటకై శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడునగు గురువును దరిజేరవలసియుండును. గురుదేవుని శరణు పొందినవానికి అహంకార-మమకారములు రహితమగును. అహంకారము లేనప్పుడు అజ్ఞానమున్నూ ఉండజాలదు. అజ్ఞానాంధకారము తొలగిపోయినప్పుడు ఆత్మభాస్కరుడు ప్రకాశించును. ఆత్మసూర్యుడు ఉదయించినప్పుడు సర్వాత్మభావము కలుగును. అప్పుడు ఆత్మానుభవము, లేక బ్రహ్మానుభవము కలుగును. ఇదియే! లాభములలో కెల్ల లాభము. ప్రాపంచిక విషయలోలత యనెడి లోభము నుండి విడివడినప్పుడు పరమాత్మానుభవ లాభము కలుగును. ఇట్టి గొప్పలాభమును బడయుటయే! మానవజీవిత కర్తవ్యము. కాని నాశవంతములైన ప్రాపంచిక లాభములను పొంది, జనన-మరణ చక్రమునందు చిక్కుకొనుట కాదు. ఇట్టి పరమలాభమును పొందుటకై పరమేశ్వరుని దివ్యానుగ్రహము మనందరిపై ప్రసరించుచుండును గాక!

## 58. విద్య

"విద్య" అనగా:- జ్ఞానము. 'య' అనగా:- 'యచ్ఛతి' -ఇచ్చునది, లేక ప్రసాదించునదని అర్థము. కావున జ్ఞానమును ప్రసాదించునది 'విద్య'యని చెప్పబడును. అయితే, జ్ఞానమనగానేమి? తెలిసికొనుట. దేనిని తెలిసికొనుట? తెలియబడని దానిని తెలిసికొనుట. తెలియబడనిది ఎట్లు తెలిసికొనబడును? రాత్రియందు లేని సూర్యుడు తెల్లవారుజామున తెలియబడుచున్నది కదా! మేఘములచే ఆవరింపబడిన సూర్యుడు మేఘములు తొలగిపోయిన తరువాత తెలియబడుచున్నది కదా! అదే విధముగా

అజ్ఞాన మనెడి అంధకారము తొలగిపోయినప్పుడు జ్ఞానభాస్కరుడు ప్రకాశించును. అప్పుడు మానవుడు విద్యాస్వరూపుడగును. తేజస్సంపన్నుడగును. జ్ఞానానంద కందళిత హృదయారవిందుడగును. నిత్యసత్యవ్రతుడగును. నిజానంద స్ఫూర్తిదాయకుడగును.

విద్య కలవాడు వినయమును కూడా కలిగియుండవలయును. ఏల? విద్య అనంతమైనది. ఈ ప్రపంచమునందు విద్యావంతులు అసంఖ్యాకులైయున్నారు. ఒకరినిమించి మరొకరు విద్యాధికులై యున్నారు. విద్యయనెడి మహోన్నత భవనములోని దిగువ సోపానమునందున్నవాడు అన్నింటికి పైనున్న సోపానము వరకు చేరువరకు ప్రయత్నము నొనర్చువాడే! నిజమైన విద్యార్థియని చెప్పబడును. అట్టి విద్యార్థి వినయ సంపన్నుడైయుండును. కేవలము దిగువ సోపానమునందుండి నాకంతయు తెలియునని విఱ్ఱవీగువాడు నిజమైన విద్యార్థి కాజాలడు. పరమలక్ష్యమును చేరుకొను అభిలాష కలవాడగుటచే విద్యావంతుడు వినయభావ సంభరితుడైయుండును. వినయము విద్యావంతునికి మిక్కిలి విలువైన భూషణము వంటిది. ఐతే, బూటకమైన వినయమును కలిగియుండరాదు. వినయముగల విద్యార్థి ఒక్కొక్క సోపానమునధిగమించుచు, జ్ఞాన పర్వత శిఖరాగ్రమును చేఱుకొనునంత వరకు తన ప్రయాణమును కొనసాగించుచునే యుండును. అట్టివాడు ఒకవైపు పురోగమనమొనర్చుచు, మరొకవైపు తనకు దిగువ సోపానమునందున్న వారికి మార్గమును నిర్దేశించుచుండును.

విద్యకలవాడు వివేకమును కూడా కలిగియుండును. మంచి-చెడుగులను, లోతు-పల్లములను, న్యాయ-అన్యాయములను, ధర్మాధర్మములను, సత్యాసత్యములను తెలిసియున్నవాడు వివేకవంతుడు. ఒక విధముగా విద్య-వివేకము పర్యాయపదములని చెప్పవచ్చును. వివేకవంతునికి 'మాయ'యొక్క స్వరూపము తేటతెల్లముగా తెలియబడును. మాయ మనలను సంసారసాగర మధ్యమునకు తీసికొనివెళ్ళి, మాయమాటలను చెప్పి, ముంచివేయును. వివేకవంతుడు మాయయొక్క మాటలకు లొంగిపోడు. శాశ్వతమేది? అశాశ్వతమేది? ధర్మమనగానేమి? అధర్మమనగానేమి? సత్యమేది? అసత్యమేది? అను విషయములను క్షుణ్ణముగా విచారించి, శాశ్వత పథముననుగమించును. ధార్మిక మార్గమును చేపట్టును. సత్యవ్రత నిష్ఠానువర్తనుడగును. విద్యచే శోభిల్లు వివేకవంతుడు విశాలహృదయుడై యుండును. ఆతనికి 'నేను, నాది' అను భావముండదు. ఆతడు 'సర్వం విష్ణుమయం జగత్' అను భావము కలవాడై సకల చరాచర జగత్తునందు జగదీశ్వరుని దర్శించుచుండును. వివేకవంతుడెల్లప్పుడు వికసితవదనుడై, తేజస్సంపన్నుడై విలసిల్లుచుండును.

విశ్వవిద్యాలయములలో పఠించువారుగాని, పఠింపజేయువారుగాని విద్యావంతులని చెప్పుటకు వీలులేదు. కారణమేమి? నేటికాలములో విద్య కేవలము ఉన్నతోద్యోగము నార్జించుటకు మాత్రమే! ఉపయోగపడుచున్నది. అది మానవుని జీవిత లక్ష్యమును నెఱవేర్చుటకై పురికొల్పబడుటలేదు. నేటి విద్య ప్రాపంచిక వస్తుజాలమనెడి ఆభరణములను మాత్రమే! మనకు దర్శింపజేయుచున్నది. కాని ఈ ఆభరణములన్నింటికి మూలకారణమైయున్న బంగారమనెడి పరమాత్మను దర్శింపజేయుటకు దోహదమొసంగుట లేదు. విద్యావంతుడు వినయసంపన్నుడై, వివేకవంతుడై, విశాలహృదయుడైయున్నప్పుడు విశ్వతేజోవిరాజితుడై శోభిల్లును. అట్టివాడీ జగత్తునకు నిజమైన సేవచేయగలుగును. అట్టివాని భావములు జ్ఞానభాస్కరుని దివ్యమైన కిరణములవలె ప్రకాశించుచుండును. అట్టివాని అంతఃకరణము పరిశుద్ధమై శోభించుచుండును. అట్టివాని అస్తిత్వమే లోక కళ్యాణమునకు కారణమగును. అట్టివాని దర్శనము ఆత్మసాక్షాత్కారము నొందుమార్గమును దర్శింపజేయును.

'విద్యలేనివాడు వింతపశువు' అనెడి సామెత కలదు. మానవశరీరమును కలిగి యున్నంత మాత్రముచే మానవుడు నిజమైన మానవుడనిపించుకొనజాలడు. మానవుని సమస్తభావములు మాధవునివైపు మ్రొగ్గుచుండవలయును. అప్పుడు మాత్రమే! ఆతడు తన జీవిత కర్తవ్యమును నెఱవేర్పజాలును. విశ్వమునందంతట వెలసియున్న విశ్వేశ్వరుని దర్శించుటయే! మానవజీవిత కర్తవ్యము. మనుజుని క్రియాకలాపములన్నియును పరమేశ్వర ప్రాప్తినొందించుటకు పురికొల్పుచుండవలయును. విద్యావంతుడు తానొనర్చు చున్న సమస్తక్రియలను పరమేశ్వరుడు దర్శించుచున్నాడను భావమును కలిగియుండును. పరమేశ్వరుడు సర్వవ్యాపకుడైయుండుటయే! దీనికిగల కారణము. విద్యావంతుడు 'నాహం కర్తా – హరిః కర్తా' యని తలపోయుచుండును. సర్వేశ్వరుడు సర్వశక్తిమంతుడై యుండుటయే! దీనికిగల కారణము. 'సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్ । సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥' – అని శ్వేతాశ్వతరోపనిషత్తు నుడువుచున్నది. నిజమునకీ విశ్వములోని సమస్త కార్యములా సర్వేశ్వరుని చేతనే ఒనర్పబడుచున్నవి.

విద్యావంతుడు 'సర్వమున్నతని దివ్య కళామయమంచు విష్ణునందుల్లము చేర్చి' యుండును. భక్తప్రహ్లాదుడే! దీనికి తార్కాణము. భక్తప్రహ్లాదుడు తన తండ్రితో 'తండ్రి హరి జేరుమనియెడి తండ్రి తండ్రి' యని పలికెను. విద్యావంతుడు ధ్రువుని వలె దృఢమైన చిత్తము కలవాడై యుండును. చదువులలోని మర్మమును

తెలుసుకొన్నవాడే! నిజమైన విద్యావంతుడు. చదువులలోని మర్మమేమి? జనన మరణములను రహితమొనర్చుకొని, జగన్నాథుని ధామమైన పరబ్రహ్మానుభూతిని బడయుటయే! చదువులలోని మర్మము. పరబ్రహ్మానుభూతిని బడయుటకు మనుజుడు తన జీవితమంతయు వెచ్చింపవలసి యుండును. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడును, విద్యాగరిష్ఠుడునగు గురుదేవుని సేవింపవలసి యుండును. నిజమైన విద్యావంతుడు తైలధార వలె భావపరంపరలన్నింటిని భగవంతుని వైపు ప్రవహింపజేయుచుండును. మనుజుడు శాశ్వతానందమును, శాశ్వతశాంతిని బడయుటకు కీలకమిదియే! పూర్ణత్వప్రాప్తిచేత మాత్రమే మనకు శాశ్వతానందము, శాశ్వత శాంతి లభించును. పూర్ణత్వమును బడయజేయునట్టి విద్య నార్జించుటకై మనమందరము నిరంతరము కృషి యొనర్చెదము గాక!

## 59. శక్తిపాతము

శక్తి, లేక బలము పైనుండి దిగువకు పడుట, లేక బయటి నుండి లోపలికి ప్రవేశించుట 'శక్తిపాతమ'ని చెప్పబడును. ఇది జలపాతమును పోలియుండును. జలపాతము స్థూల రూపమునందుండును. శక్తిపాతము సూక్ష్మరూపమునందుండును. మిక్కిలి వేగముతో ప్రవహించుచున్న జలము చాల పై నుండి దిగువకు పడినప్పుడు దానియందు విద్యుద్దీపములు వెలుగుచుండుట, ఫ్యానులు తిరుగుచుండుట, ఎలక్ట్రిక్ స్టౌలు వెలుగుచుండుట, ఫ్రిజ్ పనిచేయుచుండుట, జనరేటర్లు పనిచేయుచుండుట, ట్రాం బండ్లు నడచుచుండుట, నీరు వేడియగుచుండుట, పాలు కాచుకొనుచుండుటను మనము ప్రతి రోజు ప్రపంచములో చూచుచున్నాము కదా! జలపాతము, విద్యుచ్ఛక్తి పాతములనునవి ప్రపంచమునకు సంబంధించిన విషయములు. ఇక కేవల శక్తిపాతముతో పోల్చినప్పుడు విద్యుచ్ఛక్తి పాతము స్థూలమైనదిగా పరిగణింప వలసియుండును. సూక్ష్మాతి సూక్ష్మశక్తికి మూలమైన స్రోతస్సేది? అదియే! మాయా శక్తి. ఈ మాయాశక్తికి మూలమేమి? పరబ్రహ్మము. కావున ఈ ప్రపంచము లోని స్థూలశక్తులైతేనేమి? ఈ విశ్వములోని సూక్ష్మ శక్తులైతేనేమి? ఈ బ్రహ్మాండములోని సూక్ష్మాతి సూక్ష్మ శక్తులైతేనేమి? సమస్త శక్తులు ఆ పరబ్రహ్మ జనితములేనైయున్నవి. బ్రహ్మశక్తిచే ఈ విశ్వము సృష్టింపబడినది. విష్ణుశక్తిచే ఈ విశ్వము పోషింపబడుచున్నది. ఇక రుద్రశక్తిచే ఈ విశ్వమంతయు తిరిగి ఆ పరబ్రహ్మమునందు లీనమగును. ఈ ప్రపంచములోని ప్రతి అణువునందును సూక్ష్మమైన శక్తిదాగియుండును. కాని అది వ్యక్తమగువిధమును బట్టి ఆయా శక్తికి ఆయా నామమొసంగబడును. అది ఎట్లనగా:–

మన మందరమున్నూ ఆత్మశక్తి చేతనే! జీవింపగలుగుచున్నాము. మనలోని ఆత్మశక్తిచే మన నేత్రములు చూడగలుగుచున్నవి. మనలోని ఆత్మశక్తిచే మన శ్రోత్రములు శ్రవణము చేయగలుగుచున్నవి. మనలోని ఆత్మశక్తిచే మన నాలుక రుచి చూడగలుగు చున్నది. మనలోని ఆత్మశక్తిచే మన నాసిక వాసన చూడగలుగుచున్నది. మనలోని ఆత్మశక్తిచే మనకు స్పర్శజ్ఞానము కలుగుచున్నది. మనలోని ఆత్మశక్తిచే మన పాదములు నడువగలుగుచున్నవి. మనలోని ఆత్మశక్తిచే మన హస్తములు పనిచేయగలుగుచున్నవి. మనలోని ఆత్మశక్తిచే మన జీర్ణకోశము పనిచేయుచున్నది. మనలోని ఆత్మశక్తిచే ఈ దేహమునందు రక్తప్రసరణ జరుగుచున్నది. మనలోని ఆత్మశక్తిచే మన మనస్సు సంకల్పించుచున్నది. మనలోని ఆత్మశక్తిచే మన బుద్ధి పనిచేయుచున్నది. ఈ ప్రకారముగా మన దేహమొనర్చు కార్యములన్నియును మనలోని ఆత్మశక్తి చేతనే! జరుగుచున్నవని అర్థమొనర్చు కొనవలయును.

ఐతే మనుజులలో ఒక వ్యక్తి యందధికమైన శక్తి మరియొకనియందు అల్పమైన శక్తిఉండుటకు గల కారణమేమి? మనము ఉన్నతోన్నతమైన శక్తియైన పరాశక్తికి సంపూర్ణముగా శరణాగతులము కాకుండుటయే! దీనికి గల కారణము. ఎవరెవరు ఏ పరిమాణమునందు పరాశక్తికి శరణాగతులగుచుందురో, వారి వారికి ఆ పరిమాణము నందు శక్తి సమకూరుచుండును. కైలాస పర్వతమునే పెకలించుటకు సన్నద్ధుడైన రావణాసురుడు శక్తి సమన్వితుడు కాడని మనము చెప్పగలమా? ఐతే ఈ శక్తి పరమేశ్వరుని చేతనే ప్రసాదింపబడినదను విషయమును విస్మరించిన కారణముచే రావణాసురుడు వినాశము నొందవలసివచ్చెను. కావున మనమున్నూ మనకు గల శక్తులు అల్పములైనను, అధికములైనను అవి యన్నియును భగవత్ప్రసాదితములే! యను విషయమును విస్మరింపరాదు. విస్మరించితిమా! మనకున్నూ వినాశము తప్పదు. అనగా:- శక్తి శూన్యులము, నిర్వీర్యులము కావలసివచ్చును.

అధిక శక్తివంతమైన భూమిక నుండి అల్ప శక్తివంతమైన భూమికకు శక్తి ఎల్లప్పుడు ప్రవహించుచుండును. ఆధ్యాత్మిక రంగమునందు గురుదేవుడు అధిక శక్తివంతుడై యుండును. శిష్యుడు అల్పశక్తి వంతుడైయుండును. ఈ కారణముచే శక్తి పాతమును బడయు నిమిత్తమై శిష్యుడెల్లప్పుడు గురుదేవుని పాదపద్మముల నాశ్రయించి యుండవలయును. అప్పుడు గురుదేవుని పాదపద్మముల నుండి ఆధ్యాత్మిక శక్తి తరంగములు బయల్వెడలి, శిష్యుని హృదయమునందు ప్రవేశించును. మనుజుని యందున్న శక్తులనన్నింటిని మరొక శరీరమునందు ప్రవేశింప

జేయజాలినప్పుడది "పరకాయ ప్రవేశమ"ని చెప్పబడును. ఈ కార్యమును జగద్గురు శ్రీ శంకరాచార్యుల వారు తమ జీవితమునందొనర్చిరి. ప్రతి మనుజుడు పూర్ణత్వము నొందునంత వరకు ఈ శక్తిపాతక్రియ జరుగుచునే యుండవలయును. అనగా:- శిష్యుడు గురువగునంత వరకు ఈ శక్తిపాత క్రియ జరుగుచుండవలయును.

గురువగుట అనగానేమి? "గుకారస్త్వంధకారః స్యాత్- రుకారస్తన్నిరోధకః" అనునట్లు అజ్ఞానమనెడి అంధకారమును తొలగించుకొని, జ్ఞాన ప్రకాశముచే దేదీప్య మానుడగుటయే! "గురువ"గుట. ఇట్టి స్థితిని చేరుకొనుటకై సాధకుడు, లేక శిష్యుడు గురుదేవుని పలుకులను శ్రద్ధతో శ్రవణము చేయుచుండవలయును. తర్వాత ఆ వాక్యములను మననము చేయుచుండవలయును. తదనంతరము నిదిధ్యాసనను చేయుచుండవలయును. అనగా:- అన్యచింత లేకుండాయుండవలయును. శక్తిపాత సంపుటమును సంగ్రహించుటకై శిష్యుడు తన చిత్తమును శూన్యముగావించి యుంచవలయును. అప్పుడు గురుదేవుని శక్తిపాత సంచారము అఖండముగా కొనసాగుటతో శిష్యుని జన్మ తరించును. గురుదేవుడు అనంతశక్తి సంపన్నుడు. కావున ఆతని శక్తి అంతమగు ప్రశ్నయే ఉదయింపదు. ఒకవేళ గురుదేవుడు తన దేహమును చాలించినను, శిష్యుని శ్రద్ధ, విశ్వాసము, భక్తులననుసరించి అనంతాకాశము నుండి గురుకటాక్షమాతనికి లభించుచునే యుండును. పూర్ణత్వము నొందునంతవరకు శ్రద్ధా విశ్వాసముగల శిష్యుడు శక్తిపాతముచే అభిషిక్తుడగుచునేయుండును. "సర్వం శక్తి మయం జగత్" అండ - పిండ - బ్రహ్మాండములన్నియును శక్తి సమన్వితములై యున్నవి. ఈ విషయమును గుర్తెఱింగినట్టి వారు భగవత్పథము నుండి పతితులు కాజాలరు. అట్టివారు పరమపావన జీవనావలంబులై, నిశ్చయముగా పరమానంద ధామమును చేరుకొందురనుటలో సందేహము లేదు. ఆధ్యాత్మిక సాధకులు మఱియు గురుభక్తులందఱును ఈ శక్తిపాత రహస్యము నెఱింగి, తరింతురుగాక!

## 60. షణ్ముఖనాథుడు

శ్రీ శివుని ద్వితీయ పుత్రుడే ! షణ్ముఖనాథుడు. షణ్ముఖనాథుడనగా:- ఆరు ముఖములు గల దేవుడని అర్థము. ఆ యారు ముఖములేవి? కుడి - ఎడమలలో రెండు ముఖములు. ముందు - వెనుకలలో రెండు ముఖములు. పైన - దిగువ రెండు ముఖములు. ఇట్లా దేవునికి ఆరు ముఖములు కలవు. అనగా:- షణ్ముఖనాథుడన్ని దిక్కులలో చూచుచుండుటచే సర్వజ్ఞుడని భావము. ఆతడు సర్వవ్యాపకుడని కూడా

దీని భావము. ఆతడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడగుటచే ఆతడు సర్వశక్తివంతుడనియును చెప్పవలసియున్నది. ఈ ప్రకారముగా షణ్ముఖనాథుడు పరబ్రహ్మమును సూచించును. నిర్గుణ – నిరాకార పరబ్రహ్మ భావము ప్రాపంచికులకు రుచింపదు ఈ కారణముచే నిర్గుణ నిరాకార పరబ్రహ్మమే! షణ్ముఖనాథుని రూపమును ధరించినదని చెప్పుట యుక్తమగును. ఆధ్యాత్మిక సాధకులీ రూపమును సేవించి, పూజించి, అర్చించి, ధ్యానించి తమ జీవిత ధ్యేయమునొందవచ్చును.

పరబ్రహ్మమునుండి ప్రప్రథమముగా ఓంకారము ప్రభవిల్లెను. ఈ ఓంకారము యొక్క రహస్యమును షణ్ముఖనాథుడు తన తండ్రియైన శ్రీ శివునికి ఉపదేశించెను ఈ కారణముచే షణ్ముఖనాథుడు "శివ గురువ"ని చెప్పబడును. కార్తీక శుద్ధ షష్టిరోజు శ్రీషణ్ముఖనాథుడు అవతరించెను. అందువల్ల శ్రీషణ్ముఖనాథునికి "కార్తికేయ స్వామి" యను పేరు కలిగెను. షణ్ముఖనాథుని ఆయుధము "శూలము". శూలము యొక్క చివరి భాగము మిక్కిలి సన్నముగా నుండును. శూలము తమిళ భాషలో 'వేల్' అని చెప్పబడును అందువల్ల షణ్ముఖనాథునికి "వేలాయుధుడ"ను పేరువచ్చెను. ఆరుముఖములను కలిగియున్నందువల్ల షణ్ముఖనాథునికి "ఆర్ముగం" అను పేరుకూడా కలదు. షణ్ముఖనాథుని వాహనము నెమలి. అందువల్ల షణ్ముఖనాథునికి "శిఖివాహనుడ" ను పేరు వచ్చెను. 'శిఖి' అనగా నెమలి అని అర్థము. షణ్ముఖనాథుని ధ్వజముపై కోడి గుర్తుండును. ఈ కారణముచే షణ్ముఖనాథునికి "కుక్కుటధ్వజుడ " ను పేరు వచ్చెను. "కుక్కుటము" నగా:– కోడియని అర్థము.

గురువని చెప్పబడువానికి ఓంకారము యొక్క రహస్యము తెలిసియుండ వలయును. ఓంకారధ్యానమునందు పురోభివృద్ధి నొందగోరు వాని చిత్తము శూలము వలె ఏకాగ్రమైయుండవలయును. షణ్ముఖనాథుని ఆరుముఖములు భగవంతుని యొక్క (1) జ్ఞానము (2) వైరాగ్యము (3) కీర్తి (4) ఐశ్వర్యము (5) ధనము (6) బలములను కూడా సూచించును. షణ్ముఖనాథుడు దేవతలందఱికి సేనాపతియై సూరపద్ముడు, సింహముఖుడు, తారకాసురుని వంటి క్రూరులైన రాక్షసులను సంహరించిన తర్వాత దేవేంద్రుడు ప్రీతినొందినవాడై తన కుమార్తెయైన "దేవయాని"ని షణ్ముఖనాథునికిచ్చి వివాహమొనర్చెను. ఈ దేవియే! షణ్ముఖనాథునికి క్రియాశక్తి. షణ్ముఖనాథుడు వల్లీ దేవిని కూడా వివాహమాడెను. ఈ దేవియే! షణ్ముఖనాథునికి ఇచ్ఛాశక్తి. సకల జీవుల హృదయగుహలయందు వసించు కారణముచే షణ్ముఖనాథునికి "గుహుడు"అను నామధేయము కూడా కలదు. జగద్గురు ఆదిశంకరాచార్యులవారు స్థాపించిన ఆరు

మతములలో "కౌమారము" కూడా ఒకటి. కుమారుడగా:– కార్తికేయుడని అర్థము. కావున షణ్ముఖనాథుడు పరబ్రహ్మమే యగును.

అవి చిన్ననాటి రోజులు. ఒకరోజు పార్వతీపరమేశ్వరులు బొజ్జగణపతిపై కరుణగలవారై ఆతనికొక రుచికరమైన ఫలమునొసంగిరి. ఇంతలో షణ్ముఖనాథుడచ్చటి కేతెంచెను. గణపతి చేతిలోని ఫలమును చూచి, తనకివ్వలేదని అలిగి, ఒక కొండపైకి వెళ్ళి కూర్చుండెను. అప్పుడు పార్వతీపరమేశ్వరులు కొండపైకి వెళ్ళి 'పలనీ' యని పలికిరి. అనగా:– "ఓ కుమారా! నీవే ఫలమైయున్నావు. నీకీ భౌతిక ఫలములేల?" యని పలికిరి. కావున షణ్ముఖనాథుడు పరబ్రహ్మమునకు ప్రతీకయని తెలియుచున్నది. పరబ్రహ్మానుభూతి నొందగోరువారు ఇతరములగు ప్రాపంచిక ఫలముల నాశింపరాదు. ప్రపంచమున్నప్పుడు పరబ్రహ్మముండదు. పరబ్రహ్మమున్నప్పుడు ప్రపంచముండదు. ప్రాపంచిక ఫలములయందాసక్తి కలవాడు పరబ్రహ్మానుభూతినొందజాలడు. పరబ్రహ్మానుభూతి కలవానికి ప్రాపంచిక ఫలములన్నియును రసహీనములుగా కానబడును. పార్వతీ పరమేశ్వరులు షణ్ముఖనాథుని 'పలనీ' యని పిలచిన నాటి కొండ నేటికిని 'పలని' యని చెప్పబడుచున్నది. ఈ స్థలములోని దేవాలయము మిక్కిలి రమణీయమైయున్నది.

శ్రీ శివుని కుటుంబ సభ్యులందఱును పూజనీయులే! అది ఎట్లనగా:– శివాలయములో శివలింగమెల్లప్పుడు అభిషేకాదులతో పూజింపబడుచుండును. అదే విధముగా పార్వతీదేవి ప్రజలచే పూజలను, అర్చనలను అందుకొనుచుండును. ఇక వారి ప్రథమ కుమారుడైన విఘ్నేశ్వరుడు తమ విఘ్నములు తొలగుటకై జనులందఱి చేతను పూజింపబడుచున్నాడు. షణ్ముఖనాథునికి భారతదేశములోని ఆరు కొండలపై ఆరు ముఖ్యమైన దేవాలయములు కలవు. అవి 'అర్పడైవీడు' అని చెప్పబడును. ఈ యారు దేవాలయములన్నియును తమిళనాడు నందున్నవి. ఈ కారణముచే షణ్ముఖనాథుడు అధికముగా తమిళులచే పూజింపబడుచున్నాడు. కాని షణ్ముఖనాథుని పరమార్థము నెఱింగిన వారెవ్వరైనను షణ్ముఖనాథుని పరబ్రహ్మరూపముగా సేవించి, పూజించి, అర్చించి, ధ్యానించి, తరించుట కవకాశము కలదు. శ్రీ షణ్ముఖనాథుడు తమిళ దేవుడనెడి సంకుచిత బుద్ధి కలవారెవ్వరైనను పరబ్రహ్మానుభవము నొందజాలరు. అట్టివారి భావము తమిళనాడు నందే సంచరించుచుండును.

శ్రీ షణ్ముఖనాథుని సాక్షాత్కరించుకొన్న తర్వాత తన ఆనందానుభవమును

తిరువణ్ణామలై వాసియైన శ్రీ అరుణగిరినాథర్ తమ రచనయగు "కందరానుభూతి" యందు వర్ణించియున్నారు. ఈ గ్రంథమునందు జీవుడు తన జీవిత లక్ష్యము నొందునంత వరకు ఎట్టి సాధన నొనర్పవలయునో, ఆ విషయము 51 తమిళ పద్యములలో వర్ణింపబడినది. ఆంధ్రులకు పోతన భాగవతము వలె, లేక వేమన శతకములోని పద్యరత్నములవలె ఈ 51 తమిళ పద్యములు హృదయానందదాయములై యుండును. విదేశీయులకే భాషయు రాకున్నను, భారతదేశములోని మహాత్ములు తమ అనుభవపూర్వకముగా రచించినట్టి ఏ భాషలోని పద్యములను శ్రవణమొనర్చినను, ఆధ్యాత్మికోత్తేజము నొందుచుందురు. కావున ఆధ్యాత్మికానుభవమునకు భాషతో సంబంధము లేదు. ఆధ్యాత్మికానుభవము ఒక పసిపాప తన తల్లి యొక్క దివ్యప్రేమను చూరగొనుట వంటిది. శ్రీషణ్ముఖనాథుని పరమార్థమును గ్రహించిన సాధకులున్నూ తల్లి ప్రేమవంటి ఆధ్యాత్మికానుభవానందము నార్జించి, తరించెదరు గాక!

## 61. స్వప్నము

గాఢనిద్రయందేది కానబడదో, జాగ్రదావస్థయందున్నూ ఏది కానబడదో, కేవలము మధ్యావస్థయందేది కానబడునో అదియే "స్వప్నమ"ని చెప్పబడును. గాఢనిద్ర తమస్సును, అంధకారమును, అజ్ఞానమును సూచించును. జాగ్రదావస్థ చైతన్య భూమికను సూచించును. కావున స్వప్నము అజ్ఞానావస్థయందుగాని, విజ్ఞానభూమిక యందుగాని కానబడదు. మన కన్నులకు గోచరించుచున్న ఈ చరాచర జగత్తు కూడా ఒక పెద్ద స్వప్నము వంటిదే. కారణమేమి? మనయందెవ్వరము కూడా పూర్తిగా తమస్సునందుగాని, అంధకారమునందుగాని, జ్ఞానభూమిక యందుగాని మునిగిలేము. కావున ఈ జగత్తంతయు స్వప్నతుల్యమే యగును. ఈ కారణముచేతనే! జగద్గురు శంకరాచార్యులవారు 'బ్రహ్మ సత్యం – జగన్మిథ్యా' యని ఉద్ఘోషించియున్నారు. అనగా:– బ్రహ్మమును గాంచువారు మేల్కొన్నవారనియు, జగత్తును గాంచువారు స్వప్నమునందున్న వారనియు అర్థము.

'సర్వం బ్రహ్మమయం జగత్' అనునది వేదవేదాంగములు, శ్రుతి–స్మృతి–పురాణేతిహాసములన్నింటికి సారాంశము. ఈ భూమికను చేరుకొనుటయే! మానవులందఱి జీవిత లక్ష్యము. స్వప్నము నందు సుఖదుఃఖముల ననుభవించుచున్నట్లే, ఈ జగత్తు నందున్నూ మనము సుఖదుఃఖముల ననుభవించుచున్నాము. ఐతే, స్వప్నములోని సుఖదుఃఖముల కంటె జగత్తునందు మిక్కిలి అధిక సుఖముగాని,

మిక్కిలి అధిక దుఃఖముగాని కలుగుచుండును. దీనికి గల కారణమేమి? ప్రపంచమును సత్యమని నమ్ముటయే! దీనికి గల కారణము. "దేహము నేను, మనస్సును నేను" అనుకొనుటయే! దీనికి గల కారణము. సత్యము, నిత్యమునైయున్న బ్రహ్మమును విస్మరించి, అసత్యము- అనిత్యమునైయున్న జగత్తును నమ్మికొని యుండుటయే! దీనికి గల కారణము.

ఈ జగద్భ్రాంతి తొలగిపోవుటెట్లు? జగత్తును స్వప్నమాత్రముగా భావించినప్పుడు జగద్భ్రాంతి తొలగిపోవును. సద్గురూపదేశము ద్వారా ''అహం బ్రహ్మోస్మి" యనెడి మహావాక్యముననుభూతమొనర్చుకొన్నప్పుడు ఈ జగద్భ్రాంతి తొలగిపోవును. జీవిత లక్ష్యము నొందగోరునట్టి నిజమైన శిష్యునికి గురుదేవుడు "తత్త్వమసి" యనెడి మహావాక్యము నుపదేశించును. గురుదేవుని యందు శ్రద్ధాసక్తులు గల నిజమైన శిష్యుడు ''అయమాత్మా బ్రహ్మ'' యనెడి మహావాక్యము నర్థమొనర్చుకొనగలుగును. అప్పుడాతడు తేజోమండల విరాజితుడై "ప్రజ్ఞానం బ్రహ్మ" యనెడి మహావాక్యమునందు నిష్ఠను కలిగి యుండును. నిజమైన ముముక్షువు పైన నుడువబడిన నాలుగు మహావాక్యములను జీవితమంతయు మననమొనర్చుకొని, గురుదేవుని రూపమునందున్న ఆ పరబ్రహ్మము యొక్క కారుణ్యము నార్జించినవాడై జగద్భ్రాంతిని వర్జించినవాడై, అజ్ఞానావరణను తొలగించుకొన్నవాడై, ఈ జగత్స్వప్నమునకతీతుడై బ్రహ్మానంద సాగరమునందోలలాడ గలుగును.

మనుజుడు జన్మించినదాదిగా 25 సంవత్సరముల వరకు బ్రహ్మమునందు చరించు జీవనము బ్రహ్మచర్యాశ్రమమని చెప్పబడును. ఇందు నిమత్తమై బాలుడు, లేక బాలిక యొక్క తల్లిదండ్రులు బ్రహ్మోపాసకులై, తమ జీవిత లక్ష్యము నెఱింగినవారై యుండవలయును. ఇక గృహస్థాశ్రమమునందున్న పురుషుడు తన సహధర్మచారిణితో కలిసి గృమస్థాశ్రమ ధర్మమును నెఱవేర్పవలసియుండును. మోక్షధామము నొందుటకై ధర్మాచరణ ప్రథమ భూమికయని అతడు తెలిసికొనవలసియుండును. అతడు తన భార్యను తాను భరించి, పోషించుచున్నట్లెప్పుడును భావింపరాదు. కాని ఆ భగవంతుడే తన ద్వారా భరించి, పోషించుచున్నాడని భావింపవలయును. అతడు తన పత్నిని పతియైన తనకు నికృష్టమైన దానినిగా చూడరాదు. కాని తన పత్ని పతియైన తనకు నిర్వాణము నొసంగజాలు శక్తి సంపన్నురాలుగా తలంపవలయును. అతడు తన సతిని ఒక అబలగా భావింపరాదు. కాని దేవీమహాత్మ్యమునందు వర్ణింపబడినట్లుగా శుంభ-నిశుంభ రాక్షసులను, చండ-ముండ రాక్షసులను వధింపజాలినట్టి

చాముండేశ్వరిగా తలంపవలయును. రక్తబీజ రాక్షసుని సంహరింపగలిగినట్టి రక్తదంతికగా తలంపవలయును. అతడు తనకు కలుగు సంతానమును దేవుని బిడ్డలుగా భావింపవలయును. సంతానమును పోషించుటకు తల్లిదండ్రులు కేవలము నిమిత్తమాత్రులుగా భగవంతునిచే నియమింపబడినట్లు తలంపవలయును. ఏబది సంవత్సరముల వయస్సు వచ్చిన తర్వాత గృహస్థుడు తన గృహస్థాశ్రమ ధర్మమునకు ఉన్నతమైన వానప్రస్థాశ్రమమును స్వీకరించుట ఉచితమగును. ఇట్లు చేయకున్నచో కేవలము ఐశ్వర్యమును, ధనమును, కనకమును ప్రోగుచేయుటయందు మాత్రమే! మనస్సు లగ్నమగుట కవకాశమేర్పడును. ఈ ప్రకారముగా మనుజుడు తన జీవిత లక్ష్యమును కోల్పోవును.

ఇక సన్న్యాసాశ్రమము ఉన్నతోన్నతమైనదే కాక, ఉత్తమోత్తమమైనది కూడా. కారణమేమి? కేవలము ఆత్మసాక్షాత్కారము, లేక దైవసాక్షాత్కారము, లేక బ్రహ్మసాక్షాత్కారమే! సన్న్యాసాశ్రమము యొక్క లక్ష్యమైయున్నది. ఇచ్చట కేవలము భస్మధారణ, కాషాయ వస్త్రధారణ, రుద్రాక్షమాలాధారణులగు డాంబిక సన్న్యాసుల విషయము చెప్పబడుట లేదు. ఈ విశ్వమును కేవలము స్వప్న సదృశముగా తలంచువాడే! నిజమైన సన్న్యాసి. సన్న్యాసి సర్వత్ర కేవలము సత్పదార్థమును దర్శించుచుండును. సన్న్యాసి స్థూల-సూక్ష్మ-కారణావస్థలను దాటి, ఈ జగత్తునకు పరమ కారణమైయున్న పరబ్రహ్మను సంధానము నొనర్చుచుండును. నిజమైన సన్న్యాసి ఆత్యంతిక దుఃఖ నివృత్తిని పొందినవాడై, పరమానందమును సంప్రాప్తించుకొనును. నిజమైన సన్న్యాసికి పూర్వజన్మ సంస్కారములన్నియును భస్మీభూతములగును. ఈ కారణముచే జీవన్ముక్తావస్థను బడయును. జీవన్ముక్తుని శరీరము సర్పము యొక్క కుబుసమును బోలియుండును. జీవుడు స్వప్నావస్థను త్యజించి, జాగ్రదావస్థ లోనికి ప్రవేశించినట్లే జీవన్ముక్తుడు జగత్స్వప్నము లోని ఈ శరీరమును త్యజించి, పరబ్రహ్మముతో తాదాత్మ్యము నొందును. అప్పుడాతడు అజ్ఞానమనెడి నిద్ర నుండి మేల్కొనును. ఇట్లాతడు జాగ్రత్స్వప్నము నుండి మేల్కొన్నవాడై, అఖండ సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మానుభూతి నొందును. ఈ స్థితిని చేరుకొనుటకై జీవితమంతయును ఆధ్యాత్మిక సాధన అఖండముగా కొనసాగుచుండ వలయును.

# 62. హరియను రెండక్షరములు

శ్రీమదాంధ్ర భాగవతము నందు శ్రీ బమ్మెర పోతనామాత్యులీ క్రింది పద్యమును వ్రాసిరి:

కం. హరియను రెండక్షరములు
హరియించును పాతకంబులంబుజనాభా!
హరి నీ నామ మాహాత్మ్యము
హరి హరి, పొగడంగ వశమె? హరి శ్రీకృష్ణా!

ఆహా! ఇది ఎంతటి సరళమైన మఱియు సారగర్భితమైన పద్యమో, గమనింపుడు. ఈ పద్యము మానవజీవిత కర్తవ్యమును నిర్దేశించుటయే గాక, మానవ జీవితలక్ష్యమును చేర్చుననుటలో ఏలాటి సందేహము లేదు. జ్ఞానయోగ మార్గావలంబులు కేవలము 'ఓం' అనెడి ఏకాక్షరమునుచ్చరించుచు, తమ జీవిత గమ్యస్థానమును చేరగలుగుదురు. ఇక భక్తియోగము ననుసరించువారు. కేవలము 'హరి' యనెడి రెండక్షరముల నుచ్చరించుచు, తమ జీవిత గమ్యస్థానము నొందగలుగుదురు. ఏల? 'హరి' యనెడి ఈ రెండక్షరములు మానవుడొనర్చిన సమస్త పాపములను హరింపజేయును. పాపములు నశించిన తర్వాత పుణ్యము మాత్రమే! శేషించును. పుణ్యఫలము ననుభవించుటకై పుణ్యలోక ప్రాప్తి కలుగును. ఐతే పుణ్యఫలము క్షీణించిన తర్వాత తిరిగి ఈ భూలోకమునకు రావలసిన అవసరముండదు. కారణమేమి? ఈ లోకము నందనుభవించుటకు కారణములైన పాపముగాని, పుణ్యముగాని నిశ్శేషముగా నశించిపోవును. కావున కైవల్యమోక్షద్వారమా వ్యక్తి కొఱకు తెరువబడును. ఎప్పుడు? 'హరి' యను రెండక్షరములను నిరంతరము జపించినప్పుడు, జీవితాంతము వరకు జపసాధన నొనర్చినప్పుడు, అహర్నిశము శ్రీహరిని తన హృదయకమలము నందుంచు కొన్నప్పుడు!

ఈ కారణముచే 'హరి' యనెడి నామము యొక్క మహాత్మ్యము అమోఘమై యున్నది. విష్ణుమూర్తి, శ్రీ రామచంద్రుడు, శ్రీకృష్ణుడు, హరియనునవి పర్యాయపదములు. అనగా:- ఒకే దేవునికి గల వివిధనామములు. కావున "కలిసంతరణోపనిషత్తు" నందు

"హరేరామ హరేరామ రామరామ హరేహరే ।
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే ॥"

యనెడి 16 హరినామములున్న మంత్రము చెప్పబడినది. ఈ 16 నామములు శ్రీ కృష్ణభగవానుని షోడశ కళలను సూచించును. షోడశ కళలు భగవంతుని పూర్ణావతారమును నిరూపించును. అందువల్ల పైన పేర్కొనబడిన మహామంత్రము నందు కూడా 'హరి' యను రెండక్షరములే! కలవు. కారణమేమనగా:- "హరి" అన్నా, "రామ" అన్నా, "కృష్ణ" అన్నా ఒకే అర్థము. ఈ కలికాలమునందీ మహామంత్ర జపము పరమోత్కృష్టమై యున్నది. ఈ కారణముచేతనే శ్రీ సద్గురు శివానంద స్వాములవారు 3-12-1943వ తేదీన శ్రీశివానందాశ్రమములోని "భజనహాలు" నందు అఖండ "మహా మంత్ర" జపయజ్ఞమును ప్రారంభించిరి. 3-12-2008 నాటికి 65 సంవత్సరములు పూర్తియగును. మహామంత్రోచ్చారణచే దుష్టశక్తులు దూరమగును. లక్ష్మీకటాక్షము కలుగును. చివరికి మోక్షసామ్రాజ్యమునందు ప్రవేశించుటకర్హమైన యోగ్యతాపత్రము లభించును. "హరి" నామస్మరణ మొనర్చువారికి ఏ విషయమునందైనను విచారము నొందుస్థితి కలుగదు. శ్రీశివానందాశ్రమము నందొక వ్యక్తి మరియొక వ్యక్తిని కలిసినప్పుడు "హరి ఓమ్" అని పలుకుటతో అభినందనలు తెలుపబడును. ఈ "హరి ఓమ్" పదద్వయము భక్తియోగమును, జ్ఞానయోగమును సమ్మిళితమొనర్చును. "హరి" యనునది భక్తియోగమును, మఱియు "ఓమ్" అనునది జ్ఞానయోగమును సూచించును. భక్తియోగమార్గమును దాటిన తర్వాత సాధకుడు జ్ఞానయోగమార్గము ననుసరింప వలయునని దీని భావము. కావుననే "జ్ఞానాదేవహి కైవల్యమ్" అని శ్రుతి నుడువుచున్నది. "నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే" యని శ్రీమద్భగవద్గీత చెప్పుచున్నది. "సర్వస్య చాహం హృది సన్నివిష్టః" అనునది కూడా భగవద్వచనమే! అనగా:- "నేను ప్రతియొక్కరి హృదయమునందు విరాజమానుడనై యున్నాన"ని భగవంతుడు భగవద్గీత యందు పలికెను. ఐతే, ప్రతియొక్కరు ఈ వాక్యము యొక్క అనుభూతి నొందు చుండవలయును.

ఒకవ్యక్తికి బ్యాంకులో కోటికోట్ల రూపాయలున్నవనుకొనుడు. ఐతే, బ్యాంకులలో అంతపెద్దమొత్తమును తన తండ్రి తనువును చాలించుటకు పూర్వము తన పేరుతో వేసినాడను విషయమాతనికి తెలియదు. ఈ కారణముచే అతడు బ్యాంకులో నున్న ధనముచే ఏలాటి ప్రయోజనము నొందజాలడు. అదే విధముగా భగవంతుడు మన హృదయగుహయందు నివాసమొనర్చుచున్నను, ఆ జ్ఞానము మనకు లేనప్పుడు

హృదయాంతర్వాసియైయున్న భగవంతునిచే మనవేలాటి ప్రయోజనము నొందజాలము. సరికదా! మనము భగవంతుని కేవలము శరీరమనెడి రథమునకు సారథిగా ఒనర్చుకొన్న వారమగుదుము. అర్జునుడు కూడా భగవంతుని విశ్వరూప సందర్శన తర్వాతనే “కరిష్యే వచనం తవ” అని పలికి యుద్ధసన్నద్ధుడయ్యెను. కావున సాధకుడు తన హృదయమునందు భగవంతుని దర్శింపజాలనప్పుడు కనీసము తన గురుదేవుని యందు భగవంతుని దర్శించి, ఆతని ఆజ్ఞలను పాలించుచుండవలయును.

మనమెల్లప్పుడు మరణమును జ్ఞప్తియందుంచుకొని, నిరంతరము భగవత్స్మరణ ను చేయుచుండవలయును. అప్పుడే! మన జీవితములు ధన్యములగును. మరణము దేహమునకు సంబంధించియున్నది. పరమేశ్వరునికి “కాలకాలుడ”ను పేరు కలదు. కాలునికి కాలుడే! పరమశివుడని అర్థము. అనగా:- జనన-మరణములను అంతమొనర్చునట్టి వాడని భావము. కాలము సమయమును కూడా సూచించును. పరమాత్మ దేశ-కాలముల కతీతమైయున్నది. పరబ్రహ్మమునందు దేశముగాని, కాలముగాని ఉండవు. అన్ని దేశములలో, అన్ని కాలములలో ఉ ండునదే! పరబ్రహ్మయని చెప్పబడును. నిరంతర “హరి” నామస్మరణచే ఇప్పుడిచ్చటనే! మోక్షము లభించును. “హరి” నామస్మరణ చేయుటకు ముందు “హరి” నామ మాహత్మ్యము తెలియబడవలయును. చైతన్యమహాప్రభువు, శ్రీరామకృష్ణ పరమహంస, తుకారామ్, భక్తమీరాబాయి, సక్కుబాయి, ప్రహ్లాదుడు, స్వామి శివానంద వంటి భక్తులు, భక్తనారీమణులు హరినామస్మరణచే తరించిరి. మనమున్నూ ‘భక్తి’యనెడి పడవలో ‘హరి’ యను రెండక్షరములనెడి తెడ్ల సహాయముతో జీవితమనెడి తరంగిణిలో పయనించుచు, అఖండ సచ్చిదానంద పరబ్రహ్మ సాగరమును చేరి, సుఖించుటకు ప్రయత్నించెదము గాక! ‘హరి’స్మరణ నిలచిపోయినప్పుడు ప్రయాణము కూడా ఆగిపోవును. కావున ‘హరి’ స్మరణ సర్వకాల సర్వావస్థలలో కొనసాగుచుండవలయును.

## 63. క్షమాలక్ష్మి

కమలాక్షునర్చించు ముముక్షువులకు క్షమయను లక్ష్మి అక్షయమగు సుఖము నొసంగుటయే గాక, భగవత్కృపా కటాక్షమునకు పాత్రునిగా చేయును. క్షమ యనగా:- ఓర్పు. ఈ సుగుణముగల సజ్జనుడు ముజ్జగములయందును స్వతేజో విరాజితుడై వెలుగొందును. అతడెల్లప్పుడును వికసిత వదనుడును, ప్రఫుల్ల హృదయారవిందుడునై

ఉల్లాసవంతమైన జీవితమును గడుపుచుండును. కొల్లలుగా కష్టపరంపర లేతెంచినను, మెల్లమెల్లగా వాటినన్నింటిని తరిమివేసి, ఉల్లాసమునొందు సామర్థ్యమును కలిగి యుండును. క్షమాలక్ష్మిని కలిగియున్నట్టి నరుడు క్షామముచే బాధపడక క్షేమముగా నుండును.

వనలక్ష్మియందు సంచరించుచుండిన శ్రీరామచంద్రుడు క్షమాలక్ష్మిని చేపట్టియే కదా! తుదకు తాను కోల్పోయిన సీతామహాలక్ష్మిని పొందగలిగెను. ఎన్ని ఇడుము లేర్పడినను పట్టువీడక క్షమాధర్మగుణ విభూషితుడైయుండుట చేతనే కదా! తుట్టతుదకు ధర్మరాజు ఏకచ్ఛత్రాధిపత్యము నధిరోహింపగలిగెను. క్షమాగుణమను మాణిక్యమును ధరించుట చేతనే కదా! ప్రహ్లాదుడు ఒకానొక జడమైన స్తంభమునుండి సచ్చిదానంద స్వరూపుడైన శ్రీనరసింహమూర్తిని ఉద్భవింపజేయగలిగెను. క్షమాగుణ విభూషితురాలై యొప్పుట వల్లనే కదా! సావిత్రీదేవి యమలోకమునకేగి, తన పతియగు సత్యవంతుని నిత్యజీవునిగా ఒనర్పగలిగెను. ఇక క్షమాగుణ తేజోవిరాజితుడై యుండుటచేతనే కదా! మన భారతమాత జాతిపితయగు గాంధీమహాత్ముడు విదేశీయులను పారద్రోలి, స్వదేశీయులగు మనకు స్వాతంత్ర్యసామ్రాజ్యము నొసంగగలిగెను. కావున క్షమాగుణము ఇహ-పర లోకములకున్నూ క్షేమము నొనగూర్చునదై యున్నదని తెలియవలయును. క్షమాలక్ష్మిని కలిగియున్నట్టి సాధకుడు నిరక్షరకుక్షియైయున్నను, మోక్షలక్ష్మిని చేరగలుగును. ఇక క్షమాగుణరహితుడగు జనుడు సాక్షరుడైయున్నను మోక్షలక్ష్మిని చేరజాలడు.

క్షమాలక్ష్మిని కలిగియున్నట్టి బ్రాహ్మణులు తాము సర్వకాల సర్వావస్థలయందు బ్రహ్మనిష్ఠులైయుండి, ఇతరులనున్నూ బ్రహ్మజ్ఞాన సంపన్నులుగా ఒనర్చుచుందురు. క్షమాగుణముగల క్షత్రియులు అధర్మ క్షయముచే ధర్మసంరక్షణ యొనర్చి ముముక్షువులకు అక్షయమగు సుఖము నొసంగుదురు. క్షమాగుణముగల వైశ్యులు విశ్వాత్మైక హృదయులై శునకమునందును, శ్వపచునియందును సమదృష్టిని కలిగి వర్తింతురు. ఇక క్షమాగుణ సంపన్నులైన శూద్రకులజులు ఆయాసమనుకొనక, ఆనందముతో అందరియందును దేవుని దర్శించుచు, ఆత్మార్పణభావముతో పరిచర్యలొనర్చుచుందురు. క్షమాలక్ష్మిని కలిగియున్న భిక్షాధికారి లక్షాధికారియగుటకు వీలున్నది. క్షమాశీలుడు క్షణక్షణము విశ్వేశ్వరునియందు లక్ష్యమునుంచి, విశ్వేశ్వరుని వీక్షించుచుండును. ఒక క్షమాగుణ రహితుడు క్షణక్షణము గొణుగుకొనుచు, విశ్వములోని మనుజులపై ఆక్షేపణలనొనర్చు చుండును. క్షమాస్వరూపుడైన సత్పురుషుని

వీక్షించి, వీనులవిందుగా అతని సంభాషణను శ్రవణమొనర్చుటకై దిక్కుదిక్కుల నుండి వేలకు వేలు మనుజులు వచ్చివేచియుందురు.

క్షమాలక్ష్మిని కలిగియున్నట్టి గృహలక్ష్మి, గృహమనెడి దర్పణమునందు తళతళ కాంతితో ప్రకాశించుచుండును. అట్టి క్షమాగుణములేని గృహస్థుని గృహములోని గృహిణి క్షయవ్యాధివలె నిరంతరము వేధించుచుండును. క్షమాలక్ష్మిని కలిగియున్నట్టి గృహలక్ష్మి లోకములోని సమస్త జనులచే గజలక్ష్మియని స్తుతింపబడుచుండును. కావుననే భగవద్గీతలోని దశమాధ్యాయము, విభూతియోగమునందు శ్రీకృష్ణ భగవానుడు "కీర్తిశ్రీర్వాక్చనారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా"యని నారీమణి యొక్క గుణములను వర్ణించియున్నాడు. కావున ఈ క్షమాగుణము చేతనే నారీమణులకు కీర్తి, సంపద, వాక్చాతుర్యము, జ్ఞాపకశక్తి, మేధాశక్తి మఱియు ధైర్యము వృద్ధినొందునని చెప్పవచ్చును. క్షమాగుణము కలవానికి జగత్తునందు శత్రువనువాడు లేడు. క్షమాగుణము లేనివానికి జగమునందు మిత్రుడులేడు. క్షమాగుణము కలిగియుండుట, చేతనే కదా! భగీరథుడు భాగీరథినదిని మన భారతదేశమునందు గంగోత్రి నుండి గంగాసాగరము వరకు ప్రవహింపజేయగలుగుట? ఇక ఈ క్షమాగుణము చేతనే కదా! భాస్కరుడు వేసటనొందక, రేయింబవళ్ళు ఉదయాస్తమయ క్రియలను నెఱవేర్చ గలుగుచుండుట? మరీ క్షమాగుణమును అక్షయముగా కలిగియుండుట వల్లనే కదా! క్రీస్తు ప్రభువు ఖండఖండాతరముల యందును అఖండ ప్రతిభా ప్రభావ సంపన్నుడై, ఉజ్జ్వల తేజోవిరాజితుడై, తదనుయాయులచే కీర్తింపబడుటయున్నూ జరుగుచున్నది?

భూదేవికి "క్షమ" యనెడి మరియొక పేరు కలదు. మనమందరమున్నూ దేనియందు సంచరించుచున్నామో, దేనియందు పనిపాటలను నిర్వర్తించుకొనుచు న్నామో, మఱియు దేనియందు ఆటలాడుచు, అడుగిడుచున్నామో, పరుగిడుచున్నామో, అట్టి పుడమి ఏలాటి పెడమొగము పెట్టక, భూభారమును భూరికాలము నుండి మోయుచున్నది. కావుననే ఒకానొక కవీశ్వరుడు "క్షమ సర్వంబు వహించు" నని పద్యరత్నమునందు పేర్కొనియున్నాడు. కాబట్టి మనమందరమున్నూ భూదేవి నుండి క్షమాగుణమును నేర్చుకొనవలసియున్నది.

"తేజః క్షమాధృతిః శౌచమద్రోహో నాతి మానితా।
భవంతి సంపదం దైవీ మభి జాతస్య భారత ॥"

యని షోడశాధ్యాయమునందు షోడశకళా ప్రపూర్ణుడైన శ్రీకృష్ణచంద్రుడు గీతయందు నుడివినట్లు క్షమాగుణము దైవసంపదకు చెందినదగుటచే ముముక్షువులీ

క్షమాగుణమును సంపాదించుటకై సకల విధముల ప్రయత్నము నొనర్పవలసియున్నది. అంతేకాదు, ద్వాదశాధ్యాయమునందు మాధవుడు

> "అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
> నిర్మమో నిరహంకార సమదుఃఖ సుఖః క్షమీ ॥"

యని భగవద్భక్తుని గుణగణమును స్తుతించియున్నాడు. ఈ కారణముచే క్షమాగుణము కల యోగిపుంగవుడు ద్వేషరహితుడును, సర్వభూతహిత కారుణ్య సహితుడును, అహంకార–మమకార విహీనుడును మఱియు సుఖదుఃఖములయందు సమభావము కలిగియుండువాడునై యుండునని తెలియవలెను.

కావున మన ప్రారబ్ధకర్మను క్షీణింపజేసికొని, మోక్షలక్ష్మిని బడయుటకై మనము క్షమాలక్ష్మి యొక్క శరణుపొందవలసియున్నది. ఈ క్షమాలక్ష్మిని ప్రసాదించుటకై అపార కృపాకటాక్ష వీక్షణుడగు లక్ష్మీపతిని మనమందరము నిరంతరము సత్యహృదయముతో ప్రార్థించి, సఫలీకృత మనోరథుల మయ్యెదము గాక!

## 64. త్రినేత్రములు

త్రినేత్రములనగా:– మూడు కన్నులని అర్థము. గ్రుడ్డివారు తప్ప పశు పక్షులన్నియును, మానవులందఱును రెండు నేత్రములను కలిగియుందురు. ఒక నేత్రముతో మనము మన దేహ–మనోబుద్ధ్యాదులను దర్శించుచుందుము. మరొక నేత్రముతో సూర్య–చంద్ర నక్షత్రాది జగత్తును దర్శించు చుందుము. వీటితో పూర్ణత్వ దర్శనము కలుగునా? కలుగదు. పూర్ణత్వ దర్శనము కొఱకై మనవేమి చేయవలసియుండును. ఇందునిమిత్తమై మూడవ నేత్రము ఆవశ్యకమైయుండును. ఆ మూడవ నేత్రమేది? అదియే! జ్ఞాననేత్రము. ఈ జ్ఞాననేత్రముచే అజ్ఞానము తొలగింపబడును. ఈ దేహమనోబుద్ధులు నేననుకొనుటయే! అజ్ఞానము. దేహము నాశవంతమైనది. మనస్సు సంకల్పముల పుట్ట. కావున సంకల్పములు రహితమైనప్పుడు మనస్సు కూడా నశించును. బుద్ధి మంచి–చెడులను, నిత్యానిత్యములను వివేచించును. ఐనను, బుద్ధి పరిమితమైయుండును. ఆత్మ అపరిమితము. కావున ఆత్మావలోకనము నొనర్చుటయే! జ్ఞాననేత్రము యొక్క కార్యము.

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" మని వేదములుద్ఘోషించుచున్నవి. సత్యమనునది అన్ని దేశములలోను, అన్ని కాలములలోను ఉండును. దేహ–మనో–బుద్ధులు నశ్వరములు. కావున అవి సత్యము కాజాలవు. జ్ఞాననేత్రము తెఱువబడినప్పుడు అనంతమైన బ్రహ్మము పొందబడును. "జ్ఞానా దేవహి కైవల్యమ్" అని ఉపనిషత్తు పలుకుచున్నది. కైవల్యమనగా:– కేవలత్వము. కేవలత్వమనగా:– అన్యపదార్థములేని అద్వైతస్థితి. "ద్వితీయాద్వై భయం భవతి" –రెండవవస్తువున్నప్పుడు భయము కలుగును. రెండవ వస్తువేదియైనను, ఇంతో–అంతో స్వార్థపరత్వమును కలిగియుండును. ఇక జ్ఞాననేత్రము కలవానికి స్వార్థపరత్వముండదు. అట్టివాడు సర్వత్ర సర్వేశ్వరుని సందర్శించుచుండును. అట్టివాడు చెట్టులోను, గుట్టలోను, పిట్టలోను పరమేశ్వరుని సందర్శించుచుండును. అట్టివాడు చీమలోను, దోమలోను దైవమును దర్శించు చుండును. అట్టివాడు అనేకత్వమునందేకత్వమును దర్శించును. "ఏకం సద్విప్రా బహుధా వదంతి" సత్యపదార్థము ఏకైకము. అది మాయను ఆధారముగా గొని, నానా విధములైన దృశ్యములచే కానబడుచుండును.

పరమశివుడు ముక్కంటియని చెప్పబడును. అనగా:– మూడు కన్నులున్న దేవుడని చెప్పబడును. శివునికి మూడు నేత్రములున్న కారణముచే మనము ప్రశాంతముగా ధ్యాననిష్ఠయందున్న శివుని దర్శించుచుందుము. ధ్యాననిష్ఠ యందు మూడవనేత్రము తెఱువబడును. శివుడు తన మూడవ నేత్రముచే కాముని దహనమొనర్చెను. కాముడు సమస్త కోరికలకు ప్రతీకము. కావున శివుడు సమస్త కోరికలను దహింపజేసెనని అర్థము. ఏ కోరిక లేనివాడే! పూర్ణతృప్తుడైయుండును. కారణమేమనగా:– ఏలాటి కోరికయైనను, సంకుచితమైయుండును. సంకుచితమైన కోరిక సంకుచితమైన ఫలితమునే ఒసంగును. ఈ కారణముచే ఏలాటి కోరికయైనను పూర్ణతృప్తి నొసంగజాలదు. తుట్టతుదకు బ్రహ్మపదవి కూడ పూర్ణతృప్తి నొసంగజాలదు. బ్రహ్మపదవి పూర్ణత్వమునకు దిగువస్థాయియందుండుటయే! దీనికిగల కారణము. కావున పూర్ణత్వమునొందు వాంఛను బ్రహ్మదేవుడు కూడ కలిగియుండునని తెలియు చున్నది. నిష్కాముడు ఆత్మకాముడైయుండును. అనగా:– ఆత్మను కోరువానికేలాటి కోరికలుండవు. ఏలననగా:– ఆత్మయందే సమస్త కోరికలిమిడియుండును. అందువల్ల ఆత్మకాముడు ఆత్మతృప్తుడై యుండును. ఆత్మానందము నొందునిమిత్తమై ఆత్మజ్ఞానము నార్జింపవలసియుండును. జ్ఞాననేత్రము తెఱువబడినప్పుడు ఆత్మజ్ఞానము కలుగును. ఏకైకమైన, సత్యమైన, నిత్యమైన పరబ్రహ్మము సర్వత్ర ఉనికిని కలిగియున్నదని

తెలిసికొనుటయే! జ్ఞాననేత్రము తెఱువబడుట. జ్ఞాననేత్రము తెఱువబడుటయే! ఆత్మసాక్షాత్కారమని చెప్పబడును. అదియే! దైవసాక్షాత్కారము. అదియే! బ్రహ్మసాక్షాత్కారము. జగద్గురువు శ్రీశంకరాచార్యులవారు నుడివినట్లు "త్వయి మయి సర్వత్రైకో విష్ణుః వ్యర్థం కుప్యసి మయ్య సహిష్ణుః" అను వాక్యమును మనము మన జీవితమునందనుభూత మొనర్చుకొనవలయును. "సర్వం విష్ణుమయం జగత్" అను భావము దృఢమైనప్పుడు పరస్పర ద్వేషభావము అంతరించును. "సర్వం శివమయం జగత్" అనుకొన్నప్పుడు కూడా ద్వేషభావము అంతరించును. "సర్వం శక్తిమయం జగత్" అనుకొన్నప్పుడున్నూ ద్వేషభావము అంతరించును. "సర్వం బ్రహ్మమయం జగత్త"ని భావించినప్పుడు కూడా ద్వేషభావము అంతరించును. తుట్టతుదకు "సర్వం జీసస్ మయం జగత్త"ని తలంచినప్పుడు కూడా ద్వేషభావము సమసిపోవును. ఇవన్నియును ఒకే సద్వస్తువునకు గల నానావిధములగు నామములు.

మూడు నేత్రములున్న మనుజుడు సర్వజ్ఞుడైయుండును. కేవలము రెండు నేత్రములున్న మనుజుని జగద్గురు శ్రీశంకరాచార్యులవారు "పశ్యన్నపి న పశ్యతి మూఢో" అని వర్ణించి చెప్పిరి. "ప్రపంచములో మిక్కిలి ఆశ్చర్యకరమైనదేది?" అని యక్షుడు ప్రశ్నించినప్పుడు "అహన్యహని భూతాని గచ్ఛంతీ హయమాలయం, తథాపి జీవితు మిచ్ఛంతి కిమాశ్చర్యమతః పరమ్" యని శ్రీధర్మరాజు సమాధానమొసంగెను. అనగా :– ప్రతిరోజు పశువులు, పక్షులు, మనుష్యులు ఇత్యాది జీవులెన్నో మరణించుటను మనము చూచుచున్నాము. కాని, తాను ఇంకను జీవించునని మనుజుడు తలంచును. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన విషయమీ ప్రపంచమునందేమి కలదు? మనము ప్రతిరోజు సూర్యుడు ఉదయించుటను, అస్తమించుటను చూచుచున్నాము. ఆకాశమునందు మిణుకు మిణుకు మనెడి నక్షత్రములను చూచుచున్నాము. శుక్లపక్ష చంద్రుని వృద్ధిని, కృష్ణపక్ష చంద్రుని క్షయమును గాంచుచున్నాము. చలికాలము, ఎండాకాలము, వర్షాకాలముల ననుభవించు చున్నాము. ఇవియన్నియును ఎవరి ఆదేశమువల్ల జరుగుచున్నవి? ఈ విషయమై మనము దీర్ఘముగా ఆలోచింపవలసియున్నది.

ఇంత ఏల? "మనమీ ప్రపంచమునకెచ్చటినుండి వచ్చితిమి? ప్రపంచమును విడిచి ఎచ్చటికి వెళ్ళుదుము? మనమీ ప్రపంచమునందున్నప్పుడు చేయవలసిన కర్తవ్యమేమి?" అనెడి మూడు విషయముల నాలోచించినచో చాలును. ఈ విషయములను మరచిపోవుట మనుష్యదేహమున్న మనకు సహజము. కావున ఇచ్చట గురూపదేశ మావశ్యకమైయుండును. ఈ కారణముచేతనే గురుదేవులు "బ్రహ్మానంద

పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్" అని గురుగీతయందు వర్ణింపబడెను. జ్ఞానస్వరూపుడైన అట్టి గురుదేవునాశ్రయించినచో, జ్ఞాననేత్రము తెఱువబడును. ఒక నేత్రముతో గురుదేవుని దర్శించుచు, మరొక నేత్రముతో గురుదేవుని స్వరూపమేయైన జగత్తును దర్శించుచు, మూడవదైన జ్ఞాననేత్రముతో సర్వజీవ హృదయాంతర్వర్తియైనట్టి ఆత్మను దర్శించుచు, ఆత్మజ్ఞానమునొంది, ఆత్మసాక్షాత్కారపథమునందు ముందడుగు వేయుచు, మానవజీవిత పరమలక్ష్యమును సాధించెదము గాక!

## 65. "జ్ఞానేన హీనః పశుభిః సమానః"

"జ్ఞానము లేనివాడు పశువుతో సమానమ"ని పై వాక్యమునకు అర్థము. జ్ఞానముండియు దానిని ఉపయోగించుకొనని నరుడు పశువుతో సమానమని భావము. "జ్ఞానము"ను ఉపయోగించుకొనని మానవజాతి కంతటికి ఇది ఒక పెద్దతిట్టు వంటిది. మానవుని భాష తెలిసిన గాడిదను "ఓగాడిదా!" అని పిలచినచో అది కూడా కోపగించుకొని తన్నుటకు కూడా సిద్ధమగును. దానిని బట్టి జ్ఞానము మిక్కిలి విలువైన పదార్థమని తెలియుచున్నది. ఈ కారణముచే శాస్త్రములలో జ్ఞానము "రత్నము"గా వర్ణింపబడినది. ఐతే జ్ఞానమంటే ఏమిటి? మనము తెలిసి కొనవలసియున్నది. ఒకప్పుడు నారదమహర్షి శ్రీ సనత్కుమారుని సన్నిధికేగి, జ్ఞానోపదేశము చేయుమని కోరెను. "మొదట నీకేమి తెలియునో, దానిని నాకు చెప్పుమని శ్రీ సనత్కుమారుడడిగెను. దానికి సమాధానముగా నారదుడు" నాకు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము, వ్యాకరణము, గణితము, న్యాయము, తర్కము, రాజనీతి, జ్యోతిషము ఇత్యాది కళలన్నియును తెలియునని సమాధానమొసంగెను. అప్పుడు శ్రీ సనత్కుమారుడు "నీవు నేర్చిన దంతయును నామమాత్రమ"ని పలికెను. త్రిలోకసంచారియైన శ్రీ నారదమహర్షియే పూర్ణజ్ఞానము, లేక నిజమైన జ్ఞానమును కలిగిలేకుండెనని దీనిభావము ఇక మనబోటివారము గణనకు రాగలమా? కావున మనమందఱమున్నూ పశుప్రాయ జీవితమును గడుపుచున్నామని చెప్పినచో దోషములేదు. ఐతే ఈ మార్గమునుండి మరలుటకు మార్గము లేదా? ఉన్నది. ఐతే ఆ మార్గము ననుసరించుటకు మనము దృఢనిశ్చయులము కావలసియున్నది. అనగా:- శ్రీ నారదుని వంటి మహామేధా సంపన్నులమై యున్నను, అదియంతయు నిష్ప్రయోజనమను విషయము మనము తెలిసికొనవలసి యున్నది. ఆధ్యాత్మిక మార్గముననుసరించుటకు స్వార్థపరత్వము ను

వీడవలసియున్నది. ఆ మార్గము ననుసరించుటకు మన అహంకారమును జ్ఞానాగ్ని యందు ఆహుతి యొనర్పవలసియున్నది. ఆ మార్గము ననుసరించుటకు మనోనాశము నొనర్పవలసియున్నది. ఆ మార్గము ననుసరించుటకు ఆత్మావలోకనము నొనర్పవలసి యున్నది.

మనమందఱమున్నూ దేహమును పోషించుటకై ప్రతిరోజు ఆహారమును భుజించుచుందుము. ఎంత భుజించినను, మనకు మరల మరల ఆకలివేయుచుండును. మనమే ఆహారమును భుజించినచో మరల మరల ఆకలివేయదో, అట్టి ఆహారమును మనము భుజింపవలసియున్నది. అట్టి ఆహారమును సేవించుటచే ఆత్మతృప్తి కలుగును. మనము ప్రతిరోజు పడకపై నిద్రించుచుందుము. ఏ ప్రకారముగా నిద్రించినచో, మనమీ భౌతిక ప్రపంచమనెడి జాగ్రదవస్థకు తిరిగి రాకుందుమో అట్టి నిద్రలోనికి మనము ప్రవేశింపవలసియున్నది. దీనిని మరణమనుకొనరాదు. అది 'నిర్వికల్ప సమాధి' యని చెప్పబడును. మనము మన అధికారులను, దుష్టులను, క్రూరజంతువులను చూచి భయపడుచుందుము. ఏ జ్ఞానము కలిగినచో మనము మరొకరికి భయపడవలసిన అవసరముండదో అదియే! నిజమైన జ్ఞానమని చెప్పబడును. వివాహమైన ప్రతి స్త్రీ-పురుషుడున్నూ సంతానమును కనుటకు ఉబలాట పడుచుందురు. ఏ సంతానమును పొందినచో పుత్రవ్యామోహము నశించునో, అట్టి సంతానము 'ఆత్మజ్ఞానమ'ని చెప్పబడును. 'నేనెవరు?' అను విషయమును తెలుసుకొని, దానిని అనుభవమునకు తెచ్చుకొనుటయే! ఆత్మజ్ఞానమనబడును. ఆధునిక మానవుడు కేవలము ధనార్జనయే! ఆత్మజ్ఞానమునకు పునాదియనుకొను చున్నాడు. 'యస్యాస్తి విత్తం సనరః కులీనః, స పండితః, స సర్వజ్ఞః' యను స్థితికి వచ్చినది నేటి ప్రపంచము. కీర్తిప్రతిష్ఠలను బడయుటయే! ఆత్మజ్ఞాన శిఖరము నందుకొనుటయని భ్రమించుచున్నాడు, నేటి మానవుడు. గొప్ప వదవి నొందుటచే గొప్ప జ్ఞాని నగుదునని తప్పుటభిప్రాయమును కలిగియున్నాడు. నిజమైన ఆత్మజ్ఞాని దేహాభిమానమును దహించివేయును. అహంకారమనెడి రాక్షసుని జ్ఞానఖడ్గము చే ఖండించివేయును. ఆత్మజ్ఞాని మనస్సనెడి మర్కటమును తన వశమొనర్చుకొని, ఆ మనస్సును జ్ఞానజ్యోతి సహాయముచే పరమాత్మయందు లయింపజేసి, పరమానందము నొందును. మనస్సును బహిర్ముఖమొనర్చినప్పుడది బంధనమునకు కారణమగును. మనస్సును అంతర్ముఖ మొనర్చినప్పుడది ఆత్మజ్ఞానమునకు కారణమగును. ఈ కారణముచేతనే 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని చెప్పబడినది.

ప్రాపంచిక విషయ వ్యామోహమనెడి మేఘములచే మన జ్ఞాననేత్రము కప్పబడియున్నది. కావున అజ్ఞానావరణచే మనము బంధింపబడి యున్నాము. ఈ అజ్ఞానావరణ తొలగుటకై జ్ఞానభాస్కరుడు ఉదయించుటకై జ్ఞానస్వరూపుడైన గురుదేవుని దరిజేరవలసి యుండును. 14 కళలతో భూలోకమునందవతరించిన శ్రీరామచంద్రుడు స్వయముగా శ్రీ వసిష్ఠమునిచే బ్రహ్మోపదేశమునొందెను. షోడశ కళాప్రపూర్ణుడై ఈ భూలోకమునందవతరించిన శ్రీకృష్ణుడు స్వయముగా సాందీప మునిచే ఉపదేశింపబడెను. ఇక అతి సామాన్యులమైన మనము గురూపదేశము అవసరము లేదని చెప్పుట తగునా? ఈ ప్రపంచోత్పత్తికి కారణమేమి? జీవుని అజ్ఞానమునకు కారణమేమి? ఆజ్ఞానాంధకారము తొలగిపోవుట ఎట్లు? మున్నగు ప్రశ్నలకు సమాధానము లభించి, హృదయము పరిశుద్ధమై సర్వత్రా సర్వకాలములలో ఆ సర్వేశ్వరుని దర్శింపగలిగినప్పుడు మాత్రమే! గురువు అవసరము లేదని చెప్పవచ్చును.

శ్రీకృష్ణుడు రణరంగమునందు అర్జునునికి ఉపదేశించిన ఉపనిషత్సారమే ఈ భగవద్గీత. ఇదియే! బ్రహ్మవిద్య. ఇదియే! యోగశాస్త్రము. గీతాసారమును గ్రహించినవాడు జ్ఞానసాగరమునందు ప్రవేశింపగలుగును. జ్ఞానసాగరమునందు ప్రవేశించుటయే! ఆనందసాగరమునందు ప్రవేశించుట. ఈ ఆనందసాగరమునందు ప్రవేశించి, జనన-మరణ రాహిత్యమునొందుటయే! మానవజీవిత లక్ష్యము. "ప్రణవో ధనుః శరో హ్యాత్మా బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే" యని ముండకోపనిషత్తు నుడువుచున్నది. అనగా:- ఓంకారమనెడి ధనస్సు యొక్క సహాయముచే జీవాత్మయనెడి బాణము పరబ్రహ్మమనెడి లక్ష్యమును చేఱుకొనవలయునని దీని భావము. సాధకుడు ఏకసంధాగ్రాహి యైనప్పుడే! ఇది సాధ్యమగును. కావున జ్ఞానధనమును వెచ్చించి తన జీవితలక్ష్యమును సాధించువాడే! నిజమైన మానవుడని చెప్పబడును. కేవలము ఆహార-నిద్రా-భయ-మైధునాదులచే జీవితమును వ్యర్థమొనర్చుకొను మనుజుడు పశుప్రాయుడని వేఱుగా చెప్పవలయునా?

## 66. రాష్ట్రీయ ఐక్యత

మట్టియొక్క భూభాగము రాష్ట్రమని చెప్పబడదు. రాష్ట్రముయొక్క సమస్త ప్రాణి సమూహమే రాష్ట్రమనిచెప్పబడును. స్త్రీ పురుషులందఱు మఱియు సమస్త జీవ జంతువులకు తమ ప్రాణము ప్రియముగా నుండును. ప్రాణము పరమాత్ముడొసంగిన వస్తువు. కావున ప్రతి ప్రాణిని రక్షించుట మనకర్తవ్యమగును. పరస్పర ప్రేమ భావముచే ఈ కార్యము సాధ్యమగును.

మన శరీరములోని సమస్త అవయవములు మన ప్రాణమును రక్షించును. ఒక గృహములోని సభ్యులందరును కలిసి గృహమును రక్షింతురు. అదే విధముగా గ్రామ వాసులందరును కలిసి గ్రామమును రక్షింపవలయును. ఈ కార్యము కేవలము ఐక్యతచే సిద్ధించును. ఐక్యతఅనగానేమి? ఒక దేశము మరొక దేశముతో కలియుట ఐక్యత అనబడదు. ఏలననగా:- ఆ ఐక్యత నిలువజాలదు. ఎప్పుడో ఒకప్పుడు అవశ్యముగా విడివడుట జరుగును. ఒక మనస్సు మరొక మనస్సుతో కలియుట కూడా ఐక్యత అనబడదు. మనస్సు ఎల్లప్పుడు మార్పునొందుచుండును. అస్తిత్వము యొక్క స్వరూపమే! మనస్సు. కావున, ఒక మనస్సు మరొక మనస్సుతో ఘర్షణ యొనర్చుచుండును.

ఇక బుద్ధి శక్తిని గూర్చి ఆలోచింతము. భగవంతుని సంకల్పము ఎదుట మన బుద్ధిశక్తి ఎందుకును పనికిరానిదైయుండును. ఒక బుద్ధికి మరొక బుద్ధికి మధ్య రాపిడి జరుగుచుండును. ఈ కారణముచే బుద్ధిబలముచేత కూడా ఐక్యత అసాధ్యమగును.

కాని ప్రతిప్రాణియొక్క సారవస్తువు ఆత్మయేనైయున్నది. ఆత్మ వల్లనే మన బుద్ధి, మనస్సు మఱియు శరీరము కార్యముల నొనర్చుచుండును. ఆత్మ- మనస్సు, బుద్ధి మరియు ఇంద్రియములకు రాజు వంటిది. రాజు తన ప్రజలను పరిపాలించును. అదేవిధముగా, ఆత్మ యనెడి రాజు సృష్టిలోని సమస్త చరాచరప్రాణులను పాలించును. ఈ రహస్యమును తెలిసికొనుటయే! ఆత్మజ్ఞానమనబడును. ఆత్మజ్ఞానమువలన అప్రయత్నముగా సమస్తప్రాణులు రక్షింపబడుదురు. ఏ విధముగా గృహయజమానిని చూచిన వెంటనే సమస్త దాస-దాసీజనులు తమతమ కార్యములలో నియుక్తులగుదురో, అదే విధముగా ఆత్మను తెలిసికొన్నంత మాత్రముచే సమస్తప్రాణులు ఏకసూత్రము నందు బంధింపబడుదురు. ఇదియే! ఐక్యతయొక్క రహస్యము.

ఒక దేశమును మరొక దేశమునకు భిన్నమైనదిగా తలంచుట అజ్ఞానమే! యగును. భిన్నత్వము ఆత్మజ్ఞాన విహీనుని లక్షణము. మన దేశమునందైక్యతను స్థాపించుటకై ఇతరదేశములను, రాష్ట్రములను ప్రేమించుట ఆవశ్యకమగును. ద్వేషభావము అజ్ఞానము కలవారి లక్షణము. ఆత్మజ్ఞాన విహీనులే! ద్వేషభావమును కలిగియుందురు.

తన శత్రువును కూడా ప్రేమించుట ధర్మలక్షణమగును. శత్రువునందు కూడా ఆత్మ విరాజిల్లియున్నది కదా! మనుజుడెప్పుడైతే తన శత్రువును కూడా

ప్రేమించుట నేర్చుకొనునో, అప్పుడా శత్రువు తనకు మిత్రుడగును. మిత్రుని రూపమునందు శత్రువుగా జీవించుట అధమత్వము మఱియు మూర్ఖత్వమగును. భిన్నత్వము శత్రుభావమునకు కారణమగును.

ఆత్మజ్ఞాని ఒక ఎలుగుబంటులో కూడా భగవంతుని దర్శించును. అహింసావ్రతము నవలంబించు వారినుండి క్రూరజంతువులు దూరముగా పారిపోవును. లేక, సమీపమునందున్నను హానిని కలిగింపవు. ధార్మికజీవనము ననుసరించువారి లక్షణము ఈ ప్రకారముగా ఉండును.

అందఱికి దేవుడొక్కడే! కొందరు రాధారాణిని కృష్ణభగవానుని కంటెను శ్రేష్ఠమని భావింతురు. ఇది వారి భక్తియొక్క పరాకాష్ఠను సూచించును. కాని రాధారాణిని శ్రీకృష్ణభగవానునియందు చూడకుండుట, శ్రీరామచంద్రునియందు చూడకుండుట, శ్రీ శివునియందు చూడకుండుట, జీసస్ ప్రభువునందు చూడకుండుట, అల్లాయందు చూడకుండుటచే అట్టి పరాకాష్ఠ కుంటుపడిపోవును.

మీరు అల్లాయందు విశ్వాసమును కలిగియుండుడు. కాని అల్లాను సమస్త ప్రాణులలో సమస్త దేశములలో, సమస్త దేవతలలో దర్శించుడు. మీరు జీసస్ ప్రభువును విశ్వసించుడు. కాని జీసస్ ప్రభువును సమస్తప్రాణులలో సమస్తదేశములలో సమస్త దేవతలలోను దర్శింపుడు. మీరు శ్రీరామభక్తులై యుండుడు. కాని, రాములవారిని సమస్త ప్రాణులలో, సమస్త దేశములలో, సమస్త దేవతలలో దర్శింపుడు. మీరు శివభక్తులై యుండుడు. కాని శివుని సమస్త ప్రాణులలో, సమస్త దేశములలో, సమస్త దేవతలలో దర్శించుడు. మీరు శ్రీకృష్ణభక్తులై యుండుడు. కాని సమస్త ప్రాణులలో, సమస్త దేశములలో, సమస్త దేవతలలో శ్రీకృష్ణుని దర్శింపుడు. మీరు పరాశక్తిని ఉపాసింపుడు. కాని పరాశక్తిని సమస్త ప్రాణులలో, సమస్త దేశములలో, సమస్త దేవతలలో దర్శింపుడు. ఇదియే! ఆధ్యాత్మిక జీవన సారము. ఇదియే! దివ్యజీవన కీలకము. ఇదియే! సత్యధర్మ సమభావ పర్యవసానము. ఇదియే! సర్వధర్మ సమభావ పర్యవసానము. ఇదియే! సాంప్రదాయిక సౌహార్ద్ర రహస్యము. ఇదియే! జీవన్ముక్త పురుషుని లక్షణము. ఇదియే! ఆత్మసాక్షాత్కార లక్ష్యము. ఇదియే! విశ్వశాంతికి భూమిక. ఇదియే! విశ్వప్రేమ యొక్క భావార్థము. ఇదియే! విశ్వపురుష సాక్షాత్కారము, మఱియు ఇదియే! రాష్ట్రీయ ఐక్యతకు తాళపుచెవియైయున్నది.

# 67. భగవద్గీత - కర్మ, భక్తి, మోక్ష సన్న్యాస యోగములు.

శ్రీమద్భగవద్గీతలోని 18 అధ్యాయములను కర్మ–భక్తి–జ్ఞానయోగములను పేర్లతో షట్కత్రయముగా విభజింపవచ్చును. అనగా మొదటి ఆరు అధ్యాయములును కర్మయోగమును ప్రతిపాదించును. తర్వాతి ఆరు అధ్యాయములు భక్తియోగమును ప్రతిపాదించును. చివరి ఆరు అధ్యాయములు జ్ఞానయోగమును ప్రతిపాదించును. "జ్ఞానాదేవహి కైవల్యమ్" –అనగా జ్ఞానము ద్వారా కైవల్యమోక్షమును పొందుటయే ఈ 18 అధ్యాయముల యొక్క సారము.

కర్మయోగము దేహమునకు సంబంధించినది. ఏ కర్మచేయుటచే భగవత్ ప్రాప్తి కలుగునో, ఆ కర్మను చేయుటయే! కర్మయోగమనబడును. లేక, ఏది భగవత్సంకల్పమో, అట్టి కర్మను చేయుటయే కర్మయోగమనబడును. యుద్ధారంభము నందు అర్జునుడు "నేను, నాది, నా వారు" అను మమకారముచే యుద్ధము చేయుటకు నిరాకరించెను. ఇది కర్మభీరువు యొక్క లక్షణము. ఇక, భగవత్సంకల్పమును నెఱవేర్చుటయే! కర్మధీరుని లక్షణము. 'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః' అనునది భగవద్వాక్యము. అర్జునుడు క్షత్రియుడయ్యు తన స్వధర్మమును కాలదన్నిన వాడై "ఏతాన్నహంతు మిచ్ఛామి ఘ్నతో–పి మధుసూదన" అని పలికెను. కర్మచ్యుతుడైన అర్జునుని అచ్యుతుడు మందలించి, అర్జునుని మందబుద్ధిని పోగొట్టి , రణరంగమునందు ముందడుగు వేయించెను. కావున మనమొనర్చు కర్మలన్నియును భగవదిచ్ఛానుసారమై యుండవలయును. మన జీవితమునందు మనమే కర్మ యొనర్చినను దాని ఫలితమును దేవుని కర్పించవలయును. అప్పుడు మనము కర్మబంధమునందు తగుల్కొనజాలము. మనమే కర్మ యొనర్చినను "నేను చేయుచున్నాన"ను భావము రాకూడదు. అప్పుడా కర్మ కర్మయోగముగా మారును. మనమొనర్చు కర్మపరంపరలన్నియును ఆ దేవదేవుని పరమానందధామమును చేరుటకు సోపానములగును. అప్పుడు గంగానది గంగాసాగరమును చేరునట్లు మన జీవితగంగ బ్రహ్మానందసాగరము చేఱుకొనును.

ఇక భక్తిషట్కము రెండవ భూమికయైయున్నది. దైవోన్ముఖుడై కర్మయొనర్చు వాడు భగవద్భక్తిని కలిగియుండక తప్పదు. అందువల్లనే అర్జునుడు "శిష్యస్తే–హం శాధిమాం త్వాం ప్రపన్నమ్" అని శ్రీకృష్ణభగవానునితో పలికెను. భగవద్భక్తిని

కలిగియున్నవాడు ధర్మనిష్ఠాగరిష్ఠుడును, ధ్యాననిష్ఠాగరిష్ఠుడును, బ్రహ్మనిష్ఠాగరిష్ఠుడునైయున్న గురువును చేపట్టి శిష్యరికము నొనర్చవలయును. అనగా:- గురు ప్రబోధానుసారముగా వర్తింపవలయును. గురువుగాని, శిష్యుడుగాని ధనమును ప్రోగుచేయు లక్ష్యమును కలిగియుండరాదు. "మన్మనాభవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు" అని భగవానుడు స్వయముగా అర్జునునితో పలికెను. మన భారతదేశము ఉద్ధరింపబడుటకై భారతీయులందఱును గురుశిష్యపరంపరలను కలిగియుండ వలయును. "అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ। నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ" యని శ్రీకృష్ణపరమాత్మ 12వ అధ్యాయములోని 13వ శ్లోకమునందు నుడివెను. కావున నిజమైన భక్తుడు ఏ ప్రాణిని కూడా ద్వేషింప జాలడు. అట్టివాడు అందఱితో మైత్రిని కలిగియుండును. అందఱియందు కరుణ కలవాడై యుండును. అట్టివాడు నిరహంకారియై 'నేను-నాది' అను భావము లేనివాడై యుండును. తన జీవితమునందు సుఖము వచ్చినను, దుఃఖము వచ్చినను, 'ఇది నా స్వయంకృత కర్మ ఫలితమే!' యని భావించి, సంతుష్టిని కలిగియుండును. నిజమైన భక్తుడు తన మనస్సును, బుద్ధిని భగవంతునికర్పించి జీవించును. నిజమైన భక్తుడు లోకమునకు భయంకరుడైయుండడు. మఱియు లోకమునకాతడు భయపడడు. నిజమైన భక్తుడు శత్రుమిత్రులయందు సమానమైన భావమును కలిగియుండును. నిజమైన భక్తుడు లోకులాతనిని స్తుతించినచో పొంగిపోడు; నిందించినచో క్రుంగిపోడు. నిజమైన భక్తుడు అనికేతనుడైయుండును. అనగా:- ఆతనికి స్వంత గృహముండదు. కారణమేమి? విశ్వమంతయు ఆతనికి గృహమై యుండును. "అయం నిజః పరోవేత్తి గణనా లఘు చేతసాం ఉదార చరితానాం వసుధైవ కుటుంబకం" అనగా:- ఇతడు నావాడు. ఆతడు పరాయివాడు అనెడి భావమాతనికి ఉండదు.

ఇక జ్ఞానషట్కములోని చివరి అధ్యాయము మోక్షసన్న్యాసయోగము. మోక్షమును కూడా సన్న్యసించుట మోక్షసన్న్యాసయోగమని కొందరు పలుకుచుందురు. అట్టి అర్థము అనర్థ హేతువగును. అట్టి వారికి జీవితలక్ష్యము మోక్షమే! అను విషయము తెలియదు. మోక్షముపొందిన తర్వాత మోక్షకాంక్ష స్వయముగా వీడి పోవును. కాని మోక్షము నొందునంతవరకు ప్రతి ఆధ్యాత్మిక సాధకుడు మోక్షకాంక్షను కలిగియుండవలయును. ఈ మోక్షకాంక్షలేని వాడు శ్రీ కృష్ణజన్మ స్థానమునకేగ వలసియుండును. మోక్షకాంక్షలేని వారు రాజకీయనాయకులకు బానిసలై మెలగవలసియుండును. మోక్షకాంక్ష కలిగియున్న మనుజుని అష్టలక్ష్మిమాతలు

అనవతరము సేవించుచుందురు. ఐనను ముముక్షువు తన జీవితలక్ష్యమును మరువక ముందడిగిడుచుండును. "మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ" యని శ్రీకృష్ణపరమాత్ముని వాక్యానుసారముగా ముముక్షువు ఈ ప్రపంచమును "సర్వం విష్ణుమయం జగత్" గా వీక్షించుచుండును. ఆతడేలాటి దారుణమైన క్రియలనొనర్ప కుండును. ఆతడు "ఆత్మవత్సర్వ భూతాని" సకల పదార్థముల యందాతడు స్వయముగా తనను వీక్షించుచుండును. "మయ్యేవ మన ఆథత్స్వ మయి బుద్ధిం నివేశయ, నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః" అని శ్రీకృష్ణుడు పలికెను. కావున మనస్సును మాధవుని యందు లయింప జేయుటయే! ముముక్షువుల కర్తవ్యమై యున్నది. ముముక్షువులు తమ బుద్ధులను పరిశుద్ధమొనర్చుకొని వాటిని పరమాత్ముని కర్పింపవలసి యుండును. అట్టివానికి అడుగడుగునందును బ్రహ్మానుభవము కలుగుచుండును. అట్టివాడు ఆనందోత్సాహములతో ముందడుగు వేయుచుండును. అట్టివాడు "ఆనందోహం – ఆనందోహం, ఆనందం బ్రహ్మానందం" అని పాడుచు నృత్యమొనర్చు చుండును. అట్టివాని అంతఃకరణము నందు అతఃకలహము లుండవు. "నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే" అనునది భగవద్వాక్యము. సాధకుడు అసంగమనెడి శస్త్రముచే అజ్ఞానమనెడి వృక్షమును ఛేదింపవలసియుండును. అప్పుడాతనికి జ్ఞానమనెడి కల్పవృక్షము లభించును. దానిచే సమస్త కోరికలు నెరవేరును. కావున ఆతనికి కోరవలసిన దేమియుఉండదు. మరియొక కోరికకు ఆస్కారము లేనిస్థితియే మోక్షమని చెప్పబడును. ఇట్టి మోక్షమునొందు ప్రయత్నమునందు మానవుడు నిరంతరము క్రియాశీలుడై యుండునుగాక! జీవితలక్ష్యము మోక్షమే! అను విషయము నాతడు మరువకుండునుగాక!

## 68. నిష్కామ సేవా సారము

మనమేకార్య మొనర్చినను, దాని ఫలితము అవశ్యముగా లభించును. ఆ కర్మఫలమును అర్పించుటయే! 'నిష్కామసేవ', లేక 'కర్మయోగమ'ని చెప్పబడును. శ్రీమద్భగవద్గీత యొక్క తృతీయాధ్యాయములోని నాల్గవ శ్లోకమిట్లు కలదు:

"న కర్మణా సమారమ్భా న్నైష్కర్మ్యం పురుషో–శ్నుతే ।
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥"

కర్మను ప్రారంభింపకుండుట నిష్కామసేవయని చెప్పబడదు. ఏలననగా:– ప్రతి ప్రాణియును కర్మచేయుట కొఱకే ఈ పృథ్వియందు జన్మించును. కావున కర్మను

సన్న్యసించుటచే అది కర్మయోగము కాజాలదు. కేవలము కర్మఫలమును త్యజించినప్పుడే, అది కర్మయోగమని చెప్పబడును.

కర్మఫలమును త్యజించుటకై అహంకారమును త్యజించుట అనివార్యము. ఇక అహంకారమును త్యజించుటకై భక్తిభావసంపన్నతయు ఆవశ్యకమగును. భక్తిభావము ప్రస్ఫుటమగుటకై భగవద్భజన, కీర్తన, సంకీర్తనలు దోహదమొసంగును. కేవలము ఒకే దేవునిపై భక్తిభావమును కలిగియుండుట ఉచితమగును. అనేకత్వము నందేకత్వము ను దర్శించుటయే! నిజమైన భక్తియని చెప్పబడును. మనస్సు స్వాభావికముగా జగత్తులోని వివిధ పదార్థములను చూడగోరును. అనేక పదార్థములయందొకే పదార్థమును దర్శించుట జ్ఞానమార్గమని చెప్పబడును. పరాభక్తియందును, జ్ఞాననిష్ఠయందును ఏమాత్రము భేదము లేదు.

జీవితములోని సమస్త కర్మఫలములను భగవంతునికి సమర్పించుటకై శరీరాభి మానమును త్యజించుట ఆవశ్యకమగును. ఈ దేహమును మనకు భగవంతుడొసంగి యున్నాడు. అట్టి ఎడల, ఈ దేహము మనది ఎట్లగును? కావున దేహాభిమానమును అవశ్యముగా త్యజింపవలయును.

మనస్సు నానారకములగు సంకల్పముల నొనర్చుచుండును. భగవంతుని యందు మనస్సును నిమగ్నమొనర్చుట సత్యసంకల్పమని చెప్పబడును. ఇక ప్రపంచమునందు మనస్సు నుంచుట దుస్సంకల్పమగును. ఏలననగా:- మనస్సు కూడా మనకు భగవంతు డొసంగినదే! కావున మన దేహము మఱియు మనస్సులను మనము భగవంతుని కొఱకై వినియోగింపవలసియుండును.

మన బుద్ధి ఏదైన కార్యమునొనర్చుటను, లేక ఒనర్పకుండుటను నిశ్చయించును. ఏ కార్యమునైనను కేవలము భగవంతునికొఱకే ఒనర్చుట ఉచిత మగును, కాని మన కొఱకు ఒనర్చుట ఉచితము కాదు. కావున మన దేహమును మనస్సును మఱియు బుద్ధిని భగవంతుని కొఱకే వినియోగించుట “నిష్కామ సేవ” యనబడును.

భగవంతునిచే ఒసంగబడిన వస్తువును భగవంతుని కొరకే వినియోగించుట ధార్మిక మార్గమగును. ఇదియే! సత్యసంధుడగు సాధుజీవనమనబడును.

“తృణాదపి సునీచేన తరోరివ సహిష్ణునా ।
అమానినా మానదేన కీర్తనీయః సదా హరిః ॥”

అని శ్రీ చైతన్యమహాప్రభువు పలికిరి. నిజమైన భక్తుడు తన్నుతాను ఒక గడ్డిపోచ కంటెను నీచముగా తలంచును. ఆతడొక వృక్షము కంటెను మిక్కిలి సహనశీలుడై యుండును. ఆతడు ఇతరులకు గౌరవమర్యాద లొసంగుచు, తాను సన్మానింపబడుటకు కోరిక లేనివాడై యుండును. అన్ని వేళలయందాతడు హరిభజన యందే తల్లీనుడై యుండును.

## 69. బాలభగవానుడు

నవవిధ భక్తులలోని "వాత్సల్యభావము"ను కలిగియుండువారు బాలభగవానుని ఉపాసింతురు. సాధారణముగా భక్తులు శ్రీరాముని, లేక శ్రీకృష్ణుని బాలరూపమునందు ఉపాసింతురు. స్త్రీలకు ఇది సులభసాధ్యమైన ఉపాసన. సంతానము కలవారు తమ పిల్లలనే బాలభగవానుడుగా భావించి, ఉపాసన చేయవలయును. నిజమునకు పిల్లలందఱును భగవత్ప్రసాదితములే! కావున భగవంతుని బిడ్డలను మిక్కిలి ప్రేమతో చూడవలయును. వారిపై కోపగించుకొనరాదు. వారి మధురమైన మాటలను విని, మనము కూడా మధురముగా మాట్లాడవలయును. వారిని అందమైన వస్త్రములతో అలంకరింపవలయును. అనేక రకములుగా అలంకరింపవలయును. వారికి ఆహార పానీయముల నొసంగున్పుడు ఆ భగవంతునికే ఆహారపానీయముల నొసంగుచున్నట్లు తలంపవలయును. పిల్లలను కొట్టుట, తిట్టుట, వేధించుటలను చేయకూడదు. ఒకవేళ కొట్టుట, తిట్టుట, వేధించుట యొక్క ఆవశ్యకత కలిగినచో తనను తాను యశోదాదేవిగా భావించుకొనవలయును.

పిల్లల హృదయము మిక్కిలి కోమలముగా ఉండును. కావున పిల్లలకు మృదువైన పదార్థములనే ఒసంగవలయును. పాలు, పాయసము వంటి పదార్థముల నొసంగవలయును. వెన్న, జున్ను వంటి పదార్థములను తినిపించవలయును. మరియు గులాబీపుష్పములవంటి కోమలమైన పదార్థములను దర్శింపజేయవలయును.

పిల్లలు అనుకరణమొనర్చు స్వభావమును కలిగియుందురు. కావున సినిమా దృశ్యములను మఱియు దూరదర్శనములోని అశ్లీల దృశ్యములను పిల్లలకు చూపరాదు.

ఇప్పుడు సంతానము లేని స్త్రీల విషయమై చర్చించెదము. వారు బాలరాముడు, లేక బాలకృష్ణుని పటమును మందిరమునందుంచి, పూజింపవలయును. వారు బాల రాముడు, లేక బాలకృష్ణునే తమ పుత్రునిగా భావింపవలయును. ఇతరుల పిల్లలను తన పిల్లలుగా భావించి ప్రేమింపవలయును. పిల్లలందరియందును భగవంతుని దర్శించు చుండవలయును.

కొందఱు క్రోధావేశముచే ఏడ్చుచున్న పిల్లలను ఒకే చేతితో ఎత్తి చంకన పెట్టుకొందురు. అట్లు చేయరాదు. ఏలననగా:- పిల్లల అంగములు కోమలములై యుండును. ఒకే చేతితో పైకెత్తినచో పిల్లల అంగములు అస్తవ్యస్తములగును, మఱియు భవిష్యత్తునందు కూడా హానికారకములగును. క్రోధము యొక్క ప్రభావము శరీరముపైననే కాకుండా పిల్లల మనస్సుపై కూడా పడును. కావున పిల్లలను అత్యంత జాగరూకతతో పోషించుచుండవలయును. పిల్లలను పోషించుట వారి మనస్సులను సురక్షితములుగా నొనర్చుట ఒక అలౌకికమైన కళ. ఆధునికకాలములోని అత్యధిక స్త్రీలు పెద్ద పెద్ద ఉద్యోగములను చేయుచు తమ్ముతాము ధన్యులుగా తలపోయు చుందురు. కాని ఇది సత్యము గాదు. ఇట్లొర్చుటచే పిల్లలు చెడిపోవుదురు. మఱియు తమ తల్లిదండ్రుల ప్రేమకు నోచుకొనజాలరు. కావున గృహిణులు తమ గృహమునందే ఉండి పిల్లలను రమ్యముగాను, దివ్యముగాను తీర్చిదిద్దు చుండవలయును. ఇట్లొనర్చుటచే పిల్లల భవిష్యత్తు స్వర్గసదృశముగా సుయశోవిశాల మగును. ఇదియే! వారి ప్రథమమైన పరమకర్తవ్యమైయున్నది. భారతమాత యొక్క ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఆధునిక బాలబాలికలపై ఆధారపడియున్నది. పిల్లలసేవ భగవంతుని సేవయే యగును. పిల్లలకు తల్లియే ప్రథమ గురువు. తల్లుల స్తనములనుండి బయల్వెడలు పాలు మిక్కిలి శక్తిశాలియై, పుష్టికరమైయుండును. ఈ పాలనుండియే స్వామి వివేకానంద, స్వామి రామతీర్థ, స్వామి దయానంద, స్వామి శివానంద వంటి వరిష్ఠ సన్న్యాసులు ప్రభవిల్లిరి. ఈ పాల నుండియే మీరాబాయి, మాఁ ఆనందమాయి, ఇందిరాగాంధి వంటి మహాతల్లుల నిర్మాణము జరిగెను. ఈ పాలనుండియే రమణమహర్షి, శ్రీ అరవిందఘోష్, శ్రీగురునానక్ దేవ్ వంటి మహానుభావులు ప్రాదుర్భవించిరి. ఈ కారణమువల్ల పిల్లలకు స్తనపానమే ఒనర్పవలయును. కాని బజారునుండి కొని తెచ్చిన పాలను వాడరాదు.

బాలభగవంతుని తను-మన-ధనములతో సేవింపవలయును. ఒకవేళ బాలుడెప్పుడైనను అస్వస్థుడగునేని, తల్లి తన ఆహార నియమములను పాటించినచో, ఆ బాలుడు స్వస్థుడగును. కేవలము అనివార్యపరిస్థితులలో బాలుని డాక్టరు వద్దకి తీసుకొని వెళ్ళవలయును. వాత్సల్యభక్తియందు ప్రేమ పరాకాష్ఠ నొందును. ఆ సమయము నందు తల్లి మఱియు బాలభగవానుని హృదయము ఏకమగును. మాతాశిశువులలో అవినాభావ సంబంధముండును. కావున వారు పరస్పరము విడదీయరానివారై యుందురు. ప్రభుత్వోద్యోగము చేయు మహిళలు ఉదయము ఇల్లు విడిచి, సాయంకాలము తిరిగి ఇల్లు చేరుకొందురు. ఈ మధ్యకాలములో బాలుడుగాని,

బాలికగాని దాదియొక్క చేతులలో పోషింపబడుచుండును. ఈ కారణముచే ఆ దాదియొక్క సంస్కారములు పిల్లలపై పడును. దాదియందు కూడా నిస్స్వార్థసేవాభావ ముండవలయును. దానిచే ఆమె పిల్లలలో భగవంతుని దర్శింపగలుగును.

ఒకవేళ ఆధ్యాత్మిక సాధకులు, ముముక్షువులు, జిజ్ఞాసువులు, భక్తులు వాత్సల్య భావము ద్వారా భగవంతుని పొంద దలంచినచో వారు బాలభగవానుని ఉ పాసింపవలసియుండును. పిల్లలను తమ సర్వస్వముగా భావింపవలసియుండును. దీని ద్వారా గృహము ఉద్ధరింపబడును. సమాజము వికాసమునొందును. దేశము కీర్తిప్రతిష్ఠల నందుకొనును. మరియు, చివరకు నిశ్చయముగా ఆత్మోద్ధారము కలుగును. బాలభగవానుడు మనందఱిని రక్షించును గాక!

(శ్రీ గోపాల సంకీర్తన మండలి 17వ వార్షికోత్సవ సంచిక నుండి సేకరణ)

## 70. (అ) నా యూరప్ ఖండ పర్యటన

(ఇటీవల 'శ్రీ శివానందవాణి  పత్రిక సంపాదకులైన పూజ్యశ్రీ హంసానంద స్వాములవారు యూరపు దేశ పర్యటనచేయుట మన 'శ్రీశివానందవాణి' పాఠకులందరికి తెలిసినదే! పర్యటనలోని కొన్ని విశేష విషయాలను వారినుండి సంగ్రహించి, విదేశ విషయాలమీద ఆసక్తిగల పాఠక మహాశయులకు అందించగలిగినందులకు సంతోషిస్తున్నాను. - యు.నారాయణరావు

విదేశములకేగుట వివేకవంతుల లక్షణముకాదని కొందఱి అభిప్రాయము. కారణమేమనగా:- ఏ దేశమేగినా, ఎందు కాలిడినా పంచభూతములకు మించిన మరియొక పదార్థము కానరాదు. అయినను అప్రయత్నముగా లభించిన ఒక అవకావమును జారవిడుచుకొనుట కూడా ఒక విధమగు అహంకారమేయగును. ఈ కారణముచే జర్మనీ(Germany) దేశవాసియగు శ్రీ వుల్ఫ్ గ్యాంగ్‌సేట్జ్ (Sri Wolf Gang Seitg) గారి సంకల్పమునకు తలవంచితిని. ఆ వంచిన తలపై గురుదేవ్ శ్రీ చిదానందస్వాములవారి, గురుదేవ్ శ్రీ కృష్ణానందస్వాములవారి, పూజ్యశ్రీ మాధవానంద స్వాములవారి, పూజ్యశ్రీ దేవానందస్వాములవారి, పూజ్యశ్రీ అసంగానంద స్వాములవారి ఆశీస్సులు కుంభవృష్టివలె కురిసెను. ఈ కారణముచే కంచి కామకోటి యతీశ్వరుల శతజయంత్యుత్సవము (7వ మే, 1993) రోజు నాకు పాస్‌పోర్టు (pass port)లభించెను. ఇక గురుపూర్ణిమ (3వ జూలై, 1993) రోజు

వీసా (visa) లభించెను. ఇక నా ప్రయాణము సుగమము కాక ఎట్లు మానును?

5-8-'93వ తేదీ గురువారం రోజు శ్రీగురుదేవ్ కుటీరమునందు పూజ్యశ్రీ దేవానందస్వాములవారు నాకు వీడ్కోలు సభను ఏర్పాటు చేసిరి. అందరి ఆశీస్సుల నందుకొని, ఢిల్లీ విమానాశ్రయమునకు రాత్రి 10 గంటలకు చేరుకొంటిని. ఢిల్లీలో వివిధ దేశములకు వీసాలను పొందు విషయమునందు పూజ్యశ్రీ నరసింహులుగారు చేసిన సహాయము చిరస్మరణీయము. లుఫ్తాంసా(Lupthansa) విమానము ఢిల్లీనుండి 6-8-93 తేదీన ఉదయం గం. 2-20కి బయలుదేరెను. రాత్రియగుటచే విమానము నుండి బయట చూచుటకేమియు కానబడకుండెను. కాని తెల్లవారుజామున బయటికి దృష్టిని సారించుసరికి మా విమానమొక దూదిపరుపు వంటి మేఘములకు పైభాగమునందు పయనించుచుండుటను గమనించితిని. ఉదయం 6 గంటలకు ప్రపంచమునందు రెండవ ఎయిరుపోర్టు (Airport) గా ప్రఖ్యాతి గాంచిన ఫ్రాంకుఫర్టు (Frankfurt) నందు విమానము దిగెను. అచ్చట విమానము మారి, మ్యుంచెన్ ఎయిర్ పోర్టు (Munchen Airport) లో ఉదయం 8 గం.లకు దిగితిమి. దిగిన వెంటనే బాలభానుని అరుణ కిరణములు కరుణారస పీయూషను వెదజల్లు చుండెను. శ్రీవుల్ఫ్‌గాంగ్ (Sri Wolf Gang) గారు తెచ్చిన కారులో బయలుదేరి, శ్రీపరమహంస యోగానందగారి సెంటరు (Centre) కు వెళ్ళితిమి. దీనిని శ్రీ మనోహర్‌గారు నిర్వహించుచుండిరి. అచ్చట భోజనముచేసి, ప్రార్థన-కీర్తన- ధ్యానాదుల నొనర్చిన పిమ్మట కోచెల్ (Kochel) లోని శ్రీ వుల్ఫ్‌గాంగ్ (Sri Wolf Gang) గారి గృహమున కేగితిని. 7వ తేదీన శ్రీ కవితాదేవిని, 8వ తేదీన శ్రీమతి డోబ్లర్

(Mrs.Dobler) ను ఆమె కుమారుడగు శ్రీ ఆంద్రూ(Sri Andrew) ను చూచుటకై వెళ్ళితిమి. 9వ తేదీన భారతదేశము నుండి వచ్చిన ఉత్తరములన్నింటికి సమాధానములు వ్రాసితిని. 10వ తేదీన శ్రీవుల్ఫ్‌గాంగ్ (Sri Wolf Gang) గారి గృహమునందు శ్రీకృష్ణజన్మాష్టమిని జరుపు కొంటిమి. 11వ తేదీన శ్రీగుంటర్ ఓబర్‌చెమిడ్ (Sri Gunter Oberschmid) ఉండు స్థలమగు బాద్‌సాకింజెన్ (Bad Sackingn) చేరుకొంటిమి. 12వ తేదీన బుద్ధభగవానుని భక్తుడైన ఒక హంగేరీ ( Hungary) దేశస్థుడు వచ్చి తన సందేహమును నివారించుకొనెను. 13వ తేదీన శ్రీహన్నొలోర్ (Sri Hannolore) తోను, శ్రీ గుంటర్ (Sri Gunter) గారి కూతురుతోను మాట్లాడుట జరిగెను. 14వ తేదీన స్విట్జర్లాండు (Switzerland) వెళ్ళి ప్రాకృతిక సౌందర్యమును, రైను (Rhein) నదిని దర్శించితిమి. 15వ తేదీన మసూరీ వలెనున్న శాంతిస్

(Santis) పర్వతము నెక్కితిమి. 16వ తేదీన బాలబాలికలకు ఉపాధ్యాయులొసంగు విద్యావిధానమును గమనించుటకై కిండర్‌గార్టెన్ (Kindergarten) పాఠశాలకేగితిమి. 17వ తేదీన రెయిన్ ఫాల్ (Rheinfall)జలపాతమును దర్శించితిమి. 18వ తేదీన బజారు కేగినపుడు చలించుచున్న ఒక ఫలకముపై నిలబడగా దానికదే పైకి తీసికొనివెళ్ళెను. 19వ తేదీన సత్సంగమునకు వచ్చిన భక్తులు ప్రశ్నలడుగగా వారికి సమాధానముల నొసంగితిని. 20వ తేదీన బుద్ధదేవుని భక్తురాలికి జపమాలతో జపము చేయు విధానము గూర్చి చెప్పుట జరిగెను. 21వ తేదీన స్విట్జర్లాండు (Switzerland) లోని శ్రీనౌబర్టు (Sri Nowbert)గారి గృహమునకేగితిమి. 22వ తేదీన మరియస్టేన్ (Mariastein) అనెడి చర్చిని దర్శించితిమి. ఇక్కడ ఒక కొండపైనుండి క్రిందపడిన ఒక బాలికను శ్రీమేరీమాత రక్షించినదట! 23వ తేదీన శ్రీనౌబర్టుగారి సతీమణి, తల్లిగార్ల ఆధ్యాత్మిక సందేశములను తీర్చుట జరిగెను. 24వ తేదీన మేము శ్రీ గుంటర్ (Sri Gunter)గారి గృహమునకు చేరుకొనగా మమ్ములను చూచుటకై శ్రీ ఎలిజబత్ అరినర్ (Elizebeth Ariener)గారు వచ్చిరి. 25వ తేదీన శ్రీమతి సరళ(Smt. Sarala)గారు, వారి భర్తగారైన శ్రీఆత్మారామ్ (Sri Atmaram)గారు నిర్వహించుచున్న భోలేబాబా (Bhole Baba )ఆశ్రమమును దర్శించితిమి. 26వ తేదీన తమ ఆనారోగ్యమునకు సలహాల కొరకై వచ్చిన ఇద్దరు వృద్ధమహిళలకు సమాధానమొసంగితిని. 27వ తేదీన జరిగిన బృహత్ సత్సంగమునందు భక్తులడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చితిని. 28వ తేదీన శ్రీ ఎలిజబత్ ఆరినర్ (Sri Elizebeth Ariener)గారి గృహమున కేగి వారి ఆతిథ్యమును స్వీకరించితిమి. 29వ తేదీన శ్రీ ఎలిజబత్ (Sri Elizebeth)గారి వద్దనున్న ఆధ్యాత్మికోపన్యాసములు గల టేప్పు (Tapes) శ్రవణమొనర్చితిని. 30వ తేదీన శ్రీవుల్ఫ్‌గాంగ్ (Sri Wolf Gang) గారి గృహమును చేరుకొంటిమి. 31వ తేదీన శ్రీహెల్మట్ (Sri Helmut)గారింటికి వెళ్ళి వారి ఆతిథ్యమును స్వీకరించితిమి. బాద్ సాకింజన్ (Babsackingen) లోని ఈ 3 వారములలో కారును నడిపియు, అనువాదము చేసియు సహకరించినట్టి శ్రీ మేరీ లూయీస్‌సేట్‌జీ ( Sri Mary Luicy Seitzy)గారికి అనేక ధన్యవాదముల నర్పించుకొనుచున్నాను.

## (ఆ) నా యూరప్ ఖండ పర్యటన - వివరణ కొనసాగింపు

శ్రీ శివానందాశ్రమమునుండి జర్మనీకి గురువారంరోజు బయలుదేరుట జరిగెను. కాబట్టి జర్మనీ నుండి ఇతరదేశములకు కూడా గురువారం రోజే బయలుదేరుటకు నిశ్చయించుకొంటిమి. కావున 1-9-93 వ తేదిన ఇతర 8 దేశముములను దర్శించుటకై తగిన సన్నాహముల నొనర్చుకొనుట జరిగెను. 2-9-93 గురువావారంరోజు నేను, శ్రీ వుల్ఫుగాంగ్ సేట్జ్ (Sri Wolf Gang Seitg) వారి సతీమణి మేరీలూయీన్ సేట్జ్ (Smt. Mary Luicy Seitzy ) ఉదయం 9 గంటలకు బయలుదేరి ఆస్ట్రియా (Austria) మీదుగా ఇటలీ (Italy) కి మధ్యాహ్నం 11 గంటకు చేరుకొని, బోజనానంతరం విశ్రాంతి తీసుకుని సాయంకాలం 4-36 నుండి రాత్రి 8-30 వరకు శ్రీమతి వొరిల్లా(Smt. Orilla) గారింట్లో సత్సంగము నొనర్చితిమి.

3-9-93 వ తేదిన సత్సంగమునకు వచ్చిన ఒక మహిళకు ధూమపాన మొనర్చు అలవాటుండుటచే దానియందుగల దోషములను గూర్చి వివరించి చెప్పుట జరిగెను. 4-9-93 వ తేదిన ఉద్యోగరీత్యా ఒక కొండపై నివసించుచున్న శ్రీమతి ఒరిల్లా భర్త గారింటికి వెళ్ళి వారికి ఓం శాంతిః శాంతిః శాంతిః” అనుపదముల కర్థమును వివరించి చెప్పితిని. 5-9-93వ తేదిన అస్సిసి (Assisi) అనెడి గ్రామమునకు వెళ్ళి అక్కడ సెయింటు ఫ్రాన్‌సిస్కో ( Saint Fransisco) గారి సమాధిని విశాలమైన చర్చిని దర్శించితిమి. 6-9-93 వ తేదిన మేము విడిదిచేసిన లిటిల్‌సిస్టర్సు( Little Sisters ) యొక్క ధర్మశాలనుండి బయదేరి సాయంకాలం 6-30 గంటలకు శ్రీమతి వొరిల్లా (Smt. Orilla )గారి గృహమును చేరుకొంటిమి. 7-9-93వ తేదిన ఉదయం బయలుదేరి ఆస్ట్రియాలోని 14 కి.మీ. దూరముగల ఒక సొరంగమును దాటి స్వామి సత్యానంద సెంటర్(Swami Satyananda Centre ) ను చేరుకొని శ్రీ స్వామి ప్రకాశానంద మాతాజీ ఏర్పాటుచేసిన సత్సంగమునందు పాల్గొంటిమి.

8-9-93వ తేదిన శ్రీ సద్గురు శివానందస్వాములవారి 106వ జన్మ దినోత్సవమగుటచే సంక్షిప్తంగా శ్రీ గురుపాదుకాపూజ నొనర్చి మధ్యాహ్నం 11 గం॥కు వింటర్‌థుర్ (Winterthur) లోని శ్రీ ఓంకారానందాశ్రమమును చేరుకొని శ్రీ వివేకానందదేవిగారి ఆతిథ్యమును స్వీకరించితిమి. 9-9-93వ తేదిన మధ్యాహ్నం

12 గంటలకు ఆష్ట్రియా(Austria)కు వెళ్లగా అక్కడ పూజ్యశ్రీ ఓంకారానంద స్వాములవారి శిష్యురాండ్రు వచ్చి శ్రీ సూక్త- పురుష సూక్తములతో ఘనమైన స్వాగతము నొసంగి శ్రీ స్వాములవారు జరుపుచున్న సత్సంగహాలులోనికి తీసుకొని వెళ్ళిరి. శ్రీ స్వాములవారి శిష్యవర్గము "శాంతములేక సౌఖ్యము లేదు" "అయిగిరినందిని" "భాగ్య సూక్తము" "మేధా సూక్తము" ఇత్యాదులను శ్రవణానందకరముగా వినిపించిరి. ప్రసాదము స్వీకరించి, స్వాములవారితో సెలవు తీసికొని, సాయంకాలం 6-30 గంటలకు వింటర్ థుర్ (Winterthur)చేరుకొంటిమి.

10-9-93వ తేదిన ఉదయం బయలుదేరి ఇన్సు (Ins)అను గ్రామమును చేరుకొని శ్రీ సద్గురు శివానందస్వాములవారి అనన్య భక్తురాలగు శ్రీ రీటా రుప్రేటా(Sri Rita Rupreta) గారి గృహమునకు వెళ్ళితిమి. 11-9-93వ తేదిన వారు దాచుకొన్నట్టి స్లైడ్సు లను చూచుటయే గాక, టేపు చేయబడిన శ్రీవారి ఉపన్యాసములను, పాటలను శ్రవణ మొనర్చితిమి. 12-9-93 వ తేదిన శ్రీమతి మౌనిక(Smt. Mounika) గారి గృహమును చేరుకొని, ఆమె పాపయగు 2 1/2 సం॥ల వయస్సుగల ప్రమీణ(Pramina)ను పరామర్శించి, సాయంకాలం 6గంటలకు శ్రీశ్రీశ్రీ చిదానందస్వాములవారి భక్తురాలైన శ్రీమతి జాకీ వెబ్సుటర్ ( Smt. Jackie Webster ) గారి గృహమును చేరుకొంటిమి. 13-9-93వ తేదిన చికాగో, యోగవిల్లే, న్యూ బృందావన్ (Chicogo, Yoga Villa, New Brindavan )లో జరుప బడిన పూజ్య శ్రీ చిదానందస్వాములవారి కార్యక్రమములను వీడియోలలో దర్శించి ముదము నొందితిమి.

14-9-93వ తేదిన శ్రీ త్యాగగారింటికి వెళ్ళితిమి. వీరి భర్తగారు భారతదేశములో మౌంట్ ఎవరెస్టు(Mount Everest ) పర్వతము నధిరోహించు చుండగా 11 సం॥ల క్రితము పరమపదించిరట. 15-9-93 వ తేదిన ఉదయం మిర్రర్ రాక్ ( Mirror Rock)ను దర్శించితిమి. సాయంకాలము ఒకచర్చి (Church)కి వెళ్ళగా అక్కడ భారతదేశమునందు 1949 నుండి1964 వరకు ఉండివచ్చిన ఒక మాంక్ (Monk) కానబడి మాకు చర్చినంతటిని ఓపికతో చూపించెను. 16-9-93 వ తేదిన ఇంటేగ్రల్ యోగ బుక్సు (Integral Yoga Books) పఠించితిని. ప్రతి పుస్తకములోను ఇంటెగ్రల్ యోగ రికమండ్స్ ఎ డయట్ - ఫ్రీ ఆఫ్ మీట్ ఫిష్ అండ్ ఎగ్ (Integral Yoga Recommends a diet Free of meat Fish and Egg) అని వ్రాయబడియుండెను. ఇట్లు పాశ్చాత్యులు అహింసాతత్త్వమును

ఆకళించుకొనుచుండగా భారతీయులమగు మనము  మాంసాహారాది పైశాచిక కృత్యముల నలవరచు కొనుచుండుట నాకు సిగ్గుచేటుగా తోచెను.

17-9-93వ తేదిన లియాన్( Lyan) లో శ్రీమతి మల్‌లార్విన్( Smt. Malou Larvin) మాతాజీ గృహమునకు వెళ్ళి సత్సంగమొనర్చి, హారతియొనర్చి ప్రసాదవితరణము చేసితిని. 18-9-93వ తేదిన బార్సిలోనా( Barcolona) చేరుకొని శ్రీ భక్తిదాసుగారు శివానంద సెంటరు( Sivananda Centre)లో ఏర్పాటుచేసిన సత్సంగమునందు పాల్గొంటిని. 19-9-93 వ తేదీన భూసొరంగములగుండా వెళ్ళు రైలుబండిలో బయలుదేరి కొలంబస్ ( Columbus) స్థూపమును దర్శించితిమి. 20-9-93 వ తేదిన ఒక కొండ గుహలో ఒక పశువుల కాపరికి కానబడిన దేవీమూర్తిని దర్శించితిమి. 21-9-93 వ తేదిన లౌర్డస్ (Lourdes) కు వెళ్ళి, అక్కడ శ్రీ స్వామి రామదాసుగారి భక్తుడు ఏర్పాటుచేసిన ఒక పూటకూళ్ళింటిలో బసచేసితిమి. 22-9-93 వ తేదిన లౌర్డిన్ లోని చర్చి(Church)ని చూచుటకై వెళ్ళితిమి. ఇక్కడ ఒక కొండగుహలో ఒక గొల్లపిల్లకు మేరీమాత కానబడెను. ఇక్కడ 10,000 జనులు పట్టు ఒకపెద్దహాలు కలదు. తమ రోగనివారణకై రోగులు ప్రతిరోజు తండోపతండాలుగా వచ్చి, ఇచ్చటి పవిత్ర జలమును పానమొనర్చి కృతకృత్యులగు చుందురు. 23-9-93 వ తేదిన ఒక మిక్కిలి ఎత్తైనకొండపై నున్న బుద్దిస్ట్ మొనాస్టరి (Buddist Monastry)ని దర్శించితిమి. 24-9-93వ తేదిన శ్రీశ్రీశ్రీచిదానందస్వామువారి  జన్మదినమగుటచే ఆ దినమంతయు జప-ధ్యాన-ప్రార్థన స్వాధ్యాయములచే గడిపితిని. 25-9-93వ తేదిన ఉదయం బయలుదేరి దట్టమైన, అందమైన కీకారణ్యములను  దాటి జర్మనీలో ఒక ప్రీస్ట్(priest) చే నిర్వహించబడుచున్న యోగాసెంటర్ ( Yoga Centre)ను చేరుకొంటిమి. 26-9-93వతేదిన శ్రీవిల్లి మర్రా ( Sri Willi Marra)గారి కూతురగు మేరియా ( Maria) మాకు యోగసెంటర్ అంతటిని దర్శింపజేసెను. 27-9-93వ తేదిన సాయంకాలం 4గంటలకు ఫ్రాంక్‌పర్టు (Fronkfurt) చేరుకొంటిమి. 28-9-93వ తేదిన జంతుప్రదర్శనశాలకు వెళ్ళి భగవంతుని సృష్టిలోగల జీవజంతువులను దర్శించితిమి. 29-9-93వ తేదీ మాకొక సుదినము. కారణమేమనగా ఈ రోజు గురుదేవ్ శ్రీ చిదానందస్వాములవారిని కోలన్ (Koln) అను ప్రదేశములో దర్శించుటయేగాక వారి లవ్ ఆఫ్ గాడ్ (Love of God ) అనెడి  ఉపన్యాసమును శ్రవణమొనర్చితిమి. 30-9-93వ తేదిన శ్రీమతి ఉమాపతి గారింటిలో సత్సంగము జరిగెను.

ఈ విధముగా మా సెప్టెంబరు నెల కార్యక్రమము సమాప్తమయ్యెను. ఈ 30 రోజులలో కారును నడిపియు, ఆంగ్లమునుండి జర్మనీ భాషలోనికి అనువదించి దివ్యజీవన సందేశమును పాశ్చాత్యుల కందించియు, భోజన భాజనాది సౌకర్యముల నొనర్చియు సహకరించినట్టి శ్రీ ఉల్ఫ్ గాంగ్ సేట్జ్ మరియు శ్రీమతి మేరీ లూయిసేట్జ్ ( Sri Wolf Gang Seitg & Smt Marie Luise Seitg) దంపతులకు నా కృతజ్ఞతాభి వందనములను తెలుపుకొనుచున్నాను.

## (ఇ) నా యూరప్ ఖండ పర్యటన - వివరణ కొనసాగింపు

(శ్రీ స్వామి హంసానందులవారి యూరపు దేశాల పర్యటన విశేషాలు ఇంతకు ముందు రెండు సంచికలలో ప్రచురించుట పాఠకుల కెరుకయే! ఈ మూడవ వ్యాసంతో ముగిస్తున్నాము.)........ (సం.)

1-10-93వ తేదిన కాలకృత్యములను తీర్చుకొని, ధ్యాన సాధనయొనర్చి, ఉపాహారానంతరము కోలన్ (Koln) లోని డామ్ క్యాథెడ్రల్ (Dom-Cathedral) చూచుటకు వెళ్ళితిమి. ఇచ్చట బిషప్ (Bishop) ఉండును. ఇది భారతదేశములోని మధురై మీనాక్షి మందిరమువలె మహోన్నతముగను, అందముగను, చిత్రవిచిత్రములగు కళలతోను అలంకరింపబడియుండును. 2-10-93వ తేదిన మధ్యాహ్నం 12 గంటలకు ఓం శాంతిఆశ్రమమును చేరుకొంటిమి. ఆ రాత్రి జరిగిన సత్సంగములో "ఓం సహనావవతు" అనెడి శాంతిమంత్రముపై మాట్లాడుట జరిగెను. ఇక 3-10-93 వ తేదిన రాత్రి 8 గంటలనుండి 10-30 గంటలవరకు జరిగిన సత్సంగములో యోగ స్టూడెంట్సు అడిగిన ప్రశ్నలకు సమాధానమొసంగితిని. 4-10-93వ తేదిన మాకు సుదినము. కారణమేమనగా హాలెండ్( Holland )లో శ్రీ సద్గురు శివానందస్వాములవారి శిష్యురాలును, శ్రీ శివానంద ఉచిత వైద్యశాలలో సేవ చేసినట్టియు శ్రీ స్వామి హృదయానంద మాతాజీని మేము దర్శించి, వారితో సాయంకాలము 6 గంటలనుండి 7-30 గంటలవరకు గడిపితిమి. అదే రోజు రాత్రి 10 గంటలకు బెల్జియమ్(Belgium )లో నున్న గ్రెమ్ బర్గెన్ (Grembergen) చేరుకొని, అక్కడ పూజ్యశ్రీ వేంకటేశానందస్వాములవారి శిష్యుడైన శ్రీ యోగిరాజ్ & లలిత( Sri Yogiraj and Lalitha) గారి గృహము చేరుకొంటిమి. 5-10-93 వ తేదిన రాత్రి 7గం॥నుండి 9 గంటలవరకు జరిగిన సత్సంగమునందు "యోగశ్చిత్తవృత్తి నిరోధః " అను విషయముపై ప్రసంగించుట జరిగెను. 6-10-93 వ తేదిన ఇంటర్నేషనల్ ప్లాంటేషను( International Plantation) ను చూచి వచ్చిన తర్వాత

మరొకచోట 7నుండి 9 గంటలవరకు జరిగిన రాత్రి సత్సంగములో "సో-హమ్" అను విషయముపై మాట్లాడితిని. శ్రీ శివప్రేమానందగారు ఆంగ్లమునుండి వారి ఫ్లెమిష్ భాషలోని కనువదించిరి. 7-10-93 వ తేదిన దట్టమైన కీకారణ్యమును దాటి హెమ్‌బర్గు (Hemberg) చేరుకొని ఋషీకేశ్‌లోని యోగనికేతన్ నందు కొంతకాలముండి వెళ్ళిన దంపతుల గృహమునందు బసచేసితిమి. 8-10-93 వ తేదిన శ్రీమతి లిసా అడిగిన ప్రశ్నలకు సమాధానమొసంగుచు సందర్భానుసారముగా ప్రహ్లాదచరిత్రను, ఏనుగు-ఐదుగురు గ్రుడ్డివారి కథను, పాము బుసకొట్టు కథను వివరించి చెప్పితిని. 9-10-93 వ తేదిన హెమబర్గు లోని సముద్రతీరమునకు వెళ్ళి మధ్యాహ్నం 12-15 గంటలనుండి 2-15 గంటల వరకు ఒక పడవలో సముద్రమువరకు వెళ్ళు ఆల్‌స్టర్ ( Alster)నదిలో ప్రయాణ మొనర్చితిమి. 10-10-93 వ తేదిన లిసా( Lisa) మఱియు వుల్ఫ్‌గాంగ్ దంపతులతో వార్తాలాప మొనర్చుట జరిగెను. 11-10-93 వ తేదిన పుట్ట గార్డెన్( Putta Garden)కు వెళ్ళి విండ్‌మిల్(Wind Mill) ను చూచితిమి. ఇక్కడి సముద్రములో డెన్మార్కుకు వెళ్ళుచున్న పడవను, గ్రేటు బిటన్(Great Britain) నుండి వచ్చుచున్న పడవను దర్శించితిమి. 12-10-93 వ తేదిన సాయంకాలం 4-30గంటలకు ఫ్రాంకు ఫర్టు ( Frankfur) చేరుకొంటిమి. ఇక్కడి యోగాసెంటరు ( Yoga Centre) ను శ్రీశు కదేవ ( Sri Shukadev)గారు, శ్రీ జ్ఞానేశ్వరానంద మాతాజీ నిర్వహించుచున్నారు. 13-10-93 వ తేదిన శ్రీ వుల్ఫుగాంగ్‌గారి తల్లిగారిని చూచుటకై వెళ్ళితిమి. ఆమె బ్రహ్మచర్య, గృహస్థ వానప్రస్థ, సన్న్యాసాశ్రమములను గూర్చి ఎంతో కుతూహలముతో అడిగి తెలుసుకొనిరి. ఇక 14-10-93 వ తేదిన ఉదయం శ్రీశుకదేవ్‌గారు కంప్యూటర్(Computer) లో ప్రింటు చేసినట్టి శ్రీ దుర్గ, లక్ష్మి, సరస్వతి అష్టోత్తరశతనామావళులలోని దోషములను సవరించి ఇచ్చితిని. అదే రోజు సాయంకాలము శ్రీమతి మేరీలూయిూ సేట్స్ (Smt. Mary Luise Seitg ) గారి తల్లిగారింటికి వెళ్ళి వారి తల్లిదండ్రులను దర్శించితిమి. 15-10-93వ తేదిన శుక్రవారమగుటచే శ్రీ దుర్గాష్టోత్తర శతనామములతో కుంకుమార్చనచేసి "జై అంబేగౌరీ" అను హారతిని పాడితిమి.

16-10-93 వ తేదిన లక్ష్మీఅష్టోత్తర శతనామములతో కుంకుమార్చన చేసి "జై అంబేగౌరీ" యను హారతి నొనర్చొతిమి. 17-10-93వ తేదిన శ్రీ సరస్వతీ అష్టోతర శతనామములతో కుంకుమార్చన యొనర్చి "జై అంబే గౌరీ " యను

హారతిని గానము చేసితిమి. 18-10-93వ తేదిన శ్రీ యుక్తేశ్వర్‌గారి శిష్యుడైన శ్రీ హంసయోగి గారి గృహమును చేరుకొంటిమి. ఇచ్చట వీరు భూతోచ్ఛాటన కార్యమును జరుపుచుందురు. 19-10-93వ తేదిన రాత్రి7-30 గం॥నుండి 10-30 గం॥వరకు జరిగిన సత్సంగములో దేవునిపై ప్రేమను వృద్ధి నొందించుకొనుటకు మార్గమేమి? యను ప్రశ్నకు మానవసేవ, జపము, ధ్యానము, మంత్రలేఖనము, స్వాధ్యాయములే మార్గములని సమాధాన మొసంగితిని. 20-10-93వ తేదిన భూత పిశాచములచే భయకంపితమగుచున్న ఒక మహిళకు హనుమాన్ చాలీసా - సంకటమోచన్ హనుమాన్ అష్టకములను పఠింపుమని సలహా యొసంగితిని. 21-10-93వ తేదిన శ్రీ సుశాన్న గారింటికి వెళ్ళి భోజనము చేసినతర్వాత డస్సెర్ డార్ఫుకు సాయంకాలం చేరుకొని ఇంద్రాణి (Indrani) అనెడి హోటల్ (Hotel)యజమానియగు శ్రీబోస్ బాబు (Sri Bosu Babu)ను కలిసికొంటిమి. 22-10-93వ తేదిన హానోవర్ (Hannover) చేరుకొని అక్కడ ఒక యూనివర్శిటీ (University)లో శ్రీ ఇంగో (Sri Ingo) అను వ్యక్తియొక్క పర్యవేక్షణలోనున్న శిల్ప కళాసౌందర్యమును దర్శించితిమి. ఇక 23-10-93వ తేదిన జరిగిన సత్సంగములో పూజ్యశ్రీ కృష్ణానందస్వాములవారి "స్ట్రగుల్ ఫర్ పెర్‌ఫెక్షన్" (Struggle for perfection) అను పుస్తకమును జర్మన్ భాషలోనికి అనువదించి నట్టి శ్రీమతి హెల్గా (Smt. Helga) గారిని కలుసుకొంటిమి. 24-10-93 వ తేదిన మధ్యాహ్నం టాజ్‌మహల్ (Taj Mahal)హోటల్లో భోజనము చేసినతర్వాత 1-30 నుండి సాయంకాలం గం. 6-30 ని॥ల వరకు సత్సంగము జరిగెను. 25-10-93వతేదిన ఈస్ట్‌జర్మనీ (East Germany)లో ప్రవేశించి 1989లో రష్యా ప్రభుత్వము యీస్ట్ జర్మనీ (East Germany)ని జర్మన్ ప్రభుత్వమున కొసంగుటచే బ్రద్దలు చేయబడిన బెర్లిన్‌వాల్ (Berlin Wall)ప్రాంగణమును చూచితిమి. బెర్లిన్ లో సింబల్‌ఆఫ్ విక్టరీ (Symbol of Victory)లో ఒక ఏంజల్ ( Angel) నాలుగు గుఱ్ఱముల రథమును తోలుచుండుటను తిలకించితిమి. ఇక 26-10-93వ తేదిన సాయంకాలం 3గంటలకు ప్రాహ( Praha) చేరుకొని శ్రీమతి యీవాకరనోవా (Eva Karanova) గారి గృహమునకు వెళ్ళితిమి. సాయంకాలం డా॥ఆంద్రోల్ ( Dr. Andropie) గారింటికి వెళ్ళి అచ్చటికి వచ్చిన భక్తులకు జపమాలను ఉపయోగించు విధానమును తెలిపితిని. 23-10- 93వ తేదిన ఒక చర్చివద్దనున్న క్రిమేషన్ గ్రౌండు (Crimation ground) కు వెళ్ళి శ్రీమతి యీవకరనోవా (Smt. Eva Karanova) గారి తల్లిదండ్రుల సమాధులవద్ద ప్రార్థనచేసితిమి. 28-10-93వ తేదిన శ్రీ శివానందాశ్రమములోని

భజనహాలులో 1993 మార్చి, ఏప్రిల్, మే, నెలలలో గంటల తరబడి ధ్యాన నిమగ్నులైె సాధన చేసినట్టి శ్రీయీవా జమీనోవా (Sri Eva Zemanova) గారు మమ్ములను చూచుటకై వచ్చిరి. వారితో కలిసి మేమందరము పరిశుద్ధమైన గోవింద వెజిటేరిన్ క్లబ్ (Govinda Vegetarian Club) లో భోజన మొనర్చితిమి. 29-10-93 వ తేదిన శ్రీమతి యీవా కరనోవా గారి భర్తగారైన శ్రీపీటరు(Sri Peter)గారు మంచము పట్టిన కారణముచే వారి స్వాస్థ్యము కొరకై ప్రార్థనచేసి, శ్రీ గాబి ( Sri Gabi ) గారి ఆశ్రమము చేరుకొంటిమి. 30-10-93 వ తేదిన శ్రీ మనోహర్‌గారి పరమహంస యోగానందసెంటర్ (Yogananda Centre) కు వెళ్ళి ఆ రోజు "రాసలీల" యగుటచే శ్రీ కృష్ణుని రాసలీలా రహస్యమును గూర్చి ముచ్చటించితిని. 31-10-93వ తేదిన శ్రీ హీంజ్ గ్రిల్(Sri Heing Grill)గారి శిష్యురాలైన మరొక గాబి(Gabi)గారి గృహమును చేరుకొని, ధ్యానసాధన విషయమై చర్చించితిమి. అదేరోజు మరల కోచల్ (Kochel) చేరుకొని, నాపేరుతో వచ్చిన ఉత్తరములన్నింటిని సమాధానములను వ్రాసి రాత్రి 12-30 గంటలకు పరుంటిని. 1-11-93వ తేదిన నావద్ద కొన్ని సం॥లకు పూర్వము భగవద్గీతాపఠనమును నేర్చుకొన్నట్టి శ్రీ జెర్హాట్ (Sri Gerhat) గారితో మాట్లాడుట జరిగెను. 2-11-93వ తేదిన ఉదయం 9-30 గం॥కు ముంచెన్ (Munchen) విమానాశ్రయమును చేరుకొని, ఫ్రాంక్‌ఫర్టు (Frankfurt) విమానాశ్రయమును మధ్యాహ్నం 12 గంటలకు చేరుకొని, అదే రోజు రాత్రి 1-30 గంటలకు 3-11-'93 ఢిల్లీ విమానాశ్రయము చేరుకొని, ఎయిర్‌పోర్ట్( Airport)లోనే ఉదయం 5 గంటల వరకుండి, తరువాత శ్రీఅరవిందా శ్రమములో బస చేసితిమి. 3-11-'93 వ తేతీన డా. తరుణ్‌గారిని, శ్రీలాలా ముకుంద్‌లాల్ గారిని కలుసుకొంటిమి. 4-11-'93వ తేదీన శ్రీస్వామి ఆత్మ స్వరూపానంద గారితోను, శ్రీసుసాన్( Sri Susan)గారితోను కలిసి నేరుగా కారులో శ్రీగురుదేవ్ కుటీరమునకు వచ్చి, పూజ్యశ్రీ దేవానందస్వామి గారిని, శ్రీసాధుశేషగిరి రావు గారిని, తదితరులను దర్శించి, శ్రీ గురుదేవ్ కుటీరమునానుకొని ప్రవహించుచున్న పావన గంగాజలసేవన మొనర్చుకొని, ఆనందకందళిత హృదయారవిందుడనైతిని.

గురుదేవుల దివ్యజీవనవాణిని దేశదేశాలలో వినిపించి, కృతార్థులైన పూజ్యశ్రీ హంసానందస్వాములవారికి శ్రీశివానంద సందేశ ప్రచార సమితి అభినందనలు తెలియ జేస్తుంది.

# 71. అమ్మా! అమ్మా! రావమ్మా!

(1) అమ్మా! అమ్మా! రావమ్మా!
అమ్మలకమ్మా! రావమ్మా!

(2) ఆదిశక్తి! రావమ్మా!
ఆత్మ నివాసిని! రావమ్మా!

(3) ఇచ్ఛాశక్తీ! రావమ్మా!
ఇప్పుడే, ఇప్పుడే! రావమ్మా!

(4) ఈశ్వరి, ఈశ్వరీ! రావమ్మా!
ఈ క్షణమందే రావమ్మా!

(5) ఉమాదేవీ! రావమ్మా!
ఉజ్జ్వలమూర్తీ! రావమ్మా!

(6) ఊర్ధ్వగామినీ! రావమ్మా!
ఊహావాహిని! రావమ్మా!

(7) ఋషీకేశవాసిని! రావమ్మా!
ఋతువుల రాణీ! రావమ్మా!

(8) ఎడబాయకు నన్నోయమ్మా!
ఎల్లప్పుడు నాతో ఉండమ్మా!

(9) ఏనుగనెక్కి రావమ్మా!
ఏడ్చుచునుంటిని రావమ్మా!

(10) ఐం శక్తీ! రావమ్మా!
ఐరావతమెక్కి రావమ్మా!

(11) ఒయ్యారముగా రావమ్మా!
ఒప్పుల కుప్పా! రావమ్మా!

(12) ఓడనెక్కి రావమ్మా!
ఓటమి నీకు లేదమ్మా!

(13) ఔత్సుక్యముతో రావమ్మా!
ఔరా! యనగా రావమ్మా!

(14) అందెలు వేయుచు రావమ్మా!
అందాలదేవీ! రావమ్మా!

(15) ఆహా! ఆహా! రావమ్మా!
ఆహారము గైకొనవమ్మా!

(16) క్రియాశక్తివి నీవమ్మా !
కయ్యము బాపగరావమ్మా!

(17) ఖం ఖం ఖం ఖం రావమ్మా!
ఖడ్గధారిణీ! రావమ్మా !

(18) గం గం గం గం రావమ్మా!
గంగారాణీ ! రావమ్మా!

(19) ఘుమ ఘుమ వాసనలీయమ్మా!
ఘల్లు ఘల్లు మని రావమ్మా!

(20) అంగలు వేయుచురావమ్మా!
అంగన బ్రోవగరావమ్మా!

(21) చాముండేశ్వరి రావమ్మా!
చిన్మయ రూపిణి రావమ్మా!

(22) ఛం ఛం ఛం ఛం రావమ్మా!
ఛాయగ నాకు నిలువమ్మా!

(23) జగముల తల్లీ! రావమ్మా!
జలజాక్షివి నీవమ్మా!

(24) ఝుం ఝుం ఝుం ఝుం రావమ్మా!
ఝుంకార నాదము చేయమ్మా!

(25) పంచభూతములు నీవేనమ్మా!
ప్రపంచమంతా నీవేనమ్మా !

(26) టక్కు టక్కున రావమ్మా!
టైములేదని అనకమ్మా!

(27) ఠీవిగ నీవు రావమ్మా !
తావులు దప్పితి నేనమ్మా!

(28) డమరు ధరించి రావమ్మా!
డంబము నాలో లేదమ్మా!

(29) ఢం ఢం ఢం ఢం రావమ్మా!
ఢాకిని శక్తివి నీవమ్మా!

(30) గణ గణ గణ గణ రావమ్మా!
గుణముల రాశివి నీవమ్మా!

(31) తల్లీ! తల్లీ! రావమ్మా!
తన్మయ మొందగరావమ్మా!

(32) కథను చెప్పెద వినవమ్మా!
వ్యథను దీర్పగ రావమ్మా!

(33) దయగల తల్లివి నీవమ్మా!
దక్షుని పుత్రిక! రావమ్మా!

(34) ధిక్కరింపక రావమ్మా!
ధైర్యము నివ్వగ రావమ్మా!

(35) నారాయణీ !రావమ్మా!
"నా" యను వారు లేరమ్మా!

(36) పరాశక్తివి నీవమ్మా!
పరమానందిని! రావమ్మా!

(37) ఫక్కున నవ్వుచు రావమ్మా!
ఫలము నివ్వగ రావమ్మా!

(38) బలమునీవే నాకమ్మా!
బలగము ఎవ్వరు లేరమ్మా!

(39) భం భం భం భం రావమ్మా!
భయము దీర్పగ రావమ్మా!

(40) మహిమలు చూపగ రావమ్మా!
మహాలక్ష్మి! రావమ్మా!

(41) యామిని తల్లీ! రావమ్మా!
యతియే గతి నాకమ్మా!

(42) రమణీ! రమణీ! రావమ్మా!
రమాదేవీ !రావమ్మా!

(43) లా-లా-లా-లా రావమ్మా!
లావణ్య రూపిణి !రావమ్మా!

(44) వాణీ దేవీ! రావమ్మా!
వెతలు దీర్పగ రావమ్మా!

(45) శాంభవిదేవీ ! రావమ్మా!
శంనోదేవీ! రావమ్మా!

(46) షణ్ముఖమాతా! రావమ్మా!
షట్క్రియ రూపిణి! రావమ్మా!

(47) సాయము చేయగ రావమ్మా!
సామగాన ప్రియ! రావమ్మా!

(48) హా-హా-హా-హా రావమ్మా!
హూ-హూ-హూ-హూ రావమ్మా!

(49) క్షమా రూపిణీ! రావమ్మా!
క్షాత్ర రూపిణి! రావమ్మా!

(50) త్రాహి- త్రాహి ఓయమ్మా!
త్రిమూర్తి రూపిణి! రావమ్మా!

(51) జ్ఞానరూపిణీ !రావమ్మా!
జ్ఞానదాయినీ ! రావమ్మా!

(52) అమ్మా! అమ్మా! రావమ్మా!
అనంతరూపిణి! రావమ్మా!

(53) అఖండరూపిణి !రావమ్మా!
అఖిలాండేశ్వరి! రావమ్మా!

(54) ఆనందదాయిని!రావమ్మా!
పరమానంద రూపిణి !రావమ్మా!

# 72. Marriage

**(on Krishna's Birthday on 17th July, 2002)**

**M**arriage is a bondage, which ultimately leads to the freedom from the bondage of birth and death.

**A**bosolute Love between man and woman is really the Love b etween *Radha* and *Krishna*.

**R**oot of the real love lies in the heart.

**R**eal Love cannot separate the man from the woman.

**I**llness of the husband is the separation from his wife.

**A**nger of mother or father will effect the child.

**G**od is the source of man and woman. Therefore the source of the child also must be God alone.

**E**ternal love of man and woman leads to the Eternal Love Divine.

***-Swami Hamsananda***

# निष्काम सेवा, भक्ति एवं संकीर्तन
# स्वामी हंसानन्द

स्वार्थपरता को छोड़कर काम करना ही निष्काम सेवा कहलाती है । देहाभिमानी मनुष्य हमेशा स्वार्थ परायण होता है । ''देह को 'मैं' मानना सबसे बड़ा पाप है । सब पाप इसके पुत्र हैं । सब पापों का यह बाप है ।''

इन वाक्यों को परम पूज्य श्री चिदानन्द जी महाराज अपने प्रवचनों में उच्चारण करते रहते थे । इस कारण से निष्काम सेवा करने वाले देहाभिमान को छोड़ना अनिवार्य है । आत्माभिमानी देहाभिमानी से भिन्न होता है । आत्म ज्ञानी को किसी प्रकार का अभिमान नहीं रहता है । इस कारण से यहाँ आत्माभिमानी न कहकर आत्मरत कहना उचित होगा । निष्काम सेवा के नाम से धन का संचय करना पाप की गठरी को आर्जन करना ही होता है । निष्काम सेवा करने वालों का मन और बुद्धि शुद्ध होती है । सच्वी निष्काम सेवा करने वालों का दर्शन मात्र से सकाम भावना आकाश में उड़ जाती है । सकाम भावना से मनुष्य लौकिकता रोग से पीड़ित होता है । निष्काम भावना वाले मनुष्य हमेशा स्वस्थ रहते हैं । निष्काम सेवा से मनुष्य में आध्यात्मिकता बढ़ती है । निष्काम सेवा से भगवान् का अनुग्रह प्राप्त होता है। निष्काम सेवा रूपी नदी अपना परम लक्ष्य परमात्मा रूपी सागर में पहुँचा देती है । परमात्मा क्या चीज़ है ? सत्, चित्, आनन्द का स्वरूप ही परमात्मा है । परम सत्य ही परमात्मा है । परम प्रकाश ही परमात्मा है ।

परमानन्द ही परमात्मा है । इसलिये हर साधक, हर भक्त, हर मुमुक्षु, हर जिज्ञासु को निष्काम सेवा को अपनाना चाहिये ।

अब हम भक्ति के विषय में.विचार करेंगे । मातृ भक्ति, पितृ भक्ति, भ्रातृ भक्ति, पति भक्ति, देश भक्ति - इस प्रकार भक्ति कई रूपों को धारण करती है । परन्तु जिस भक्ति में ये सब भक्तियाँ सम्मिलित होती हैं, उसको कहते हैं ''भगवद्भक्ति'' । क्यों ? भगवान् में माता - पिता, भ्राता, पति, देश इत्यादि सर्वस्व सम्मिलित हैं । परन्तु भगवद् भक्ति करना इतना

सुलभ साध्य नहीं है । क्यों ? अपनापन को छोड़ना ही असली भगवद् भक्ति है । आजकल अपनी वृद्ध माता की सेवा कोई भी नहीं करता है, इसका कारण अपनापन ही है । पिताजी की सेवा कोई भी नहीं करता है, इसका कारण अपनापन ही है । अपने भाई से झगड़ा करता है, इसका कारण अपनापन ही है । पति पत्नी से और पत्नी पति से परस्पर झगड़ा करते हैं । इसका कारण भी अपनापन ही है । इस प्रकार का व्यक्ति देश सेवा क्या कर सकता है ? ऐसा व्यक्ति भगवद् भक्ति को छू भी नहीं सकता है । बच्चों में भगवद् भक्ति जगाने के लिये माता भक्तिमती बननी चाहिये । पिता भक्ति भाव सम्पन्न होना चाहिये । । भ्राता का हृदय प्रेमामृत से भरपूर होना चाहिये । पत्नी का हृदय भक्तियुक्त होना चाहिये । पति भगवदाराधना करते रहना चाहिये । तब पूरा परिवार परम पिता परमात्मा को पाने के लिये लालायित होता है । इस प्रकार क्रमशः देश का उद्धार भी हो जाता है । वास्तव में व्यक्ति का उद्धार ही देश का उद्धार है ।भगवद् भक्ति से सुसम्पन्न भारत माता सारे विश्व के लिये आदर्श है । इस आदर्श को कलंकित करने वाला व्यक्ति पापी है । भगवद् भक्ति से पाप का राशि भस्मी भूत होता है । भगवद् भक्ति से आत्म साक्षात्कार या दैव साक्षात्कार, ब्रह्म साक्षात्कार का लाभ होता है ।

अब हम संकीर्तन के विषय में विचार करेंगे । भक्ति भाव का द्योतक ही संकीर्तन है । भगवान् की स्तुति को संकीर्तन कहते हैं । वास्तव में भगवान् किसी प्रकार की स्तुति को नहीं चाहता है । वह केवल हमारे हृदय के प्रेम को चाहता है । हृदय के प्रेम की सरिता बढ़कर जब बाढ़ बन जाती है, तब वह संकीर्तन का रूप धारण करती हो । दिखावटी संकीर्तन से भगवान् कभी संतुष्ट नहीं होता है । सच्चा संकीर्तन करने वाले अपनापन खो देते हैं ।

सच्चा संकीर्तन करने वालों से दुष्ट शक्तियाँ दूर भाग जाती हैं । सच्चा संकीर्तन करने वालों का हृदय शुद्ध होता है । सच्चा संकीर्तन करने वाले सच्चे भक्त होते हैं । सच्चा संकीर्तन करने वालों का जीवन निष्काम सेवा हुदय से परिपूर्ण रहता है । भगवान् के सिवाय अन्य विषयों को चाहने वाले मनुष्य सच्चा संकीर्तन नहीं कर सकते हैं । कीर्ति प्रतिष्ठा को चाहने वाले भगवान् का सच्चा संकीर्तन नहीं कर सकते हैं । धन और ऐश्वर्य को चाहने वाले भगवान् का

सच्चा संकीर्तन नहीं कर सकते हैं । जिनका मन मुरली मनोहर भगवान् में लीन होता है,

वह व्यक्ति सच्चा संकीर्तन कर सकता है ।

संकीर्तन से ही मीरा बाई वृन्दावन में श्रीकृष्ण भगवान् का दर्शन करके कुंज गलियों में नाची थीं । संकीर्तन से ही भक्त प्रह्लाद अपने पिता हिरण्यकशिपु के आत्मोद्धार के लिये एक खम्भ में श्रीनरसिंह भगवान् को प्रकट कर सका था । संकीर्तन से ही श्री मोहनदास करमचन्द गाँधी जी बीसवीं शताब्दी में भारत देश को विदेशी पालन से मुक्त करवा पाये थे । अतः भगवान् का प्राकट्य ही सच्चे संकीर्तन का फल है अथवा भगवान् की कृपा का प्राकट्य ही सच्चे संकीर्तन का फल है । इस फल को प्राप्त करके हम सब लोग अपने जीवन को सफल बनायें, यही मेरी कामना है ।

ओं तत् सत् ।

ओं शान्तिः शान्ति : शान्ति : ।

शिवानन्द आश्रम,
ऋषिकेश

पुत्र भूल तू जग में आया, माया ने तुझ को भरमाया ।
तू है अलख निरंजन बेटा, जग माया ने तुझे लपेटा ।।
है तू इस शरीर से न्यारा, परमात्मा शुद्ध अविकारा ।
वही जतन तू कर सुत मेरे, जिससे छूटें बन्धन तेरे ।।

मदालसा

(श्रीगोपाल संकीर्तन मण्डल, खुरजा - बाईसवाँ वार्षिकोत्सव 2008)

# सर्व धर्म समभाव
## स्वामी हंसानन्द

चार प्रकार के पुरुषार्थ होते हैं। वे हैं धर्म, अर्थ, काम और मोक्ष। ये मानव जीवन भवन के चार स्तम्भ के समान हैं। धर्म के बिना मनुष्य अर्थ, काम और मोक्ष को पा नहीं सकता। अर्थ के बिना इस दुनिया में कोई जीवित नहीं रह सकता है। काम के बिना इस शरीर का अस्तित्व नहीं हो सकता है। मोक्ष के बिना मनुष्य अपने जीवन को सार्थक नहीं कर सकता है। इस कारण से धर्मार्थ काम और मोक्ष परस्पर अविनाभाव सम्बन्ध रखते हैं। मनुष्य के शरीर में मुख्य अंग चार हैं। धर्म हमारे शरीर के चरण के समान है। अर्थ हमारे शरीर के उदर के समान है। काम हमारे शरीर के बाहु के समान है और मोक्ष हमारे शरीर के सिर के समान है। इस कारण से वस्तुतः धर्मार्थ काम और मोक्ष सब मिल कर एक ही चीज़ है।

अलग-अलग मानने से अलग-अलग जाति उत्पन्न होते हैं; जैसा कि ब्राह्मण, क्षत्रिय, वैश्य और शूद्र। ब्राह्मण हमारे सिर हैं। क्षत्रिय हमारे बाहु हैं। वैश्य हमारा उदर हैं और शूद्र हमारे चरण हैं। अगर कोई ब्राह्मण शूद्र को दूर हटाता है, तो वह अपने ही चरण को अपने से अलग कर देता है। इसी प्रकार अगर कोई शूद्र ब्राह्मण को अपने से अन्य मानता है, तो वह अपने ही सिर को अपने से अलग मानता है। अगर कोई क्षत्रिय, ब्राह्मण, वैश्य और शूद्र को अन्य मानता है, तो उसे अपने सिर, उदर और चरण से अलग होना पड़ता है। अगर कोई वैश्य, ब्राह्मण, क्षत्रिय और शूद्र को अन्य समझता है तो वह अपने सिर, बाहु और चरण को अलग मानता है। सिर, बाहु, उदर और चरण एक ही शरीर के अंग हैं, ऐसा मानने से व्यक्ति पुष्टिवान्, बलवान् और बुद्धिमान होता है।

उसी प्रकार ब्राह्मण, क्षत्रिय, वैश्य और शूद्र एक ही समाज के हैं, ऐसा मानने से समाज सुसम्पन्न हो जाता है।

धर्मार्थ काम, मोक्ष केवल भारतीय लोगों के लिये सीमित नहीं हैं; ये चार मानव मात्र के लिए अत्यावश्यक हैं। धर्मार्थ, काम, मोक्ष को नहीं अपनाने के कारण ही आज देश में अराजकता व अलगाव उत्पन्न हो रहा है। सत्य

का लोप होने से धर्म का भी लोप हो जाता है । सत्य ही भगवान् है । इस कारण से ''सत्यमेव जयते नानृतम्'' कहा गया है । धर्मार्थ, काम, मोक्ष, सत्य के ऊपर निर्भर हैं । सत्य को अपनाने वाला मनुष्य ही अपने जीवन में धर्मार्थ, काम, मोक्ष को पालन कर सकता है ।

सत्य को अपनाने वाला ही अहिंसा को भी अपने जीवन में पालन कर सकता है । अहिंसा से जीवन की शक्ति बढ़ती है । सत्य और अहिंसा को अपने जीवन में उतारने के कारण ही श्री मोहनदास करमचन्द महात्मा गाँधी जी भारत माता को ब्रिटिश राज्य पालन से मुक्त करा सका । अतः सत्य और अहिंसा के पालन के बिना सर्व धर्म समभाव असम्भव है । वास्तव में धर्म एक ही होता है । सत्य वस्तु को नहीं भूलना ही धर्म का स्वरूप है । इस दुनिया में सत्य को खोजना अन्धकार में सूई को खोजने के बराबर है ।

मण्डल के सभी भक्तों की कुशल क्षेम पूछा करते थे । मण्डल द्वारा महाराजश्री के आश्रम को अनेकों बार कम्बल आदि प्रदान कर सेवा की गई, परन्तु वह उनका वितरण अन्य साधू-संत व असहायों के बीच दिया करते थे । खुरजा प्रवास के दौरान भक्तों द्वारा भेंट किये गये वस्त्रादि वह नगर के बाहर स्वयं जाकर गरीबों को प्रदान कर दिया करते थे ।

तीर्थ भ्रमण की उनमें बहुत जिज्ञासा थी । वह छोटे से छोटे तीर्थस्थान, संत आश्रम व मन्दिरों के दर्शन करने के इच्छुक रहते थे । एक बार गुरुपूर्णिमा के अवसर पर मण्डल की ओर से श्री रमेश चन्द्र (कटपीस वाले) के नेतृत्व में श्री शिवशक्ति योगाश्रम, नरौरा पर भण्डारे का आयोजन किया गया । खुरजा से प्रातः प्रस्थान के समय मूसलाधार वर्षा प्रारम्भ हो गई । भक्तों का बस तक पहुँचना कठिन हो रहा था । मण्डल के समर्पित भक्तों ने निजी वाहन, कार आदि से यात्रियों को लाना प्रारम्भ कर दिया । लगभग २०० यात्रियों (तीन बसों द्वारा) के जाने की व्यवस्था थी । मैंने टेलीफोन से महाराजश्री को अवगत कराया । महाराजश्री ने कहा कि मैं समाधी पर बैठता हूँ, तुम लोग निर्भय होकर यात्रा प्रारम्भ करो । बस फिर क्या था ? इन्द्र देवता प्रसन्न हुए, देखते ही देखते आसमान साफ होने लगा । यात्रा आश्रम तक सुरक्षित पहुँची । भण्डारे में संत प्रसाद के समय महाराजश्री स्वयं संत-दर्शन कर उनका स्वागत सत्कार किया करते थे । अखण्ड रामचरित मानस पाठ में उनकी अत्यधिक रुचि थी । अपने जीवनकाल में उन्होंने लगभग ५००० ऐसे ही अनुष्ठान आयोजित किये या भक्तों द्वारा पूर्ण कराये । अपने आश्रम में वह एक-दो सप्ताह का

अखण्ड पाठ अनेकों बार आयोजित कर चुके थे । उनके अन्तिम समय में भी आश्रम में शिवशक्ति महायज्ञ का आयोजन सुनिश्चित था । जिसकी अध्यक्षता कार्ष्णि स्वामी गुरु शरणानन्द जी महाराज को करनी थी । यज्ञ की वेदियाँ तैयार हो रही थीं । यज्ञशाला लगभग पूर्ण थी । अचानक महाराजश्री अस्वस्थ हो गये, भक्तों द्वारा उन्हें अलीगढ़ नर्सिंगं होम में इलाज हेतु भर्ती कर दिया गया । तीन दिन तक विश्राम करने के बाद १७ अक्टूबर, २००९ को सायं लगभग ७ बचे उस दिव्य आत्मा में हरि से मिलन की चाह जागृत हो उठी । उन्होंने अपने सेवकों को संध्या वन्दन हेतु बाहर जाने का आदेश दिया और एक भक्त से श्री शिव शक्ति चालीसा (स्वरचित) पाठ करने का अनुरोध किया । पाठ अपने अन्तिम श्लोक पर था, तभी ऊँ शब्द की ध्वनि महाराजश्री के कंठ से उठी अैर ब्रह्माण्ड को भेद कर मोक्ष धाम पहुँच गया । वह दिव्य संत पूर्णानन्द, सम्पूर्णानन्द में विलीन हो गया ।

उनके पार्थिव शरीर को भक्तों द्वारा नरौरा शिव शक्ति आश्रम पर ले जाया गया । १८ अक्टूबर, २००९ को प्रातः लगभग ११.३० बजे आश्रम में ही महाराजश्री को समाधी दे दी गई । यह वही स्थान था जहाँ १२ वर्ष पूर्व महाराजश्री ने अपनी अन्तिम समाधी हेतु गुप्त गुफा बनवाई थी । परन्तु भक्तों के आग्रह पर उसे पूर्व में ही पाटकर समाप्त कर दिया गया था ।

उनके आशीर्वाद की ध्वनि आज भी हमें श्रवण हो रही है । उनके तप की विकीरण रश्मियाँ आज भी हमें आध्यात्मिक ऊर्जा प्रदान कर रही हैं । धन्य है यह धरा, धन्य है यह राष्ट्र जहाँ महाराजश्री सरीखे संत मानव कल्याण हेतु जन्म लेकर लीलायें करते हैं ।

उनके श्री चरणों में शत् शत् नमन !

(श्रीगोपाल संकीर्तन मण्डल, खुरजा)

क्योंकि यह दुनिया असत्य है । इस कारण से यह दुनिया नाशावान है । जो भी नाशवान है, उसको सत्य नहीं कह सकते हैं ।

श्रीकृष्ण भगवान् ने श्रीमद्भगवद् गीता में कहा है कि ''सर्व धर्मान् परित्यज्य मामेकं शरणं ब्रज'' । इसका भाव यह है कि ''हे अर्जुन ! सब धर्मों को छोड़कर केवल मेरे ही शरण में आओ ।'' इसका मतलब यह है कि सब धर्म भगवान् में सम्मिलित हैं । अतः सर्व धर्म समभाव के लिये मनुष्य को केवल भगवान् के ही शरण में जाना है । यहाँ समझने की बात यह है कि श्रीकृष्ण भगवान् एकदेशीय नहीं हैं । अगर भगवान् एकदेशीय होते तो इस कलियुग में हम श्रीकृष्ण भगवान् को भूल जाते । अल्लाह, जीसस, बुद्ध इत्यादि सब एक ही भगवान् के भिन्न - भिन्न नाम हैं । केवल इस विषय को जानने से ही सर्व धर्म समभाव हो सकता है अन्यथा सर्व धर्म सम्भाव होना समभाव है । ओ३म् शान्तिः शान्तिः शान्तिः !

शिवानन्द आश्रम,
ऋषिकेश (उत्तराखण्ड)

संसार की किसी वस्तु को पाकर अहंकार न करो, सभी विषयों में एक से एक बढ़कर लोग पड़े हैं । अपने को छोटा मानकर नम्रता और विनय के साथ सबसे सम्मानयुक्त व्यवहार करो । तभी सच्ची राह मिलेगी । जो अहंकार में अन्धे हो रहे हैं, वे तो पथभ्रष्ट हैं ।

# टमाटर खाएँ
# वजन घटाएँ

मानना पड़ेगा टमाटर वास्तव में हमारी खूबसूरती में चार चाँद लगा देता है । इसे खाने से न सिर्फ गाल और होंठ लाल होते हैं, बल्कि छरहरी काया भी मिलती है । रीडिंग यूनिवर्सिटी, लंदन की ताजा अध्ययन रिपोर्ट पर गौर फरमाएँ तो टमाटर आकर्षक रंग-रूप और काया पर इतराने की पूरी गारंटी देता है । इसमें मौजूद पौष्टिक तत्व शरीर में एपेटाइट हारमोन का स्तर नियंत्रित रखते हैं । लिहाजा वजन घटाने के लिए ना तो डायटिंग की जरूरत पड़ती है और ना ही जिम जाने की ।

'डेली एक्सप्रेस' के मुताबिक टमाटर के सेवन से पेट भरा-भरा सा लगता है । एपेटाइट हारमोन का लेवल कम रहने की वजह से जल्दी कुछ खाने या पीने की तलब नहीं जावाती है । प्रमुख शोधकर्त्ता डॉ० जूली लवग्रोव की मानें तो रोजाना सलाद में टमाटर शामिल करके लोग एक्सरसाइज की फिक्र भूल सकते हैं । टोमैटो सूप या सैंडविच लेने के बाद खाने पर खुद बखुद कंट्रोल हो जाता है । लवग्रोव १७ महिलाओं को तीन गुट में बाँटकर उन्हें सादी ब्रेड, टोमैटो सैंडविज और गाजर के सैंडविच खिलाकर इस नतीजे पर पहुँची हैं ।

'अमर उजाला' से साभार

# मन की शान्ति

(प्रा० वासुदेव रणदेब)
एम.ए. (दर्शनशास्त्र,इतिहास, राजनीति शास्त्र),
एम.एड., एल-एल. बी.

श्री स्वामी चिदानन्दजी महाराज सन् 1959 में जब पहली बार अमेरिका गए तो जैसे ही उन्होंने उस धरती पर पैर रखे तो जो पत्रकार और अमेरिकन उनको मिला तो पहला प्रश्न उन्होंने इस प्रकार किया, ''स्वामी जी, हम वस्तुनिष्ठ देश के हैं और आप विचारनिष्ठ देश से आए है । हमारी समस्या यह है कि हमारे पास आज धन, दौलत और सुख की सारी सामग्री है फिर भी हमारा मन सदा अशांत रहता है। कृपया हमें बताएँ कि इस तनाव से हम कैसे मुक्त हो सकते हैं ।'' स्वामी जी ने कहा कि मानव की सबसे बड़ी गलती यही है कि वह समझता है कि वस्तुओं से हमें सुख मिलेगा, वह रात दिन वस्तुओं को इकट्ठा करने में लगा रहता है । वस्तुओं की इस दौड़ ने उसके मन की शांति छीन ली है, और वह जीवन के वास्तविक लक्ष्य को भूल गया है । भगवान् ने जो आपको दे रखा है, उसका उपयोग करने में कोई हर्ज नहीं, परन्तु उपयोग और अन्धाधुन्ध भोग में लिप्त होने में अन्तर है ।

मनुष्य सुख में और भोग में कोई अन्तर नहीं समझता परन्तु वास्तव में सुख और भोग में जमीन आसमान का अन्तर है। भोग चाँद की तरह है जिसमें स्वयं की रोशनी नहीं है लेकिन लगता है कि उसमें रोशनी है। वास्तव में चाँद की रोशनी भ्रम मात्र है। इसी तरह भोग हमें विलासिता दे सकते हैं,सुख नहीं।

शान्ति तब मिलेगी जब तुम्हें अपने असली रूप का पता चलेगा कि मैं कौन हूँ ? कहाँ से आया हूँ ? और मुझे कहाँ जाना है ? लेकिन स्वयं को स्वयं ही जाना जा सकता है। आज का मानव तो अपने आप को भूल चुका है, वह व्यवसायिक विकास तथा कॉकटेल पार्टियों में उलझा रहता है और दिन रात अर्थवादी दौड़ में टूटता और थकता रहता है। अध्यात्म कहता है थोड़ी आंतरिक शक्ति जुटाओ जिससे चक्रव्यूह से पार निकल सको ।

अगर तुम्हें मन की शान्ति चाहिए तो दिल की आवाज सुनो और मन के कहने पर मत चलो । अपनी आत्मा की आवाज को भगवान् का भेजा हुआ संदेश समझो ।

धन का जीवन में महत्व है परन्तु इसी को जीवन में सब कुछ मत समझो । शान्ति और इच्छाओं की पूर्ति दोनों अलग-अलग हैं । आपको अपनी इच्छाओं को अंकित करना होगा । वर्तमान में आदमी थक रहा है, टूट रहा है और निराश है । माया के चक्रव्यूह ने उसे पागल बना दिया है, इसलिए हर समय वह चिड़चिड़ा और अशान्त रहता है । इसलिए यदि तुम्हें शांति चाहिए तो अपने मन पर नियन्त्रण करो । पदार्थो को संग्रहित करने की दौड़ से परे रहो और, और, और तथा मैं, मेरा और मुझे ने हमें पागल बना दिया है । संतों ने कहा है, ''कुछ, समय शांत होकर एकान्त में बैठो और सात्विक विचारों में विचरण करो । ईश्वर को हर वस्तु और स्थान पर देखो, आपको मन की शान्ति मिलेगी ।'' यह मन की शान्ति का मुख्य द्वार है।

# वरिष्ठ नागरिकों के लिए प्रेरणादायक सामग्री

## स्वामी हंसानन्द सरस्वती

नगर में रहने वाले नागरिक कहलाते हैं । उदाहरण के लिए - शिवानन्द नगर, गान्धी नगर, नरेन्द्र नगर इत्यादि । निम्न स्थाई से ऊँचा स्थाई तक पहुँचना ही वरिष्ठ नागरिक बनने का अर्थ है । इसके

लिए सद्गुरु श्री स्वामी शिवानन्द जी महाराज अति सरल उपाय बताते हैं । वह है - BE GOOD - DO GOOD का भाव ''भले बनो - भला करो'' । आध्यात्मिक शिखर स्थाई की दृष्टिकोण से सब लोग भले ही हैं । परन्तु इस दुनिया में कई प्रकार के समस्याओं को, कष्ट परम्पराओं को, शारीरिक और मानसिक व्याधियों को हमको भोगना पड़ता है । इसका कारण क्या है ? हम भले नहीं हैं । इसलिए सद्गुरु स्वामी शिवानन्द महाराज ने कहा है कि ''भले बनो'' । भले किस प्रकार बन सकते हैं ?

कदम-कदम पर, हर समय और हर जगह पर भगवान् का स्मरण करने से हम भले बन सकते हैं । भले बनने के बाद भला करना अपने आप आरम्भ हो जाता है । गुलाब का फूल सुगन्ध को अपने आप फैलाता है । क्योंकि वह स्वभावतः सुगन्ध स्वरूप है । इसी प्रकार भले मनुष्य भले काम को अपने आप करते हैं । उनके हदय में प्रेम भाव रहता है । उनके हदय में दया भाव रहता है । उनके हदय में सेवा भाव रहता है । उनके हदय में पवित्र भाव रहता है । उनका हदय भगवद् चिन्तनामृत से भर जाता है । उनका हदय भगवान् के संकीर्तन में लीन रहता है । उनका हदय भगवदायत्त चित्त वृत्ति नामक वित्त से भरपूर रहता है । भगवन्नामामृत का पान करने वाला हर एक व्यक्ति वरिष्ठ नागरिक बन सकता है । केवल खान-पान से, सोने-जागने वाला व्यक्ति का वरिष्ठ नागरिक बनना, मरु भूमि में पानी को पाने के समान होता है ।

श्री सद्गुरु स्वामी शिवानन्द महाराज ने वरिष्ठ नागरिक बनने के लिए और एक सरल मार्ग बताया है । वह यह है कि God first, World next, yourself last ''भगवान् पहला, दुनिया दूसरा, आप आखिरी'' । इसका मतलब है भगवान् हमारे मार्गदर्शक हैं । वे गुरुजी के रूप में आकर हमको

आध्यत्मिक जीवन जीने का मार्ग दिखाते हैं । उस मार्ग पर चलने से दुनिया हमारी मित्र बन जाती है । अगर हम भगवान् या गुरुजी के आदेश को नहीं मानते हैं, तो दुनिया हमारी शतृ बन जाती है । इसलिए भगवान् के बाद दुनिया को दूसरा नम्बर दिया गया है । आप आखिरी । क्यों ? एक व्यक्ति का शारीरिक बल अत्यन्त निकृष्ट होता है । मानसिक बल निर्वीर्य होता है । बुद्धि बल समृद्धि नहीं होती है । आत्म बल नहीं के बराबर होता है ।

अगर हम वरिष्ठ नागरिक बनना चाहते हैं, तो हमारे शरीर को परोपकार के लिए विनियोग करना चाहिए । हमें अपने मन को मनोकामनाओं से रहित करना
चाहिए । हमें अपनी बुद्धि को भगवान् के चिन्तन से शुद्ध करना चाहिए । अपनी आत्मा को परमात्मा

के चिन्तन में नियुक्त करना चाहिए । श्रीमद्भगवद्गीता में श्रीकृष्ण भगवान् ने कहा है कि ''वासुदेवः सर्वमिति स महात्मा सदुर्लभः ।'' परमात्मा की सर्व व्यापकता को अनुभव करने से आखिरी अवस्था में स्थित व्यक्ति पहली अवस्था तक पहुँच सकता है । सर्व शक्तिमान बन सकता है । सर्वज्ञ बन सकता है । यही वरिष्ठ नागरिक का स्वरूप है । आकार में सामान्य शरीरधारी होने पर भी उनका अन्तः करण सर्वदा सच्चिदानन्द पर ब्रह्म में लीन रहता है । वे दुनिया में रहते हुए भी दुनिया से ऊपर विराजमान होते हैं ।

वरिष्ठ नागरिक बनने के लिए सद्गुरु श्री स्वामी शिवानन्द जी महाराज ने तीसरा सरल उपाय भी बताया है । वह है - ''Start the day with God, End the day with God, Live the day with God, Fill the day with God. इसका मतलब यह है कि ''भगवान् से दिन को आरम्भ करो, भगवान् से दिन को समाप्त करो, भगवान् के साथ जीवन को बिताओ और भगवान् से दिन को भरो'' । हमें बिस्तर से उठते ही भगवान् का नाम लेना चाहिए । क्यों ? सोते समय भगवान् ने ही हमारी रक्षा की है । सोने से पहले भी हमें भगवान् का नाम लेना चाहिए । क्यों ? पूरे दिन भर जो भी काम हम करते हैं, वे सब भगवान् की कृपा से ही करते हैं । मेरा अपनी कलम से लिखना भगवान् की दी हुई शाक्ति से ही सम्भव हुआ । आपका पढ़ना आँखों को भगवान् की दी हुई शक्ति से ही सम्भव हुआ । इस प्रकार समस्त कार्य भगवान् की दी हुई शक्ति से ही सम्पन्न होते हैं । ऐसा सोचने से हमारा जीवन भगवन्मय हो जाता है । वास्तव में हम भगवान् में ही अपना जीवन बिता रहे हैं। भगवान् से हमें दिन को भरने की आवश्यकता नहीं है । क्यों ? भगवान् के बिना दिन या रात होता ही नहीं । इसमें, उसमें, सब में भगवान् ही समाया हुआ है । इस प्रकार का चिन्तन ही वरिष्ठ नागरिकों का लक्षण होता है । वरिष्ठ नागरिक अपने जीवन का लक्ष्य पाने के लिए ही अपने जीवन को बिताता है । भगवत्प्रेम

ही वरिष्ठ नागरिक के लिए प्रेरणादायक सामग्री है । इस बात को अच्छी तरह समझकर आचरण करने वालों का जीवन धन्य होता है, कृतकृत्य होता है और उनका जीवन समस्त जगत के लिए आदर्श प्राय बन जाता है । ओं तत् सत् । ओं शान्तिः शान्तिः शान्तिः ।

गुरु कुटीर, गंगा तट,

शिवानन्द आश्रम, ऋषिकेश

मानव जीवन की सार्थकता

हमारी संस्कृति हमें सिखाती है कि हम स्वयं के लिए नहीं वरन् दुसरों के लिए जिएँ, स्वयं आधा पेट भोजन खाकर दूसरों की भूख मिटायें तथा स्वयं कष्ट सह कर दूसरों का कष्ट दूर करें । जीवन का यही रहस्य है । इसी को जीवन जीना कहते हैं और इसमें ही मानव-जीवन की सार्थकता है ।

- स्वामी चिदानन्द

एक कहावत है कि ''न गृहं गृहमित्याहुः गृहिणी गृहमुच्यते'' । इसका तात्पर्य यह है कि ईंट, पत्थर, चूना, सीमेन्ट इत्यादि से बना हुआ घर, घर नहीं कहलाता है, परन्तु जिस घर में गृहिणी (गृह को सुचारू रूप से देख भाल करने वाली महिला) रहती है, वह असली गृह या घर कहलाता है । कारण यह है कि गृह के यजमानी से लेकर बाल-बच्चे सब गृहिणी के ऊपर आधारित रहते हैं । आज कल की महिलाएँ अपना गृह धर्म छोड़कर धन के लोभ के कारण नौकरी-चाकरी करती हैं, यह अत्यन्त निकृष्ट कर्म है । क्योंकि नौकरी-चाकरी करने से बच्चों के ऊपर माता का प्रेम, अनुराग, स्नेह बिलकुल नहीं रह पाता है । इस कारण से बच्चों का मन विभिन्न मार्गों में जाने लगता है और उनके मन की चंचलता बढ़ जाती है । तब उनके बुद्धि का विकास नहीं हो सकता है । प्रायः बुद्धि का नाश होता है । इस दशा में वे सुचारु रूप से विद्यार्जन किस प्रकार कर सकते हैं ? उनके लिये विद्यार्जन असाध्य हो जाता हो । धीरे-धीरे वे कुसंगति को प्राप्त करने लगते हैं । इस कारण से भ्रष्टाचार को अपनाना पड़ता है । सारे घर में अशान्ति फैल जाती है । गृह के कार्यकलाप सुचारु रूप से नहीं

चल सकते हैं । सदाचार के जगह पर दुराचार राज्य करने लगते हैं । इस हेतु से गृह में जितने सभ्य हैं, उन सब का मन भगवदुन्मुख नहीं हो पाता है ।

पूर्व काल में गृहिणी गृह लक्ष्मी मानी जाती थी, पूरे घर की देवी मानी जाती थी, पतिव्रता मानी जाती थी । पुरुष की पत्नी भार्या कहलाती है । इसका मतलब है कि पुरुष अपनी स्त्री का भरण पोषण करता है, परन्तु पत्नी पूरे घर का भरण पोषण करती है । केवल धन घर का भरण पोषण

## सद्गृहस्थ

**स्वामी हंसानन्द**

कर नहीं सकता । आध्यात्मिक दृष्टिकोण से ही पूरे घर का भरण पोषण हो सकता है । भार्या घर की ज्योति है । इस ज्योति के बिना घर एक अन्ध कार कूप बन जाता है । घर के कार्यकलाप भगवदुन्मुख होने से पहले घर में जितने लोग रहते हैं, उन सब लोगों का मन भगवदोन्मुख होना अनिवार्य है । यह कार्य केवल गृह की दिव्य ज्योति भार्या ही कर सकती है, न कि नौकरी-चाकरी करने वाली औरत । अपने बच्चों का पालन करते समय गृहिणी को बालक को बाल कृष्ण या बाल राम या बाल शिव समझना चाहिये । बालिका को बाला राधा या बाला सीता या बाला पार्वती समझना चाहिये । तब भगवद्भजन के बीज बच्चों के साथ-साथ गृह में रहने वाले सभी सभ्यों के हदय क्षेत्र में बोये जाते हैं । गृहिणी अपने बच्चों को अपनी गोद में लेकर सति मदालसा की भाँति ''शुद्धोच्सि बुद्धोच्सि निरञ्जनोच्सि, संसार माया परि वर्जितोच्सि'' गीत गाना चाहिये या भगवद् गुणगान करना चाहिये तब निश्चय ही घर एक स्वर्ग बन जाता है ।

प्रातःकाल उठते ही बच्चों को भूमाता और सूर्य भगवान को हर रोज प्रणाम करना सिखाना गृहिणी का कर्तव्य है । सोने से पहले अपने आप भगवान् का स्मरण करके बच्चों को आदर्श प्राय बनाना चाहिये । टी०वी० पर केवल भगवत्कथा सम्बन्धी चित्रों को बच्चों को दिखाना चाहिये । हर रोज घर में केवल भक्ति चैनल ही चलना चाहिये, न कि अन्य अनावश्यक चैनल । घर के वातावरण को प्रशान्त रखने के लिये केवल गृह यजमान की पत्नी ही सामर्थ्य

रखती है । नारी की हदय पवित्रता से सारे घर की शुद्धि होती है । उस घर से काम, क्रोध, मद, मात्सर्य, अहंकार आदि भूत पिशाच दूर भाग जाते हैं । उस घर में सकल ऐश्वर्य भरे पड़े रहते हैं । घर के पूरे सभ्यों में परस्पर प्रेम भाव, स्नेह भाव, समता भाव, दिव्य भाव उत्पन्न होते हैं । वह घर समस्त पुरवासियों के लिये आदर्श बन जाता है । इस प्रकार गृहस्थी के कार्यकलापों एवं आचरण को भगवदुन्मुख करने हेतु केवल गृहिणि ही एकमात्र सामग्री है, न कि नाना प्रकार की वस्तु सामग्री । असली गृहिणी के लिये अपना घर एक स्वर्ग ही है । घर के सभी सभ्य उनके लिये देवी और देवता ही बन जाते हैं । अन्य मनस्तत्व की गृहिणी के लिये घर एक नरक बन जाता है । अतः गृहिणी का मन मन्दिर सदा शुद्ध होना चाहिये ।

ओं तत् सत् ।

ओं शान्तिः शान्तिः शान्तिः ।

शिवानन्द आश्रम,

ऋषिकेश (उत्तराखण्ड)

भक्ति माता परम प्रेम रूपा है । परम पिता परमेश्वर पर परम प्रेम को रखना ही भक्ति कहलाती है । ''भज सेवायाम्'' का मतलब है कि सेवा करने के लिए भक्ति परम आवश्यक है । पैसा लेकर नौकरी-चाकरी करना भक्ति नहीं होती है । भक्ति में निष्कामता भरी रहती है । काम करते हुए फल की आशा नहीं रखना, ''निष्कामता'' कहलाती है । फल की आशा क्यों नहीं रखना है ? अनन्त फल को प्राप्त करने के लिए । अनन्त फल क्या चीज है ? भगवत् प्राप्ति ही अनन्त फल है । कब तक निष्काम सेवा करनी चाहिए? जब तक भगवत् प्राप्ति नहीं होती, तब तक निष्काम सेवा करनी चाहिए । भगवत्प्राप्ति के उपरान्त क्या होगा? आनन्द ही आनन्द । इसका मतलब है कि परमानन्द की प्राप्ति होगी । परमात्मा परमानन्द घन है । आनन्द के बिना परमात्मा का अस्तित्व नहीं है । परमात्मा चैतन्य स्वरूप भी है । परमात्मा सत्य वस्तु है । परमात्मा चैतन्य स्वरूप है और परमात्मा आनन्द स्वरूप है । इसलिए परमात्मा का निर्वचन है सच्चिदानन्द स्वरूप । इस चीज को जानकर हम भगवद् भजन करने से हमारा जीवन का लक्ष्य

पूर्ण हो सकता है । यही है मानव जीवन का उद्देश्य । केवल मानव जीवन ही जीवन लक्ष्य को प्राप्त करने के लिए उपयुक्त है । अन्य योनियों में यह कार्य सिद्ध नहीं होगा ।

अब संकीर्तन का मतलब क्या है ? भगवद् भक्ति में अपने आप को खो देना संकीर्तन कहलाता है । संकीर्तन के आदर्श पुरुष हैं श्री चैतन्य महाप्रभु । वे संकीर्तन करते-करते पुरी के जगन्नाथ मन्दिर में श्री जगन्नाथ में विलीन हो गये थे और भक्तिमति मीराबाई अपनी इष्ट देवता श्रीकृष्ण भगवान् का भजन करते करते वृन्दावन में श्रीकृष्ण में सम्मिलित हो गयीं थी । भगवान् का असली भक्त संकीर्तन करते करते बाह्य प्रपञ्च को भूल जाता है । सारी दुनिया उनके लिए तृण प्राय हो जाती है । फिर भी सारी दुनिया का आधार केवल राधा-माधव ही है समझता है । यहाँ राधा और माधव एक दूसरे से अन्य नहीं हैं । राधा ही माधव हैं और माधव ही राधा हैं । फिर एक ही वस्तु को दो शब्द का प्रयोग करने की क्या आवश्यकता पड़ी है ? दो शब्द का प्रयोग हमारे लिए किया गया है । राधा जीवात्मा है और माधव परमात्मा है । राधा-माधव शब्द वेदान्त तत्व का चिन्तामणि है । इस मणि को पाने के लिए ही संकीर्तन किया जाता है । चिंतामणि में दुनिया की सारी चीज सम्मिलित हैं इसलिए चिन्तामणि जिस चीज को हम चाहते हैं, उस चीज को दे सकती है । आध्यात्मिक साधक की सब चिंताओं को दूर करके शान्ति को प्रदान करती है । संकीर्ण मन को हटा कर सम्पूर्ण तृप्ति को प्रदान करने वाली वस्तु है संकीर्तन ।

राधा-माधव तत्व कामधेनु के समान है । जिस वस्तु को चाहे उस वस्तु को देने वाली माता कामधेनु है । राधा-माधव की चिंतन से मनुष्य पूर्ण काम बन जाता है । इसका मतलब है कि मांगने के लिए कुछ चीज शेष नहीं रहती है फिर भी कामधेनु माता इस शरीर के संचालन के लिए सब कुछ देती है । मनुष्य अमरत्व को प्राप्त करने तक कामधेनु माता भक्त के शरीर का संरक्षण करती रहती हैं । राधा-माधव एक ही हैं । अगर हम निष्काम सेवा को चिंतामणि समझते तो भक्ति माता कामधेनु के समान है और यह संकीर्तन कल्प वृक्ष के समान है । इस प्रकार निष्काम सेवा, भक्ति एवं संकीर्तन एक ही वस्तु है । परमानन्द प्राप्ति के लिए हम सब लोग इन तीन गुणों को अपनाकर जीवन को सफल बनायें । जिस प्रकार

राधा और माधव में अन्तर नहीं है, उसी प्रकार निष्काम सेवा, भक्ति एवं संकीर्तन में अन्तर नहीं है। इस तथ्य को जानकर हम अपने जीवन को कृतकृत्य बनायें। भगवत्प्राप्ति के बाद इस दुनिया में करने के लिए कुछ भी शेष नहीं रहेगा क्योंकि समस्त विश्व उस समय विश्वेश्वर

में समाया होता है।

ॐ तत् सत्। ॐ शान्तिः शान्तिः शान्तिः।

एकता ही धर्म है। अनेकता ही अधर्म है। धर्म में राष्ट्रीय एकता समायी हुई है। धर्म में सब सम्प्रदाय सम्मिलित होते हैं। हृदय का सौहार्द्र ही धर्म कहलाता है। सब प्राणियों में समभाव ही धर्म है। सत्य की पथ प्रदर्शिका धर्म कहलाता है। सत्य एक है, इसलिए धर्म भी एक ही है। माया से अनेक पदार्थ उत्पन्न होते हैं। जगत् मिथ्या कहा जाता है, क्योंकि उसमें अनेक पदार्थ होते हैं। एक से अनेक उत्पन्न होते हैं। एक ही परमात्मा से अनेक रूपी या बहुरूपी जगत् उत्पन्न होता है। जगत् का आधार जगत्पति है। जगत्पति का आधार कुछ भी नहीं होता है। इसलिए जगत आधेय है और जगत्पति या जगत्पति माया के सहयोग से इस जगत का निर्माण करता है। यह जगत केवल भगवान् की लीला या क्रीड़ा है। भगवान् से दूर होने से हम कर्म के बन्धन में फँस जाते हैं। इससे छुटकारा पाने के लिए भगवान् का आश्रय लेना जरूरी है। माया हमको हमेशा भगवान् से दूर फेंकती रहती है। भगवान् का आश्रय लेने से माया कुछ भी नहीं कर सकती है। माया का आश्रय लेने से भगवान् भी कुछ नहीं कर सकता है। माया त्रिगुणात्मिका है। तमो गुण बुद्धिमान्द्य का कारण होती है। रजो गुण दुष्ट कर्मों का कारण बन जाता है। सात्विक गुण मन को प्रसन्नता प्रदान करता है और भगवान् की ओर ले जाता है। परन्तु इन तीन गुणों को पार करने से ही भगवान् की प्राप्ति की संभावना है।

धर्म एक गगन कुसुम नहीं है। परन्तु गगनोपरि स्थित परमात्मा का दर्शन कराती है। भगवदुन्मख कर्तव्य ही धर्म है। पृथ्वी अपनी आप की परिक्रमा करते हुए सूर्य भगवान् की परिक्रमा करती है। इस को धर्म का पालन या कर्तव्य निर्वहण कहते हैं। भागीरथी (गंगा जी) निरन्तर अखण्ड रूप से समुद्र की तरफ भागती रहती हैं। यह भी धर्म का पालन या कर्तव्य निर्वहण है। समुद्र का जल ग्रीष्मकाल में

बादल बन कर वर्षा काल में बरसता है । यह भी धर्म का पालन या कर्तव्य निर्वहण है । आम का बीज पौधा बनकर जब वृक्ष होता है, तब उस वृक्ष से हमको आम के फल उपलब्ध होते हैं । यह भी धर्म का पालन या कर्तव्य निर्वहण है । इस प्रकार सारा जगत् धर्म या कर्तव्य निर्वहण पर निर्भर है । बिना धार्मिक कर्म के मनुष्य बिगड़ जाता है । धर्मनिष्ठा से बुद्धि सुप्रतिष्ठित होती है । अधर्म से बुद्धि बिगड़ जाती है । अहंकार के कारण रावण श्रीराम के द्वारा मारा गया था । इसी अहंकार के कारण कंस श्रीकृष्ण के द्वारा मारा गया था । इसी अहंकार के कारण हिरण्यकश्यपु नरसिंह भगवान् के द्वारा मारा गया था । अहंकार के नाश से ''अहं ब्रह्मास्मि'' महावाक्य का अनुभव होता है । अहंकार हमेशा हमको ब्रह्म से दूर हटाता रहता है । जहाँ अहंकार है, वहाँ ब्रह्म नहीं रहता है । जहाँ ब्रह्म है, वहाँ अहंकार नहीं होता है । अहंकार ही अंधकार या अज्ञान है । ब्रह्म ही प्रकाश या ज्ञान है ।

नवधा भक्ति का पालन करना भी धर्म है । नौ प्रकार की भक्तियों में ''श्रवण'' भक्ति प्रथम

है । केवल इसी के आधार या आचरण से मनुष्य अपने जीवन लक्ष्य को प्राप्त कर सकता है । पुत्र को पिता की आज्ञा का पालन करना धर्म है । इसलिए श्रीराम जी ने अपने पिता की आज्ञा का पालन किया था । पत्नी को अपने पति का अनुसरण करना धर्म है । इसलिए सीता माता राज्य और राणीवास सुखों का त्याग करके अपने पति

के साथ वन में चली गयी थीं । छोटे भाई द्वारा अपने बड़े भाई की सेवा करना धर्म है । इसलिए लक्ष्मण जी ने अपने बड़े भाई श्रीराम की सेवा के लिए वन गमन किया था । समस्त धार्मिक कार्य केवल ''श्रवण'' शब्द में सम्मिलित हैं । सद्गुणों की प्राप्ति के लिए केवल ''श्रवण'' ही आधार है ।

आजकल हर एक जगह ''राष्ट्रीय धार्मिक सम्मेलन'' और ''अन्तर्राष्ट्रीय धार्मिक सम्मेलन'' किये जाते हैं ।

**मानव सेवा ही ईश्वर की सेवा है ।**
**उठो ! जागो ! लक्ष्य पर पहुँचने से पहले रुको नहीं ।**
**संकटों से भागो मत, उनका सामना करो ।**
**अपने दोष के लिए तुम किसी को उत्तरदायी न समझो ।**
**कुछ गलत मत करो । दूसरों के लिए पीड़ा मत बनो ।**

परन्तु धर्म का पालन करने वाले एक हजार व्यक्तियों में से एक व्यक्ति मिलना मुश्किल है । भगवान् के संकीर्तन में सारी इन्द्रियाँ भगवान् की सेवा में लग जाती हैं । परन्तु भगवान् का नाम लेते हुए, अगर मन भोगों की तरफ भागने लगे तो लाभ की जगह अनिष्ट ही मिलेगा । इसलिए संकीर्तन करते समय भी सावधानी से रहना आवश्यक है । श्रवण, संकीर्तन इत्यादि नवधा भक्ति केवल भारतीय लोगों के लिए ही सीमित नहीं है । परन्तु ये सब मनुष्य मात्र का परम कर्तव्य है । यही धर्म का सार है । धर्म एक ही होता है । सत्य एक ही होता है । हम सब धार्मिक जीवन बिताकर परम सत्य को या परमात्मा को प्राप्त करें, यही मेरी आकांक्षा है ।

**ओं तत्सत् !**

**ओं शान्तिः शान्तिः शान्तिः !**

शिवानन्द कुटीर,
दिव्य जीवन संघ, ऋषिकेश

# एकता ही पूर्णता है

## स्वाभी हंसानन्द जी महाराज

वास्तव में एकता अद्वैत भावना को सूचित करता है। इसका मतलब है कि केवल भगवान् का अस्तित्व ही सच है। दूसरी वस्तु या दूसरे प्राणी का अस्तित्व नहीं है। हाँ, दूसरी वस्तु या दूसरे प्राणी का रूप तो इन बाह्य चक्षु को जरूर दिखायी पड़ता है, परन्तु यह केवल दिखावटी अस्तित्व है। कारण यह है कि भगवान् के अस्तित्व के बिना किसी वस्तु या किसी प्राणी का रूप नहीं बनता है। इन सबका आधार केवल भगवान् ही हैं। अगर हमारे शरीर में एकता नहीं होती तो आँख, नाक, हाथ, पैर इत्यादि हमारे सारे अंगों में परस्पर झगड़ा चलता रहता। परन्तु हमारे शरीर के सारे अंगों में एकता है। इसलिए हमारे संकल्प के सारे कार्य सुसम्पन्न होते रहते हैं। इसी प्रकार एक घर में कुदुम्ब के सारे सदस्यों में एकता होनी चाहिए। तब वह परिवार आनन्द मंगल से चलता रहेगा। इसी प्रकार हमारे देश के सारे नर-नारियों में एकता रहनी चाहिए। तब विदेशियों को आक्रमण करने की हिम्मत नहीं होगी। एक लकड़ी को तोड़ना आसान है, लेकिन लकड़ियों की गठरी को तोड़ना बहुत कठिन कार्य है। एकता से सुशोभित देश को जीतना भी बहुत कठिन कार्य है। इसी प्रकार जीवात्मा को जीतना आसान है परन्तु विश्वात्मा को जीतना असम्भव है। इस दुनिया में एशिया, यूरोप, अफ्रीका, आस्ट्रेलिया, अमेरिका, अन्टार्किटका नाम से छः खण्ड हैं। परन्तु पृथ्वी एक ही है। हमें विचार करना चाहिए कि यह विश्व केवल पृथ्वी मात्र नहीं है। यह विश्व चौदह लोक से भरा हुआ है। उनके अन्तर्गत पृथ्वी एक है। इस प्रकार चौदह लोकों में हमारा अस्तित्व अणु मात्र भी नहीं है। अहंकार कहता है कि ''मैं सबसे बड़ा हूँ'' परन्तु वास्तव में हम कुछ भी नहीं हैं। सकल चराचर जगत में केवल भगवान् का अस्तित्व सत्य है, अन्य सब असत्य हैं। वे सारे स्वप्न की भाँति हमको दिखाई पड़ती हैं। स्वप्न में हम पहाड़, नदियाँ, समुद्र, जंगल, जानवर इत्यादि सब चीज देखते हैं। परन्तु जाग्रदाावस्था में वे सब अदृश्य हो जाते हैं। इसी प्रकार एकमात्र भगवान् की अनुभूति से चौदह भुवन भी इस पृथ्वी के साथ अदृश्य होते हैं। सारी दुनिया केवल भगवान् का स्वप्न ही है। इसलिए दुनिया नाशवान है। केवल भगवान् अविनाशी है। सत्संग से सत्य वस्तु को हम पा सकते हैं, परन्तु सत्संग अखण्ड होना अनिवार्य है। अखणड सत्संग के लिए मन भगवन्नाम के सागर में डूबना चाहिए। इसी को अखण्ड सत्संग कहते हैं।असत्य वस्तु को भूल जाना चाहिए। जो चीज हमेशा बदलती रहती है, वह असत्य है। शरीर, मन और बुद्धि भी हमेशा बदलते रहते हैं। इसलिए इनसे नाता तोड़कर भगवान् से नाता जोड़ना चाहिए। इसी को कहते हैं ''अखण्ड सत्संग''।

अमृत बिन्दुपनिषद् कहता है कि ''मनएव मनुष्याणां कारणं बन्ध मोक्षयोः'' अर्थात् मन ही मनुष्य के बन्धन का कारण और मोक्ष का कारण भी है। अगर मन जगत नामक स्वप्न में डूब जाता है तो वह बन्धन का कारण बनता है। वही मन अगर सृष्टिकर्ता के स्मरण और भजन-कीर्तन में डूबता है तो वह मोक्ष का कारक बनता है। एक शान्ति मन्त्र इस प्रकार है - ''ओं पूर्णमदः पूर्णमिदं पूर्णात् पूर्ण मुदच्यते । पूर्णस्य पूर्णमादाय पूर्णमेवावशिष्यते ।'' इसका मतलब यह है कि वह परमात्मा पूर्ण है।यह जगत या जीवात्मा भी पूर्ण है। उस पूर्णता से यह पूर्णत्व उत्पन्न हुआ है । उस पूर्णता से यह पूर्ण को निकालने से पूर्णता ही शेष रह जाती है। सारांश यह है कि इस दुनिया का या इस जीवात्मा का इस अहंकार का बिल्कुल भी अस्तित्व नहीं है। केवल उस आत्मा, उस परमात्मा या उस परमपिता का अस्तित्व है। उस पूर्णता को पाने के लिए हमें निरन्तर एकता में स्थित होना चाहिए । इसका मतलब सब कालों में, सब स्थलों में जप, तप, स्मरण, कीर्तन भगवान् का करना चाहिए । इस प्रकार अभ्यास करते-करते ऐहिक जीवन आदर्श जीवन बन जाता है। जिस चीज को पाने से मनुष्य और कुछ पाने की इच्छा नहीं करता है, जिस चीज से पूर्ण तृप्ति मिलती है, जिस चीज से परमानन्द प्राप्ति हो जाती है, वही पूर्णता है। वही हमारे जीवन का परम लक्ष्य है। ओं तत् सत् ।

ओं शान्तिः शान्तिः शान्तिः !!

दिव्य जीवन संघ,

शिवानन्द आश्रम, ऋषिकेश

# नवयुवकों का उत्तम स्वास्थ्य

स्वामी हंसानन्द

इस संसार के सब लोगों के लिए उत्तम स्वास्थ्य अत्यावश्यक है । उत्तम स्वास्थ्य के लिए उत्तम भावना भी अत्यावश्यक है । केवल शारीरिक स्वास्थ्य उत्तम स्वास्थ्य नहीं कहलाता है । उसके साथ-साथ मन का स्वास्थ्य भी अत्यावश्यक है । मन स्वस्थ रहने के लिए मन के मूल तत्व की जानकारी अत्यावश्यक है । मन से ही प्राण और शरीर चलायमान होते हैं । परन्तु मन किससे चलायमान होता है ? यह आत्मा से चलायमान होता है । इस आत्मा को जानने के लिए जीवन बिताना ही आध्यात्मिक जीवन कहलाता है । अन्ततः आध्यात्मिकता ही उत्तम स्वास्थ्य का मूलाधार है । अपने आप में स्थित होना ही स्वास्थ्य कहलाता है । अपने आप में स्थित होने के लिए ''मैं कौन हूँ'' जानना चाहिए । मैं शरीर नहीं हूँ, क्योंकि शरीर प्राण पर निर्भर है । अगर शरीर में प्राण नहीं हो तो इस शरीर का कोई मूल्य नहीं होता है । निर्जीव शरीर को किसी नदी में फेंकना पड़ता है या अग्नि में जलाना पड़ता है या भूमि में दबाना होता है । इसलिए प्राण ही शरीर को मूल्यवान बनाता है । परन्तु यह प्राण भी स्वतन्त्र नहीं है । यह प्राण मन के आधीन रहता है । मन जिस तरफ खींचता है, उस तरफ प्राण और शरीर भागते हैं । मन के कारण से ही हमारा प्राण इस शरीर में बांधा हुआ है । अब हम मन के बारे में सोचेंगे, यह मन क्या है ? संकल्पों का पहाड़ ही मन है । मन के सारे संकल्प इस भौतिक प्रपञ्च के पदार्थ के लिए होते हैं या स्वर्ग लोक के सुख भोगने के लिए होते हैं ।

वास्तव में यह प्रपञ्च एक जड़ पदार्थ है । परमात्मा ही इस प्रपञ्च को चलायमान करता है । इस शरीर में बंधी हुई आत्मा जीवात्मा कहलाती है । इस शरीर से छुटकारा पाते ही यह आत्मा परमात्मा में मिल जाती है । आत्मा के इस शरीर से मुक्त होने को 'मरण' या 'मृत्यु' नहीं समझना चाहिए । हमारे प्रारब्ध कर्म, संचित कर्म और आगामी कर्म समस्त कर्म निश्शेष होने पर ही आत्मा-परमात्मा में मिल सकता है । केवल उसी समय हम उत्तम स्वास्थ्य को पा सकते हैं । नवयुवक उत्तम स्वास्थय पाने के लिए बाल्यावस्था में भी उत्तम स्वास्थ्य से युक्त होना आवश्यक है । बाल्यावस्था में उत्तम स्वास्थ्य से युक्त होने के लिए बालक या बालिका के माता-पिता भी अपने आप को जानकर स्वस्थ रहना आवश्यक है । इस मार्ग को अपनाने के लिए गुरु आवश्यक होता है । अज्ञान के अन्धकार को

हटाकर ज्ञान-प्रकाश को जो प्रदान करता है, वही गुरु कहलाता है । सांसारिक ज्ञान हमको पाठशाला और कॉलेज में मिल सकता है, परन्तु इस ज्ञान से हमको उत्तम स्वास्थय प्राप्त नहीं होता है । हम कह सकते हैं कि आधुनिक युग में श्री सद्गुरु स्वामी शिवानन्द जी महाराज, भगवान् रमण महर्षि, श्री अरविन्द घोष, श्री स्वामी विवेकानन्द, माँ आनन्द माई, रानी मीराबाई जैसे महापुरुष और साध्वी मातायें आध्यात्मिक ज्ञान के आधार पर ही उत्तम स्वास्थ्य के आदर्श पुरुष और आदर्श स्त्री हैं ।

इन लोगों के मार्ग का अनुसरण करने से हम लोग उत्तम स्वास्थ्य को प्राप्त कर सकते हैं । बचपन के स्वास्थ्य का प्रभाव नवयुवकों में पड़ता है । नवयुवकों के स्वास्थ्य का प्रभाव वृद्धावस्था में पड़ता है और वृद्धावस्था के स्वास्थ्य के प्रभाव से जीवन अत्यन्त उत्तम स्वास्थ्य से समन्वित होता है । इस प्रकार मनुष्य अपने जीवन लक्ष्य को पा जाता है । हम स्वास्थ्य को स्वधर्म भी कह सकते हैं । इस कारण से श्रीकृष्ण भगवान् ने श्रीमद्भगवद्गीता में कहा है कि 'स्वधर्मे निधनं श्रेयः पर धर्मो भयावहः' । इसका मतलब यह है कि अपने धर्म का पालन करते हुए इस शरीर को छोड़ने से हम लाभान्वित हो जाते हैं । मगर पर धर्म को अपनाने से भय, दुःख, शोक को भोगना पड़ता है । प्रापञ्चिकता ही परधर्म है । आध्यात्मिकता ही स्वधर्म है । प्रापञ्चिकता ही अस्वास्थ्य है । आध्यात्मिकता ही उत्तम स्वास्थ्य है । इसलिए हम सब लोग स्वधर्म के आचरण द्वारा उत्तम स्वास्थ्य को पाकर पुरुषोत्तम प्राप्ति की अर्हता को संपादन करें ।

यही परम पद प्राप्ति, परम सुख की प्राप्ति, परमानन्द की प्राप्ति का स्त्रोत है । यही जीवन लक्ष्य को पहुँचने का उपाय है । हम सब लोग स्वस्थ रहने हेतु मार्गदर्शन देने के लिए परमपिता परमात्मा से मैं हृदयपूर्वक प्रार्थना करता हूँ।

ॐ तत् सत् ।

ॐ शान्तिः ! शान्तिः !! शान्तिः !!!

दिव्य जीवन संघ (मुख्यालय)
ऋषीकेश

गृहस्थी के कार्य कलापें एवं आचरण को भगवदोन्मुख करने हेतु सामग्री ।

गृह में रहने वाला गृहस्थ कहलाता है । गुफा में रहने वाला महात्मा या बाबा, या सन्त या सन्यासी कहलाता है । किन्तु गृह में रहकर भी जिनका मन भगवदुन्मुख होता है, बह भी महात्मा कहलाता है । उदाहरण के लिऐ श्री मोहन दास करम चन्द गान्धी जी गृहस्थाश्रम में रह कर भी अपना मन और हदय को विशाल करके पूरा भारत को अपना गृह समझ कर सत्य और अहिंसा आयुध के दूारा भरत माता को सर्वतन्त्र स्वातन्त्र बना दिया है । इस कारणसे वह भी महात्मा बन गये थे ।

अगर एक महात्मा गुफा में रहे कर भी प्रापञ्चिक दृष्टि कोण को नहीं छोड कर परमात्मा की चिन्तन का विसर्जन करता है तो वह गृहस्थ ही कहलाता है । ''निर्वृत्त रागस्य गृहं तपोवनम्'' यह महा पुरुषों का वाणी है । जो गृहस्थ राग और द्वेष से दूर रहता है । उनका गृह तपोवन का समान है । इस कारण से एक गृहस्थ भी महात्मा बन सकता है और एक महात्मा भी गृहस्थ बन सकता है । श्रुति में कहा गया है कि ''मन एव मनुष्याणां कारणं बन्ध मोक्षयोः इसका मतलब यह है कि मन ही बन्धन का कारण है और मन ही मोक्ष का कारण है । ममेति बध्यते जन्तुः निर्ममेति

विमुच्यते मैं और मेरापन से मनुव्य बन्धन में पड जाता है । और हृदय पूर्वक से अपना शरीर के सहित समस्त वस्तुओं को ''तेरा ही तेरा'' जो कहता है और अनुभव करता है वह बन्धन से विमुक्त हो जाता है । ''उदार चरितानां तु वसुधैव कुटुम्बकम्'' विशाल हृदय वाले यह सारा धरातल को अपना गृह मानते हैं । ''घर में रहो, परन्तु घर का मत बनो'' और संसार में रहो परन्तु संसार का मत बनो'' इन दो वाक्यों को जो अपना जीवन में आचरण में लाता है, वह निश्चय ही आध्यात्मिक मार्ग में अग्रसर होता रहता है । गृहस्यों को हर समय भगवन्नाम का स्मरण करना अनिवार्य है इससे उनका समस्त समस्यायें मिट जाते है ।

गृहस्थ अपना परिवार के सदस्यों के साथ हर रोज सत्सङ्ग करना चाहिये । तब अपना सन्तान में भी आध्यात्मिक जागृति हो जाता है । घर के बूढे लोग भगवन्नाम का जाप, मन्त्र लेखन स्वाघ्याप और संकीर्तनों से अपना जीवन बिताना चाहिये । तब अपना पोता पोतियो काहदय में आध्यात्मिक संस्कार के बीज बाये जाते हैं । घर के सब सदस्यों का जीवन लक्ष्य एक ही होना चाहिये । तब उस गृह में गृह लक्ष्मी विकसित वदनारविन्द से सुहशोभित होती है । तब वह गृह पूरे शहर

के लिये आदर्श बन जाता है । गृह के सदस्यों में परस्पर राग और द्वेष नहीं रहना चाहिये । राग से अनुराग होता है । अनुराग से ममता बढती है । ममता से अहंकार बढता है ।

अहंकार बढने से व्यक्तित्व की अस्तित्व का नहीं होता है । तब वह व्यक्ति जनन मरणचक्र में पड जाता है । उसी प्रकार हम किसी को द्वेष भी नहीं करना चाहिये । द्वेष से असूया बढती है । असूया से अहंकार बढता है । अहंकार से व्यक्ति निर्वीर्य होजाता है । इस प्रकार मानवता का हानि होता है । गृहस्थी रामायण का पारायण करके पुरुष लोग भगवान श्रीराम के जीवन को अपनाना चाहिये । महिलायें सीता माता का जीवन को अपनाना चाहिये । भाई लोग भरतलाल, लक्ष्मणलाल के जीवन को अपनाना चाहिये । सेबक लोग आञ्जनेय स्वामी का अनुकरण करना चाहिये । मनुष्य का सारा जीवन एक रामायण ही है । अतः रामायण को पारायण करके अपना जीवन समस्याओं से विमुक्त होना चाहिये ।

पुरुष लोग एक पत्नी व्रत को आचरण में रखना चाहिये । स्त्री लोग पातिव्रत्य को आचरण में रखना चाहिये । तब गृहस्थाश्रम सुचारु रूप से चलेगा । ब्रह्मचारियें का वानप्रस्थों का और सन्यासियों का पोषण केवल गृहस्था श्रम से ही होता है । गृहस्था लोग तन, मन, घन से यह तीन आश्रम लोगों का सेवा करनी चाहिये । और अपने बच्चों को भारत माता के पुत्र या पुत्री समझना चाहिये । तब भारत माता  सम्पूर्ण विश्व का माता बन सकती है ।गृहस्थाश्रम के हर एक सदस्य भारत माता का कीर्ति बढाने के लिये यत्न करनी चाहिये । इससे सारा कुटुम्ब सदस्य सुख शान्ति से जीवन बिता कर, भारत माता की कीर्ति बढा कर, अन्त में वि३व शान्ति के साथ साथ आत्म साक्षात्कार का लाभ उठा सकते है ।

# SRI SANTI ASHRAM CENTENARY CELEBRATIONS KI JAI

Shanti is that, which everyone wants to have.

Rest in God while living.

Ignorance is the cause of not knowing God.

Service to man is service to God.

Another word cannot be added to God.

Never think that you are not in God.

Timelessness is God.

India is the country which gives peace to the whole world.

Aspiration for God is the duty of man.

See God in everything.

Happiness comes when individual merges in God.

Remember God at all times to come.

Art of life is to live in God.

Mending the mind on God is real meditation.

Catch the mind and put it in the Ocean of God.

Ever remain in the Bliss of God.

Nothing exists beyond God.

Turn your vision towards God.

Eternity is what the man wants.

Name of God is what helps us in the end.

Atman is same as Brahman.

Running towards God is not necessary.

Yoga is the path to perfection.

City life makes us to forget God.

Everything exists in God.

Long life is what everybody wants.

Eagerness to reach God is called. "Sadhana".
Brahman is all pervading.
Reaching God means reaching Yourself.
Anger Comes when desire is not fulfilled.
Timid person cannot attain God.
It is time to pray to God now.
Only God exists and nothing else exists.
Non-injury makes us to love God.
Same God exists at all places.
Kingdom of god is within our own self.
Inside and outside exists God.
Japa is the way to control the mind.
Aim of life is God-Realisation.
Identify yourself with God.

Note: Please write all the first letters of each sentence together to get **"Sri Santi Ashram Centenary Celebrations Ki Jai."**

# SHANTI ASHRAM - MY HOME AWAY FROM HOME

Sri Shanti Ashram - The abode of Peace, A 'Peace' of Heaven on Earth, H.H. Sri Swami Omkarji's gift of spirituality to earnest seekers and greater mankind. This spiritual legecy has been sustained through the nourishment of H.H. Beloved Mother Jnaneswari. Sri Swami Omkarji, in His Autobiography, glorified Mathaji thus."Kumari Jnaneswari has been devoted, loving, sweet and obedient, never thinking of herself but always of others, loving and adoring me as her all-in-all since her childhood. She has impressed me and made me, feel that she is one of the ordained disciples of God Himself. She has been noble, completely selfless and magnanimous always. There are moments again when I feel that she is more my Guru, the Teacher, than Chela, the disciple, for she sets an example even for me to follow by her utter selflessness. "Swami Sahajanandaji too had often spoken about Mother Jnaneswari and extolled Her unparalleled spirit of service.

Through the spiritual thread that runs commonly between Sri Swami Sivanandaji's devotees (Divine Life Society) and Sri Swami Omkarji's devotees (Shanti Ashram), the members of DLS South Africa were infinitely blessed when H.H. Sri Swami Sahajanandaji graciously hosted Mathaji in South Africa from October 1989 to January 1990. A profound experience awaited us.

Mathaji radiated divinity and love. Her humility belied the Shakti of the Divine Mother incarnate. The very sight of Mathaji caused the heart to well up with deep, ineffable joy. Her love was showered on all who came into Her ambit. Imbued with this Divine Love, many devotees experienced a spiritual awakening. This was all due to our Beloved Swami Sahjanandaji who foresaw our need for supreme love which only the form of the Divine Mother could satiate. To me, Mother Jnaneswari and Swami Sahajananda have always been one.

Harih om.

# (42)

# శ్రీ స్వామి హంసానందవారి సంక్షిప్త జీవిత విశేషములు

ఓం నమః శివాయ

పూజ్యస్వామి హంసానంద మహారాజ్ 1939 మే నెల 25వ తేదీన ముస్త్యాల అనే ఊర్లో జన్మించారు. 1965లో స్వామీజీ శ్రీ శివానంద ఆశ్రమానికి వచ్చారు. 12వ జూన్, 1975వ తేదీన సన్యాసదీక్ష తీసుకున్నారు. స్వామీజీ భారత దేశములోను, యూరప్ ఖండములోను విశేషంగా పర్యటించారు.

1999లో నేను స్వామీజీ దర్శనం చేసుకోవడం సంభవించింది. అప్పటినుండి స్వయంగా కలవడం తక్కువైనా ఉత్తరాల రూపంలో సందేహాలు తీర్చడం, ఆధ్యాత్మిక ప్రగతికి దారి చూపించడం చేస్తూనే ఉన్నారు. స్వామీజీ ఎప్పుడూ చెప్తూ ఉంటారు: "మనమీ శరీరం కాదు. దీనియందున్న ఆత్మతో ఏకత్వం పొందడానికి కృషిచేయాలి" అని. మనకు పైన, క్రింద, లోపల, బయట, ఇరు ప్రక్కల. ఎల్లచోట్ల దేవుడున్నాడు. ఈ భావన బలపడడానికి నామస్మరణ చేయాల"ని చెప్తారు స్వామీజీ. అద్వైత వేదాంతాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి స్వామీజీ మాట్లాడే ప్రతీ మాట దారి చూపిస్తుంటుంది. అద్వైతానందమే గమ్యమని చెప్పినా దైనిక జీవితములో గురుదేవుల వారి మాటలు Be Good and Do Good పాటించడం చాలా ముఖ్యమని స్వామీజీ చెప్తారు. దానధర్మాలు చేయడం మంచిదని, మంచిపనులు చేయడానికి వెనుకాడకూడదని స్వామీజీ బోధిస్తారు.

స్వామీజీ బోధించడమే కాదు, ఆయన చెప్పినవన్నీ ఆయన జీవితాచరణలో కన్పిస్తాయి. నాకు ఇది కావాలని ఆశ్రమాన్ని ఎప్పుడూ అడగలేదాయన. సీనియర్ స్వామీజీ అయివుండి, సుఖసౌఖ్యాలకి ఎప్పుడూ ప్రాముఖ్యత ఇవ్వలేదు. స్వామీజీ ఎక్కడ తిరిగినా చెప్పులు ధరించరు. ఆయనను చూస్తే ఆదిశివుడి వైరాగ్యం, నిష్ఠ తీవ్రతరంగా గోచరమౌతాయి. అంత తపస్వి అయివుండియు, ప్రాపంచిక విషయాలలో సలహా అడిగినప్పుడు ఆయన చెప్పేమాటల్లో చాలా విజ్ఞత, వివేకం గోచరిస్తాయి. ఆయన Universal Person. ఆయన అందరికి చెందిన మహామనిషి.

బుధజన విధేయురాలు,

**మోక్షప్రియ**

# మృత్యుంజయ మహా మంత్రము



"ఓం త్ర్యంబకం యజామహే
సుగన్ధిం పుష్టి వర్ధనమ్ ।
ఉర్వారుకమివబంధనాత్
మృత్యోర్ముక్షీయమాఽ మృతాత్ ॥"


**అర్థము :-** ఓం = ఓ భగవంతుడా!, త్ర్యంబకం = మూడు కన్నులు కలవానిని, యజామహే = పూజించుచున్నాము, సుగంధిం = దివ్యపరిమళముగల దేహము కలవానిని, పుష్టి వర్ధనం = ఆరోగ్యమును, బలమును అభివృద్ధి చేయువానిని, ఉర్వారుకం = దోసకాయను, బంధనాత్ = తొడిమ నుండి (త్రుంచిన), ఇవ = విధముగా (అంత సులువుగా), మృత్యోః = మృత్యురూపమైన సంసారము నుండి, ముక్షీయ = విముక్తి కలిగించుము, మా = వద్దు, అమృతాత్ = అమృతము నుండి.


**తాత్పర్యము :-**

"దోసకాయను తొడిమ నుండి సులువుగా త్రుంచి వేసినటుల, మృత్యుబంధము నుండి మమ్ముద్ధరించి, అమరత్వము నొసంగుటకు సర్వజీవులకు పోషణ కర్తయు, దివ్యపరిమళముగల దేహము గలవాడునగు ముక్కంటిని ఆరాధించుచున్నాము".

ఈ మహామృత్యుంజయ మంత్రము మిక్కిలి శక్తిదాయకమైన మంత్రము. దీనిని నిత్యము 108 సార్లు పఠించు వారలకు అపమృత్యు భయముండదు. అట్టి వారు ఆయురారోగ్యములతో జీవించి, అమృతత్వమును బడయుదురు.







పూజ్యశ్రీ స్వామి హంసానంద

ఓం నారాయణాయ విద్మహే
వాసుదేవాయ ధీమహి
తన్నో విష్ణుః ప్రచోదయాత్

ఈ గ్రంథము
పూజ్యశ్రీ స్వామి హంసానందవారి
జన్మదినము (25.5.2022) సందర్భముగా
పూజ్యపాద శ్రీ కృష్ణానంద సరస్వతీ మహారాజ్ వారి
దివ్య శతజయంతి సంవత్సరము (2021-2022) నందు
వారి పాదపద్మములయందొక పుజాపుష్పముగా
సమర్పించుటకై ప్రచురించబడినది.